శ్రీశ్రీ కళావేదిక

అనంతపురము - 515 003, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

భావేపిణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 19 - Issue. 5 - Spl. Edition - May 2022 - ISSN No. : 2456-4702

మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం



జాతీయ సదస్సు

తేది:9 & 10 మే 2022

నిర్వహణ :

శ్రీశ్రీ కళావేదిక

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శాఖ

అనంతపురం -515 003.



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Special Issue 5 - May 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.

రెండు రోజుల జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం

9 & 10 తేదీలు, మే 2022



నిర్వహణ

శ్రీశ్రీ కళావేదిక

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శాఖ

అనంతపురము - 515 003.

మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం

జాతీయ సదస్సు

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities

Editor : **Dr. B. Ashok Kumar**

Assistant Editor : **K. Muniswamy**

ప్రథమ ముద్రణ	:	**మే 2022**
ప్రతులు	:	**500**
వెల	:	**రూ. 500/-**
కాపీలకు	:	**శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.**
గమనిక	:	**ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - సంపాదకవర్గం.**
ఎడిటోరియల్ చిరునామా	:	**హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు - 522 002.**
డి.టి.పి	:	**తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509.
ప్రింటింగ్	:	**సాయి విఘ్నేశ్వర ప్రింటర్స్, సాయి నగర్, అనంతపురం.**

మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం

జాతీయ సదస్సు

సంపాదకులు & సదస్సు సంచాలకులు

డా॥. బత్తల అశోక్‌కుమార్

అధ్యక్షులు

శ్రీశ్రీ కళావేదిక

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శాఖ

అనంతపురము - 515003

సెల్ : 9490194780

సహ సంపాదకులు & సదస్సు సమన్వయకర్త

కనుమల మునిస్వామి

ప్రధాన కార్యదర్శి

శ్రీశ్రీ కళావేదిక

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శాఖ

అనంతపురము - 515003

సెల్ : 9490194780



ఎ. కృష్ణారావు
కవి, విమర్శకులు,
ఆంధ్రజ్యోతి, న్యూఢిల్లీ.

కీలకోపన్యాసం

శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి గారికి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిళ్లంగోళ్ల శ్రీ లక్ష్మి గారికి, అద్భుతమైన కవి, చిరకాల మిత్రుడు, శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గారికి (మట్టి నెర్రల మధ్య చర్మపు ఛాయలు కనిపిస్తున్నాయి వెంటాడే జ్ఞాపకపు నీడల్లో), ప్రముఖ రచయిత్రి, విద్యావేత్త, సంఘసేవకురాలు, బహుముఖ ప్రజ్ఞాశాలి నల్లాని రాజేశ్వరికి గారికి, శ్రీ శ్రీ కళా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, సహృదయ మిత్రుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు గారికి, శ్రీశ్రీ జాతీయ కన్వీనర్, ప్రముఖ కవయిత్రి కొల్లి రమావతి గారికి, పెద్దలు డా॥ పతికి రమేష్ నారాయణ గారికి, నాగురించి పరిచయం చేసిన కె. హరీశ్ కుమార్‌కు, ఈ జాతీయ సదస్సు సంచాలకులు డా॥ బత్తల అశోక్‌కుమార్, సమన్వయకర్త కనుమల మునిస్వామిలకు, ఈ సమావేశంలో పాల్గొంటున్న పెద్దలు, ప్రముఖులకు ధన్యవాదాలు.

ఢిల్లీలో జర్నలిస్టుగా వార్తలు రాసుకునే నన్ను ఈ సమావేశంలో కీలకోపన్యాసం ఇచ్చేందుకు ఆహ్వానించడం నాకెంతో సంతోషకరంగా ఉన్నది. నిజానికి నేను రాసే వార్తల కంటే రాయాలనుకుని, రాయని వార్తలే ఎక్కువగా ఉంటాయి. కాని శ్రీశ్రీ ని తలుచుకున్నప్పుడల్లా నాలో రగులుతున్న రాయని వార్తలే అక్షరాలై ప్రేరేపిస్తాయి.

శ్రీశ్రీ గురించి మాట్లాడాలంటే శ్రీ శ్రీ నేపథ్యం గురించి మాట్లాడాలి. శ్రీశ్రీకి జర్నలిజానికి ఉన్న సంబంధం గురించి మాట్లాడాలి. తెలుగు సాహిత్యానికీ, జర్నలిజానికీ ఎంతో సామీప్యం ఉన్నది. పత్రికలు లేకముందు తెలుగు సాహితీవేత్తలే జర్నలిస్టులు. తెలుగు సాహితీ చరిత్రను, రచనా ధోరణులను నిష్పాక్షిక దృష్టితో పరిశీలించినప్పుడు ఈ నాటి ప్రమాణాలతో ఆనాటి రచనలను పరిగణించడం కానీ, ఆనాటి ప్రమాణాలతో నేటి సాహిత్యాన్ని అంచనా వేయడం సర్కెంది కాదు కాలంతో పాటు సమాజధర్మాలు, సంప్రదాయాలూ, ఆదర్శాలూ మారుతూనే ఉంటాయి. అయితే స్థూలంగా చూస్తే... నాటి సాహిత్యం నాటి ప్రమాణాలతోనే నాటి సమాజాన్ని చిత్రించిందా లేదా అన్నదే మనం పరిగణించాల్సిన విషయం. విశ్వశ్రేయస్సే సాహిత్య ప్రధాన లక్షణమని మన సంస్కృతాలంకారికులు అన్నారు. సమాజశ్రేయస్సుకు విరుద్ధమ్మెన, ప్రమాదకరమ్మెన విషయమేదీ రచనకు ఉపయోగపడరాదని మన పూర్వులు ఆశించారు. అయితే తన సమాజానికి శ్రేయస్కరమ్మెన విష యమేదో కూడా వారే నిర్దేశించుకున్నారు. రాజపోషణలో

సాహిత్యాన్ని సృష్టించాల్సిన అవసరం ఉన్నప్పటికీ అవకాశం వచ్చినప్పుడు సమాజ స్థితిగతులను వర్ణించిన ఉదంతాలు ఎన్నో నాటి సాహిత్యంలో, కళా రూపాల్లో కనపడుతాయి.

పాల్కురికి సోమనాథుడి బసవ పురాణంలో అప్పటి వేషభాషలు, సంస్కృతులు మనకు తెలుస్తాయి. శ్రీనాథుడి భీమఖండంలో తెలుగువారి ఆహార విహారాలు కనపడుతాయి. శ్రీనాథుడి చాటువుల్లో తెలుగు వారి జీవన పరిస్థితులు అర్థమవుతాయి. రసికుడు పోవడు పల్నాడెసగంగా గంగ యొక్కన నేకులె వడుకున్ వసుధేశుడొక్కన దున్నును కుసుమాస్త్రుండొక్కన జొన్న కూడే కుడుచున్.. గౌరన హరిశ్చంద్రోపాఖ్యానంలో చక్రవడ్డీల చక్రబంధంలో ప్రజల బాధలను వర్ణించారు. కొరవి గోపరాజు సింహాసనద్వాత్రింశికలో నాటి ప్రజా జీవనాన్ని అర్థంచేసుకోవచ్చు. నాటి సామాజిక స్థితికి భిన్నమైన ప్రతిఘటనా ధోరణులూ నాటి సాహిత్యంలో మనం చూడవచ్చు. సాంప్రదాయసిద్ధమైన రాచ వ్యవస్థను తోసి రాజన్న వాడు పోతన్న. బాలరసాలసాల నవ పల్లవ కోమల కావ్యకన్యకన్, కూళల కిచ్చి అప్పుడుపు కూడు భుజించుట కంటే సత్కవుల్ హాలికులైననేమి అన్నాడు పోతన్న. రాజులున్మత్తులు వారి సేవ నరకప్రాయంబు అన్నాడు ధూర్జటి. 32వేల పదకీర్తనలను తెలుగులో రాసిన కవి అన్నమయ్య. ప్రజల నోళ్లలో నిత్యం నానుతూ ఉండే జీవిత సత్యాలను చెప్పిన కవి వేమన వరకు వచ్చేసరికి మనకు సామాన్య మానవ స్వభావాల్లో, దైనందిన జీవనంలో వచ్చిన మార్పులూ కనపడతాయి. ప్రజల నోళ్లలో నిత్యం నానుతూ ఉండే జీవిత సత్యాలను చెప్పిన కవి వేమన్న. ఏమైనా తెలుగు కవులు వాడిన పదాలు, భావాలుశైలిలో అంతర్లీనంగా నాటి సమాజాన్ని కనిపెట్టేందుకు అవకాశం ఉంది. నాడు వీరే సాహిత్య జర్నలిస్టులు.

బ్రిటిష్ పాలన తర్వాత క్రమంగా, ఆర్థిక సంబంధాల్లోను, సామాజిక వ్యవస్థలో, సామాజిక జీవనంలో, సామాజిక దృక్పథంలో మార్పులు రావడం జరిగాయి. ఆర్థిక మార్పులకు అవసరంగా సంస్కరణలు జరిగాయి. ఈ క్రమంలోనే మనకు వీరేశలింగం, గురజాడ అప్పారావు లభ్యమయ్యారు. తెలు[illegible]కానికీ వారు చేసిన సేవ అపూర్వం. మతానికి నీతి ప్రధానమని, నీతి మాలిన వాడు భగవద్భక్తుడు కాలేడని రాసిన వీరేశలింగం ఏదైనా వింత సంగతి విన్నచో శోధించి దాని నిజాన్ని కనుక్కోవాలని, విన్న దానినెల్ల విశ్వసించకూడదని తన స్వీయచరిత్రలో రాసుకున్నారు. ఆయన ఆధునిక యుగంలో తొలి తెలుగు జర్నలిస్టు కూడా. అందుకే ఆయన గోదావరి విద్యాప్రబోధిని, వివేకవర్ధని అనే పత్రికలు ప్రారంభించారు. సాంస్కృతికంగా మార్పు మన మొదటి కర్తవ్యం అని భావించాడు. స్త్రీవిద్య, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలను వ్యతిరేకించడం కోసం ఆయన పత్రికలను ఉపయోగించుకున్నారు.

గురజాడవరకు వచ్చేసరికి సామాజిక పరిస్థితులు ఎంతో మారాయి. గురజాడ ముత్యాలసరాలు తెలుగు కవిత్వంలో ఒక విప్లవాన్ని ప్రారంభించాయి. సమాజాన్ని ఎంత నిశితంగా ఆయన అధ్యయనం చేశారో చెప్పడానికి కన్యాశుల్కం నాటకం ఒక ఉదాహరణ మాత్రమే. కేవలం బాల్యవివాహాలే కాదు, సమాజంలోని అన్నిరకాల కుళ్లును, వ్యవస్థాత్మక లోపాలను, వ్యక్తుల మనస్తత్వాలను కన్యాశుల్కంలో అద్భుతంగా చిత్రించాడు గురజాడ. స్వాతంత్ర్యం వస్తే... మన హెడ్ కానిస్టేబుల్ మారతారా.. అని అడుగుతుంది ఒక పాత్ర. అంటే వ్యవస్థలు మారకపోతే స్వాతంత్ర్యం వచ్చినా

ప్రయోజనం లేదని ఆయన అభిప్రాయం. గురజాడ కాలం నాటికి శ్రమజీవుల గురించి ఆలోచించడం మొదలైంది. సబాల్టన్ దృక్పథం అంతర్జాతీయంగా పెరుగుతున్న తీరును ఆయన గమనించారు. నరుల చెమటను తడిసి మూలం ధనం పంటలు పండవలెనోయ్. అన్నారు గురజాడ.

ఆ గురజాడ అందించిన మార్గాన్ని అందుకున్నారు శ్రీశ్రీ. తెలుగు సాహిత్యాన్ని భూమార్గం పట్టించి భూకంపం సృష్టించిన శ్రీశ్రీ రాకతో మొత్తం భావజాలంలోనూ, భాషలోనూ విప్లవాత్మక మార్పులు వచ్చాయి. తెలుగు సాహిత్యాన్నే కాదు, పత్రికారంగాన్ని కూడా ప్రభావితం చేసిన మహాకవి శ్రీశ్రీ. ఒక వార్తకు కాని, వ్యాసానికి కాని మంచి శీర్షిక పెట్టాలంటే శ్రీశ్రీని తలుచుకోవాల్సిన పరిస్థితి ఇప్పటికీ నెలకొంది. పదాలతో విన్యాసాలు చేయాలంటే శ్రీశ్రీయే గుర్తుకు వస్తాడు. ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగ నాదం స్ఫురిస్తుంది మనకు. కడుపు దహించుకుపోయే పడుపుకత్తె రాక్షస రతిలో అర్ధ నిమీలిత నేత్రాల భయంకర బాధల పాటల పల్లవి గుర్తుకు వస్తుంది. ఆ మధ్య ఇస్రో ప్రయోగించిన రాకెట్ పడిపోయినప్పుడు.. నిప్పులు విరజిమ్ముతూ.. నింగికి ఎగసి నీరసపడిపోయిందని పలు పత్రికలు శీర్షికలు పెట్టాయి.

కాలం ఎంత గడిచినా, మనలో నిరాశా నిస్పృహల చీకట్లని తొలగించి మనను చైతన్యవంతం చేసే కవి శ్రీశ్రీ. మనదీ ఒక బతుకేనా, కుక్కల వలె, నక్కల వలె.. మనదీ ఒక బతుకేనా సందులలో పందుల వలె.. అని మన జీవితాలను సమీక్షించేందుకు తోడ్పడే కవి శ్రీశ్రీ.

ఒక కుళ్లు సమాజాన్ని చూసి, అస్తవ్యస్త వ్యవస్థల్ని చూసి, దుర్మార్గాల్ని, దౌర్భాగ్యాల్నీ చూసి మనలో ఒక ప్రతిఘటనా స్వరం ఉప్పొంగుతుంది. అప్పుడు ప్రశ్నించాలనే తత్వాన్ని మనలో పురికొల్పుతుంది శ్రీశ్రీ కవిత్వం. ప్రశ్నించకుండా అంగీకరించే వాడు బానిసతో సమానం అన్నాడు చార్వాకుడు. ప్రశ్నించకుండా ఉండలేని వారు దిక్కుమాలిన చావు చావమని కూడా శ్రీశ్రీ కవిత్వం అవహేళన చేస్తుంది. ఎముకలు కుళ్లి, వయస్సు మళ్లిన సోమరులా చావండి, నెత్తురు మండే శక్తులు నిండే సైనికులారా రారండి... అని శ్రీశ్రీ రాసిన మహాప్రస్థాన గేయం ఒక్కటి చదివితే చాలు మనకు అడుగు ముందుకు వేయాలనే అనిపిస్తుంది కాని, వెనక్కు వేయాలనిపించదు. ఆ ప్రశ్నించే తత్వమే ఇవాళ తెలుగు జర్నలిజానికి ప్రేరణ అయింది. భాష పరంగా, భావ పరంగా తెలుగు జర్నలిజానికి ఊపిరి పోసింది.

మహాప్రస్థాన గేయం రాసింది 1934లో. అంటే ఇప్పటికి 88 ఏళ్ల క్రితం రాసిన కవిత్వం అన్నమాట. ఎనిమిది దశకాలే కాదు, శతాబ్దం గడిచినా, ఎన్నో శతాబ్దాలు గడిచినా మనలో ఒక నూతనోత్తేజం తెప్పించే కవిత్వం మహాప్రస్థానం... నేడు ప్రపంచం ఎట్లాపోతేనేం? మీకెందుకు లెండి.. అదృష్టవంతులు మీరు.. వడ్డించిన విస్తరి మీ జీవితం.. అని యదాతథ వాదులను శ్రీశ్రీ రోడ్డుమీద నిలబెట్టి ప్రశ్నించాడు. వారిని నగ్నస్వరూపులు చేసి వారి వికృత రూపాన్ని జనానికి తెలియజేశాడు.

గురజాడ అసలు సిసలైన వారసుడు శ్రీశ్రీ. సాహిత్య శిల్పాన్ని, సామాజిక చైతన్యాన్ని ఒకే స్థాయిలో అవపోశన పట్టిన వారిలో ఇద్దరికన్నా మించిన వారు లేరు. అడుగుజాడ గురజాడ అది భావికి బాట... అని అందుకే శ్రీశ్రీ ఆయనను గుర్తించారు. కనిపించని వంద కల్పవృక్షాల కన్నా గురజాడ రాసిన దేశభక్తి గీతం మిన్న అని వ్యాఖ్యానించారు. ఆధునికాంధ్ర కవిత్వానికి గురుపాదులు గురజాడ... అని అభివర్ణించిన శ్రీశ్రీ గురజాడనే మహాకవిగా తీర్మానించారు.

గురజాడ ముత్యాల సరాలను తెలుగు కవిత్వంలో ఒక గొప్ప మలుపుగా తీర్మానించారు. ఇద్దరూ సాంప్రదాయంలో బలమైన వ్రేళ్లున్నవారే. కాని ఆధునికతను సమాజం కోసం ఆహ్వానించారు. ఇద్దరూ ప్రజలకోసం తపించారు. కాంగ్రెస్ మహాసభల గురించి శ్రీశ్రీ అనువదించిన గురజాడ కవితను చూస్తే ఎంత చక్కగా ఆనాటి వాతావరణాన్ని చిత్రించారో అర్థమవుతుంది. 1908లో మద్రాస్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభలపై గురజాడ ఈ కవిత రాశారు. పాడకోయి కవీ కాంగ్రెస్ భజన సమాజం మాత్రమేనని... ప్రతినిధులంతా నిద్దురపోయినా భవనం కిక్కిరిసిన సత్రమే సుమీ.. కాంగ్రెస్ యుద్ధం రూల్స్ ప్రకారం. కాగితాలతో నామకార్థకం..అడపా దడపా అంతఃకలహం.. అయితే బిల్‌కుల్ అహింసాత్మకం! ఇవ్వాళ్టికీ కాంగ్రెస్ పరిస్థితి గురజాడ, శ్రీశ్రీ రాసిన వాక్యాలకంటే భిన్నంగా ఉందా?

సాహిత్యంలో ప్రవేశించిన శ్రమజీవి తత్వాన్ని గురజాడ పట్టుకుంటే శ్రీశ్రీ ఇంకా ముందుకు తీసుకువెళ్లారు. శ్రమజీవి చెమటకు ఖరీదు కట్టే షరాబు లేడోయ్ అని చెప్పారు. నిజానికి శ్రమ జీవిని సాహిత్యంలో ప్రవేశపెట్టింది శ్రీశ్రీ. చరిత్రను ప్రజా దృక్పథంతోచూడాలని చెప్పింది శ్రీశ్రీ, సామ్రాజ్యపు దండయాత్రలో సామాన్యుల సాహసమెట్టిది? అని మాత్రమే కాదు, పతితులారా, భ్రష్టులారా, దగాపడిన తమ్ములారా.. ఏడవకండేడవకండి అని ఆయన సామాన్యుల పక్షం నిలిచారు.

స్వాతంత్ర్యం వచ్చిన నాడు హర్షించిన ఆయన కలం ఆ తర్వాత జరుగుతున్న దారుణాల్ని ప్రశ్నించింది. మనం కష్టపడి ఆర్జించిన స్వాతంత్ర్యం గద్దలు తన్నుకుపోతాయ్. కంచిమేక పాపం ఎప్పుడూ కసాయినే నమ్ముకుంటుంది... అని రాశారు.. భారత దేశంలో స్వాతంత్ర్యం లేదు. నేను స్వేచ్ఛగా ఉన్నాననే భావం ఒక్కడిలోనూ లేదు.. అని లిమరుక్కుల్లో రాశాడు. జ్ఞాపకం వస్తున్నావు గాంధీజీ ఈనాడు నీవు. ఎక్కడుంది నీవాశించిన సంక్రందన ధామం? అని ప్రశ్నించాడు.

శ్రీశ్రీలో అణువణువునా తెలుగుతనం నిండి ఉంది. ఆయనకు సంస్కృతం, ఆంగ్ల భాషల్లో అమితమైన పట్టు ఉంది. తెలుగు సాహితీవేత్తల్లో ఎవరికీ లేనంతగా ఆయనకు జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై సమగ్ర అవగాహన ఉండేది. అందుకు ఆయన కవితలు, అనువాదాలే నిదర్శనం. ఏ భాషలోనైనా క్రీడించగల శక్తి ఆయనకున్నది. అయినప్పటికీ ఆయన తెలుగుకోసమే తపించారు. తెలుగువారి ధీశక్తి, తెలుగు వారి క్రియాశక్తి. నలుదెసలా రహించాలి. తెలుగుతనం జయించాలి.. అనిఆయన కోరుకున్నాడు. అదెదో తెలుగుతల్లి... అందాల నిండు జాబిల్లి...ఆనందాల కల్పవల్లి అని రాస్తూ సంకెళ్లు లేని తెలుగునేల కావాలని వాంఛించాడు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు శ్రీశ్రీ అంత ఆనందించిన కవి లేడు. ఇది ఆంధ్రజాతికంతటికీ విజయం, ఆంధ్ర సంస్కృతికి అఖండ విజయం అని రాశాడు. కాని అదే సమయంలో రానురానూ జరుగుతున్న పరిణామాల గురించి ఆయన దహించుకుపోయాడు. కాలే గుడిసెలు కాలుతు ఉంటే లేచే మేడలు లేస్తూ ఉన్నాయ్ అన్నారు. ఆంధ్రదేశం మీద గీతం రాయలేదని చాలా మంది నన్ను అడుగుతున్నారు. అసలు సంగతేమిటంటే నేనూ ఆంధ్రదేశంలాగ ఉన్నాను.. అల్లకల్లోలంగా తుఫాను భీభత్సం చెలరేగుతోంది నా మనస్సులో.. అన్నారాయన. ఒక వ్యాసంలో ఆయన గురజాడను నరకంలో కలుసుకున్నాను.. అని రాశారు. ఇక్కడికొచ్చి చాలా దారుణప్పని చేశావు.. అంటాడు గురజాడ. ఆంధ్రదేశంలో కంటే ఇక్కడే బాగుంటుందని వచ్చేశాను.. అంటాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీ జీవితం గురించి తెలుసుకోవాలంటే ఆయన రాసిన ఆత్మకథ 'అనంతం' గురించి తెలుసుకోవాలి. ఈ పుస్తకంలో శ్రీశ్రీ బలాలూ, బలహీనతలూ ఎన్నో ఉన్నాయి. కాని శ్రీశ్రీ 'అనంతం' ఏం చెబుతోంది అని ఎవరైనా అడిగితే అది శ్రీశ్రీ రాజకీయ సైద్ధాంతిక విశ్వాసాల గురించి చెబుతుంది... అని నేనంటాను.

"75శాతం నిరక్షరాస్యులమీద 25శాతం అక్షరాస్యులూ, 90శాతం దరిద్రుల మీద 10శాతం ధనవంతులూ పరిపాలన సాగిస్తున్న వ్యవస్థ మనది. ఇదే ప్రజాస్వామ్యం అనుకోవడమంత సిగ్గుచేటు ఇంకోటి ఉండదు. ఈ వ్యవస్థను మార్చాలని ఉద్ఘోషించడం కన్నా ఇంకో ఉత్కృష్టధర్మం ఏ సాహిత్యపరుడికైనా ఎలా ఉంటుందో నేను ఊహించలేను", అని ఘంటాపథంగా చెప్పిన శ్రీశ్రీకి రాజకీయ సైద్ధాంతిక విశ్వాసాలు లేవని ఎవరంటారు? ఈ పురోహిత వర్గానికి తెలుసు, నిప్పు, నీరు, గాలి, నింగి,ఏదీ దేవుడు కాదని. కాని ఒక ఉత్సవ విగ్రహం అవసరమైంది. కార్మికుల కండబలం దోచుకోవడానికి మేధావుల మెదడు సృష్టిందొక మిథ్యా దైవాన్నే.. ఎవడో ఆ తెలియనివాడా, నీ కాళ్లు పట్టుకుంటాను. నన్ను రక్షించు. అంటే వాడు నాకు సమస్త సదుపాయాలు చేస్తాడట... ఇదే అసలు సిసలైన బానిస మనస్తత్వం'అన్న శ్రీశ్రీకి రాజకీయ, సైద్ధాంతిక విశ్వాసాలు లేని ఎవరంటారు?

"జీర్ణ దేవాలయాల పునరుద్ధరణకు కోట్లు ఖర్చు పెట్టడం కన్నా ఆ డబ్బుతో కుష్ట రోగ నివారణకు ఉపక్రమించడం మంచిది. నిజమైన సమసమాజమే కావాలంటే నిరీశ్వరత్వమే దాని పునాది. దేవుళ్లు ఐశ్వర్యంతో తులతూగుతున్నంతకాలం ప్రజలు దారిద్ర్యంలో ఉంటారు. సంపదను అనుభవించేవాడు నోరులేని దేవుడు కాదు, అతని చాటున బతుకుతున్న నరరూపులైన పందికొక్కులు. కాని ఇంట్లోంచి దేవుడిని తరిమేయలేకపోతున్నాము" అని వాపోయిన ఆయనకు రాజకీయ సైద్ధాంతిక విశ్వాసాలు లేవని ఎవరంటారు?

తన పుస్తకానికి 'అనంతం' అని ఆయన ఎందుకు పేరు పెట్టుకున్నారు? మొత్తం ప్రపంచంలో మనిషి జీవితం క్షణభంగురమైతే, ఆ జీవితంలో ప్రపంచం గోచరించినప్పుడు ఆ క్షణమే' అనంతం' అవుతుంది. అందుకే జీవిత చరిత్ర రాసుకుంటే సృష్టి చరిత్ర రాసుకున్నట్లేనని శ్రీశ్రీ తాత్విక పరిభాషలో చెప్పుకున్నారు. 'సృష్టి ఒక గొప్ప శ్లేష కావ్యం. వాస్తవంలో ఉన్న అనంతత్వాన్ని అన్వేషించడానికి ముందు ఒక క్షణం కళ్లు మూసుకోవడం మంచిది. ఎదురుగా కనిపించే వస్తువు ఒకటుండగా, కళ్లు మూసుకున్నప్పుడు మన మనస్సులో నిద్రించే అదే వస్తువు శబ్దరూపంలో సాక్షాత్కరిస్తుంది. వాస్తవికత ఒక ప్రతీక, చిహ్నం. వస్తువుల వాస్తవికత చిహ్నమయితే, ఆ చిహ్నానికి చిహ్నం భాష. అందుచేత భాష విధిగా రెండర్థాలను మోసుకు తిరుగుతూ ఉంటుంది. చీకటి కానిది వెలుతురు కావదు. మరేదయినా కావచ్చు. వెలుతురు కానిది చీకటి కాదు. మొదటి అనంతంలోనే రెండో అనంతం గర్భితమయి ఉంచుంది. నా జీవిత చరిత్ర రాసుకుంటే సృష్టి చరిత్ర రాసినట్లే. ఏ ఒక్క క్షణాన్ని వర్ణించినా అనంత కాలాన్ని వర్ణించినట్లే. నా జీవితం ఒక క్షణం. ఇదే అనంతం.'

'నా జనని గర్భంలో ఆకారం లేకుండా నిద్రిస్తున్న నా అహంకారానికి ఆకలి గొల్పించిన నాడో.' అని రాసిన శ్రీశ్రీ ఇంగ్లీషు మహాకవి స్విన్ బర్న్ చనిపోవడం, తాను తన మాతృగర్భ మహాసముద్రంలో ఈదడం ఒకేసారి ప్రారంభమయ్యాయని భావించారు. 1910లో పుట్టిన శ్రీశ్రీ తాను తొలి దశలో సంప్రదాయ పద్ధతిలో వచనం, పద్యం రాశానని చెప్పుకున్నారు. దందహ్యమాన దశాబ్దం 1930 ఆయన ను ప్రగతిశీల కవిగా తీర్చిదిద్దింది. ఆర్థిక

మాంద్యంలో చిక్కుకున్న పెట్టుబడిదారీ వ్యవస్థ సోషలిస్టు వ్యవస్థపై ఆశలు రగిలించింది. అదే సమయంలో పాశ్చాత్య సాహిత్య ధోరణులైన ప్రతీక వాదం, అధివాస్తవికత వాదాలతో పరిచయం కలిగింది.1930 లనుంచి చివరి వరకూ తడబడుతూ అయినా నిలబడ్డారు. వామపక్ష ఉద్యమాలతో తనంతట తాను మమేమయ్యాడు. .

'ఈ మదీయ కరాళ జిహ్వికల యందు జీవ సముదాయమెపుడైన జిక్కవలయు' అని రాసిన కవే 'పల్లెటూళ్లోతల్లి కేదో పాడుకలలో పేగు కదిలింది..' అని రాశారు. 'కాలాంత ప్రభవార్క కోటి ఘణి సంకాశ ప్రతాప సురతాలాక్ష జ్వాలదగ్ని దగ్ధ సకల బ్రహ్మాండ భాండుండవై, జ్వాలా దీప్త మహా ప్రభవ గరిమన్ స్వచ్ఛంద సంవర్త కేళీ లోలాత్ముండవై సమస్త జగముల్ కీర్తింప నర్తింపుమా '..అని రాసిన కవే, 'కదిలేదీ కదిలించేది, పెను నిద్దుర వదిలించేది, పరిపూర్ణపు బతుకిచ్చేది, కావాలోయ్ నవక వనానికి.'.అని రాసి రచనలకు సామాజిక ప్రయోజనం ఉండాలని చెప్పారు. ఆయన నాస్తికుడని, దేవుడిపై ఏ మాత్రం నమ్మకం లేదని చెప్పడానికి,సైన్స్ నే ఆయన విశ్వసించారనడానికి 'అనంతం'లోని ఈ వాక్యాలే నిదర్శనం. '33 కోట్ల దేవతలు కాపాతున్న ఈ దేశంలో పరాంకోటి మంది దరిద్రులున్నారు. నాకు దేవతలూ వద్దు, దరిద్రమూ వద్దు.' అని ఆయన చెప్పారు. సామ్యవాదుల్లో కూడా దైవభక్తీ, దైవభీతీ ఉండవచ్చు. ఈ రెండూ సమూలంగా నాశనం కావాలి. భక్తులకీ, పిరికిపందలకీ ఈ ప్రపంచంలో స్థలం ఉండకూడదు.. అన్నారు ఒక చోట. దేవుడి మీద ఏమాత్రమూ నమ్మకం లేని తాను, దేవుళ్ళ మీద తాను రాసిన సినిమా పాటల గురించి వేసిన ప్రశ్నలకి ఇచ్చిన సమాధానం: "శివుడి మీద, శ్రీరాముడి మీద, షణ్ముఖుడి మీద, శ్రీ వేంకటేశ్వరస్వామి మీద, గురువాయూరప్ప మీద, ఇంకా ఆడ దేవుళ్ళను కూడా కలుపుకుంటే ఎందరెందరో దేవతలమీద నేనెన్నో పాటలు రాశాను. మాటలు కూడా రాశాను. ఇవేవీ కవిత్వం కాదన్నదే ఆ ప్రశ్నలకు జవాబు." అని సందేహాలను తీర్చారు. అదే శ్రీశ్రీ "బలవంతులు దుర్బల జాతిని బానిసలను గావించిరి. నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి, నైలు నదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది? తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" అని 1938లోనే చరిత్రకి నూతన నిర్వచనం చెప్పాడు.

శ్రీశ్రీ జీవితాన్ని పరిశీలిస్తే అది ఒక వ్యక్తి జీవితంగా కాక అదొక సామాజిక చరిత్రగా మనకు కనిపిస్తుంది. అది కేవలం తెలుగు సమాజం మాత్రమే కాదు, భారతీయ సమాజం మాత్రమే అని అనడానికి వీలు లేదు. అంతర్జాతీయ పరిణామాలు భారతదేశంపై, సమాజంపై చూపిన ప్రభావం కూడా శ్రీశ్రీ జీవితంలో మనకు కనిపిస్తుంది. కాంగ్రెస్ ద్వారా సోషలిజం వస్తుందని గాడిదలు కూడా నమ్మవు" అన్న ఆయన అప్పుడే అభిప్రాయం పడ్డారు. అదే సమయంలో సంఘ్ పరివార్ నూ ఆయన తీవ్రంగా విమర్శించారు. 'పిడికెడు కుటుంబాలు కోట్లకొలది ప్రజలను దోచుకునే విధానం పోతుంది. పెట్టుబడిదారీ విధానం ప్రపంచ నాటకరంగం నుంచి నిష్క్రమించక తప్పదు' అన్న శ్రీశ్రీ ఒక నిగూఢమైన కవి. పద్మభూషణ్ కంటే ప్రజాకవి అనిపించుకోవడమే నాకిష్టం అన్న శ్రీశ్రీ నిజంగా ప్రజా కవే. శ్రీశ్రీ సమాజాన్ని మరమ్మతు చేయాలనుకునేవారికి తొలుత గుర్తుకు వచ్చే కవి. రెండు రెండ్లు నాలుగన్నందుకు గుండాలు గండ్రాళ్లు విసిరే సీమలో, క్షేమం అవిభాజ్యం అంటే జైళ్లు నోళ్లు తెరిచే భూమిలో.. క్షణ క్షణం మారుతున్న లోకాన్ని సరీగా అర్థం చేసుకున్న వాళ్లంతా పేద ప్రజల పక్షం వహించడమే అపరాధమైపోయింది అన్నాడు శ్రీశ్రీ ఖడ్గ సృష్టిలో. ఇది 1966 లో రాసిన కవిత.. ఏమైనా మారిందా? దొంగ నోట్లు, దొంగ ఓట్ల రాజ్యం ఒక రాజ్యమా, లంచగొండి వెధవలిచ్చు సాక్ష్యం ఒక సాక్ష్యమా అని అని ప్రశ్నించాడు శ్రీశ్రీ మరో ప్రస్థానంలో..

ఈ కవిత్వంలో ఆయన ప్రపంచ బాధను తన బాధగా మరింత పలికించాడు.ఒకవైపు తెలంగాణ రైతాంగ పోరాటం, మరో వైపు తన నిరుద్యోగం, ఇంకో వైపు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఫలించని ఆశలు ఆయన గుండెను మండించాయి. మరో ప్రస్థానంలో మంటలే మనకు కనిపిస్తాయి. మంటలతో మాట్లాడించి రక్తంతో రాగాలాపన చేయిస్తాను.. అన్నారు. 1968లో ప్యారిస్ లో జరిగిన విద్యార్థుల విప్లవానికీ ప్రతిస్పందించిన శ్రీశ్రీ అదే క్రమంలో నక్సలైట్ ఉద్యమాన్నీ సమర్థించారు. ఊగరా, ఊగరా, ఉరికొయ్యనందుకొని ఊగరా. మాంచాలను కొలుస్తారు, మల్లమ్మను తలుస్తారు, ఝాన్సీ లక్ష్మీ బాయికి పటం కట్టి పొగుడుతారు. పంచాది నిర్మలంటే భయం పుట్టి వణుకుతారు. అన్నారు. ఈ క్రమంలో ఆయన ప్రజల భాషలో రాసే ప్రయత్నం చేశారు. ఇప్లవం యాడుందిరా, నీ గుండెలోనే కూకుందిరా... అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత మారిన పత్రికల ధోరణినీ విమర్శించారు. పెట్టుబడికీ కట్టు కథకు పుట్టిన విష పుత్రికలు మన పత్రికలు అన్నారు. ఏమైనా మారిందా?

తన జీవితమంతా సంఘర్షించి, సమాజంలో జరిగిన కీలక పోరాటాల్ని సమర్థించి, సమాజంలో మార్పుకోసం నిత్యం రగిలిన, నిప్పు రగిల్చిన కవి శ్రీశ్రీ... శ్రీశ్రీ దారిలో నేటి కవులు, రచయితలు ఎంతమంది నడుస్తున్నారు.. ఇవాళ్టికీ మరో శ్రీశ్రీ అవసరం ఎందుకు కనపడుతోంది... ఈ ప్రశ్నలే మనకు శ్రీశ్రీ ప్రాసంగికతను అవసరాన్ని తెలియజేస్తుంది. నాకీ అవకాశం ఇచ్చిన శ్రీశ్రీ కళా వేదికకు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికీ, కృతజ్ఞతలు.

❖❖❖



పిళ్ళంగోళ్ల శ్రీలక్ష్మి
అధ్యక్షురాలు,
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, అమరావతి.

సందేశం

'కదిలేదీ,- కదిలించేదీ,- పెనునిద్దర వదిలించేదీ, పరిపూర్ణపు బతుకిచ్చేదీ, కావాలోయి నవ కవనానికి', అని ఎలుగెత్తి అభ్యుదయ కవిత్వపు లక్షణాలన్నీ నిర్వచించాడు శ్రీ శ్రీ.

'1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత నుంచి నేను దాన్ని నడిపిస్తున్నాను. దిస్ సెంచరీ -ఈజ్ మైన్', అనీ సాధికారంగా చెప్పగలిగిన తెలుగుకవి శ్రీశ్రీ ఒక్కడే.

అటువంటి సాహితీ యుగ పురుషుడు గురించి అనతపురం శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ శ్రీశ్రీ కళావేదిక శాఖ నుండి **"మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం"** అనే అంశంపై వెబినార్ నిర్వహించి ఎందరో పరిశోధక విద్యార్థుల నుండి, కవులనుండి, సాహితీ వేత్తల నుంచి పత్ర సమర్పణ చేసే బృహత్తర కార్యక్రమం చేపట్టడం అభినందనీయం. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక ఎస్కేయూ శాఖను అభినందిస్తున్నాను .

శ్రీ శ్రీ అని పిలవబడే శ్రీరంగం శ్రీనివాసరావు (ఏప్రిల్ 30, 1910 - జూన్ 15, 1983) ప్రముఖ తెలుగు కవిగా పేరొంది, సాహిత్యానికి కవిత్వానికి ఒక దిక్సూచిగా మారారు. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ కవిగా , విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా శ్రీశ్రీ ప్రసిద్ధుడు.


మహాప్రస్థానం శ్రీశ్రీ రచనల్లో ప్రసిద్ధమైనది. శ్రీశ్రీ అనగానే ఎక్కువగా గుర్తొచ్చే మహా కవిత్వం ఈ మహాప్రస్థానం. ఎన్నో సాహిత్యాత్మకమైన మార్పులు శ్రీశ్రీ కవిత్వంలో చోటు చేసుకుంటాయి . శ్రీశ్రీ శకం తర్వాత కవిత్వం కొత్త బాటలు తీసింది. కుక్క పిల్లా , అగ్గి పుల్లా కాదేది కవితకు అనర్హం అని ఎప్పుడైతే ఎలుగెత్తి కవిత్వానికి కొత్త అర్థం చెప్పారో అప్పటినుండి వర్ధమాన కవులకు, యువ కవులకు శ్రీశ్రీ కవిత్వం ఒక చుక్కానిగా నిలిచింది. అప్పటి నుండి కొన్ని వేల సాహిత్యాలు ఉద్భావించాయనే చెప్పవచ్చు.

అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా... విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా....సినిమా పాటల రచయితగా శ్రీశ్రీ అనేక భూమికలు పోషించాడు. సమరానికి నేడే ఆరంభం...ఎవరో వస్తారని ఏదో చేస్తారని అంటూ సందేశాత్మక గీతాలు నేటికి తెలుగు నేలపై ఏదో సందర్భంలో గుర్తించుకోని తెలుగు వారుండరు.

మనసున మనసై బ్రతుకున బ్రతుకై అంటూ మదిలోని భావాలను మనుసుతో ముడిపడిన బ్రతుకును ఆవిష్కరించిన అద్భుత కవి శ్రీశ్రీ. 'ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా!' అంటూ సోమరి పోతులను జాగృతం చేసిన చైతన్య శీలి శ్రీశ్రీ. మాంగల్య బలంలోని 'ఆకాశ వీధిలో అందాల జాబిలి' అంటూ చందమామ పై రాసిన ఈ గీతం శ్రీశ్రీ కలం నుంచి జాలు వారిందే.

ఇరవయ్యవ శతాబ్దంలో కొందరికి ఆధునిక తెలుగుకవిత్వానికి శ్రీశ్రీ కవిత్వం ఒక ఆదర్శంగా నిలిచారు. సాహిత్యం ఎప్పుడు సమాజ చైతన్యం కోరుకోవాలి. ఆ దిశగా కవులు రచనలు సాగించాలి. అప్పుడే ఆ సాహిత్యం పది కాలాల పాటు నిలుస్తుంది.

❖❖❖



డా॥. కత్తిమండ ప్రతాప్
అధ్యక్షులు,
రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ రాష్ట్ర సభ్యులు
శ్రీశ్రీ కళావేదిక
(అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ)

సందేశం

ఎగిసిపడే అగ్ని కణం ...
రగిలే రణం ... మీ ఆలోచనలైతే ...
కలిమే చెలిమై -చెలిమే బలమై
ముందడుగు వేస్తె .
ఉవ్వెత్తున లేచే ఉప్పెనలా
బలమే గెలుపై విజయం సాధిస్తాం !

సాహిత్యం మహాసముద్రం. తెలుగు సాహితీ వినీలాకాశంలో లబ్ధప్రతిష్టులైన మహాకవులు ఎందరో వున్నారు. అయితే సామాన్యుని కష్టాల్ని, వారి వేదనల్ని, ఆవేదనల్ని తనవిగా భావించి, ప్రపంచ బాధనంతా తనలోనే పలికించిన వ్యక్తి, మహాశక్తి "శ్రీరంగం శ్రీనివాసరావు". అలాంటి మహావ్యక్తిపై ఏర్పాటు చేసిన ఈ సంస్థ కవులు కావాలనుకున్న వారికి ఒక మంచి వేదికగా మారింది. సామాన్యుని కష్టాలను అక్షరబద్ధం చేసే ప్రతివ్యక్తికి శ్రీశ్రీ కళావేదిక అవకాశాల్ని కల్పిస్తూనే వుంది. ఆ నిరంతర అక్షరయజ్ఞం ఒకవైపు ఎడతెరిపిలేకుండా కొనసాగుతున్న తరుణంలో, మహాకవి శ్రీశ్రీగారి గురించి సాహితీలోకంలో లోతైన చర్చకు ద్వారాలు తెరవాలన్న తలంపుతో, శ్రీశ్రీ కళావేదిక, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శాఖ ద్వారా "మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం" అన్న అంశంపై రెండురోజుల జాతీయసదస్సును ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడానికి విశ్వవిద్యాలయం ఆచార్యులు, కళాశాలల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, సాహితీ పిపాసులకు ఆహ్వానాలు పలికాము. మా ఆహ్వానాన్ని మన్నించి దాదాపు 100 మంది సభ్యులు మహాకవి శ్రీశ్రీగారిపై విభిన్న పార్శ్వాల్లో స్పందించి, ఆయనగురించి, ఆయన సాహిత్యం గురించి పరిశోధన వ్యాసాలను పంపారు.

2022 మే 9 మరియు 10వ తేదీల్లో జూమ్ ఆన్‌లైన్ వేదిక ద్వారా రెండు రోజులపాటు వెబినార్‌ను నిర్వహించాము. శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యవర్గము, మరియు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ శాఖ ఆ బాధ్యతలను సక్రమంగా

నిర్వర్తించడంలో సఫలీకృతమయ్యారు. వెబినార్ అద్యంతం ఎంతో చక్కగా జరిగింది. మహాకవి శ్రీశ్రీ గారి గురించి చాలా లోతైన విశ్లేషణలు సాగాయి. భిన్న కోణాల్లో మహాకవి శ్రీశ్రీగారి గురించిన చర్చ జరిగింది.

వెబినార్ సందర్భంగా వచ్చిన పరిశోధన వ్యాసాలను మా శ్రీశ్రీ కళావేదిక ఎస్కేయూనివర్శిటీ కార్యవర్గం పరిశీలించి, నిపుణులతో వాటికి అవసరమైన సవరణలు చేయించి, యూజీసీ కేర్‌లిస్ట్ జర్నల్ అయిన "భావవీణ" ద్వారా వాటిని పుస్తకంగా తీసుకురావడం అభినందనీయం. ఇది మహాకవి శ్రీశ్రీగారి గురించి తెలుసుకోవాలనుకున్న వారికి మంచి ఆధార గ్రంథంగా నిలువగలదు. ఈ సందర్భంగా కార్యక్రమం విజయవంతం చేయడంలో కృషిచేసిన శ్రీశ్రీ కళావేదిక కార్యవర్గం మొత్తాన్ని అభినందిస్తూ, కీలకోపన్యాస కర్తలకు, ముఖ్యఅతిథులకు, పత్రసమర్పకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

❖❖❖

శ్రీశ్రీ కళావేదిక

(అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ)

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శాఖ,

అనంతపురము.

డా॥. బత్తల అశోక్ కుమార్
అధ్యక్షులు

కనుమల మునిస్వామి
ప్రధాన కార్యదర్శి

ధన్యవాదాలు

మహాకవి శ్రీశ్రీ అంటే మాకు ఎంతో ఇష్టం. ఆయనగురించి మేము స్నాతకోత్తర, పరిశోధన స్థాయిల్లో, పోటీపరీక్షల దృష్ట్యా అనేక కోణాల్లో చదువుకున్నాము. అలాంటి ఇష్టమైన మహాకవి జీవితం, సాహిత్యాలను గురించి రెండురోజులపాటు జాతీయ సదస్సును నిర్వహించే అవకాశం రావడం మా అదృష్టంగా భావిస్తున్నాము.

యువతను కవిత్వం దారిలోకి తీసుకువచ్చే క్రమంలో... శ్రీశ్రీ కళావేదిక తన శక్తివంచన లేకుండా కృషి చేస్తూనే వుంది. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డా॥ కత్తిమండ ప్రతాప్ సార్‌గారు ఎక్కడెక్కడో వున్న సాహిత్య పిపాసులందరికీ ఒక మంచి వేదికను కల్పించి, వారిని కవులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తూనే వున్నారు. శ్రీశ్రీ కళావేదికను శాఖోపశాఖలుగా విస్తరించే క్రమంలో చిటారున ఒక కొమ్మగా "శ్రీశ్రీ కళావేదిక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం శాఖ" ద్వారా మాకు అవకాశం కల్పించారు. వారికి సదా కృతజ్ఞులము.

రెండురోజుల జాతీయ వెబినార్‌ను ప్రారంభించి, పనిచేసే వారికి ఎప్పుడూ తన సహకారం ఉంటుందని అభయమిచ్చి, ఆశీర్వదించిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డిగారికి, ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ శ్రీమతి పిళ్ళంగోల్ల శ్రీలక్ష్మిగారికి, కీలకోపన్యాసం చేసిన ప్రముఖ కవి, విమర్శకులు, సీనియర్ ఎడిటర్ శ్రీ ఎ. కృష్ణారావుగారికి, విశిష్ట అతిథులుగా హాజరైన మా పీహెచ్.డీ పర్యవేక్షకులు, మా జీవిత మార్గదర్శి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. బాలసుబ్రమణ్యంగారికి, ప్రముఖ విద్యావేత్త, కాలమిస్ట్ శ్రీమతి నల్లాని రాజేశ్వరి గారికి, మరియు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం గ్రామీణాభివృద్ధి విభాగం అధ్యక్షులు, సీఎస్ఎస్ఈఐపీ డైరెక్టర్ ఆచార్య ఎం. మునినారాయణప్పగారికి మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ శ్రీ మందపాటి శేషగిరిరావుగారికి, విశిష్ట అతిథులుగా హాజరైన ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ చామలూరు రాగే హరిత రాజగోపాల్‌గారికి, ప్రముఖ హాస్యావధాని హాస్యబ్రహ్మ శంకరనారాయణగారికి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జి.వి. రమణగారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

వెబినార్ నిర్వహణకు ఎంతో సహృదయతతో సహకరించిన శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ శ్రీమతి కొల్లి రమావతి మేడంగారికి, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు శ్రీ గుత్తా హరిసర్వోత్తమ నాయుడుగారికి, ఉపాధ్యక్షులు మరియు ఎస్కేయూ శాఖ గౌరవాధ్యక్షులు డా॥ పతికి రమేష్ నారాయణ సార్‌గారికి, శ్రీశ్రీ కళావేదిక సాహిత్య కుటుంబ సభ్యులందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

మహాకవి శ్రీశ్రీగారిపై ఉన్న అవ్యాజమైన ప్రేమతో, శ్రీశ్రీ కళావేదికపై ఉన్న నమ్మకంతో జాతీయస్థాయిలో పత్ర సమర్పకులు స్పందించి పరిశోధనా పత్రాలను పంపారు. రెండురోజుల పాటు వెబినార్‌లో ఆద్యంతం శ్రీశ్రీ జీవితం - రచనల గురించి సమగ్ర చర్చ జరిగింది. వచ్చిన పరిశోధన పత్రాలను నిపుణులతో అవసరమైన సవరణలు చేయించి, యూజీసీ కేర్‌లిస్ట్ జర్నల్ అయిన "భావవీణ" ద్వారా వాటిని పుస్తకరూపంలో తీసుకువస్తున్నాము. ఇది మహాకవి శ్రీశ్రీగారి గురించి తెలుసుకోవాలనుకున్న వారికి మంచి ఆధార గ్రంథంగా నిలువగలదని ఆశిస్తున్నాము. సహకరించిన ప్రతి ఒక్కరికీ మా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

❖❖❖

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురము - 515 003.



ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి
ఉప కులపతి

సందేశం

శ్రీశ్రీ సాహిత్య ప్రభంజనం మరింత వికసించాలి

శ్రీశ్రీ ఈ రెండక్షరాల పేరు ఒక శతాబ్దాన్ని శాసించింది. తెలుగు వారి కీర్తి పతాకను ప్రపంచ సాహిత్యం అంచున రెపరెపలాడేలా చేసింది. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని శాసించిన వ్యక్తిగా మనకు శ్రీరంగం శ్రీనివాసరావుగారు కనిపిస్తారు.

"తెలుగు వీర లేవరా!
దీక్షబూని సాగరా!!" అంటూ భారత జాతీయతను చాటుతూ రచించిన గేయం ఆయనకు కేంద్రస్థాయిలో జాతీయ అవార్డును తెచ్చిపెట్టిన గీతం. అల్లూరి సీతారామరాజు సినిమాకోసం ఈ గేయాన్ని రాశారు శ్రీశ్రీగారు. అయితే అందులో ఆయన రాసిన చరణాలు తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం పుస్తకం యువకులకు దిశానిర్దేశం చేసే ఒక కరదీపిక అంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

"ఎముకలు క్రుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులాలా! చావండి!
నెత్తురు మండే,

శక్తులు నిండే,

సైనికులారా! రారండి!" అన్న మాటలు ఈ దేశ యువతను ఉద్దేశించి, పనితత్వాన్ని పెంచుకోమని, సోమరితనాన్ని వీడాలంటూ చేసిన ఉద్బోధగా నేను భావిస్తున్నాను. ఏ దేశ సంపద అయినా పెరగాలంటే సోమరితనం వీడితేనే సాధ్యమవుతుంది. ప్రస్తుతం యువతలో ఉన్న సోమరితనం చాలా ప్రమాదకరమైన జబ్బు. ఆ సోమరి తనాన్ని వదులుకుంటేనే వారు ఎంచుకున్న రంగాల్లో ముందకు వెళ్ళి విజయాల్ని సాధించగలరు. ఆయన కోరుకున్న ఆధునిక సమాజం కూడా అదే.

అందుకే పదండి ముందుకు, పదండి ముందుకు అంటూ సమాజాన్ని ముందుకు నడిపే ప్రయత్నాన్ని చేశాడు. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ కవిత్వం నిత్యనూతనత్వాన్ని, సుస్థిరతను పొందింది. ఆయన ప్రపంచంలో అణగారిన వర్గాల ప్రజల సాధక బాధకాల్ని తన కవిత్వంలో అక్షరీకరించాడు. అందుకే చలం గారు శ్రీశ్రీ గురించి ప్రస్తావిస్తూ "ప్రపంచపు బాధ శ్రీశ్రీ బాధ" అని అనడం ఆయన అన్ని వర్గాల, కులాల, మతాల, ప్రాంతాల ప్రజల సమస్యల్ని తన సమస్యలుగా భావించాడని చెప్పవచ్చు.

"తెలుగు కవితా జగతికే
మార్గనిర్దేశకం శ్రీశ్రీ కవిత" అని నేను భావిస్తున్నాను.

అదే కోణంలోనే శ్రీశ్రీ కళావేదిక కనిపిస్తోంది. నిద్రావస్థలో ఉన్న సమాజాన్ని చూచి, దీన్ని మేల్కొపాలన్న తపనతో శ్రీశ్రీ కళావేదికను డా॥ కత్తిమండ ప్రతాప్‌గారు ఏలూరు కేంద్రంగా ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సంస్థ దేశ విదేశాల్లో కవిత్వం కేంద్రంగా పనిచేస్తోంది. ఈ శ్రీశ్రీ కళావేదిక ద్వారా ప్రస్తుతం నిర్వహిస్తున్న "మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం" అన్న అంశం ద్వారా శ్రీశ్రీ కలలుగన్న సాహిత్య స్వప్నాల్ని ఏవిధంగా సాధించాలి అన్న దిశగా ఈ సదస్సు సాగుతుందని నేను భావిస్తున్నాను.

"మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం" పేరిట నిర్వహించిన జాతీయ సదస్సులో వచ్చిన వ్యాసాలను ప్రత్యేకంగా యూజీసీ కేర్ జర్నల్ భావవీణ ద్వారా ముద్రణ చేయించడం అభినందనీయం. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డా॥ కత్తిమండ ప్రతాప్‌గారిని, రాష్ట్ర అధ్యక్షులు శ్రీగుత్తా హరిసర్వోత్తమనాయుడుగారిని, రాష్ట్ర ఉపాధ్యక్షులు, మరియు అనంతపురం నగర సీనియర్ సిటిజన్ డా॥ పతికి రమేష్ నారాయణగారిని అభినందిస్తున్నాను. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ శాఖ శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు, సదస్సు సంచాలకులు డా॥ బత్తల అశోక్ కుమార్‌ను, సదస్సు సమన్వయ కర్త మరియు తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి కనుమల మునిస్వామిని ఆశీర్వదిస్తున్నాను. శ్రీశ్రీ కళావేదిక ఎస్కేయూ శాఖ ద్వారా మరిన్ని సాహిత్య కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నాను.

❖❖❖

Contents (విషయ సూచిక)

1.	శ్రీశ్రీ 'అనంతం' చరిత్రాత్మక స్వీయచరిత్ర	- డా॥. నందమూరి లక్ష్మీపార్వతి	24
2.	20వ శతాబ్దపు మహాకవి - శ్రీశ్రీ	- ఆచార్య ఎం.రామనాథం నాయుడు	27
3.	శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లో వ్యక్తపరచిన అభ్యుదయ భావనలు మహాప్రస్థానంలో అభ్యుదయ భావాలు	- డా॥ కొయ్యా శ్రీనివాసులు	31
4.	కష్టజీవుల కవి - శ్రీశ్రీ	- డా॥. ఎ. ఎ. నాగేంద్ర	36
5.	అభ్యుదయ గీతం - శ్రీశ్రీ జయభేరి	- డా॥. జి. పార్వతి	39
6.	శ్రీశ్రీ కవితా ప్రస్థానం	- డా॥. వి. శ్రీదేవి	41
7.	శ్రీశ్రీమహాప్రస్థానం - మహాప్రస్థానం గేయ ప్రాధాన్యం	- డా॥. సి. పి. లక్ష్మీ ప్రసూన	45
8.	శ్రీశ్రీ కవిత్వం - మానవతావాదం	- గజ్జెల ప్రమీల	48
9.	అభ్యుదయ కవిత్వ ఉద్యమ రథసారథి - శ్రీశ్రీ	- డా॥. జెన్నే యోగీశ్వరనాయుడు	52
10.	శ్రీ శ్రీ మహా ప్రస్థానం - సామాజిక చిత్రణ	- డా॥. ఇ. వాసు	55
11.	మహా ప్రస్థానం - ఒక పరిశీలన	- డా॥. బి. వెంకటయ్య	58
12.	మహాప్రస్థానం - శ్రీశ్రీలోని సంప్రదాయ వాసనలు	- మడకశిర రాజేశ్వరి	60
13.	శ్రీ శ్రీ కంద పద్య రచనా చమత్కృతి	- డా॥. రాంభట్ల వేంకటరాయ శర్మ,	64
14.	మరోప్రపంచాన్ని కలగన్న శ్రీశ్రీ మహాప్రస్థానం	- డా॥. పల్లా కృష్ణ	70
15.	శ్రీ శ్రీ ప్రతిజ్ఞ - అభ్యుదయ దృక్పథం	- డా॥. బూర్గుల స్వరూప & - డా॥. జె. తిరుపతయ్య	74
16.	శ్రీశ్రీ 'మహాప్రస్థానం' - అభ్యుదయ దృష్టి	- జి. యమున రాణి	77
17.	"శ్రీ శ్రీ కవిత్వంలో సామాజిక చైతన్యం"	- డా॥. ఎం. ఫామిదబేగం	82
18.	శ్రామిక జీవన గీతం - శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ'	- ఎస్. శశికళ	85
19.	శ్రీశ్రీ మహా ప్రస్థానం - సామాజిక దృక్పథం	- డా॥. పలివెల చిరంజీవిరావు	89
20.	శ్రామిక చైతన్యమే శ్రీశ్రీ 'మహాప్రస్థానం'	- భూక్యా కాశీరామ్	93
21.	శ్రీశ్రీ సందేశం	- పోతురాజు దుర్గాదేవి	97
22.	సరోజాశ్రీశ్రీ జ్ఞాపకాలు - శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానం	- డా॥. బి. భీమమ్మ	100
23.	శ్రీశ్రీ - అనంతం	- శ్రీ పేరి	105
24.	శ్రీ శ్రీ సాహిత్యంలో మహాప్రస్థానం	- వేమూరి కమలాకర్ సుజాత	111
25.	శ్రీశ్రీ - ప్రయోగశీలత	- డా॥. నల్లపనేని విజయలక్ష్మి	115

26. శ్రీశ్రీ కవితా హృదయం : ఒక పరిశీలన	- ఓ. అన్నమ్మ	121
27. ఖడ్గసృష్టిలో అభ్యుదయ భావనలు	- సుభాషిణి ప్రత్తిపాటి	124
28. శ్రీశ్రీ సాహిత్యం - ఖడ్గసృష్టి స్థానం	- మార్తల పవన్ కుమార్ రెడ్డి	127
29. మహాప్రస్థానం - శ్రీశ్రీ భావాలు	- తాడి రేవతి	130
30. శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' కవితలు	- డా॥. కడివెండి మమత	134
31. మహాకవి "శ్రీశ్రీ" - మహాప్రస్థానం : కావ్య స్వరూపం - వస్తు పరిచయం	- రామకృష్ణ ఇడుకుల్ల	138
32. శ్రీశ్రీ కవిత్వంలో 'అధివాస్తవికత'	- భమిడిపాటి గౌరీశంకర్	151
33. శ్రీశ్రీ మహాప్రస్థానం - అనుశీలన	- హిమబిందు వేదుల	154
34. శ్రీ శ్రీ జయభేరి - ఒక విశ్లేషణ	- డా॥. టి. శ్రీదేవి	158
35. సాహిత్యంపై మహాకవి శ్రీశ్రీ ప్రభావం	- పి. గాయిత్రి	161
36. మహాప్రస్థానం - పీడిత తాడిత వర్గాల రాజ్యాంగం	- కొండ మోహన్	166
37. శ్రీ శ్రీ మహా ప్రస్థానం - సామాజిక చిత్రణ	- బి. క్యాథరీన	169
38. శ్రీశ్రీ కథలు - స్త్రీ జీవన చిత్రణ	- డా॥. పులపర్తి శ్రీనివాసరావు	174
39. తెలుగు సాహిత్యంపై శ్రీ శ్రీ ప్రభావం	- కాళేశ్వరం కృష్ణమూర్తి	178
40. శ్రీశ్రీ మహాప్రస్థానం- అభ్యుదయవాదం	- డా॥. కె. చెన్నకేశవరెడ్డి	183
41. "శ్రీశ్రీ దేశచరిత్రలు - మార్క్సిస్టు దృక్పథం"	- డా॥. జె. సంగీత	186
42. శ్రీ శ్రీ కవిత్వంలో - అలంకారిత	- డా॥. పెద్దింటి ముకుందరావు	189
43. శ్రీశ్రీ మహా ప్రస్థానం - కవితా వస్తువు	- పి. భార్గవీ ప్రియదర్శిని	192
44. శ్రీశ్రీ మహాప్రస్థానం - కావ్య ప్రయోజనం	- డా॥. నేమాని శారద	197
45. శ్రీశ్రీ జీవితం - సాహిత్యం	- డా॥. జి. పార్వతి	201
46. శ్రీరంగం శ్రీనివాసరరావు జీవితం - సాహిత్యం	- డా॥. మాదా శంకరబాబు	204
47. శ్రీశ్రీ సాహిత్య నేపథ్యం	- పొత్తూరి శ్రీనివాసులు	210
48. శ్రీ శ్రీ నవరసాల కథలు - ఒక పరిశీలన	- అంకే మదనమోహన	214
49. శ్రీశ్రీ - ఆధునిక సాహిత్యంలో వేగుచుక్క	- కె. రంగనాయకులు	221
50. సిప్రాలి కవితలు	-డా॥. పి. నరసింహులు	224
51. అనంతం - శ్రీశ్రీ విదేశీయాత్రానుభవాల పరిశీలన	- డా॥. ఎం. లక్ష్మయ్య	226
52. శ్రీశ్రీ కవిత సమాజపు భవిత - విశ్లేషణ	- డా॥. జాడ సీతాపతి రావు	231

53. శ్రీకాకుళ ఉద్యమ స్ఫూర్తిగీతం - 'మరో ప్రస్థానం'	- డా॥. దార్లపూడి శివరామకృష్ణ	234
54. శ్రీశ్రీ జీవితం - సాహిత్య ప్రస్థానం	- డా॥. భీమినేని శివసాయి ప్రసాద్	237
55. శ్రీశ్రీ కవితాదృష్టి - కవుల చర్చ	- కప్పల శ్రీరాములు & - కనుమల మునిస్వామి	245
56. శ్రీశ్రీ ఆలోచనా ప్రసంగ ప్రస్థానం - దాని అవశ్యకత	- పోలపల్లి శ్రీకాంత్	248
57. ఆయన కవిత్వం... ఆయన వ్యక్తిత్వం	- డా॥. బి. శ్రీనివాసరావు	251
58. ముగ్ధ, నిర్మల మానవతా గీతి - శ్రీశ్రీ శైశవ గీతి	- డా॥. పట్టపు శివకుమార్	254
59. సమాజంపై శ్రీశ్రీ రచనల ప్రభావం	- సుశీల్ ప్రత్యూష దాసరి	258
60. ఈ శతాబ్ధం నాది అన్న - శ్రీశ్రీ	- బండారి ప్రేమ్‌కుమార్	260
61. శ్రీ శ్రీ మహాప్రస్థానం - చైతన్య స్రవంతి	- కాపర్తి స్వరాజ్యం	264
62. శ్రీశ్రీ సాహిత్యంలోని పాటలలో మాటలు	- కే. హరీష్ కుమార్	270
63. సమసమాజ నిర్మాణ చైతన్య స్ఫూర్తి శ్రీశ్రీ	-డా॥. సూరపరాజు వసంత కుమారి	273
64. అభ్యుదయ కవితా - యుగకర్త శ్రీశ్రీ	- డా॥. మల్లెపొగు వెంకటలక్ష్మమ్మ	277
65. అభ్యుదయ కవి - శ్రీశ్రీ	- డా॥ బి. చక్రవర్తి	279
66. అభ్యుదయ కవితోద్యమ వైతాళికుడు శ్రీశ్రీ	- డా॥. పుట్ట శ్రీనివాసులు	283
67. శ్రీశ్రీ సినీగేయాలు - సాహిత్య సౌరభాలు	- అవధానం సుజాత	285
68. మహా కవి శ్రీశ్రీ - మహా ప్రస్థానం	- వంకం భాస్కర్	288
69. కష్టజీవికి బాసటగా శ్రీశ్రీ	- నండూరి అనంతలక్ష్మి	291
70. శ్రీశ్రీ అనంతం - నా దరిద్రపు రోజులు	- పి. వెంకటేష్	293
71. తెలుగు సాహిత్యంపైన శ్రీశ్రీ ప్రభావం	- డా॥. పి. కమల సుధారాణి	296
72. మహాకవి - శ్రీశ్రీ ప్రతిజ్ఞ	- చిట్టి రవీంద్ర	298
73. యుగకవి శ్రీశ్రీ - మహాప్రస్థానం	- బి. రాజశేఖర్	301
74. విశ్వమానవ ప్రేమకు దిక్సూచి - జయభేరి	- కోష్ట గోవిందరావు	304
75. ''కాలదోషం అంటని పాట - పాడవోయి భారతీయుడా''	- యం. ప్రదీప్	308
76. శ్రీశ్రీ జీవితం - వ్యక్తిత్వం	- డా॥. సత్యగాయత్రి జనమంచి	311
77. ఆధునిక సాహిత్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానం - సామాన్యుల జీవన విధానం	- యం. భైరవేశ్వర	314
78. శ్రీశ్రీ సాహిత్యం - నేటి సమాజ ప్రతిఫలనం	- డా॥ బత్తల అశోక్ కుమార్	317

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ 'అనంతం' చరిత్రాత్మక స్వీయచరిత్ర

– డా॥. నందమూరి లక్ష్మీపార్వతి, తెలుగు అకాడమి, ఛైర్‌పర్సన్.

అపరిమితమైన వ్యాప్తికలది "సాహిత్యం" "హితేన సహితం సాహిత్యమ్" అంటే హితంతో కూడింది ఉపదేశించేది సాహిత్యం అని చెప్పవచ్చు.

"సహితస్య భావ: సాహిత్యమ్" సాహిత్యము ధర్మాధి సకల శాస్త్ర రహస్యముల సహితమైనది. ప్రకృతి సత్యమును సౌందర్య వంతము చేసి ఆనంద పర్య వసాయిగా చిత్రించునది సాహిత్యము. సాహిత్యము ఒక దర్శనమని 'నానృషి: కురుతే కావ్యమ్' అనుటచే సాహిత్య నిర్మాత ఉపదేశకుడు కావలెనని కొందరు భావింతురు 'విశ్వశ్రేయ: కావ్యం' అను సూక్తిని బట్టి విశ్వశ్రేయమును కాంక్షించు గ్రంథములు మాత్రమే సాహిత్యమున చేరు చున్నవి.

ఆంగ్లసాహిత్య ప్రభావం వలన మనదేశంలో అనేక నూతన సాహిత్య ప్రక్రియలు వెలువడ్డాయి. ఈ ప్రక్రియల్లో పేర్కొనదగిన ప్రక్రియల్లో స్వీయచరిత్ర ఒకటి దీనినే ఆత్మ కథ అని కూడా అంటారు. స్వీయ చరిత్రలో కర్తయొక్క జీవిత ధర్మాలు ఆయన సాధించిన ఘనకార్యాలు, విజయపరంపరలు, ఆయా సంఘటనల్లో పొందిన అనుభవం, పడిన కష్టాలు, సుఖాలు మొదలైన వన్నీ ప్రకరణానుగుణంగా విభజింపబడి రాయబడతాయి.

తెలుగులో వచ్చిన ఆత్మకథలలో శ్రీశ్రీగారు రచించిన 'అనంతం' ఆత్మకథ ఎంతో ప్రసిద్ధమైనది. తన జీవితం లోని ముఖ్య ఘట్టాలు, ఒడిదుడుకులు వివరించారు. వారి సమకాలీన కవులు, రచయితలు ప్రసిద్ధ వ్యక్తులను మనకు ఈ పుస్తకంలో పరిచయం చేశారు. 1986లో రచించారు. తన ఆత్మకథాత్మకమైన ఈ రచన తనకు తోచిన విధంగా క్రమాతి క్రమణంలో అన్ ఎడిటెడ్ రచనగా ప్రచురించారు.

శ్రీశ్రీ అని పిలవబడే శ్రీరంగం శ్రీనివాసరావు 1910 ఏప్రిల్ 30న విశాఖపట్టణంలో జన్మించారు ప్రముఖ తెలుగుకవిగా, విప్లవకవిగా ఛందో, బద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ప్రసిద్ధుడు. ఆయన హేతువాది, నాస్తికుడు. మహాప్రస్థానం అతని రచనల్లో ప్రసిద్ధమైనది. శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని తన ఏడవయేటనే ప్రారంభించారు. తన మొదటి గేయాల పుస్తకం ఏనిమిదవయేట ప్రచురించబడింది. అందుబాటులో ఏదుంటే అది కాగితం కాని, తన సిగరెట్ ప్యాకెట్ వెనుకభాగంలోగాని రాసేవాడు. తన 18వ ఏట 1928లో 'ప్రభవ' అనే కావ్య సంపుటిని ప్రచురించాడు. ఈ రచనను సాంప్రదాయ పద్ధతిలోనే రాసాడు. తరువాతి కాలంలో సాంప్రదాయకమైన గ్రాంథిక శైలి, ఛందస్సు వంటి వాటిని పక్కన పెట్టి వాడుక భాషలో మాత్రా ఛందస్సులో కవిత్వం రాశాడు. ఇలా చేయడం గురజాడ 'అడుగుజాడ" అని వారే పేర్కొన్నారు.

1950లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు. బాటసారి, బిక్షువర్షీయసి మొదలైన కవితలసంపుటులు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవిని చేసింది. తరువాత మరో ప్రస్థానం, ఖడ్గసృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని రేడియో నాటికలను రచించాడు. మహాప్రస్థాననం వంటి గీతాలన్నీ మార్క్సిజం దృక్పథంతో రాసినవే అయినా అవి రాసేనాటికి మార్క్సిజం అనేది ఒకటుందని అతనికి తెలియదు. 1981లో లండన్‌లో ప్రచురితమైన 'మహాప్రస్థానం'కు ముందు మాటలో అతను ఈ విషయ స్వయంగా రాశారు. "ఈ

వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా ఇలాంటి రచనలను సామాజిక వాస్తవికత అంటారనీ, దీని వెనుక దన్నుగా మార్క్సిజం అనే దార్శనికత ఒకటి ఉందనీ అప్పటికి నాకు తెలియదు ఇప్పుడొకసారి వెనకు తిరిగి చూసుకుంటే మహాప్రస్థాన గీతాలలోని, మార్క్సిస్టు స్ఫూర్తి, సామాజిక స్పృహ యాధృచ్ఛికాలు కావని స్పష్టంగా తెలుస్తుంది. ప్రాసకూ, శ్లేషకూ శ్రీశ్రీ పెట్టింది పేరు. "అల్పాక్షరాలల్లో అనల్పార్థాన్ని" సృష్టించడంలో శ్రీశ్రీ మేటి. "వ్యక్తికి బహువచనం శక్తి" అనేది అతను సృజించిన మహత్తర వాక్యమే. శబ్ద ప్రయోగంలో నవ్యతను, చూపించారు. "ప్రగతి" వారపత్రికలో ప్రశ్నలు, జవాబులు (ప్రజ) అనే శీర్షికను నిర్వహించాడు. పాఠకుల ప్రశ్నలకు సమాధానాలిచ్చే శీర్షిక అది. చతురోక్తులతో, శ్లేషలతో కూడిన ఆ శీర్షిక బహుళ ప్రాచుర్యం పొందింది.

"ఈ జన్మను సద్వినియోగం చేసుకోవడం చేతకాక లేని జన్మ గురించి ఆలోచించడం అజ్ఞానం" "శోధించి సాధించడమే ధీరగుణం" అంటారు.

శ్రీశ్రీ 'అనంతం' తన ఆత్మకథ కాదని ఆత్మచరిత్రాత్మక చారిత్రక నవల అని ఆయనే స్వయంగా చెప్పారు. తన ఆత్మకథలో తన గురువుల గురించి కవిత్వంలో తాను చేసిన ప్రయోగాలను, సరియలిజం గురించి, తన నాస్తిక వాదం గురించి, విదేశీ ప్రయాణాల గురించి రాసాడు. దాచుకోకుండా తన బలహీనతలను కూడా కుండబద్దలు కొటినట్లుగా ఇందులో ప్రస్తావించారు.

అనంతం శ్రీశ్రీ యొక్క ఆత్మకథ దీనిని మొదట విప్లవ రచయితల సంఘం తరపున ఆగష్టు 1986లో తొలిసారి ముద్రించారు. 2010లో శ్రీశ్రీ గారి శతజయంతి సందర్భంగా శ్రీశ్రీ ప్రచురణలు సంస్థవారు. చలసాని ప్రసాదు గారి సహకారంతో చేర్పులు, మార్పులతో మలి కూర్పును జనవరి 2010లో ప్రచురించారు. పుస్తకం మీది ముఖచిత్రాన్ని శ్రీ పినిశెట్టి అందించారు. (నవ్యవార పత్రిక సౌజన్యంతో) ఈ పుస్తకంలో మొత్తం 328 పుటలు ఉన్నాయి. ఈ పుస్తకం మీద శ్రీమతి సరోజ శ్రీశ్రీ, ఎస్.వి రమణ (జూనియర్ శ్రీశ్రీ) కాపీరైట్ హక్కులు కలిగి ఉన్నారు. వారి లిఖిత పూర్వక హామీ లేనిదే ఈ పుస్తకంలోని ఏ భాగాన్ని కూడా ఉపయోగించరాదు. ఈ పుస్తక అక్షరాలంకరణను సవేరా గ్రాఫిక్స్ హైదరాబాద్ వారు చేయగా, ముద్రణను శ్రీ కళాంజలి గ్రాఫిక్స్ హైదరాబాద్ వారు చేశారు. ఈ పుస్తకానికి విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అబీడ్స్ వారు సోషల్ డిస్టిబ్యూటర్స్.

శ్రీశ్రీగారు 1910లో విశాఖ పట్టణంలో తన పుట్టుక మొదలు 1977 వరకు తనజీవిత సంఘటనలను ఇందులో పొందుపరిచారు. శ్రీశ్రీ తన జీవిత చరిత్రను ఒకేసారి కుదురుగా కూర్చొని రాయలేదు. ఇందులోని భాగాలన్ని, అప్పడప్పుడు రాసినవి అత్యధికంగా 1975 నుండి 1977 వరకు ప్రజాతంత్రవార పత్రికలో ధారావాహికంగా రాసిన భాగాలు. కొన్ని భాగాలు స్వాతి మాస పత్రిక లోనివి. మొదటి ముద్రణ సమయంలో "ఉదయం" దినపత్రిక తన సహకారాన్ని అందించింది. శ్రీశ్రీ అనంతం ఆత్మకథ కాదని ఆత్మచరిత్రాత్మక చారిత్రక నవల అని ఆయనే స్వయంగా చెప్పారు.

ఆకలి రాజ్యమో, రుద్రవీణో లేదా వారిని చూసో సంబంధం ఉన్నవారికి ఎవరికైనా ఆయన జీవితం గురించిన కుతూహలం కలగడంలో ఆశ్చర్యం ఏమిలేదు. "అనంతం" ద్వారా కవుల గురించీ కవిత్వం గురించీ తెలుగు కవులే కాదు ఎంతో మంది పాశ్చాత్య కవుల గురించీ తెలుస్తుంది. "జనార్ధనరావు జ్ఞాపకాలు", "కృష్ణశాస్త్రి జ్ఞాపకాలు", కవిత్వ ఆరంభం వంటి చాప్టర్లు పాఠ్య పుస్తకాల వంటివి. కవిత్వం గురించి చారిత్రక ఆసక్తి ఉన్నవారికీ, కవిత్వం రాయాలనుకునే వారికీ అందరికీనూ వీటిలో శ్రీశ్రీ గారు ఎంత విరివిగా చదివారో తెలుస్తుంది. అయితే ఇంత ఆత్మకథలోనూ ఎక్కడా తన కథల గురించి గానీ, తాను చేసిన అనువాదాల గురించి గానీ, తాను ఎన్నో కథల్ని తెనిగించిన విలియం సారోయాన్ గురించి గాని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యమే. తన కవితల గురించి అంత సవివరంగా పొగొట్టాకున్న కవితల్నీ, నాటకాల్నీ

గురించి రాసిన మనిషి కథల్నీ, అనువాదాల్ని ఎందుకు మరిచారో మరి! అవి కూడా ప్రస్తావించి ఉంటే, ఈ పాఠ్య పుస్తకం మరింత విలువైన నిధి అయి ఉండేది. ఆ పరంగా చూస్తే ఇది శ్రీశ్రీ ఆత్మకథ కాదు. అప్పటి తెలుగు సాహిత్య ప్రపంచం చరిత్ర. విశ్వనాథ, రావిశాస్త్రి, తాపీ ధర్మారావు, చెళ్ళపిళ్ళ, ఆరుద్ర, నారాయణబాబు విరసం సభ్యులు ఇలా ఎన్నో పేర్లూ, వీరందరితో శ్రీశ్రీ జీవితంతో ఉన్న సంబంధం చదువుతూ ఉంటే, ఈ పుస్తకాన్ని చరిత్రపుస్తకం అనడంలో అతిశయోక్తి లేదు.

శ్రీశ్రీ విదేశీ పర్యటనల అనుభవాలు చదువుతూ ఉంటే అందులో ఒక భాగం స్కూల్లో పాఠ్యాంశంగా ఉండేది. "అనంతం" ఆత్మకథ చూస్తే ఠాగోర్ ఆత్మ కథ గుర్తుకు వస్తోంది. ఆయన ఆత్మకథ రాసుకోలేదు. కాని ఆయన ఉత్తరాలూ, వ్యాసాలూ అన్నీంటిని ఒక పద్ధతిగా కూర్చి ఆత్మకథలా చేశారు. కానీ వీరి 'అనంతం' అలాంటిది కాదు. "అనంతం" లాగానే రాశారు. సీరియల్ వలె. "అనంతం"లో ఆయన సినిమా అనుభవాల కథ కొంత అసంపూర్తిగా అన్పిస్తుంది. అన్నేళ్ళు సినిమాలో ఉన్న మనిషి తన ఆత్మకథలో దానికిచ్చిన చోటు చాలా తక్కువ. ఆయన తన సినిమా రచనలకి సాహితపరంగా విలువివ్వనని ఇందులోనే చెప్పుకున్నారు. కమ్యూనిజం గురించీ తనలో దేవుడు అన్న భావానికి సంబంధించి చిన్నప్పట్నుంచి కలిగిన పరిణామం గురించి చివరి ఛాప్టర్లలో బాగా చెప్పారు. ఇంతకీ 30లలో శ్రీశ్రీ కుటుంబం ఆర్థిక సంక్షోభానికి గురికాకుండా ఉంటే ఆయన పరిణామం ఎలా ఉండేదా అన్న కుతూహలం కలిగింది. ఆయన తనకు అప్పట్లో ఉన్న భవిష్యత్ ప్రణాళికలను గురించి చెబుతూ ఉంటే. వ్యక్తిగత జీవితం పరంగా ఈ పుస్తకంలో చాలా విషయాలను గురించి నిజాయితీగా చెప్పుకొచ్చారు. అక్కడ చెప్పిన వాటిలో కొన్ని విషయాలను జనం ముందు చెప్పుకోవడానికి బోలెడు ధైర్యం కావాలి.

శ్రీశ్రీ విదేశీ పర్యటనల అనుభవాలు చదువుతూ ఉంటే అందులో ఒక భాగం స్కూల్లో పాఠ్యాంశంగా ఉండేది. "అనంతం" ఆత్మకథ చూస్తే ఠాగోర్ ఆత్మ కథ గుర్తుకు వస్తోంది. ఆయన ఆత్మకథ రాసుకోలేదు. కాని ఆయన ఉత్తరాలూ, వ్యాసాలూ అన్నీంటిని ఒక పద్ధతిగా కూర్చి ఆత్మకథలా చేశారు. కానీ వీరి 'అనంతం' అలాంటిది కాదు. "అనంతం" లాగానే రాశారు. సీరియల్ వలె. "అనంతం"లో ఆయన సినిమా అనుభవాల కథ కొంత అసంపూర్తిగా అన్పిస్తుంది. అన్నేళ్ళు సినిమాలో ఉన్న మనిషి తన ఆత్మకథలో దానికిచ్చిన చోటు చాలా తక్కువ. ఆయన తన సినిమా రచనలకి సాహితపరంగా విలువివ్వనని ఇందులోనే చెప్పుకున్నారు. కమ్యూనిజం గురించీ తనలో దేవుడు అన్న భావానికి సంబంధించి చిన్నప్పట్నుంచి కలిగిన పరిణామం గురించి చివరి ఛాప్టర్లలో బాగా చెప్పారు. ఇంతకీ 30లలో శ్రీశ్రీ కుటుంబం ఆర్థిక సంక్షోభానికి గురికాకుండా ఉంటే ఆయన పరిణామం ఎలా ఉండేదా అన్న కుతూహలం కలిగింది. ఆయన తనకు అప్పట్లో ఉన్న భవిష్యత్ ప్రణాళికలను గురించి చెబుతూ ఉంటే. వ్యక్తిగత జీవితం పరంగా ఈ పుస్తకంలో చాలా విషయాలను గురించి నిజాయితీగా చెప్పుకొచ్చారు. అక్కడ చెప్పిన వాటిలో కొన్ని విషయాలను జనం ముందు చెప్పుకోవడానికి బోలెడు ధైర్యం కావాలి.

కేవలం శ్రీశ్రీ గురించే కాక గడిచిన శతాబ్దంలో రాష్ట్రంలోనూ, అంతర్జాతీయంగానూ జరిగిన పరిణామా లను గురించి తెలుసుకోవాలంటే "అనంతం" చదివి తీరాల్సింది.

ఆధార గ్రంథసూచిక :

1. తెలుగు సాహిత్య చరిత్ర డా॥ ద్వా. నా. శాస్త్రి
2. తెలుగు సాహిత్య చరిత్ర ప్రొ॥ వెలమల సిమ్మన్న.
3. అనంతం శ్రీశ్రీ.
4. అంతర్వాల సేకరణ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

20వ శతాబ్దపు మహాకవి - శ్రీశ్రీ

- ఆచార్య ఎం.రాజునాథం నాయుడు, తెలుగు శాఖాధిపతి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.

తెలుగు సాహితీ ప్రపంచంలో యుగకర్తగాను, మహాకవిగాను ప్రసిద్ధిచెందిన శ్రీశ్రీ తన "మహాప్రస్థానం" గేయాల ద్వారా తెలుగు అభ్యుదయ కవితకు శ్రీకారం చుట్టారు. అభ్యుదయ కవిత్వానికి భగీరథుడు. మూల విరాట్టు శ్రీశ్రీ. అభ్యుదయం శ్రీశ్రీకి ఆరోప్రాణం. నిద్రాణమైయున్న జాతిని ఒక్క ఉదుటున లేపి "అదిగో మరో ప్రపంచం" అని కాంతిరేఖను చూపిన నవయుగ వైతాళికుడు శ్రీశ్రీ. ఆయన కార్మికలోకపు కల్యాణం, శ్రామిక లోకపు సౌభాగ్యం తన ఆశయంగా అభ్యుదయ సాహిత్యాన్ని కొనసాగించాడు. తెలుగులో మొదటి సారిగా ఆవేశంతో, కవితా శిల్పంతో కూడిన కవితలు "మహా ప్రస్థానం" రూపంలో వెలువడ్డాయి. పాఠకుల హృదయా లను కదిలించాయి.

కవితకు సామాజిక ప్రయోజనం వుండాలని, కష్టజీవికి ఇరువైపులా కవి అండగా వుండాలని, ఆర్థిక, సామాజిక సాంస్కృతిక రంగాలలో అంతరాలు సమసిపోయి, సర్వమానవ సమానత్వం వికసించే "మరోప్రపంచం" కోసం కలలుగన్నారు శ్రీశ్రీ. 'శ్రీశ్రీ' అనే అందమైన రెండు అక్షరాలు చెలరేగుతున్న సముద్రపు అలల్లా, అగ్ని జ్వాలల్లా కన్పిస్తాయి. శ్రీశ్రీ మొదట పద్యకవి. తర్వాత ఉద్యమకవి. అభ్యుదయ ఉద్యమాన్ని, విప్లవ ఉద్యమాన్ని నడపించిన మహాకవి.

శ్రీశ్రీ కవిత్వం ఒక జలపాతం. అదొక దావానలం. నిండు పున్నమి వెన్నెలలా, ఇంద్రధనుస్సులా అలరారింది. శ్రీశ్రీ చేసిన మహత్తర కావ్యం అంటే అక్షరాన్ని ఛందస్సు నుంచి విముక్తి చేయించడం. అలాగే కవిత్వం అక్షరానికి ఆత్మ. అది కనిపించేది కాదు. అనుభవించదగినది అని నిష్కర్షగా దండోరా వేయించినవాడు శ్రీశ్రీ.

భావకవులు ఊహాప్రేయసి మైకంలో పడి. ఆకాశంలో తేలియాడుతూ, కవిత్వాన్ని సామాన్య ప్రజలకందనంత దూరంలో వుంచి "దిగిరాను, దిగిరాను దివి నుండి భువి"కి అని భీష్మించుకూర్చున్న తరుణంలో ఆ కవితను భూ మార్గం పట్టించి, నెత్తురు మరిగే, శక్తులు నిండే, శస్త్రాల్లాంటి అక్షరాలలో అభ్యుదయకవిత్వంగా మలచి, శివ సముద్రమువలె, నయాగరా జలపాతం వలె ఉర కండీ, ఉరకండీ ముందుకు అంటూ శాసించి, మరో ప్రపంచపు కంచు నగారా మ్రోగించి, సామాన్య ప్రజల వెతలను, కతలను తొలగించే మరో ప్రపంచంకోసం, మహాప్రస్థానం చేసినవాడు మహాకవి శ్రీశ్రీ. ఆధునిక తెలుగు సాహితీ జగత్తులో శ్రీశ్రీని మేరు శిఖరంలా నిలబెట్టింది మహాప్రస్థానం. శ్రీశ్రీ సముద్రంలాంటివాడు. విస్తారమైన కవితా ప్రియుడు. శ్రీశ్రీ ఒక వ్యక్తికాదు. ఒక శక్తి. ఒక సంస్థకాదు. ఒక వ్యవస్థ.

సమాజంలో పేదలు, ధనికులు, శ్రామికులు, బూర్జువాలు అని రెండు వర్గాలున్నాయి. ఈ వర్గాల మధ్య ఎల్లప్పుడూ సంఘర్షణ జరుగుతూవుంటుంది. సమాజంలో కొన్ని జాతులవారు మరి కొన్ని జాతులవారిని పీడిస్తూ ఆధిక్యతను ప్రదర్శిస్తున్నారని భావించిన శ్రీశ్రీ

"ఏదేశ చరిత్ర చూచినా - ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం - పరపీడన పరాయణత్వం"

అంటూ అనాదిగా చరిత్రలో కనబడుతున్న అన్యాయా లను, అక్రమాలను తీరని వ్యధతో వ్యక్తం చేశాడు. అలాగే చరిత్రకొక కొత్త భాష్యం కూడా చెప్పాడు.

శ్రీశ్రీ "ప్రపంచమొక పద్మవ్యూహం
కవిత్వమొక తీరని దాహం" అంటూ ఒక బరువైన సిద్ధాంతాన్ని మనకు అందించాడు.

"కదిలేదీ కదిలించేదీ
పెను నిద్దుర వదిలించేదీ

మును ముందుకు నడిపించేదీ
పరిపూర్ణపు బ్రతుకు నిచ్చేదీ'' అయిన అభ్యుదయ కవిత్వానికి శ్రీశ్రీ పట్టుగొమ్మయ్యాడు. సామ్యవాద ప్రపంచ నిర్మాణానికి తన కలాన్ని, గళాన్ని అంకితం చేసిన మహాకవి శ్రీశ్రీ.

అభ్యుదయ కవులు మానవతావాదాన్ని రచించడంలో తమ కలాలకు పదునెట్టారు. సామాన్యుల దయనీయ స్థితిని కళ్ళకుకట్టినట్టు వర్ణించారు. ఆ కోణంలో శ్రీశ్రీ గారు రచించిన 'భిక్షువర్షీయసి' అనే కథనాత్మక గేయం కరుణ రస ప్రధానమైంది. ఒక ముసలి బిచ్చగత్తె వర్ణన తెలుగు నుడికారంతో సాగుతుంది.

''దారి పక్కన చెట్టుకింద
ఆరిన కుంపటి విధాన
మూలుగుతూ, ముసురుతున్న
ఈగలతో వేగలేక.''

ఇక్కడ ఆరిన కుంపటి చాలా అర్థవంతమైన ఉపమానం. ఈ కవితలోని కథ అంతా ఆమెకు తిండి లేని సందర్భం మీదే ఆధారపడింది. వండుకునేందుకు బియ్యం లేవనే పరిస్థితిని ''ఆరిన కుంపటి'' స్ఫురింప జేస్తుంది. ''ఎముక ముక్క కొరుక్కుంటూ ఏమీ అనలేదు కుక్క'' అనీ, ''ఈగను పడవేసుకు తొందరగా తొలగి తొండ'' అని చెప్పడంలో స్వార్థాన్ని మాత్రమే చూసుకుంటూ, దీనుల వంక చూడని మనుషులు వ్యక్తం అవుతారు. బిచ్చగత్తె ఆకలితో మరణించింది. ఎగిరి వచ్చిన ఎంగిలాకు ఇది నా పాపం కాదంది. అంటే తాము కడుపునిండా తింటూ, తిండిలేని వాళ్ళని పట్టించుకోని వారి పాపం ఇది. శ్రమ దోపిడీకి సంబంధించిన శ్రీశ్రీ ఒక ముసలి బిచ్చగత్తె దుస్థితిని సజీవంగా, కళ్ళకు కట్టినట్టు పాఠకుల ముందుంచాడు.

''కత్తికన్నా కలమే పదునంటూ / కవనరంగమున కురికాడు
కష్టజీవులకు, కర్మవీరులకు / ప్రతినిధిగా నినదించాడు
శ్రమైక జీవన సౌందర్యానికి / సమానమైనది లేదన్నాడు
పీడత బాధిత జనుల గళాలే / తన కవితకు ప్రాణం''

అని అన్నాడు సాహితీ సిరి శ్రీశ్రీ. ఆయన తెలుగు సాహిత్యంలో ఎర్రజెండా, ప్రపంచ సాహిత్యంలో తెలుగు జెండా.

అలాగే శ్రీశ్రీ

''ఆకాశం అందుకునే ధరలొక వైపు
అంతులేని నిరుద్యోగమింకొక వైపు
అవినీతి, బంధుప్రీతి చీకటి బజారు
అలుముకున్న నీ దేశం ఎటుదిగజారు'' అంటూ సామాజిక రుగ్మతలను, సాక్షాత్కరింపజేసి, ఆ పరిస్థితిని ఎదిరించమని సామాన్యుడికి ధైర్యం నూరిపోశారు. ఆయన తన కాలపు అలజడిని, ఆవేదనలను అక్షర బద్ధం చేశాడు.

ప్రతి కవికి ప్రత్యేకమైన, తనదైన శైలి వుండటం సర్వసాధారణం. సహజంగా వామపక్ష భావజాలం గల మహాకవి శ్రీశ్రీ పేరు చెబితే విప్లవగీతాలు గుర్తుకు వస్తాయి. ఆయన ఎర్రపాటల వేగుచుక్క మాత్రమే కాదు. దేశభక్తి గేయాలు రాసిన కవి కూడా. ''నా హృదయంలో నిదురించే చెలి'' అనే పాట రాసినప్పుడు, ఆ చెలి ఎవరని అడిగితే ''కమ్యూనిజం'' అని చమత్కారంగా సమాధానమిచ్చాడట.

తెలుగు సినిమాపాటకు మొట్టమొదట సారిగా జాతీయ బహుమతిని సాధించిన ఘనత మహాకవి శ్రీశ్రీదే. అల్లూరి సీతారామరాజు చిత్రం కోసం రాసిన ''తెలుగు వీర లేవరా, దీక్ష బూని సాగరా, దేశమాత స్వేచ్ఛగోరి, తిరుగుబాటు చేయరా!'' అనే పాట తెల్ల దొరతనంపై తెలుగు వీరుడు సీతారామరాజు చేసిన తిరుగుబాటును అభివర్ణించేది. దేశ వ్యాప్తంగా తెలుగు వీరుడికి గుర్తింపు తెచ్చిన ఈ పాట అనంతరం వచ్చిన విప్లవ గీతాలకు మార్గదర్శకమైంది.

మూడవ సారి జాతీయ బహుమతి పొందిన 'ఠాగూర్' చిత్రంలో సుద్దాల అశోక్ తేజ పాట మీద శ్రీశ్రీ ప్రభావం వుండటమే కాదు ఆ పల్లవి పూర్తిగా 'జయభేరి' ఖండిక లోనిదే.

"నేను సైతం / ప్రపంచాగ్నికి / సమిధనొక్కటి అహుతిచ్చాను
నేను సైతం / విశ్వసృష్టికి / అశ్రువొక్కటి ధారపోశాను
నేను సైతం / భువన ఘోషకు / వెర్రిగొంతుకు విచ్చి మ్రోశాను"

శ్రీశ్రీ ప్రపంచానికి వినిపించే విధంగా కొత్తగొంతుకతో, కవితా రూపంలో కేకలేశాడు. అందులో ఆకలి - ఆవేశం, బాధ - బాధ్యత, సమాజం - సంఘర్షణ వున్నాయి. "కనపడ లేదా మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధగధగలు, ఎర్ర బావుటా నిగనిగలూ, హోమజ్వాలల భుగభుగలు" అని ప్రశ్నించి "ఎముకలు కుళ్ళిన, వయసు మళ్ళిన సోమరు లారా చావండి, నెత్తురు మండే శక్తులు నిండే సైనికులారా రారండి" అంటూ నూతన ప్రపంచాన్ని నిర్మించడానికి సాగిరమ్మని నూతన తరాలకు పిలుపునిచ్చారు శ్రీశ్రీ.

శ్రీశ్రీ కవితా "మహాప్రస్థానం" వస్తు శిల్పంలో నూతన త్వాన్ని విభ్రాంతి గొలిపే స్థాయిలో ప్రదర్శిస్తూ సాగింది. గిడుగు, గురజాడ, వీరేశలింగం సాహిత్య, సామాజిక రంగాలలో వేసిన ప్రజాస్వామిక భావ విప్లవ బీజాలను శ్రీశ్రీ కష్టజీవుల ఉద్యమ క్షేత్రంలో నాటారు. జాతీయ ప్రజాస్వామిక విప్లవ పునాదులు కార్మిక, కర్షక సమస్త శ్రామిక ప్రజలేనన్న నూతన యుగ చైతన్యాన్ని తెలుగు జాతికి అందించాడు. ఏకకాలంలో ఇటు సాహిత్యోద్యమ కర్తవ్యాలను, అటు సామాజిక విప్లవ దృక్పథాలను అందించాడు. నేటి సామ్రాజ్యవాద ప్రపంచీ కరణ కాలానికి శ్రీశ్రీ నిర్దేశించిన కర్తవ్యాలు మరింత ప్రాచుర్యాన్ని పొందాయి.

కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, గొడ్డలి, కొడవలి, రంపం, నాగలి వంటి సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలను ప్రదర్శిస్తూ; తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరని ప్రశ్నిస్తూ; చిరకాలం జరిగిన మోసాలవల్ల అట్టడుగున పడి కన్పించని, దాచేస్తే దాగని సత్యాలను వెలికి తీస్తూ శ్రమైక జీవన సౌందర్యానికి ఈ లోకంలోనే కాదు ఏ లోకంలోనూ సమానమైనది లేనే లేదని నిర్ద్వందంగా ప్రకటిస్తూ; పతితులైన, దగాపడిన తమ్ముల్లను అక్కున చేర్చుకుని 'ఈ లోకం మీదేనండి, మీ రాజ్యం మీరేలండి' అని రాసిచ్చేస్తూ; అలజడి మా జీవితం, ఆందోళన మా ఊపిరి, తిరుగుబాటు మా వేదాంతమని నిర్మొహమాటంగా లక్ష్య ప్రకటన చేశాడు శ్రీశ్రీ. అలాగే కార్మిక, కర్షకులతోపాటు అనేకులింకా, అభాగ్యులంతా, అశాంతులంతా తీవ్రధ్వనితో, దీర్ఘ శృతిలో, విప్లవ శంఖం విన్పిస్తారని చారిత్రక యదార్థ తత్వాన్ని చాటి చెప్పాడు.

"ఆశయం సాధించాలంటే ఆయుధం అవసరమే మరి" అంటూ "విప్లవ సాహిత్యం పోయేదారి కంటక భూయిష్టం / దాని ప్రధాన రసం బీభత్సం/ దాని పునాది సాంఘిక యథార్థం / దాని ఆదర్శం వర్గ రాహిత్యం" అని వాస్తవాంశాలను మన కళ్ళముందుంచాడు. శ్రీశ్రీ నక్సల్‌బరీ ఉద్యమాన్ని సమర్థిస్తూ, ఆ ఉద్యమంలో అమరులైన వారిని అల్లూరికి వారసులనీ, శ్రీశ్రీ కవితా లాలసులనీ గుర్తిస్తూ

"తెల్లవాడు నిన్నునాడు భగత్‌సింగ్ అన్నాడు
నల్లవాడు నేడు నిన్ను నక్సలైట్ అన్నాడు
ఎల్లవారు రేపు నిన్ను వేగుచుక్క అంటారు
అల్లూరికి వారసుడా శ్రీశ్రీ కవితాలాలసుడా
ఊగరా! ఊగరా! ఊగరా!
నువ్వూగుతుంటే శత్రువులకు గాభరా" అని చాటాడు. దేశంకోసం, ప్రజల కోసం తమ జీవితాలను పణంగా పెట్టి త్యాగమూర్తులైన అమరులు వేగుచుక్కలై నిలుస్తారని చెప్పాడు.

శ్రీశ్రీ కీర్తి కిరీటంలో మహాప్రస్థానం కలికితురాయి. ఆయన సమాజాన్ని మరోప్రపంచం వైపు నడిపించి, ప్రాచీన కవితా మార్గాన్ని దారి మళ్ళించి, అభ్యుదయ

కవిత్వ పథంలో తెలుగు సాహితీ సరస్వతిని తీసుకెళ్ళి, నవ్య కవిత్వానికి శ్రీకారం చుట్టగా 20వ శతాబ్దం శ్రీశ్రీ యుగంగా ప్రసిద్ధి చెందింది.

సామ్యవాద ప్రపంచం కోసం నవయువతకు కవన కవాతు చేయించిన రణసేనాని శ్రీశ్రీ. శ్రమైక జీవన సౌందర్యాన్ని కవిత్వీకరించిన మహాకవిశ్రీశ్రీ. పీడిత ప్రజల కోసం తన కలాన్ని, గళాన్ని అంకితం చేసి, పాలక వర్గంపై రాజీలేని పోరాటం చేసిన అక్షర యోధుడు శ్రీశ్రీ. విప్లవ రచయితల సంఘానికి సారధ్యం వహించిన శ్రీశ్రీ పెన్ను గుడ్డివానికి కన్నుగాను, నడ్డివానికి వెన్నుగాను, పేదప్రజల కోసం ప్రాణాలు ఒడ్డువానికి గన్నుగాను నిలిచి మరో ప్రపంచంవైపు నడిపించిన విప్లవకవి శ్రీశ్రీ.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష, 1985, నాగయ్య, జి, నవ్యపరిశోధక ప్రచురణలు, తిరుపతి.
2. తెలుగు సాహిత్య చరిత్ర, 1998, శాస్త్రి ద్వా.నా., ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాదు.
3. తెలుగు సాహిత్య చరిత్ర, 2021, సిమ్మన్న, వెలమల, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
4. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, 2013, ఆరుద్ర, తెలుగు అకాడమీ, హైదరాబాదు.
5. సాహితీ మందారం, 2021, రామనాథం నాయుడు, మొగరాల, ముద్రికా ప్రింటర్స్, విజయవాడ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లో వ్యక్తపరచిన అభ్యుదయ భావనలు మహాప్రస్థానంలో అభ్యుదయ భావాలు

– డా॥. కొయ్యా శ్రీనివాసులు, తెలుగు విభాగాధిపతి, యస్.టి.యస్.యన్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి.

శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం 1950 సంవత్సరంలో పుస్తక రూపంగా వెలువడింది. ఇది 41 కవితా ఖండికల సంకలనం. మహాప్రస్థానంలోని కవితా ఖండికలను 1933 నుండి 1947 సంవత్సరాల మధ్యకాలంలో శ్రీశ్రీ రచించాడు. శ్రీశ్రీ మహాప్రస్థానంతో పాటు ఖడ్గసృష్టి, చరమరాత్రి, చతురస్రం, మూడు ఏభైలు, మరో ప్రస్థానం, వారం వారం, సిరిసిరి మువ్వ, శతకం, ప్రాసక్రీడలు, లిమరిక్కులు (సిప్రాలి), అనంతం, మరో ప్రపంచం (రేడియో నాటికల సంపుటి) మొదలైన రచనలు చేశారు. శ్రీశ్రీ రచనల్లో కథలు, నాటికలున్నాయి, సినిమా పాటలున్నాయి, పద్యాలున్నాయి, వచన గీతాలున్నాయి, వ్యాసాలున్నాయి.

శ్రీశ్రీ రచనలన్నీ ఒక ఎత్తైతే మహాప్రస్థానం ఒకటే మరొక ఎత్తు. తెలుగు సాహిత్యంలో కవిత్రయ భారతం, గోనబుద్ధారెడ్డి రంగనాథరామాయణం, శ్రీనాథుని శృంగార నైషధం, పోతన మహా భాగవతం, అన్నమయ్య పద కవితలు, పెద్దన మనుచరిత్ర, భట్టుమూర్తి వసుచరిత్ర, గురజాడ కన్యాశుల్కం, వేమన ఆటవెలదులు, ఉన్నవ వారి మాలపల్లికి ఎంతస్థానం ఉందో తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానానికి అంతే స్థానం ఉంది.

మహా ప్రస్థానం తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవితా ప్రస్థానానికి తొలి దివిటీగా, సుప్రభాత గానంగా ప్రసిద్ధికెక్కిందని చెప్పవచ్చు. మహాప్రస్థానంలో మొదటి కవిత 'మహాప్రస్థానం'. ప్రస్థానం అంటే ప్రయాణం. మహాప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం. గొప్పమార్పును తెచ్చిన ఆ మరోప్రపంచానికి వెళ్ళాలంటే సాధారణ ప్రయాణం సరిపోదని మహాప్రస్థానం చేయాలని శ్రీశ్రీ భావించాడు.

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం, పోదాం పైపైకి!

ఇక్కడ మరోప్రపంచం అంటే సామ్యవాద వ్యవస్థ. పదండి త్రోసుకు పోదాం అనడంలో సమయం మించి పోకుండా పరుగెత్తి నడవాలని శ్రీశ్రీ శ్రామిక వర్గాలలో ఉత్సాహాన్ని, ఆవేశాన్ని రగుల్కొలిపాడు.

శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం అభ్యుదయ భావనలకు పాఠ్యగ్రంథం వంటింది. శ్రామికులను బూర్జువా వర్గం పై పట్టుదలతో, పగతో, ప్రతీకారంతో తిరగబడమని శ్రీశ్రీ ఇలా ఉద్బోధిస్తాడు.

త్రాచుల వలెనూ
రేచుల వలెనూ
ధనంజయునిలా సాగండి
కనబడలేదా మరోప్రపంచపు
అగ్ని కిరీటపు ధగధగలు
ఎర్రబావుటా నిగనిగలు
హైమజ్వాలల భుగభుగలు

ఓ శ్రామికులారా! మీరు త్రాచులవలె, రేచు కుక్కల వలె, ధనంజయుని వలె ముందుకు సాగండి. శ్రమ సంపదను దోచుకునే బూర్జువాలపై పగబూని, పాముల

వలె కాటువేయాలని, రేచుకుక్కల్లా వెంటబడి తరమాలని ఉద్బోధ చేశాడు.

శ్రీశ్రీ మహాప్రస్థానం సంకలనంలో మొదటి కవిత 'మహాప్రస్థానం' అయినా ముందుగా రచించిన కవిత 'జయభేరి' (1933). కొత్త ఛందస్సుతో సరికొత్త వస్తువులో 'నేను సైతం ప్రపంచాగ్నికి, సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అని ప్రారంభమయ్యే ఈ ఖండిక వాడుక భాషకి దగ్గరగా ముత్యాలసరం ఛందస్సులో రాయబడింది. అభ్యుదయ కవిత్వమునకు నూతన కవాటములు తెరచిన మొదటి గేయము జయభేరి.

నేనుసైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను
నేనుసైతం
విశ్వ వీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను
నేనుసైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను

"ఇక్కడ నేను శ్రీశ్రీ కాదు. శ్రీశ్రీ కంఠంతో పలుకుతున్న శ్రామికుడు ప్రపంచాభ్యుదయం కోసం అతడెన్నో త్యాగాలు చేశాడు. ఎంతో కృషి చేశాడు గతంలో. నేను సైతం అనే నుడికారం ఆనవజాతి చరిత్రలో పేరుకు కూడా నోచుకుని ఒక సామాన్యుడికి ప్రాముఖ్యం కలిగిస్తోంది. తరతరాల నుండి ఇతడికి చరిత్రలో గుర్తింపు లేదు. ఇప్పుడితడు తిరగబడి తన ప్రాముఖ్యం గుర్తించ వలసిందిగా ఘోషిస్తున్నాడు" అన్న మిరియాల రామకృష్ణ వ్యాఖ్యానం ఎంతో సముచితంగా ఉంది.

మహాప్రస్థానంలో చాలామందిని ఆకర్షించిన కవితా ఖండికలలో జగన్నాథుని రథచక్రాలు, దేశ చరిత్రలు, అద్వైతం, ప్రతిజ్ఞ, బుక్కులు, భిక్షువర్షీయసి.

తెలుగుసాహిత్యంలో మహాకవి శ్రీశ్రీకి విశిష్టమైన స్థానము ఉంది. ఆకాశపు దారులంట హడావిడిగా వెళ్ళిపోయే జగన్నాథ రథచక్రాలను, భూమార్గం వైపు మళ్లించి, శ్రామిక వర్గానికి కవిత్వ పట్టం కట్టించిన కవి శ్రీశ్రీ. శ్రీశ్రీ తెలుగు సాహిత్యంలో వర్గ దృక్పథానికి ద్వారం తెరచి, అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడయ్యాడు. జగన్నాథుని రథచక్రాలు'లో పీడిత మానవులకు ధైర్యాన్నిస్తూ సాగిన ఈ కవితలో

"పతితులారా
భ్రష్టులారా
దగా పడిన తమ్ములారా
మీ కోసం కలం పట్టి
ఆకాసపు దారులంట
హడావుడిగా వెళిపోయే
అరుచుకుంటూ వెళిపోయే
జగన్నాథుని రథచక్రాల్
రథచక్రాల్
రథచక్ర ప్రళయ ఘోష
భూమార్గం పట్టిస్తాను
భూకంపం పుట్టిస్తాను"

సామ్యవాద సిద్ధాంత ప్రతిపాదనను ఈ ఖండికలో వ్యక్తం చేస్తూ 'ఈ స్వప్నం నిజమవుతుంది, ఈ స్వర్గం ఋజువవుతుంది' అంటూ భవిష్యద్దర్శనం చేస్తూ 'ఈ లోకం మీదేనండి, ఈ రాజ్యం మీరేలండి' అని శ్రామికునికి రాజ్యాభిషేకం చేస్తాడు.

సామాన్య ప్రజల్ని గూర్చి పట్టించుకున్న సాహిత్యాన్ని అభ్యుదయ సాహిత్యం అంటాం. శ్రీశ్రీ 'అభ్యుదయం' కవితలో అభ్యుదయం పదానికి కొత్త అర్థాన్ని చెప్పారు.

నేడే
ఈనాడే
జగమంతా బల వితర్థి
నరజాతికి పరివర్తన
నవజీవన శుభసమయం- అభ్యుదయం"

సామాన్యుల్ని పట్టించుకోకపోతే సాహిత్యం వ్యర్థం అని చెబుతుంది అభ్యుదయ సాహిత్యం. జాగృతం చేసి ప్రజల

కష్టాన్ని పట్టించుకున్న సాహిత్యం అభ్యుదయ సాహిత్యం. శ్రీశ్రీది అభ్యుదయ వైఖరి కనుకనే మహాప్రస్థానం అభ్యుదయ దృష్టినే కలిగి ఉంది.

'దేశ చరిత్రలు' అను ఖండికలో చరిత్రను శ్రీశ్రీ కొత్త కోణముతో విశ్లేషించాడు. 'గడిచిన చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర' అన్న కారల్ మార్క్స్ భావానికి కవితాత్మక రసాభివ్యక్తీకరణే 'దేశ చరిత్రలు' గేయము. చారిత్రక భౌతికవాద సారాన్ని, సరళంగా సామాన్య పాఠకునికి హృదయాన్ని ఆకట్టుకునే విధంగా శ్రీశ్రీ రచించాడు. శిల్పరీత్యా ఈ గేయం ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రశ్నల పరంపరను సంధించి, సమాధానాలు నిర్ధారించే పద్ధతిని కవి ఇందులో పాటించారు.

"ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం" అనాదిగా చరిత్రలో కనబడుచున్న అన్యాయాన్ని, మోసాలను తీరని వ్యధతో వ్యక్తపరిచారు. ఏ దేశచరిత్ర చూసినాగర్వకారణం ఏమీ కనబడదు. నరజాతులు సమస్త చరిత్రలోనూ పీడించడంలోనే ఆసక్తి కనబడుతుంది.

"చిరకాలం జరిగిన మోసం
బలవంతులు దౌర్జన్యాలూ
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా!, ఇకపై చెల్లవు
"ఒక వ్యక్తిని మరొకవ్యక్తి
ఒక జాతిని వేరొక జాతి
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా! ఇకపై సాగదు"

ఒకడిని మరొకడు, ఒకజాతిని మరో జాతి పీడించే సాంఘిక ధర్మం ఇంక ముందు సాగదని ఖరాఖండిగా తేల్చి చెప్పాడు. అంతేగాకుండా

"నైలునదీ నాగరికతలో
సామాన్యుని జీవనమెట్టిది
తాజ్‌మహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?
సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహసమెట్టిది
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్
అది మోసిన బోయీలెవ్వరు?

అంటూ చరిత్రకు కొత్త భాష్యమును కూడా చెప్పినాడు. నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవన విధానాన్ని గూర్చి, తాజ్‌మహల్ నిర్మాణంలో పాల్గొన్న కూలీల గూర్చి చరిత్రలో రాయబడాలి. ప్రభువుల దండయాత్రలో పాల్గొన్న సామాన్య సిపాయిల సాహసగాథలు చరిత్రకెక్కాలి.

ప్రభువుల పల్లకి మోసిన బోయీల శ్రమగాథలు చరిత్రలో లిఖింపబడాలని అదే నిజమైన చరిత్రని 'దేశ చరిత్రలు'లో శ్రీశ్రీ నిర్వచించారు. మానవజాతి చరిత్ర అంతా వర్గ సంఘర్షణ ఫలితమేయని సిద్ధాంత సారము. అందుకే శ్రీశ్రీ 'పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టింది' అని మార్క్సిస్టు దృక్పథాన్ని కవిత్వీకరించాడు. అందుకే మార్క్సిస్టు సిద్ధాంత సారానికి, గతి తార్కిక భౌతిక వాదానికి నిలువుటద్దం 'దేశ చరిత్రలు' కవితాఖండిక అని విమర్శకుల భావన.

పేదల మీద, పీడితుల మీద జాతిని మాత్రమే కలిగించే నిరాశ వాద కవిత్వం కాదు శ్రీశ్రీది. శ్రీశ్రీ మహాప్రస్థానంలో జాలు వార్చిన కవితా ఖండికలు అన్నీ దయనీయ స్థితిలో ఉన్న పేదల కోసం విప్లవ పంథాలో నడుం కట్టమని మేధావి వర్గాన్నీ, మధ్యతరగతి విద్యావంతుల్నీ ఉత్తేజపరుస్తుంది. "కనబడలేదా మరోప్రపంచపు కణకణ మండే త్రేతాగ్ని" అని ప్రశ్నించిన శ్రీశ్రీ "ఎముకలు క్రుళ్ళిన వయస్సు మళ్ళిన సోమరులారా చావండి" అని దూషించి "నెత్తురు మండే శక్తులు నిండే సైనికులారా రారండి" అని ఆహ్వానించాడు. "పదండి ముందుకు పదండి త్రోసుకు పోదాం పైపైకి" అంటూ సైనిక

పదఘట్టన గీతాలాపన చేస్తూ ప్రజల్ని ప్రోత్సహ పరుస్తూ చైతన్య పరుస్తాడు.

శ్రీశ్రీ అభ్యుదయ భావజాలంతో దోపిడీకి, అణచి వేతకూ, నిర్లక్ష్యానికి గురవుతున్న వర్గాల సమస్యల పట్ల అవగాహన కలిగించే కవితా ఖండికల సమాహారమే మహాప్రస్థానం. దేశంలోని అసంఖ్యాక నిరుద్యోగులకు ప్రతీక 'బాటసారి' కవిత.

కూటికోసం. కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని
తల్లిమాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి
మూడు రోజులు ఒక్కతీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక" సాగే బాటసారి బ్రతుకు ఈ విధంగా అయ్యింది.

"అతని బ్రతుకున కదే ఆఖరు
గ్రుడ్డి చీకటిలోన గూబలు
ఘూకరించాయి
వాన వెలసీ మబ్బులో ఒక
మెరుపు మెరిసింది.
వేగుజామును తెలియజేస్తూ
కోడి కూసింది
విడిన మబ్బుల నుండీ
వేగు జుక్కా వెక్కిరించింది
బాటసారి కళేబరంతో
శీతవాయువు ఆడుకుంటోంది.
పట్టెటూళ్లో తల్లికేదో
పాడుకలలో పేగు కదిలింది".

'బాటసారి' బ్రతుకును హృదయ విదారకంగా వర్ణించారు శ్రీశ్రీ. లోప భూయిష్టమైన సమాజమే బాటసారి మరణానికి కారణమని కరుణరస ప్రధానమైన సన్నివేశమును కళ్లకు గట్టినట్లు చిత్రించిన కథా మాతృక గేయమిది.

అభ్యుదయ కవితా లక్షణాలను 'నవకవిత'లో ఈ విధంగా శబ్దీకరించారు.

"పులి చంపిన లేడి నెత్తురూ
ఎగరేసిన ఎర్రని జెండా
రుద్రాలిక నయన జ్వాలిక
కలకత్తా కాళిక నాలిక"
కావాలోయ్ నవ కవనానికి" అంటూ
'కదిలేదీ కదిలించేదీ
పెనునిద్దుర వదిలించేదీ
మున్ముందుకు నడిపించేది"

నవకవిత అభ్యుదయ కవిత కావాలని 'అభ్యుదయ కవిత్వ లక్షాన్ని, లక్షణాన్నీ, దిశను, దశను నిర్దేశిస్తాడు శ్రీశ్రీ.

అభ్యుదయ కవిత్వ భావజాలానికి పునాదైనా మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం 'మతం మత్తు మందు వంటిది.' సమాజంలోని పరిస్థితులను 'కర్మ సిద్ధాంతం', 'మాయా వాదం' వంటి ముసుగులో కప్పి ప్రగతి నిరోధక మనస్తత్వాన్ని ప్రేరేపించే శక్తులపై దాడి చేస్తుందీ మార్క్సిజం. దీన్ని గర్భీకరించి, కవిత్వీకరించిన కవిత 'మిధ్యావాది'-

"జమీందారు రోల్సుకారు
మాయంటావు? బాబూ
ఏమంటావు?
మహారాజు మనీపర్సు
మాయంటావు. స్వామీ
ఏమంటావూ" అని ప్రశ్నించి
"పాలికాపు నుదుటి చెమట
కూలివాని గుండె చెరువు
బిచ్చగాని కడుపు కరువు
మాయంటావు" అని విమర్శించి
తుఫానులూ, భుకంపం
తిరుగుబాట్లు, సంగ్రామం

సంగ్రామం సంగ్రామం
మాయంటావూ? ఏయ్
ఏమంటావు'' అని హెచ్చరిక చేస్తాడు శ్రీశ్రీ.

దేశీయత, జాతీయతా పరిధులను దాటి అంతర్జాతీయ దృష్టికోణాన్ని అలవర్చుకున్నాడు శ్రీశ్రీ. కారల్ మార్క్స్ మాటలు అయిన ''ప్రొవిటేరియట్ హేవెనో నేషన్'' స్ఫూర్తితో ఆనాటి ప్రపంచానికంతటికీ తొలి వజయంగా ఆశాకిరణంగా మెరిసిన రష్యా, రెండో ప్రపంచ యుద్ధంలో రష్యా విజయాలను కీర్తిస్తూ 'గర్జించు రష్యా' అన్న కవితలో ఇలా పలికాడు.

''ప్రపంచం పరిపక్వంగా ఉంది
కోటి గొంతులు నిన్ను కోరి రమ్మన్నాయి
కోటి చేతులు నిన్ను కౌగిలిస్తున్నాయి''

అని ప్రపంచ కార్మికుల, కర్షకుల, తాడితుల, పీడితుల తరపున రష్యాకు ఆహ్వానం పలికాడు. ఈ అంతర్జాతీయ దృష్టికోణంతోనే

''చీనాలో రిక్షావాలా
చెక్‌దేశపు గని పనిమనిషీ
ఐర్లాండున ఓడ కళాసీ
అణగారిన ఆర్తులందరూ
హెూటెన్ టాటి, జూలూ, నిగ్రో
ఖండాంతర నానాజాతులు
చారిత్రక యథార్థ తత్వం
చాటిస్తారొక గొంతుకతో''

అని ప్రకటించి విశాల విశ్వవేదికపై తన అభ్యుదయ భావజాలాన్ని ప్రకటించాడు. మొత్తం మీద శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో స్తబ్ద మనస్తత్వం పై నిరసనగా గళవ వినిపిస్తూ, అణగారిన ప్రజల పట్ల అవగాహన కలిగిస్తూ, గతితార్కిక భౌతిక వాదాన్ని పలికిస్తూ, ప్రగతి నిరోధక మనస్తత్వంపై తిరుగుబాటునూ ప్రకటిస్తూ అంతర్జాతీయ దృక్కోణంతో పతితులకోసం కవిత్వం రచన చేశారని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్)
2. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి. నాగయ్య (రెండవ సంపుటం)
3. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి
4. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న
5. శ్రీశ్రీ - వికీపీడియా

❖❖❖

కష్టజీవుల కవి - శ్రీశ్రీ

- డా॥. ఎ. ఎ. నాగేంద్ర, పోస్ట్ డాక్టరల్ ఫెలో, తెలుగు & తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము, అనంతపురము,

కష్టజీవులకు అటు వైపు ఇటువైను నిలిచి సాహిత్యాన్ని సృజించాలని కవులకు, రచయితలకు మార్గనిర్దేశం చేసిన ఆధునిక మహాకవి శ్రీశ్రీ. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని భూమార్గం పట్టించి భూకంపం సృష్టించిన శ్రమజీవుల కవి శ్రీశ్రీ.

శ్రీశ్రీ సాహిత్యం నిండా కర్షకులు, కార్మికులు, అనాథలు, అన్నార్తులు, బడుగు బలహీనులు దర్శన మిస్తారు. ఈ యుగం నాదే అంటూ తెలుగు సాహితీ లోకంలో నూతన విజయకేతనం ఎగురవేసిన కవి శ్రీశ్రీ.

కష్టజీవుల ఆకలికేకలు శ్రీశ్రీ సాహిత్యంలో దోపిడీవర్గ సమాజాన్ని నిలువునా నిలదీస్తాయి. తెలుగు సాహిత్యపు సువాసనలకు నోచుకోని ఎందరో అభాగ్యుల జీవితాలు శ్రీశ్రీ సాహిత్యంలో పతాక శీర్షికన నిలుస్తాయి. కష్టజీవుల చైతన్యం కోసం కలం పట్టిన అక్షరయోధుడు శ్రీశ్రీ. మాట లోనూ, రాతలోనూ, పాటలోనూ కష్టజీవుల గానాన్ని వినిపించిన అసలు సిసలైన మానవ కవి శ్రీశ్రీ.

శ్రమజీవుల చెమట చుక్కలకు సౌందర్యాన్ని అద్దిన కవి శ్రీశ్రీ.

మంటలు చేత మాట్లాడించి రక్తం చేత రాగాలాపన చేయించిన శ్రమజీవుల సౌందర్య కవి శ్రీశ్రీ.

చలంగారు తన యోగ్యతాపత్రంలో అన్నట్లు శ్రీశ్రీ ఎందుకు నచ్చుతాడు?

ఇంకా రాత్రి చీకట్లో, లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటో, దీనంగా పలవరించే సమయాన ఉషా గమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు శ్రీశ్రీ.

దేవుడు, అధికారాలు, పాతర్లు, సౌఖ్యాలు, నీతులు, స్వర్గం, మర్యాదలు మూట కట్టుకుని కులికే మీకు అర్థం కాని బాధ, మరణం, దరిద్రం, అవిశ్వాం, అశాంతి ఇవన్నీ అర్థం కాక గట్టిగా సృష్టినే ప్రశ్నిస్తున్న యువకుల లక్షకంఠాల్ని ఏకం చేసి పలుకుతున్నాడు శ్రీశ్రీ అందుకే మనందరికీ నచ్చుతాడు శ్రీశ్రీ.

యుద్ధంలో అలసిపోయిన జీవుకు సరికొత్త గీతా చర్యుడుగా అవతరిస్తాడు, ఎగిసిపడే ఉద్రేకానికి ఉత్ప్రేరకం అవుతాడు, శ్రామిక సైన్యపు భావోద్వేగానికి బాసటగా నిలుస్తాడు శ్రీశ్రీ. అంతేనా.... మాటల్ని ఈటెలుగా చేసి కత్తులుగా మార్చి కుత్తుకుల పైకి విసురుతాడు. మంటలు రేపి అరాచక వ్యవస్థపై పదును తేలిన పదాస్త్రాలను సంధిస్తాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీ ప్రతి మాటా బడుగు జీవికి ప్రణవనాదం. ప్రతి అక్షరం అలసిపోయిన వ్యదార్థ జీవితాల్లో జీవనాదాల్ని పలికిస్తుంది. శ్రమజీవుల జీవితాల్ని పూర్తిగా ప్రేమించిన హృదయమున్న కవి శ్రీశ్రీ.

కష్టజీవులు గురించి 'ఖడ్గసృష్టి'లో శ్రీశ్రీ ఇలా అంటారు.

"వీళ్లే నావాళ్ళు
వాళ్లే నాకళ్ళు
వీళ్ళ బ్రతుకులోంచి నేను
విశ్వాన్నే వీక్షిస్తా
వీళ్ళ కపాయం రాకుం
డా వీళ్ళని రక్షిస్తా" (వీళ్ళేనావాళ్ళు)

బక్కచిక్కిన దేహాలతో, గొంతులేని కష్టజీవులను తన వాళ్ళుగా చేసుకొని, వారికి ఎలాంటి అపాయం రాకుండా రక్షిస్తాననడం శ్రీశ్రీ శ్రామిక దృక్పథానికి నిదర్శనం.

"తరిగిస్తా కష్టం
కరిగిస్తా నష్టం
సరిచేస్తా ఇష్టం" (వీళ్ళే నావాళ్ళు)

శ్రమ జీవులకు, కష్టజీవులకు కష్టం తరిగిస్తానని, నష్టం కరిగిస్తానని, కష్టనష్టాల్ని ఇష్టంతో సరిచేస్తానంటూ శ్రీశ్రీ వాగ్దానం చేస్తూ దోపిడీ, అణచివేత లేని సమసమాజాన్ని ఆకాంక్షిస్తాడు.

"క్షణ క్షణం మారుతున్న లోకాన్ని
సరీగా అర్థం చేసుకున్న వాళ్ళంతా
పేద ప్రజల పక్షం వహించడమే
పెద్ద అపరాధమై పోయింది" (ఖడ్గసృష్టి)

సమాజంలో ప్రజాస్వామ్య, సామ్యవాద మార్పును సమాజ గమనాన్ని అర్థం చేసుకొని తారతమ్యం లేని సోదర భావ సమాజాన్ని నిర్మించాలని కొంతమంది అభ్యుదయ వాదులు పేద ప్రజల పక్షం వహించడం అది అపరాధ మైనట్లు కొంతమంది భావించడాన్ని శ్రీశ్రీ నిరసిస్తాడు.

"అహింస ఒక ఆశయమే కానీ
ఆయుధం ఎప్పుడూ కాదు
ఆశయం సాధించాలంటే
ఆయుధం అవసరమే మరి" (ఖడ్గసృష్టి)

ప్రజలను హింసించే వారిని, శ్రమదోపిడి చేసే వారిని, సమానత్వం పాటించని వారిని ఎదుర్కోవడానికి అహింస పనికిరాదని, సమాజ రుగ్మతలను పారద్రోలడానికి ఆయుధం అవసరమే నంటూ తీర్పు ఇస్తాడు శ్రీశ్రీ.

"విప్లవం యాడుందిరో
ఆడనే నీ గూడు వుందిరా..
నీ కూడు వుందిరా" అంటూ శ్రీశ్రీ

హక్కులు అనేవి అడుక్కుంటే రావని, కష్టజీవులు పిడికిలి బిగించి విప్లవం సృష్టిస్తేనే కనీస సౌకర్యాలైన గూడు, కూడు దొరుకుతాయని కోరుకుంటాడు. పేద ప్రజల చీకటి బ్రతుకుల్లో వెన్నెల వెలుగు పూయించాలని అభిలషించిన కవి శ్రీశ్రీ.

"జనాభా లెక్కలు నాకు
సరిగా తెలియవు గాని
దరిద్రాల శాతం ఇంకా
చిరాకు కలిగిస్తూనే ఉంది" (శరశ్చంద్రిక)

అంటూ ఆవేదన చెందుతాడు శ్రీశ్రీ. ఈ దేశంలో సంపన్నుడు సంపన్నుడు గాను, లేనివాడు ఏమిలేని వాడుగా మిగిలిపోతూ, ఆర్థిక అసమానతలు పెరుగుతూ వుండటాన్ని చూసి బీదలు, పేదవారు, దరిద్రుల శాతం రోజు రోజుకు పెరగటాన్ని చిరాకు కలిగిస్తుందంటూ తల్ల డిల్లుతాడు శ్రీశ్రీ.

మురికి గుడిసెల్లో నివసించే పరమ దరిద్రులంటే శ్రీశ్రీ గారికి ఎంతో ఇష్టం.

"వెళ్ళు జాబిల్లీ వెళ్ళు
వినిర్మలమైన నీ వెన్నెల కురిపిస్తూ
మనోహరమైన సంగీతం వినిపిస్తూ
ప్రయాణించు శశీ ప్రయాణించు
ఇదిగో మాట! ప్రపంచలో
ఇంకా ఎందరో అభాగ్యులున్నారు
పలకరించు వాళ్ళని చల్లగా
ధైర్యం చెప్పు వాళ్ళకి మెల్లిగా" (శరశ్చంద్రిక)

మహాకవి గుర్రం జాషువా గారు తన 'గబ్బిలం' కావ్యంలో దళిత వేదనను పరమ శివునికి వినిపించమని కోరినట్లు శ్రీశ్రీ కూడా చల్లని శరత్‌కాలపు వెన్నెలకు హితబోధ చేస్తున్నాడు. జాబిల్లీ నీవు వెళుతూ వెళుతూ చక్కటి సంగీతాన్ని పీడిత ప్రజలకూ వినిపించూ, అలాగే ఈ ప్రపంచంలో ఉన్న అభాగ్యులను పలకరించు, వారి యోగక్షేమాలు గురించి అడిగి వారిని పరమార్శించు, కేవలం పలకరించడమే కాదు సుమీ!

వారు ఈ దుష్ట సమాజంలో ఎలా బ్రతకాలో కూడా ధైర్యం చెప్పు మెల్లిగా అంటూ చల్లని వెన్నెలను కోరుతాడు శ్రీశ్రీ

"అదుగో అదుగో రిక్షావాడు
కదిలే ఎముకల గూడు
ఆకలినే తింటున్నాడు
అలో లక్ష్మణా అంటున్నాడు"

శరీరంలో ఎముకలు తప్ప మాంసపు కండలేని నిరుపేద రిక్షా కార్మికుని గురించి పలవరిస్తాడు శ్రీశ్రీ.

రిక్షావాడు ఆకలినే తింటున్నాడు అని చెప్పడం మనసును ద్రవింప జేయడమే.

"అదుగో చూడు చిన్నమ్మి
బతుకుతోంది తన ఒళ్ళమ్మి
ఆమె యింకిన సెలయేరు
ఇంకి పోదామె కన్నీరు"

నిరుపేదల కుటుంబాల్లో పుట్టి పెరిగి సరైన ఉపాధి అవకాశాలు లేక బ్రతుకుభారమై తమ శరీరాల్ని అమ్ముకొని బ్రతికే దుర్మార్గమైన వ్యవస్థను చీల్చి చెండాడుతాడు శ్రీశ్రీ

ముగింపు :

ఈ వ్యవస్థని నేను తిడతా, కొత్త వ్యవస్థకి హారతి పడతా! అంటాడు శ్రీశ్రీ

సమాజాన్ని వెనక్కినడిపే వ్యవస్థను, అసమ సమాజ వ్యవస్థను, ధనికుడు, దరిద్రుడు ఉన్న వ్యవస్థను, ఒక వ్యక్తిని మరొకవ్యక్తి, ఒక జాతిని మరొక జాతి పీడించే వ్యవస్థను తిడుతానని మంచి సమాజాన్ని ఆహ్వానించి హారతి పడతానని, కులం, వర్గం, వర్ణం అసమతౌల్యం లేని అభ్యుదయ సమాజాన్ని ఆహ్వానించి హారతి పడతాను అంటాడు శ్రీశ్రీ.

చలంగారు 'యోగ్యతాపత్రం'లో అన్నట్లు
కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ
ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ

శ్రీశ్రీ పుట్టుకతో మనిషి, వృద్ధాప్యంలో మహర్షి మధ్యలో మాత్రమే కవి. ఎప్పటికీ ప్రవక్త - వేటూరి గారు చెప్పిన మాటలు అక్షరసత్యాలు.

❖❖❖

అభ్యుదయ గీతం – శ్రీశ్రీ జయభేరి

– డా॥. జి. పార్వతి, సహ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

'సామ్యవాదమే నా గమ్యం' కవిత్వంలోనూ, జీవితం లోనూ అని చెప్పుకున్నారు శ్రీశ్రీ. అభ్యుదయ కవితా ప్రయోక్తగా, సమ సమాజ స్థాపన ప్రవక్తగా నిలిచారు శ్రీశ్రీ. ఒక కవిత పుట్టింది అంటే ఆ కవిత వెనకాల ఒక మధనం జరుగుతూ ఉంటుంది. అలాగే శ్రీశ్రీ కూడా ఎంతో బాధతో ఈ జయబేరి కవిత రాసినట్లుగా మనకు తెలుస్తుంది. ప్రపంచ సాహిత్యాన్ని బాగా అవగతం చేసుకున్న వ్యక్తిగా, పరిశీలించిన వ్యక్తిగా ఈయన రచనలు చదువుతే పాఠకులందరికి అర్థం అవుతుంది.

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతి చ్చాను!
నేను సైతం
విశ్వ సృష్టికి
అశ్రు వొక్కటి ధారపోశాను!
నేను సైతం
భమన ఘోషకు
వెర్రి గొంతుక విచ్చిమ్రోశాను!

ఇక్కడ నేను అంటే సామూహిక చైతన్యానికి ప్రతీకగా, సమాజానికి ప్రతీకగా చెప్పారు శ్రీశ్రీ. ప్రపంచం అంతా కూడా రకారకాల విప్లవాలు రగులుతున్నాయి. ఆ విప్లవంలో నేను కూడా భాగస్వామ్యం అయ్యాను. అలాగే నేటి సమాజం స్వార్థంతో, కుల్లుతో, అసమానతలతో నిండి ఉంది అని ధనికుల కింద పని చేసే శ్రామికులు, కర్షకులు ఇంకా భాదలు పడుతున్నారని వారు స్వేచ్ఛగా బ్రతకాలని అలాంటి కొత్త ప్రపంచానికి నేను కన్నీటిని వదిలాను అని ప్రపంచం అంతా రకారకాల నినాదాలతో, ఉద్యమాలతో ఉంటే అన్నింటిలోనూ నేను కూడా పిచ్చిగా గట్టిగా అరిచానన్నారు.

ఎండకాలం మండినప్పుడు
గబ్బిలం వలె
క్రాగిపోలేదా?
వానా కాలం ముసరి రాగా
నిలువు నిలువున
నీరు కాలేదా?
శీతకాలం కోత పెట్టగ,
కొరడు కట్టీ,
ఆక లేసి కేక లేశానే!

ఇక్కడ ఎండాకాలం, గబ్బిలం మొదలగునవి ప్రతీకలుగా తీసుకున్నారు. శ్రీశ్రీ ఎండాకాలంలో కూడా విశ్రాంతి లేకుండా నా శ్రమ మీకు అర్పిస్తూ గబ్బిలంలా కాలిపోయాను అని, అదే విధంగా వానా కాలంలో కూడా ఎడ తెరిపి లేకుండా పడే వానలో కూడా నిలువునా నీరై పోతున్నా కూడా ఆ చలి ఎంత బాధ పెడుతున్నా లెక్క చేయకుండా ఆ ధనికుల పరిశ్రమలలో ఎంత పని చేసిన కూడా తాను తినడానికి తిండి లేక ఆకలికి అలమటిస్తున్నా రని తెలిపారు. అదే విధంగా ఇక్కడ నేను అనే దాన్ని వ్యష్టిగా కాక సమిష్టిగా అంటే సముహంగా చెప్తున్నారు శ్రీశ్రీ.

"నే నొక్కణ్ణే
నిల్చిపోతే-
చండ్ర గాడ్పులు, వాన మబ్బులు, మంచు సోనలు
భూమి మీద
భగ్నమౌతాయి!
నింగి నుండి తొంగి చూచే
రంగు రంగుల చుక్కలన్నా
రాలి, నెత్తురు క్రక్కుకుంటూ
పేలిపోతాయి!

పగళ్ళన్నీ పగిలిపపోయీ,
నిశీధాలూ
విశీర్ణిల్లీ,
మహాప్రళయం జగం నిండా
ప్రగల్భిస్తుంది!"

కార్మికుడు అనే వాడు నిలిచిపోతే, శ్రమ చేయడం అపితే ఎండ కాలంలో వీచే వేడిగాలులు, వాన కాలంలో వచ్చే మబ్బులు, శీతకాలంలో ఉండే మంచు బిందువులు ఈ మూడు కాలలు భూమి మీద నాశనం అవుతాయి, నింగి నుండి తొంగి చూచే రంగు రంగుల చుక్కలన్ని ఇక్కడ చుక్కలని ధనిక యజమానులు, భుర్జువాలుగా వారు రాలి కింద పడిపోతారు అని శ్రమ చేయడం మానేస్తే వారి ఉత్పత్తులుగా తగ్గిపోతాయి ఒక మహా ప్రళయం లోకంలో వస్తుంది అని చెప్పారు. అంటే శ్రామికులు తాము ఎండకు, వానకు, చలి అనేది లేకుండా పని చేస్తున్నారు కాబట్టి అభివృద్ధి ఉంది అని లేకపోతే ఏమిలేదని చెబుతున్నారు.

"నే నొక్కణ్ణీ ధాత్రినిండా
నిండిపోయీ-
నా కుహురుత శికరాలే
లోకమంతా జల్లు లాడే
ఆ ముహుర్తా లాగమిస్తాయి!"

నేను ఒక్కడినే ఈ భూమి అంతా నిండి పోయీ ఈ శ్రామిక శక్తి అంతా నిండిపాయీ, కుహు కుహు అనే శబ్దం అవి లోకం అంతా పని చేసే కార్మిక శక్తి నిండి పాయినపుడు నేను చేసే కుహు అనే శబ్ద తుంపర జల్లులు లోకం అంతా కురుస్తుంది అని, ఆ ముహుర్తం వస్తుందని అంటూ

"నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను!"

ప్రపంచం అనే తామర పువ్వలో నేను కూడా తెల్లని రేకుగా ఉదయిస్తాను అని సమ సమాజ స్థాపన జరిగితే ప్రపంచం అంతా అందంగా, శాంతంగా ఉంటుంది. తెల్లనిది శాంతికి ప్రతీక కాబట్టి ఈ ప్రపంచం తెల్లని పద్మం లాగా తాను ఒక రేకులాగా ఆ పద్మంతో పోల్చారు శ్రీశ్రీ.

"నేను సైతం
విశ్వ వీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను!"

ఈ విశ్వం అనే వీణకు నేను కూడా ఒక తీగనై సప్తస్వరాలు పలికిస్తాను అని, పరవశీలించి, రాగాలు పలుకుతాను అని చెబుతున్నాడు.

"నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను!"

ఈ ప్రపంచం అంతా భవనం అయితే దానిపై శ్రామిక శక్తి, కార్మిక శక్తి అనే రెపరెపలాడే జండాగా పైకి లేస్తాను తాను పోల్చుకున్నాడు. జెండా ఎగరడం అనేది గెలుపుకి చిహ్నం. ఆ విజయంగా తాను కన్పిస్తాను అని చెబు తున్నారు శ్రీశ్రీ.

నేను సైతం అనే మాట మానవ జాతి చరిత్రలో ఒక సామాన్యుడికి ప్రాముఖ్యం కలిగిస్తుంది. నేను శ్రీశ్రీ కాదు - శ్రీశ్రీ కంఠంలో పలికిన శ్రామికుడు. ఈ విధంగా శ్రీశ్రీ జయభేరి కవితలో ఈ ప్రపంచాభ్యుదయం కొరకు నిరంతరం శ్రమ చేసే కార్మికులను, శ్రామికులను తన కవితలో వినిపించారు. ఆరుద్ర గారు చెప్పినట్టు ఈ గీతం శ్రీశ్రీ చేత కొత్త ప్రస్తానానికి జయబేరి మోగింప చేసింది.

ఆధార గ్రంధాలు :

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ

❖❖❖

శ్రీశ్రీ కవితా ప్రస్థానం

- డా॥. బి. శ్రీదేవి, కళాశాల అధ్యక్షులు, చేబ్రోలు ప్రభుత్వ కళాశాల, గుంటూరు (జిల్లా)

అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడై, తనకవితను జాతిజనులు పాడుకునే మంత్రంగా చేసిన ప్రజాకవి శ్రీరంగం శ్రీనివాసరావు. యుగకవిగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న శ్రీశ్రీ 30.04.1910న చైత్ర బహుళషష్ఠి, ఆరుద్ర నక్షత్రాన విశాఖపట్నంలో అప్పన కొండ, శ్రీరంగం రమణయ్య దంపతులకు జన్మించారు. ఏడేళ్ళకే తల్లిని పోగొట్టుకొన్న శ్రీశ్రీ, కన్నతల్లికన్నా మిన్నగా ఆదరించిన సుభద్రమ్మగారికి

"నా శిశుత్వాజ్ఞాన వేళా
నష్టమాతృ చరిత్ర నెరుగను
తావకా నిర్వాచ్య సద్వాత్సల్యమున తల్లీ" - అంటూ భక్తితో తన మొదటి కావ్యం "ప్రభవ"ను అంకితమిచ్చారు.

చిన్ననాటి నుంచే శ్రీశ్రీలో కవిత్వానురక్తి వికసించింది.

"నాలాగా కంద బంధ
జ్వాలా జ్వాలాగ్ర సంవసత్ సద్గీతా
లాలాపించే కవితా శ్రీలోలుడు" - అన్న శ్రీశ్రీ తన ఎనిమిదో ఏటే కందపద్యం చెప్పి కవిననిపించుకున్నాడు. తొమ్మిదోఏటికి సులక్షణసారం కంఠతా వచ్చింది. ఆ తర్వాత వసుచరిత్రనధ్యయనం చేశాడు. శ్రీనాథుడిని, తెనాలి రామకృష్ణుడుని ఔపోసన పట్టి, ఆ మాదిరి పద్యాలల్లడం మొదలెట్టాడు.

తొమ్మిదోఏట విశాఖలో జగన్మిత్ర నాటక సమాజంలో కుశలవుల జంటగా బాలనటుడి పాత్రను పోషించాడు. పదేళ్ళకే "వీరసింహ విజయసింహులు" అనే చారిత్రక నవలనూ, పన్నెండేళ్ళకే "సావిత్రీ సత్యవంతం" అనే నాటకాన్ని రచించిన శ్రీశ్రీ ఉన్నట్టుండి అపరాధ పరిశోధక నవలల పట్ల ఆకర్షితుడైనాడు. "గోకులాయి" అన్న భయానక అపరాధ పరిశోధక నవలను రచించాడు. తొలి నాటి రచనలన్నీ అచ్చులోకి రాకముందే హరించుకు పోయాయి. శ్రీశ్రీ పద్నాలుగో ఏట రాసిన "పరిణయ రహస్యం" అన్న అపరాధ పరిశోధక నవల అచ్చయిన తొలి రచన.

6-5-1926న స్థాపించబడిన కవితా సమితి తొలి ప్రచురణగా 1928లో శ్రీశ్రీ రచించిన "ప్రభవ" భావ గీతాలు పురిపండా ముందు మాటతో వెలువడ్డాయి. అదే సంవత్సరం మద్రాస్ క్రిష్టియన్ కళాశాలలో బి.ఏ.లో చేరాడు. అక్కడే కొంపెల్ల జనార్దన్‌రావుతో శ్రీశ్రీకి గాఢమైన మైత్రి ఏర్పడింది. వివిధ దేశాల కవితా రీతులను ఆకలింపు చేసుకున్న శ్రీశ్రీ భావకవుల ధోరణి నుంచి విడివడి 1929లో "సుప్తస్థికలు" రచించాడు. ఆరుద్ర మాటలలో చెప్పాలంటే "సుప్తస్థికలు రచన ద్వారా తన జీవిత కాలంలో ఒక ఆశ్వాసాంతానికి వచ్చాడు. కుబుసం విడిచాడు".

బి.ఏ. చదువు పూర్తయిన తర్వాత శ్రీశ్రీ తిరిగి విశాఖ చేరుకున్నాడు. టైఫాయిడ్‌లో రెండు నెలలు అవస్థపడ్డాడు. 1930 నుంచి 1940 వరకు ఓ దశాబ్దం పాటు దారిద్ర్యాన్ని చవిచూశాడు. ఆర్థికమాంద్యం ఒక్క రష్యాను తప్ప మిగతా ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఆ కాలాన్ని "హంగ్రీథర్టీస్"గా చరిత్ర నమోదు చేసింది. కాల్చే ఆకలి, కూల్చే వేదనతో శ్రీశ్రీ 1931లో ఓ ఏడాదిపాటు ఏ.వి.ఎన్. కళాశాలలో డిమాన్‌స్ట్రేటర్‌గా పనిచేశాడు.

2-6-1933న ఛందస్సుల సర్వ పరిష్యంగం, భావ కవితా స్వర్ణపంజరం వదలి కొత్త ఛందస్సుతో శ్రీశ్రీ రచించిన జయభేరి గీతం

"నేను సైతం ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అనేది అభ్యుదయ కవిత్వానికి నూతన కవాటాలు తెరిచింది.

1934 ఏప్రిల్ 12వ తేదీన శ్రీశ్రీ అయిదు నిమిషాల్లో ఏకబిగిన చారిత్రాత్మకమైన "మహాప్రస్థానం" ఖండికను

రచించాడు. సుప్రసిద్ధ సాహిత్య పత్రిక భారతికి ఆ ఖండిక పంపితే తిరిగి వచ్చింది. 1938లో సామినేని ముద్దుకృష్ణ నేతృత్వంలో వెలువడ్డ జ్వాల పత్రికలో ఆఖండిక వెలుగు చూసింది. 1934 జూన్ 9వ తేది తమ్ముడు కొండబాబు పెద్దకర్మనాడు పెద్దలంతా విషాదంలో మునిగి వుండగా ఇవేమీ తెలియని పిల్లలు అమాయకంగా కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న దృశ్యం చూసిన శ్రీశ్రీ

"పాపం పుణ్యం ప్రపంచమార్గం
కష్టం సౌఖ్యం శ్లేషార్థాలు
ఏమీ ఎరుగని పూవుల్లారా
అయిదారేడుల పాపల్లారా"

- అంటూ శైశవగీతిని విరచించాడు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయంలో అబ్బూరి రామకృష్ణారావు గారి సాన్నిహిత్యంలో శ్రీశ్రీ విశ్వసాహిత్యాన్ని మొత్తం జీర్ణించుకున్నాడు. 7-5-1937న లండన్‌లోని "ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ మానిఫెస్టో" ప్రేరణతో శ్రీశ్రీ

"పాలాలనన్నీ
హలాలదున్నీ
ఇలాతలంలో హేమం పండగ
జగానికంతా సౌఖ్యం నిండగ"

అంటూ ప్రతిజ్ఞ గేయాన్ని రాశాడు.

1938లో "ఈ ధూర్త లోకంలో నిలబడజాలక
తలవంచుకునే వెళ్ళిపోయావా నేస్తం!

అంటూ కొంపెల్ల జనార్ధనరావుకోసం ఎలిజీ రాశాడు. ఇది ఉదయినిలో ప్రచురించబడింది. ఆనాడే మహా ప్రస్థాన కావ్యం కొంపెల్లకు అంకితం అనుకున్నాడు.

శ్రీశ్రీ మహాప్రస్థాన ఖండికల్లో సగానికి పైగా మార్క్స్ సిద్ధాంతాలకు రసమయ కవితా రూపాలే. "దేశచరిత్రలు" అన్న గేయం గతితార్కిక భౌతిక వాదానికీ, "ప్రతిజ్ఞ" కార్మిక వర్గ కవిత్వానికి, "మహాప్రస్థానం" ప్రబోధ కవిత్వానికి అక్షర వేతనాలయ్యాయి. జగన్నాథుని రథచక్రాలు విప్లవ శక్తి చిహ్నాలు. శ్రీశ్రీ మానవతా దృష్టిని వివరించటానికి "జయభేరి" నిజం జయభేరియే. ఆత్మవిశ్వాస పరమావధి కవి ప్రపంచంతో తాదాత్మ్యాన్ని భజించడమే. అందుకే శ్రీశ్రీ

"నేనొక్కణ్ణీ ధాత్రినిండా
నిండిపోయీ
నా కుహూరుత శీకరాలే
లోకమంతా జల్లులాడే
ఆ ముహూర్తాలాగమిస్తాయి"

అని వ్రాశాడు. ప్రపంచ చైతన్యాన్ని అనుభవించే శక్తిని సాధించిన మానవుడు మాత్రమే

"నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను"

అని అనగలుగుతాడు. ఆ మహోచ్ఛస్థితిని సాధించడమే మానవ జన్మ పరమార్థమని శ్రీశ్రీ సందేశం.

"ఈ యుగం నాది. 1930 వరకూ తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత నేను నడిపిస్తున్నాను" అని ఆత్మ విశ్వాసంతో చెప్పుకున్నాడు శ్రీశ్రీ. 1940లో జరుక్‌శాస్త్రి మహాప్రస్థానానికి చలం చేత యోగ్యతాపత్రాన్ని రాయించాడు. శ్రీశ్రీ ఉద్యోగ పర్వం కొనసాగుతూనే వుంది. 1938లో ఆంధ్రప్రభలో నిజాం నవాబు రిఫార్మ్ సెక్రటరీగాను, ఆ తర్వాత మూడేళ్ళకు ఆనందవాణిలోను నిలకడలేని ఉద్యోగాలు మారుతూనే ఉన్నాడు. 1949లో "నీరా ఔర్ నందా" అనే హిందీ చిత్రానికి తెలుగు డబ్బింగ్ చేయడం కోసం మద్రాస్ చేరాడు. అక్కడే మిత్రుడు నళినీకుమార్ కృషితో 1950లో మహాప్రస్థాన గీతాలన్నీ పుస్తక రూపం ధరించాయి.

తను కలలు కన్న ఆదర్శ సమాజం రావాలంటే కమ్యూనిజం తప్ప వేరు మార్గంలేదని నిండు హృదయంతో నమ్మి కమ్యూనిజానికి బద్ధుడయ్యాడు. 1954 నవంబర్ నెలలో స్టాక్‌హోంలో జరిగిన ప్రపంచ

శాంతి సభలకు ప్రతినిధిగా శ్రీశ్రీ వెళ్ళాడు. అక్కడే చిలీ మహాకవి పాబ్లో నెరుడాతో పరిచయమైంది. అక్కడి నుండి సోవియట్ రష్యా పర్యటించాడు. 1970లో తెలుగు సాహిత్యం గొప్ప మలుపు తిరిగింది. శ్రీశ్రీ షష్ఠిపూర్తినాడు

"ముందుకు పోతాం మేము

ప్రపంచం మా వెంట వస్తుంది" అనే బ్యానర్ పట్టుకొని శ్రీశ్రీ జగదాంబ జంక్షన్ నుండి సభాస్థలి మునిసిపల్ స్టేడియం వరకూ విశాఖ విద్యార్థులనూ, రచయితలనూ, ప్రజలనూ, దేశవ్యాప్తంగా కదిలి వచ్చిన మేధావులను వెంటబెట్టుకొని లాంగ్‌మార్చ్ చేశాడు. ఆనాటి సభలో "రచయితలకు సవాల్" పేరిట విశాఖ విద్యార్థులు ఓ కరపత్రాన్ని విడుదల చేశారు. అది తీవ్రమైన సంచలనాన్ని సృష్టించింది.

అభ్యుదయ రచయితలనబడే వారు రెండుగా చీలిపోయారు. అప్పుడే విప్లవ రచయితల సంఘం (విరసం)నికి అంకురార్పణ జరిగింది.

04.10.1970 అర్ధరాత్రి ఒంటిగంటకు శ్రీశ్రీ అధ్యక్షతన హైదరాబాద్‌లో కె.వి.ఆర్. కార్యదర్శిగా, రావిశాస్త్రి, కొడవటిగంటి ఉపాధ్యక్షులుగా, వరవరరావు, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజు ప్రభృతులతో విరసం ఆవిర్భవించింది.

"ఉద్రేక తరంగాలే తురంగాలుగా
ఆగ్రహం కొరడాని చేబూని
సాయుధ భీభత్సుని సారధినై
భారత కురుక్షేత్రంలో నవయుగ
భగవద్గీత ఝుంఝుని ప్రసరిస్తాను
మంటలచే మాట్లాడించి, రక్తంచే
రాగాలాపన చేయిస్తాను" - అంటూ విరసం నా శాశ్వత చిరునామా అంటూ ప్రకటించాడు శ్రీశ్రీ.

విరసం స్థాపనతో మరో కొత్త శ్రీశ్రీ అవతరించాడు. "మరోప్రస్థాన" గీతాలకు అంకురార్పణ చేశాడు.

శ్రీశ్రీ 1976లో ఇరవై ఒక్క రోజులపాటు చైనాలో పర్యటించాడు. 1979లో ఆంధ్రజ్యోతి వారపత్రిక పాఠకులచే విశిష్ట వ్యక్తిగా గౌరవించబడ్డాడు. 1979 నవంబర్ 17న రాజ్యలక్ష్మీ ఫౌండేషన్ ప్రారంభసత్కారాన్ని శ్రీశ్రీ అందుకున్నాడు.

గూటాల కృష్ణమూర్తిగారి ఆహ్వానంతో లండన్‌వెళ్ళిన శ్రీశ్రీ సుమారు ఐదు నెలలపాటు లండన్‌లో పర్యటించి ఒకప్పటి విశాఖజిల్లా కలెక్టర్ జె.పి.గ్విన్‌ని, ప్రఖ్యాత కవి జార్జి బార్కల్‌ను, జనార్ధన గ్రిఫిత్‌ను కలుసుకొని సాహిత్యామృతం గ్రోలారు. పుస్తక ప్రచురణలోనే ఒక అపురూపమైన ప్రయోగాన్ని గూటాల కృష్ణమూర్తిగారు దిగ్విజయంగా నిర్వహించి శ్రీశ్రీకి ఎనలేని గౌరవాన్ని కట్టబెట్టారు. ఆ ఘనత సత్కారమేమిటంటే శ్రీశ్రీ కంఠధ్వనితో "మహాప్రస్థానం" అన్ని గేయాలను రికార్డు చేయించడం, అలాగే శ్రీశ్రీ స్వంత దస్తూరితో మహాప్రస్థానం గీతాలను రాయించి "పాక్స్‌మిలే" రూపంలో విదేశాంధ్ర ప్రచురణల పేరిట విడుదల చేయటం. శ్రీశ్రీ లండన్‌లో తెలుగువాడి వేడిని చూపించి, తెలుగు కవిత్వ బావుటా ఎగురవేసి 16 ఫిబ్రవరి1981 ఇండియా తిరిగొచ్చారు.

1981 మే 23,24 తేదీలలో చికాగోలో, 1981 జూన్8వ తేదిన హ్యూస్టన్ నగరంలో అక్కడి తెలుగువారి కోరికపై పర్యటించి, అక్కడి నుండి మరలా భారతదేశం తిరిగి వచ్చిన శ్రీశ్రీ క్యాన్సర్ వ్యాధి పీడితుడైనాడు.

"పతితులార భ్రష్టులార
బాధాసర్ప దష్టులార
ఏడవకేడవకండి"

మీకోసం నేనున్నానంటూ భరోసా ఇస్తూ

"ఈ రాజ్యం మీదేనండి
మీ రాజ్యం మీరేలండి" - అంటూ

"ఈ స్వప్నం నిజమవుతుంది
ఈ స్వర్గం ఋజువవుతుంది" అంటూ అసంఖ్యాక అన్నార్థులకు హామీ ఇచ్చి తానాశించిన స్వర్గాన్ని కాంచకుండానే 1983 జూన్15వ తేది సాయంత్రం 5.30 గంటలకు క్యాన్సర్ వ్యాధితో పోరాడి పోరాడి అలసి

పోయిన ఆ యోధుడు శాశ్వత నిద్రలోకి ఒరిగిపోయాడు.

అయినప్పటికీ రావిశాస్త్రిగారన్నట్లు "తెలుగు భాష ఉన్నంతకాలం ఆయన వుంటారు. తెలుగు భాష మాసిపోతే ఈయన మిగతా భాషల్లో మిగిలి వుంటారు. ఈ ప్రపంచంలో మావుల మనుగడ ఉన్నంతకాలం ఈయన వుంటారు. మానవుడు మరో ప్రపంచాన్ని, మరి కొన్ని లోకాలను వెతుక్కుంటూ వెళ్తే శ్రీశ్రీ వారితోపాటు అక్కడా వుంటారు". అవును శ్రీశ్రీ మహాకవి. మహా మనీషి.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీమహాప్రస్థానం - మహాప్రస్థానం గేయ ప్రాధాన్యం

- డా॥ సి. పి. లక్ష్మీ ప్రసూన, ప్రిన్సిపాల్, శ్రీ వైకెఆర్ & కె ప్రభుత్వ కళాశాల, కోవూరు, నెల్లూరు జిల్లా.

1930వ సంవత్సరం వరకు ఆంధ్ర కవితా ప్రపంచాన 'భావకవిత్వం' అప్రతిహత ప్రభావాన్ని ప్రసరింపజేసింది. కవిత్వం వ్రాయనేర్చిన వారెల్లరూ భావకవిత్వోద్యమానికి లొంగినవారే. ప్రతి యువయు కౌముదీ మలయానిల వసంత గానము గావించిన వాడే. ఈ భావకవితా వ్యామోహము కలిగిన కవులు, కృష్ణశాస్త్రిని వేషమున కూడా అనుసరింపసాగారు. 1930 నుండి భావకవిత్వం క్షీణదశకు రాసాగింది. 1920-30 సంవత్సరాల నడుమ వెలువడిన భావకవిత్వానికి, తదనంతర రచనలకు అంతరం పొడ సూపింది. రాయప్రోలు, దేవులపల్లి మున్నగువారి రచన లకు అంధానుకరణం పెరిగింది. శబ్దవ్యక్తీకరణ ప్రధాన మైంది. అర్థగాంభీర్యమడుగంటింది. కవులు శబ్దముల నాజూకుతనంపై చూపు సారించారు. వారిలో భావనా బలం సన్నగిల్లింది. ఆత్మవ్యక్తీకరణ పద్ధతి నానాటికి ముదిరిపోయి సంఘదృష్టి మాయమైంది. విశ్వశ్రేయస్సు కవితా సృష్టికి పరమార్థమని కవులు విస్మరించారు. నానావేదనామయమైన లౌకిక జగత్తులో ఉన్నప్పటికీ భావకవులు స్వప్నలోకాల్లో, ఆకాశ వీధుల్లో విహరించారు.

క్షీణదశోన్ముఖమైన భావకవిత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, నూతన పద ప్రయోగాలు చేసి, నవీన కవిత్వోద్యమానికి నాంది పలికిన కవులు శ్లిష్టా ఉమా మహేశ్వరరావు, శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీరంగం నారాయణబాబు. వీరి కవిత్వోద్యమానికి అభ్యుదయ కవిత్వమని పేరు. తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి ఆ కోవలేనివాడే. ఈ అభ్యుదయ కవులొక్కుమ్ముడిగా సాంప్రదాయ విచ్ఛేదం గావించి, విప్లవ కంఠమెత్తి గర్జించినవారు కాదు. ఆ తరంలోనే కవులందర వలనే వీరునూ ప్రప్రథమంగా భావ కవితా సృష్టి చేశారు. ప్రియురాలి కోసం అంగలార్చారు. విరహానుభూతులను తవ్వి తలకెత్తారు. వీరంతా తమకు ముందున్న భావకవి ప్రముఖుల ప్రభావంతో అనుకరణశీలమైన రచనలు చేశారు. వీరి ప్రతిభ నివురుగప్పిన నిప్పువలె సమయము నకు ఎదురు చూస్తున్నది. భావ కవితా వైముఖ్యం, నూతన మార్గాన్వేషణ, పాశ్చాత్య సాహిత్యోద్యమాలు, భారతదేశ రాజకీయ, సాంఘిక పరిస్థితులు, ప్రపంచ రాజకీయ పరిణామాలు ఈ కవుల హృదయాల్ల మహా సంక్షోభాన్ని సృష్టించి నూతన ప్రయోగాల రూపాల్లో వెలువడ్డాయి. ఈ కవులలో ఏ ఒక్కరూ ప్రథమ దశలో ఒక ప్రత్యేక కవిత్యోద్యమానికి చెందినవారు కాదు. అలజడియే ఊపిరిగా, తిరుగుబాటే ధ్యేయంగా వీరు రచనలు చేశారు. ఉమామహేశ్వరరావు, పట్టాభి రామిరెడ్డి (పఠాభి) ఛందోవిప్లవం సాగించారు. శ్రీనివాసరావు, నారాయణబాబు కవితా వస్తుభావములలో తిరుగులేని తిరుగుబాటు లేవదీశారు.

ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, నారాయణ బాబు, పఠాభి చేసిన తిరుగబాటొక ప్రణాళిక ప్రకారం నడిచినది కాదు. ఆదిమ దశయందు భావకవితా శృంఖలాల్లో చిక్కుకొని కాలక్రమంగా వానిని ఛేదించి, ఈ నలువురూ విశాలాకాశంలో స్వేచ్ఛగా విహరించారు. పాశ్చాత్య సాహిత్యోద్యమాలతో ప్రభావితులైనవారే నలుగురూ. నలుగురూ నాలుగు త్రోవలు త్రొక్కారు. నూతన ప్రయోగాలతో ఆంధ్రసాహితీ జగత్తును సుసంపన్నం చేయాలనే కోరిక నలుగురికీ వున్నది. కావున వీరిలో ఎవరి ప్రభావం ఎవరిపై కలదను ప్రసక్తియే లేదు.

వీరిలో శ్రీరంగం శ్రీనివాసరావు 1933 సం॥ చేత ప్రభావితుడై గీతాలు రచించాడు. రానురాను అభ్యుదయ కవిత్వానికి ప్రయోక్తయు, ప్రవక్తయూ అయినాడు. 1940 తర్వాత ఒక దశాబ్దం పాటు యువజనులను, నవ కవులను ఉత్తేజితం చేసి, ఆంధ్రసాహిత్య ప్రపంచాన్ని

స్వాధీనం చేసుకున్న అభ్యుదయ కవితా పితామహుడు శ్రీరంగం శ్రీనివాసరావు. భావకవిత్వానికి విరుద్ధంగా ధ్వజ మెత్తడమే గాక, శ్రామికవర్గ చైతన్యం, ఆత్మయైన నూతన కవితా రీతికి బాటలు తీసిన స్రష్ట శ్రీశ్రీ. భావకవుల వైదర్భరీతులు నిండిన గేయ ప్రక్రియను గౌడీ రీతిలో నడిపిన ఛందో రహస్యవేత్త శ్రీశ్రీ. వాస్తవికతతోపాటు అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యంతోపాటు సంఘ చైతన్యాన్ని సమానాధికారంతో ప్రవచించిన ప్రవక్త శ్రీశ్రీ.

గురజాడ అప్పారావు 1910లో ముత్యాలసరాలు రచించారు. ఆ సంవత్సరమే శ్రీశ్రీ జన్మించాడు. ఆయన ప్రాచీన సాహిత్యాన్ని పఠించి సంప్రదాయబద్ధ కవిత్వాన్ని వ్రాయ పూనుకున్నాడు. ప్రప్రథమమున శ్రీశ్రీ వ్రాసిన కవితా ఖండికలు భావకవితామయములు. ఇతివృత్త స్వీకారమునందే కాక భావనలో, పద ప్రయోగంలో, పద్య రచనలో శ్రీశ్రీ సమకాలిక కవి ప్రముఖులగు దేవులపల్లి కృష్ణశాస్త్రిని, విశ్వనాథ సత్యనారాయణను అనుకరించాడు. ఆ ఖండ కృతులలో ప్రాచీన కవితా పద్ధతులు లేకపోలేదు.

1928లో శ్రీశ్రీ, కొంపెల్ల జనార్ధనరావు మిత్రులయ్యారు. జనార్ధనరావు సాహచర్య ఫలంగా అంతకు పూర్వం తాను రచించిన పద్యాలన్నీ అంధానుకరణలుగా శ్రీశ్రీ నిర్ణయించుకున్నాడు. గతానుగతికమైన పద్ధతికి స్వస్తి చెప్పి నూతన మార్గాన్వేషణ చేయాలనే ఆకాంక్ష శ్రీశ్రీలో మొలకెత్తింది. 1933లో శ్రీశ్రీ 'విద్యున్మాలికలు' అనే ప్రథమ వచన గేయాన్ని రచించాడు. ఆయన అంతకు ముందు పద్యాలు, మాత్రాగణబద్ధ గీతాలు రచించాడు. ఈ ప్రథమ వచన గేయమున చరణ నియమం లేదు. స్పష్టమైన లయలేదు. పద్య ఛందస్సునో, గేయ ఛందస్సునో ఆశ్రయించుకునియున్న శ్రీశ్రీ ఛందోనియమోల్లంఘనం గావించి, 'విద్యున్మాలికలు' రచించడం సాహసమైన నూత్న ప్రయోగమే.

1933 నుండి నూత్న వస్తువును, నవీన ఛందస్సును స్వీకరించిన శ్రీశ్రీ "జయభేరి" గీతాన్ని రచించాడు.

"నేనుసైతం ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అంటూ ఆత్మాశ్రయ కవితా రీతిలో గానం చేసినా, ఆ గేయంలో వ్యక్తి చైతన్యం, సామాజిక చైతన్యం స్పష్టంగా సాక్షాత్కరిస్తుంది. "జయభేరి" శ్రీశ్రీ స్వతంత్ర కవితా వ్యక్తిత్వాన్ని లోకానికి చాటిన ప్రథమ గేయం. దానిని రచించాక శ్రీశ్రీ సమాజ సౌందర్యంతో తాదాత్మ్యం చెందాడు. అతీంద్రియ సౌందర్యం కోసం అర్రులు చాచడం నిష్ప్రయోజనమనీ, ఇహలోకంలోనే సుందర కవితావస్తువులు నిక్షిప్తమైనట్లు శ్రీశ్రీ గ్రహించాడు. ఈ కొత్త చూపుతో శ్రీశ్రీ పాశ్చాత్య కవులైన స్విన్‌బర్న్, ఎడ్గార్ ఎలెన్ పో, బ్రౌనింగ్, బాడ్లేర్ మున్నగు వారి రచనలను పఠింపనారంభించి, వారి సంవిధానాన్ని ఆకలించుకున్నాడు. బాడ్లేర్, మపాసా, ఎడ్గార్ ఎలెన్ పో తనకు ఋషితుల్యులని శ్రీశ్రీ 1935 జనవరి 'ప్రబుద్ధాంధ్ర' సంచికలో వక్కాణించారు. శబ్ద సంగీతానికి, భావగానానికి స్విన్‌బర్న్ కావ్యములను ఆయన ఆదర్శంగా గ్రహించాడు. బాడ్లేర్ రచనలందలి అవ్యక్త మాధురులను అనువాదముల ద్వారా ఆకళించుకున్నాడు. శరీరంలో విద్యుత్తేజాన్ని ప్రసరింపజేసే మపాసా రచనలనాస్వాదించాడు. ఈ వైదేశిక కవితా రచనలతో పాటు ఆంధ్రదేశంలోని జానపద సాహిత్యాన్ని శ్రీశ్రీ పరిశీలించాడు. గురజాడ ముత్యాల సరాలను పరిశోధించి వాని నిగ్గులు తేల్చాడు. మాత్రా ఛందస్సులను, అప్పకవీయంలోని తాళబద్ధమైన వృత్తాలను సమీక్షించాడు. ఆయన ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ శాస్త్రాన్ని, మార్క్సు ప్రతిపాదించిన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాలను సూక్ష్మదృష్టితో అధ్యయనం చేశాడు. ఈ సాహితీబలంతో శ్రీశ్రీ 1934 ఏప్రిల్ 12వ తేదిన "మరోప్రపంచం మరో ప్రపంచం పలించింది" అనే చారిత్రాత్మక గేయాన్ని రచించాడు. ఫ్రెంచి వారి జాతీయగీతం, హరీంద్రనాథ ఛటోపాధ్యాయ గేయం, నజ్రుల్ ఇస్లామ్ రచించిన విప్లవ గీతాలు, ఎడ్గార్ ఎలెన్ పో గేయాలూ మరో ప్రపంచ గేయం రచించడానికి ఉద్బోధితమయ్యాయని శ్రీశ్రీయే పేర్కొన్నాడు. ఇన్ని

ప్రభావాల ఫలితంగా ఈ గేయం వెలువడినప్పటికీ ఇది దేనికీ అనుకరణమో, అనుసరణమో కాక స్వతంత్ర అభ్యుదయ కవిత్వానికి నాందీ గీతమైంది. ''మహా ప్రస్థానం'' అనే గేయ సంపుటికి తలమానికమైంది.

మహాప్రస్థాన గేయం :

''మరోప్రపంచం మరో ప్రపంచం
మరోప్రపంచం పిలిచింది
పదండి ముందుకు,
పదండి త్రోసుకు
పోదాం, పోదాం పైపైకి''

అను చరణాలతో ప్రారంభమై ''హైమజ్వాలల భుగభుగల''తో సమాప్తమైన 'మహాప్రస్థానం' అనే గేయం మహాప్రస్థాన కావ్యానికి ముఖతిలకమైంది. శ్రీశ్రీ ఈ గేయాన్ని అయిదు నిమిషాల్లో రచించానని పేర్కొన్నాడు. ఈ గేయంలో ''కదంత్రొక్కుతూ, పదం పాడుతూ/ కాండ్రు కాండ్రు మని గర్జిస్తూ'' అని రచించి, మూడవ పాదం సంతృప్తి కలిగింపకపోగా దానిని ''హృదంతరాళం గర్జిస్తూ'' అని శ్రీశ్రీ మార్చాడు.

కొన్ని మాసాల తర్వాత ఈ గేయాన్ని 'మహాప్రస్థానం' అనే శీర్షికతో శ్రీశ్రీ జ్వాల అనే పత్రికలో ప్రకటించాడు. ఈ గేయంలో కవితావేశం కదను త్రొక్కుతుంది. శ్రీశ్రీ పేర్కొన్న ప్రభావాలు, ప్రేరక శక్తులు మాత్రమే. ఈ ప్రేరక శక్తుల ప్రోద్బలంతో నిద్రాణమైన శ్రీశ్రీ ప్రతిభ జాగృతమై పడగలు విప్పి తాండవించింది. తనపై ప్రసరించిన ప్రభావాలనొకవంక జీర్ణించుకొని తెలుగుదనం కొరవడ కుండ, గుండో డిండిమములు మ్రోగించు చండప్రచండ గతితో మాటలను ఈటెలుగా, బాకులుగా, మంటలుగా మార్చి, ఈ గేయాన్ని రచించాడు. మహాప్రస్థాన పీఠికలో చలం పేర్కొన్నట్లు శ్రీశ్రీ ఈ గేయం ద్వారా యువ సైన్యములకు, నూతనయుగ నిర్మాతలకు నేపథ్య సంగీతాన్ని పోలిన మార్చింగ్‌బాండ్‌ను పోలిన, క్రొత్త రకంగా కదను త్రొక్కించే సంగీతాన్ని వినిపించాడు. దిక్కులను, దేవతలను ఊపివేశాడు.

సమకాలిక సమాజాన్ని అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులను రెంటిని సమన్వయించుకొని సామాజిక విప్లవాన్ని కోరి శ్రీశ్రీ ఈ గేయ రూపంగా విప్లవ శంఖాన్ని పూరించాడు. గురజాడ రచించిన దేశభక్తి గీతం సత్వ ప్రధానంగా రచింపబడిన ప్రపంచ ప్రజాగీతం. శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం' ఓజోరజోగుణ ప్రధానంగా వ్రాయబడిన ప్రపంచ ప్రజాగీతం. ఈ గేయమునుద్దేశించిన సైనికులు యుద్ధసైనికులుగారు. మరి వీరి రక్తము పొంగి పొరలుచున్న పీడితులు. ప్రపంచ కార్మికులు. దీనిలోని మరోప్రపంచం స్వర్గమో, కైలాసమోగాదు. మరి ధరిత్రి యందంతట నిండిన నవసమాజం. కార్మిక కర్షక ప్రభుత్వాన్ని స్థాపించి, క్రమంగా విశ్వమందంతట వర్గరహిత సమాజాన్ని నిర్మించుటకుద్యుక్తమైన సోవియట్ రష్యా ఈ మహాప్రస్థాన గేయంలో అక్షర రూపాన నిలిచిందనవచ్చు. ఈ గేయం రచించేనాటికి శ్రీశ్రీ రష్యా విప్లవంచేత ప్రభావితుడయ్యాడు. ఆయనయే ''ప్రపంచం అంతటా అభివృద్ధిని కాంక్షించే కవుల స్వప్నాలు రష్యన్ విప్లవంలో ఆకృతి ధరించడం నాకు కనబడింది. సామాజిక విప్లవానికి సాహిత్య విప్లవం చాలన్న ధృడనిశ్చయం ఏర్పడింది'' అని పేర్కొన్నాడు.

ఈ గేయం తర్వాత 1940 వరకు మహాప్రస్థాన కవితా సంపుటిలోని గేయాలన్నీ రచితమయ్యాయి. ఈ గేయాల్లో అధికభాగం మార్క్సు ప్రతిపాదించిన సమసమాజవాదాన్ని (కమ్యూనిజాన్ని) గర్భీకరించుకుంది. గతితార్కిక భౌతిక వాదమూ, వర్గకలహం అనే రెండు ముఖ్య సిద్ధాంతాలను మార్క్సు మానవ చరిత్రకన్వయించాడు. శ్రీశ్రీ గేయాల మీద వాటి ప్రభావం అధికంగా కనిపిస్తుంది.

❖❖❖

శ్రీశ్రీ కవిత్వం - మానవతావాదం

- గజ్జెల ప్రమీల, తెలుగు అధ్యాపకురాలు, కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు.

'మానవాళికి నిజంగానే మంచి కాలం రహిస్తుందా?
దారుణ ద్వేషాన్ని పెంచే దానవత్వం నశిస్తుందా?
సాధుసత్వపు సోదరత్వపు స్వాదుతత్వం జయిస్తుందా-

అని విశ్వమానవ కల్యాణాన్ని కాంక్షించిన వ్యక్తి శ్రీరంగం శ్రీనివాసరావు. ఆయనే మహాకవి శ్రీశ్రీ. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించిన విశ్వకవి. ఆయనను ఒక ప్రాంతానికో, ఒక ప్రదేశానికో పరిమితం చేయలేము. ఆయన కవిత్వం ప్రపంచ మానవాళి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఆకాంక్షించింది. ''మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం'' అని ధైర్యంగా తన పంథాను ప్రకటించిన విశ్వమానవ పథికుడు శ్రీశ్రీ.

మానవతావాదం మానవుడు పుట్టినప్పటి నుండి అంతర్నిహితమై ఉన్నటువంటి స్వాభావికమయిన భావన. మానవతకు ఆద్యంతాలు లేవు. అది ఆనాటి మానవజాతి చరిత్రలో మానవుని ఆలోచనలు, సంవేదనలు నిక్షిప్తమై వున్నాయి. మానవతా తత్వం కవితా గర్భంలో చిరకాలంగా స్థిరపడి వుంది. మానవుడి అంతర ప్రవృత్తిని వ్యక్తీకరించేది కవిత్వం. కవిత్వంలో మానవుని భావావేశాలు ఏదో ఒక రూపంలో ప్రతిబింబిస్తాయి. కవి కొన్ని సంఘటనలకు, పరిస్థితులకు, వ్యక్తులకు అలవాటు పడి వుండుట వలన అతడు భిన్న సంఘటనలను, పరిస్థితులను, వ్యక్తులను ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు ప్రతిఘటిస్తాడు. మానవుడు పుట్టినప్పటి నుండి మానవజాతి నుండి సహజ సిద్ధంగా సంక్రమించిన పరిమిత మానవతకు నిర్భంధితుడయ వున్నాడు. కవులందరిని మానవజాతి సంస్కర్తలనీ, మానవ శ్రేయోభిలాషులని, పరార్ధ దృష్టి కలవారని భావించవచ్చు. సాహిత్యం మానవతా దృక్పథం లేనిది కాదు. ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాద విభిన్న ధోరణుల ప్రభావం మనకు స్పష్టంగా విశదమవుతుంది. సాంప్రదాయిక భావాలున్న కవులు మావతావాదానికి సంబంధించిన విభిన్న ప్రయోగాల్ని చేశారు. అంతేకాదు ఆధునిక భావజాలంతో రచనలు చేసిన వారు దానికి మరింత పదునుపెట్టారు.

శ్రీమద్భాగవతంలో ''కపిలుడు'' తన తల్లియైన దేవహూతికి ఆత్మతత్వం ఉపదేశిస్తూ ఇలా అంటాడు.

''అహం సర్వేషు భూతేషు భూతాత్మావస్థిత: సదా
తమ వజ్ఞాయ మాంమర్త్య: కురుతే ర్చావిడమ్బనమ్
యోమోం సర్వేషు భూతేషు సన్తమాత్మాన మీశ్వరమ్
హిత్వార్చాం భజతే మౌఢ్యాత్ భస్మన్యేవ జుహోతిస:
ద్విషత: పరకాయే మాం మానినే భిన్నదర్శిన:
భూతేషు బద్ధవైరస్య న మన:శాన్తి మృచ్ఛతి''

అన్ని ప్రాణుల్లోనూ ఆత్మరూపంలో ఉన్న నన్ను అవమానం చేస్తూ, మూఢుడైన మానవుడు ఏదో అర్చ (విగ్రహం) ఏర్పరచుకొని దాన్ని ఆరాధిస్తూ వుంటాడు! ఇలా అతడు చేసే పూజ అంతా బూడిదలో చేసిన హోమమే. ఇతర దేహాల్లో ఉన్న నన్ను ద్వేషిస్తూ, భేద బుద్ధి పెంచుకుంటూ, వైరంతో ప్రవర్తించేవాని మనస్సుకు శాంతి అనేది వుండదు.

ఈ భావానికీ గురజాడవారు ఉద్బోధించిన భావానికీ ఎంత సాదృశ్యం - సాదృశ్యం కాదు, ఏకత్వంబు వున్నదో చూడండి.

''మనిషి చేసిన రాయి రప్పకి
మహిమగలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పలకన్న కనిష్టం
గానూ చూస్తావేల బేలా?
దేవుడెక్కడో దాగెనంటూ
కొండకోనల వెతుకులాడేవేలా?
కన్ను తెరిచిన కానబడడో?

మనిషి మాత్రుడి యందు లేడో
యెరిగి కోరిన కరిగి యీడో ముక్తి''

- అంటూ మహాకవి గురజాడ అప్పారావుగారు కూడా ఇదే దృష్టిని, దృక్పథాన్ని వ్యక్తపరిచారు. ''మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును- యెల్ల లోకము వొక్క యిల్లె, వర్ణ భేదము లెల్ల కల్లె- ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును- దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్- మంచిచెడ్డలు మనుజులందున, యెంచి చూడగ, రెండె కులములు- బ్రతికి చచ్చియు ప్రజల కెవ్వడు బ్రీతి గూర్చునొ, వాడె ధన్యుడు-'' అని చెప్పినట్లుగానే ''గురజాడ నా అడుగుజాడ'' అని పేర్కొన్న శ్రీశ్రీ కూడా మనిషి చుట్టూనే తన కవిత్వాన్ని అల్లాడు.

''మళ్లీ నరజన్మ ఎందుకంటే
మనుషులంటే యిష్టం నాకు
దేవుడి కంటే మనిషి యిష్టం!''

అని కుందుర్తి తన స్వేచ్ఛా కవిత్వాన్ని ప్రజలకు వినిపించాడు.

''మానవత్వం'' మంటగలిసి పోతున్న రోజులివి. అందుకే మానవతను ప్రేరేపించేలా ప్రతిధ్వనించిన శ్రీశ్రీ కవిత్వాన్ని మరోమారు గుర్తు చేసుకుంటూ, ''శ్రీశ్రీ కవిత్వంలోని మానవతావాదాన్ని'' వ్యక్తపరచాలను కుంటున్నాను. శ్రీశ్రీ అని పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చే కావ్యం మహాప్రస్థానం. అందువల్ల ప్రధానంగా ఆయన మహాప్రస్థానంలో పేర్కొన్న కవిత్వంలోని మానవత్వాన్నే ప్రధానంగా చర్చించే ప్రయత్నం చేస్తాను.

మహాప్రస్థానం గేయాల్లోని ఇతివృత్తాలు ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ఎదుర్కొంటున్న బాధలు, వీటికి నేపథ్యంగా ఉన్న చారిత్రిక పరిణామాలు, పీడితుల పక్షాన నిలవాల్సిన కవికి అవసరమైన లక్షణాలు, నూతనమైన ఈ అంశాలపై రావాల్సిన కవిత్వమూ, తన కవిత్వానికి లక్షణాలు, పీడితులను ఇంకా పీడించేందుకు సహాయకారిగా ఉండే తాత్వికతలపై తిరుగుబాటు వంటివి ఉన్నాయి. వీటన్నిటికీ మూలమైన నేపథ్యంగా తన కవితాతాత్వికతనీ, దానికి వెనుకనున్న సంఘర్షణనీ అపురూపంగా వెల్లడించిన కళాఖండమైన కవితా ఓ కవితా కూడా ఉంది.

మొదటి గేయం మహాప్రస్థానం. అదొక కవాతు పాట లాంటిది. పదండి ముందుకు పదండి త్రోసుకు అంటూ ప్రబోధించే ఈ గేయం హరోం! హరోం హర! హరోం! హరోం హర!హర! హర! హర! అంటూ యుద్ధనినాదం చేసుకుంటూ కదలమన్నాడు. ఐ గేయంలో తాను స్మరిస్తే పద్యం, అరిస్తే వాద్యం అని చెప్పుకున్నారు, నా మహాప్రేకాలు భవభూతి శ్లోకాలు, పరమేష్ఠి జూకాలు అంటూ తన గురించి వ్రాసుకున్నారు. దీనిని విమర్శకులు నిర్ద్వంద్వంగా, నిరాఘాటంగా చేసుకున్న ఆత్మస్తుతిగా పేర్కొన్నారు. మూడో కవిత జయభేరి. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిస్తాను అంటూ సాగే ఈ గేయంలో తన వల్ల అయ్యేది తాను చేయగలగడం మొదలుకొని తుదకు ఆ తానే భువన భవనపు బావుటానై పైకి లేస్తానని, నా కుహూరుతశీకరాలే, లోకమంతా జల్లులాడే, ఆ ముహూర్తాలాగమిస్తాయి అన్నారు.

ప్రధానంగా పేద ప్రజల పట్ల జాలి, దయను ఆయన కవిత్వంలో మనం గమనించవచ్చు. మనిషిని మనిషిగా చూడాలన్న తత్వం శ్రీశ్రీగారిది. సమాజంలో వున్న అసమానతల్ని ప్రధానంగా ఎత్తి చూపాడు. పేదలు పడుతున్న కడగండ్లను కళ్ళకు కట్టడంలో శ్రీశ్రీ అందెవేసిన చేయి. శ్రీశ్రీ మహాప్రస్థానం రచన చేసే నాటికి సమాజ పరిస్థితులు చాలా దారుణంగా వున్నాయి. ప్రధానంగా హంగ్రీ థర్టీస్ ప్రభావం ప్రపంచ దేశాలన్నింటిపైనా పడింది. ఆ సమయంలో భయంకరమైన ఆర్థికమాంద్యం ప్రపంచాన్ని కుదిపేస్తున్న సందర్భమది. ఆ ప్రభావం గ్రామీణ ప్రాంతాలపై కూడా పడిందని, పల్లెల్లో పనులు లేక ఉపాధిని వెతుక్కుంటూ పట్టణానికి వచ్చిన ఒక పల్లెటూరి బాట సారి కష్టాలను మన కళ్ళముందుంచారు ''బాటసారి'' అనే కవితలో.

కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని-
తల్లిమాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి,
మూడురోజులు ఒక్కతీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక-
నడి సముద్రపు నావ రీతిగ
సంచరిస్తూ, సంచలిస్తూ,
దిగులు పడుతూ, దీనుడౌతూ
తిరుగుతుంటే-
చండ చండం, తీవ్ర తీవ్రం
జ్వరం కాస్తే,
భయం వేస్తే,
ప్రలాపిస్తే-
మబ్బుపట్టీ, గాలికొట్టీ,
వానవస్తే, వరదవస్తే,
చిమ్మచీకటి క్రమ్ముకొస్తే
దారితప్పిన బాటసారికి
ఎంత కష్టం!

ఇక్కడ సామాన్య మానవుడు పడుతున్న వ్యథను ఎంతో ఆర్ద్రతతో చిత్రించాడు శ్రీశ్రీ. పరిస్థితులు వ్యతిరేకంగా వున్నప్పుడు మనిషిని ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తాయో, ఎన్ని కష్టాలు పడాల్సి వస్తుందో, ఎతంటి నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందో వివరించే ప్రయత్నం చేశాడు. ఇక్కడ మనం గమనించాల్సింది సమాజాన్ని కూడా. సమాజంలో తోటి మానవుడు ఇబ్బందులు పడుతుంటే, వాటిని పరిష్కరించకపోగా, వారిని మరింత ఇబ్బంది పెట్టేలా చూసే సమాజం మన కళ్ళముందు ఇంకా వుంది. ఇలాంటి పరిస్థితిలో సామాన్య మానవుడు ఎలా నెగ్గుకు రాగలడు, ఈ కష్టాన్ని గట్టెక్కించే దెవ్వరు అని సమాజాన్ని ప్రశ్నిస్తున్నాడు శ్రీశ్రీ.

కళ్ళు వాకిట నిలిపిచూచే
పల్లెటూళ్ళో తల్లి ఏమని
పలవరిస్తుందో.....?
చింతనిప్పులలాగు కన్నుల
చెరిగిపోసే మంటలెత్తగ,
గుండుసూదులు గ్రుచ్చినట్లే,
శిరోవేదన అతిశయించగ,
రాత్రి, నల్లని రాతి పోలిక
గుండె మీదనె కూరుచుండగ,
తల్లిపిల్చే కల్ల ద్రుశ్యం
కళ్ళ ముందట గంతులేయగ
చెవులుసోకని పిలుపులేవో
తలచుకుంటూ-
తల్లడిల్లే,
కెళ్ళగిల్లేజి
పల్లటిల్లే బాటసారికి
ఎంత కష్టం!
.....
.....
విడిన మబ్బుల నడుమనుండీ
వేగుచుక్కా వెక్కిరించింది..
బాటసారి కళేబరంతో
శితవాయువు ఆడుకుంటోంది!
పల్లెటూళ్ళో తల్లికేదో
పాడుకలలో పేగు కదిలింది!

ఇక్కడ ప్రధానంగా మనిషి ఇబ్బందుల్ని, కుటుంబానికి దూరంగా వుండే పరిస్థితుల్ని వివరిస్తూనే, కన్నతల్లి బాధను హృదయానికి హత్తుకునేలా చిత్రించారు శ్రీశ్రీ. కొడుకు ఇబ్బందులు పడుతున్న విషయం ప్రత్యక్షంగా చూడనప్పటికీ కన్నతల్లి మనసు మాత్రం దాన్ని అర్థం చేసుకుంటుంది అని సూచించాడు. ఇక్కడ తల్లీబిడ్డల అప్యాయతల్ని, కుటుంబ సంబంధ విలువల్ని గురించి చర్చించాడు శ్రీశ్రీ. అయితే ప్రస్తుత సమాజంలో వృద్ధాశ్రమాలు రోజు రోజుకూ పెరుగుతున్న తరుణంలో మనం ఏ సమాజంలో వున్నామో మనమే అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది.

ఆధార గ్రంథాలు :

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ
2. శ్రీశ్రీ సంసార ప్రస్థానం - సరోజా శ్రీశ్రీ
3. శ్రీశ్రీ కథలు అనువాద కథలు - చలసాని ప్రసాద్ (ప్రచురణ)
4. శ్రీశ్రీ సిప్రాలి - చలసాని ప్రసాద్ (ప్రచురణ)

❖❖❖

అభ్యుదయ కవిత్వ ఉద్యమ రథసారథి - శ్రీశ్రీ

- డా॥. జొన్నే యోగీశ్వరనాయుడు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), అనంతపురము.

అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి: అన్నది ఆర్యోక్తి. సృష్టికర్త బ్రహ్మ ఈ ప్రపంచాన్ని సృష్టించినట్లు, కవి బ్రహ్మ కూడా తన ప్రతిభతో అద్భుతమైన కావ్య ప్రపంచాన్ని సృష్టిస్తాడు. ఏ వస్తువునైనా కవిత్వం చేయగల పరుసవేది కవికి వుంటుంది. కవిత్వానికి వస్తువు, శిల్పం ముఖ్యం. ఒక వస్తువుని గ్రహించి దానిని కవిత్వంగా ఎలా మలచాలి, ఎలాంటి భాష ఉపయోగించాలి, భావమెలా పదును తేలాలి అన్న ఈ వాక్యాలు శ్రీశ్రీ కవిత్వానికి నిలువెత్తు సాక్ష్యాలు. తెలుగు సాహిత్యంలో సంతకం అక్కరలేని కవిత్వం శ్రీశ్రీ సొంతం. ఎలాంటి భావాన్నైనా వ్యక్తీకరించే భాష ఆయన సొంతం. తన అక్షయ తుణీరం నుంచి బాణాల్లో పదాలు, వాక్యాలు దూసుకొస్తాయి.

''ఆదిలో మార్క్సిస్టులైనులోకి శ్రీశ్రీని తీసుకొచ్చిన అబ్బూరి రామకృష్ణారావు ఎంత ప్రయత్నించినా అతణ్ణి ఆ దారిలోంచి పక్కకు తప్పించలేకపోయారు''. అబ్బూరి శ్రీశ్రీ గురించి ''రష్యా గురు ధూపంతో రమణీయపు శివమెత్తిన రణాచారి, గణాచారి'' అని కీర్తించగా, ''అబ్బూరి నా విశ్వవిద్యాలయం'' అని వినుతించటం శ్రీశ్రీ వ్యక్తిత్వానికి పరాకాష్ట. ''తనకీ, ప్రపంచానికీ సామరస్యం కుదిరేదాకా కవి చేసే అంతర్, బహిర్ యుద్ధారావమే కవిత్వం'' అని చలం శ్రీశ్రీ కవిత్వాన్ని మహాప్రస్థానం యోగ్యతా పత్రంలో వివరించారు. ఈ మహాప్రస్థాన కవిత్వమే అభ్యుదయ కవిత్వానికి శిఖరాయమానం. ఒక కవి వేర్వేరు ఉద్యమాలకు ప్రభావితుడవడం సహజం. అందుకు ప్రధాన నిదర్శనం శ్రీశ్రీ. తొలుత భావకవిగా, తర్వాత అభ్యుదయ కవిగా, విప్లవ కవిగా కాల పరిణామంలో రూపాంతరం చెందటం జరిగింది. మహాకవి శ్రీశ్రీ సాహిత్యంపై పలువురు క్రింది విధంగా స్పందించడం అతని సాహిత్య మహోన్నత స్థాయికి నిలువుటద్దాలు.

1. నెత్తురు, కన్నీళ్ళూ తడిపి కొత్త టానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి. ''కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ'' అని చలం మహాప్రస్థానానికి వ్రాసిన యోగ్యతా పత్రంలో తెలియజేశాడు.
2. ''మానవ సమాజానికి, నూతన సమాజానికి నూతన లక్ష్యాలను నిర్ధేశించడంలో విప్లవ ప్రాయమైన విధానాలను వెతుకుతున్నది ఈయన వాణి. వింత వీధులలో పరుగుతీయడంలో మహా సాహసికుడు శ్రీశ్రీ'' అని ముద్దుకృష్ణ తెలిపారు.
3. 1940 తర్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్య లోకమునుత్తేజిత మొనర్చిన అభ్యుదయ కవిత్వోద్యమ మూలవిరాట్టు శ్రీశ్రీ. వాస్తవికతతో పాటు, అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యముతోపాటు సంఘచైతన్యమును సమానాధికారముతో ప్రవ చించిన ప్రవక్త శ్రీశ్రీ - డా॥ సి. నారాయణరెడ్డి
4. ఆంధ్ర సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవితా మహాప్రస్థాన యుగకర్త శ్రీశ్రీ. దాదాపు 1930 నుంచీ ఆంధ్ర సాహిత్యం ఆయన వెంట నడుస్తోంది. ఆంధ్ర సాహిత్యానికి సామాజిక స్పృహతోపాటు అంతర్జాతీయ దృక్పథాన్ని నేర్పారు శ్రీశ్రీ. శ్రీరంగం శ్రీనివాసరావు రెండు శ్రీకారాలకు ప్రతీక. ఒక శ్రీకారం అభ్యుదయ ప్రస్థానానిది మరో శ్రీకారం విప్లవ ప్రస్థానానిది అని జి.వి. సుబ్రమణ్యం తెలియ జేశారు.

అభ్యుదయ కవిత్వ ఉద్యమం :

కమ్యూనిస్టు పార్టీకి మార్క్సిజం ప్రధాన భూమిక. అభ్యుదయ సాహిత్య ఉద్యమానికి మార్క్సిజం పునాది. మార్క్సిస్టు అయినవాడే అభ్యుదయవాది అన్న భావం

కూడా ప్రచారంలో వుంది. మార్క్సిజం ప్రధానోద్దేశ్యం సామ్యవాద సమాజాన్ని ఆశించటం. మానవ జాతి చరిత్ర సమస్తం వర్గ సంఘర్షణమే అన్నది కారల్‌మార్క్స్ ప్రధాన భావన. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, గోర్కీలు రచనలు అనువాదం కావడంతో సమాజంలో సోషలిస్టు భావాలు వ్యాప్తి చెందాయి. భారత అభ్యుదయ రచయితల సంఘం 1933లో ఏర్పడింది. 1933-34లోనే తెలుగునాట అభ్యుదయ కవిత్వం ప్రారంభమైంది. పి.వి. రాజమన్నారు, దేవులపల్లి, శ్రీశ్రీ, క్రిష్టపర్ కాడ్వెల్, ప్రేంచంద్ మొదలగు వారు అభ్యుదయ కవిత్వ నిర్వచనాలను తెలియజేశారు. భావకవిత్వంపై తిరుగుబాటు చేసిన అభ్యుదయ కవితా ప్రవక్త శ్రీశ్రీ. శ్రామిక వర్గ చైతన్యము వారి జీవిత సమస్యలను చిత్రించే సాహిత్యమే అభ్యుదయ సాహిత్యమని శ్రీశ్రీ అభిప్రాయము. శ్రీశ్రీ వెలువరించిన మహాప్రస్థానం అభ్యుదయ శకానికి నాంది.

"నేడే - ఈనాడే
జగమంతా బలివితర్తి
నరజాతికి పరివర్తన
నవజీవన శుభసమయం - అభ్యుదయం"

అని శ్రీశ్రీ అభ్యుదయ అనే పదాన్ని మొదటిసారిగా ప్రగతి, పురోగమనం అనే అర్థంలో వాడారు. అభ్యుదయ కవిత్వం ఎలా వుండాలో తన కవిత్వంలో తెలియజేశారు.

మహాప్రస్థానం :

శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానంలో నలభై ఖండికలున్నాయి. 'కొంపెల్ల జనార్ధన రావుకోసం' అనే అంకిత గీతం కలిపితే నలభై ఒకటి. ఈ సంకలనంలో ముందుగా రచించబడిన కవిత జయభేరి. ఈ గీతం శ్రీశ్రీ చేత కొత్త ప్రస్థానానికి జయభేరి మోగింపజేసింది అని ఆరుద్ర తెలిపారు.

"నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అని ప్రారంభించబడ్డ జయభేరి గీతం వాడుక భాషలో ముత్యాలసరం ఛందస్సులో వ్రాయబడింది. ఇదే శ్రీశ్రీ ప్రస్తావించిన గురజాడ అడుగుజాడ. ఇక్కడ నేను శ్రీశ్రీ కాడు. శ్రీశ్రీ కంఠంలో పలుకుతున్న శ్రామికుడు, సామాన్య మానవుడు. ప్రపంచాభ్యుదయం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మానవుడు చరిత్రలో పేరుకు కూడా నోచుకోని సామాన్యుడికి ప్రాముఖ్యం కల్పించిన నుడికారం నేనుసైతం. గుర్తింపుకోసం, ప్రాముఖ్యత కోసం సామాన్యుడు తిరగబడాలని శ్రీశ్రీ ఘోషిస్తున్నాడు. మహాప్రస్థానంలో గతితార్కిక భౌతికవాదం వున్నది.

మహాప్రస్థాన గేయం ఒక సమరగీతి. వీరగానం. మహాప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం. దోపిడీ వ్యవస్థ నుండి, పీడిత సమాజం నుండి సామ్యవాదం, సమసమాజ వ్యవస్థలోకి పయనించటమే మహాప్రస్థానం. రష్యాలో సామ్యవాదం అనే అనే మరో ప్రపంచం ఏర్పడిందని భారతీయులు కూడా అభ్యుదయ పథంవైపు పయనించాలని ఉద్బోధించాడు. ఈ గేయం మహా ప్రవాహం. శ్రమశక్తికి విలువ కట్టాలని, శ్రామిక వర్గం చైతన్యంతో ప్రవర్థిల్లాలని, సామ్యవాద సమాజం నిర్మించబడాలని ఆశిస్తూ, 'ప్రతిజ్ఞ' గేయం ప్రకటించారు. ఈ గేయం శ్రీశ్రీ కవిత్వానికే కాదు, అభ్యుదయ కవిత్వానికే మానిఫెస్టో వంటిది. కర్షక వీరుల ఘర్మజలానికి, ధర్మ జలానికి ఖరీదు లేదని నినదించాడు. కార్మికలోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి ప్రయత్నిస్తానని తెలియజేశాడు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని, కష్టజీవులకు, కర్మవీరులకు నిత్యమంగళం నిర్దేశిస్తూ, వ్యర్థార్థ జీవిత యదార్థ దృశ్యం పునాదిగా వుండేదే అభ్యుదయ కవిత్వమని శ్రీశ్రీ ప్రవచించాడు. సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి అని బహుజనుల వృత్తి చైతన్యాన్ని కాంక్షించాడు.

సామ్యవాద వ్యవస్థ ఏర్పడుతుందన్న విశ్వాసం బలంగా వ్యక్తీకరిస్తూ "జగన్నాథుని రథచక్రాలు" గేయం రచించాడు. ధనస్వామ్య వ్యవస్థలోని వైరుధ్యాలు దాని పతనానికి కారణమవుతుందని తెలియజేశాడు. జగన్నాథు

డంటే పూరీలోని విష్ణువు. ఈ రథోత్సవంలో భక్తులు చక్రాల కింద పడి మరణిస్తారు. జగన్నాథ రథం అభ్యుదయ పథానికి సంకేతమని, ఆ రథవేగంలో దుర్మార్గులూ, దోపిడీదార్లూ పడి మరణిస్తారనీ వివరించాడు. పతితులారా! భ్రష్టులారా! బాధాసర్పదష్టులారా! ఏడవకండి అని జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయని, స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాత్రం, సౌహార్ధం పునాదులుగా ఈ రాజ్యాన్ని సామాన్యులు పాలించాలని, ఈ స్వప్నం నిజమవుతుందని, ఈ స్వర్గం ఋజువవుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశాడు.

గతితార్కిక భౌతిక వాదానికి నిలువుటద్దం 'దేశ చరిత్రలు' అన్న గేయం. ఈ గేయంలో వర్గ సంఘర్షణ కనిపిస్తుంది. అలాగే బూర్జువా వ్యవస్థను తిరస్కరించడం కనిపిస్తుంది.

"ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం"

అన్న గేయంలో రాజ్యకాంక్ష, స్వార్థం వున్న రాజుల చరిత్ర, చరిత్ర కాదది, దానివల్ల జాతి గౌరవం, ప్రతిష్ట కలగవని తెలిపారు. చరిత్రలోకి ఎక్కిన రాజులందరూ నరహంతకులేనని, ప్రజల్ని కాల్చుకుతిన్నవారేనని, దరిద్రుల, సామాన్యుల శవాలమీద సింహాసనం ఎక్కిన వారేనని విప్లవ శంఖం పూరించిన మహనీయుడు శ్రీశ్రీ

ముగింపు :

శ్రీశ్రీ శబ్దబ్రహ్మ. తన సాహిత్యంలో సింహభాగం అభ్యుదయం, చైతన్యతలను సృష్టించాడు. ప్రపంచమొక పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం అని సిద్ధాంతీకరించి, సామాన్యుల సమానత కోసం పరితపించిన మహాకవి శ్రీశ్రీ. తన మహాప్రస్థాన కావ్యం ద్వారా అభ్యుదయ కవిత్వ ఉద్యమానికి దశ, దిశ నిర్ధేశం చేశాడు.

"నేనొక దుర్గం!
నాదొక స్వర్గం
అనర్గళం, అనితర సాధ్యం, నా మార్గం"

అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ. తన కవిత్వం ద్వారా సమసమాజం నిర్మించబడాలని తెలియజేశాడు. "నా రచనలలో లోకం ప్రతిఫలించి, నా తపస్సు ఫలించి, నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ, నా జాతి జనులు పాడుకొనే మంత్రంగా మోగించాలనని" ఆశించి, నినదించిన ప్రజాకవి, అంతర్జాతీయ కవి, విశ్వసామాన్య మానవ కవి, అభ్యుదయ సాహిత్య రథసారధి శ్రీశ్రీ.

ఆధార గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు - ప్రయోగములు - డా॥ సి. నారాయణరెడ్డి
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి
3. మహాప్రస్థానం - శ్రీశ్రీ
4. యుగకర్త శ్రీశ్రీ - ఆర్వీయార్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ శ్రీ మహా ప్రస్థానం - సామాజిక చిత్రణ

- డా॥ ఐ. వెసు, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.

శ్రీరంగం శ్రీనివాసరావు గారు, విప్లవకవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినీ గేయ రచయితగా ప్రసిద్ధుడు. ఆయన హేతువాది, నాస్తికుడు ఆయన రచనలన్నీ ఒక ఎత్తైతే మహా ప్రస్థానం శ్రీ శ్రీ రచనలలో ప్రసిద్ధిమైనది. తన ఏడవ యేటనే ప్రారంభమైన రచనా ప్రస్థానంలో ఎన్నో గేయాలు, కావ్యాలు, ఖండికలు తన కలం నుండి జాలువారాయి. '' అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీ శ్రీ మేటి. ''వ్యక్తికి బహువచనం శక్తి'' అనేది అతను సృజించిన మహత్తర వాక్యం. శబ్ద ప్రయోగంలో నవ్యతను సృష్టించడంలో అతనికి సాటి ఎవ్వరూ లేరు.

1930 దశకం ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగులైన యువకుల జీవితాలు మొదలుకొని సమాజంలోని అణగారిన వర్గాల జీవితాలతో కూడిన అల్లకల్లోలమైన సమయం. ఈ దశలో వ్యక్తిగతంగాను, సామాజికంగానూ శ్రీశ్రీ చుట్టూ జరిగిన సాంఘిక పరిణామాలు ఆయన రచనా వస్తువులను నిర్దేశించాయి. అలాంటి స్థితిలో 1930-1940 రాసిన ఉత్తమమైన కవితలలో మహా ప్రస్థానంగా వెలువరించారు. దానికి యోగ్యతా పత్రం చలంగారు రచించారు. ఈ పుస్తకాన్ని 1938లో అకాల మరణం పొందిన శ్రీ శ్రీ స్నేహితుడు, సాహిత్యకారుడు కొంపెల్ల జనార్ధనరావుకు అంకితమిచ్చారు.

మహా ప్రస్థానం - ఇతివృత్తం :

మహాప్రస్థానం గేయాల్లోని ఇతివృత్తాలు ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ఎదుర్కొంటున్న బాధలు, వాటికి నేపథ్యంగా ఉన్న చారిత్రక పరిణామాలు, పీడితుల పక్షాన నిలవాల్సిన కవికి అవసరమైన లక్షణాలు, వీటన్నిటికీ మూలమైన నేపథ్యంగా తన కవితా తాత్వికతని దానికి వెనుకనున్న సంఘర్షణనీ అపురూపంగా వెల్లడించిన కళాఖండమైన "కవితా ఓ కవితా" కూడా ఉంది. మొదటి గేయం మహా ప్రస్థానం. అదొక కవాతుపాట లాంటిది. '' పదండి ముందుకు పదండి త్రోసుకు అంటూ ప్రబోధించే గేయం. ఐ గేయంలో స్మరిస్తే పద్య, అరిస్తే వాద్యం అని చెప్పడం. నామహోద్రేకాలు భవభూతి శ్లోకాలు, పరమేష్ఠి జూకాలు అని తనను గురించి తాను చెప్పుకోవడం. జయభేరి కవితలో నేనుసైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిస్తాను అంటూ సాగే ఈ గేయంలో తన వల్ల అయ్యేదితాను చేయగలడు. మొదలుకొని తుదకు తానే భువన బావుటాన్ని పైకి లేస్తానని చెప్పడం ఇలాంటి అనేక ఇతివృత్తాలతో కూడి ఉన్నాయి.

మహా ప్రస్థానం - సామాజిక చిత్రీకరణ :

మహాప్రస్థానంలో ప్రతి కవితా ఖండికలోను సామాజిక స్పృహ, సాంఘిక జీవితాలతో కూడినది. మరో ప్రపంచంతో మొదలైన మహా ప్రస్థానం జగన్నాధుని రథ చక్రాలు గేయం వరకు ప్రతి గేయం చాలా ప్రాధాన్యతను సంతరించుకున్నవి. మచ్చుకు పరిశీలిస్తే మరో ప్రపంచం గేయంలో సోమరితనం విడనాడి ఈ కుళ్ళిన సమాజంను విడిచి సైనికులలాగా కొత్త ప్రపంచంలో ప్రభంజనమై ముందుకు సాగాలని 'జయభేరి' గేయంలో ప్రతి ఒక్కరు సమాజానికి తమవంతు పాత్ర పోషించాలని ఎవరూ శాశ్వతం కాదని ప్రతి ఒక్కరూ సమాజానికి సమిధలాగా ముందుకెళ్ళాలని సూచించారు.

'బుక్కులు' గేయంలో ప్రతి వస్తువు కవితా వస్తువు ''కాదేదీ కవిత కనర్హం'' అని

కుక్క పిల్లా,
అగ్గిపుల్లా,

సబ్బుబిళ్లా
హీనంగా చూడకు దేన్నీ!
కవితామయ మేనోయ్ అన్ని! అని చెప్పాడు,

'బాటసారి' గేయంలో కూలి కోసం పట్టణంలో బ్రతుకుదామని - తల్లిమాటలు చెవిని పెట్టక బయలు దేరిన బాటసారికి నడుస్తున్నా దిక్కు తెలియక.... బాట సారులు పడే కష్టాలు సమాజంలో చక్కగా వివరించాడు.

"శైశవగీతి" గేయంలో 'పసికూనలు' యొక్క జీవనశైలని "పాపం", పుణ్యం, ప్రపంచమార్గం, కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ, ఏమీ ఎరుగని పూవుల్లారా, అయిదా రేడుల పాపల్లారా! గేయంలో చిన్న పిల్లల మనస్తత్వాన్ని చాలా చక్కగా వివరించాడు.

భిక్షు వర్షీయసి 'ఖండిక'లో నేటి సమాజంలో వృద్ధాప్య జీవితం ఎలా ఉందో సమాజంలో అనేది అప్పుడే

"దారి పక్క, చెట్టుకింద
ఆరిన కుంపటి విధాన
కూర్చున్నది ముసల్దొకతె
మూలుగుతూ, ముసురుతున్న
ఈగలతో వేగలేక....." అని చక్కగా వివరించాడు.

'అభ్యుదయం' కవితా ఖండికలో

"ఏవో
ఏవేవో, ఏవేవో
ఘోషాలు వినబడుతున్నాయ్!
గుండెలు విడిపోతున్నాయ్! అని ప్రారంభించి

ప్రతి ఒక్కరికి సమాజంలో మార్పు రావాలంటే మనలో మార్పు రావాలని ఎందరో యోధులను స్మరించుకొని ముందుకు నడిచినప్పుడే సామాజిక ప్రగతి చేకూరు తుందని చక్కగా వివరించారు "ప్రతిజ్ఞ" కవితా ఖండికలో

పాలాల నన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యల నిండగ
విరామ మెరుగక పరిశ్రమించే
కర్షక వీరుల కాయం నిండా
కాలుపకట్టే కర్మజలానికి
ఘర్మ జలానికి
ధర్మ జలానికి
ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్!.....

అని కర్షకులు, కార్మికుల కష్టాలను వివరించాడు. రైతులు పొలాలుదున్ని వ్యవసాయం చేసి శ్రమధారపోసి వారి చెమట బిందువులకు ఖరీదు లేదని అలాగే కార్మికు లకు సరైన వేతనం శ్రమకు తగ్గ ప్రతిఫలం లేదని చక్కగా వివరించాడు. 'నవకవితా' ఖండికలో కర్షక, కార్మిక, కష్టాలకు వ్యతిరేకంగా వారి తిరుగుబాటుకు చిహ్నంగా..

"సిందూరం రక్త చందనం
బంధూకం, సంధ్యారాగం,
పులిచంపిన లేడి నెత్తురు,
ఎగరేసిన ఎర్రని జెండా
రూద్రాలిక నయన జ్వాలిక
కలకత్తా కాళిక నాలిక

కావాలోయ్ నవకవనానికి అని "నవ కవిత"లో చక్కగా వివరించాడు.

'దేశ చరిత్రలు' కవితా ఖండికలో

"ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నతి గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడిన పరాయణత్వం" అని చరిత్రలను చదవడం ద్వారా ఏమున్నది, ఎవరో రాజులు పరిపాలించారు, యుద్ధాలు చేశారు, దండయాత్రలు వాటిలోని గొప్పతనం ఏమిలేదు. వారి స్వార్థాలు తప్ప సామాన్యుని గురించి ఏ చరిత్రలోనూ లేదని

సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహసమెట్టిది?
ప్రభు వెక్కిన పల్లకి కాదోయ్

అది మోసిన బోయి లెవ్వరు? అని సామాన్యుల పక్షాల గళమెత్తిన గొప్పకవి శ్రీ శ్రీ గారు.

కోరికలు ఎందుకని 'దేని కొరకు' కవితా ఖండికలో

వేళకాని వేళలలో..... లేని పోని వాంఛనలతో
దారికాని దారులలో, కానరాని కాంక్షలతో
దేని కొరకు పదే పదే దేవులాడుతావ్?

ఆకటితో, అలసటతో! ప్రాకులాడుతావ్ అని శాశ్వతం అని ఈ ఖండికలో వివరించాడు.

మానవత్వం గురించి 'మానవుడా' ఖండికలో సమాజంలో మ్రగ్గిపోతున్న ప్రజానికాన్ని ధైర్యంగా ముందుకు వెళ్ళి వాటిని ఎదిరించి పోరాడి సాధించు కోవాలని "జగన్నాథుని రథచక్రాలు" వస్తున్నాయొస్తున్నాయి జగన్నాథ, జగన్నాథ జగన్నాథ రథ చక్రాలు! అని చక్కగా వివరించాడు.

ముగింపు :

మహా ప్రస్థానంలో ఉన్న కవితా ఖండికల్లో ప్రతి గేయం సమాజంలోని ప్రస్తుత సామాజిక పరిస్థితులను, నిరుద్యోగ, కర్షక, కార్మిక జీవత స్థితిగతులకు అద్దం పట్టే విధంగా శ్రీ శ్రీ చిత్రించినట్లు మరో ఏ కవి చిత్రించలేదని చెప్పవచ్చు. అందుకే "మహాకవి" పేరు అతనికి సార్థక మవుతుందని చెప్పవచ్చు.

❖❖❖

మహా ప్రస్థానం - ఒక పరిశీలన

- డా॥. బి. వెంకటయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు, యం.వీ.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఏ), మహబూబ్‌నగర్.

శ్రీశ్రీ మహాప్రస్థానం కవితలు రాసే నాటికి అభ్యుదయ కవి. ఆకలి దశాబ్దం పరిణామాలు, లండన్ ప్రొగ్రెసివ్ రైటర్స్ మేనిఫెస్టో చదవడం, వ్యక్తిగతంగా టైఫాయిడ్ రోగం పీడించడం ఈ పరిణామాల వల్ల వ్యక్తిగత కవిత్వం రాసే స్థాయి నుండి సామాజిక కవిత్వం రాసే దశకు మరలడం జరిగింది.

మార్క్సిస్టు స్పృహతో సమాజాన్ని పరిశీలించాడు. ఎగుడుదిగుడు సమాజం సమానత్వంతో ప్రకాశించాలనీ ఆశించాడు. ఈ ప్రపంచం మరో ప్రపంచంగా మారాలనుకున్నాడు. దీని కోసమే కవిత్వంలో మహా ప్రస్థానం సాగించాడు.

"కావున లోకపు టన్యాయాలూ
కాల్చే ఆకలి, కూల్చే వేదన
దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ
పరిష్కరించే బహిష్కరించే
బాటలు తీస్తూ పాటలు వ్రాస్తూ" అంటూ

సమతా స్వప్నం కవిత్వంలో పలికించాడు. ఈ సమాజాన్ని, ప్రపంచాన్ని సమానత్వం వైపుకు నడిపించకుండా ఈ ప్రపంచమే 'మాయ' అనే భావజాలం అడుగడుగున అడ్డు తగులుతుందన్న విషయాన్ని ఇలా విశ్లేషించారు.

"జమీందారు రోల్కుకారు
మాయంటావూ? బాబూ
ఏమంటావు?
మహారాజు మనిపర్సు
మాయంటావూ? స్వామీ
ఏమంటావు?
పాలికాపు నుదుటి చెమట
కూలివాని గుండె చెరువు
బిచ్చగాని కడుపు కరువు
మాయంటావు?

కూలీ, రైతుల చెమటతో ధనవంతులై కార్లల్లో తిరిగే సామాజిక వాస్తవం కళ్లముందుండగా ఇదంతా మాయ అంటూ శ్రామికుల దృష్టిని వాస్తవం నుండి పక్కకు మళ్లించడం దోపిడీ వర్గం చేస్తుందనీ శ్రీశ్రీ చెప్పారు. కర్మ, ఆచారం మొదలైన భావజాలపు సంకెళ్లతో శ్రమజీవులను బంధించలేనప్పుడు హింస, దౌర్జన్యాలకు కూడా పీడక వర్గం తెగబడుతుందనీ మహాప్రస్థానంలో శ్రీశ్రీ తేల్చేశారు.

బ్రతుకు మారేదాకా కూలీలకు, కార్మికులకు, చిన్న రైతులకు జీవితంలో సమస్యలే, సంఘర్షణలే. తిరుగుబాటు లేకపోతే వాళ్లకు జరుగుబాటు కాదని చెప్పారు.

"అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం"

"ఇంత వరకూ జరిగిన మానవ జాతి చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే" అనీ మార్క్స్, ఎంగెల్స్‌లు "కమ్యూనిస్టు మెనిఫెస్టో"లో విశ్లేషించిన దాన్ని తన మార్క్సిస్టు దృక్పథంగా చేసుకున్నాడు.

"నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం
బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు
నరహంతలు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి" - అంటూ

చరిత్రలో ఉన్న వాళ్లు లేని వాళ్ళను దోచుకోవడం, అణచివేయడం ఎలా జరిగిందో తెలిపారు. ఈ దోపిడీ ఎల్లకాలం కొనసాగదనీ శ్రామిక సమతా సమాజం తప్పదనీ శాస్త్రీయ సత్యాన్ని కవిత్వంలో క్రింది విధంగా పలికించాడు.

"చిరకాలం జరిగిన మోసం
బలవంతుల దౌర్జన్యాలూ
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా? ఇకపై చెల్లవు"

కవికి వర్గ దృక్పథం ఉండాలనీ శ్రీశ్రీ బలంగా నమ్మాడు. పీడితవర్గం వైపు నిలబడి దోపిడీ వర్గాన్ని బలంగా ద్వేషించాలన్నాడు. సమస్త సంపదలకు సృష్టికర్త లైన శ్రామిక ప్రజల తరపున నిలబడడమే కవికి లక్ష్యంగా ఉండాలన్నాడు.

"ఔనుమరి బూర్జువా వర్గాలన్నా
పోలీసు రాజ్యం
పూజారి రాజ్యం అన్నా
నాకు విపరీతమైన ద్వేషం"

బూర్జువా వర్గం మతం, పాలనా యంత్రాంగాన్ని, పోలీస్‌ను తనకు రక్షణ కవచంగా చేసుకుంటుంది. వీటి సహాయంతోనే దోపిడీని యథేచ్ఛగా కొనసాగిస్తుంది. అందుకే నేను విపరీతంగా ద్వేషిస్తాను అంటారు.

సంప్రదాయిక తాత్వికత దేవుడు మనిషిని సృష్టించి నట్లుగా చెబుతుంది. దీనికి భిన్నంగా శ్రీశ్రీ శాస్త్రీయ దృక్పథంతో మనిషి ప్రభవించిన విషయం చెప్పారు.

"రాశి చక్ర గతులలో
రాత్రిందివాల పరిణామాలలో
బ్రహ్మాండ గోళాల పరిభ్రమణాలలో
కల్పాంతాలకు పూర్వం కదలిక పొందిన
పరమాణు సంకల్పంలో
ప్రభవం పొందినవాడా
మానవుడా! మానవుడా!

చివరగా ఇప్పుడు ఎలాంటి కవిత్వం కవులు రాయాలో కవులకు ఒక మేనిఫెస్టోలాగా ఉండే విషయం తన కవిత్వంలో ప్రకటించాడు.

"కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేదీ
మునుముందుకు సాగించేదీ
పెనునిద్దుర వదిలించేదీ
పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి"

ఈ విధంగా శ్రీశ్రీ మహాప్రస్థానం నిండా మనిషి నూతన మనిషిగా జీవించే సమానత్వ సామాజిక పరిస్థితులు ఏర్పడాలనీ కలగన్నాడు.

❖❖❖

మహాప్రస్థానం - శ్రీశ్రీలోని సంప్రదాయ వాసనలు

- ముడకశర రాజేశ్వరి, ఫ్లాట్ నం. 102, రాజహంస గెలాక్సీ అపార్ట్‌మెంట్, రుద్రం పేట బైపాస్, అనంతపురం.

కొన్ని శతాబ్దాల పర్యంతం సాంప్రదాయాలకి తలొగ్గిన తెలుగు కవితని అభ్యుదయంవైపు మళ్ళించిన మహాకవి శ్రీశ్రీయే. తెలుగు సాహిత్య చరిత్రగతిని ఒక మలుపు తిప్పిన ఘనత శ్రీశ్రీకే దక్కుతుంది. ఆయన దేవతల్ని, దయ్యాల్ని నిరసించాడు. కుక్కపిల్ల, సబ్బుబిళ్ళ, అగ్గిపుల్ల కూడా కవితా వస్తువుగా స్వీకరించవచ్చునన్నాడు. కాని శ్రీశ్రీ హఠాత్తుగా సాంప్రదాయాల్ని తిరస్కరించిన పచ్చి తిరుగుబాటుదారు కాదని అతని రచనల్ని లోతుగా పరిశీలిస్తే తెలుస్తుంది. అతని రచనలు పండిత పామర జనాన్ని సమంగా అలరిస్తాయి. అవి ఎందరో యువ కవులకు ఒరవడి దిద్దాయి. ఇంతగా ప్రభావితం చేసే అతని కవితలు సాంప్రదాయాల్ని కాలరాచేవి మాత్రం కానేకావు. పాతదంతా పనికిరాదని సాంప్రదాయాల్ని గుడ్డిగా ఖండించడమూ మంచిది కాదు. కొత్తదంతా మేలైనదనే సమర్ధనమూ మంచిది కాదు. పూర్వ సాంప్రదాయంలోని చెడుని విడిచి, మంచిని గ్రహిస్తూనే, కొత్త పద్ధతులు నేర్పరచుకోవాలి. కొత్త పాతల మేలు కలయిక అందరికీ అనుసరణీయమవుతుంది. సాంప్రదాయాల్ని జీర్ణించుకోలేని రచనలు పేక మేడల్లా కూలిపోతాయే కాని చిరకాలం నిలదొక్కుకోలేవు.

ఇప్పటి కొంతమంది ఆధునిక కవుల్లాగా కాకుండా శ్రీశ్రీ ప్రాచీనాంధ్ర సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసినవారు. ప్రాచీన సాహిత్యపు పునాదులు లేకుండా ఆయన కవితలు లేవు కాబట్టే అవి కలకాలం మన గల్గుతున్నాయి.

పురాణ సంప్రదాయాలు, మత సంప్రదాయాలు అనే ఉత్తమ ప్రమాణాల్ని సంతరించుకున్న ప్రతిభ శ్రీశ్రీది. గతమెంచబోయి, కేవలం గతాన్నే నెమరువేస్తూ కట్టుబడిపోయిన వారి కోవకు ఈయన చెందడు. గతాన్ని త్రవ్వి, వర్తమానానికి దాన్ని అనువుగా మలచుకున్న ఆధునిక కవి ఆయన. సంప్రదాయ బలంతో సరికొత్త ప్రయోగాలు చేసి చూపెట్టాడు. ఛందస్సులో, భావనలో, శబ్ద ప్రయోగంలో, వస్తువులో శ్రీశ్రీ చేసిన నవ్య ప్రయోగాలు అసంఖ్యాకమైనవి.

మహాప్రస్థానంలోని 'అవతారం' అనే గేయంలో ప్రళయం తర్వాత వచ్చే నూత్న సృష్టిని వ్యంజింపజేశాడు. పాలకవర్గంపై పాలితులు చేసే తిరుగుబాటును సూచించడానికి 'ప్రళయానంతర' నవ్యసృష్టి అనే పురాణ సంప్రదాయాన్ని గ్రహించడాయన. ఇది అతనిపై గల సాంప్రదాయ వాసనకు ప్రతీక.

ఉదయ సూర్యుని సప్తహయములు
నురుగులెత్తే
పరుగు పెట్టాయి - అనే చరణంలో

ప్రాచీన కవి సమయాలైన 'సూర్యుని సప్తాశ్వాలు' అనే పదం కొత్త భావాన్ని స్ఫురింపచేస్తుంది. భౌతిక విజ్ఞానాన్ని విశ్వసించి, గుడ్డి నమ్మకాన్ని ఖండించిన శ్రీశ్రీ సూర్యుని ఏడు గుర్రాల్ని స్వీకరించటంలో ఒక చమత్కారముంది.

"యముని మహిషపు లోహఘంటలు
మబ్బు చాటున ఖణేల్ మన్నాయ్"

- ఈ చరణాలు తిక్కన్న గారి 'యమ మహిష ఘంటానాదాన్ని' గుర్తు చేస్తాయి. అవతార గేయఖండిక మొత్తం శ్రీశ్రీకి గల హైందవ పురాణ మర్మజ్ఞతకు సాక్షిగా ఉంది.

కనకదుర్గా చండ సింహం జూలు దులిపీ అవ
లించింది.
ఇంద్రదేవుని మదపుటేనుగు ఘీంకరిస్తూ సవాల్
చేసింది.

దుర్గాదేవి వాహనం సింహం, ఇంద్రుని వాహనం ఐరావతం అనే ఏనుగు. దుర్గాదేవి సింహంపై స్వారి చేస్తే, ఇంద్రుడు ఏనుగుపై స్వారి చేస్తాడు. ఇక్కడ పురాణ సంప్రదాయాల్నే తీసుకొని, కొత్త పద్ధతిలో మలుపు తిప్పాడు శ్రీశ్రీ. ఇంతకాలం తమ యజమానులు తమని బానిసల్ని చేసి వీపు వెక్కి స్వారి చేశారు. ఇక ఎంతకాలం మేము భరిస్తామని సింహం జూలు దులిపి ఆవులించిందంట. అంటే పెట్టుబడి దారి వ్యవస్థపై ప్రజలకు తిరుగుబాటు చేసే తలంపు వచ్చిందన్న మాట.

'నరకలోకపు జాగిలమ్ములు' గొలుసు త్రెంచుకుని ఉరికిపడ్డాయి. అనే చరణాలు గ్రీకు పురాణ సాంప్ర దాయానికి ప్రతీకలు. నరకద్వారంలో ఃజవతీఎవతీబంఃఅనే మూడుతలల కుక్క కావలి కాస్తుందంట. ఈ కుక్కల్ని ఃఎవశ్రీశ్రీష్ణశీబఅఎంఃఅంటారు. ఇవి నరకవాసుల్ని బయటికి పోనివ్వవు. నరకలోకపు జాగిలమ్ములు అని పేరు పెట్టి గ్రీకు పురాణ సాంప్రదాయాన్ని కూడా కవితలో శ్రీశ్రీ మేళవించాడు.

'జ్వాలాతోరణం' అనే గేయంలో ప్రళయానంతరం జరిగే నవ్య సృష్టిని గురించి చెబుతూ పాత వ్యవస్థ అంతరిస్తుందనడానికి

ఇదేమి లోకం హిరణ్యనేత్రుని
పదాఘాతమున ప్రతిధ్వనించగ
కురుక్షేత్రమున కృద్ధవృకోదరు
గదా ఘాతమున గజగజలాడగ అనే సంకేతాలు ప్రయోగించాడు. హిరణ్యాక్షుని పదాఘాతం, భీమసేనుని గదాఘాతం ప్రాచీన పురాణేతిహాస వ్యవస్థలో జరుగుతూ వచ్చిన కల్లోలానికి సంకేతాలని మనం గ్రహించవచ్చు.

'మరో ప్రపంచం' అనే విప్లవగేయంలో శ్రీశ్రీ ప్రాచీన సాంప్రదాయాల్ని గ్రహించాడని స్పష్టంగా తెలుస్తుంది.

'హరోం హర హర
హర! హర! హర! హర'' - అనే సైనిక నినాదాల శివాజీ సైన్యంలోని హరహరమహదేవ అనే నినాదాల్ని గుర్తు చేస్తాయి.

ధనంజయునిలా సాగండి
కనబడలేదా మరో ప్రపంచపు
కణకణమండే త్రేతాగ్ని ?
కనబడలేదా మరో ప్రపంచపు
అగ్ని కిరీటపు ధగధగలు
ఎర్రని బావుటా నిగ నిగలు
హోమ జ్వాలల భుగ భుగలు ?

- ఇందులో త్రేతాగ్ని, హోమజ్వాలలు అనే పదాలు అచ్చంగా వైదికసాంప్రదాయానికి సంకేతాలు. ఇవి సరికొత్త చైతన్యాన్ని స్ఫురింపజేస్తాయి. 'అగ్ని కిరీటంలో' కిరీట శబ్దం ప్రభూత్వానికి సంకేతం. నూతన ప్రభుత్వం రాజుల్ది కాదు, రైతుల్ది- కూలోల్ది. అందుకే రత్న కిరీటమనకుండా 'అగ్ని కిరీటంగా' పదాన్ని మార్చాడు శ్రీశ్రీ. అగ్ని శ్రామిక విప్లవానికి గుర్తు. ఇలా సంప్రదాయపు పదం నుంచే ఒక వినూత్న పదాన్ని తద్వారా భావాన్ని ఆవిష్కరిస్తాడు శ్రీశ్రీ.

అంతే కాదు - 'ధనంజయునిలా సాగండి' అని సూచించాడు. ధనంజయుడు అంటే అర్జునుడని అర్థం. రాజసూయయాగ సందర్భంలో నలుదిక్కులకేగి రాజులను జయించి, ధనకనక వస్తు వాహనాల్ని కొల్లగొట్టి కుప్పపోసిన 'విజయుడు' ధనంజయ శబ్దంలో ప్రతిధ్వనిస్తాడు.

జయభేరిలో
నేను సైతం, ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను.

అనే చరణాలు వైదిక సంప్రదాయాలు జీర్ణించు కున్నవి. అనంతమైన ఈ సామాజిక చైతన్యానికి తాను కూడా ప్రతినిధినని కవి చెప్పాడు. ప్రపంచమనే హోమాగ్నిలో తానొక సమిధనని చెప్పటంలో గొప్ప భావం ఉంది.

'కవితా! ఓ కవితా! అనే గేయంలో మతపరమైన సంప్రదాయాల్ని స్ఫురిస్తాయి.

నా నుడుల తీగలపై సాగిన
నాదబ్రహ్మపు పరిచుంబనలో,

ప్రాణావసాన వేళాజనితం,
నానాగానానూనస్వానావళితం,
బ్రతుకును ప్రచండ భేరుండ గరు
త్పరిరంభంలో పట్టిన గానం,
సుఖదుఃఖాదిక ద్వంద్వాతీతం
అమోఘం, అగాధం, అచింత్యమ్, అమేయమ్,
ఏకాంతం, ఏకైకమ్,
క్షణికమైన శాశ్వతమైన దివ్యానుభవం
బ్రహ్మానుభవం కలిగించిన
నను కరిగించిన కవనఘ్నుణీ
రమణీ - కవితా ఓ కవితా !

ఈ మొత్తం చరణాలలో ఈ పదాలు యోగ సాంప్ర దాయాలు జీర్ణించుకున్నావారికి మాత్రమే అర్థమవుతాయి. ఇది -

చైతన్యం శాశ్వతం శాంతం
వ్యోమాతీతం నిరంజనం
నాదబిందు కళాతీతమ్
తస్మై శ్రీ గురవే నమః - అనే శ్లోకంలోని పదాల లాగా శ్రీశ్రీ వ్రాసిన చరణాల్లోని పదాలు ఉన్నాయి.

బ్రహ్మానందం పరమ సుఖదం,
కేవలం జ్ఞానమూర్తిమ్,
ద్వంద్వాతీతమ్ గగనసదృశమ్ - అన్న శ్లోకంలో లాగా శ్రీశ్రీ సుఖదుఃఖాదిక ద్వంద్వాతీతమ్ - అన్నాడు.

'బాటసారి' అనే గేయంలో

అతని బ్రతుకున కదే ఆఖరు
గ్రుడ్డి చీకటిలోను గూబలు
ఘీకరించాయి .
.....
వేగుజామును తెలియజేస్తూ
కోడి కూసింది
వీడిన మబ్బుల నడుమ నుండి
వేగు జుక్క వెక్కిరించింది.
బాటసారి కళేబరంతో
శీతవాయువు ఆడుకుంటోంది.
పల్లెటూళ్ళో తల్లికేదో
పాడు కలలో పేగు కదిలింది.

ఈ చరణాల్లో తర తరాలనుండి హైందవ సమాజ ప్రచారంలో ఉన్న విశ్వాసం ఉద్ధీపమైంది. 'అద్వైతం' అనే గేయంలో ఆంధ్ర ప్రబంధ కవితా సాంప్రదాయాన్ని జీర్ణించుకున్న కవితారీతి కనబడుతోంది.

నీ మోవికి కావిని నేనై
నా భావికి దేవివి నీవై
నీ కంకణ నిక్వాణంలో
నా జీవన నిర్వాణంలో
అనందం అర్ణవమైతే
అనురాగం అంబరమైతే
ప్రపంచమును పరిహసిస్తాం,
భవిష్యమును పరిపాలిస్తాం.

పేదలు అనే ఖండికలో పేదల కన్నుల్ని శ్రీశ్రీ గోమాతల కన్నుల తమ్ములు అని పోల్చాడు. గోమాత అనే పదం హైందవాచారాన్ని మేళవించుకొంది.

అంతేలే పేదల కన్నులు
వినమ్రములు, వెతల వ్రణమ్ములు
తుఫానులో తడిసిన, జడిసిన
గోమాతల కన్నుల తమ్ములు !

'ఆకాశదీపం' అనే గేయంలో ఒక గదిలో సాయంకాలం ఆరిపోయిన దీపాన్ని గురించి శ్రీశ్రీ అంటాడు.

ఆకాశతార ఆహ్వాన గానం చేసింది
దీపం ఆరిపోయింది
తారగా మారిపోయింది.

కాంతి పంచభూతాలలో లీనమవుతుందనే సాంప్ర దాయం ఈ చరణంలో ధ్వనిస్తుంది. అంతే గాక ఆ గదిలో నిస్సహాయంగా, నిర్భాగ్యంగా మరణించిన ఒక దురదృష్ట జీవుని అంతరాత్మ పంచభూతాల్లో కలిసిపోయిందనే భావం కూడా ఇక్కడ కనిపిస్తుంది.

''జగన్నాథ రథచక్రాలు'' అనే గేయ నామమే సాంప్రదాయ ప్రతీక. జగన్నాథుని రథం 'పూరి' క్షేత్రంలోని ఒక రథం. ఇది వాచ్యార్థం. దీని వెనుక సాంప్రదాయ బద్ధమైన వ్యగ్యార్థముంది. ఆదర్శ సమాజంలోని మానవ సమిష్టికి అంతరాత్మ సదృశమైన వాహనం జగన్నాథుని యాత్రా రథం. ''ఐక్యత స్వాధీనత, జ్ఞానం, శక్తి'' అనేవి నాల్గు ఆ రథానికి నాల్గు చక్రాలు అని అరవిందుల భావన. శ్రీశ్రీ గేయంలోని జగన్నాథ రథం కూడా అరవిందుల వారు ఊహించిన ఆదర్శ సమాజానికే సంకేతం. అరవిందుడు దాన్ని ఆధ్యాత్మిక దృష్టితో సమన్వయించాడు. శ్రీశ్రీ భౌతిక దృష్టితో సమన్వయ మయ్యేటట్లు రచియించాడు. కవి దృష్టిలో ద్రష్ట, కర్తలు శ్రామికుని, మానవ ప్రయత్నం వల్లనే జగన్నాథ రథం నేలకి దిగుతుంది.

వచ్చేశాయ్ వచ్చేశాయ్
జగన్నాథ జగన్నాథ

జగన్నాథ రథ చక్రాల్ - ఈ విధంగా సాంప్రదాయ సిద్ధమైన జగన్నాథ రథచక్రాన్ని కవితా వస్తువుగా స్వీకరించి మార్క్సిస్టు దృక్పథంతో సమన్వయించటంవల్ల ఆయన కవితలో కొత్త పాతల మేలు కలయిక స్ఫురిస్తోంది.

శ్రీశ్రీకి విదేశీయ సాహిత్య సాంప్రదాయాల్లో కూడా చక్కని పరిచయముంది. ఆయన ఫ్రెంచి, ఇంగ్లీష్ కావ్యాలు లోతుగా అధ్యయనం చేశాడు. ఆ సాహిత్యాల్లోని సంప్రాదాయాల్ని కూడా అనుకరించాడు. ముఖ్యంగా 'పేదలు' అనే గేయం ఫ్రెంచిగీతికి, అద్వైతం అనే గేయం స్వైన్‌బర్న్ వ్రాసిన ' ఏ మ్యాచ్' కి అనుసరణలు.

-ఇలా ప్రాచ్య పాశ్చాత్య కవితా సాంప్రదాయాలచేత ప్రభావితుడై శ్రీశ్రీ తన విప్లవ గేయాల్ని అభ్యుదయ మార్గంలో పరుగులెత్తిస్తూ సంప్రదాయ విధేయతని చాటుకున్నాడు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ శ్రీ కంద పద్య రచనా చమత్కృతి

– డా॥. రొంఖట్ల వేంకటరెయ శర్మ, పద్యకవి, రచయిత, నాటకకర్త, జ్యోతిశ్శాస్త్రవేత్త, విశాఖపట్నం.

కందం రాసిన వాడే కవి, పందిని (ముళ్ళ పంది/ అడవి పంది) ని బొడిచిన వాడే బంటు అని అంటారు. పద్య కవిత్వం పరిచయం ఉన్న వాళ్లందరికీ కంద పద్యం గురించి సుపరిచితమే. పద్యాలు రాయడం ప్రారంభ దశలో ఉన్నవారు కందపద్యం కూడా రాయడానికి ఉత్సాహాన్ని చూపిస్తుంటారు. ఇక మహాకవుల గురించి చెప్పనవసరం లేదు. సంస్కృతంలోని ఆర్యాకు తెలుగులో కందం దగ్గరగా ఉంటుంది.స్కంధం అనే పదం నుండి కందం వచ్చిందనీ పరశోధనల వలన తెలుస్తోంది.

వరాహమిహిరుడు క్రీస్తు శకం అఱువ శతాబ్దంలో జీవించాడు. ఇతడు చంద్రగుప్త విక్రమాదిత్యుడి నవరత్నాలలో ఒకరు అని అంటారు. ఇతడు ఒక గొప్ప గణితశాస్త్రజ్ఞుడు, ఖగోళశాస్త్రజ్ఞుడు, జ్యోతిషంలో దిట్ట. ఇతడు పాంచసిద్ధాంతిక, బృహజ్జాతకం, బృహత్సంహిత అనే పుస్తకాలను రాసాడు. అందులో బృహత్సంహితలో 103వ అధ్యాయాన్ని గ్రహగోచరం అంటారు. ఇందులోని పద్యాలు వేఱువేఱు ఛందస్సులలో ఆ పద్యాల పేరులతో (ముద్రాలంకారం) రాయబడ్డాయి. అందులో ఆర్యాగీతి స్కంధకాలు ఒకటే అని తెలిపిన పద్యాన్ని క్రింద చదువ వచ్చును.

సూర్య సుతోర్క ఫలసమ
శ్చంద్రసుత శ్చందతః సమనుయాతి యథా
స్కంధక మార్యాగీతి
ర్వైతాలీయం చ మాగధీ గాథార్యాం.

(వరాహమిహిరుడి బృహత్సంహిత, 103-54)

సూర్యుడి లాగానే అతని సుతుడైన శని కూడా సమంగా ఫలాలను ఇస్తాడు. అదెలాగంటే ప్రాకృతంలో స్కంధకం సంస్కృతంలో ఆర్యాగీతి అయినట్లు, ప్రాకృతంలో మాగధి సంస్కృతంలో వైతాళీయం ఐనట్లు, ప్రాకృతంలో గాథా సంస్కృతంలో ఆర్యా ఐనట్లు. పోతే చంద్రసుతుడైన బుధుడు శుభ గ్రహాలతో ఉంటే శుభ ఫలాన్ని, అశభ గ్రహాలతో ఉంటే అశుభ ఫలాలను ఇస్తాడు.

కందం తెలుగువారికి ఇంచుమించు 1100 సంవత్సరాల నుండి పరిచయం. తెలుగులో ఆదికవి నన్నయ్యకు సుమారు వంద సంవత్సరాలకు ముందే క్రీ.శ. 945 నాటి జినవల్లభుడి శాసనంలో మూడు కంద పద్యాలు తెలుగులో ఉన్నాయి. ఇవే తెలుగులో మనకు తెలిసిన అతి ప్రాచీన కంద పద్యాలు.అందులో ఇది ఒకటి.

జిన భవనము లెత్తించుట
జిన పూజల్సేయుచున్కి జిన మునులకు న
త్తిన యన్న దానం బీవుట
జినవల్లభు బోల గలరె జిన ధర్మపరుల్

తెలుగు పద్యాలలో అత్యంత అందమైన పద్యంగా కందాన్ని పేర్కొంటారు. ఈ పద్యపు లక్షణాలు చూడటానికి కష్టంగా కనిపించినా ఇందులోని గణాలన్నీ నాలుగు మాత్రల గణాలు కావడం వలన, ఈ పద్యం నడక సులువుగా పట్టుబడుతుంది. సుమతీ శతకంలోని పద్యాలన్నీ కందపద్యాలే.

కందము త్రిశర గణంబుల
నందును గాభజసనలము-లైదునె గణముల్
పొందును నాఱిట నలజము
లొందుం దుది గురువు జగణ మొప్పదు బేసిన్.

(కవిజనాశ్రయము, 6)

ఈ పద్యంలో చెప్పిన కంద పద్య లక్షణాలు నియమాలు ఇవి.

1. ఈ పద్యానికి చతుర్మాత్ర గణాలు మాత్రమే వాడాలి.
2. 1, 3 పాదాలలో మూడేసి గణాలూ..2, 4 పాదాలలో ఐదేసి గణాలు ఉంటాయి.

3. అంటే 1, 2 పాదాలలో 8 గణాలు, 3, 4 పాదాలలో 8 గణాలూ ఉంటాయి.
4. 2 పాదాలను ఒక "సెట్టు" గా (అంటే మొదటి 2 పాదాలలో ఉన్న 8 గణాలూ) భావించాలి.
5. 1, 3, 5, 7 గణాలలో "జగణం" ఉండరాదు.
6. 6 వ గణంలో తప్పనిసరిగా "జగణం" లేక "నలము" ఉండాలి.
7. 8 వ గణంలో చివర తప్పనిసరిగా గురువు ఉండాలి.
8. మొదటి పాదం గురువు తో మొదలైతే, అన్ని పాదాలూ గురువు తో, మొదటిపాదం లఘువు తో మొదలైతే, అన్ని పాదాలూ లఘువు తో మొదలవ్వాలి.
9. 2,4 పాదాలలో యతి మైత్రి ఉంది. ఈ పాదాలలో, మొదటి గణం మొదటి అక్షరానికీ.. నాల్గవ గణం మొదటి అక్షరానికీ యతి.
10. ప్రాస నియమము ఉంటుంది.

ఇన్ని నియమాలు ఉన్నాయి కనుకనే కందపద్యం రాయడం కష్టమని కొందరి అభిప్రాయం. అయితే ప్రాచీనాంధ్ర కవుల నుండి ఆధునికాంధ్ర కవుల వరకు మహా కవులందరూ కంద పద్యాన్ని అందంగా అందించారు. కంద పద్యం లో వాడే గణాలను బట్టి కందాన్ని చాలా రకాలుగా రాయవచ్చు. లాక్షణికులు కందంలోని రకాలను ఇలా పేర్కొన్నారు.

పొత్తపి వేంకటకవి లక్షణశిరోమణిలో కందభేదాలను ఇలా వర్గీకరించాడు, అవి (1) సమకందం, (2) విషమ కందం, (3) ఆర్యా కందం, (4) కుఱుచ కందం, (5) నిడుద కందం, (6) ద్వివిధ కందం, (7) చతుర్విధ కందం, (8) నల చతుష్కందం, (9) జ-గణ చతుష్కందం, (10) వృత్తగర్భిత కందం, (11) భాస్కరవిలసిత కందద్వయం, (12) క్రౌంచపద కందద్వయం, (13) మణిగణనికర కందం, (14) ప్రమితాక్షర కందం.

కంద పద్యానికి ఉన్న ప్రాధాన్యం ఇది. మహాకవి శ్రీశ్రీ (1910-1983) సిప్రాలిలో కంద పద్య రచనలో చూపించిన చమత్కృతి ని ఈ పరిశోధన పత్రంలో పరిచయం చేసి వివరిస్తున్నాను.

సిరిసిరిమువ్వాలోని పద్యాలు దశలవారీగా పత్రికల్లో ముద్రించబడ్డాయి. మొదటి దశ అనే పద్యాలు 1945 సెప్టెంబర్లో ఆంధ్రజ్యోతిలో మొదటిసారిగా ముద్రించ బడ్డాయి. ఆ తరువాత శ్రీశ్రీ సాహిత్య సంపుటాలు 1970 లోను పునర్ముద్రించగా, 1981లో సిప్రాలి పుస్తక రూపంలో వచ్చింది. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీ అయినట్టే, సిరిసిరిమువ్వ పద్యాలు, ప్రాస క్రీడలు లిమబుక్కులు సిప్రాలి అయ్యింది. రుక్కుటేశ్వర శతకం పంచపదులు కూడా ఇందులో ఉన్నాయి. ఇందులో సిరిసిరిమువ్వా శతకంలోను, రుక్కుటేశ్వర శతకంలోను కంద పద్యాలున్నాయి.

శ్రీశ్రీ అంతకు ముందు ఎప్పుడూ కందపద్యాలు రాయలేదు. 'ప్రభవ' పద్యాల్లో గాని, స్వర్గదేవతలు పద్యాల్లో గాని కంద పద్యం లేదు. దాదాపు దశాబ్దం తర్వాత మళ్లీ పద్యాలు జోలికి వెళ్లారు.

మళ్ళీ ఇన్నాళ్ళకి ఇ
న్నేళ్ళకి పద్యాలు రాయుటిది ఎట్లన్నన్
పళ్ళూడిన ముసలిది, కు
చ్చెళ్ళున్ సవరించినట్టు సిరిసిరిమువ్వా !

కేవలం కందాల అందాల కోసమే తాను రాస్తున్నట్టు చెప్పాడు. పైగా ఈ శతకంలో పాత వాసనలు పోలేదు. అలనాడు తిక్కనకు హరిహరనాథులు కలలోకి వచ్చినట్టు ఈనాడు తనకి చక్రపాణి కలలో కనిపించినట్టు రాశాడు శ్రీశ్రీ. ఇకపోతే రుక్కుటేశ్వరశతకంలో జలసూత్రం గురించి, కొంత ప్రైవేటు పాయట్రి కూడా వుంది. ఈ శతకాలలో అటు శబ్ద చమత్కారం, ఇటు అర్థ వైచిత్రి పండెం వేసుకు పరుగెడతాయి. ఇది కొత్త ప్రయోగం కాదు. పోనీ ప్రయోజనం సంగతి చూద్దామంటే అదీ అంతంత మాత్రమే.

ఈ శతకాల రచనాకాలం 1945-50. ఈ కంద పద్యాలలో ఉన్న భాషా చమత్కృతి, ప్రాసల్లోనూ, యతుల్లో చూపించిన చమత్కృతి ఈ విధంగా ఉన్నాయి.

శ్రీశ్రీ కందాలలో భాషా చమత్కృతి :

పద్యం రాయడం అనగానే వ్యవహారిక భాషను కొంచెం పక్కన పెట్టి, గ్రాంథిక పదాలను ఉపయోగించి కొంత మంది పద్యాలను రాస్తారు. శ్రీశ్రీ అందుకు భిన్నంగా, శుద్ధ వ్యవహారిక పదాలతో కంద పద్యాలను అందంగా అందించారు. ఈ భాషలో కొన్ని వ్యవహారిక పదాలు అయితే, మరికొన్ని గ్రాంథిక సమాస భూయిష్టమైనవి కూడా రాశారు. మణిప్రవాళ శైలిలో రాసిన పద్యాలు ఉన్నాయి. ఈ మణిప్రవాళ శైలిలో ఎక్కువగా ఆంగ్ల పదాలను కూడా వాడారు.

అందంగా మధురస ని
ష్యందంగా పఠితృ హృదయ సంస్పందంగా
కందాలొక వంద రచిం
చిందికి మనస్సయ్యె నాకు సిరిసిరిమువ్వా!

ఇది సిరిసిరిమువ్వ లోని మొదటి పద్యం. అందంగా నిష్యందంగా పఠితుల హృదయం స్పందించే టట్లుగా కంద పద్యాలు ఒక వంద రచించడానికి మనసు అయిం దని స్పష్టంగా చెప్పారు. ఇందులో భాష సరళ సుందరం. ఆ తర్వాత నాలుగో పద్యంలో కందపద్య ప్రశస్తి చెబుతూ పంది ని చంపిన వాడే కందం రాయాలటన్న కవి సూక్తికి నా చందా యిస్తానా? రాసేందుకయో షరుతులెందు కంటూ వాపోతాడు.

కందం తిక్కన గారిది
కుందవరపు వారి ముద్దు కుర్రని దంతే
అందరి తరమా కందపు
చిందుల కిటుకుల్ గ్రహింప సిరిసిరిమువ్వా!

మహాభారతాన్ని తెనిగించిన కవిత్రయంలో రెండవ వాడు తిక్కన. (13వ శతాబ్దం) విరాట పర్వం మొదలు నుండి 15 పర్వాలను అనువదించాడు. కంద పద్యం నడిపించటంలో నేర్పరి. నాటకీయతకు తెలుగు పదాలకు పెట్టింది పేరు. ఒకానొక సందర్భంలో శ్రీ శ్రీ తన దృష్టిలో కవిత్రయమంటే తిక్కన వేమన గురజాడ అని చెప్పాడు. తిక్కన కవి కంద పద్యానికి శ్రీశ్రీ అంతటి అభిమాని.

కవిత్రయ భారతంలో మొత్తం కంద పద్యాలు 7034. ఇందులో తిక్కన గారి కంద పద్యాలు 5394. ఇన్ని వేల పద్యాలను ఎంత హృద్యంగా అందించినందుకే శ్రీశ్రీ తిక్కనకు కవిత్రయంలో చోటుకల్పించారు.

వాగ్నేతవు నీవె (వాగ్ఞ్యనత లేల) మహా
గ్రాగ్ఞ్య ర్వీధరము నీవె అమృత హిమానీ
రుగ్ఞ్య గ్రోధము నీవె అ
సృగ్ఞ్య త్యగురుండ నీవె సిరిసిరి సుకవీ!

ఈ పద్యం మొత్తం సంస్కృత పదభూయిష్టం. ఇందులో ప్రాస కూడా దుష్కర ప్రాస. అంటే కష్టమైన ప్రాస. అది కూడా ఎంతో చక్కగా పరిగెత్తించిన పద్యం. ఇది సంస్కృత భాష చమత్కృతికి ఉదాహరణ. సంస్కృత పద సమాసాలతో చెప్పిన పద్యాలు ఇంకో రెండు ఉన్నాయి. అలాగే మణిప్రవాళానికి ఉదాహరణగా చాలా పద్యాలు ఉన్నాయి అందులో ఒకటి ఇదిగో.

హిప్పోపొటామసొక్క బి
షప్పును గని యడిగెనిట్టు స్వామీ ! మీరె
ల్లప్పుడు చెప్పిందాన్నే
చెప్పడమెంచేత? ననుచు సిరిసిరి మువ్వా!

ఇందులో ఉన్న మొదటి రెండు పాదాలలోనూ ప్రారంభంలో వాడినవి ఇంగ్లీష్ పదాలు. హిప్పోపొటామస్ అంటే నీటి ఏనుగు. పెద్ద జంతువు అతి పెద్ద నోరు కలదు. నేలమీద నీటి లోనూ కూడా బ్రతకుతుంది. ఇంగ్లీషు పదాలైనా సిగరెట్టు, హిప్పోపొటామస్, బిషప్.. ఇమిటేషన్, కాంగ్రెస్, బారెట్ లా.. ట్రాములు, గోల్డ్ మైల్డ్, చైల్డ్ ఓల్డ్.. ఆంగ్రేజీ, అలాంటి పదాలను కంద పద్యాలలో ఇమిడ్చాడు శ్రీ శ్రీ.

కంద పద్యాలలో ఏకాక్షర, (ఒకే అక్షరంతో మొత్తం పద్యం), ద్వ్యక్షర (రెండు అక్షరాలతో మొత్తం కందపద్యాన్ని

చెప్పడం) త్ర్యక్షర కందం(మూడు అక్షరాలతో కంద పద్యం చెప్పడం) అనేవి తెలుగు సాహిత్యంలో ఉన్నాయి. ఇందులో మ న స అనే మూడు అక్షరాల తోనూ చాటువుల్లో ఒక పద్యం చెప్పాడు శ్రీశ్రీ. దీన్ని త్రక్షరి అని అంటారు.

మనసాని నిసిన సీమా
మనసా మసిమనిసి మనసు మాసిన సీనా
సినిమానస మాసనమా
సినిమానిసి సీమసాని సిరిసిరిమువ్వా!

కేవలం కొన్ని పదాలతో రాసిన కందం ఇది. 1. మనసు 2. సాని 3. నిసి, 4. సీమ 5. మసీ 6. సీను, 7. సినిమా, 8. ఆసనము అనే పదాలు ఉన్నాయి. నంది తిమ్మన పారిజాతాపహరణంలో రాసిన "మనమే మన మని" అనే పద్యం రెండు అక్షరాలతో రాసిన పద్యం.

అప్పిచ్చువాడు వైద్యుడు అనే సుమతి శతక పద్యానికి పేరడీగా రాసినట్లు ఉండే ఒక పద్యం "ఎప్పుడు పడితే అప్పుడు కప్పెడు కాఫీ నొసంగ గలిగిన సుజనల్, చొప్పడిన యూరనుండుము చొప్పడకున్నట్టి యూరు చొరకుము మువ్వా అని అంటాడు. అలాగే కోయకుమీ కను గాయలు అనేదానికి కోయకు మీ సొరకాయలు, అంటాడు.

సిరిసిరిమువ్వ శతకంలో కాకుండా కుమ్మరి మొల్ల చిత్రంలో అష్టావధానాలలోని దత్తపదిలా ఒక పద్యం కూడా శ్రీశ్రీ రాశాడు. ఇందులోని పదాలు అప్పు, నిప్పు, మెప్పు, చెప్పు, కాని ఈ పదాలకు ఈ అర్థాలు ఉండవీ పద్యంలో. ఆ పద్యం-

అప్పుడు మిథిలకు జని నే
నిప్పుడు కావించు వింత నిచ్చటి ప్రజ తా
మెప్పుడును కాంచబోరని
చెప్పుచు రాఘవుడు విడిచె శివకార్ముకమున్

ఇవి శ్రీ శ్రీ కంద పద్యాలు లోని కొన్ని భాషా చమత్కృతులు.

శ్రీశ్రీ కందపద్యం - యతిప్రాసల చమత్కృతి :

శ్రీశ్రీకి మాత్రా చ్ఛందస్సులమీద ఎంత మక్కువ, పట్టు ఉన్నాయో మనకు ప్రాసక్రీడలు చెబుతాయి. "ఛందస్సులు మూడు తెగలు. సాగదీయడానికి వీలు లేనివి, కొంతవరకు సాగేవి, elastic metres బాగా సాగగలవి. అంటే rigid, semi-elastic and నా ఉద్దేశంలో వృత్తాలు (గణబద్ధ ఛందస్సులు) మొదటి రకానికీ, గీతసీసాదులు రెండోరకానికీ, మాత్రాచ్ఛందస్సులు మూడో తరగతికి చెందుతాయి.అందువల్లనే మాత్రాచ్ఛందస్సులు స్వాభావికములని సూచించాను" అంటాడు శ్రీశ్రీ.

పద్యంలో రెండో అక్షరాన్ని ప్రాస అంటారు. కంద పద్యానికి ప్రాస నియమం ఉంటుంది. అలాగే మొదటి అక్షరానికీ నాల్గవ గణం మొదటి అక్షరానికి యతి. తెలుగులో యతి ప్రాసలు పద్యాలకు అలంకారాలని ఇలా చెప్పాడు.

భాషకొక స్థాయినిచ్చే
ప్రాసలు యతులలంకృతులు వ్యాకృతులయ్యో
పైసొగసు పూతకైతే
చేసేదేమున్నదింక! సిరిసిరిమువ్వా!

ఈ పద్యంలో మొదటి పాదంలో భాష అనే పదానికి తరువాతి మూడు పాదాలలో ప్రాస, పై సొగసు, చేసేది అనే పదాలలోని స తో ప్రాస వేశాడు. ఈ ప్రాసను శ,ష,స ప్రాస అని అంటారు. ప్రాసాక్షరం లో ఏ హల్లు ఉంటే, అదే హల్లు ను అని పాదాల్లోనూ వేయడం పద్ధతి. అప్పకవి 17 రకాల ప్రాసులను చెప్పాడు. ఇందులో పైన చెప్పిన శ, ష, స ప్రాస ఒకటి. శ, సలకు, ళ, ల కు శ్రీ శ్రీ స్వేచ్ఛగా ప్రాసను పాటించాడు.

బిందు పూర్వక అక్షరాలతో ప్రాసలను అందంగా పాటించాడు శ్రీశ్రీ. మొదటి పద్యమే అందంగా, నిష్యందంగా, కందాలు, చిందికి అనే పదాలను ఉప యోగించాడు. అలాగే ఏం లాభం గడ్డం లా దేశంలో ముస్లిం లీగ్ ఇలాంటి పదాలలోని బిందుపూర్వక లకారాన్ని

క్లాసులో వాడుకున్నాడు. బిందు పూర్వక పదాలైనా జంఘాల, సంఘాల, ఉల్లంఘన మేస్త్రీం ఘన.. పదాలను ఎంతో చక్కగా ఉపయోగించాడు. కాంగ్రెస్ గురించి చెప్పాల్సిన మరో పద్యం లో సంగ్రామ సింహమై, కాంగ్రెస్, వెంటం గ్రామ, నడ చెం గ్రుడ్డిగా అనే పదాలను బిందు పూర్వక రేఫ యుక్త గ కార ప్రాసతో వైవిధ్యంగా చెప్పాడు. అంతా సురాఘటేశులె అనే పద్యం బిందుపూర్వక తకార ప్రాస. ఇంతెందుకు అనే పద్యంలో కూడా ఇదే కనిపిస్తుంది.

బిందు పూర్వక గకార ప్రాస అయిన సంగీతము బంగాళాఖాతము చెంగావి వంటి పదాలతో రెండు పద్యాలు రాశాడు.

బండెడు చెత్తను ఛంద
శ్చండముగా పోగుచేసి స్వారస్యము చూ
డండని రంకెలు వేస్తే
చండాడెద నట్టివారి సిరిసిరిమువ్వా!

కుకవి నింద అనే శీర్షికతో చెప్పిన పద్యాలలో బిందు పూర్వక డకార ప్రాసతో ఉన్న పద్యం ఇది. బిందు పూర్వక హకార ప్రాస చాలా కష్టమైంది. కానీ దీన్ని ఎంతో ఇష్టంగా మార్చేసాడు శ్రీశ్రీ. సింహాలకు zoo లుండును, సంహారము సృష్టి యగును సామాన్యముగా అంహస్సే యౌను పుణ్యము, some how మన కవనమిట్లు స్రవియించు జరూ! అనే పద్యంలో సం హౌ అనే ఇంగ్లీషు మాటను ప్రాసలోకి తీసుకువచ్చాడు. ఇది రుక్కుటేశ్వర శతకంలోది. జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి (1914-1968) గారిని సాహిత్యంలో అందరూ ఆప్యాయంగా రుక్కాయి అనేవారు. ఇంటి పేరులో మొదటి అక్షరం జ పేరులో మొదటి అక్షరం రూ కలిపి జరూ అని సంబోధిస్తూ రాసింది ఈ శతకం.

ఇందులో దుష్కర ప్రాస పద్యాలు, ద్విత్వాక్షర ప్రాస పద్యాలు చాలా ఉన్నాయి. ఒక హల్లు కన్నా ఎక్కువ హల్లుల ఒత్తులుతో ఉంటే దాన్ని దుష్కర ప్రాస అంటారు. ఇలాంటి ప్రాసాక్షర పదాలతో కంద పద్యాలను రమణీయంగా నడిపించాడు శ్రీశ్రీ. ఉదాహరణగా వాగ్ధ్యానత అనే పద్యం పైన చెప్పాను. ఇంకా మాస్కో ఆస్కారం విస్కీ శ్రీస్కీ అనే నాలుగు పదాలను ప్రాసాక్షరంలో పెట్టి ఒక పద్యం చెప్పాడు. నిత్య, వ్యత్యా, అత్యవస, ఔచిత్యం అనే పదాలను ప్రాసలో పెట్టి ఒక పద్యం ఉంది.

హాస్య రచనలో నొక్క ర
హాస్యం కలదనగ వచ్చు నది యేదన్నన్
వేశ్యామాతల సన్నిధి
శిష్యరికం ఆరునెలలు సిరిసిరిమువ్వా!

ఈ పద్యంలో హాస్య అనే పదంలోని స్య దుష్కర ప్రాస. ఇందులో మళ్ళీ శషసలను ప్రాసలో ఉప యోగించాడు. ఈ పద్యంలో చెప్పిన భావం లోక వ్యవహారంలో ఉన్న ఒక కథను తెలియజేస్తోంది. ఇలాంటి దుష్కర ప్రాస యుక్తమైన పద్యాలు సిరిసిరిమువ్వ శతకంలో అక్కడక్కడా కనిపిస్తున్నాయి.

ప్రాసాక్షరములో అచ్చును ఉపయోగించి కూడా ఒక పద్యాన్ని శ్రీశ్రీ రాశాడు-

ఓ అంతా కవులే, అ
ఆ ఇ ఈలైన రాని యంబ్రహ్మలె, మే-
మూ ఋషులం అని, చీ,
ఛీ ఎంతటి నవ్వుబాటు సిరిసిరిమువ్వా!

స్వరయతులను వర్ణిస్తూ రేచన కవిజనాశ్రయములోని మరొక పద్యం మాత్రమే ఇలాంటి ప్రాసకుదాహరణ. అఆ ఇ ఈ అన్నప్పుడు నాలుగో గణం తప్పినట్లుగా కనిపిస్తోంది. కానీ ఇందులో అఆఇఈలో ఇ కారం ఒత్తి పలకడం చేత గురువు అయితే కంద పద్యంలో గణభంగం కావడం లేదు. దీనికి సంబంధించిన ఛందోదర్పణం లోని ఒక పద్యం ఉంది.

ఛందో దర్పణం -

క॥ తనరగ అఆఇఈ
లనగా ఉఊలు నాగ నంబుజదళలో

చన బుబూలన ఓబొ
లనగ నజంతాహ్వయంబు లగు నీపడియున్.

ఈ పుస్తకానికి ముందుమాటలో టీకను రాస్తూ గిడుగు సీతాపతి గారు ఇలా అన్నారు. 4-107 "అ ఆ ఇ ఈ లనగా ఉ ఊ అంశాలు... ఈ పద్యములో హ్రస్వాక్షరములే అయినా 'ఆ' 'ఇ' ఉ' బు గురు వర్ణములు గానే ఉచ్చరించవలెను. అదియెట్లు జరుగునంటే! ఈహ్రస్వా క్షరములుచ్చరించిన తరువాత ఏకలఘు మాత్రాకాలము ఊపిరి ఆపి 'ఆ' బిగపట్టి పైవర్ణము లుచ్చరించుటచేత ఈహ్రస్వాక్ష లోచ్చారణలో ద్విమాత్రోచ్చారణ ప్రయత్నము జరిగినది. అంతేకాని పరమందున్న 'ఆ' అనే అచ్చు ద్విత్వాక్షరమువలె ఉచ్చ రించుటచేత పూర్వమందున 'అ' గురువు అగునని జయంతి రామయ్యపంతులు గారు చెప్పిన సమాధానము అశాస్త్రీయము. అచ్చువిషయముగ ద్విత్వాక్షరోచ్చారణమంటే దీర్ఘోచ్చారణమని చెప్పవలెనేకాని వ్యంజనముల విషయమై చెప్పిన అర్థముపొసగదు. ద్విత్వవ్యంజనమునకు పూర్వమందున్న హ్రస్వాచ్చు గురువు కాగలదు గాని కేవల దీర్ఘాచ్చునకు పూర్వ మందున్న హ్రస్వాచ్చు గురువు కాలేదు. (ఛందోదర్పణ పీఠిక).

అంతేకాదు, శ్రీశ్రీ ఒక కందపద్యంలో ర అక్షరానికి ఠ అక్షరానికి రూపసామ్యం ఉండడంబట్టి యతి చెల్లిం చాడు!

జగణంతో జగడం కో
రగా దగదు కాని దాని ఠస్సా గొయ్యా
నగలాగ వెలుగును గదా
చిగిర్చితే నాలుగింట సిరిసిరిమువ్వా!

ఈ పద్యంలో నాలుగవ గణం జగణాన్నే వేశాడు. ఇందులోనే ర కు ఠ అక్షరానికి యతి వేశారు! ఇవి శ్రీ శ్రీ కందపద్యాలు లోని కొన్ని రచనా చమత్కృతులు.

ముగింపు :

1946 నాటి 'సిరి సిరి మువ్వ' నంప్రదాయ చ్ఛందస్సులో రాసినపద్యగ్రంథం. ప్రతి పద్యమూ అదే మకుటంగా రాశాడు. ఆనందవాణి, ఢంకా, ఆంధ్రజ్యోతి వంటి సాహితీ పత్రికల్లో వెలువడ్డ తరువాత దానికి గ్రంథ రూపమిచ్చాడు. అలాంటిదే ఆరుద్ర, వరదరాజేశ్వర రావులతో కలిసి రాసిన మరో గ్రంథం 'మేమే'. ఆరుద్ర సహరచయితగా సంప్రదాయ చ్ఛందస్సుల్లో వ్యావహారిక భాషలో రాసిన గ్రంథం 'రుక్కుటేశ్వర శతకం' (1943). జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రికి అభినందనగా రాసిందిది. ఇందులోని కంద పద్య రచన లోని శ్రీ శ్రీ చూపించిన చమత్కృతులను కొన్నింటిని పరిచయం చేశాను. తన చిన్ననాటి అంటే పదవ సంవత్సరం లోనే అప్పకవీయం, సులక్షణసారమును బాగా చదువుకున్నట్లుగా శ్రీశ్రీ అనంతంలో చెప్పాడు. వాటితో పాటు సంస్కృత ఆంధ్ర సాహిత్యాలను అధ్యయనం చేయడంతో అద్భుతమైన ధార శ్రీశ్రీకి పట్టుబడింది. ఈ సిరి సిరి మువ్వా శతకం లోనూ ఈ ధార మనకు అద్భుతంగా కనిపిస్తుంది. లక్షణ గ్రంథాల్లో చెప్పిన యతిప్రాసలను నియమాలను తప్పకుండా కొన్ని పద్యాలలో ఉపయోగించి చమత్క రించాడు శ్రీ శ్రీ.

ఉపయుక్త గ్రంథసూచి :

1. కవిజనాశ్రయం-మల్లియ రేచన
2. చందో దర్పణం- అనంతామాత్యుడు
3. అప్పకవీయం -అప్పకవి
4. బృహత్సంహిత-వరాహమిహిరుడు(తెలుగు అనువాదం)
5. శ్రీ శ్రీ సిప్రాలి శ్రీ శ్రీ సాహిత్య సర్వస్వం, 14
6. కవిత్రయ భారతం, టీటీడీ ప్రచురణ.

❖❖❖

మరోప్రపంచాన్ని కలగన్న శ్రీశ్రీ మహాప్రస్థానం

– డా॥. ఏల్లె కృష్ణ, వైస్ ప్రిన్సిపల్, తెలుగు ఉపన్యాసకులు, సిఎస్ఎస్ఆర్ & ఎస్ఆర్ఆర్ఎమ్ డిగ్రీ మరియు పిజి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

ఒక సామాజిక వ్యవస్థ నుంచి అంతకన్నా ఉన్నతమైన సామాజిక వ్యవస్థలోకి పురోగమించి, ప్రపంచాన్ని వర్గ రహితంగా రూపొందించడమే అభ్యుదయం. ఆర్థిక, సామాజిక వ్యవస్థ పునాదిగా రూపొందిన మార్క్సిస్ట్ దృక్పథం అభ్యుదయవాదం. మార్క్సిజమ్-భౌతికవాదం, వాస్తవికతావాదం ప్రాతిపదికగా అభ్యుదయ కవిత్వం జనించింది. పెట్టుబడిదారీ వ్యవస్థను, సామ్రాజ్యవాద తత్వాన్ని, యుద్ధోన్మాదాన్ని నిరసించడం; ఆకలి, దారిద్ర్యం, అసమానత, పరాధీనత మొదలైన సామాజిక రుగ్మతల్ని నిర్మూలించడానికి కృషి చేయడం, మతవర్ణ వర్గ భేదాల్ని, జాత్యహంకారాన్ని సమూలంగా పెల్ల గించడం దాని లక్ష్యం. జనంవైపు ఉండి, జనంతో కలిసి, జనం కోసం పోరాడే కవి అభ్యుదయ కవి. అభ్యుదయ కవి అంటే మొదట గుర్తుకు వచ్చే మహా కవి శ్రీశ్రీ.

"హృదయం ఎలా కంపిస్తే ఆ కంపనకి మాటల రూపాన్ని యివ్వడం అతనికే తెలుసు. మాటల్ని కత్తులూ, యీటెలూ, మంటలుగా మార్చటం అతనికే చాతనవును. పద్యాలు చదువుతో వుంటే, ఇవి మాటలు కావు, అక్షరాలు కావు - ఉద్రేకాలు, బాధలు, యుద్ధాలు - అతని హృదయంలోంచి మన హృదయంలోకి డైరెక్ట్‌గా పంపిన ఉత్సాహాలు, నెత్తురుకాలవ లనిపిస్తుంది. ఎందుకంటే -

కృష్ణశాస్త్రి తన బాధని అందరిలోనూ పలికిస్తే, శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు.

కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" - అని "మహాప్రస్థానం"లో 'చలం' 'యోగ్యతా పత్రం' ద్వారా 'శ్రీశ్రీ' అంతరంగాన్ని ఆవిష్కరించారు.

30-04-1910 విశాఖ పట్నంలో జన్మించిన శ్రీరంగం శ్రీనివాసరావు గారి తల్లిదండ్రులు - అప్పలకొండ, పూడిపెద్ది వెంకటరమణయ్యగార్లు. వీరి రచనా వ్యాసంగంలో ప్రభవ, మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, మరో ప్రస్థానం, సిప్రాలి, మరోప్రపంచం, చరమరాత్రి, చైనాయానం, అనంతం వంటి రచనలు ఉన్నాయి. "1940 తర్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్య లోకాన్ని ఉత్తేజితం చేసిన అభ్యుదయ కవిత్యోద్యమ మూల విరాట్టు 'శ్రీశ్రీ'. భావకవిత్వానికి విరుద్ధంగా జెండా ఎత్తుటతోనే కాక, శ్రామిక వర్గచైతన్యం ఊపిరిగాగల ఒక సరికొత్త కవితారీతికి పాదులు వేసిన స్రష్ట, వాస్తవికతతో పాటు అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యంతో పాటు సంఘచైతన్యంను సమానాధికారంతో ప్రవచించిన ప్రవక్త శ్రీశ్రీ." - అంటారు సి.నారాయణరెడ్డి.

శ్రీశ్రీ రచనలను పరిశీలిస్తే మొదటి దశలో కాల్పనికతా ప్రభావం, రెండవ దశలో మార్క్సువాద ప్రభావం, మూడవ దశలో ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంత ప్రభావాలు మనకు కనిపిస్తాయని ఆచార్య కె.వి.ఆర్.నరసింహులుగారు ఆధునికాంధ్ర కవితా సమీక్షలో తెలిపారు. శ్రీశ్రీ 'ప్రభవ'లో ప్రకృతి గీతాలు, ప్రణయగీతాలు, ప్రకీర్ణగీతాలు కని పించగా, 'సుప్తాస్థికలు' గీతంతో అతనిలోని నిశిత భావనా శక్తి వెలుగు చూడగా, 'మహాప్రస్థానం' ద్వారా అభ్యుదయ కవి ఉదయించి, జ్వలించాడని చెప్పవచ్చు. శ్రీశ్రీలో మొదట పద్యకవి, భావకవి కనిపించిన తర్వాత అభ్యుదయ కవి, విప్లవ కవి కనిపిస్తారని వీరి రచనలు ద్వారా తెలుస్తుంది.

"1930 వరకు ఆంధ్రదేశం నన్ను నడిపించింది, 1930 తర్వాత ఆంధ్రదేశాన్ని నేను నడిపించాను." అంటారు శ్రీశ్రీ. మానవ నాగరికత పరిణామంలో మనిషి నాగ రికుడయ్యే కొద్ది తన మూలాల్ని మరచిపోతున్నాడు.

శ్రీశ్రీ సమాజంలో వస్తున్న మార్పులను నిశితంగా పరిశీలించి శ్రమజీవుల పట్ల తమ బాధ్యతాయుతమైన పాత్రను కొనసాగించారు. సరళత, స్పష్టతలతో సమాజ శ్రేయస్సు కోరుకుంటూ, సామాన్యులకు ప్రాధాన్యత కల్పిస్తూ తమ కవిత్వంతో మేలుకొలుపు పలికారు.

1930లో శ్రీశ్రీలో అపూర్వమైన అలజడి మొదలై, స్వరాజ్య శంఖధ్వనులు ఒకవైపు, పీడిత ప్రజానీకం మరోవైపు కనిపించింది. ఆయన అంతరంగంలో దాగివున్న చైతన్యం ఎగసిపడి 1933లో 'జయభేరి' వచన గేయ ఖండిక ద్వారా అభ్యుదయ కవిత్వానికి నాంది పలుకుతూ వాడుక భాషలో తమ గోంతుకతో -

''నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వవృష్టికి
అశ్రు వొక్కటి ధార పోశాను!
నేను సైతం
భువన ఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!
నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను!'' అంటూ కొనసాగే గేయఖండికలో వ్యక్తి చైతన్యం సామాజిక చైతన్యంలో భాగస్వామ్యం అని తెలియజేశారు.

స్పిన్‌బర్న్, ఎడ్గార్ ఎలెన్ పో, గోర్కి వంటి ప్రాశ్చాత్య రచయితల ప్రభావం, ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ శాస్త్రం, మార్క్స్ ప్రతిపాదించిన గతితార్కిక భౌతిక వాద సిద్ధాంతాల్ని అధ్యయనం చేసి, దోపిడీకి గురౌవుతున్న కార్మిక, శ్రామిక వర్గాల్ని అంతటినీ 'మరో ప్రపంచం' పిలిచింది అంటూ

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరోప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు,
పడండి త్రోసుకు!
పోదాం, పోదాం పైపైకి!
అగ్ని కిరీటపు ధగధగలు,
ఎర్రబావుటా నిగనిగలు,

హోమజ్వాలల భుగభుగలు ? అని 1934లో 'మహా ప్రస్థానం'లో నూతన ప్రపంచం పట్ల కుతూహలాన్ని రేకెత్తిస్తూ, సమసమాజ నిర్మాణానికి పరుగులు పెట్టిస్తూ, సమర గేయం రచించారు శ్రీశ్రీ. ఇది అభ్యుదయ గేయానికి నాంది గేయంగా మారి, ''మహాప్రస్థానం'' గేయ సంపుటికి మకుటాయమానంగా నిలిచింది. సమకాలీన సమాజాన్ని, అంతర్జాతీయ పరిస్థితుల్ని సమన్వయించు కుని సామాజిక విప్లవాన్ని ఆశించి విప్లవ శంఖం పూరిం చాడని చెప్పవచ్చు. ఇందులోని 'మరోప్రపంచం' స్వర్గమో, కైలాసమో కాదు. ధరిత్రీ నిండా నిండిన సమసమాజం. ఇది రష్యా విప్లవంతో ప్రభావితమై, విశ్వమంతటా వర్గరహిత సమాజాన్ని నిర్మించేందుకు తోడ్పడిందనవచ్చు.

సమష్టి చైతన్యానికి ప్రతిబింబంగా, పీడిత జన సముద్ధరణ లక్ష్యంగా ముందుకు అడుగులు వేసి, కవిత్వాన్ని జీవితానికి దగ్గరగా తీసుకువచ్చి అభ్యుదయ కవిత్వానికి మార్గదర్శకుడైనాడు శ్రీశ్రీ.

''నేడే, ఈనాడే, ఈనాడే-
జగమంతా బలి వితర్డి!
నరజాతికి పరివర్తన!
నవజీవన శుభసమయం!

అభ్యుదయం !'' అంటూ అభ్యుదయవాదులకు పిలుపునిచ్చారు. శ్రీశ్రీని నవ్య కవితాయుగకర్తగా, అభ్యుదయ కవితా ప్రవక్తగా ఈ యుగకవులు గుర్తించడం జరిగింది. ''పాత పదాలు, డిక్షన్ వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, కవిత్వంలోవి, జీవితంలోవీ ఇంక మళ్ళీ లేవకుండా వాటి నడ్డి విరక్కొట్టాడు శ్రీశ్రీ'' అని చలంగారు 'మహాప్రస్థానం'

'యోగ్యతా పత్రం'లో తెలియచేశారు. ఈ విశ్లేషణ శ్రీశ్రీ కవిత్వ స్వరూపానికి సంబంధించింది. అభ్యుదయ కవిత్వ రచనా శైలి, సూత్రాలు ఇంతకుముందు రచనా విధానాలకన్నా భిన్నమైనవి, బలమైనవి.

"లోకపుటన్యాయాలూ, కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ పరిష్కరించే, బహిష్కరించే బాటలు తీస్తూ, పాటలు వ్రాస్తూ...

కార్మికలోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణంగా, సమర్చనంగా...

నాలో కదలే నవ్యకవిత్వం" అని ప్రతిజ్ఞ ద్వారా కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింపచేసే గొడ్డలి,రంపం, కొడవలి, నాగలి వంటి సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు నా వినిపించే, విరచించే నవీన రీతికి ప్రాణం!, ప్రణవం అంటారు. కార్మిక లోకపు కల్యాణం కోసం, శ్రామిక లోకపు సౌభాగ్యం కోసం కవిత్వం రాయడంతో తదనంతర కవులకు శ్రీశ్రీ మార్గ దర్శకులు అయ్యారు.

ఒక నిర్దిష్ట కవితా ప్రయోజనంతో తెలుగు కవితా రంగంలోకి ప్రవేశించారు శ్రీశ్రీ. కదలిక, మార్పు, జాగృతి, పురోగమనం మొదలైనవి కవితా ప్రయోజనాలుగా, కార్మిక లోకపు కళ్యాణానికి తన కవిత్వం విప్లవశంఖం కావాలంటూ-

"కదిలేదీ, కదిలించేదీ,
మారేదీ మార్పించేదీ,
మునుముందుకు సాగించేదీ,
పెనునిద్దుర వదలించేదీ,

పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ" 'నవ కవిత' అని తమ నూతన లక్ష్యాల్ని స్పష్టపరిచి అభ్యుదయ కవిత్వానికి బలమైన ప్రతినిధిగా నిలిచారు శ్రీశ్రీ. లోకంలోని అన్యాయాలను ప్రశ్నించి ప్రజలను చైతన్యవంతం చేయడంలో శ్రీశ్రీ గారికి సాటిలేరు అని చెప్పవచ్చు. అంతేకాదు ప్రపంచంలో జరుగుతున్న ప్రభుత్వ పతనాలు, యుద్ధాలు, విప్లవాలు మానవజాతి పురోగమనానికి దోహదం చేసే తీరుతెన్నులు శ్రీశ్రీ కనుగొన్నారు.

కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా
హీనంగా చూడకు దేన్నీ !
కవితామయమేనోయ్ అన్నీ !

"కాదేదీ కవిత కనర్హం" అంటూ 'బుక్కులు' అనే కవిత ద్వారా జగత్తులో అన్నింటిలోనూ ఒక విషయం, విశేషం ఉంటుందని కవిత్వానికి అనర్హమైనదంటూ ఏదీ లేదని, వాటి చుట్టూ ఉండే వాతావరణం వల్ల, వాటి ఉపయోగ, వినియోగాల వల్ల ఎన్నో విషయాలు స్ఫురింప చేస్తారు. ఇటువంటి గొప్ప దార్శనిక దృష్టి ఉన్నవాడే శ్రీశ్రీ. కవిత్వం మంచి శిల్పం ఉండి పాఠకులను ఆకట్టుకోగలగాలి అని, ప్రపంచం ఒక పద్మవ్యూహంగా, కవిత్వం ఒక తీరని దాహంగా కూడా అభివర్ణించారు.

శ్రీశ్రీ కవిత్వం తాడితులు, పీడితుల అభ్యున్నతి కోసం రచించబడింది. ప్రపంచంలో ఎవరు ఎవరికీ బానిసలు గారని చెబుతూ అనాదిగా భరిస్తున్న బానిసత్వపు సంకెళ్ళను బద్దలు చేయమంటూ 'అవతారం' కవితలో -

"యముని మహిషపు లోహపు ఘంటలు
మబ్బుచాటున
ఖణేల్మన్నాయి!
నరకలోకపు జాగిలమ్ములు
గొలుసు త్రెంచుకు
ఉరికిపడ్డాయి!....
పుడమి తల్లికి
పురుటి నొప్పులు

కొత్త సృష్టిని స్ఫురింపించాయి!" అని అభ్యుదయ కవిత్వ లక్షణాలలో ఒకటైన "తిరుగుబాటు"ను సూచిస్తూ, తరతరాల బానిసత్వాన్ని విదిలించుకుని కొత్త సృష్టికి నాంది పలికారు.

గతితార్కిక భౌతికవాదానికి నిలువుటద్దం వంటిది "దేశచరిత్రలు" గేయఖండిక. శ్రీశ్రీ ఈ గేయంలో-

"ఏ దేశచరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం ?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం" అంటూ...
"ఇతిహాసపు చీకటి కోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు !

దాచేస్తే దాగని సత్యం" అని హెచ్చరిస్తూ, చారిత్రక దృక్పథాన్ని నిష్కర్షగా ప్రకటించారు. "నరజాతి చరిత్ర సమస్తం - దరిద్రులను కాల్చుకు తినడం" అని వ్యాఖ్యానించారు. వర్గసంఘర్షణ సిద్ధాంతాన్ని అత్యంత స్పష్టంగా ప్రతిపాదించారు. మానవ జాతి చరిత్ర సమస్తం "వర్గసంఘర్షణ ఫలితమే" అనే మార్క్స్ సిద్ధాంతాన్ని -

"పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను" అని ఒక్క మాటలో తెలుపుతూ ఆశ్చర్యకరమైన నైపుణ్యతను ప్రదర్శించారు.

"జగన్నాథుని రథచక్రాలు" అభ్యుదయ కవి స్వప్నం నిజమవుతుందని శ్రీశ్రీ ఈ ఖండికలో ప్రకటించారు. ఆకాశ వీధిలో హడావుడిగా పోతున్న జగన్నాథుని రథచక్రాలను భూమార్గం పట్టించి ఆ రథచక్రాల ప్రళయ ఘోషలో భూకంపం పుట్టించారు." వస్తున్నా యొస్తున్నాయ్... జగన్నాథ రథచక్రాల్" అని రథచక్రాల ఆగమనాన్ని సామ్యవాద విప్లవంతో సూచించారు. జగన్నాథుని రథం మరోప్రపంచపు సంకేతంగా "ఈలోకం మీదేనండి, మీ రాజ్యం మీ రేలండి!" అని ముగించి రాజ్యాధికారాన్ని వ్యక్తుల నుంచి తప్పించి సమాజానికి ఇప్పించడమే కవిత్వపు తుది లక్ష్యం అన్నాడు. శ్రామికులతో 'తిరుగు బాటు మా వేదాంతం' అనిపించారు.

శ్రామికులు, కార్మికులు కర్షకులు తమకు ఎదురైన సమస్యలను ఎదుర్కొంటూ ఐకమత్యంగా పోరాటం చేసినపుడు మాత్రమే విజయం సాధించవచ్చని, దోపిడీ వ్యవస్థ నుంచి, ఈ పీడిత సమాజం నుండి సామ్యవాద వ్యవస్థకి, సమసమాజ వ్యవస్థకి పయనించడమే మహా ప్రస్థానం అంటారు.

మహాప్రస్థానంలోని గేయ ఖండికల ద్వారా శ్రామికులు, అణగారిన బడుగు, బలహీన వర్గాలు, ఇలా ఒకరేమిటి వెనుకబాటుకు గురైన ప్రజానీకాన్ని తమ కవిత్వంతో అభ్యుదయంవైపు నడిపించారు శ్రీశ్రీ. శ్రమ దోపిడీ నుండి బయటపడడానికి అతి సరళ పదాలతో సామాన్యులకు కూడా అర్థమయ్యే రీతిలో కవిత్వ రచనకు నాంది పలికి, ఆర్థిక అసమానతలు లేని నూతన సమాజాన్ని కలగన్నారు. నవ సమాజ నిర్మాణంలో మనవంతు పాత్ర నిర్వహించాలని అన్నారు. ఆధునిక విప్లవ కవిత్వపు రథసారథిగా కొనియాడబడ్డారు. నవ భారతావని నిర్మాణం కేవలం యువకుల వలనే సాధ్యమవుతుందని, కార్మిక, కర్షక, బడుగు, బలహీన వర్గాల కష్టాలు, సమస్యలు పేదరికం, ఆకలిమంటలు వంటి కవితా వస్తువులే ఇతివృత్తంగా, విశ్వమంతటా సమ సమాజాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేశారు శ్రీశ్రీ. 1933-47 మధ్యకాలంలో శ్రీశ్రీ రాసిన 41 గేయ ఖండికలతో 'మహాప్రస్థానం' కవితాసంపుటిని 1950లో ప్రచురించారు.

ఆధార గ్రంథాలు :

1. మహా ప్రస్థానం - శ్రీశ్రీ
2. తెలుగు సాహిత్య సమీక్ష - (రెండవ సంపుటం) - డా. జి. నాగయ్య.
3. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి.

❖❖❖

శ్రీ శ్రీ ప్రతిజ్ఞ - అభ్యుదయ దృక్పథం

- డా॥. బూర్గుల స్వరూప
తెలుగు అధ్యాపకురాలు,
యం.వి.ఎస్. ప్రభుత్వ కళాశాల.

- డా॥. జె. తిరుపతయ్య
తెలుగు అధ్యాపకులు,
పాలమూరు యూనివర్సిటీ.

"మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం" అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీ రంగం శ్రీనివాసరావు ఏప్రిల్ 30, 1910లో విశాఖపట్నంలో జన్మించారు. 1931లో బి.ఎ. పూర్తి చేసిన శ్రీశ్రీ - ఎ.వి.ఎన్. కళాశాలలో డెమాన్ స్ట్రేటర్‌గా, మద్రాసు ఆంధ్రప్రభలో లేబరేటరీ అసిస్టెంట్‌గా వివిధ ఉద్యోగాలు చేసినా, తన స్వంత భావాల కారణంగా దేనిలోనూ ఇమడలేక సీనిరంగంలో స్థిరపడ్డారు.

"మహా ప్రస్థానం" :

శ్రీశ్రీకి పేరు తెచ్చిన కవితా సంపుటి మహా ప్రస్థానంలో మొత్తం 40 ఖండికలు ఉన్నాయి. "ప్రతిజ్ఞ" కవిత 07-05-1937 వ్రాయబడింది. శ్రీశ్రీ ముందు పద్యకవి బావకవి, ఆ తర్వాత అభ్యుదయకవి తర్వాత విప్లవకవి స్వీయచరిత్రను అనంత అనే శీర్షికలో రచించాడు. పత్రికలలో వచ్చిన ప్రశ్న జవాబు ప్ర.జ పేరుతో అచ్చు య్యాయి. మరో ప్రపంచం, చరమరాత్రి, చైనాయానం, మొదలగునవి. ఇతర రచనలు విరసంవారు శ్రీశ్రీ వ్యాసాలు, వ్యాలు, రివ్యూలు ప్రచురించారు. శ్రీశ్రీ రచించిన సినిమా పాటలు పాడవోయి భారతీయుడా తెలుగు వీర లేవరా? అనే పేరుతో అచ్చయ్యాయి. ఈ విధంగా శ్రీశ్రీ ఆధునికాంధ్ర కవితా యుగకర్త. ప్రతిజ్ఞ కవిత శ్రీశ్రీ కవిత్వానికే కాదు, అభ్యుదయ కవిత్వానికే మెనిఫెస్టో వంటిది.

ఇంగ్లాండులో భారతీయ విద్యార్థులు స్థాపించిన అభ్యుదయ రచయితల సంఘం (Progressive writing Association) వారి అరరారపు మెనిఫేస్టో ఇండియాలోకి వచ్చింది. దాని కాపి ఒకటి 1935లో లక్నోలో జరిగిన జాతీయస్థాయి అభ్యుదయ రచయితల సమావేశానికి హాజరై వచ్చిన అబ్బూరి రామకృష్ణారావు గారు సంపాదించి తెచ్చి శ్రీశ్రీకి ఇచ్చారు. అది చదవగానే ఆ అబ్బూరి వారు ఆ మ్యానిఫేస్టో సారాంశమంతా ఆగేయంలో దించాలని శ్రీశ్రీని ప్రశంసించారు. మహా ప్రస్థానాన్ని అర్థం చేసు కోవడానికి చలం యోగ్యత పత్రం ఒక చక్కని ముందు మాట. మహాప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం.

ఈ దోపిడి వ్యవస్థ నుంచి పీడిత సమాజం నుంచి సామ్రాజ్యవాద వ్యవస్థకు నవసమాజ వ్యవస్థకై పయనించ డమే మహాప్రస్తానం. అభ్యుదయ పదం వైపు ప్రస్థానం సాగించాలన్నది శ్రీశ్రీ ప్రభోదం ఆక్రమంలో ఆయన వ్రాసిన కవితలలో ప్రతిజ్ఞ ఒకటి. శ్రామిక వర్గ పక్షపాత దృష్టి గల కవిగా ఇందులో కనబడుతాడు.

పాలాలనన్నీ
హలాల దున్నీ
ఇలాతలంతో హేమం పిండగ
జగనికాంత సౌఖ్యం నిండగ
విరామమెరుగక పరిశ్రమించే
బలం దరిత్రికి బలికావించే,
కర్షక వీరుల కాయం నిండా
కాలువ కట్టే ఘర్మ జలానికి,
ఘర్మ జలానికి, ధర్మ జలానికి
ఖరీదు లేదోయ్.

పాలాన్ని నాగలితో దున్ని భూమిలో బంగారం పండించడానికి ప్రపంచానికంతా సౌఖ్యం ప్రసాదించ డానికి విరామం లేక శ్రమించే తన యావత్ శక్తిని, బలానికి భూమికే అంకితం చేసిన ఆ కర్షకుని శరీరం

నుంచి కాలువలుగా ప్రవహించే ఘర్మ జలానికి ఖరీదు చెప్పలేము. ధర్మం మూర్తీభవించిన అట్టి ఘర్మ జలానికి అతని శ్రమకు ఇంత అని విలువకట్టలేము అన్నది శ్రీశ్రీ భావన. ఆ రకంగా ఆయన శారీరక శ్రమకు తక్కువ రేటు కట్టి దోచుకునే వర్గ సమాజ లక్షణాన్ని నిరిసిస్తూ శ్రమ అమూల్యమైనదని అది ధర్మబద్ధమైనది ప్రతి పాదించాడు.

నరాల బిగువు
కరాల సత్తువ
వరాల వర్షం కురిపించాలని
ప్రపంచ బాగ్యం వర్ధిల్లాల్లాని
గనిలో, పనిలో, కార్ఖానాలో..

ఒంట్లో బలమున్నా, లేకున్నా నరాల బిగువుతో చేతి బలాన్ని అంతా చూపి అందరికి వరాల వర్షం కురిపించా లని యావత్ ప్రపంచానికి సంపదను వృద్ధి చేయాలని అక్రమంలో గనిలో, అడవిలో, యంత్ర శాలలో నలువైపులా తానే అయి నడయాడుతూ ధనికుడైన యజమానికి దాస్యం చేస్తూ యంత్రాలనే భూతములతో నిరంతర సహవాసం చేస్తూ నిత్యం శ్రమించే ధీర కార్మికుల కన్నుల నుంచి కణకణమండె గలగల కదలాడే విలాపాగ్నికి విషాదాశ్రువులకు ఖరీదు కట్టే యజమాని లేడంటాడు శ్రీశ్రీ. కర్షక వీరుల ఘర్మ జలానికి, ధర్మ జలానికి నిత్య నిరంతరం బలాన్నంతా కూడగట్టుకొని ప్రపంచ సంపదను అభివృద్ధి పరిచే కార్మిక వర్గానికి మిగిలినది దు:ఖాగ్ని, విషాద సూచకమైన కన్నీరు. ఎందువల్ల ఇట్లా అవుతున్న దంటే శ్రమ ఉంటే వాళ్ల శ్రమకు తగిన ఫలితం లభిం చడంలేదు.

కనుక శ్రామికుల విషాధానికి దు:ఖానికి ఖరీదు కట్టే యజమాని లేడంటే అతను వాళ్లకు శ్రమకు తగిన వెలకట్టేవాడు లేడనే, కార్మిక ధీరుల విలాపాగ్నులకు, విశాదాశ్రువులకు "ధర" నిర్ధారించగలవాలేనన్నది. శ్రీశ్రీ అభిప్రాయం, అభాగ్యుల, అనాథల, అశాంతుల పక్షం వహించి శ్రీశ్రీ విప్లవ శంఖం మోగించాడు.

సిద్ధాంతాలు, బోధనలు విని విని విసుగు చెందిన జనం తమ కష్టాలకు మూలకారణం శ్రమ దోపిడి అని గుర్తించి అట్లాంటి శ్రమను చేయడానికి నిరాకరిస్తూ, మా శ్రమకు ఫలితం దక్కితేనే పని చేస్తాం. మీ సంపదలు పెంచడానికి అయితే పనిచేసేది లేదు అని సమ్మెకు దిగితే ఆ యజమాని భరించలేడు. అసత్యపు కుట్ర కేసుల్లో జైలుశిక్షలు అనుభించేవాళ్లు, క్రూరులైన రాక్షస ప్రవృత్తి గల పారిశ్రామిక పెట్టుబడిదారి వ్యవస్థ పాదాల కింద పడి నలిగి చిత్రహింసలు అనుభవిస్తూ కొన ఊపిరితో ఉన్న వాళ్లు తమ శ్రమకు తగిన ఫలితం దొరకక ఏమి దిక్కుతోచని పరిస్థితిలో చివరి అస్త్రంగా సమ్మె చేసే వాళ్లు, శ్రమ ఫలితం లభించక, పుట్టుక, బ్రతుకు బాధకరమై బ్రతకలేక ఆ కష్ట పరిస్థితిలో నూతిలో, గోతిలో పడి ఆత్మహత్యా యత్నాలు సాగిస్తున్న అనేకానేక అభాగ్యులు అనాథలు అశాంతితో పెద్ద ఎత్తున విప్లవ శంఖం పూరించక తప్పదని ఆనాడే చెప్పారు. శ్రీశ్రీ ఈ అన్ని కారణాల వల్ల లోకంలో నిత్యం జరుగుతున్న అన్యాయాలు, దుర్భరమైన ఆకలి, భరించరాని వేదన, వీటన్నింటిని మించి దారిద్ర్యం, దానికి తోడు పేదల మీద దౌర్జన్యాలు మొదలైన వాటిని పరిష్కరించడానికి వాటిని బహిష్కరిస్తూ ఆ మార్గంలో బాటలు వేస్తూ, పాటలు వ్రాస్తూ ఆ పీడితులైన కార్మికలోకపు కళ్యాణానికి శ్రామిక లోక సౌభాగ్యానికి కవితలు ఎల్ల కాలాల్లో ఎల్లలోకాలలో చేప్పాను అంటాడు. శ్రీశ్రీ ఆ విధంగా నిబద్ధమైన ప్రతిజ్ఞ చేశారు.

త్రిలోకాలలో, త్రికాలలలో,
శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనే లేదని
కష్టజీవులకు, కర్మ వీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ

తన కవిత్వం ఎలా ఉంటుందో చెప్పాడు. శ్రీశ్రీ. తన కవితా వస్తువు శ్రమైక జీవన సౌందర్యం. తన కావ్య ప్రయోజనం కష్టజీవులకు, కర్మ వీరులకు, నిత్యమంగళం

నిర్దేశించడం, ఊహలు, కల్పనలతో, కాక, సాహిత్యాన్ని వ్యదార్థ జీవత యదార్థ దృశ్యాల పునాదిపై నిలబెడతానని ప్రతిజ్ఞ చేశాడు. ఈ రకంగా సాహిత్యంలో ముఖ్యంగా కవితలలో వాస్తవికతా వాదానికి పెద్దపీట వేశారు. లోక వాస్తవికతలోని భోగలాలస జీవితం కాక కవితను వర్ణించడానికి ఎంచుకొన్నది. వ్యథలోను అర్తితోను నిండిన కష్టజీవుల జీవితం. అందుకనే శ్రీశ్రీ ఒక సందర్భంలో కవి అంటే కష్టజీవికి ఇరువైపులా ఉండేవాడని చమత్కారంగా చెప్పగలిగారు. ఈ విధంగా వ్యదార్థ జీవిత నిజమైన జీవిత దృశ్యమే అభ్యుదయ కవిత్వమన్నారు. శ్రీశ్రీ ప్రజల అబ్యుదయాన్ని కోరేదే అభ్యుదయ కవిత్వం.

కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం,
జాలరి పగ్గం, సాలెల మగ్గం
శరీక కష్టం స్ఫురింపజేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాల్.

శ్రీశ్రీ నవ్య కవిత్వానికి గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి వంటి అనేక రకాల వృత్తి చిహ్నాలే ప్రాణం.

కమ్మరి కొలిమి, కుమ్మరి నడిపే చక్రం, జాలరి వాడే పగ్గం, సాలెవాని మగ్గం, ఇవన్నీ శ్రామికునికి ఉత్పత్తి సాధనాలు, శరీర కష్టానికి, ప్రాతినిధ్యం వహించే పరికరాలు, వీటిని గురించి పొగుడుతూ నేను వ్రాస్తున్న. వినిపిస్తున్న ఈ గీతాలకు ఆ అనేకానేక సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలే తన కవితకు పరిపుష్టిని, పవిత్రతను, జీవవాన్ని, ఓంకారాన్ని కల్పిస్తున్నాయి. అని శ్రీశ్రీ అంటారు. ఆ విధంగా అవన్ని అతని కవితా వస్తువులు అతని కథా నాయకుడు శ్రామికుడే.

శ్రీశ్రీ ఒక కొత్త చరిత్రకు సందర్భంలో కవిగా, మార్క్సిస్టు చైతన్య కవిగా పరిణామం చెందుతున్న సందర్భంగా కవిత్వం ఎవరికొరకు, ఎందుకొరకు అని రెండు ప్రశ్నలు వేసుకొని దానికి జవాబుగా వ్రాసిన కవిత ప్రతిజ్ఞ. ఈ కవితలో సంపదలు సృష్టించే కర్షక, కార్మిక వర్గాల వారిని కథా నాయకులుగా ప్రతిపాదించి వాళ్ల శ్రమను దోచుకోవడమే కాని, విలువ కట్టలేని వ్యవస్థ దుర్మార్గాన్ని సూచించాడు. శ్రమ దోపిడికి గురి అయ్యే ప్రజా సమూహాలు సంఘటితమవుతూ విప్లవకర వర్గాల్లో రూపొందుతున్న చారిత్రక వాస్తవాన్ని నిరూపించారు. ఈ చారిత్రక సందర్భాలు కవి అయినవాడు కార్మిక లోకపు కళ్యాణానికి శ్రామిక లోకపు సౌభాగ్యానికి కట్టుబడాలని ప్రకటించాడు.

ఆకలిని వేదనను, దారిద్ర్యాన్ని,దౌర్జన్యాన్ని పరిష్కరించేందుకు, బహిష్కరించేందుకు బాటలు తీస్తూ పాటలు వ్రాస్తూ కవి ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ సమాజంలో అభ్యుదయాన్ని కాంక్షించిన కవి శ్రీశ్రీ మనందరికి మార్గదర్శకం.

ఉపయుక్త గ్రంథాలు :

1) మహాప్రస్థానం : శ్రీశ్రీ
2) తెలుగు సాహిత్య చరిత్ర : ద్వానా శాస్త్రి.

❖❖❖

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' – అభ్యుదయ దృష్టి

– **జి. యమున రెడ్డి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, శ్రీ సత్య సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ లర్నింగ్, అనంతపురము క్యాంపస్.

శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానంలోని తొలి దశ :

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) 1910లో విశాఖ పట్నంలో జన్మించారు. 8 సం॥ల వయస్సులోనే కంద పద్యం రాశారు. 18వ ఏట 'ప్రభవ' కావ్యం వెలువరించారు. దీనిని మారుతల్లి సుభద్రమ్మకు అంకితం చేశారు. 1920లో వీరసింహ, విజయసింహ అనే నవలలను రాసినట్లు చెప్పుకున్నారు. 1927 'భారతి' జూలై సంచికలో తాను రాసిన ''అభిసారిక''లోనూ ప్రభవలోనూ కూడా భావ కవిత్వపు ఛాయలే కనిపిస్తాయి. 1920 నుంచి 1940 మధ్య కాలంలో స్పందించే గుణమున్న ప్రతి వారు భావ కవిత్వపు వలలో చిక్కుకోక తప్పలేదు. అందుకు శ్రీశ్రీ మినహాయింపు కాదు. శ్రీశ్రీ గారే ఒకచోట కృష్ణశాస్త్రి పద్యాలకు కార్బన్ కాపీలా రాసేవాళ్ళమని చమత్కరించు కున్నారు. అందుకు చక్కని ఉదాహరణ ఆనాడు భావకవులల్లోని సహజ లక్షణమైన స్వేచ్ఛ కృష్ణశాస్త్రిని పోలిన శ్రీశ్రీ కవితల్లోనూ కనిపిస్తుంది. ''ఆకులో ఆకునై పూవులో పూవునై...'' జగమునిండ స్వేచ్ఛగాన ఝరుల నిండు అని కృష్ణశాస్త్రి గారంటే శ్రీశ్రీ ''నేను సైత మొక్కాకునై యొనయుదేని... గాలి యొనగెడు కొత్తఱెక్కలు ధరించి, అతి నిరాఘాటముగ విహాయస పథాల నెఱుక పడరాని యొచటికో ఎగసిపోదు'' అని అంటాడు. శ్రీశ్రీ రచనల్లో తొలిదశలో వచ్చిన ''మాతృ గీత''లో ప్రకృతి ఆరాధనాతత్వం. అందులో పద ఆడంబరత కూడా కనిపిస్తాయి. ఈ లక్షణం మాతృగీతి, మృత్యుప్రబోధం ఖండికల్లోనూ స్పష్టంగా చూడగలం. శ్రీశ్రీ గారికి గీతపద్యాల మీద గల మక్కువను ''గీత పద్యాలు'' అన్న ఖండికలోను చెప్తారు. ''ప్రాణసన్నిభమై గీతి త్రుళ్ళులాడు'' అంటాడు.

''ఓ మహాత్మ! త్వదీయ మహోన్నత ప్ర
భావమింతని తెలుపనెవ్వానితరము?
.....
దివలోచనములఁబ్రసాదింపుమయ్య!''

ఇది శ్రీశ్రీ గారి మొట్టమొదటి పద్యం. అప్పటికి అతనికి 15 ఏళ్ళు. ఇవి విశ్వరూప సందర్శనము అనే ఖండికలో విశ్వరూపం ధరించిన శ్రీకృష్ణుడ్ని ధృతరాష్ట్రుడు విశ్వరూపం దర్శించడానికి తనకు కళ్ళమ్మని అడుగుతున్న సందర్భంలోనిది. ధృతరాష్ట్రుడి మాటల్లో శ్రీశ్రీ ఆర్తి కనిపిస్తుంది. ఈ దివ్యలోచనం అతడికి కావలసిన కవితా ప్రతిభయే. కవితా ''విశ్వరూప సాక్షాత్కారం'' తనకు తన 27వ ఏట కలిగిందని చెప్పుకున్నారు.

''ధైర్యము త్యజించి ఘోర యుద్ధంబు సేయ
ననుచిత పలాయన పథంబు ననుసరించి
ఓ సుయోధన! యెందేగి యుంటివిపుడు
రమ్ము! క్షత్రియోచిత సంగరం బొనర్ప''

అంటూ ''సమరాహ్వానము''లో మడుగులో దాక్కున్న దుర్యోధనుడికి ధర్మరాజు సమరాహ్వానము పలుకు తున్నాడు. ఇక్కడ శ్రీశ్రీ గారిలో మహాభారత గాథలోని సత్య సందర్శనం పట్ల ఉత్కంఠ, ధర్మ సంగ్రామం పట్ల అభిమానం చిన్నతనంలోనే ఆకర్షించాయని స్పష్టమవు తోంది. కాబట్టే శ్రీశ్రీ గారికి అతి తక్కువ సమయంలోనే గతితార్కిక భౌతికవాదం ఒంటబట్టింది. పీడిత వర్గం పట్ల పక్షపాతం పెంచుకొని కదనశంఖం పూరిస్తానన్నారు.

శ్రీశ్రీని అభ్యుదయం వైపు నడిపిన అంశాలు :

శ్రీశ్రీ రెండు శ్రీకారాలకు ప్రతీక. ఒక శ్రీకారం అభ్యుదయ ప్రస్థానానిది! మరో శ్రీకారం విప్లవ ప్రస్థానానిది.

1930 నుండి శ్రీశ్రీ రచనల్లో మార్పు కనిపిస్తుంది. అందుకు ఆనాడు అమెరికాలో ప్రారంభమైన ఆర్థిక మాంద్యం కూడా ఒక కారణము. ఆనాడు ప్రపంచమంతా

శ్రమను నమ్ముకొని బతికిన కోటాను కోట్ల మంది వీధిన పడ్డారు. మరోవైపు పెట్టుబడిదారి దేశాలలో దోపిడీ, దౌర్జన్యాలు అధికమయ్యాయి. ఈ ఆర్థిక మాద్యాన్ని తట్టుకో గలిగిన ఒకే ఒక్క దేశం రష్యా. అందుకు కారణమైన సామ్యవాద సిద్ధాంతాలు ఆనాటి కవుల్ని బాగా ఆకర్షించాయి.

అదే సమయంలో పురిపండా వల్ల నజురుల్ ఇస్లాం కవిత్వంతో పరిచయం కలగడం, మద్రాసులో కొంపల్ల జనార్దనరావు పరిచయం, ముద్దుకృష్ణ వంటి సాహితీ సంస్థలతో సాహచర్యం, హరీష్ ప్రభావంతో అంతర్జాతీయ రచనలు చదవడం ప్రారంభించారు. అబ్బూరి వారి సహ చర్యంతో ఆనాటికొన్తున్న సోషలిస్టు గ్రంథాలను అధ్యయనం చేయడం, భారతదేశంలో ఒక బలమైన శక్తిగా కార్మిక వర్గం నిలదొక్కుకోవడాన్ని గమనించాడు, ప్రపంచంలో ధనిక శక్తికీ, సోషలిస్టు శక్తికీ ఉన్న తారతమ్యాన్ని అవగాహన చేసుకున్నాడు. శ్రామిక శక్తులు అంతర్జాతీయతను గుర్తించాడు. అప్పటివరకు తాను ఎంచుకున్న మార్గం సరికాదనీ కొత్త మార్గంలో ప్రయాణిం చాలనీ భావించాడు. క్రమంగా శ్రీశ్రీ భావ కవిత్వం నుండి వాస్తవిక ధోరణితో అభ్యుదయ రచనల వైపు అడుగులు వేశారు. అదే మహాప్రస్థాన గీతాల రచన.

ఆంధ్ర సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవితా మహా ప్రస్థాన యుగ కర్త శ్రీశ్రీ. దాదాపు 1930 నుంచీ ఆంధ్ర సాహిత్యం ఆయన వెంట నడిచింది. ఆయన పాట, మాట, పక్రియ ప్రభోదం యువతరానికి విప్లవ శంఖా రావం వినిపించింది.

"ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం"

అన్న గేయం అభ్యుదయ కవి కుమారుల కావ్య గీతాలకు పల్లవిగా పరిడవిల్లింది. ఈయన కవిత నవకవనానికి పెనునిద్దుర వదిలించే గర్జన కదులుతూ కదిలించేదీ, మారుతూ మార్పించేదీ, పాడుతూ పాడిం చేదీ, పరిపూర్ణపు బ్రతుకునిచ్చేదీ శ్రీశ్రీ నవకవనం. "నేనొక దుర్గం, నాదొక స్వర్గం, అనర్గళం, అనితర సాధ్యం నా మార్గం" అన్న శ్రీశ్రీ వాక్కు శిలాక్షరంగా నిలిచే వాఙ్మయ సత్యం.

మహాప్రస్థానంలో అభ్యుదయ దృష్టి :

1950లో వెలువడిన ఈ మహాప్రస్థానాన్ని తన మిత్రుడైన కొంపెల్ల జనార్దన గారికి అంకితమివ్వగా, చలం గారు యోగ్యతాపత్రం అందించారు. ముఖ్యంగా ఇందులో 40 కవితా ఖండికలతో కూర్చడం జరిగింది. ఇందులోని ప్రతీ ఖండికలో శ్రీశ్రీ గారి అభ్యుదయ దృష్టికి నిదర్శనంగా కనిపిస్తాయి.

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వసృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను! "

అంటూ శ్రీశ్రీ "జయభేరి" ఖండికలోని నేను అంటే ఒక సామాన్యుడు, శ్రామికుడు. నేను సైతం అనే నుడికారం మానవ జాతి చరిత్రలో పేరుకు కూడా నోచు కోని ఒక సామాన్యుడికి ప్రాముఖ్యం కలిగిస్తోంది. తన గతాన్ని అవగాహన చేసుకొని, భవిష్యత్తులో జయభేరి మ్రోగిస్తాడు సామాన్యుడు. నేను సైతం ప్రపంచాజ్ఞపు తెల్లరేకై పల్లవిస్తానంటాడు.

"కదం తొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం,
పదండి పోదాం,
వినబడ లేదా
మరో ప్రపంచపు జలపాతం?

అంటూ "మహాప్రస్థానం" ఖండికలో మరో ప్రపంచం

అనే సామ్యవాద వ్యవస్థలోకి కదిలించడానికి తానే ఒక విప్లవ నాయకుడై ప్రేరేపిస్తూ రచించిన గేయం ఇది. ఈ గీతం రాసేనాటికే మరో ప్రపంచం రష్యాలో ఏర్పడింది. కనుక అది కేవలం ఊహాస్వర్గం కాదు. అందుకే వినబడ లేదా మరో ప్రపంచపు జలపాతం అని ప్రశ్నించాడు.

"ఏవో,
ఏవేవో, ఏవేవో
ఘోషలు వినబడుతున్నాయ్!
గుండెలు విడిపోతున్నాయ్! "

అంటూ 'అభ్యుదయం' గేయంలో శ్రామికులలో, కార్మికులలో రగులుతున్న చైతన్యం. పాలక చర్యల పట్ల పీడిత గుండెల్లో కలుగుతున్న విద్వేషం విప్లవంగా మారుతున్న వైనాన్ని చెబుతారు.

"సింధూరం, రక్తచందనం,
బంధూకం, సంధ్యారాగం,
పులిచంపిన లేడినెత్తురూ,
ఎగరేసిన ఎర్రని జెండా,
రుద్రాలిక నయనజ్వాలిక,
కలకత్తా కాళిక నాలిక
కావాలోయ్ నవకవనానికి"

అంటూ 'నవ కవిత'లో పేర్కొన్నవన్నీ ఎరుపును సూచించేవే. ఎరుపు విప్లవ సంకేతం. కాబట్టే అలాంటి సామాగ్రే నవ కవనానికి కావాలంటాడు.

"ఎగిరించకు లోహవిహంగాలను
కదిలించకు సుప్తభుజంగాలను
ఉండనీ,
మస్తిష్క కులాయంలో!
మనోవల్మీకంలో! "

అంటూ "సాహసి" ఖండికలో వెక్కిరిస్తాడు అతివాది.

లోహవిహంగం విప్లవాది సృష్టించే పోరాటాన్ని సూచిస్తుంది. సామ్యవాదాన్ని కోరే అతివాది పీడక వర్గాన్ని ద్వేషించక మానడు. ఈ ద్వేషమే 'భుజంగం' దీన్ని కదిలించ వద్దంటాడు మితవాది. వెక్కిరిస్తాడు అతివాది.

"ఇవేమిటీ వింత భయాలు?
ఇంట్లో చీకటి!
ఇవేమిటీ అపస్వరాలు?
తెగింది తీగ!
అవేమిటా రంగుల నీడలు?
చావూ, బ్రదుకూ!
ఎచటికి పోతావీ రాత్రి?
అవతలి గట్టుకు! "

అంటూ "అవతలి గట్టు" అనే కవితలో వేసిన ప్రశ్నా జవాబూ ఒక మితవాది / భావవాది వేసే ప్రశ్నలకు అతివాది / భౌతికవాది ఇచ్చే జవాబులు. ఇందులో మార్పును కోరుకోని మితవాది ఎచటికి పోతావీ రాత్రి? అనే ప్రశ్నకు అతివాది / భౌతిక వాది అవతి గట్టుకు! అన్న సమాధానం మార్పును సూచించే మరో ప్రపంచమే అవతి గట్టు.

"ఆ అవ్వే మరణిస్తే
ఆ పాపం ఎవ్వరిదని
వెర్రిగాలి ప్రశ్నిస్తూ"

వెళ్ళిపోయింది "బిక్షువర్షీయసి"లో జబ్బు చేసి పడిపోగా ఆ అవ్వే మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని ప్రశ్నించే వెర్రిగారి భౌతికవాదికి ప్రతీక కాదా. ఇది నా పాపం కాదని జవాబు చెప్పిని ఎంగిలాకు కర్మవాదికి ప్రతీక. ఆ ఎంగిలాకు సమాజ శ్రమను దోచుకొని సుఖంగా భుజించిన పెట్టుబడిదారుడి ఎంగిలాకే. అతడే హేతువాదాన్ని తిరస్కరించి మత సిద్ధాంతాలను ఆశ్రయిస్తాడు.

"మాయంటావా? అంతా
మిథ్యంటావా?
నా ముద్దుల వేదాంతీ!
ఏమంటావు?
మాయంటావూ? లోకం
మిథ్యంటావూ?"

అంటూ 'మిథ్యావాది' కవిత ద్వారా 'మాయ', మిథ్య అనే వేదాంతుల పరిభాషలోనే కఠోర సామాజిక

వాస్తవాలను కళ్ళముందుంచి వేదాంతుల మాడుపగల కొడతాడు.

"అందరం కలిసి చేసిన ఈ
అందమైన వస్తు సముదాయం అంతా
ఎక్కడో ఒక్కడే వచ్చి
ఎత్తుకుపోతూ ఉంటే చూసి,
"అన్యాయం, అన్యాయం!" అని మేమంటే
అనుభవించాలి మీ కర్మం" అంటాడు.

దోపిడీలు, దౌర్జన్యాలు, పీడనల విశ్వరూపాన్ని తెలియజేసే కవిత 'వాడు'. కర్మ, రాత మొదలైన మాటలు మానవ శక్తిని నిర్వీర్యం చేస్తాయి. ఆ మాటల ముసుగులో అనాదిగా ప్రజలు దోపిడీకి గురవుతూనే వచ్చారు. శ్రీశ్రీ పాలకుల దౌర్జన్యాలను తేటతెల్లం చేస్తాడు 'వాడు' కవిత ద్వారా. ఇది శ్రీశ్రీ ప్రాపంచిక దృక్పథాన్ని తేటతెల్లం చేస్తుంది.

"నైలునదీ నాగరికతలో
సామాన్యుని జీవన మెట్టిది?
తాజమహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?"

అంటూ "దేశచరిత్రలు" ఖండికలో చారిత్రక భౌతిక వాదం వల్ల నూతన దృక్పథంలో చరిత్రను చదువుకున్న శ్రీశ్రీ చరిత్రకారుల మీద తిరగబడి వేసిన సూటి ప్రశ్నలవి. పాలక వర్గాన్ని సమర్థిస్తూ, కీర్తిస్తూ సాహిత్యం లాగే చరిత్ర కూడా రచింపబడిందింత వరకూ. పాలక వర్గమే నిజానికి చరిత్రను సృష్టించింది. కానీ ఆ చారిత్రక యథార్థతత్వం ముసుగులో పడిపోయింది.

"ఇతిహాసపు చీకటి కోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు
దాచేస్తే దాగని సత్యం" అంటాడు.

షాజహాన్, ముంతాజమహల్‌ల ప్రణయగాథకుండే ప్రాధాన్యం చరిత్రలో తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలకు కనిపించదు. అంటే ఆ కూలీల పేర్లు చెప్పమని కాదు. వారి జీవన విధానం ఎలా ఉండేది? కళాఖండాల నిర్మాణం కూలీల శ్రమ లేకుండా జరగదు. ఆ శ్రమకు తగిన ప్రతిఫలం వారికి దక్కిందా? లేక దోపిడి జరిగిందా? అన్నది చూడాలంటారు. సామ్రాజ్య విస్తరణ కాంక్షతో ప్రభువులు చేసిన దండయాత్రలలో సామాన్యులు సైనికులుగా పాల్గొన్నారు. వారి పాత్రను గురించి ఏ చరిత్రకారుడూ వ్రాయనే లేదు. అందుకే సామ్రాజ్యపు దండయాత్రలో సామాన్యుని సాహసమెట్టిది? అని ప్రశ్నించాడు.

"మీ బాధలు, మీ గాథలు
అవగాహన నాకవుతాయి!
పతితులారా! భ్రష్టులారా!
దగాపడిన తమ్ములారా!
మీ కోసం కలం పట్టి
ఆకాశపు దారులంట
అడావుడిగ వెళ్ళిపోయే,
అరచుకుంటూ వెళ్ళిపోయే
జగన్నాథుని రథచక్రాల్,
రథచక్ర ప్రళయఘోష
భూమార్గం పట్టిస్తాను!
భూకంపం పుట్టిస్తాను!"

అంటూ "జగన్నాథుని రథచక్రాలు" గేయంలో శ్రీశ్రీ సమాజంలో బూర్జువాలు దోపిడీకి గురి అవుతున్న పతితుల్ని భ్రష్టుల్ని ఏడవకండని ఓదారుస్తూ వారిని ముందుకు నడిపిస్తాడు. ఈ లోకం మీదేనండి! మీ రాజ్యం మీరేలండి! అంటూ రాజ్యం వారికి అప్పగిస్తాడు.

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గీతాలలో అడుగడుగునా తనను తాను శ్రామిక, కార్మిక పక్షపాతిగా, పీడిత జనుల పక్షాన నిలిచి దోపిడీదారులను, ప్రశ్నిస్తూనే మరోవైపు ప్రజలలో చైతన్యం రగిలించే విధంగా గతి తార్కిక భౌతికవాదిగా అభ్యుదయ దృక్పథంతో ముందుకు సాగుతూ కనిపిస్తారు. అందుకే చలం గారు తన యోగ్యతాపత్రంలో "హృదయం

ఎలా కంపిస్తే ఆ కంపనకి మాటల రూపాన్ని ఇవ్వడం అతనికే చేతనవును. పద్యాలు చదువుతోంటే ఇవి మాటలు కావు, అక్షరాలు కావు - ఉద్రేకాలు, బాధలు, యుద్ధాలు - అతని హృదయంలోంచి మన హృదయం లోకి డైరెక్ట్‌గా పంపిన ఉత్సాహాలు, నెత్తురు కాలవలని పిస్తుంది" అంటాడు.

ఆధార గ్రంథాలు :

1) మహా ప్రస్థానం గీతాలు - శ్రీశ్రీ
2) శ్రీశ్రీ కవితా వైభం - డా॥ మిరియాల రామకృష్ణ
3) రంజని - (శ్రీశ్రీ సంస్మరణ సంచిక) - ప్రభవ నుండి ప్రస్థానం - డా॥ ఏటుకూరి ప్రసాద్
4) ఆధునికాంధ్ర కవిత్వం - యం.ఏ. (తెలుగు), యస్.కె.యు., అనంతపురము.

❖❖❖

"శ్రీ శ్రీ కవిత్వంలో సామాజిక చైతన్యం"

– డా॥. ఎం. ఫాయిదచేగం, తెలుగుశాఖ అధ్యక్షురాలు, సిల్వర్ జూబ్లి ప్రభుత్వ కళాశాల (స్వ), కర్నూలు.

ఆధునిక తెలుగు కవిత్వంలో శ్రీ శ్రీ ప్రళయంలా, ప్రభంజనంలా, అలజడిలా, ఆందోళనలా, ఉద్రేకంగా, సమరంలా, సంఘర్షణలా, తుఫానులా, తూర్పురావంలా, అగ్నిలా, త్రేతాగ్నిలా, భాష్యంలా, చితాభిస్మంలా, ఆకలిలా, ఆకలికేకలా దర్శనమిస్తాడు.

1930-50 మధ్యకాలాన్ని శ్రీశ్రీకాలంగా గుర్తించవచ్చు. ఆధునిక మహాకావ్యంలా విరాజల్లుతున్న మహా ప్రస్థానంలోని ప్రసిద్ధ గేయాలన్ని ఈ మధ్యకాలంలో. మహాప్రస్థానం మొట్టమొదట 1950 సం.లో వెలువడింది. ప్రతికవి తనదైన ఒకకాలం, సమాజం, చరిత్ర కల్గి ఉంటాడు. ముఖ్యంగా శ్రీశ్రీలాంటి కవులకు ఇది ప్రధానంగా వర్తిస్తుంది.

ప్రాచీన తెలుగు కవిత్వం రాజాశ్రయంలో, పండితుల మధ్య బతికి బట్ట కట్టింది. అలౌకికాలను, అద్భుతాలను శక్తివంచన లేకుండా చిత్రించింది. శబ్దార్థాల మధ్య భావ గాంభీర్యాల మధ్య, గణయతి ప్రాస నియమాల మధ్య, రస ధ్వనుల మధ్య, అలంకార వర్ణనల మధ్య చిక్కుబడి పోయి కొట్టుమిట్టాడుతున్న తరుణంలో తెలుగు కవిత్వాన్ని గురుజాడ తన స్మర్శతో పునీతం చేసాడు. వస్తువులో, భావనలో, భాషలో, వ్యక్తీకరణలొ నవ్యత సాధించి సాహిత్య సమకారన సామాజిక వాస్తవికతకు అద్ధం పట్టేటట్టు చేసాడు. గురజాడ ప్రవేశపెట్టిన వాస్తవిక జీవితచిత్రణ శ్రీశ్రీలాంటి కవులకు మార్గ నిర్దేశికత్వం చేసింది. అందుకే "నా అడుగుజాడ గురజాడ" అని శ్రీశ్రీ చెప్పుకున్నాడు.

గురజాడ తెలుగు కవిత్వ దృష్టిని ప్రజాస్వామిక భావాల వైపు మళ్ళిస్తే శ్రీశ్రీ ఆ స్ఫూర్తిని మరింత బలంగా, శక్తివంతంగా అభ్యుదయం వైపు తీసుకువెళ్ళాడు. శ్రమ జీవుల కష్టాలను, కన్నీళ్ళను, అవేదనలను, సంవేదనలను, సాహిత్యంలో నిలుపడం కోసం సమస్త భౌతిక సంపదల్ని సృష్టిస్తున్న శ్రమ జీవులకు సాహిత్యంలో స్థానం కల్పిడం కోసం కంకణం కట్టుకోని భూమ్యాకారౌలు అదిరేటట్టు, గుర్రాలు పగిలేటట్టు, దిక్కులు ఒక్కబిల్లేటట్టు "ఆకలి" కవిత్వం రాసాడు.

సమాజంలో దోపిడి, దౌర్జన్యాలు, పీడన, అణచివేతలు దినదినానికి మితి మీరి పోతుంటే దారిద్ర్యం, నిరుద్యోగం, అనారోగ్యం, ఆకలి వంటి సాంఘిక రుగ్మతలు విలయ తాండవం చేస్తుంటే వాటినన్నింటిని ప్రత్యేక్షంగా, పరోక్షంగా చవిచూసిన శ్రీశ్రీ అణువణవూ కదిలి, కరిగి, మరిగె మాటల్ని తూటలుగా, కత్తులుగా, రక్తాని రాగా లాపనగా మార్చి తన కవితల ద్వారా సామాజిక చ,తన్యానికి ప్రాణం పోశాడు.

ఆర్థిక అసమానతలు, దోపిడీ దౌర్జన్యాలు లేని నూతన సమాజం కోసం శ్రీశ్రీ పరితపించాడు. స్వేచ్ఛ, సమానత్వం, సాభ్రాతృత్వం లభించే సమాజం కోసం తన కవితల ద్వారా మాత్రమే సాధ్యమౌతుందని గ్రహించి.

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచ ం పిలిచింది !
పడండి ముందుకు
పదండి త్రోసుకు

పోదాం, పోదాం పైపైకా అంటూ సమస్త ప్రజానీకాన్ని మరో ప్రపంచం వైపు మల్లించి - మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధగధగలు, ఎర్రబావుట నిగనిగలు, హోమ జ్వాలలు భుగభుగలు వారికి చూపించాడు.

సమస్త భౌతిక సంపదలకి శ్రమే మూలదుని శ్రమ జీవులే ప్రధానమని గురించిన శ్రీశ్రీ వక్తి సామాజిక చైతన్యంలో భాగం కావడాన్ని అభిలసిస్తూ

నైను సైతం
ప్రంచాగ్నికి
సమిధ నొక్కటి అహుతిచ్చాను.
నేనుసైతం
విశ్వసృష్టికి
ఆశ్రువొక్కటి ధారపోశాను !
నేను సైతం
భువన ఘోషకు
వెరిగొంతుక విచ్చిమ్రోశాను !! అంటాడు.

ఆత్మాశ్రయరీతిలో సాగిన ఈ గేయంలో వ్యక్తి చైతన్యం సామాజిక చ,తన్యంలో భాగమైంది.

ఎండల్లో, వానల్లో ఎండుతూ తడుస్తూ తను శ్రమను ఎలా ధారపోస్తుంది. గుర్తుచేసి ఆ శ్రమ జీవులే లేకుంటే లోకం ఏమౌతుందో వివరిస్తూ.

నేనొకణ్ణే
నిల్చిపోతే
చంద్రగాడ్పులు, వానమబ్బులు, మంచునోనలు
భూమి మీదా
భుగ్నమౌతాయి.
వింగినుండీ తొంగిచూసే
రంగు రంగుల చుక్కలన్నీ
రాలి, నెత్తురు క్రక్కుకుంటూ
పేలిపోతాయి !
పగళ్ళన్నీ, పగిలిపోయీ,
విశధాలూ విశీర్ధిల్లి,
మహాప్రళయం జగం నిండా
ప్రగల్భిస్తుంది --- అంటూ కఠీర సత్యాన్ని గుర్తు చేసాడు.

ఇక్కడ నెత్తుర క్రక్కుకుంటూ రాలిపోయేది నక్షత్రాలు కాదం. శ్రమ జీవులు సృష్టించే సంపదను శ్రమశక్తిని దోచుకొనే భూస్వాములు, ధన స్వాములు.

నూతన సమాజాన్ని, నూతన వ్యవస్థను కోరుకునే శ్రీశ్రీ తన భావాలను అనుగుణమైన కవితా వస్తువును, కవితా నిర్మాణాన్ని, ఎన్నుకోవాల్సిన అవసరం ఏర్పడింది. 'నవ కవిత'లో కవితా వస్తువుని, కవిత్వం ప్రయోజానాల్ని స్పష్టంగా వ్యకత్వం చేశాడు.

తన కవిత్వంలోని వస్తువుని తన కవిత్వం ఆశించే ప్రయోజనాన్ని కవిత ద్వారానే వ్యక్తీకరించడం శ్రీశ్రీకే చెల్లింది.

"సిందూరం ఎర్రచందనం
బంధూకం సంధ్యారాగం
పులి చంపిన తరినేత్తురూ
ఎగురేసిన ఎర్రజెండా
రుద్రాలిక నయన జ్వాలిక
కలకత్తా కాలిక నాలిక
కావాలోయ్ నవ కవనానికి"అంటాడు.

ఎరుపురంగు విప్లవానికి సంకేతం- తాను సామాజిక విప్లవానికి పూనుకొన్నాడు. కాబట్టి ఎరుపునే ఎంచు కొన్నాడు. తర్వాత భయం గొల్పే, విస్మయం గొల్పె అంశాలను నవ కవిత్వానికి అవసరమని వస్తు సామాగ్రిగా నిర్దేశించాడు.

కవిత్వ ప్రయోజనం గురించి శ్రీశ్రీకి ఒక ప్రత్యేక దృక్పధం ఉంది. కాబట్టే కవిత్వ ప్రయోజనాన్ని సామాజిక ప్రయోజనం దృష్ట్యా నిర్దేశిస్తూ.

"కదిలేది కదిలించేది
మారేది మార్పించేది
పెను నిద్ధర వదిలించేది
మును ముందుకు సాగించేది" - అనాదిగా అడిగి నువ్వే భూస్వాములకి, ధనస్వాములకి సేవలు చేసి వాళ్ళ భోగ భాగ్యాలకు నీప్రాణాలైన శ్రామికులు తప్పక తిరుగుబాటు చేస్తారనే భావాన్ని ధ్వని పూర్వకంగా పురాణా ప్రవేశాల్ని ఏకరువు పెడుతూ కొత్త సృష్టికి భాగ్యం పోసాడు.

'అవతారం' అనే గేయంలో యముడు, సూర్యుడు, శివుడు మొదలైన దేవుళ్ళ వాహనాలు, వాళ్ళని ధిక్కరించి సవాల్ చేస్తున్నాయని అచ్చంగా వివరిస్తూ ఆ తిరుగుబాటు

పాత వ్యవస్థను శిధించేసి క్రొత్త వ్యవస్థను నిర్మించే మార్పుగా ఆ మార్పు పుడమి తల్లకి పురిటి నొప్పిగా క్రొత్త సృష్టికి నాండగా భావించాడు.

సృష్టాదిగా కొందరు శ్రమిస్తూ ఉంటే మరికొందరు ఆ శ్రమ సంపదను అనుభవిస్తూనే ఉన్నారు. సమస్త సంపదలన్నీ సృష్టిస్తున్న శ్రమ జీవులు కడ్డు, గుడు, గుట్టకై కరువై దోపిడీ, దౌర్జన్యం, పీడనలకు గురవెతూనే ఉన్నారు. కాలం మారినా, సమాజం మారినా, పరిస్థితులు మారినా సామాన్యుల బ్రతుకుల్లో, శ్రమజీవుల బ్రతుకుల్లో మాత్రం, ఏ మాత్రం మార్పు లేదు, కానీ శ్రమ విలువ కట్టడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ఈ నగ్న సత్యాన్ని శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ" గేయంలో

పొలాల నన్నీ
హలాలా దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ
కావాలోయ్ నవ కవిత్వానికి ..... అంటూ కవిత్వం ప్రయోజానాన్ని నిర్దిశిస్తాడు. ఇంతగా రుద్రరూపం ధరించిన కవి అప్పట్లో మరొకరు లేరు.

శ్రీశ్రీ "బుక్కులు" అనే గేయంలో కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, రొట్టె ముక్క, అరటి తొక్క, బల్లచెక్క, తలుపు గొళ్ళెం, వంటి సాధారణ అంశాలను కూడా కవితామయం చేయడం, ప్రపంచం ఒక పద్మ 'వ్యూహం' అని కవిత్వం ఒక 'తీరని దీపం' అని తెర్చి చెప్పాడు.

"అలజడి మా జీవితం
అందొళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం" అని గొంతు సారించి

నూతన సమాజాన్ని నిర్మించడం కోసం ప్రపంచం నన్నిద్ధమవుతున్న సమయాన్ని అభ్యుదయంగా పేర్కొన్నాడు. ఫాసిజం పైశాచికానికి సమయాన్ని అభ్యుదయంగా పేర్కొన్నాడు. ఫాసిజం పైశాచికానికి వ్యతిరేకంగా జరిపిన పొరాటాన్ని అభ్యుదయంగా భావించారు.

ఘర్మ జలానికి
ధర్మ జలానికి
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్

విలాపాగ్నులకు, విషాదాశ్రులకు ఖరాఖండిగా తెల్చిచెప్పారు. వాళ్ళ శ్రమ నిష్పలమైనప్పుడు, వాళ్ళ బ్రతుకులు నిఘారమైనప్పుడు శ్రమ విలువ కోసం వాళ్ళంలా ఏకమై దీర్ఘశృతిలో తీవ్రధ్వనిలో విప్లవశంఖం 'దేశచరిత్రలు' లో

"ఏదేశ చరిత్ర చూసినా
ఏమున్దం గర్వకారణం
దరజాతి చరిత్ర సమస్తం
పరపిడన సరాయణత్వం"--- అంటారు.

ఏదేశం ఏకాలంలో సాధించానదే పరమార్థం అని నిలదీశాడు.

తెలుగు సాహిత్యంలోనే మొట్ట మొదటిగా బాదితులకీ, పరితులకీ, దీనులకీ, హెనులకీ, భ్రష్టులకీ, బాధా సర్ప ద్రష్టులకీ, అనాధలకీ, అభాక్తులకీ, అంశాతకీ, ఉన్మాదులకీ, బాటుసారులకు, బిక్షగతైలో, వెర్రినాళ్ళకి, కూర్రవాళ్ళకి, ధీరాలకీ, వీరులకీ, కర్షకులకీ, కార్మికులకీ, నక్కలకీ, పువ్వులకీ, గుడ్ల గూబలకీ సమస్త ప్రాణులకీ స్థానం కల్పించిన వాడు - శ్రీశ్రీం

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రామిక జీవన గీతం – శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ'

– ఎస్. శశికళ, పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం

తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవిత్వ యుగకర్తగా మహాకవిగా ప్రాచుర్యం పొందిన కవి శ్రీశ్రీ. వీరి పూర్తి పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. ప్రముఖ తెలుగు కవి, విప్లవ కవిగా, సాంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవారుగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షులుగా, అలాగే సాహిత్య రంగంలోనే కాకుండా ఇటు సినిమా పాటల రచయితగా కూడా ప్రసిద్ధులు. అంతేకాదు హేతువాద ధృక్పథం కలిగినవారు. నాస్తికులు. తెలుగు సాహిత్యంలోకి వెలుగు కిరణంలా ప్రవేశించిన వారూ శ్రీశ్రీ గారు. కవిత్వం కవిత్వం కోసం కాక సమాజం కోసమే అనే అభిప్రాయపడ్డారు. సమాజం, సాహిత్యం, రాజకీయం. విజ్ఞానం వేరు వేరుగా కాకుండా అన్నిటికీ కవిత్వంలో సహజీవనం ఏర్పాటు చేశారు. తరువాత కాలంలో సంప్రదాయకమైన గ్రాంధిక శైలి, ఛందస్సు కవిత్వం రాశారు. ఇలా చేయటం గురజాడ అడుగుజాడ" అని శ్రీశ్రీ అన్నారు.

1934కూ 1940కీ మధ్యకాలంలో రాసిన కవితలతో మహాప్రస్థానాన్ని గేయసంపుటిగా తన సర్వోత్తమ కావ్యంగా ప్రచురితమైంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో మహాప్రస్థానం అనే కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవిని చేసింది. ఇంతటితో వీరి ప్రయాణం ఆగకుండా కష్టపడుతున్న శ్రామికులను చూసి కర్షకుల అవస్థలను చూసి చలించిన గీతాలే కవితలుగా ధారా వాహికగా వెలువడ్డాయి, అందుకేనేమో "వ్యక్తికి బహు వచనం శక్తి" అనేది అతను సృజించిన మహోత్తర వాక్యమే! అయింది.

ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ఎదుర్కొంటున్న బాధలు ప్రధానేతివృత్తంగా ఉండేట్లు గేయాలను అమర్చారు. ఈ మహాప్రస్థానంలో 40 కవితా ఖండికలు ఉన్నాయి. అందులో అభ్యుదయ కవిత్వ లక్షణాలు ప్రతిబింబించే శ్రీశ్రీ ప్రతిజ్ఞ గేయం చాలా అద్భుతంగా ప్రజల హృదయంలో చిరస్థాయిగా స్మరించుకునేలా చేశారు అని భావించవచ్చు. ఈ గేయంలో శ్రామిక జీవన విధానాన్ని, దోపిడిదారుల వ్యవస్థను, అలాగే శ్రమపడి నిర్మించిన వుస్తువుల మీద శ్రామికుడు హక్కు పొంద లేకపోవడం, సంఘం నుంచి కొందరిని వెలివేయడం ఇలా ప్రపంచంలోని యదార్థ సంఘటనలను దర్శించారు కాబట్టే శ్రీశ్రీ కవిత్వానికి పునాది వ్యధార్థ జీవుల యధార్థ దృశ్యం అయ్యింది అని చెప్పవచ్చు.

అబ్బూరి నమకూర్చిన లండన్ అభ్యుదయ రచయితల మేనిఫెస్టోను చదివి 1937లో కవితారూపంలో శ్రీశ్రీ ఈ గేయాన్ని రచించారు. మెనిఫెస్టోలోని విషయాలు అతడి మనసు మీద చెరగని ముద్ర వేశాయి. వీరు తన స్వభావోచితంగా దాని మూలభావాలను కవితగా మలిచారు. ఆ సమయంలో వారే తరవాతి కాలంలో చెప్పినట్లు జాన్ ఎడ్వర్డ్ మాస్‌ఫీల్డ్ (1878-1967) రాసిన నానికుల మాండలికంలోని సాల్ట్‌వాటర్ బలాడ్స్ (1892) అనే గీతాలూ అతడి మనసులో లోతుల్లో మెసలు తున్నాయి.

ఫలితంగా 'ప్రతిజ్ఞ' అనే గేయం తన గురువునే అలరించింది. ప్రచురితమైన మరుక్షణం నుంచి సాహితీపరుల మనస్సులనే దోచుకుంది. గేయచ్ఛందస్సు కదిలించి కుదిలించి ఊపుతుంది. కర్షకవీరుల కాయంనిండా, కాలువ కట్టే ఘర్మజాలానికి ధర్మజలానికిగాని కార్మిక ధీరుల విలాపాగ్నులకు, విషాదాశ్రువులకుగాని ఖరీదు కట్టేషరాబు లేడని తేల్చాడు. అటువంటి అభాగ్యులంతా, అనాథులంతా, అశాంతులంతా, దీర్ఘ శ్రుతిలో, తీవ్ర

ధ్వనితో, విప్లవశంఖం పూరిస్తారన్నారు. త్రిలోకాలలో శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైన సమానమైనది లేనేలేదు అని బల్లగుద్ది చెప్పారు.

పునాదిగా ఇక జనించబోయే, భావి రీతిలో రాయ బోయే నవీనగీతికి సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలూ ప్రాణ మన్నారు కవి. తన భావి రచనలే నవీన వేదవాక్యాలు అవుతాయన్న ఆత్మవిశ్వాసం ప్రదర్శించారు. ఈ ఛంద శ్శిల్పాన్ని స్వరపరిచారు. పాడారు నాటకీకరించారు. డాక్టర్ సంపత్ అనే ప్రసిద్ధి నర్తకుడు ఈ గీతం ఆధారంగా నృత్య విధాన మొకటి పరికల్పించారు. ప్రతిజ్ఞ గేయ భావాలకు విలువ ఉన్నంత కాలం, ఈ రచనాశిల్పం శ్రోతలనూ, పాఠకులనూ ఆకట్టుకోగలిగినంతకాలం శ్రీశ్రీ గారు సజీవంగా ఉంటారు శ్రమ జీవన గౌరవ సౌందర్యాలకు వీరు విలువ కట్టిన విధానం తెలుగు సాహిత్యంలో అపూర్వం. ఇలా చెప్పుకుంటేపోతే ఎన్నో నగ్న సత్యాలు వెలికివస్తాయి.

ఇక ప్రతిజ్ఞ గేయంలో కవి శ్రీశ్రీ గారు శ్రామిక జీవుల గురించి వారికి జరిగే కష్టనష్టాలు గురించి, వస్తువుల అమ్మకం మీద యజమానికి వచ్చిన లాభంలో కార్మికుడికి వాటా లేదు అంటూ కార్మికుల శ్రమశక్తిని దోచుకునే వ్యవస్థను మార్క్స్ నిరసించారు. శ్రీశ్రీ కూడా శ్రామికవర్గ చైతన్యాన్ని తన కవిత్వంలో ప్రకటించారు.

"ఘర్మ జలానికి,
ధర్మ జలానికి,
ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్

అని ఆవేదన వ్యక్తం చేశారు.... అయితే మార్క్సిజం నిర్వేద పూరితమై కన్నీరు తొణికించమనదు. ఆ నిర్వేదం నుండి ఆశావాదం వహించి శ్రమ నిష్పలమై, జని నిష్ఫలమై అనేకులు, అభాగ్యులు, అనాధలు తీవ్ర ధ్వనితో దీర్ఘ శ్రుతితో విప్లవ శంఖం వినిపిస్తారని శ్రీశ్రీ గారు ప్రబోధించారు. అంటే ఎప్పుడైతే కార్మికులు గానీ, కర్షక వీరులు గానీ, అబాగ్యులు గానీ. అనాధలు గానీ ధనిక స్వామి క్రింది ఎప్పుడైతే అణిచివేచతకు బలి అవుతు నప్పుడు వచ్చే ఆవేధన, గర్జించే హృదయం ధ్వనిస్తే ఏ విధంగా ఉంటుందో ఈ గేయంలో కవి తెలియజేసారు. అలాగే కార్మికుల శ్రమ దోపిడి విధానాన్ని గురించి చుద్ధాం.

శ్రమికులను ఉద్ధేశించి మహాకవి శ్రీశ్రీ స్వయంగా వినిపించిన కవిత

"ధనిక స్వామికి దాస్యం చేసే
యంత్ర భూతముల కోరలు తోమే
కార్మికధీరుల కన్నులనిండా
కణకణమండే
గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్"

అంటూ "ప్రతిజ్ఞ" గేయంలో మార్క్సిస్టు దృక్కోణంతో శ్రామిక వర్గ చైతన్యాన్ని స్ఫురింప చేశారు. కార్మికుల శ్రమ శక్తిని దోచుకునే పెట్టుబడిదారీ వ్యవస్థను నిరసించిన కవి శ్రీశ్రీ గారు. దీనికి చక్కని సామెత కూడా లేకపోలేదు "సామ్ము ఒకరిది సోకు ఒకరిది" అనే సామెత చక్కని ఉదాహరణగా. కార్మికులకు, పెట్టుబడిదారులకు మధ్య జరిగే వ్యవస్థకు చక్కని నిదర్శనంగా ఈ సామెత చెప్పవచ్చు. ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థలో లేనిది, బానిస జమీందారీ యుగాలకు వచ్చే నాటికి వర్గవ్యవస్థ అవతరించింది. వస్తువుల అమ్మకాలమీద యజమానికి వచ్చిన లాభంలో కార్మికుడికి భాగంలేదు. యజమాని కార్మికునికి ఇచ్చే ఫలితం కన్న వారి శ్రమశక్తిని ఎన్నోరెట్లుగా వినియోగించుకుని ఆ శ్రమశక్తి ద్వారా ఉత్పత్తి అధికం చేయంచి ఎక్కువ లాభాలు పొందుతున్నారు అని శ్రీశ్రీ వ్యక్తం చేస్తారు..

అలాగే మార్క్సిస్టు దృక్పథంలో సాహిత్య పరమావధి శ్రామికవర్గానికి చైతన్యం కలిగించడం కవిత్వమైనా, కళలైనా శ్రామికులకు పట్టం కట్టాలి అంటూ.... అందుకే ఇలా అంటారు శ్రీశ్రీ గారు..

"నాలో కదిలే నవ్యక విత్వం
కార్మికలోకపు, కల్యాణానికి

శ్రామిక లోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా, సమర్చనంగా

అంటూ సమర్పిస్తున్నానని ప్రకటించారు. శ్రామికుణ్ణి కావ్యనాయకుణ్ణి చేశారు. సోవియట్ రచయిత మాగ్జిం గోర్కి 1934 ఆగస్టు 17న మాస్కోలో జరిగిన ప్రథమ సోవియట్ రచయితల మహాసభలో ఇలా "వ్యు మస్ట్ మేక్ లేబర్ ది ప్రిన్సిపల్ హీరో ఆఫ్ అవర్ బుక్స్". అని ప్రకటించారు. శ్రీశ్రీ కవిత్వంలో ఈ సూత్రాన్ని ఇమిడ్చారు కాబట్టే ఆ సభలో శ్రామికుణ్ణి కావ్యనాయకుణ్ణిగా చిత్రిస్తూ పలికిన మాటలు వింటే శ్రామికుల మీద కర్షక వీరుల మీద కవి దృక్పథం ఎంత గొప్పదో తెలుస్తుంది.

అలాగే శ్రమలోనే అసలైన సౌందర్యం ఉందంటూ శ్రమ జీవన సౌందర్యాన్ని గురించి ఏమన్నారో కవి చుద్దాం:

త్రిలోకాలలో, త్రికాలాలలో,
శ్రమైకజీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని
కష్టజీవులకు, కర్మవీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ....."

మార్క్సిస్టుల ప్రకారం- బూర్జువా నాగరికత వాస్తవికతలో సౌందర్యం చూడలేదు. అందువల్ల సమాజపు సుశిక్షితమైన గతిలోనే సౌందర్యం ఇమిడి ఉందని, ఆ గతి శ్రమవల్లనే సాధ్యమని, కాబట్టి శ్రమే సౌందర్యమని మార్క్సిస్టులు ప్రకటించారు.

అంతేకాకుండా సాహిత్య పరమావధి శ్రామికవర్గ చైతన్యాన్ని చిత్రించడమే అని అభ్యుదయ కవిత్వం నిర్దేశించింది. కళలు, కవిత్వం అంతా శ్రామికుల సుఖ దుఃఖాలను, వారి ఆశయాల్ని ప్రతిఫలించేందుకు అంకితం కావాలని అభ్యుదయ కవిత్వం నిర్ధారించింది. కష్టజీవులకు, కర్మ వీరులకు నిత్యమంగళం నిర్దేశించారు శ్రీశ్రీ.

అలాగే కొలిమి, చక్రం, పగ్గం, మగ్గం, గొడ్డలి, కొడవలి, నాగలి, రంపం ఇలా మొదలైన వాటిని తన గీతికి ప్రాణం, ప్రణవం అన్నారు. వృత్తి పారిశ్రామిక జీవన విధానంలో వారి పడే శ్రమ, రౌతులు గురించి, జాలరి వారి గురించి కమ్మరి వారి గురించి కవి ఏ విధంగా స్పష్టం చేసారో గమనిస్తే.

"కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం
జాలరి పగ్గం, సాలెల మగ్గం
శరీర కష్టం స్ఫురింపచేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి..
సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు-
నా వినుతించే,
నా విరుతివంచే,
నా వినిపించే నవీన గీతికి,
నా విరచించే నవీన రీతికి
భావం!
భాగ్యం
ప్రాణం!
ప్రణవం! "

అని దోపిడిని, శ్రామికుల దైన్యాన్ని, హైన్యాన్ని వెలుగులోకి తెచ్చి అభ్యుదయ సాహిత్యం కార్మికుల చైతన్యానికి పునాదులు వేస్తుంది అన్నారు. ఆ చైతన్యం విప్లవానికి దారి తీస్తుంది అని స్పష్టంగా పలికారు కవి.

అందుకే నాగలి, కొడవలి, గొడ్డలి ఇలా మొదలైన పదాలు శ్రమ జీవన రైతులకు ఆయుధాలుగా సమస్త చిహ్నాలుగా పెర్కొన్నారు. అలాగే జాలరి వారి జీవన కళలు పగ్గం, సాలెల మగ్గం ఇలాంటివి వారి శరీర కష్టానికి స్ఫూరింపచేసేవిగా వర్ణించారు కవి.

ముగింపు :

ఈ విధంగా వీరి కవిత్వమొక అగ్నిధార. అది అజ్ఞానమనే అడవులను దహించి వేస్తుంది. చీకటి కమ్ముకు న్న ముసుగును తొలగించి కాంతి గీతాలుగా ప్రవహించే కవితా ఖండికలు చైతన్య మార్గానికి మళ్ళిస్తుంది అని చెప్పవచ్చు. వీరి కలం నుంచి జాలవారిన

అక్షర నక్షత్రాలు దూసుకొస్తాయి. అవి సమాజమాజ స్థాపన కోసం ఆరాటపడుతున్న వారి చేతిలోని కాగడాలై కాంతి మార్గాన్ని చూపిస్తాయి అని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

అలా తన కలాన్ని కాగడా చేసి మరో ప్రపంచానికి దారి చూపిస్తానంటూ ముందుకు నడిచిన వారు శ్రీశ్రీ గారు. మరో ప్రపంచానికి పూల బాటలు వేసిన మాహాను భావులు శ్రీశ్రీ అని చెప్పవచ్చు. ఏదేమైనా శ్రీశ్రీ ఆశించిన నవసమాజం వర్థిల్లాలని కోరుకుందాం. నా ఈ పత్రంలో ఏవైనా దోషాలు ఉంటే క్షమించమని కోరుతూ ధన్య వాదాలు.

ఆధార గ్రంథాలు :

1. మహాకవి శ్రీశ్రీ
2. శ్రీశ్రీ మహాప్రస్థానం
3. మహాకవి శ్రీశ్రీ
4. శ్రీశ్రీ ప్రస్థాన త్రయం

❖❖❖

శ్రీశ్రీ మహా ప్రస్థానం - సామాజిక దృక్పథం

- డా॥. పలివెల చిరంజీవిరెడ్డి, సహాయాచార్య (తెలుగు శాఖ), ఐఐఐటి శ్రీకాకుళం, ఆర్.జి.యు.టి.

నవీన కవిత్వం దృక్పథాలన్నిటికీ సామాజిక స్పృహే మూలకందం అయినా, సంఘ ప్రగతికీ, మానవాభ్యుదయానికీ, మార్గాలనూ సామాజిక దురాచారాలకు పరిష్కారాలను ప్రభావవంతంగా ప్రదర్శించింది అభ్యుదయ కవిత్వమే. ఈ ప్రక్రియకు ఆద్యుడూ, నవీన కవిత్వ యుగకర్త అయిన శ్రీశ్రీ కవిత మహాప్రస్థానం. ఈకవిత ద్వారా సామాజికాభ్యుదయానికి శ్రీశ్రీ కవిత్వం ఎలా బాటలు వేసిందో మనం గ్రహించవచ్చు. శ్రీశ్రీ అభ్యుదయ కవితా యుగానికి రథసారథి. శ్రీశ్రీ ఆధునిక కవితా ప్రక్రియలతో అనేక రచనలు సాగించారు. అభ్యుదయ కవితా ప్రస్థానానికి నాంది పలికారు. రాబోయే తరం కవులకు మార్గదర్శకమయ్యారు.

ప్రస్థానం అంటే ప్రయాణం. మహాప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం. పాండవులు తమ శరీరంతో కైలాసానికి చేరడానికి మహాప్రస్థానం చేశారని భారతం చెప్పింది. ఫ్యూడల్, బూర్జువా వ్యవస్థలను కూలగొడుతూ సామ్యవాద జగత్తుకు శ్రామికులు సాగించిన దీర్ఘ యాత్రయే ఈ మహాప్రస్థానం. ఏ లోకంలో అన్యాయాలు, అధికారాలు, ఏడ్పులు, క్లామాలు, యాచకాలు, క్షుద్ర కవిత్వాలు, శిక్షణలు, scandals లేవో, ఆ లోకాన్ని శ్రీశ్రీ కలగంటున్నాడని చలం మహాప్రస్థానానికి ముందు మాటలో చెప్పారు. వాస్తవ దృష్టిలో చూస్తే శ్రీశ్రీ దృష్టిలో మరో ప్రపంచం అంటే రష్యా దేశం. శ్రీశ్రీ ఈ గేయం రచించే నాటికి రష్యా అగ్రరాజ్యంగా ఉండేది.విప్లవం ద్వారా అక్కడ సమసమాజం వెలసింది. దాన్ని శ్రీశ్రీ భూతల స్వర్గంగా భావించాడు. శ్రామికులు కూడా ఆ సమసమాజ వ్యవస్థ గల మరోప్రపంచానికి ప్రయాణం చేయాలని శ్రీశ్రీ ఈ గేయంలో చెప్పారు.

శ్రీశ్రీ చెప్పిన మరో ప్రపంచ సామ్యవాద జగత్తు. ఆ సామ్యవాద జగత్తు పిలుస్తోందని, తనతోపాటు వేగంగా ఆ మరోప్రపంచానికి రండనీ, శ్రీశ్రీ తాను నాయకుడై శ్రామికులను పిలిచారు. మహాప్రస్థానం ఒక మైలు రాయి. అభ్యుదయ సాహిత్యంలో శిఖరాయమానమైంది. అనాటి యువతరాన్ని ఉర్రూతలూగించిన గేయకావ్యం.. శ్రీశ్రీ కవిత్వం కార్మిక వర్గం సంక్షేమాన్ని కోరింది. శ్రీశ్రీ మహాప్రస్థానం అద్భుత గేయ కావ్యం. అభ్యుదయ కవిత్వంలో అగ్రస్థానాన్ని పొందింది.

ఇందులో అనేక గేయాలున్నాయి. కొన్ని గేయాల్లో ప్రాచీన ఛందస్సుల లక్షణాలు గోచరిస్తాయి. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కావ్య సంపుటిలోని ''మహాప్రస్థానం'' గేయాన్ని తెల్పటమే నా వ్యాసం ప్రధానోద్దేశ్యం.

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' అనేక గేయాల సంపుటి. ఇందులో అభ్యుదయ దృక్పథంతో అనేక గేయాలున్నాయి. వాటిలో 'మహాప్రస్థానం' గేయం ఒకటి. మహాప్రస్థానం అంటే మహా ప్రయాణం, ఈ ప్రయాణం ఎక్కడి వరకు? అని ప్రశ్నించుకుంటే ''సమసమాజ స్థాపన సాగేవరకూ'' అని సమాధానం చెప్పుకోవచ్చు. సాహిత్యాన్ని సమాజం కోసం సృష్టించాలనే తపనతో శ్రీశ్రీ మానవుడే తన కవిత్వానికి ప్రమాణమని చెప్పారు. మానవుల కష్టాల్ని తొలగించి వారికి శుభాన్ని చేకూర్చటానికే కలం పట్టానని శ్రీశ్రీ ఉద్ఘోషించారు. శ్రీశ్రీ రచన ముందుకు నడిపిస్తుంది. పెనునిద్దుర వదిలిస్తుంది. ఆయన రచనల వేగం, పదప్రయోగంలోని నేర్పు అనితర సాధ్యమైనవి. ఆయన కొత్తలోకాన్ని కోరుకున్నారు. ఆ లోకాన్ని చేరుకోవడానికి మార్గం చూపించారు. ఆధునిక కాలంలో వారిని మించిన కవి మరొకరు లేరని చెప్పాలి. ఆయనే చెప్పినట్లుగా మహాప్రస్థానంలో ''అభ్యుదయ కవిత్వమూ, విప్లవ బీజాలు'' ఉన్నాయి. సామాజిక రుగ్మతలను తొలగించే ప్రయత్నాలు ఉన్నాయి.

నేపథ్యం :

శ్రీశ్రీ ఈ గేయాన్ని 1934లో రచించారు. అప్పటికి ఆయన వయస్సు 23 ఏళ్ళు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపాలని, అందుకు శస్త్రచికిత్స అంటే విప్లవమే మార్గమని ఆయన విశ్వసించారు. సామాన్య ప్రజానీకాన్ని విప్లవ ఆచరణకు ఉద్యుక్తులను చేయడానికి రచన చేయాలనుకున్నారు. ఈ విషయాన్ని ఆయన మహా ప్రస్థానం గ్రంథంలోనే చెప్పుకున్నారు.

శ్రీశ్రీ ఈ గేయం రాసే సమయానికి ముందే రష్యాలో 1917లో విప్లవం వచ్చింది. కమ్యూనిజం రాజ్యం వచ్చింది. ఈ గేయం రాసేటప్పటికి రష్యా భూతల స్వర్గం. అక్కడంతా సుఖమూ, సంతోషాలే. నిన్న మొన్న రష్యా విచ్ఛిన్నమయ్యేంత వరకూ రష్యాను ఆదర్శ రాజ్యంగా భావించేవారు. శ్రీశ్రీ చెప్పిన మరో ప్రపంచం అదే. శ్రీశ్రీ రష్యాను మరో ప్రపంచంగా భావించారు. అక్కడ ప్రభుత్వానికి వచ్చిన కమ్యూనిజాన్ని "అగ్ని కిరీటంగా"' చెప్పారు. ఆ మరోప్రపంచానికి ఎలా వెళ్ళాలో, ఏమి చెయ్యాలో ఈ మహాప్రస్థానం గేయంలో చెప్పబడింది. గొప్ప మార్పును తెచ్చిన ఆ మరో ప్రపంచానికి వెళ్ళాలంటే సాధారణ ప్రయాణం సరిపోదని, గొప్ప ప్రయాణం చేయాలని శ్రీశ్రీ భావించారు. అందుకే ఈ గేయానికి మహాప్రస్థానం అని పేరు పెట్టారు.

సామాజిక దృక్పథం :

శ్రీశ్రీ రచించిన "మహా ప్రస్థానం" గేయ సంపుటిలో మొట్ట మొదటి గీతం మహాప్రస్థానం. ఈ పేరే కావ్యానికి పెట్టారు. శ్రీశ్రీ మహా ప్రస్థానంలో మార్క్సిజం ప్రభావం ఉందని, గతితార్కిక భౌతిక వాదం ఉందని విమర్శకులు భావించారు. అయితే శ్రీశ్రీ 1970లో "సృజన" పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ 'మహా ప్రస్థానం' అన్న గీతం రాసే నాటికి "నాకు మార్క్సిజం గూర్చి తెలియనే తెలియదు నేను మార్క్సిజం తెలుసుకున్నది సాహిత్యం ద్వారానే రాజకీయాల ద్వారా కాదు" అనే వాస్తవాన్ని వెల్లడించారు. మహా ప్రస్థానం రాసే నాటికి శ్రీశ్రీ తాను అభ్యుదయ రచయితనని కూడా చెప్పుకోలేదని కొడవటిగంటి కుటుంబరావు చెప్పారు. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గేయం ఇలా ప్రారంభిస్తారు.

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు
పదండి త్రోసుకు!
పోదాం పోదాం పైపైకి"

అని అంటారు. ఇదొక ఏకగీతంలా సాగింది. సైన్యం కవాతులా మొదలైంది. ఇంతవరకు సమాజంలో పీడించ బడుతున్న వాళ్లంతా ముందుకు సాగిపోవాలని శ్రీశ్రీ ప్రభోదించారు. మరో ప్రపంచ నిర్మాణం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రయాణాన్ని ఆపవద్దని శ్రీశ్రీ సూచించారు. తోసుకుని ముందుకు, పైపైకి సాగి పోవాలని పిలుపునిచ్చారు. దోపిడి వ్యవస్థ నుంచి, పీడిత సమాజం నుంచి సామ్యవాద వ్యవస్థ వైపుకు, సమ సమాజం వైపుకు ప్రయాణాన్ని సాగించవలసిందిగా శ్రీశ్రీ కోరుకున్నారు.

"కదం త్రొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ-
పదండి పోదాం"

అని పిలుపునిచ్చాడు. కదం తొక్కటం అంటే గుర్రపు అడుగులు వెయ్యటం. గుర్రం అడుగులు వేసేటప్పుడు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తుంది. ఆ ఉత్సాహాన్ని నీలో నింపుకుని హాయిగా కష్టాలను మర్చిపోతూ పాటలు పాడుతూ సాగిపోమన్నారు. "హృదంతరాళం గర్జిస్తూ" అని చెప్పటంలో తీవ్ర ప్రతీకారాన్ని ధ్వనింపచేశారు. ప్రజల కోసం కలం పట్టానని చెప్పి ప్రజల్ని చైతన్యంగావించే ప్రయత్నం చేసిన ప్రజాకవి ఈయన.

ప్రజల్ని ఉత్సాహపరుస్తూ శ్రీశ్రీ "వినబడలేదా మరో ప్రపంచపు జలపాతం " అని ప్రశ్నించాడు. జలపాతం ఉధృతికి దూకుడుకూ, ఏ ఆటంకం ఎదురైనా వెను

దిరగని తత్వానికి ప్రతీక. అది శబ్దం చేస్తూ సాగుతుంది.అందుకే జలపాతాన్ని ఆదర్శంగా తీసుకోమని పరోక్షంగా ప్రభోదించారు. ప్రయాణాన్ని సాగించేటప్పుడు ఆత్మ త్యాగానికైనా సిద్ధపడాలని అందరిని హెచ్చరించారు.

"బాటలు నడచీ
పేటలు కడచీ
కోటలన్నింటిని దాటండీ!

అని పిలుపునిచ్చాడు. సంప్రదాయాన్ని విడిచి పెట్టి, వివక్షతలకు తావివ్వకుండా, అవరోధాలెదురైనా ముందు సాగిపోవాలని శ్రీశ్రీ చెబుతారు. మహా ప్రయాణాన్ని సాగిస్తున్నపుడు నదీనదాలు అడ్డురావచ్చును, అడవులు కొండలు అవరోధాలు కావచ్చును, ఎడారులు ఆటంకాన్ని కలిగించవచ్చును కాని వాటిని ఏమాత్రం లెక్కచెయ్యకుండా ముందుకు దూసుకుపోవాలని శ్రీశ్రీ సలహా ఇచ్చారు.

"ఎముకలు కుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులారా! చావండి"

అనటంలో సోమరితనాన్ని అసహ్యించుకున్నాడు. "చావండి" అనే పదంతో రోషాన్ని ప్రజల్లో రేకెత్తించారు. ఇలా తీవ్రంగా దూషిస్తేనే పోరాడటానికి ముందుకు వస్తారని శ్రీశ్రీ "చావండి" శబ్దాన్ని ప్రయోగించారు. అయితే వెంటనే ఉత్సాహాన్ని నింపుతూ "నెత్తురుమండే, శక్తులు నిండే, సైనికులారా రారండి!" అని ఉత్సాహపరిచారు. సైనికులారా! అనటం ద్వారా సుశిక్షితులైన వ్యక్తులుగా రండి అనే భావాన్ని కూడా వ్యక్తం చేశారు. శివ భక్తుల్లో తీవ్రత ఉంటుంది. ఆవేశం ఉంటుంది. ఉగ్రత ఉంటుంది. అందుకే శ్రీశ్రీ "హరోం హరోం హర, హర హర హర హర, హరోం " అని కదలవలసిందిగా యువతను మేల్కొల్పాడు. కదిలిన యువత ఎక్కడకు వెళ్ళాలి అనే సందేహం వస్తుందని వెంటనే

"మరో ప్రపంచం
మహా ప్రపంచం
ధరిత్రి నిండా నిండింది!
పదండి ముందుకు!
పదండి త్రోసుకు"

అని సలహా ఇస్తూ మరో ప్రపంచం మహా ప్రపంచమని అది ధరిత్రి నిండా వ్యాపించింది. కాబట్టి అక్కడకు సాగిపొమ్మన్నారు. సుడిగాలిలా హోరెత్తిమని చెప్పాడు. భావవేగంతో సాగమన్నారు. వర్ష ఋతువులా విరుచుకుపడమన్నారు. ముందుకు మును ముందుకు కదిలిపొమ్మన్నారు. "కనబడలేదా మరో ప్రపంచపు కణకణ మండే త్రేతాగ్ని?" అని ప్రశ్నించారు. శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వంలో ఎన్నో సంప్రదాయ ప్రతీకలు చూపించారు. త్రేతాగ్ని శబ్దం ద్వారా సంప్రదాయాన్ని ధ్వనింప చేస్తూ అభ్యుదయ దృక్పథాన్ని పొందు పరిచారు. ఆకలి అజ్ఞానం, దారిద్ర్యం అనే మూడు అగ్నులు కనబడలేదా అని ప్రశ్నించారు. ఆకలిని తీర్చటానికి అజ్ఞానాన్ని పోగొట్టటానికి దారిద్ర్యాన్ని తొలగించటానికి ప్రయాణాన్ని కొనసాగించమని శ్రీశ్రీ తెలిపారు.

"ఎగిరి ఎగిరి ఎగిరి పడుతున్నవి
ఎనభై లక్షల మేరువులు"

అని శ్రీశ్రీ చెప్పటం ద్వారా ధనవంతులు విర్ర వీగుతున్నారని స్పష్టం చేశారు. మేరువు బంగారు పర్వతం. ఇక్కడ ఎనభై లక్షల మేరువులు ధనవంతులు, నీళ్లు ఎగిరి పడుతున్నారని చెప్పటంతో ఎవరినీ లెక్కచెయ్యటం లేదని గర్వంతో విర్రవీగి పోతున్నారని చెప్పవచ్చు. సముద్రాలే జలప్రళయ నాట్యం చేస్తున్నాయని చెప్పడంతో పాలకులు కూడా పట్టించుకోవడం లేదు కాబట్టి ప్రజలందరూ ఉద్రేకంతో శివ సముద్రం లాగా, నయాగరా జలపాతంగా వేగంగా పరుగులు తియ్యాలని చెప్పారు. ప్రజల్ని "ఉరకండీ ఉరకండీ ముందుకు" అని శ్రీశ్రీ భాష మీద తనకున్న పట్టును బ్రహ్మాండంగా వ్యక్తీకరించారు.

"మరోప్రపంచపు కంచునగారా
విరామ మెరుగక మ్రోగింది"

అని శ్రీశ్రీ చెప్పటం ద్వారా మరో ప్రపంచాన్ని సాధించేంత వరకూ ఆ నగారా మోగుతూనే ఉంటుంది. కాబట్టి సమ సమాజ స్థాపన కోసం విరామాన్ని పాటించ కుండా ముందుకు సాగుతూనే ఉండాలని శ్రీశ్రీ అంటారు.

శబ్దం మీద పూర్తి పట్టు సాధించారు శ్రీశ్రీ. ఆయన పద ప్రయోగాలే ఆయన కవితలకు ఆయువు పట్టు. ప్రాచీన సాహిత్య పరిజ్ఞానమనే పునాది శ్రీశ్రీకి పటిష్టంగా ఉంది. అందుకే అద్భుత పద ప్రయోగాలు శ్రీశ్రీ కవితల్లో ఉన్నాయి. ముందుకు సాగిపోవలసిందిగా చెబుతూ..

"త్రాచుల వలెనూ
రేచుల వలెనూ
ధనంజయునిలా సాగండి" అంటారు.

ఇక్కడ త్రాచుల వలెను అనటంలో దెబ్బతిన్నందుకు ప్రతీకార బుద్ధితో వేగంగా సాగిపొమ్మన్నట్టు తెలుసు కోవచ్చు. రేచులవలెను అనటంలో ఎన్ని ఆటంకాలు వచ్చినా పట్టును వీడకుండా ముందుకు కదలమని తెలిపారు. "ధనంజయునిలా సాగండి" అనటంలో విజయాన్ని సాధించేవరకూ వెనుకాడవద్దని చెప్పారు.

మరో ప్రపంచపు అగ్ని కిరీటపు ధగధగలు కనబడలేదా అని ప్రశ్నిస్తారు. అంటే మరో ప్రపంచం కనుచూపు మేరలో కనిపిస్తుందని తెలిపారు. ఎర్రబావుటా నిగనిగలు అని చెప్పటంలో విప్లవచైతన్యాన్ని, హెూమ జ్వాలల భుగ భుగల్లో విశ్వ శ్రేయస్సును నిక్షిప్తం చేయాలని ప్రబోధిస్తారు.

శ్రీశ్రీ ఈ గేయాన్ని కేవలం ఐదు నిముషాల వ్యవధి లోనే రచించారని ఒక చోట చెప్పుకున్నారు. భావతీవ్రత ఇందులో కనిపిస్తుంది. భాషా ప్రయోగ వైశిష్ట్యం ఇందులో ఉంది. శ్రుతి హితమైన లయ ఈ గేయానికి అదనపు ఆకర్షణ. శ్రీశ్రీ మహాప్రస్థాన గేయాన్ని రచించాడు. మహాప్రస్థాన గేయంలో వీర రౌద్ర రసాలు మిళిత మయ్యాయి. అందుకే ఆ రసాలకనుగుణమైన శబ్దాల్ని ప్రయోగించారు. శ్రీశ్రీ తనకున్న శబ్ద శక్తి బలంతో జనం, జీవం, కండ, గుండె గల శబ్దాన్ని ఏరుకొని వాటిచేత కసరత్తులు చేయించారు. విప్లవ గీతాన్ని రచిస్తూ ఈయన సంప్రదాయ ముద్రను వీడలేదు. అయితే సంప్రదాయ ముద్ర శ్రీశ్రీ కవిత్వానికి మరింత బలాన్ని చేకూర్చిందనే విషయాన్ని మనం మర్చిపోకూడదు.

ముగింపు :

శ్రీశ్రీ అభ్యుదయ కవి. శ్రీశ్రీ "మహాప్రస్థానం" గేయ సంపుటి అభ్యుదయ సాహిత్యంలో ప్రముఖమైనది. శ్రీశ్రీ కవిత్వంలో ఛందస్సు లేకపోయినా అంత్య ప్రాసలు, లయ శ్రీశ్రీ కవిత్వానికి ప్రాణం. కదం తొక్కుతూ పదం పాడుతూ హృదంతరాళం గర్జిస్తూ ముందుకు సాగాలని, ఆత్మత్యాగానికైనా వెనుకాడకుండా మరో ప్రపంచ సాధనకు ముందుకు సాగాలని, మహా ప్రపంచ సాధన కోసం నడవాలని. ఆకలి, అజ్ఞానం, దారిద్ర్యాల్ని తొలగిం చాలని తెలిపారు. ధనవంతులు విర్రవీగుతున్నారు. వారి గర్వాన్ని అణచివెయ్యాలని. శివసముద్రంలా, నయా గరాలా ఉద్ధృతంగా సాగిపోవాలని త్రాచుల్లాగా, రేచుల్లాగా విజయాన్ని సాధించే వరకూ ప్రయాణం సాగించాలని తెలిపారు.

ఆధార గ్రంథాలు :

1. మహాప్రస్థానం - శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)
2. తెలుగు సాహిత్య చరిత్ర - జి.నాగయ్య
3. శ్రీశ్రీ శత జయంతి విశేష సంచిక

❖❖❖

శ్రామిక చైతన్యమే శ్రీశ్రీ 'మహాప్రస్థానం'

– భూక్యా కాశీరాం, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

శ్రీశ్రీ మహాప్రస్థానం వల్ల తెలుగు కవిత్వానికి నూరేళ్ల పురోగమనం జరిగింది. కవిత్వం కదిలింది, మారింది. శ్రీ శ్రీ ఆదర్శాన్ని వాస్తవంగా మార్చాలి అనుకున్నాడు. అన్ని కొందరికి మాత్రమే లభించడం చూసి ఆగ్రహించాడు. అన్ని అందరికి లభించాలని కోరుకున్నాడు. దరిద్రులను చూసి జాలి పడ్డాడు. అందుకు దోపిడీ కారణమని గ్రహించాడు. కవిత్వం కవిత్వం కోసం కాక, సమాజం కోసమే అనే అభిప్రాయాపడ్డాడు. సమాజం, సాహిత్యం, రాజకీయం, విజ్ఞానం వేరు వేరుగా కాకుండా అన్నిటికీ కవిత్వంలో సహజీవనం ఏర్పాటు చేశాడు.

సమాజ సంస్కరణ నుంచి సమాజ విప్లవీకరణ వరకు సాగిన పురోగమనమే గురజాడ నుంచి శ్రీశ్రీ వరకు సాగిన కవితా ప్రస్థానం. అందువల్లనే వస్తువులలో మార్పు వచ్చింది. బూర్జువా యుగపు చైతన్యాన్ని గురజాడ ప్రజలకు అందించగా, సామ్యవాదయుగపు చైతన్యాన్ని శ్రీ శ్రీ శ్రామికులకు అందించాడు. అందువల్లనే కవితా వస్తువులలో గురజాడకు శ్రీ శ్రీ మధ్యతేడా వుంది. ఈ ఇద్దరి కవితా వస్తువులు సమకాలీనమే కాక భావికాలిక కూడా కావడం ఇద్దరికి గల పోలిక. గురజాడ కవిత్వంలో బూర్జువా సమాజపు వాస్తవికత సామ్యవాద సమాజ కూడా ప్రతిబింబించే గా శ్రీశ్రీ కవిత్వంలో బూర్జువా సమాజపు వాస్తవికత సామ్యవాద సమాజ వుహాలు ప్రతిబింబించాయి. నిరుద్యోగానికి యువకులు బలి కావడం, బిచ్చగాళ్లకు ఎవరూ పట్టించుకోకపోవడం, సామాజిక న్యాయం లేకపోవడం వల్ల కొందరు ఉన్మాదులు గా మారిపోవడం, ఆకలి తీరని యువతులు వేశ్య వృత్తికి దిగడం, యుద్ధాలలో యువకులు చనిపోవడం, నిరాశ వల్ల తాగుడుకు అలవాటు పడటం, కర్షకులు,కార్మికులు జీవన భారం మోయలేక దుఃఖించడం, కన్న బిడ్డలకి తిండి పెట్టలేక తల్లిదండ్రులు ఏడవటం, దిక్కులేని వారి సేవలు ఎవరూ పట్టించుకోవడం లేదని, వ్యక్తికి మరొక వ్యక్తి, జాతిని మరొక జాతి ని పీడించడం, శ్రమపడి నిర్మించిన వస్తువుల మీద శ్రామికుడు హక్కు పొందలేక పోవడం, సంఘం నుంచి కొందరిని వెలివేయడం, ప్రపంచ యుద్ధాలను సృష్టించడం మారణాయుధాలను తయారుచేయడం వంటివి బూర్జువా, వలసవాద సమాజంలో చూసిన లోపాలు.

ఫ్యూడల్ వ్యవస్థలో కన్నా బూర్జువా వ్యవస్థ చాలా బలమైంది. హింస దాని ప్రధాన ఆయుధం. ఇది రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నీటికి సంబంధించినవి. కాబట్టి మొత్తం ఈ వ్యవస్థ మారిపోవాలి. ఆ పనిని చేయగలిగేది విప్లవమే. ఆ విప్లవం తీగల శ్రామిక వర్గానికి చైతన్యం కలిగించాడు శ్రీ శ్రీ. అందువల్ల బూర్జువా సమాజ వాస్తవికతను నగ్నంగా చూపించటం ఒక లక్ష్యంగా శ్రీశ్రీ తన కవితా వస్తువును విస్తరించు కున్నాడు. వర్తమాన దుర వ్యవస్థ పిడకలను శ్రీశ్రీ కవితా వస్తువుగా స్వీకరించడంలో ఈ బూర్జువా సమాజ వాస్తవికతయే కనిపిస్తుంది.

శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'జయభేరి' ఖండికలో శ్రామిక పురోగమన భావాలు చెప్తున్నాడు కవి ఇక్కడ

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను
నేను సైతం
విశ్వ వృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను
నేను సైతం
భువన ఘోషకు
వెర్రి గొంతుక విచ్చి మ్రోశాను పుట :22

ధనస్వామ్యం తుడిచిపెట్టుకుపోతుంది. శ్రమజీవి ప్రపంచానికి ప్రాణం అవుతాడు. ఆ కాలం రానున్నది శ్రామికుడు 'జయభేరి' మోగిస్తాడు. శ్రామికుడుసమాజాన్ని సూటిగా ఎదుర్కొంటున్నాడు. ఇది వర్తమాన కాలంలో జరుగుతుంది. కార్మికులుగా, కర్షకులుగా, వివిధ వృత్తుల వారు పని చేస్తున్న శ్రామికులు ఆ పని చేయడం మాని వేస్తే సమాజం స్తంభించి తలకిందులు అయి సమాజంలో అల్లకల్లోలం ఆరంభమవుతుంది. శ్రమ విలువను దోచుకొంటున్న అధిక లాభాలతో విలాసవంతంగా పెట్టుబడిదారులు తల్లడిల్లి పోతారు. అప్పుడు గాని సమసమాజ స్థాపనకు పోరాట మొదలవుతుందని కవి చైతన్యాన్ని ప్రకటిస్తున్నాడు.

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి
.....
.....
ఎముకలు క్రుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులారా చావండి
నెత్తురు మండే
శక్తులు నిండే
సైనికులారా! రారండి! పుట :19

ప్యూడల్, బూర్జువా వ్యవస్థల్లో కష్టాలకు, బానిసతనాలకు దోపిడికి గురవుతున్న కర్షక కార్మిక, శ్రామిక వర్గాన్ని 'మరో ప్రపంచం' పిలిచింది అంటూ ఆహ్వానాన్ని అందిస్తూ మొదలు పెట్టి అందరితో పాటు తాను కూడా పాల్గొని దారి చూపిస్తున్నట్లు కవి ఈ గేయాన్ని మొదలు పెట్టిన శ్రామిక సమాజ నాయకుడయ్యాడు.

మరో ప్రపంచం అనే సామాజిక వ్యవస్థ మానవీకరణ పొంది 'పిలిచింది' అనడం లోనే ఉంది గొప్ప వైచిత్రి. సామాన్యుల జీవితాలలో అల్లకల్లోలాలను, ఆ శాంతిని సృష్టిస్తున్న వివిధ దేశాల రాజకీయ, ఆర్థిక విధానాలు 1934 నాటికే రెండవ ప్రపంచ యుద్ధం వైపు నడిచాయని చెప్పవచ్చు. ఈ యుద్ధాలవల్ల విశ్వ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం భారత దేశంలో నిరుద్యోగం, పరపీడన, దారిద్ర్యం భీకర పరిస్థితులు మొదలైన సంఘటనలు మహాప్రస్థానం గీతకు కారణమైందని శ్రీశ్రీ రాసిన కవిత చదివితే తెలుస్తుంది.

"కూటి కోసం కూలి కోసం
పట్టణంలో బ్రతుకుదామని
తల్లి మాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి
మూడు రోజులు ఒక్క తీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక
నడి సముద్రపు నావ రీతిగ
సంచరిస్తూ సంచలిస్తూ
దిగులు పడుతూ దీనుడౌతూ
తిరుగుతుంటే....." పుట :32

'బాటసారి'నీ ఫ్యూడల్ వ్యవస్థ నుంచి బూర్జువా వ్యవస్థలోకి ప్రయాణించే సాంఘిక వ్యక్తికి ప్రతినిధిగానే శ్రీశ్రీ భావించి ఉంటాడు. పల్లెటూరి నుంచి అతడు కూటి కోసం, కూలి కోసం పట్టణానికి బయలుదేరినట్లు చెప్పడమే ఈ కవిత నిదర్శనం.

దున్ను కోవడానికి పొలం లేని వాడు ,పని చేసుకోవడానికి కూలి పని దొరకని వాడు యువకుడు. తండ్రి పోయిన తర్వాత తల్లి అనాధగా కాక, ఆమెకు తిండి పెట్టలేక, తాను తిండికి లేక దరిద్రం అనుభవిస్తూ నగరానికి బయలుదేరిన యువకుని దృశ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించాడు కవి శ్రీశ్రీ. యువకుడు తల్లి మాటని వినకుండా పట్టణానికి వచ్చిన సందర్భం తీసుకుంటే అతనిలో పట్టుదల, సాహసం మాత్రమే కాకుండా

ఒక వైపు తండ్రి మరణం, అలాగే నిరుద్యోగ సమస్య ఇవన్నీ కూడా ఉండటం వల్ల నగరానికి రావడం జరుగుతుంది దుఖభరితమైన సమాజ వ్యవస్థను బాటసారి ఖండికలో శ్రీశ్రీ వివరించాడు. కొడుకు గురించి తల్లి దుఃఖం, తల్లి గురించి కొడుకు దుఃఖం అ సన్నివేశాలు పాఠకులు కలచివేస్తుంది.

అలాగే భారతదేశంలో భిక్ష వృత్తి ఎంత వృద్ధమైందో వ్యక్తం చేస్తున్నాడు. 'భిక్షువర్షీయసి' ఖండికలో ఈ విధంగా చెబుతున్నాడు కవి.

''ఏళ్ళు ముదిరి,కీళ్లు కదిలి
బతుకంటే కొర్కెసడలి
పక్కనున్న బండరాతి
పగిదగనే పడి ఉన్నది
ఆ అవ్వే మరణిస్తే
ఆ పాపం ఎవరి దని
వెర్రిగాలి ప్రశ్నిస్తూ
వెళ్ళిపోయింది! పుట :42

శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి'లోకి వృద్ధ భిక్షురాలి మరణవార్త సమాజంలోని విషమన్యాయాన్ని చూపెడుతుందని భావిస్తున్నాడు. సమాజ వ్యవస్థలో శ్రీశ్రీ చూసిన నికృష్ట వాస్తవ జీవితానికి భిక్షువర్షీయసి ఒక ప్రతినిధిగా చెప్పవచ్చు. కనీస అవసరాలైన తిండి, బట్ట ,గూడు లేక పోవడమే కాక జబ్బు చేసి పడిపోయి బ్రతుకంటే కోరికలు లేకుండా శవం కన్నా హీనంగా పడిపోయినా అ వృద్ధురాలి దుస్థిని చూసి కవి చలించిపోయాడని ఈ కవితలో తెలుస్తుంది.

పారిశ్రామిక విప్లవాన్ని సాధించిన సంపన్న సమాజంలో ఇలాంటి నికృష్ట జీవితాలను కూడా ఉండటం, ఆ సంపన్న సమాజానికి సిగ్గుచేటు అంటున్నాడు కవి. ఉన్నవాడు ఉన్నతంగా జీవిస్తున్నాడు లేనివాడు వాడు తమ శ్రమను తగ్గట్టు జీవిస్తూ పేదవాడిగానే మిగిలిపోతున్నాడు అని కవి ఆవేదన వ్యక్త పరుస్తున్నాడు. భిక్షువర్షీయసిని చూసిన సమాజం దోపిడి సమాజంగా చిత్రించాడు శ్రీశ్రీ.

''అభాగ్యులం మేము
సరిహద్దులు దొరకని
సంధ్యలలో మా సమాచారం
అన్నీ సమస్యలే సందేహాలే మాకు
వెలుగులోని చీకట్లే
ఇరులలోని మిణుగురులే చూస్తాం
నూరు దోషాలలోని ఒక సుగుణం
నూరు పుణ్యాలలోని ఒక ఘోరం
వ్యత్యాసాలు, వ్యాఘాతాలే
అడుగడుగునా మాకు
మా వంట మేమే వండుకోవాలి
ఒక్కొక్కమారు విస్తరే దొరకదు
జీవితపు సన్నని సంధులకే
అకర్షణ మాకు.....'' పుట : 56

ఈ కవితలో శ్రీశ్రీ మధ్యతరగతి జీవితాలను చిత్రించారు. ధనవంతులు ఇంకా, ధనవంతులు గా మిగిలిపోతున్నారు. పేదవర్గం ఇంకా కటిక పేదరికంలోనే చీకటి బతుకులను కొట్టుమిట్టాడుతున్నాయి. వెలుగును ప్రేమిస్తారు !ఇరులను ద్వేషిస్తారు!. కార్మికవర్గం వెలుగులో చీకట్లను ఇరులలోని మిణుగురులను చూస్తారు. కార్మికుల వర్గం వారి ఇళ్ళల్లో వెలిగే కరువవుతుంది. మధ్యతరగతిలో కింది వర్గం వాళ్ళ, చిన్న పరిశ్రమల యజమానులు, వృత్తి పని వాళ్ళు ,రైతులు వీళ్ళందరూ కూడా బూర్జువా వర్గంతో పోరాడుతారు. శ్రీ శ్రీ రాసిన ''వ్యత్యాసం'' ఖండికలో ప్రధానంగా మధ్యతరగతి జీవితాలను గురించి వివరించాడు కవి.

సమకాలీన సమాజంలో కవి సామాజిక స్పృహ కలిగి ఉండాలి. అప్పుడే సమాజంలో సామాజిక, రాజకీయ ,ఆర్థిక, సాంస్కృతిక జీవితాలను తెలుస్తాయి. శ్రీ శ్రీ మహా ప్రస్థానం రచన చేసే నాటికి రెండో ప్రపంచ యుద్ధం ఈ సమయంలో తాను అనుభవించిన జీవన స్థితిని, తాను చూసిన సంఘటనలు, సమాజంలో ఫ్యూడల్ వ్యవస్థ

సామ్రాజ్యవాదం మొదలైన అనేక విషయాలపై ప్రతి స్పందిస్తూ 'మహాప్రస్థానం' కవితా సంపుటిలో సామాజిక కోణంలో మానవీయత మానవతా దృక్పథంతో శ్రామిక వర్గ ప్రజల జీవితలను ఆవిష్కరించారు కవి శ్రీశ్రీ.

ఆధార గ్రంధాలు :

1. శ్రీశ్రీ కవిత్వం వస్తువు - సంవిధానం - మిరియాల రామకృష్ణ
2. మహాప్రస్థానం - శ్రీశ్రీ
3. తెలుగు కవితా విప్లవ స్వరూప స్వభావాలు - వేల్చూరు నారాయణరావు
4. తెలుగు కవితా వికాసం - కడియాల రామ్ మోహన్ రావు
5. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదయాలు - ప్రయోగములు - డా. సి. నారాయణ రెడ్డి

❖❖❖

శ్రీశ్రీ సందేశం

- పోతురాజు దుర్గాదేవి, (యమ్.ఏ.), పరిశోధక విద్యార్థిని

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం"మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం" అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ ఏప్రిల్ 30న, 1910లో విశాఖపట్నంలో జన్మించారు. 1931లో బి.ఏ. పూర్తి చేసిన శ్రీశ్రీ ఏ.వి.యస్. కాలేజీలో డెమాన్ స్ట్రేటరుగా, మద్రాసు ఆంధ్రప్రభలో లేబరేటరీ అసిస్టెంటుగా వివిధ ఉద్యోగాలు చేసినా, తన స్వంత భావాల కారణంగా దేనిలోనూ ఇమడలేక 'సినీ రంగం'లో స్థిరపడ్డారు. తెలుగు కవిత్వాన్ని మరో మలుపు తిప్పిన మహాకవి శ్రీశ్రీ. 'మహాప్రస్థానం' 1950లో పుస్తక రూపం ధరించింది. 1955లో అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడుగా వున్నారు. ఆయన సాహితీ తపస్సుకు గుర్తింపుగా 'ఖడ్గసృష్టి' కావ్యానికి 1966లో సోవియట్ భూమి నెహ్రూ అవార్డు, 1973లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1979లో శ్రీ రాజా లక్ష్మీ ఫౌండేషన్ వారి మొదటి అవార్డు అందుకున్నారు మహాకవి శ్రీశ్రీ. కథలు కూడా రాశారు అని ఆశ్చర్యపడేవాళ్లు ఎంతోమంది వున్నారు. వీరి కథలు గతంలో 'చరమరాత్రి', 'ఆశ' పుస్తకాలుగా వెలువడ్డాయి.

జీవితములో అన్ని ఆశలు ఉడిగినవారే విప్లవ సైనికులగుదురన్నట్లు పతితులను, భ్రష్టులను విప్లవము నకు మేల్కొల్పుట జరిగినవి. 'విరసం'లో చేరి శ్రీశ్రీ రచించిన 'జట్కావాలా' కవితలో అట్లే జరిగినది. అందులో నాయకుడైన జట్కావాలా భార్య ఎవరితోనో లేచి పోయినది. ఆ తరువాత జట్కా గుర్రము చచ్చిపోయింది. దానితో విప్లవావేశము వెల్లువవలె ఉప్పొంగి ఆ జట్కా వాలా అడవిదారి పట్టును. అతడు ఎట్టి పరిస్థితులలో విప్లవ వీరుడుగా మారునో శ్రీశ్రీ చిత్రించినాడు. ఇట్టి చిత్రణ 'విరసం' ఊహించి విప్లవమునకేవిధముగా ఉపయోగపడునో బోధపడదు. ప్రజలందరినీ వదిలి అడవికి వెళ్ళి అక్కడ దాక్కొన్న కొద్దిమందితో చేరి వర్గశత్రు నిర్మూలనం చేయుట ద్వారా విప్లవము జయించునున్న భ్రాంతి 'విరసం'లో చేరిన తరువాత చెప్పుకొనదగిన గొప్ప కవితను రచింపలేకపోయినాడు. దీనిని బట్టి నిజమైన భావావేశము శ్రీశ్రీకి కలుగలేదని, అయినను వ్రాయ వలెననుకొని వ్రాసినందువలలనే అతి సామాన్యమైన రచనలు వెలువడివని అనుకొనక తప్పదు. రాజ కీయముగా సిద్ధాంతరీత్యా 'విరసం' కార్యక్రమమునకు కట్టుబడినను కొందరు కవులు జన చైతన్యమును ప్రతిఫలించు చక్కని గేయములు రచించినారు. విరసం వ్యవస్థాపక అధ్యక్షులైన శ్రీశ్రీ నినాదముల వంటి గీతములతో పాటు రసవంతమైన కొన్ని గేయములను రచించినాడు. శ్రీశ్రీ 'మరో ప్రస్థానం'లో విప్లవ పోరాటములో ఉరిశిక్షకు గురియైన భూమయ్య, కిష్టా గౌడ్‌లపై వ్రాసిన 'భూమ్యాకాశాలు' అను స్మృతి గీతము ఆయన ప్రతిభకు ప్రజల నిదర్శనము. 'ఒద్దు కన్నీటి కవిత్వం రాయొద్దు, సమాజానికి కాలం పెట్టిన అప్పును, ప్రాణాలతో వారు తీర్చుకున్నారు.. బతికే అర్హతకాని పందల్ని, పందుల్ని చంపడమే వాళ్ళు చేసిన నేరం... వాళ్ళిద్దరిలో ఒకడు భూమి, రెండోవాడు ఆకాశం' ఈ గేయములో మహాకవి ప్రతిభ వ్యక్తిమగుచున్నది. 'తుదిపయనం, తొలి విజయం' అనునది శ్రీశ్రీ వ్రాసిన వీరవిప్లవ గీతము. విప్లవ వీరులను కదన రంగమును కురికించు శక్తి ఈ గీతములో ఉన్నది చూడుడు.

"ఊగరా, ఊగరా, ఊగరా.. ఉరికొయ్య అందుకొని ఊగరా
ఉరికొయ్య అంటుకొని ఊగరా..
నెత్తురు కార్చిన కళ్ళే నిప్పులు చెరుగుతాయి
స్వాతంత్ర్యపు మారుపేరు సామ్యవాదమే సత్యం
చావులేని ఆ సత్యం జ్వలిస్తుంది అనునిత్యం
మాంచాలను కొలుస్తారు, మల్లమ్మను తలుస్తారు
ఝాన్సీ లక్ష్మీబాయికి బాష్పధార విడుస్తారు

సరోజిదేవి ఫోటో పటం కట్టి పొగుడుతారు
పంచాఁది నిర్మలంటే భయం పుట్టి వణుకుతారు
తెల్లవాడు నిన్ను నాడు భగత్సింగు అన్నాడు
నల్లవాడు నువ్వు నేడు నక్సలైటువన్నాడు
ఎల్లవారు నిన్ను రేపు వేగుజాక్క అంటారు
శివాజీకి వారసుడా శ్రీశ్రీ కవిత్వవారసుడా
నిధాటీకి అడ్డు లేదు, నీ త్యాగం వృధాకాదు

'తిరుగుబాటు మా వేదాంతం' అని మహా ప్రస్థానములో స్పష్టము చేసిన శ్రీశ్రీ 'ఓ మహాత్మా! ఓ మహర్షీ' అను కవితలో 'హింసతోనే సృష్టి పూస్తది - హింసతోనే మార్పు వస్తది' అనే దౌర్జన్యములపై హింసాత్మక చర్యలను సమర్థించినాడు శ్రీశ్రీ. 'అల్లూరి సీతారామరాజు' అను సినిమాకు వ్రాసిన 'తెలుగువీర లేవరా' అనుపాట 'అంతం కాదిది ఆరంభం' అను సినిమాకు వ్రాసిన 'ఎదురు చూసి మోసపోకుమా' అను పాట, జాతిని ఉత్సాహపరిచి విప్లవ చైతన్యము రగుల్కొల్పగల గేయములు. శ్రీశ్రీ అంటే ఎవరు అని ఎవ్వరూ అడగరు. కావ సిప్రాలి అంటే ఏమిటని అందరూ అడుగుతారు. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీ అయినట్టే, సిరిసిరి మువ్వలు ప్రాసక్రీడలు లిమబుక్కులు కలిసి సిప్రాలి అయ్యింది. శతకాల రచనాల కాలం 1945-50. భారతదేశానికి తలమానికమని చెప్పదగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ముమ్మరంగా సాగినకాలం. సిరిసిరిమువ్వ రుక్కుటేశ్వర శతకంలోనూ, చాటువుల్లోనూ 'మేమే' గేయాల్లోనూ వున్న హాస్యం కేవలం నవ్వించడానికే పనికొస్తుంది. 'బాతాడక దొరకు నువ్వు పుట్టదు' అని నవ్వించడంతోనే తన పని తీరిపోయిందనుకున్నాడు అనాటి కవి చౌడప్ప. వీటిల్లో శ్రీశ్రీ కూడా అంతే చేశాడు. ప్రప్తా క్రీడలు లిమబుక్కులు గొప్ప రాజకీయ ప్రయోజనం సాధించాయి. అవి అంతా వాసికెక్కాయి. శ్రీశ్రీకి మాత్రం ఛందస్సుల మీద ఎంద మక్కువ, పట్టు ఉన్నాయో మనకు ప్రాస క్రీడలు చెబుతాయి లిమబుక్కులు రచనా రీతులు గురించి సామాజిక చైతన్యం రాజకీయం సిద్ధాంతం, సాహిత్య సంఘాల స్థాపన - శ్రీశ్రీ కవితా జీవితంలో పెనవేసుకుపోయాయి. లిమబుక్కులతో ఇవే మనకు కనిపిస్తాయి. అక్షరాల ఆయుధాలే లిమబుక్కులు. కవితా పిల్లంబులు మనందరికీ అందించాడు శ్రీశ్రీ. వాటిని వాడిగా, వేడిగా ప్రయోగించి సామాన్య జనాన్ని విప్లవ కార్యాచరణకు ఉద్యుక్తుల్ని చేసి తద్వారా విప్లవ సాహిత్యాన్ని అందించారు.

1948 తర్వాత ఒక దశాబ్దము పాటు ఆంధ్ర సాహిత్య లోకమును ఉత్తేజపరచిన అభ్యుదయ కవితోద్యమ మూలవిరాట్టు శ్రీశ్రీ. భావకవిత్వమునకు విరుద్ధముగా జెండా ఎత్తుటలోనే కాక, శ్రామిక వర్గ చైతన్యము ఊపిరిగా గల ఒక సరిక్రొత్త కవితా రీలుకి పాదులు వేసిన స్రష్ట శ్రీశ్రీ. వాస్తవికతతో పాటు అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యముతోపాటు సంఘ చైతన్యమును సమూనాధి కారముతో ప్రవచించిన ప్రవక్త శ్రీశ్రీ..' అని సి.నారాయణ రెడ్డిగారు పేర్కొన్నారు.

శ్రీశ్రీ వచనకవిత ఉత్తేజాన్ని ఊపిరిగా వీల్చే వజ్రాయుధదారు. శ్రీశ్రీ వచన రచన గుండెను గుప్పిట పట్టిన గద్య ప్రహేళిక! ఒక శ్రీకారం అభ్యుదయ ప్రస్థానానిది! మరో శ్రీకారం విప్లవ ప్రస్థానానిది! శ్రీశ్రీ దృష్టి విశ్వాలమైంది. ఒక గమ్యం ఏర్పడుతుంది. ఒక ధ్యేయం కనిపించింది. అందుకే

"పరిష్కరించే, బహిష్కరించే
బాటలు తీస్తూ పాటలు వ్రాస్తూ" నవ్య కవిత్వం రాస్తానని ప్రతిజ్ఞ చేసి - ఈ కవిత్వం కార్మిక లోకపు కళ్యాణం కోసం, శ్రామికలోకపు సౌభాగ్యం కోసం అని ఎలుగెత్తి చాటాడు. శ్రీశ్రీ కవిత్వానికి గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి వంటి వృత్తి చిహ్నాలే ప్రాణం!

కష్టజీవులకు, కర్మ వీరులకు
నిత్య మంగళం నిర్దేశిస్తూ
స్వస్తి వాక్యములు సంధానిస్తూ
స్వర్ణ వాద్యములు సంరావిస్తూ
వృధార్థ జీవిత యధార్థ దృశ్యం పునాది" గా ఉండేదే

అభ్యుదయ కవిత్వమని, శ్రీశ్రీ ప్రవచించాడు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేదని నొక్కి పలికాడు.

"జగన్నాథుని రథచక్రాలు" అనే గేయంలో శ్రీశ్రీ సామ్యవాద వ్యవస్థ ఏర్పడుతుందన్న విశ్వాసం వ్యక్తీకరించాడు.

"స్వాతంత్ర్యం, సమభావం
సౌభ్రాత్రం, సౌహార్ధం
పునాదులై ఇళ్ళులేచి
జనావళికి శుభం పూచి
శాంతి, శాంతి, శాంతి, శాంతి
జగమంతా జయిస్తుంది
ఈ స్వప్నం నిజమౌతుంది

ఈ స్వర్గం ఋజువవుతుంది అని ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేశాడు. అదే సమసమాజం అని వ్యాఖ్యానించాడన్న మాట. పాశ్చాత్యులు జగన్నాథుని రథం అంటే విధ్వంస చిహ్నంగా భావించారని కొందరి అభిప్రాయం. జగన్నాథ రథం అభ్యుదయ పదానికి సంకేతమనీ, ఆ రథవేగంలో దుర్మార్గులూ, దోపిడీదార్లు పడి మరణిస్తారనీ కొందరు వివరించారు.

ముగింపు :

శ్రీశ్రీ పై సంప్రదాయ సాహిత్య ప్రభావం చాలా ఉంది. అధివాస్తవికతావాదం గల గేయాలు రచించారు. వీరు రాసిన సిరిసిరిమువ్వ శతకంలో ఆధునిక సమాజ చిత్రణ కనపడుతుంది. ఇందులో అధిక్షేపం ఎక్కువైనా హాస్యం కూడా ఉంది. "యుగకలం ఆయన చేతిలో ఉంది, అది కదిలినా కక్కినా అందమే" అని శ్రీరమణగారు చెప్పారు. సమసమాజ స్థాపనకు సంధించిన బాణాల వంటి శ్రీశ్రీ రచనలు నేటి సమాజాన్ని సంధిస్తూనే ఉన్నాయి. అభ్యుదయ బాటలను, భావాలను స్థిరపరుస్తూ ఉన్నాయి అనడంలో అతిశయోక్తి లేదు.

నా రచనలలో లోకం ప్రతిఫలించి
నా తపస్సు ఫలించి
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నాజాతి జనులు పాడుకునే
మంత్రంగా మ్రోగించాలని ఆశించి అని

శ్రీశ్రీ వ్రాసిన కవిత్వం స్థిరంగా, తరతరాలుగా మోగుతూనే ఉంది. అనితరసాధ్యమైన అతని మార్గాన్ని చేరాలని అనుకోవడం అత్యాశే కాని ప్రయత్నించాల్సిన బాధ్యత అందరిది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష - డా.జి.నాగయ్య
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా. ద్వా.నా. శాస్త్రి
3. సిప్రాలి - శ్రీశ్రీ

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సరోజాశ్రీశ్రీ జ్ఞాపకాలు – శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానం

– డా॥ ఐ. భీమమ్మ, తెలుగు అధ్యాపకురాలు, ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నాంపల్లి, హైదరాబాద్.

ప్రముఖ తెలుగు కవి, జనసామాన్యంలోకి చొచ్చుకు పోయిన కవి, అభ్యుదయకవి, వాదానికి వివాదానికి వారధిగా మిగిలిన కవి... శ్రీశ్రీ సాహిత్యం ఒక సంచలనం, వీరి కవిత్వాలు నినాదాలు... ఉషస్సులు... భూమి ఉన్నంతవరకు మిగిలిపోయే అక్షర కరవాలాలు... ! అందుకే శ్రీశ్రీ స్థానం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా మిగిలిపోయింది.

కథ, కవిత, పాట, నాటిక, వ్యాసాలు... ఏది రాసిన శ్రీశ్రీ సాహిత్యం ఒక ప్రత్యేకముద్ర. పసిపిల్లల్ని వృద్ధుల్ని సోమరుల్ని సైతం పరుగెత్తించే చైతన్యం శ్రీశ్రీ సాహిత్యానికి సొంతం కాబట్టే తెలుగు వాకిటిలో శ్రీశ్రీ ఒక రవిబింబం అని అభివర్ణించుకోవచ్చు. శ్రీశ్రీ సాహిత్యం విస్తృతమైనది. వారి వాదనలపై ఎన్ని వ్యాసంగాలు వచ్చినా, ఎందరో పరిశోధనలు చేసినా, మరెందరో సదస్సులు నిర్వహించినా, ఇంకా ఏదో మిగిలివున్నది అనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో శ్రీశ్రీ జీవిత భాగస్వామి సరోజాశ్రీశ్రీ అనుభవాల్లో జ్ఞాపకాల్లో శ్రీశ్రీ సాహిత్యం గురించి తెలుసుకుంటే ఆసక్తికరమైన కొన్ని కొత్త విషయాలు తెలిసే అవకాశం అనివార్యంగా ఉన్నది.

శ్రీశ్రీ జీవితంలో సరోజా శ్రీశ్రీ :

విజయనగరం వాస్తవ్యులు పాఠశాల హైడ్మాస్టరు సూర్యనారాయణ, సీతారామమ్మ గార్ల కూతురు సరోజమ్మ పదిమంది సంతానంలో ఒకరు. చిన్ననాటి నుండే సంగీతంలో ఆరితేరింది. హరికథలు చెప్పడంలో మంచి పేరు సంపాదించుకుంది. సంగీత్ విద్వాన్ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలయ్యింది. సినిమాలో కోరస్ నుండి "సో"లో పాటలు పాడేవరకు అవకాశాలను సంపాదించుకుంది. ఇట్లాంటి క్రమంలో వాహిని స్టూడియోలో రికార్డింగ్ కోసం 1956 ఆగస్టు 25వ తేదీన వెళ్ళడం జరిగింది. "సో"లో పాట పాడుతున్న సమయంలో "తలకాయ్" అనే పదాన్ని "తలకై"... అంటూ తప్పుగా పాడుతుంటే, కట్ కట్ అంటూ ఒక వ్యక్తి సరోజమ్మ వద్దకు వచ్చాడు. మాసిపోయిన లాల్చి, పెరిగినగడ్డం, ఎడంచేత్తో సిగరెట్టు, దమ్ము కొడుతూ కనిపించిన వ్యక్తి తలకాయ్‌కి "తలకై"కి వివరణ ఇచ్చాడు. అతడి అవతారం ఆమెకు నచ్చలేదు కాని కొద్దిసేపటికి అతడు ఎవరో కాదు శ్రీశ్రీ అని తెలియగానే సరోజమ్మ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. తన అభిమాన కవిని ఆవిధంగా ఊహించుకోలేకపోయింది. తర్వాత అతడే తన జీవిత భాగస్వామికావడం ఒక ఊహించని మలుపు. ఇది సరోజా శ్రీశ్రీ- శ్రీశ్రీ ప్రస్థానంలో మొదటి పేజీ. ఇక సరోజశ్రీశ్రీ మాటల్లో శ్రీశ్రీ సాహిత్యాన్ని పరిశీలిద్దాం.

ఒక్కరోజులో 16 పాటలు :

శ్రీశ్రీ ప్రతిభకు ఇదొక కొలమానం. నేటి రచయితలు ఒకపాట రాయడం కోసం రెండు రోజులు కనీస సమయం తీసుకుంటున్నారు. కాని సరోజమ్మగారి జ్ఞాపకాల్లో గమనిస్తే.... శ్రీశ్రీ ఒక్క రోజులో 16 పాటలు రాసిన సందర్భం ఉన్నది. ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల లోపు 16 పాటు రాసిన ఘనత శ్రీశ్రీ స్వంతం. అందుకే మహాకవి అయ్యాడు. శ్రీశ్రీ రూపురేఖలకు పెద్దగా ప్రాముఖ్యత ఇవ్వని రాతగాడు భావజాలంలో విభేదించినా హార్డ్‌వర్క్‌లో అందరికి ఆదర్శప్రాయుడు.

శ్రీశ్రీగారి అసిస్టెంటుగా పనిచేస్తున్న రోజుల్లో మహాత్మ, స్టూడియోలో ఈ అరుదైన అద్భుతం జరిగింది. అసిస్టెంటుగా శ్రీశ్రీ రచనా వేగానికి సరోజమ్మ ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. శ్రీశ్రీ ఆరోజుల్లో "మహాత్మా పిక్చర్స్- శంకర్‌సింగ్"గారు అంటే తెలియని వాళ్ళు లేరు. ఆవిధంగా ఒక ప్రఖ్యాత సంస్థకు శ్రీశ్రీ అందించిన సేవ ఎంత కఠోరంగా సాగిందో సరోజమ్మ అనుభవం ద్వారా

సమాజానికి తెలుస్తున్నది. శ్రీశ్రీతన సాహిత్యం బతకాలని ఆశపడ్డాడే తప్ప, తన అక్షరాలకు ఇంత డబ్బు కావాలి అని ఆశపడలేదు. ఆవిధంగా సాహిత్యాన్ని పోషించిన శ్రీశ్రీ, ఫలితాన్ని సంపాదనగా కాదు సమాజాన్ని కదిలించడం కోసం ఆరాటపడ్డాడు.

శ్రీశ్రీగారి కోపం :

శ్రీశ్రీ గారి కోపంలోనూ పాఠాలు నేర్చుకోవచ్చు. తన సాహిత్యం అంటే సమాజం హితమే అని భావించిన కవి. శ్రీశ్రీ గారికి ఎవ్వరైనా అబద్ధాలు చెప్పడం, ఇచ్చిన పని చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేయడం, చెప్పుడు మాటలు వినడం, దొంగతనం, ఇచ్చకాలు, పొగడ్తలు, గొప్పలు చెప్పడం... ఇవన్నీ శ్రీశ్రీకి నచ్చదు. ముక్కు సూటిగా వెళ్ళిపోయే మనస్తత్వం. అందుకే శ్రీశ్రీ కొందరికి గిట్టని వ్యక్తి కూడా అయ్యాడు. కాని అది వారి జీవితంపై ఎలాంటి ప్రభావం చూపలేదు. తనదైన ప్రపంచంలో గమ్యం చేరడం కోసం కష్టపడతాడు. అప్పగించిన పని పూర్తయ్యేవరకు నిద్రకు కూడా స్వస్తిచెప్తాడు. సిగరెట్టు పొగలు వదులుతూ సమయం ఎలా గడిచిందో తెలియకుండా రాయడంలో విరామం ఎరుగకుండా పని చేసుకుంటాడు. తన అసిస్టెంట్స్‌లతో కూడా ఉత్సాహంగా పని చేయిస్తాడు. తప్పించుకునే ప్రయత్నం చేసినా సాకులు చెప్పినా పసిగట్టి చివాట్లు పెడతాడు. "తన మనసులో చివాట్లు పెట్టడం అంటే, బుద్ధిచెప్పడం" అనేది శ్రీశ్రీ భావన, అర్థం చేసుకుంటే ఇదే నిజం. శ్రీశ్రీలో కోపం అనే కోణం ఒక విధంగా సానబెట్టడం వంటిది.

కలంతో కదులుతాను :

నేను మనిషిని నమ్ముతాను. మనిషిలో అంతర్గతమైన మంచితనాన్ని నమ్ముతాను. మనిషి హక్కుల్ని ఎవరైనా నాశనం చేస్తానంటే నేను సహించను, వాటిని రక్షించుకోవడానికి పోరాడుతాను! కలం నా ఆయుధం, కలంతో నేను కదులుతాను. కలంతో కదం తొక్కుతాను. అంటూ శ్రీశ్రీ నిర్భయంగా ప్రకటించుకున్న సందర్భాన్ని సరోజమ్మ గుర్తు చేసుకున్నారు. తాను వాస్తవానికి ఆస్తికురాలు. దేవుడ్ని నమ్ముతుంది. కాని శ్రీశ్రీనాస్తికుడు. రెండు విభిన్న మనస్తత్వాలు ఒక గూటి కింద ఉండటంలో ఎటువంటి ఇబ్బంది కలుగలేదు. అదే శ్రీశ్రీలో ఉండే మంచితనం. ముఖ్యంగా శ్రీశ్రీ సినిమా ప్రపంచంలోనే ఉండిపోలేదు. సినిమాకు అమ్ముడుపోలేదు. కాని శ్రీశ్రీని సమాజం అనుమానించింది. ఈ విషయమై "లోకులు కాకులు"... అంటూ శ్రీశ్రీ పెద్దరికం వహించాడు. బ్రతకడానికి ఏదో ఒకపని చేయాలి. ఏదైతే ఏమిటి? ఇది మాత్రం సాహిత్యం కాదా? అదీగాక, నాకవిత్వానికీ, సినిమాకి సంబంధం ఏమిటి. నేను సినిమా ప్రపంచంలో ఉంటూ సాహిత్యాన్ని రాయడం మానేశానా? అంటూ ఆ ఆరోపణల్ని నేను అంగీకరించను కొత్తరచనలు చేస్తూనే ఉంటాను అంటూ నిర్భయంగా సమాధానం ఇచ్చాడు.

అర్ధరాత్రి ఆవిర్భవించిన విరసం :

విప్లవకవిగా శ్రీశ్రీ ఒక ప్రభంజనం సృష్టించాడు. గుండె గుండెను కదిలించాడు. 1970 జూలై నాల్గవ తేదీన అర్ధరాత్రి విప్లవరచయితల సంఘం ఆవిర్భవించింది. విప్లవ రచయితగా శ్రీశ్రీ చుట్టూ ఎప్పుడూ యువతరమే ఉండేది. తాను అరవైఏండ్ల వయసులో ఉన్నప్పటికీ ఆలోచనల్లో రాయడంలో ఎల్లప్పుడు యువకుడిగానే కనిపించేవాడు. యువత నిర్లక్ష్యంగా ఉండటాన్ని సహించలేకపోయేవాడు. కుర్రాల్లో వృద్ధాప్యంను శ్రీశ్రీ అస్సలు ఒప్పుకునే వాడు కాదు. "ఇంక్విలాబ్ జిందాబాద్" అంటూ గొంతెత్తి అరుస్తుంటే ఆ శబ్దం ప్రపంచంలో ప్రతిధ్వనించినట్టుగా ఉండేది. ఆవేశంతో మాట్లాడే మాటలు వింటూంటే ఒళ్ళు జలధరించేది. ఇంత నిబద్ధతగా ధీటుగా భయంకరంగా కనబడే శ్రీశ్రీకి ప్రజలే ప్రాణం, పోరాటమే ప్రాణవాయువు, ఉద్యమమే ఊపిరి విప్లవం అతని జీవితం, జలపాతం వారి వేగం - అన్న మాటల్లోని

నిజం కళ్ళకి కట్టినట్లుగా కనిపించేది. శ్రీశ్రీ అక్షర కోటీశ్వరుడు. కాబట్టే విప్లవ ప్రపంచానికి అధినేత అయ్యాడు... అంటూ శ్రీశ్రీని సరోజమ్మ ప్రశంసించారు.

కృష్ణశాస్త్రి గురించి శ్రీశ్రీ :

శ్రీశ్రీ గారికి కృష్ణశాస్త్రిగారి పుస్తకాలతో పెద్దగా పరిచయంలేదు. మల్లీశ్వరి పాటలతో కృష్ణశాస్త్రి గారిపై అభిమానం పెంచుకున్నాడు. అక్షరాన్ని అర్థాన్ని ఆరాధించే శ్రీశ్రీ కృష్ణశాస్త్రి అక్షరాలను మనసారా ఇష్టపడుతూ వచ్చాడు.

"ఎవరే పిలిచేరల్లన మెల్లన-పిల్లల గ్రోవిని - ప్రియా ప్రియా" అనే పాటతోను, మరి "ఎందుకే నీకింత తొందరా" అనే పాటలు సరోజమ్మతో పదేపదే పాడించు కున్నాడు. ఇది ఇలా సున్నిత మనస్తత్వానికి తార్కాణం. కనిపించని అనుభూతుల పరంపరాలు శ్రీశ్రీలో అంతర్గతంగా ఎంత సుకుమారంగా ప్రవహిస్తున్నాయో తెలుస్తుంది.

"అద్దం బద్దలైంది
రోదసీ రోదించింది.
షెల్లీ మళ్ళీ మరణించాడు.
వసంతం వాడిపోయింది....." అంటూ కృష్ణశాస్త్రి మరణాన్ని విని తట్టుకోలేక అతి దుఃఖంతో రాసుకున్న కవిత ఇది. ఈ కవిత శ్రీశ్రీ స్నేహమనస్తత్వానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

గుండె ధైర్యం ఒక్కటే నా ఆస్తి :

అందరికి తెలుసు... శ్రీశ్రీ ఆర్థిక స్థితిమంతుడు కాదు అని, అక్షరమే అతడి ఆస్తి... అతడు ఒక అక్షర కోటీశ్వరుడు అని అభిమానంగా అభివర్ణించుకుంటారు కూడా, కాగా శ్రీశ్రీ గుండె ధైర్యమే తనకు ఉన్న ఆస్తిపాస్తి అని చెప్పు కున్నాడు. గుండె ధైర్యం ఉంది కాబట్టే, విరసంలో అగి పుట్టించాడు అని చెప్పుకోవచ్చు. 1975లో ప్రపంచ మొదటి తెలుగు మహాసభల సందర్భంగా విరసం కవులు నిర్ధారణకు గురయ్యారు. అప్పుడు శ్రీశ్రీ రగిలిపోతూ తన జీవిత సహచరి సరోజతో "ఈ ప్రపంచ తెలుగు మహాసభల్ని బహిష్కరించాలని యువతకు పిలుపు నిస్తున్నాను"... అని చెప్పడం జరిగింది. వాదించిన సహచరితో తన గుండెధైర్యం గురించి చెప్పుకోవడం జరిగింది. ఏదిఏమైనా సరోజమ్మ మాటలు వింటే శ్రీశ్రీకి ఇంతటి ధైర్యం ఏమిటి? ప్రాణాల మీద ఏమాత్రం తీపిలేదు... అన్పిస్తుంది.

అడుగుజాడ - గురజాడ :

గురజాడ చనిపోయే నాటికి నాకు ఐదేళ్ళు. మరొక ఇరవై ఏళ్ళయినా గురజాడవారు బతికి ఉంటే తెలుగు సాహిత్యక్షేత్రం మరింత సస్యశ్యామలం అయ్యేది కదా! అని ఎప్పుడు తలుచుకున్నప్పుడల్లా బాధగా ఉంటుంది. నేను అనుకున్నట్లు గురజాడ వారు బతికి ఉంటే నేను వారిని చూసే అవకాశం కూడా నాకు ఉండేది.... అంటూ నాకు గురువు "నా అడుగుజాడ గురజాడ" అని హృదయపూర్వకంగా ప్రకటించుకన్న కవి శ్రీశ్రీ.

శ్రీశ్రీ గురజాడవారి దేశభక్తి గీతాల్ని గొప్పగా అభిమానించాడు. ఆ ఒక్క గీతంతోనే ప్రపంచకవుల్లో ఒక్కడిగా గురజాడని గుర్తించాడు.

శ్రీశ్రీ స్వదస్ఫూర్తితో సిప్రాలి :

శ్రీశ్రీ నాస్తికుడు అయినప్పటికి ఎప్పుడు ఎక్కడ దైవదూషణ చేయలేదు. మిత్రులు కోరితే దైవ భక్తి పాటలు రాయడానికి వెనకాడలేదు. ఇది వారి సంస్కారానికి ప్రతీక.

హూష్టన్లో జరిగిన సంఘటన కారణంగా "అమెరికాలో ఉన్న ఆంధ్రులకు నా స్వద స్ఫూర్తితో ఒక మంచి కావ్యాన్ని అందజేయాలనే ఆలోచనతో ఈ గ్రంథాన్ని రూపకల్పన చేసారు. 109 సిరిసిరిమువ్వ పదాలు, 103 ప్రాసక్రీడలు, 10 లిమరిక్కులతో "సిప్రాలి" కావ్యాన్ని శ్రీశ్రీ పూర్తిచేశారు.

సంగీతవిద్యాలయం :

వచ్చినవిద్య మరుగున పడటమో, మూలనపడటమో, నాలుగు గోడలకు అంకితం కావడమో శ్రీశ్రీకి సహేమిరా నచ్చదు. ఒప్పుకోడు. భార్య సరోజ విషయంలో ఇదే జరిగింది. సంసారంలో పడి సినిమా ఫీల్డుకు సరోజమ్మ దూరం అయింది. అది శ్రీశ్రీ ఏమాత్రం సహించలేదు.

ఆమె మంచి సంగీత విద్వాంసురాలు. వీణ, మృదంగం, వయోలిన్, హార్మోనియం... వంటి సంగీత పరికరాలు వాయించగలదు. సంగీతంలో ప్రభుత్వం నిర్వహించిన అన్ని పరీక్షలు పాసయ్యి ''సంగీత విద్వాన్''గా సర్టిఫికెట్ కూడా తీసుకుంది. అందుకే ఆమె ఇంట్లో కూర్చోవడం శ్రీశ్రీ ఒప్పుకోలేదు. బలవంతంగా భార్య చేత సంగీతంకు సంబంధించిన స్కూలును పెట్టించాడు. సంగీత పరికరాలు తానే స్వయంగా కొన్నాడు. ప్రకటనను పేపర్లో అచ్చువేయించాడు. నాస్తికుడు. అయినప్పటికీ ''జై సంతోషి సంగీత విద్యాలయం'' అనే పేరుతో సరోజమ్మ పాఠశాలను ప్రారంభిస్తానంటే అడ్డుచెప్పలేదు. ఇది శ్రీశ్రీ ఉన్నతమైన వ్యక్తిత్వానికి గొప్ప నిదర్శనం. సరస్వతిమాతను శ్రీశ్రీ గౌరవించాడు కాబట్టే అక్షర కోటీశ్వరుడు అయ్యాడు. అని మనం భావించవచ్చు.

భార్యకన్నా కవిత్వమే ఎక్కువ :

రాయడంలో శ్రీశ్రీది వ్యసనం అని ఇదివరకు చెప్పుకున్నాం. అది ఎంతవ్యసనం అంటే భార్యకంటే కవిత్వమే ఎక్కువ అనేంత వ్యసనం వారిది. ఈ విషయం వారి మాటల్లోనే వింటే ''కవిత్వం అనేది ఏదో ఆరాత్రికి తెచ్చుకున్న స్త్రీ'' కాదు ఉంచుకున్నా వాడి ఊర్వశీ కాదు.. నాకవిత్వాన్ని చేసుకున్న భార్యగా గాని, ఉంచుకున్నా స్త్రీగా గానీ కాకుండా నన్ను కన్నతల్లిగానే ఎప్పుడు భావించాను''... అంటూ మాట్లాడిన మాటలు కవిత్వం మీద గౌరవాన్ని ఆరాదనని వ్యక్తం చేస్తున్నాయి. నాస్తికుడైన శ్రీశ్రీలో ఒక ఆరాధకుడి భావనల్ని ఇక్కడ మనం దర్శించవచ్చు.

పిల్లలకు తెలుగు నేర్పించండి :

శ్రీశ్రీకి తెలుగు భాషపైన గౌరవం ఆరాధన ఎక్కువ. తెలుగుకవిగా విశ్వఖ్యాతి గడించాడు. ఇదంతా తనవరకే కాదు, తర్వాతి తరాలకు కూడా తెలుగు భాషాభిమానం ప్రసరించాలని ఆశించాడు. అందుకే

ఏ దేశంలో ఉన్న ఏ హొదాలో ఉన్న మాతృభాష మీద పిల్లలకు మమకారం పెంచాలని అనేక సభలలో మన అందరిని ఆశించాడు.

కాళ్ళు కడిగిన శ్రీశ్రీ :

శ్రీశ్రీ అంటే ఒక అభ్యుదయ కవి, ఒక విప్లవకవి, వీరు సమాజహితాన్ని ఆశిస్తాడు. సమాజంలో నెలకొని ఉన్న కొన్ని నమ్మకాలను నిరసిస్తాడు అనే భ్రాంతి చెందుతారు. న్యాయఅన్యాయాలను ప్రశ్నిస్తాడు. కొన్ని ఆచారవ్యవహారాలను వ్యతిరేకిస్తాడు. అని మనం భ్రమ పడుతున్నాం. కాని శ్రీశ్రీ కూతురి పెళ్ళి సమయంలో ఓ కొత్త కోణంలో ఆవిష్కరించబడింది, కరుడుగట్టిన నాస్తికుడు కూతురు పెళ్ళిలో అమాంతం కరిగిపోయాడు తన భావజాలం పక్కకు పెట్టి కూతురు పెళ్ళిలో గౌరి పూజలో పాల్గొన్నాడు. కాళ్ళు కడిగి కన్యాదానం చేసాడు. కూతురు అత్తగారింటికి వెళ్తుంటే కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఎంతటి కవైనా సామన్యమనిషే అని నిరూపించుకున్నాడు. ఇది శ్రీశ్రీ హృదయ సంస్కారానికి తార్కాణం.

నా మరణం శాసనం :

మతం అంటే శ్రీశ్రీకి అసహ్యం, మనిషి తనమే అతడి విశ్వాసం. ఈ మనిషితనంలో మరణ శాసనం రాసిపెట్టాడు. తన మరణం తర్వాత తన శరీరాన్ని విశాఖపట్టణంలో ''కింగ్ జార్జ్'' ఆసుపత్రికి ఇవ్వాలి అనేది ఆ శాసనం, శ్రీశ్రీ మరణాన్ని అంగీకరించలేదు. అందుకే తన అవయవదానంతో పునః జన్మించాలని ఆశించాడు. ఈ విషయాన్ని బహిరంగంగా ప్రకటించుకున్నాడు.

ముగింపు :

సరోజమ్మ జ్ఞాపకాలలో శ్రీశ్రీ అనేక కోణాల్లో కన్పిస్తాడు. కేవలం కవిగా, రచయితగా కనిపించే శ్రీశ్రీ సరోజమ్మ జ్ఞాపకాల్లో సరికొత్తగా చూడవచ్చు. వారి సాహిత్యం, వారి జీవితానుభవాలు, సాహిత్యంలో వివిధ సందర్భాలు, పిల్లలతో వారికి ఉండే అనుబంధం, తెలుగు భాష మీద అభిమానం భార్యతో సరదాలు... ఇవన్నీ శ్రీశ్రీ సంసార ప్రస్థానంలో కన్పిస్తాయి.

ఆధార గ్రంథాలు :

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ
2. శ్రీశ్రీ సంసార ప్రస్థానం - సరోజా శ్రీశ్రీ
3. శ్రీశ్రీ కథలు అనువాద కథలు - చలసాని ప్రసాద్
4. శ్రీశ్రీ సిప్రాలి - చలసాని ప్రసాద్
5. శ్రీశ్రీ అనంతం - చలసాని ప్రసాద్

❖❖❖

శ్రీశ్రీ - అనంతం

- శ్రీ లేలి, హెచ్ 1103, అపర్ణ సెరెన్ పార్క్, కొండాపూర్, హైదరాబాద్.

అది 1910 దశకం. ఎందరో మహా కవులు పుట్టిన దశకం. ఈ శతాబ్దపు మహాకవి జన్మించిన దశకం కూడా. పూడిపెద్ది వారి మనవడు అయినప్పటికీ, తండ్రి శ్రీరంగం వారి దత్తుడు అయినందుకు మన శ్రీనివాసరావు శ్రీశ్రీ అయ్యాడు. అందరిలానే బాల్యం జమిందారీతనంగా సాగింది. తండ్రి వెంకటరమణయ్య, తల్లి అప్పలకొండల గారాల పట్టీ శ్రీశ్రీ. శ్రీనివాసరావు పేరు ఎలా వచ్చిందంటే, విశాఖలో ఆ రోజుల్లో ఎవియన్ కాలేజీ సంబంధిత స్కూల్‌లో తండ్రి వెంకటరమణయ్య లెక్కల మాస్టర్‌గా చేస్తూ ఉండేవారు. ఈ శ్రీనివాస్ అయ్యంగార్ తెలుగు సాహిత్య పిపాసి. ఆ రోజుల్లో తెలుగు భాషాభివృద్ధికి పాటుపడిన వారిలో ఒకరుగా ప్రఖ్యాతి పొందిన వ్యక్తి. ''మా నాన్నగారికి ప్రిన్సిపాల్ గారి మీద ఉన్న అత్యంత భక్తి వలన కాబోలు, నాకు శ్రీనివాసరావు అని నామకరణం చేశారు''- అని అనంతంలో శ్రీశ్రీ పేర్కొన్నారు. శ్రీశ్రీకి 5వ ఏట విశాఖ తీరంలో అక్షరాభ్యాసం, తిరుపతిలో ఉపనయనం జరిగాయి. ''నా బాల్యంలో జరిగిన పెద్ద మార్పులు రెండు'' అని శ్రీశ్రీ పేర్కొన్నారు.

7,8 సంవత్సరాల వయసు వున్నప్పటి నుండే పుస్తక పఠనం అలవాటు చేసుకున్నారు. అదే వయసులో చిన్నగా, ఒకలైను పెద్దగా రాసి ఇదే కంద పద్యం అని వాళ్ళ నాన్న గారికి చూపించడం, ఆయన చిన్నగా నవ్వి ఇది కంద పద్యం కాదు, నువ్వు నిజంగా వ్యకరణ పూరితంగా పద్యం రాయాలి అనుకుంటే ''సులక్షణ సారం'' అనే వ్యాకరణ గ్రంథం కొనిచ్చి చదువుకోమన్నారు.

తిలక్ గారి మాటల్లో :

''అతని శైలి శల్యూష- ప్రజా శ్రేయోభిలాషి'',

''మీ కవిత్వం ఒక ఆల్కెమీ'' అంటూ శ్రీశ్రీని కొనియాడారు.

''ఒక పల్లెటూరి పొలిమేరల్లో నన్ను నిలబెట్టి ఒక యువకుడు శ్రీశ్రీ కవితా ఓ కవితా అనే కవితను తన గంభీర కంఠంతో వినిపించినప్పుడు లక్ష జలపాతాల పాటలు, కోటి నక్షత్రాల మాటలతో పాటు రాజ్యాలు, సైన్యాలు, విప్లవాలు, ప్రజలు, శతాబ్దాలు నా కళ్ళముందు గిర్రున తిరిగి నేను చైతన్యపు మరో అంచున నిలబడ్డాను. అంటూ తిలక్‌గారు శ్రీశ్రీ గారిని ప్రశంసించారు.

బాధాకరమైన విషయం ఏమిటంటే, తిలక్‌గారి లాంటి గొప్ప కవులు చెప్పిన మాటలన్నీ అముద్రితంగా మిగిలిపోయాయి.

సాహిత్యం - శ్రీశ్రీ :

ఏక సంథాగ్రాహ్యత శ్రీశ్రీ సొంతం. ఎవియన్ కాలేజీలో పనిచేసే వడ్డే కేశవరావు గారు శ్రీశ్రీ గారికి ఛందస్సు నేర్పారు. బాలకవిగా పేరు రావడం మొదలు పెట్టింది. వీర సింహ విజయసింహులు అనే కథను మొట్టమొదట శ్రీశ్రీ రాశారు, గోకులాయి అనే అపరాధ పరిశోధక నవల కూడా రాశారు. చిన్నతనం నుండే పద్యాలు రాయడం అలవాటుగా ఉండేది. సావిత్రి సత్యవంతం అనే పద్యాలతో కూడిన నాటకం కూడా రాశారు. ఇవన్నీ హైస్కూల్ వయసులోనే రాయడం గమనార్హం. పరిణయ రహస్యం అనే నవల కూడా శ్రీశ్రీ గారే రాశారు, కాకపోతే వీటిలో ఏదీ లభ్యం కాలేదు. నేను రాశాను అని శ్రీశ్రీ చెప్పుకోవటమే తెలుసు. పరిణయ రహస్యం నవల ప్రతి మాత్రం లభ్యం అయింది. బాలకవి, వర్ధమాన కవి అంటూ స్కూల్ లో పిలవటం జరుగుతూ వచ్చింది.

1925 ప్రాంతాల్లో పురిపండ అప్పలస్వామి గారు అనే రచయిత పరిచయం జరిగింది. ఆయన చిట్ట చివరి వరకూ స్నేహితుడిగా, బోధకుడిగా, దర్శకుడిగా, అభిమానిగా శ్రీశ్రీని ప్రోత్సహిస్తూ వచ్చారు. అప్పటికే

రాస్తున్నప్పటికీ పూర్తిస్థాయి కవిగా సుస్థిర స్థానం లేదు శ్రీశ్రీకి. తరువాత '' విశ్వరూప సందర్శనం'' అనే ఒక పద్యకావ్యాన్ని పూర్తిస్థాయి కవిగా రాయడం జరిగింది. విశ్వరూప సందర్శనాన్ని పురిపండ అప్పలస్వామి గారు దివ్యలోచనములుగా పేరు మార్చి ఆయన పత్రిక స్వశక్తి లో ప్రచురించారు. ఇంటర్‌లో ప్రభవ అనే పుస్తకాన్ని శ్రీశ్రీ రాయడం జరిగింది. ఈ ప్రభవ 1928వ సంవత్సరంలో మొట్టమొదటి పుస్తకంగా ప్రచురించబడింది.

భావకవిత్వం, ప్రణయ కవిత్వం రాస్తూ వచ్చాను. వేమన పద్యాలను తొలిసారిగా చదవడం వల్ల సమాజంలో ఉన్న సమస్యలను ఉద్దేశించి కవితలను రాయచ్చు. అనే ఆలోచనలని కల్పించుకుని, నాలో మార్పుని తెలచ్చుకున్నాను అని శ్రీశ్రీ ఒకానొక సందర్భంలో చెప్పడం జరిగింది. 1930-31 సంవత్సరం జీవితంలో మరొక దశ ప్రారంభం అయింది శ్రీశ్రీకి. ఒక పది సంవత్సరాల కాలం మాత్రం చాలా కష్టాలు పడ్డారు, ఆయన అనంతంలో రాసుకున్నారు నా దరిద్రపు రోజులు అని మొహమాటం లేకుండా. 1933 నాటికి ఇప్పటికీ చదువుతున్న మహాప్రస్థానంలో కవితలు రాయడం మొదలు పెట్టారు.

మహాప్రస్థానం -శ్రీశ్రీ :

శ్రీశ్రీ గారి కవితలకు అర్థం తెలియకపోయినా, శబ్దాడంబరం మాత్రం ఆకర్షిస్తుంది అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. మహాప్రస్థానం మాటకొస్తే అదొక సుదీర్ఘ ప్రయాణం. 80,90 ఏళ్ల క్రితం మహాప్రస్థానంలో పద్యాలు, గేయాలు రాయడం మొదలు పెట్టినప్పటికీ, ఈనాటి పరిస్థాతులకి కూడా అద్దం పట్టేలా ఉన్నాయి అంటే మనం ఇంకా ఎక్కడున్నాం అనే ప్రశ్న మనలో కలగడం సమంజసమేనేమో. మహాప్రస్థానంలో ముందు మాటగా గుడిపాటి వెంకటాచలం గారి మాటలు కవిలత కంటే ఆకర్షించే విధంగా ఉన్నాయనటంలో అతిశయోక్తి లేదు. మహాప్రస్థానం పుస్తకం 41 కవితలతో 100 పేజీల పుస్తకం 1950వ సంతవ్సరంలో మొదటిసారిగా ప్రచురితం కాబడింది. ఈనాటికీ కూడా పున: ముద్రణ జరుగుతూనే ఉంది. ముద్రించిన ప్రతీసారీ 2000 కాపీలకి తక్కువ కాకుండా అమ్ముడుపోవటం గమనార్హం. ఈనాటికీ యువకవుల్ని సైతం ప్రభావితం చేస్తోంది మహాప్రస్థానం అంటే దాని వెనకాల ఉన్న మూల రహస్యం మనం గమనిస్తే పురాణ పదజాలాన్ని వాడట. మహా భారతంలో ఉన్న అంశాలు, మహాప్రస్థానంలో ఉన్నటు వంటి జయభేరి అనుకోండి. ఇటువంటి ఖండిక లన్నింటికీ మూలం అని చెప్పుకోవచ్చు.

''అభ్యుదయ భావాలతో విప్లవ బీజాలను మొల కెత్తించిన ఖండ కావ్యమే మహాప్రస్థానం''.

''కన్నీరు కారిస్తే కాదు చెమట చుక్కను చిందిస్తేనే చరిత్ర రాయగలమని తెలసుకో.''

''పేదవాడి ఆకలి, కార్మికుడి కష్టం, నిరుద్యోగి అసహనం, సైనికుడి తెగింపు కలగలిసిన విప్లవం శ్రీశ్రీ కవిత్వం''

''నవ్వు నడిచే దారిలో కనిపించే ప్రతీ కుక్కకి సమాధానం చెప్తూ పోతే గమ్యాన్ని చేరలేవు''.

''ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం''.

''నువ్వు రోజూ అబద్ధం ఆడితే, అది నిన్ను రోజూ అబద్ధం ఆడే స్థితికి తీసుకొస్తుంది.''

''పద పోదాం ప్రభాతనల ప్రవక్త మెలికలు తిరిగే దారుల తిరిగి నీ ప్రేమాస్పదమైన ఆకుపచ్చ నేల విముక్తికి పద పోదాం పగతీర్చుకుందాం, ఎన్నో అన్యాయాల మీద మన ఫాలభాగాల నిండా తిరుగుబాటు తారలు, విజయమో మరణమో అని ప్రమాణం చేస్తూ... అని శ్రీశ్రీ ఒక సందర్భంలో రాశారు.

మహాప్రస్థానం అంటేనే శ్రీశ్రీ, శ్రీశ్రీ పేరు అంటేనే మహా ప్రస్థానం. అది అభ్యుదయ కవులు, విప్లవకవులకు ఒక అపూర్వమైన కావ్యం. కవులు ఒకరికొకరు బహుమతిగా ఇచ్చుకునేటటువంటి అద్భుతమైన కానుకగా నిలిచింద నడంలో ఏ మాత్రం సందేహం లేదు.

అనంతం - శ్రీశ్రీ :

ఆత్మ, చరిత్రాత్మ, చరిత్రాత్మక నవల శ్రీశ్రీ ఆత్మకథ అనంతం. ''1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తరువాత నుంచీ దాన్ని నేను నడిపిస్తున్నాను'' అప్పటి నుంచీ , తెలుగు సాహిత్యం చరిత్ర శ్రీశ్రీ స్వీయ చరిత్ర. ఏ ముసుగులు, దాపరికాలు లేకుండా ఉన్నదున్నట్టు రాసాడు శ్రీశ్రీ అని కొందరన్నారు. అనంతంలో మింగలేని చేదు నిజాలు, వినలేని సంగతులు, చూడలేని దృశ్యాలు ముందుకు దూసుకు వచ్చాయన్నారు మరికొందరు. ఇక దీని రచనా పద్ధతి గురించి చెప్పుకుంటే, ఒక చోట కుదురుగా కూర్చుని, తీరిగ్గా, తాపీగా రాసింది కాదు. అలాగే ఒక క్రమంలో కూడా రాయలేదు శ్రీశ్రీ, అనంతంను 26 శీర్షికలుగా చిత్రీకరించి వివిధ ఊళ్ళల్లో ఉన్న పత్రికా సంపాదకులను, శ్రీశ్రీ అభిమానులను సంప్రదించి కఠిన శ్రమకోర్చి కూర్చిన చరిత్రాత్మక నవల.

ప్రారంభం నుంచీ విరసంలో వీరశైవులు వరకూ తీసుకుంటే, బాల్యం, ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, కాలేజీ, జ్ఞాపకాలు, శ్రీశ్రీ జీవితంలో గురువులు, సినిమా సరదాలు, సెక్స్ సరదాలు, విదేశీ యాత్ర అనుభవాలు, దరిద్రపు రోజులు, కవిత్వ ఆరంభం, నాస్తికత్వం, సినిమాతో అనుబంధాలు, కొంపెల్ల జనార్ధన్ రావు వరకూ అనంతంలో పేర్కొనబడ్డాయి.

అయ్యిందేదో అయిపోయింది. వెళ్ళినకాలం వెళ్ళి పోయింది. ఒక్కొక్కరోజే వస్తూ ఉంటుంది. ఈ జీవితం అనంతం అని బుజువు చేస్తూ ఉంటుంది. గతించి పోయినవన్నీ నెమరువేసుకోవడం కోసం అని ఈ 'అనంతం' నేను రాయలేదు. రేపేమి జరుగుతుందో చెప్పగల జ్యోస్యుణ్ణి కాను కనుక ఇవాళ నుంచి ఏమవుతున్నది రాస్తున్నాను. అని వాస్తవికతను ప్రతి బింబించేలా శ్రీశ్రీ అనంతంలో పేర్కొన్నారు. ధారాళంగా అబద్ధాలు ఆడేయటం మన జాతికి అలవాటైపోయింది. కవిత్వంలోనూ ఇంతే, నిత్యజీవితంలోనూ ఇంతే. ఫలానా సినీతార ముఖం చంద్రబింబం అంటే, నేను అర్ధం చేసుకోగలను కానీ, అంగీకరించలేను అని శ్రీశ్రీ అనంతంలో వాపోయాడు.

అనంతానికి అర్రులు చాస్తూనే ప్రస్తుతాన్ని ప్రస్తుతించడం ఒక్కటే నా కవితా ప్రయోగాలన్నింటికీ మూల కేంద్రం. అంచేతనే, నేను 20వ శతాబ్దపు తెలుగు కవిత్వం మీద, తిరుగులేని నియంతృత్వం చలాయించాలని నిశ్చయించాను. అందుకుగాను జీవితం అంతా కృషి చేశాను, చేస్తున్నాను అంటూ శ్రీశ్రీ తన కవిత్వం గురించి ప్రస్తావిస్తూ, ఈ శతాబ్దపు కవిగా ప్రకటించుకున్నాడు.

అనంతం, ఇలాగ తప్ప ఇంకో విధంగా రాయడానికి వీలులేదు. ఆత్మ చరిత్రాత్మక నవల ఇది. అన్ని నవలలు ఆయా రచయితల ఆత్మకథలే అన్నాడొక రచయిత. నిజం చెప్పాలంటే, నాకూ నిజం చెప్పాలనే ఉంది, కానీ దానికెన్నో అభ్యంతరాలు. పాగిడినంతసేపు అందరూ బాగుందంటారు. తెగిడినపుడు తిడతారు. అందుకే '' ఈ నవలలో పాత్రలన్నీ కల్పితాలే, ఏ వ్యక్తినీ ఉద్దేశించి రాసినవి కావు'' అని ముందుగానే ఒక నమస్కార బాణం పారెయ్యాలి. అని నిక్కచ్చిగా నిగ్గు తెల్చేశారు శ్రీశ్రీ అనంతంలో.

వచనాన్నే చిన్న పెద్ద పాదాలుగా రాసినంత మాత్రాన వచన గీతం సిద్ధించదు. లేదా ఏ కంద పద్యాన్నో గీత పద్యాన్నో ఇక్కడో మాత్రా, అక్కడో గణం లాగేసి కుదించినా వచనగీతం కాదు. వచన గీతానికి లక్షణం ఏమిటి అనడిగితే నిర్వచించడం కష్టమే. కవిత్వం అంటే ఇదీ అని నిర్ధారణగా చెప్పగలిగినప్పుడే వచన గీతం ఇదీ అని చెప్పవచ్చును. కవిత్వమే కాదే ఏది రాద్దామనుకున్నా కృత్యాద్యవస్థే అంటూ కవిత్వం పట్ల శ్రీశ్రీ అతని అనుభవాలని వ్యక్తం చేసారు.

ఇప్పుడు నేను చాలా అగాధమైన లోతుల్లోకి దిగుతున్నాను, దరిద్రం అనుభవించేటప్పుడు ఎంత భయంకరంగా ఉంటుందో జ్ఞాపకం చేసుకున్నపుడు, అంత ఆనందమయంగా ఉంటుంది. అవును, అవి నా దరిద్రపు రోజులు రెండేసి రోజులు తిండి లేకుండా బ్రతికాను. ఆ

పది సంవత్సరాలలోనే మహాప్రస్థాన గీతాలు రాసాను. అంత దరిద్రంలోనూ నేను ఎవ్వరినీ 'దేహి' అని యాచించలేదు. క్యారమ్స్‌లో గెలిచిన కప్పులని అమ్ముకున్నాను, కవిత్వాన్ని కూడా అమ్ముకున్నాను, ఇది వ్యభిచారం అని నాకు తెలుసు". చింకిగుడ్డల సింహం" అనే అసంపూర్ణ గీతం ఆ రోజుల్లో ఆలపించాను. సింహం ఆ రోజుల్లో నా ఆదర్శం. పది సంవత్సరాల దరిత్రం అందులోంచి ప్రభవించింది. నా కవిత్వం అంటూ 1930 నుంచీ 1940దాకా అవస్థలు పడ్డ కాలాన్ని వివరంగా వివరించారు శ్రీశ్రీ అనంతంలో.

పాగిడితే పొంగిపోయి, తిడితే క్రుంగిపోయే మనస్తత్వం కాదు నాది. నేనెంతో అమూల్యంగా ఎంచుకునే నా కవిత్వాన్ని తిట్టేవాళ్ళని కూడా నేనెప్పుడూ అసహ్యించుకోలేదు. నేను చెక్కు చెదరననే ధైర్యం నాది, శారీరకంగానే కాదు మానసికంగా కూడా నేనెన్నో బాధలు పడ్డాను. దేనికీ నేను చలించలేదు అన్నింటినీ నాలో ఇముడ్చుకున్నాను, నా ఉద్దేశ్యంలో సెక్స్ కూడా తిండి తినటం, ఊపిరి తీయటం, నిద్రపోవటం లాంటి ఒకానొక శారీరక వ్యాసంగం మాత్రమే. "నీకు జ్ఞానం వచ్చిన దగ్గర్నుంచి ఇప్పటిదాకా ఎంతమందితో పోయావని నన్నెవరైనా అడిగితే నవ్వి ఊరుకుంటాను. అన్న ప్రాసన జరిగింది లగాయతూ ఇవాళ దాకా ఎన్నిసార్లు భోజనం చేసానని ఎవరైనా అడిగితే ఏమని చెప్పడం అంటూ నిజాయితిగా తన జీవితంలో జరిగిన సంఘటనలన్నీ ఒక్కొక్కటిగా వివరించారు శ్రీశ్రీ అనంతంలో.

విరసం అంటే దిగంబర కవులే అన్న పొరపాటు అభిప్రాయాన్ని సవరించక తప్పదు. దిగంబర కవులంతా కలిసి ఆరుగురు. వారిలో 'మహాస్వప్న' విరసం ఆవిర్భావానికి ముందే దిగంబరోద్యమం నుంచి తప్పుకున్నాడు. భైరవయ్య విరసం సభ్యుడో కాదో ఇప్పటికీ నాకు తెలియదు, అతనో చిరునామా లేని మేఘం. ఎప్పుడో ఎక్కడ నుంచో కాస్త కనిపిస్తాడు. జడివాన లాంటి ఒక వచనగీతాన్ని కురిపించి మాయమవుతాడు. విరసం ఏర్పడ్డ తర్వాత చెరబండ రాజు కవిత్వం వచనగీత ప్రక్రియలో కాకుండా .జానపదగేయ ఛందస్సులలో రూపొందించడం అందరూ ఆహ్వానించదగ్గ ఒక గొప్ప పరిణామం అంటూ గద్దర్, జనసేన, వంగపండు కవుల్ని ప్రోత్సహిస్తూ వారి ప్రస్థావన తీసుకొచ్చారు శ్రీశ్రీ అనంతంలో.

సినిమా - శ్రీశ్రీ :

సినిమాల ప్రభావం సినిమా మీద మక్కువ శ్రీశ్రీలో ఒకింత అధికమనే చెప్పాలి. బాల్యంలో విశాఖలో లైట్ హౌస్ దగ్గర బయోస్కోప్ లో సినిమాలు చూడటం దగ్గరి నుండి మహాకవిగా మారి సినీ ప్రపంచానికి పరిచయం అయ్యేవరకూ గమనిస్తే సినిమా పట్ల శ్రీశ్రీ అభిరుచి ఎక్కువనే చెప్పాలి. సినీ కళామతల్లి నా దరిద్రపు రోజుల నుంచి నన్ను బయటపడేసింది, ప్రపంచానికి నన్ను పరిచయం చేసింది. అని శ్రీశ్రీ ఒకానొక సందర్భంలో వెల్లడించారు.

శ్రీశ్రీ కలం నుండి జాలువారిన కొన్ని ఆణిముత్యాలు :

ఆనందం అవర్ణమైతే అనురాగం అంబరమైతే.
అనురాగపుటంచులు చూస్తాం,
ఆనందపు లోతులు చూస్తాం

ఆనందం అంటూ కన్యాశుల్కం సినిమా కోసం 1955 వ సంవత్సరంలో శ్రీశ్రీగారు రాసిన కవిత పాటగా మారి జనాదరణ పొందింది. విషవాయువులై ప్రవరిస్తే విరితేనియలై ప్రవహిస్తే, ప్రపంచంను పరిహాసిస్తాం, భవిష్యమును పరిపాలిస్తాం అంటూ ఇన్ని శతాబ్దాలు గడిచినా చరిత్రలో నిలిచిపోయాడు శ్రీశ్రీ.

పాడవోయి భారతీయుడా అని వెలుగు నీడలు సినిమా కోసం 1961వ సంవత్సరంలో రాసిన పాటు బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. 1961 ముందు పరిస్థితు లను దృష్టిలో పెట్టుకుని రాసిన పాట ఈనాటికీ మన పెదాల మీద పలుకుతోందంటే, ఇప్పటికీ ఆ దౌర్భాగ్యపు

పరిస్థితులు కొనసాగుతున్నట్లే కదా. మచ్చుతునకగా, ఆకాశం అందుకునే ధరలొకవైపు అదుపులేని నిరుద్యోగం ఇంకొకైపు అంటూ కొనసాగే భావ ప్రవాహమే ఈనాటి పరిస్థితులకూ నిదర్శనం.

తెలుగువీర లేవరా - అల్లూరిసీతారామరాజు సినిమా కోసం 1974వ సంవత్సరంలో శ్రీశ్రీ కలం నుండి జారిన విప్లవగీతం ఈనాటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. ఈ గీతాన్ని పరిశీలించినట్టయితే దారుణ మారణ కాండకు తల్లడిల్ల వద్దురా నీతిలేని శాసనాలు నేటి నుండి రద్దురా.. నిదురవద్దు బెదరవద్దు నింగి నీకు హద్దురా అంటూ మనలో నిద్రణమై ఉన్న శక్తిని మేలుకొలుపుతూ సాగిన గీతానికి జాతీయ అవార్డు దక్కడం శ్లాఘనీయం.

శ్రమైక జీవనం - శ్రమైక జీవన సౌందర్యానికి సమాన మైనది లేనే లేదని అంటూ ఊరుమ్మడి బ్రతుకులు సినిమా కోసం శ్రీశ్రీ రాసిన పాట 1976వ సంవత్సరంలో, ఈనాటికీ కార్మికుల దినోత్సవం మే డే రోజున పాడుకోవడం పరిపాటిగా నిలిచింది. జాతీయ ఉత్తమ చిత్రంగా అవార్డు అందుకోవడం గమనార్హం.

ఆకలిరాజ్యం :

ఎ) 1981వ సంవత్సరంలో ఈ సినిమా విడుదలై శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని మరొక్కసారి ప్రపంచానికి పరిచయం చేస్తూ ''ఓ మహాత్మా.. ఓ మహర్షి ఏది చీకటి ఏది వెలుతురు అంటూ ఒక నిరుద్యోగి విసిగిపోతూ తన బాధను వెళ్ళగక్కే సందర్భంగా చిత్రీకరించారు దర్శకులు.

బి) కూటికోసం కూలికోసం పట్టణంలో బ్రతుకుదామని బయలుదేరిన బాటసారికి ఎంత కష్టం ఎంత కష్టం అంటూ ఇంట్లో తల్లిదండ్రుల మాట పెడచెవిని పెట్టి పట్టణానికి బయలుదేరిన ఆవేశపు యువతని ఉద్దేశిస్తూ చిత్రీకరించిన దర్శకుల పాటవం కడు అభినందనీయం.

సి) పోనీ పోనీ
పోతే పోనీ
సతుల్ సుతుల్ హితుల్ పోనీ,
రానీ రానీ వస్తే రానీ
కష్టాల్ నష్టాల్ కోపాల్ తాపాల్

శాపాల్ రానీ అంటూ కథానాయకుడు, తండ్రి మధ్య జరిగిన సంభాషణలో భాగంగా దర్శకుడు చిత్రీకరించిన తీరు మెచ్చుకోదగ్గది.

రుద్రవీణ సినిమా కోసం 1988వ సంవత్సరంలో దర్శకుడు బాలచందర్ శ్రీశ్రీ కలానికి పదునెక్కువని చాటి చెపుతూ నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను నేనుసైతం భువనఘోషకు వెర్రి గొంతుక విచ్చి బ్రోసాను అంటూ మహాప్రస్థానాన్ని మరొక్కసారి పరిచయం చేసి విజయబావుటా ఎగురవేశాడు.

రాగూర్ సినిమా కోసం 2003వ సంవత్సరంలో మహాప్రస్థానంలోని నేనుసైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను అనే కవితను ఆధారంగా తీసుకుని సుద్దాల అశోక్ తేజ గీతాన్ని పరిపూర్ణంగా రచించి జాతీయ ఉత్తమ గేయ రచయితగా సినీ ప్రపంచంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

సమాజం - శ్రీశ్రీ :

సిగ్గులేని జనాలని నిగ్గదీసి అడిగిన ధైర్యం శ్రీశ్రీ కలం సొంతం. ఆవేశానికి అక్షర రూపం ఇచ్చి, ఆక్రోసాన్ని కవిత్వ రూపంలో వెళ్ళగక్కిన కవి మన మహాకవి శ్రీశ్రీ. ఆధునిక తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టి వ్యావహారికభాషలో ఆశువుగా అలతి అలతి పదాలతో అభ్యుదయ భావాలు ఒలికించిన ఘనత శ్రీశ్రీది. పద్యరూపంలోనే కవితలు రాసే దశకంలో కవిత్వం అంటే కంద పద్యమో, సీస పద్యమో కాదని వచన కవిత్వంలో దిగంతాలు దాటవచ్చని నిరూపిస్తూ యువకవులను స్ఫూర్తి ప్రదాత అయ్యాడు మన శ్రీశ్రీ. మచ్చుతునకగా ''మహాప్రస్థానం''ను చెప్పుకోవచ్చు.

ఒక కవిని సత్కరిస్తూ రెండు వేలమంది ఊరేగింపుగా బ్రహ్మరథం పడుతూ తీసుకెళ్ళటం అనేది చరిత్రలో బహుశా శ్రీశ్రీకే దక్కిన అరుదైన గౌరవం అని చెప్పుకోవచ్చు. అది కూడా విశాఖయ నగరంలో మెడికల్ విద్యార్థులు

సత్కరించడం సభను నిర్వహించడం, కరపత్రాలు పంచడం 1970వ సంవత్సరంలో ప్రభంజనం అనే చెప్పుకోవాలి. ఈకరపత్రం తెలుగు సాహిత్య ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇదే స్ఫూర్తిగా జూలై4, 1970వ సంవత్సరం నాడు విప్లవ రచయితల సంఘం నాడు విప్లవ రచయితల సంఘం అనే సంస్థని స్థాపించడం తెలుగు సాహిత్యానికి పెద్ద మలుపనే చెప్పాలి.

ఇక విమర్శల విషయానికొస్తే సద్విమర్శల కంటే, కువిమర్శలు పెద్దపీట వేసింది శ్రీశ్రీ సాహిత్యం అని చెప్పుకోవచ్చు. వాటన్నిటినీ త్రోసి పుచ్చుతూ "నువ్వు నడిచే దారిలో కనిపించే ప్రతీ కుక్కకీ సమాధానం చెప్తూపోతే ఎప్పటికీ గమ్యాన్ని చేరలేవు అంటూ కలాన్ని ఎక్కుపెట్టిన ధైర్యం శ్రీశ్రీది. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ శ్రీశ్రీ పద ప్రయోగాలు అప్పటి ఇప్పటి యువతలో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని రేకెత్తిస్తూ సమకాలీన సాహిత్యానికి శ్రీకారం చుట్టాడు. "ఇవి కవితలా ఇది సాహిత్యమా, అక్షరాలను పొగుచేసి చిన్న పెద్ద లైన్లుగా రాసేసి ఒకటే పదం వెనుకా ముందు జోడించి రాసెయ్యడం మహాప్రస్థానం అవు తుందా?" అన్న విమర్శకులకు సైతం ఆధునిక నిఘం టువుగా మహాప్రస్థానం మారిందనటంలో ఏ మాత్రం సందేహం లేదు.

శత శతాబ్దాల సాహిత్య దీపిక - శ్రీశ్రీ :

"ఓ చెరిగిపోయిన అక్షరాల్లారా కరిగిపోయిన క్షణాల్లారా! ప్రవహించండి నా కలంలో సిరాల్లాగ, సరే మరణించాను. నా శవం చుట్టూ చాలామంది చేరి ఏడుస్తున్నారు "ఎందు కేడుస్తారు, ఇప్పుడు ఏమైపోయిందని" నేనంత ధారా పాతంగా అరుస్తున్నా ఎవరికీ నా మాటలు వినపడవ్, అనంతర కార్యక్రమం గురించి ఆలోచించమన్నారెవరో. విరసం వాళ్ళు నన్ను ఊరేగిస్తామన్నారు. నా అభ్యంతరం లేదు నా శవం మీద ఎర్రజెండా కప్పడం మర్చిపోకండని మరీ మరీ అభ్యర్థించాను. చుట్టూ మూగిన వాళ్ళలో కొంతమందికి నేనొకసారి రాసిన మరణశాసనం జ్ఞాపకం వచ్చింది. నేను చనిపోయాక నా శవాన్ని విశాఖలో కింగ్ జార్జి ఆసుపత్రికి అప్పగించండి. అని రాసాను. ఈ మాటలన్నీ శ్రీశ్రీ మరణానికి ముందుగానే అనంతంలో పేర్కొన్నారు.

మూడు యాభైలు ఎవడు బతికాడు? అనే సామెతను తిరగరాస్తూ తరలిన శతాబ్దంలోని యువకవులలో విప్లవ జ్వాలలు రగిలించిన శ్రీశ్రీ సాహిత్యం ఇప్పటి శతాబ్దపు నవకవులకు సాహిత్యదీపికగా అభ్యుదయ భావాలను విరజిమ్ముతూ శత శతాబ్దాల మహాకవిగా చరిత్ర సృష్టిం చిన ప్రజాకవి శ్రీరంగం శ్రీనివాసరావు అదే "శ్రీశ్రీ".

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ శ్రీ సాహిత్యంలో మహాప్రస్థానం

- వేముల కమలాకర్ సుజాత, రాజేంద్రనగర్ మండలం, రంగారెడ్డి జిల్లా.

మీ కోసం కలం పట్టి ఆకాశపు దారులంట
హడావుడిగా వెళ్లిపోయే..
అరుచుకుంటూ వెళ్లి పోయే జగనాధుని రథచక్రాలని
భూ మార్గం పట్టిస్తాను
భూకంపం పట్టిస్తాను....అని ప్రకటించాడు శ్రీ శ్రీ.
ఓ వ్యధావశిస్థులారా !
ఏడవకండి ఏడవకండి,
వస్తున్నాయొస్తున్నాయి.
జగనాధుని రథచక్రాల్ వస్తున్నాయని ఆశ్వాసము నందించినవాడు శ్రీ శ్రీ.

40 కవితలతో వెలువడిన ''మహాప్రస్థానం తెలుగు సాహిత్యంలో ఓ మైలురాయి,ఓ మలుపు, ఓ డైనమెటు. ప్రస్థానం అంటే ఒక చోటు నుంచి మరో చోటికి ప్రయాణించడం. మహా ప్రస్థానం సుదీర్ఘ ప్రయాణం మహాకవిగా సుప్రసిద్ధుడైన శ్రీశ్రీ ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ. శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీ గా ప్రసిద్ధుడయ్యాడు. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ఆయన ప్రసిద్ధుడు. శ్రీశ్రీ హేతువాది, నాస్తికుడు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతామోదం పొందాడు.

శ్రీశ్రీ రచనలలో అతి ముఖ్యమైనది ఆయన వ్రాసిన కవిత సంపుటి, ''మహాప్రస్థానం''. అందులో ముఖ్యమయిన కవితలు జయభేరి, అవతారం, ఋక్కులు, కవితా, జగన్నాధుని నిజంగానే వంటివి. తరువాత విరసం కవిగా మరెన్నో రచనలు చేసినా శ్రీశ్రీ పేరు వినగానే గుర్తుకొచ్చేది ''మహాప్రస్థానం''. అతని రచనల్లో ప్రసిద్ధమైనది. అభ్యుదయ కవితా యుగ ప్రయోక్త...సమ సమాజ సంస్థాపన పూర్వక మహాకవి శ్రీశ్రీ.

శ్రీశ్రీ బాల్యం :

శ్రీశ్రీ - శ్రీరంగం శ్రీనివాసరావు - 1910 సంవత్సరం పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పలకొండ దంపతులకు శ్రీరంగం సూర్యనారాయణకు దత్తతు తీసుకోవడం వలన ఈయన ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. శ్రీశ్రీ ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖపట్నంలో చేశారు. 1925లో ఎస్ఎస్ఎల్సీ పాసయ్యారు. అయితే అదే ఏడాది వెంకట రమణమ్మతో శ్రీశ్రీకి పెళ్ళి జరిగింది. 1931 లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బీఏ (జంతుశాస్త్రము) పూర్తి చేసారు. 1935లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎన్ కాలేజీలో డిమాన్స్ట్రేటరుగా చేరారు. 1938లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీలోను, మిలిటరీలోను, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. అయితే 1933 నుండి 1940 వరకు ఆయన రాసిన మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహాప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించారు. మహాప్రస్థానం పుస్తకాన్ని తెలుగు సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన పుస్తకంగా పేర్కొంటారు. 1947లో మద్రాసుకు తిరిగి వచ్చి అక్కడే స్థిరపడ్డాడు. తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ మరిన్ని గొప్ప రచనలు చేసారు. ఈ క్రమంలోనే ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు అందించారు. శ్రీశ్రీ పిల్లలు లేని కారణం చేత 1949లో ఒక బాలికను దత్తత తీసుకున్నారు. 1956లో సరోజను రెండవ వివాహం చేసుకున్నాడు. శ్రీశ్రీ కి రెండవ భార్య ద్వారా ముగ్గురు కుమార్తెలు కలిగారు. ఆయన, వివిధ దేశాల్లో ఎన్నోమార్లు పర్యటించారు. ఎన్నో పురస్కారాలు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి ''రాజా లక్ష్మీ ఫౌండేషను'' అవార్డులు

లభించాయి. 1970 సంవత్సరంలో అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా ఎన్నుకో బడ్డాడు. 1983లో మరణించారు.

మహాప్రస్థానం :

శ్రీశ్రీ రచించిన సంచలన కవితా సంకలనం మహా ప్రస్థానం. ఇది వెలుబడిన తరువాత తెలుగు సాహిత్యపు ప్రస్థానానికే ఓ దిక్సూచిలా వెలుగొందినది. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని 'మహా ప్రస్థానానికి ముందు, మహా ప్రస్థానానికి తరువాత' అని విభజించవచ్చు అని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఇది ఒక అభ్యుదయ కవితా సంపుటి. దీనిలో మొత్తం నలభై కవితలు ఉన్నాయి. ఇందులో శ్రీశ్రీ కార్మిక కర్షిక శ్రామిక వర్గాలను ఉత్తేజితులను చేస్తూ, నూతనోత్సాహం కలిగిస్తూ, ఉర్రూతలూగిస్తూ గీతాలు వ్రాసినాడు. ఇది తెలుగు కవితకే ఓ మార్గదర్శి అయినది. మహాప్రస్థాన కవితల రచన మొత్తంగా 1930 దశకంలో జరిగింది. మరీ ముఖ్యంగా 1934కూ 1940కీ నడుమ వ్రాసినవాటిలో గొప్ప కవితలను ఎంచుకుని 1950లో ప్రచురించారు శ్రీశ్రీ. ఈ కవితలు తెలుగు సాహిత్యంలో అభ్యుదయ కవిత్వమనే కవితావిప్లవాన్ని సృష్టించడానికి ఒకానొక కారణంగా భావించారు.

శ్రీశ్రీ మహాప్రస్థానం రచనా నేపథ్యం :

1930 దశకం ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం వల్ల నిరుద్యోగులైన యువకుల జీవితాలు మొదలుకొని చిరుద్యోగుల వరకూ సమాజంలోని అనేకమైన వర్గాల జీవితాలు అల్లకల్లోలమైన సమయం. ఆ కాలాన్ని ఆకలి ముప్పైలు (హంగ్రీ థర్టీస్) అని పిలిచారు. ఈ దశలో వ్యక్తిగతంగానూ, సాంఘికంగానూ శ్రీశ్రీ చుట్టూ జరిగిన సాంఘిక పరిణామాలు ఆయన రచనా వస్తువులను నిర్దేశించాయి. రచనా క్రమంలో కూడా మొదట పద్యాలను భావకవుల ప్రభావం వ్రాస్తున్న శ్రీశ్రీ క్రమంగా ఇతర భాషల్లో వస్తున్న ప్రక్రియాపరమైన మార్పులు అర్థం చేసుకుంటూ ఒకానొక పరిపక్వమైన దశకు చేరుకున్నారు. అలాంటి స్థితిలో 1934 నుంచి 1940 వరకూ తాను రాసిన కవితల్లోని ఉత్తమమైన, మానవజాతి ఎదుర్కొంటున్న బాధల గురించి కవితలను రచించారు, మహాప్రస్థానం లోని కవితలు పేరు ప్రఖ్యాతులు పొందాయి. కవితా! ఓ కవితా!!ను నవ్యసాహిత్య పరిషత్తు వేదికపై తన ధోరణిలో గొణుగుడు లాంటి స్వరంతో చదువుతుండగా అదే వేదికపై అధ్యక్షునిగా కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఉన్నారు. తొలినాళ్ళలో శ్రీశ్రీకి అభిమాన పాత్రుడైనవాడు, 1950న మహాప్రస్థానం మొట్టమొదటి సారిగా నళినీకుమార్ ఆర్థిక సహాయం ప్రచురణ పొందింది. నళినీకుమార్ పూర్తిపేరు ఉండవల్లి సూర్య నారాయణ. ఈ పుస్తకాన్ని 1938లో అకాల మరణం పొందిన శ్రీశ్రీ స్నేహితుడు, సాహిత్యకారుడు కొంపెల్ల జనార్ధనరావుకు అంకితమిచ్చారు.

ఇతివృత్తాలు :

మహాప్రస్థానం గేయాల్లోని ఇతివృత్తాలు ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ఎదుర్కొంటున్న బాధలు, వీటికి నేపథ్యంగా ఉన్న చారిత్రిక పరిణామాలు, పీడితుల పక్షాన నిలవాల్సిన కవికి అవసరమైన లక్షణాలు, నూతన మైన ఈ అంశాలపై రావాల్సిన కవిత్వమూ, తన కవిత్వా నికి లక్షణాలు, పీడితులను ఇంకా పీడించేందుకు సహాయకారిగా ఉండే తాత్త్వికతలపై తిరుగుబాటు వంటివి ఉన్నాయి. వీటన్నిటికీ మూలమైన నేపథ్యంగా తన కవితాతాత్త్వికతనీ, దానికి వెనుకనున్న సంఘర్షణనీ అపురూపంగా వెల్లడించిన కళాఖండమైన కవితా ఓ కవితా కూడా ఉంది.

మొదటి గేయం మహాప్రస్థానం. అదొక కవాతు పాట లాంటిది. పదండి ముందుకు పదండి త్రోసుకు అంటూ ప్రబోధించే ఈ గేయం హరోం! హరోం హర! హరోం! హరోం హర!హర! హర! హర! అంటూ యుద్ధనినాదం చేసుకుంటూ కదలమన్నాడు. ఐ గేయంలో తాను స్మరిస్తే పద్యం, అరిస్తే వాద్యం అని చెప్పుకున్నారు, నా మహోద్రేకాలు భవభూతి శ్లోకాలు, పరమేష్ఠి జూకాలు

అంటూ తన గురించి వ్రాసుకున్నారు. దీనిని విమర్శకులు నిర్ద్వంద్వంగా, నిరాఘాటంగా చేసుకున్న ఆత్మస్తుతిగా పేర్కొన్నారు. మూడో కవిత జయభేరి. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిస్తాను అంటూ సాగే ఈ గేయంలో తన వల్ల అయ్యేది తాను చేయగలగడం మొదలుకొని తుదకు ఆ తానే భువన భవనపు బావుటానై పైకి లేస్తానని, నా కుహూరుతశీకరాలే, లోకమంతా జల్లులాడే, ఆ ముహూర్తా లాగమిస్తాయి అన్నారు.

శ్రీ శ్రీ 1910 లో అత్యంత దేదీప్యమానంగా ఒక తోకచుక్క పొడిచింది. అదే సంవత్సరం, తెలుగు కవిత్వాకాశంలో వేగుచుక్క పొడిచింది. ఇరవయ్యవ శతాబ్దంలో అధునిక తెలుగు కవిత్వానికి చుక్కానైయ్యింది. ఆ చుక్కాని శ్రీశ్రీ. పూర్తి పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. 1930ల్లో 'ఛందస్సుల సర్వ పరిష్వంగం' లోంచి బయట పడి, 'ఛందోబందో బస్తులన్నీ ఛట్‌ఫట్ మని తెంచి, కడుపు దహించుకుపోయే పడుపుగత్తె రాక్షసరతి, ఉరి తీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం, సమ్మె కట్టిన కూలీల భార్యల బిడ్డల హాహాకారం', మొదటిసారిగా కవితా వస్తువులుగా చూపించి, 'కదిలేదీ, కదిలించేదీ, పెనునిద్దర వదిలించేదీ, పరిపూర్ణపు బతుకిచ్చేదీ, కావాలోయి నవకవనానికి', అని ఎలుగెత్తి అభ్యుదయ కవిత్వపు లక్షణాలన్నీ నిర్వచించాడు శ్రీ ఛందస్సులకి నూతన యవ్వనం ప్రసాదించాడు. పద్యాన్ని ఎలుగెత్తి పాడటానికి కావలసిన రెండు ముఖ్య లక్షణాలు యమకం, తాళం తన కవితల్లో గుప్పించాడు. సామాజికస్పృహతో కవితా వస్తువులు ఎంచుకోవడం కొత్తదనం. అంటే కవిత్వాన్ని పాతపరిధులని దాటించి, కొత్త పరిధుల్లోకి దూకించడం సాధారణ కవులకి సాధ్యమయ్యే పని కాదు. ఆనాటినుంచి ఈనాటి వరకూ తెలుగులో చెప్పుకోదగ్గ నవ్య కవిత్వానికి భావి తరానికి బాట వేసినారు. భాషల అవధులు దాటిన శక్తి తన కవితా శక్తి ఉంది.

'1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత నుంచి నేను దాన్ని నడిపిస్తున్నాను. దిస్ సెంచరీ ఈజ్ మైన్', అనీ సాధికారంగా చెప్పగలిగిన తెలుగుకవి శ్రీశ్రీ ఒక్కడే. తెలుగు సాహిత్యంలో ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. మాత్రా ఛందస్సుల్లో వచ్చిన మహాప్రస్థాన గీతాలు 'మరో ప్రపంచం', 'జగన్నాధ రథ చక్రాల్' మొదలైనవి మనందరికీ తెలిసినవే. 'చరమరాత్రి' సంకలనంలో శ్రీశ్రీ కథలు ఆణిముత్యాలు. ఈ కథల్లో 'నిరంకుశమయిన స్వేచ్ఛ, అధివాస్తవిక స్పర్శ' ఉన్నాయనడం అతిశయోక్తి కాదు. సమాజ స్థితిమీద, భారతదేశ వ్యవస్థ మీద ఎన్నో వ్యాసాలు రాశాడు. అవి కత్తి చురక ల్లాంటి వ్యాసాలు. ఆయన వచనంలో అనవసర శబ్దాలకి తావులేదు, ' అద్దంలా స్పష్టంగా అర్థం స్ఫురిస్తుంది.'

రచనకి సాంఘిక ప్రయోజనం ఉన్నదని, రచనని సంఘం వాడుకుంటుందని విశ్వసించాడు శ్రీశ్రీ. తనకు తానుగా నిర్దేశించి చెప్పిన సాహిత్యం తన నిబద్ధతకి తార్కాణం. 1930 నుంచి 1940 వరకూ, శ్రీశ్రీ దారిద్ర్యంతో నానా అవస్థలు పడ్డాడు. ఆ దశాబ్దంలోనే మహాప్రస్థాన గీతాలు చాలామటుకు రాశాడు. 1951 ప్రాంతంలో విప్లవసాహిత్యానికి నాందీ వాక్యం పలికాడు, తన ఖడ్గ సృష్టి ఖండికలో "రెండు రెళ్ళు నాలుగన్నందుకు / గుండాలు గండ్రాళ్ళు విసిరే సీమలో / క్షేమం అవిభాజ్యం అంటే / జైళ్ళు నోరు తెరిచే భూమిలో అహింస ఒక ఆశయమే కాని / ఆయుధం ఎప్పుడూ కాదు / ఆశయం సాధించాలంటే / ఆయుధం అవసరమే మరి" అని చెప్పినవాడు, 1938 లో చరిత్ర పాఠం చెప్పాడు.

"బలవంతులు దుర్బల జాతిని బానిసలను గావించిరి / నరహంతలు ధరాధిపతులై చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి / నైలు నదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది? / తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" అని, ఆ గీతంలోనే చరిత్రకి నూతన నిర్వచనం చెప్పాడు. అంతే కాదు, "జమీందారు రోల్సు కారు / మహారాజు మనీపర్సు / మరఫిరంగి విషవాయువు" మాయ కాదని మిథ్యా వాదులని మందలించాడు. "పాలికాపు నుదుటి చెమట / కూలివాని గుండె చెరువు / బిచ్చగాని కడుపు కరువు"

ఇవన్నీకఠోర సత్యాలని మెట్టవేదాంతులకి చురకలు పెట్టాడు. సాహిత్యపరుడు సమాజవ్యవస్థలో మార్పుకు చేయవలసిన కృషి గురించి శ్రీశ్రీకి ఏ విధమైన సందేహమూ లేదు.

శ్రీశ్రీ మహాకవిగా పరిణతి చెందడానికి పాశ్చాత్య ఆధునిక రచయితల ప్రభావం ఎంతో దోహదం చేసింది. ఎవరో అన్నారు, ఏదో పీఠికలో శ్రీశ్రీ పై విశ్వనాథ, దేవులపల్లి గార్ల ప్రభావం కూడా ఉన్నది, అని. అదేమో తెలియదు కాని, విశ్వనాథకి భాషపై ఎంత అధికారం ఉన్నదో అంతే అధికారం శ్రీశ్రీకి నిస్సందేహంగా కూడా ఉన్నది. అలాగే కృష్ణశాస్త్రి ఛందోలాలిత్యం శ్రీశ్రీలో కూడా కనపడక మానదు. అది దోషం అని అనుకోను. ''కవి సంఘానికి మార్గదర్శకుడు కావాలి. అందుకనే వడివడిగా ప్రజలందర్నీ ముందుకు నడిపించే విప్లవపంథాబీ అభ్యుదయ రీతి'' అని ఎప్పుడో 1946 లో అభ్యుదయ పత్రికలో రాశాడు శ్రీశ్రీ. అంచేత, ఆయనకి విప్లవాద కవిత్వ ధోరణి సమయానుకూలంగా, ఎవరినో సంతోషపెట్టడం కోసం వచ్చిన ధోరణి అనే వాదం చవకబారు వాదం మాత్రమే. శ్రీశ్రీ గొప్పతనానికి ముఖ్యకారణం ఆయన ప్రజలపక్షాన నిలబడడమే.

శ్రీశ్రీని వ్యక్తిగా శ్రీశ్రీని కవిగా వేరుచేయలేరు. శ్రీశ్రీ చాలా పిన్న వయసులోనే తన రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టాడు. తరువాతి కాలంలో సాంప్రదాయిక పక్కన పెట్టి వాడుక భాషా కవిత్వం ప్రాధాన్యం- ఇచ్చారు. గురజాడ అడుగుజాడ అని ఆయన అన్నారు.1950 లో మహాప్రస్థానం కావ్యం ప్రచురితమైనది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసి మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవి చేసింది. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలు రచించాడు.తెలుగు వారిని ఉర్రూతలూగించిన ఎన్నో గొప్ప సినిమా పాటలను శ్రీశ్రీ రచనల్లో ప్రాసకూ, శ్లేషకు శ్రీశ్రీ పెట్టింది పేరు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీశ్రీ మేటి. ''వ్యక్తికి బహువచనం శక్తి'' అనేది ఆయన సృజించిన మహత్తర వాక్యమే శబ్ద ప్రయోగంలో నవ్యతను చూపించారు.

చివరిగా ఒక విషయం ఆధునిక తెలుగు సాహిత్యం అనే బంగారు నాణేనికి ఒక వైపు విశ్వనాథ సత్య నారాయణ, మరోవైపు శ్రీరంగం శ్రీనివాసరావు. 20వ శతాబ్దపు ఆధునిక తెలుగు కవిత్వానికి శ్రీశ్రీ ముఖ్య ప్రతినిధి. 'శ్రీశ్రీ ఆధునిక తెలుగు కవిత్వానికి ప్రతినిధి'.

''మీరొక దుర్గం....మీదొక స్వర్గం.
అనర్గళం, అనితర సాధ్యం మీ మార్గం''

కొన్ని కోట్ల మందిలో అక్షరాలతో ఆలోచనలు రేపి కార్మిక లోకానికి, శ్రామిక వర్గానికి రచనలతో...వచనాలతో తెలుగు సాహితీ ప్రపంచంలో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్నారు.

❖❖❖

శ్రీశ్రీ - ప్రయోగశీలత

– డా॥. నల్లపనేని విజయలక్ష్మి, తెలుగు ఆధ్యాపకురాలు, యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళా కళాశాల, చీరాల.

'మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది! పదండి ముందుకు, పదండి తోసుకు' అంటూ సమసమాజాకాంక్షతో ప్రజలను ఉత్తేజితుల్ని చేస్తూ మహోద్వేగంతో గానం చేసిన అభ్యుదయ కవిత్వోద్యమ నాయకుడు శ్రీశ్రీ. వాస్తవికతతో పాటు అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యంతో పాటు సంఘ చైతన్యాన్ని సమానాధికారంతో ప్రవచించిన ప్రవక్త, నూతన యుగకర్త శ్రీశ్రీ.

శ్రీశ్రీ కవిత్వం వ్రాయటం ప్రారంభించేనాటికి కవుల మీద భావకవిత్వం ప్రభావం అమితంగా ఉంది. ఎంతో ప్రయత్నంతో ఆ ప్రభావం నుండి బయటపడిన శ్రీశ్రీ తన సొంత గొంతుక వినిపించటం కోసం ఎన్నో ప్రయోగాలు చేశాడు. వస్తువులోనూ, భావంలోనూ నవ్యతను కనబరిచాడు. ఛందస్సుల విషయంలోనూ, గేయ రచనా సంవిధానంలోనూ, భాషతో చమత్కారాలు చేయటంలోనూ తనదైన ప్రత్యేకతను కనబరిచాడు. లైట్ వెర్స్‌ను పరిపుష్టం చేశాడు.

వస్తు నవ్యత :

సామాన్య మానవుల జీవితాలను చిత్రించటం, మానవతావాదాన్ని, సంఘసంస్కరణ దృక్పథాన్ని కవిత్వంలో ప్రవేశపెట్టటం గురజాడ చూపిన నవ్యత అయితే అమలిన ప్రేమ సిద్ధాంతాన్ని ప్రతిపాదించటం, గొల్లవారి జీవితాన్ని గొప్పగా చిత్రించటం రాయప్రోలు చూపిన నవ్యత. వీరికి భిన్నంగా శ్రీశ్రీ మార్క్సిస్టు దృక్పథంతో మానవ సమాజాన్ని పరిశీలించాడు. శ్రామిక వర్గ చైతన్యాన్ని గానం చేశాడు. కాలువ నీళ్లలో జారిపడ్డ త్రాగుబోతు వ్యక్తావ్యక్తాలాపన, సమ్మె కట్టిన కూలీల కుటుంబాల ఆకలి కేకలు, ఆకలితో దహించుకుపోయే వేశ్య దైన్యం, దుర్మార్గంగా ఉరి తీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం విని తెలుసుకొని వాటిని కవితావస్తువులుగా చేసుకొన్నాడు శ్రీశ్రీ. 'బాటసారి' లో 'కూటికోసం, కూలికోసం పట్టణంలో బ్రతుకుదామని' తల్లి మాటలు చెవిని పెట్టక బయలుదేరిన బాటసారి నిస్సహాయస్థితిలో దయనీయంగా మరణించిన తీరును వర్ణించాడు. 'భిక్షువర్షీయసి'లో అనాథ, వృద్ధ భిక్షుకురాలి దీనస్థితి ఆయన కవితా వస్తువు. బుద్ధిమంతుల వల్ల అన్యాయానికి గురైన బక్కపలచని వెర్రి కుర్రవాడు 'ఉన్మాది' కవితా నాయకుడు. కర్మసిద్ధాంతాన్ని బోధించి శ్రమజీవుల కష్టాన్ని దోచుకునేవారిని విమర్శించిన కవిత 'వాడు'. జగత్తంతా మిథ్య అనే వేదాంతులను వేళాకోళం చేసిన కవిత 'మిథ్యావాది'. ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కనిపించకుండా పోయిన సామాన్యుల జీవితాన్ని వివరించే నవ్య చరిత్ర నిర్మాణావశ్యకతను వివరించిన కవిత 'దేశ చరిత్రలు'. సాంఘిక చైతన్యంలో సామాన్యుడి భాగస్వామ్యాన్ని చిత్రించిన కవిత 'జయభేరి'. శ్రీశ్రీ గ్రహించిన ఈ కవితా వస్తువులన్నీ అంతకుమునుపు ఎవరూ స్పృశించనివి.

భావ నవ్యత :

గేయ రచనలో శ్రీశ్రీ ప్రదర్శించిన సంవిధాన చాతుర్యం, శబ్ద ప్రయోగ నైపుణ్యం అనితరసాధ్యం. నాగస్వరం విన్న నాగుపాములా ఛందస్సు శ్రీశ్రీ ముందు సాగిలపడింది. ఆయన ఆడించినట్లల్లా ఆడింది. ఇక ఆయన భావనా బలం గురించి చెప్పనవసరం లేదు. ఆయన గేయాల్లోని వస్తువులో ఈ నాలుగు శక్తులు విడదీయలేనంతగా కలిసిపోయాయి. అందువల్ల శ్రీశ్రీ భావచిత్రాలను విడిగా తీసిచూపటం కష్టసాధ్యమైన విషయం.

'ఒక రాత్రి' శ్రీశ్రీ మానసిక స్థితిని వివరించే ఆత్మాశ్రయ కవిత. నిరుద్యోగం, పేదరికం, ఏకాకితనం వల్ల తనలో

రేగిన భావాలను శ్రీశ్రీ ఈ కవితలో వినూత్నంగా వెల్లడించాడు. బహుళ పంచమి నాటి వెన్నెలను ఆకాశమంతా నిండి పొగలా కమ్ముకొని భయపెట్టిందని ఒకసారి, విశ్వమంతా నిండి తెల్లని బూడిదలా భయపెట్టిందని మరొకసారి వర్ణించాడు. తనలో తలెత్తిన అలజడిని 'ఆకాశపు టెడారి నంతటా, అకట! ఈ రేయి రేగింది ఇసుక తుఫాను' అని సూచించాడు. 'కరి కళేబరములా కదలదు కొండ!'అన్నాడు. సాధారణంగా కవులు కొండను, ఏనుగును పోల్చి చెపుతుంటారు. కాని ఇక్కడ కవి తన నిరాశతో కూడిన మానసిక స్థితిని వ్యక్తీకరించటానికి కొండను కరి కళేబరంతో పోల్చి చెప్పాడు. ఈ వర్ణనలు శ్రీశ్రీ భావనాశక్తికి నిదర్శనాలు.

'ఆకాశపు టెడారిలో కాళ్లు తెగిన
ఒంటరి ఒంటె లాగుంది జాబిల్లి!'

అన్న ఊహాచిత్రం నరికొత్తది. అప్పటివరకు ప్రణయజీవుల విరహాగ్నిని ప్రజ్వరిల్లజేసే పనిలో విరామమనేది లేకుండా కష్టపడుతున్న జాబిల్లిని చైతన్య రాహిత్యానికి, నిస్సహాయస్థితికి ప్రతీకగా భావించటం అత్యంత నవీన భావం.

'ఖండశశి' కవితలో విరహతాపాన్ని వెల్లడించటానికి నెలవంకను వంపు తేరిన కత్తితో పోల్చాడు. నవ్య భావ చిత్రాలను రూపొందించటంలో శ్రీశ్రీకి గల ప్రతిభకు ఇది నిదర్శనం. 'బాటసారి' కవితలో దిక్కులేని బాటసారి గుండె మీద 'రాత్రి నల్లని రాతి పోలిక' కూర్చున్నదని శ్రీశ్రీ వర్ణించాడు. జ్వరంతో, మండుతున్న కళ్లతో, శిరోవేదనతో తల్లడిల్లుతున్న దారి తప్పిన బాటసారికి రాత్రి ఎంత బాధాకరంగా పరిణమించిందో ఈ భావచిత్రం ద్వారా వ్యక్తం చేశాడు.

'ఆకాశదీపం' ఖండికలోనూ నవ్య భావచిత్రాలు దర్శనమిస్తాయి. 'సాయంత్రం ఆరున్నర, గది లోపల చినుకుల వలె చీకట్లు' అంటూ అప్పుడప్పుడే ముసురు కుంటున్న చీకట్లను చినుకులతో పోల్చాడు.

'చీకటి బోనులో సింహములా నిలుచున్నది'

గదిలోని దీపాన్ని గురించిన వర్ణన ఇది. గదిలోని చీకటి బోను వంటిది. అందులోని దీపం సింహం వంటిది. దీపానికి చీకటిని తొలగించగల శక్తి ఉంది. కాని ప్రస్తుతమది బోనులో సింహం వలె నిస్సహాయస్థితిలో ఉంది. అంటే ఆరిపోవడానికి సిద్ధంగా ఉంది.

'కత్తిగంటు మీద నెత్తుటిబొట్టు లాగున్నది'

ఈ వర్ణనలో చీకటిని కత్తితో పోల్చాడు. దీపం నెత్తుటిబొట్టులా ఉందన్నాడు. కత్తిని నల్లగా ఉన్నట్టు చెప్పటం కవి సమయం. చీకట్లో దీపాన్ని ఈ విధంగా వర్ణించటంలో కవి భావనాశక్తి వెల్లడయింది.

శబ్దశక్తి :

'మహాప్రస్థానం' లోని గేయాల్లో చాలా భాగం వీర రౌద్ర రస భరితాలు. అందువల్ల శ్రీశ్రీ ఆ రసాలకు అనుగుణమైన ఓజస్సు గల శబ్దాలను ఏరుకున్నాడు.

'శ్రీశ్రీ తెలుగు కవిత్వాన్ని పోరాటానికి అనువైన భాషగా తయారుచేశాడు - a fighting language కృష్ణశాస్త్రి అదే కవిత్వాన్ని సౌందర్యానికి, శృంగారానికి, లాలిత్యానికి అనువయినదిగా చేశాడు - ఘ ంఎవవ్ శ్రిఅస్త్రఱుస్త్రవ ఇద్దరూ పదాల మీద దాడి చేసి కావలసిన వాటిని దోచుకున్నారు. శ్రీశ్రీకి గాంభీర్యం, కాఠిన్యం అవసరమయింది. కృష్ణశాస్త్రికి మార్దవం, విషాదం అవసరమయింది. కృష్ణశాస్త్రిలో స్త్రీ ఎక్కువయింది. శ్రీశ్రీలో అవక్ర విక్రమోద్ధతుడయిన లోహమూర్తి అతిశయించాడు...' అన్నారు కె.వి.రమణారెడ్డి.

'తెలుగు ప్రబంధములను - అందులో శ్రీనాథుని కావ్యములను, పాండురంగ మాహాత్మ్యము మున్నగు ప్రౌఢ కావ్యములను - కూలంకషంగా పఠించుట వలన శ్రీశ్రీకి శబ్దముపై అమోఘమైన ప్రభుత్వమేర్పడినది. పద్య రచనలో అప్పటికే సాధన చేసినందున చక్కని ధారాశక్తి యలవడినది. ఈ ఉభయశక్తుల బలముతో శ్రీశ్రీ అనంత శబ్ద భాండాగారము నుండి జవము, జీవము, కండ,

గుండె గల శబ్దముల నేరికొని వాని చేత కసరత్తులు చేయించినాడు; రసవృష్టులు కురియించినాడు' అన్నారు సి.నా.రె.

శబ్దాలను ఏరుకోవటంలో శ్రీశ్రీ గొప్ప చాకచక్యాన్ని చూపాడు. ముఖ్యంగా అంత్య ప్రాసలను, అంతఃప్రాసలను కూర్చటంలోనే శ్రీశ్రీ శక్తి నిక్షిప్తమై ఉంది. ఒక్కొక్కసారి 3,4 పాదాల పాటు ప్రాసను పాటించి శబ్దాల చేత మేఘ గర్జన చేయించాడు.

'కదం త్రొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం' (మహా ప్రస్థానం)

కొన్ని చోట్ల ఆదిప్రాసలతో పాటు, అంతఃప్రాసలను ప్రయోగించాడు.

'దారుణ మారణ దానవ భాషలు
ఘోరవ భైరవ భీకర ఘోషలు' (కేక)

మరికొన్ని చోట్ల అంత్యప్రాసలను ప్రయోగించాడు.

విషం కక్కే భుజంగాలో
కదం త్రొక్కే తురంగాలో
మదం పట్టిన మాతంగాలో (స్విన్‌బర్న్ కవికి)

ఈ మూడు రకాలైన ప్రాస చమత్కృతులతో పాటు శ్రీశ్రీ శబ్దాలతో రకరకాల ప్రయోగాలు చేశాడు.

ఛందోరీతులు :

శ్రీశ్రీ తొలి కవితా సంపుటి 'ప్రభవ'. ఇందులోని పద్యాలను పరిశీలించినపుడు శ్రీశ్రీకి గల వృత్త రచనా నైపుణ్యం స్పష్టమౌతుంది. 'ప్రభవ' ప్రచురణ తర్వాత శ్రీశ్రీ వృత్త రచనా సన్యాసం చేసి మాత్రా ఛందస్సులలో, వచన గీతాలలో విలువైన ప్రయోగాలు చేశాడు.

'ఛందస్సు గుర్రం వంటిది. గుర్రం ఎటు తీసుకుపోతే అటల్లా వెళ్లిపోయేవాడు అశ్వికుడు కానట్లే ఛందస్సు లాగుకుపోయినట్లు వ్రాసేవాడు సంవిధానజ్ఞుడు కాడు. మరి ఆ ఛందస్సును లొంగించుకొని దాని చేత చిత్ర విచిత్ర రీతులలో కదం త్రొక్కించిన వారినే ప్రశంసిస్తాను' అన్న శ్రీశ్రీ మాత్రా ఛందస్సుల గతుల్లో కొన్ని చిత్రమైన మార్పులు చేసి నూతనత్వాన్ని సాధించాడు.

'యముని మహిషపు లోహ ఘంటలు
మబ్బు చాటున
ఖణేల్‌మన్నాయి'

ఈ గేయంలోని నడక మిశ్రగతే. కాని 'యి' అనే మాత్ర అధికంగా ఉండటం వల్ల కొత్త అందం వచ్చింది.

'ఐ' అనే శీర్షికతో వ్రాసిన గేయం ఖండగతిలో నడిచినా వచన పద్య భ్రాంతిని కలిగిస్తుంది.

'భూతాన్ని
యజ్ఞోపవీతాన్ని
వైప్లవ్యగీతాన్ని నేను'

చరణ విభాగంలోని చమత్కారం వల్ల ఇది సాధ్యమైంది.

శ్రీశ్రీ 'సిరిసిరిమువ్వ శతకం' లో సైతం ఎన్నో ప్రయోగాలు చేశాడు. అన్ని పద్యాలలో ఏదో ఒక ప్రత్యేకతను సాధించడానికి ప్రయత్నించాడు. దీర్ఘాక్షరంతో ప్రారంభమైన కంద పద్యంలో నాల్గవ గణంగా 'జ' గణం ఉండకూడదు. అయినా

'వాజమ్మ వంటి కుకవిని
సజీవ దహనం పొనర్చి...'

అంటూ నాల్గవ గణంగా 'జ' గణాన్ని ప్రయోగించాడు.

ఒక పద్యంలో ఉద్దేశపూర్వకంగా యతిభ్రంశం చేస్తే మరోచోట ప్రాసను సరిగా వేయకపోవడం కనిపిస్తుంది.

'...జగడం కో
రగా దగదుగాని ఠస్సాదియ్యా'

అన్నచోట ఉద్దేశపూర్వకంగా యతిభ్రంశం చేయడమే కాక రకారము, ఠకారము చూడడానికి ఇంచుమించు ఒకలాగే ఉంటాయి కాబట్టి అది కంటికింపైన యతి అని సమర్థించుకున్నాడు.

ఈ శతకంలో దుష్కర ప్రాసను సరిగా పాటించక పోవటం, ప్రాస స్థానంలో అచ్చును వాడటం, బిందు పూర్వక

లకారాన్ని వాడటం - ఇలా ఎన్నో ప్రయోగాలు కనిపిస్తాయి.

'లిమరిక్కు' ప్రక్రియను తెలుగులోకి తెచ్చిన శ్రీశ్రీ దానిలోనూ ప్రయోగాలు చేశాడు. ఇంగ్లీషులో లిమరిక్కు ఐదు పాదాలలో ప్రాస పద్ధతి a,a,b,b గా ఉంటుంది. ఖ పాదాలు ఒక కొలతలోనూ, ఎ పాదాలు ఇంకో కొలత లోనూ ఉంటాయి. శ్రీశ్రీ లిమబుక్కుకి ఐదు పాదాలదీ ఒకే ప్రాస. పాదాల కొలత అప్పుడప్పుడు సమానంగానూ, తరచు అసమానంగానూ ఉంటుంది.

'స్వజాతీయగీతం' అనే లిమబుక్కులో ఇంచుమించు అన్నీ సమాన పాదాలు.

'తెలుగువాడి తెలివితేటలకి జైజై
తెలుగువాడు దేనికైనా సైసై
తెలుగువారి నెదురువారు నైనై
తెలుగునాట కవుల పాట హైహై
ప్రస్తుతానికి వస్తా మరి నేస్తం బైబై'

'నేను' లిమబుక్కులో

'ముసలివాణ్ణి
కాను అసలువాణ్ణి
పడగెత్తిన తాచుపాము బుసలవాణ్ణి
పీడితుల్ని వెంటేసుకు మసలువాణ్ణి
అందుకున్న ఆకాశపు కొసలవాణ్ణి'

దీనిలో 1,2 అసమాన పాదాలు, 3,4,5 సమాన పాదాలు.

'రంగు' అనే లిమబుక్కులో అన్నీ అసమాన పాదాలు.

ఎరుపు
ద్రోహుల గుండెల్లో కురుపు
ఆరాటానికి ఆటవిడుపు
పోరాటానికి పిలుపు
దానిదే గెలుపు'

ఇలా లిమబుక్కుల రచనలోనూ తనదైన ప్రత్యేకతను ప్రదర్శించాడు శ్రీశ్రీ.

గేయ రచనా సంవిధానం :

'సైన్సుకి లాగే కవిత్వానికి కూడా ప్రయోగాలు లేనిదే అభివృద్ధి లేదు' అని నమ్మిన శ్రీశ్రీ ఛందస్సుల విషయంలో ప్రయోగాలు చేసినట్లుగానే రచనా సంవిధానంలోనూ ఎన్నో ప్రయోగాలు చేశాడు.

ఒకే గేయంలో భిన్నగతులను నిక్షిప్తం చేయటం శ్రీశ్రీ చేసిన ప్రయోగాలలో ఒకటి.

ఆయన రచించిన 'బుక్కులు' లో

'కుక్కపిల్లా
అగ్గిపుల్లా
సబ్బుబిళ్ళా'

అనే ధోరణిలో మొదటి మూడు పాదాలను మిశ్రగతిలో నడిపాడు.

వెంటనే

'హీనంగా చూడకు దేన్నీ
కవితామయమేనోయ్ అన్నీ'

అని చతురస్ర గతిలోకి మారాడు. ఈ విధంగా ఒకే గేయంలో ఒక సంవిధానక్రమంలో రెండు రకాల గతులను ప్రవేశపెట్టాడు.

'కేక' గేయంలో

నిద్రకు వెలియై
నే నొంటరినై
నా గది లోపల చీకటిలో
చీకటి లోపల నా గదిలో
నా గదిలో
చీకటిలో

అనే పాదాలలోని వాక్యశిల్పంలోని చమత్కారాన్ని

గమనించవచ్చు. 'నా గది లోపల చీకటిలో' అన్న పాదాన్నే విలోమంగా 'చీకటి లోపల నా గదిలో' అని కూర్చాడు. తర్వాత క్రమంగా మూడవ, నాల్గవ పాదాల చివరి మాటలు నా గదిలో, చీకటిలో అని పేర్చాడు. ఈ గేయం మొత్తం ఈ పద్ధతిలోనే నడిచింది. కవి చిత్రించదలచుకొన్న భయానక వాతావరణానికి ఈ విధమైన వాక్యవిన్యాసం, పదాల కూర్పు తోడ్పడ్డాయి.

'అవతలి గట్టు' గేయం ప్రశ్న, సమాధానం, ప్రశ్న, సమాధానం పద్ధతిలో నడుస్తుంది. 'మానవుడా!' అనే వచనగేయంలో సగం శబ్దాలకు పైగా సంబోధనలే. వీటిని కూర్చిన విధానం కవి ప్రతిభను వెల్లడిస్తుంది.

భాషా చమత్కారాలు :

'సిప్రాలి' లో శ్రీశ్రీ భాషతో రకరకాల ప్రయోగాలు చేశాడు. కవితలకు పేర్లు పెట్టడంలోనూ చమత్కారమే కనిపిస్తుంది.

'వంద రూపాయల నోటు
ఖరీదు ఒక వోటు
లేదా రండీ మహల్లో చోటు
లంచగొండికి వెండి బూటు
పేదవాడికి నట్టేట్లో లైఫ్ బోటు'

ఈ కవితలో ప్రతిపాదంలోని మొదటి అక్షరాన్ని తీసుకొని 'వంఖలేలంపే' అని కవితకు పేరు పెట్టాడు.

కొన్ని కవితలకు ణశీస్త్రస్త్రవతీవశ్రీ, R.I.P for a V.I.P, Tale with a tail, East is West, Credo - ఇలా పూర్తిగా ఆంగ్లంలోనే పేర్లు పెట్టాడు.

వింటే తెలుగు భారతమే వినాలి. తింటే పెరుగు గారెలే తినాలి వంటి లోకోక్తులకు కవితా రూపాన్నిచ్చి దానికి ఇంగ్లీషు, తెలుగుల కలగలుపుతో గాన్లు అని పేరు పెట్టటం ఆయన చేసిన మరో ప్రయోగం.

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి సాక్షి వ్యాసాల గురించి వివరిస్తూ పేను లాంటి భావానికి ఆయన ఏనుగంటి రూపాన్నిచ్చాడని చెప్పాడు. ఆ కవితకు 'పేనుగ' అని చమత్కారంతో కూడిన పేరు పెట్టాడు. డబ్బు జబ్బును కుదర్చగల మెడిసినల్ సబ్బు కవిత్వమేనని చెపుతూ దానికి 'కవిత్తం' అనే పేరు పెట్టటం మరో చమత్కారం. గుంటూరు జనం గొప్పతనం గురించి వ్యంగ్యంగా ప్రస్తావించిన కవితకు 'గుం' అని పేరు పెట్టటం కూడా ఇటువంటిదే.

ఇంగ్లీషు, తెలుగు పదాలను కలిపి అర్థవంతంగా కవితను అల్లటం ఆయన చేసిన మరో ప్రయోగం.

విదూషకుడ్ వఎజ్ఞుతీవఎవత్
ఏదో ఒక discontent
బ్రదుకులో experiment
పదాలు patent sÁkÍ\T torrent
సదసత్సమస్యకి solvent çoço giant

రుక్కుటేశ్వర శతకంలో 'సింహాలకు Zoo లుండును' అనే సరదా ప్రయోగం కూడా శబ్ద చమత్కారమే.గ్గశీశీ ని

తెలుగులో చదువుకుంటే సింహాలకి జూలుంటుంది అనే అర్థం, ఆంగ్లంలో చదువుకుంటే శీశీ లు ఉంటాయి ఆనే అర్థం స్ఫురిస్తాయి. అటు సంస్కృతం ఇటు తెలుగు శబ్దాలతో పాటు ఆంగ్ల పదాల మీద కూడా శ్రీశ్రీకి పట్టు ఉందని ఈ కవితలు నిరూపిస్తున్నాయి.

హాస్యం, వ్యంగ్యం :

తన వ్యక్తిత్వంలోనే హాస్య ప్రియత్వం, చమత్కారం ఉన్న శ్రీశ్రీ వాటిని కవిత్వంలోనూ ప్రదర్శించాడు. 'లైట్ వెర్స్' గురించి పెద్దగా పట్టించుకోని తెలుగువారికి ఆ విభాగంలో చాలా రాశిని 'సిప్రాలి' రూపంలో అందించాడు. హాస్య, వ్యంగ్యాలతో ఎంతటి సామాజిక విమర్శ చేయవచ్చో 'సిప్రాలి' చెపుతుంది. ఇందులోని కవితల్లో ఒక విశేషముంది. కితకితలు పెడుతున్నట్లే ఉంటాయి. వేళాకోళం ఒక్కటే తమ ప్రయోజనం అనిపిస్తాయి. 'నాన్సెన్స్ వెర్స్' అనే భ్రమను కలిగిస్తాయి. అయితే జాగ్రత్తగా గమనిస్తే వీటిలో హాస్యం ఒక్కటే కాకుండా గర్భితంగా, స్వల్పాతి స్వల్పంగానైనా సరే ఉపదేశం ఉందని తెలుస్తుంది.

'పాపనాశనం' అనే పంచపదిలోని సునిశిత హాస్యంతో కూడిన వ్యంగ్యం -

'గంగ
లో మునుగంగ
పాపాలు పోతాయని ఒక దొంగ
కాశీకి వెళ్లి గంగలో బుడుంగ
ని మునింగి చనిపోయాడు చల్లంగ'

అంత్యప్రాసలు, వాటి కోసం పదాల విరుపు, చివరకు కొసమెరుపు వీటితో పాఠకులను అలరిస్తూనే అలోచింఎ ంజేస్తాడు.

'Doggerel' కవితలో నున్నితమైన హాస్యం అలరిస్తుంది.

'అరిచే కుక్కలు కరవవు
కరిచే కుక్కలు మొరగవు
కరవక మొరిగే కుక్కలు తరమవు
అరవక కరిచే కుక్కలు మరలవు
అరవని కరవని కుక్కలెక్కడా దొరకవు'

ఎంత గొప్ప న్యాయవాది అయితే మాత్రం సాంబారు చేయటం వస్తుందా? భార్య ఎదుట నోరు తెరవగలడా? చీర బేరమాడగలడా? అంటూ సున్నితమైన హాస్యంతో గిలిగింతలు పెడతాడు.

'బారెట్లా అయితే సాం
బారెట్లా చెయ్యగలడు? భార్య యెదుట తా
నోరెట్లా మెదలించును?
చీరెట్లా బేరమాడు? సిరిసిరి మువ్వా!'

'వేసిన దారంట వెళ్లిపోవడం సులభం. అంతే కాదు పదిలం. నలుగురికీ తెలిసిందీ, చిరకాలం నుంచి నలిగిందీ ఒక దారి సిద్ధంగా, సుప్రసిద్ధంగా ఉంటూనే ఉన్నప్పుడు వేరే ఒక కొత్త దారి వెదకడం అవివేకం, ప్రమాదం అని అంటారు కొందరు. కాని పురోగమనానికి కొత్త దారులే రాచబాటలు' అని ప్రకటించిన శ్రీశ్రీ నిరంతరం క్రొత్తదనం కోసం తపించాడు. 'నవీన కవిత్వం బాధ్యత లేని భ్రంశకార్య తత్పరుల అగమ్యగోష్టి కాదు' అని ప్రకటించాడు. ఆ కవిత్వం గొప్పతనం గుర్తించిన వారినే తన శ్రోతలుగా నిర్ణయించుకున్నాడు. అతడు ప్రజాకవి. సమాజహితాన్ని కాంక్షించిన అభ్యుదయ రథ సారథి. కవిత్వ రచన చేయగోరే తరువాతి కవులకు అతడొక పాఠ్యగ్రంథం. అనితరసాధ్యం అతని మార్గం.

ఆధార గ్రంథాలు :

1. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు ప్రయోగములు-డా.సి.నారాయణరెడ్డి.
2. శ్రీశ్రీ ప్రస్థానత్రయం (సర్వ లభ్య రచనల సంకలనం)-కూర్పు చలసాని ప్రసాద్, ఎం.వి.రాయుడు-మనసు ఫౌండేషన్.
3. కె.వి.ఆర్ సాహిత్య వ్యాసాలు (మూడో భాగం) - కె.వి.ఆర్ శారదాంబ స్మారక కమిటీ, విజయవాడ.

❖❖❖

శ్రీశ్రీ కవితా హృదయం : ఒక పరిశీలన

– ఓ. అన్నమ్మ, తెలుగు అధ్యాపకురాలు, శ్రీపద్మావతి డిగ్రీ & పి.జి. కళాశాల, తిరుపతి.

ఏ కవిత్వం అయినా మానవజీవితాన్ని, జగత్తును విడిచి ఉండదు. ఈ జగత్తును అంతరం అనీ, బాహ్యం అనీ రెండు రకాలుగా విడదీస్తే, దృశ్యరూపమైన ఈ చరాచర ప్రపంచం బాహ్యం అని చెప్పవచ్చు. కవి ఈ జగత్తు నుండే తన కావ్యరచనకు వస్తువును తీసుకుంటాడు. ఆ వస్తువు రమణీయమైన పదార్థం కావచ్చు లేదా లోకంలో జరిగిన సంఘటనలు అయినా కావచ్చు. అయితే ఆ పదార్థం కవికి రమణీయంగా అగుపించినప్పుడే, దానిని గురించి ఆలోచిస్తాడు. ఈ పదార్థం కవికి బాహ్యజగత్తు ఇచ్చిన కావ్యవస్తువు. ఇదే పరాశ్రయం.

కవి తన మానసిక క్షేత్రంలో ఉద్భవించిన సుఖ దుఃఖాత్మకమైన భావాలను కావ్యరూపంలో వ్యక్తం చేసినప్పుడే ఆ భావాలు అతని ఆత్మీయమైనవిగా అనిపిస్తాయి. కనుక ఆ కవిత్వం ఆత్మాశ్రయం అనిపించుకుంటుంది.

శ్రీశ్రీ రెండు అక్షరాలే అయినా అవి చైతన్యస్ఫూర్తికి సజీవదర్పణాలుగా కన్పిస్తాయి. బాల్యంలోనే కలం పట్టిన శ్రీశ్రీ సమస్తాన్నీ కుతూహలంగా గుండెకు హత్తుకొని నిండు మనసుతో ప్రపంచాన్ని ప్రేమించాడు. శ్రీశ్రీ భావ వ్యక్తీకరణలో అనేక అనువైన ప్రక్రియలు ఒద్దికగా ఒరిగిపోయాయి. ఆ మహాకవి కలం నుండి జాలువారిన ప్రతి కవితా ఖండిక సౌందర్యాత్మకమే.

కవిని గూర్చి, కవితా శిల్పంను గూర్చి శ్రీశ్రీ మాటల్లో "అది మనోమోహనము! హృదయం గమమ్ము! దాని సృష్టించు శిల్పి నిత్య ప్రపూజ్య ఘనతర ప్రాభవ యుతుండు!

కవి యతుండు! అని చెప్తూ కవిని చివరగా - "ప్రౌఢ శిల్ప జగత్తులో ప్రథమ అగ్రగణ్యుడు" అని నిర్వచిస్తాడు.

కవి మనసులో భావాల సృష్టి ఏవిధంగా ఉద్భవిస్తాయో "సముద్రపుటొడ్డున" అనే కవితలో-

"నా మనస్సున గల భావనా సహస్ర సంహతులలోన
సృష్టి అస్పష్టమయ్యె!" అంటూ "నా మనశ్చంచలత
నశించ, కొంగ్రొత్త భావాలు చివులెత్త మనసు చంచల
స్వభావాన్ని నశింపచేసి, క్రొత్త భావాలను ఎలా చిగురింప
చేస్తున్నాయంటే-

"సాంధ్యవాతూల వీచీ ప్రసార ముగ్ధ
మీ సమస్త ప్రకృతిగాని ఏమొ నాకు
నా మధుర భావనలలోనే మనస్సు
బద్ధమై ముగ్ధమై మహాభాగ్యమిచ్చె"

ఈ మనోహర భావాలు ప్రకృతి ప్రసాదించిదేమో, ఈ క్షణం ఎంత మనోహరమో అని మురిసిపోతాడు శ్రీశ్రీ.

(తన హృదయంలో విధిగా మధుధారయై స్రవించే ఊహల పరంపరను "నిశీథస్వాంతనము" కవితలో-

"ఏ గతి పాడుకుందును జ
నించిన ఊహలనెల్ల నా మన

స్సాగర మంతకంతకు నిసర్గ పిపాసల పొంగి నింగిపై
ఊగగనేగు నంతట; నవోజ్జ్వల మోహన కావ్యగీతికావా
గమృతమ్ము లాగక స్రవంతికలై ప్రవహించు నంతటన్'
అని 'వాగామృతం' ఆలంకార పదప్రయోగం చేశాడు
శ్రీశ్రీ.)త్త శిల్పంగా పెనవేసుకుంటాయి. మామూలు
మాటలకు ప్రాణం పోసి బరువులేని బలంతో, మరుగు
లేని స్వచ్ఛతతో, కరువు లేని శిల్పంతో పలకడం వలన
ప్రతిమాటా, ప్రతి ఊహా మనసును గట్టిగా పట్టుకుంటుంది. "బుక్కులు' కవితా ఖండికను ఒకసారి
పలకరిస్తే

కుక్కపిల్లా, అగ్గిపుల్లా సబ్బుబిళ్లా -
హీనంగా చూడకు దేన్నీ!
కవితా మయమేనోయ్ అన్నీ!

అగ్గిపుల్లనో. అరటి తొక్కేనో, హారతి పళ్ళాన్నో - దేన్నైనా సరే కవితామయంగా చేసే స్పర్శవేది శ్రీశ్రీ కి తెలుసు. అందుకే అంటాడు

కాదేది కవిత కనర్హం!
ఔనౌను శిల్ప మనర్హం !

కవితావేశం ఉంటేనే రసనిర్దేశం జరిగి శోభాయ మానంగా ఉంటుందంటారు. కళ్ళుంటే చూసి, వాక్కు శక్తి ఉంటే రాస్తే -

ప్రపంచమొక పద్మవ్యూహం!
కవిత్వమొక తీరని దాహం! అని ఉద్ఘాటిస్తాడు.

అందుకే శ్రీశ్రీలోని అకుంఠితమైన పటిమ, అమోఘ మైన శిల్పం నైపుణ్యంతోనూ; నివేదనా లాఘవం చెడకుండా పలకడం వల్ల శ్రీశ్రీ పట్టిందంతా బంగారం, ముట్టిందంతా ముత్యం అయ్యింది.

విప్లవాత్మకమైన విలువలు మాత్రమే రచనలను రసవత్కావ్యాలుగా మార్చలేవు. హృదయాన్ని ఆకర్షించే సుందరమైన శబ్దవ్యూహాలతో పొదిగినప్పుడే సాహిత్య శ్రేణిలో చేరడానికి అర్హమవుతాయి. కావ్యశిల్పం లేని విప్లవాత్మక రచన ఎంతనీరసమో, విప్లవాత్మక విలువల్లేని కావ్యశిల్పం అంత నిరర్థకమని భావించారేమో, అందుకే జయభేరి కవితా ఖండికలో -

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!

ఇక్కడ 'నేను' కర్తృపదం. ఉత్తమపురుష ఏకవచనం. దీనిని సామూహిక పరంగా వాడాడు. 'నేను' అనే పదం ప్రతీకగా తీసుకున్నాడు.

శ్రామికుడి శ్రమను ఎలా దోచుకొంటున్నారో చెప్పుతూ సమసమాజం ఏర్పడినప్పుడు నేను హాయిగా కూసే ధ్వనుల్లో జగమంతా తడిసే ముహూర్తాలొస్తాయని, అప్పుడు నేను ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవించి, విశ్వ వీణకు తంత్రినై పరవశించి పోతాననడంలో అతని హృదయ పారవశ్యం మనకు తెలుస్తుంది.

కవి సంఘానికి మార్గదర్శకుడు కావాలి. అందుకేనేమో వడివడిగా ప్రజలందర్నీ నడిపించే కవితా పంక్తులను విప్లవ, అభ్యుదయ పంథాలలో నుడివాడు.

'పాలికాలపు నుదుటి చెమట
కూలివాని గుండె చెరువు
బిచ్చగాని కడుపు కరువు.

ఇవన్నీ కఠోర సత్యాలని మెట్ట వేదాంతులకి సైతం చురకలు పెట్టించిన మహాకవి శ్రీశ్రీ.

ఒక కవి మరొక కవి హృదయాన్ని ఎరుగును. వారి సహృదయతయే దానికి కారణం. '' ఆంధ్రకవితా పితామహుడు'' కవితా ఖండికలో పెద్దనగారి సాహిత్య సేవను కీర్తిస్తూ - ''ఏండ్లు పూండ్లు నాడు మొదలుగతించె కాని భవద్యశస్సులు నేటివరకు;''

నీవు నాటిన తోటలోపల
చేవ తరుగని పూవుగుత్తులు
నేటివరకును తేటవలపులు

నింపెడని దెసల; అని, ''నీ కవిత్వంలోని జీవచిత్ర కళారహస్యాలు చిత్రకారుల కుంచెలుగా మారాయని చెప్పడంలో శ్రీశ్రీ కవితా హృదయం కళాత్మకమైనదో తెలుస్తుంది.

అల్లసాని పెద్దనను ''చిలికి చుక్కల నడుమ మింటను కులుకుచున్నావు'' అని చేవ తరుగని పూగుత్తులుగా చెప్పాడు.

''స్విన్‌బర్న్ కవికి'' కవితా ఖండికలో కవి హృదయ భావాలను తెల్పుతూ

''కవీ! నీ గళ గళన్మంగళ
కళా కాహళ హళాహళిలో
కలిసిపోతిని! కరిగిపోతిని! కానరాకే కదలిపోతిని'' అనీ అలంకార ప్రయోగాలతో తెల్పుతాడు.

'కవితా, ఓ కవితా! ఖండికలో తన కవితా లక్ష్యాలను, సామాజికతను ప్రతీకలతో, సమాసాలతో తెల్పుతూ కవిత్వ దర్శనం గావిస్తాడు. తన కవితా లక్షణాలను సామాజిక

స్పృహ, విప్లవస్పృహ, కలిగిన అభ్యదయ భావాలు అని చెప్తూ -

'కవితా! ఓ కవితా!
నా యువకాశల నవపేశల సుమగీతావరణంలో
నిను నేనొక సుమూహర్తంలో....

అందని అందానివిగా భావించిన రోజుల్లో ..... అంటూ తన కవితా ప్రస్థానానికి తను చేసిన తపనను ఇక్కడ తెలియజేశాడు.

"నీ ప్రాబల్యంలో, తపస్సమీక్షణలో, నా మస్తిష్కంలో ఎన్నో ఘోషలు, భాషలు, దృశ్యాలు, చూశానో " అంటూ

అగ్నిసరస్సున వికసించిన వజ్రం!
ఎగిరే లోహశ్యేనం! విప్లవ పంథాను చూపిస్తాడు.

ఏఏ నిజాలు మనం గుర్తించాలో చెప్తూ - కడుపు దహించకుపోయే పడుపుగత్తె రాక్షసరతి, ఉరితీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం, సమ్మెకట్టిన కూలీల భార్యల బిడ్డల హాహాకారం, తన కవితా వస్తువులుగా చెప్పాడు.

ఛందస్సుల సర్పపరిష్వంగం లోంచి బయటపడి వ్యాకరణాల సంకెళ్ళు విడిచి, మామూలు మాటలను ఔచిత్యంతో అలంకారికతతో పదప్రయోగం చేశాడు. కదిలేది, కదిలించేది, పెనునిద్దుర వదిలించేదీ, పరిపూర్ణపు బ్రతికిచ్చేది కావాలి నవకవీనానికి అని అభ్యుదయ కవితా నిజలక్షణాలను వివరించాడు శ్రీశ్రీ.

శాస్త్రీయమైన సత్యాలను ఉదాత్తమైన శిల్పంతో నిపుణంగా పొదిగితే కానీ కవిత్వం కాదని వాటిని రసవత్కావ్య పంక్తులుగా మార్చిన పద్ధతిని 'దేశచరిత్ర'లో -

నైలునది నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది?
తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్ అదిమోసిన బోయి లెవ్వరు?

అని సాహిత్యాన్ని బుద్ధిపూర్వకంగా విప్లవాత్మక ఆచరణకు సాధనంగా వినియోగించిన మహామేధావి శ్రీశ్రీ.

శ్రీశ్రీ గణబద్ధమైన ఛందస్సులకి స్వస్తి చెప్పి ప్రాచీన మాత్ర ఛందస్సులకి నూతన యవ్వనం ప్రసాదించాడు. పద్యాన్ని పాడటానికి కావలసిన రైమ్ & రిథమ్ యమకం, తాళం తన కవితల్లో చొప్పించాడు.

నా రచనలలో లోకం ప్రతిఫలించి
నా తపస్సు ఫలించి
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నా జాతి జనులు పాడుకొనే

మంత్రంగా మోగించాలని... "కవితా! ఓ కవితా! అని సామాజిక స్పృహతో కవితా వస్తువులు ఎంచుకొని, కవిత్వపు పాత పరిధుల్ని దాటించి కొత్త పరిధుల్లోకి దూకించడం సాధారణ కవులకి కాని పని.

ముగింపు :

నా పాటకి పల్లవి బాధ, ఇది ప్రపంచ మానవులందరి గాథ, అంటూ; పసివాడి ఎముకల గూడు, ఇవియే నా కవిత్వ హృదయం అని తెల్పుతూ నా ఇంటి పేరు ప్రపంచం, ప్రజలే నా కుటుంబం అని వెలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ.

చలసాని ప్రసాద్ గారన్నట్లు ఆకలి శోకాలు చెల రేగుతున్నంతకాలం... నింగి, నేల, నీరు, నిప్పు ఉన్నంత కాలం; అందరి గుండె గొంతుకల్లోంచి శ్రీ శ్రీ అనే రెండక్షరాలు దూసుకువస్తూనే ఉంటాయి అనేది ముమ్మాటికి నిజం నిజం ఇదే ఈ పాత్ర సారాంశం.

ఉపయుక్త గ్రంథ సూచి :

1) శ్రీ రంగం శ్రీనివాసరావు : 'మహాప్రస్థానం'; విశాలాంధ్ర పబ్లికేషన్స్; హైదరాబాదు, 2013.
2) డా॥ రామమోహన్ రాయ్, కడియాల; తెలుగు సాహిత్యాలపై మహాకవి శ్రీశ్రీ ప్రభావం; శ్రీశ్రీ సాహిత్య నిధి, విజయవాడ; 2012
3) చలసాని ప్రసాద్ & ఎం.వి. రాయుడు (కూర్పు) "శ్రీశ్రీ ప్రస్థానత్రయం" కళాజ్యోతి; హైదరాబాద్; 2010. ❖

ఖడ్గసృష్టిలో అభ్యుదయ భావనలు

– సుభాషిణి ప్రత్తిపాటి, తెలుగు ఉపాధ్యాయిని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యాజలి, బాపట్ల జిల్లా.

కవిత్వం ఎప్పటికీ ప్రచార సాధనం కాదు, కరపత్రమూ కాదు మరి అలాంటి కవిత్వం , దాని ప్రయోజనం వేరు. కవి ఎప్పుడూ ఉదార మానవతా వైఖరిని వదలకూడదు. అతని హృదయం ఆకాశమంత విశాలంగా ఉండాలి. అలాంటి లక్షణాలు కలిగి, అసామాన్యమైన పదాలపై అధికారం,లయ విన్యాసం, ఉద్రేకం, ఉద్వేగం కలబోసిన యువరక్తపు వేడితో , వాడిగా క్రొత్త తరహా కవితా రీతిని సృష్టించుకొని తెలుగు సాహిత్యంలో ప్రభంజనమై వీచిన మహాకవి శ్రీశ్రీ.

అభ్యుదయం, అభివృద్ధి నిశ్చలనంగా, నిశ్చేతనంగా ఉండే వస్తువు కాదు. అదో ప్రస్థానం ,అదో ప్రవాహం.అదే శ్రీశ్రీ మహాప్రస్థానం, సాహిత్య ప్రవాహం. శ్రీశ్రీ గారు ఓ కవితలో అంటారు, శ్రీ అంటే సంపద, శ్రీ అంటే విషం, నీకు నచ్చిన నానా అర్థం నువ్వు చెప్పుకో. నాకు మాత్రం ఒకటే'' శ్రీ'' శ్రీశ్రీ మనిషి అని. అభ్యుదయం అంటేనే సామాజిక మార్పు. అభ్యుదయం ఉన్నతికి ప్రయాణం.ఇదే జీవిత మూల సూత్రం. శ్రీశ్రీ గాత్రం. లోక కళ్యాణానికి తోడ్పడే మార్పే అభ్యుదయం. ఆ ప్రకారం ప్రతిజ్ఞ లో శ్రీశ్రీ గారు చెప్పేశారు ఏనాడో.

''కార్మిక లోకపు కళ్యాణానికి,
శ్రామిక లోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా....
సమర్చనంగా...''

ఆయన కోరుకున్న అభివృద్ధి సామ్యవాదం.

ఆయన సాహితీ ప్రయాణంలో మహాప్రస్థానం తరువాత ఖడ్గసృష్టి,మరో ప్రస్థానం చాలా ముఖ్యమైన రచనలు. అందులో ఖడ్గసృష్టి ని పరిశీలిస్తే 1940 నుంచి 1970 వరకు వ్రాసిన, మరియు మరికొన్ని కవితలు ఇందులో పొందుపరిచారు. అధివాస్తవికత అనే కొత్త అంశాన్ని తెలుగు సాహిత్యానికి ఈ కావ్యం ద్వారా పరిచయం చేశారు. దేశ, విదేశ నాయకుల ఉచితానుచిత కార్యాలను అధిక్షేపిస్తూ వ్రాసిన కవితలు కనబడతాయి.

రెండు రెళ్ళు నాలుగంటే..
గూండాలు గండ్రాళ్ళు విసిరేసే సీమలో...
.....
.....
అహింస ఆశయమే కానీ ఆయుధం కాదు
అందుకే
ఈ కుళ్ళిన సమాజ వృక్షాన్ని
సమూలంగా ఛేదించడానికి,
కలంతో సృష్టిస్తున్న ఖడ్గం ఇది,
జనంతో నిర్మిస్తున్న స్వర్గం ఇది.

అంటారు. కలమే ఆయుధం ,సమాజ జీవచ్ఛవంలో చైతన్యం రేకెత్తించి, సరికొత్త భావనలతో స్వర్గం నిర్మించాలనే కాంక్షను వెల్లడిచేశారు.

పాలకుల అవినీతి దురాగతాలు పోవాలని, పెట్టుబడీ దారి వ్యవస్థ నుంచి సంఘం కాపాడబడాలని కోరుతూ వ్రాసిన కవితలూ కనిపిస్తాయి. వందిమాగధులను వెంట తిప్పుకునే నాయకులను చాలా చమత్కారంగా ''పహటాం టాం'' కవితలో ఇలా అంటారు.

''నువ్వు ఇంద్రుడవనీ,చంద్రుడివని
కవులు పొగడడం మేం విన్నాం...మేం విన్నాం.
కానీ...
నువ్వో పురుగువని,
కొయ్యవనీ..
వాజమ్మవనీ .. నీ అసాధారణ గాథలు నమ్మమనీ
కష్టమైతే కావచ్చు గానీ.. స్పష్టంగానే అంటాం..
టాం..టాం..

పాలకుల ధిక్కారానికి చాలా స్థైర్యం కావాలి. శ్రీశ్రీ గారిది ఆ ధిక్కార స్వరమే. కార్మికుల శ్రమతో సంపదలు కూడా కట్టుకున్న ధనిక స్వాములు కొందరు పాపభీతి తో దానాలు చేస్తుంటారు. వారిని గురించి ఇలా అంటారు.

దానశీలి యైన వాడి చేతుల్లో..
రూపాయల చెట్లు మొలుస్తాయి,
అవి బ్యాంకుల్లో బంగారపు గుడ్లు పెడతాయని
అవి కన్నీటి సాన కార్చుతుంటాయని...

- అంటారు. సంపద కేంద్రీకరణను వ్యతిరేకించే సామ్యవాద ధోరణి ఈ కవితలో సుస్పష్టంగా కనిపిస్తుంది.

అద్భుతమైన పదచిత్రాలు,ప్రాసలు,అనుప్రాసలు, ప్రాచీన సాహిత్య ప్రతీకలకు, సాంప్రదాయ భాషకు అభ్యుదయ భావాలకు పొత్తు కుదిర్చిన ఘనత శ్రీశ్రీ గారికే దక్కుతుంది.

ధ్యానం బ్రహ్మ వేద్యమని
ఈశ్వరుడే సత్యం
సమస్తం మిథ్య...
అన్న గీతా సారాంశం ఉదహరిస్తూ
మనిషిలో మరణభీతి
మదిలో దుఃఖానుభూతి
ఆలోచనలన్నింటికీ ఆంతర్యమే పునాది

మనసే సర్వమంటూ ఎంత చక్కగా చెప్పారోకదా! మనసులోని దుఃఖమే భయం అదే నరకం, ఆ భయంతోనే ప్రపంచం ప్రస్తుతం మునిగి పోయిందంటారు.

ఈ రోజున వ్యక్తిత్వ వికాస తరగతులు, నిన్నల్లో పుస్తకాలు, కౌన్సెలింగ్ లు ఐనో వచ్చాయి. ఏడు దశాబ్దాల క్రితమే శ్రీశ్రీ ఆ పని చేసేశారు నాలుగు పాదాల్లో.

ఒక నేత్రం కల్వారం
మరో కన్ను కర్వూరం
మూడోకంటివాడు లేడంటే నమ్మవోయ్!!
చూడవోయ్ నీలోకి నువ్వు
స్వర్గ నరకాలు ఒకస్థితికి రెండు పేర్లు
ఫోకస్ భేదమే తప్ప లోకస్

- ఒకటే అంటారు. ఇదే కదా ఏదీ అంటించుకోవద్దని గీత చెప్పిన సారం. మనం అనుభూతించే దాన్ని బట్టే పరిస్థితులుంటాయంటారు. ప్రవక్తామి గీతార్థేన లో నీతి ,న్యాయ,ధర్మాలకు ఎవరికి తోచిన రీతిలో వారు అర్థం చెప్పుకుంటారని,కానీ పరమార్థం మాత్రం సామాజిక సామూహిక అభ్యుదయమే అని శాసిస్తారు ఈ అభ్యుదయ యుగకర్త.

మహాసంకల్పం కవితలో...

స్వాతంత్ర్యం రాగానే అనాటి కవులు బహుశః ఆనంద గీతాలు వ్రాసే ఉండవచ్చు. కానీ మహాకవి మాత్రం అతణ్ణి జాగ్రత్తగా చూడండి స్వతంత్ర భారత పౌరుడతడు, కించిత్ విషాదం, నిరాశ, విరాగం అతనిలో కనబడు తున్నాయని, అతని బాధ్యత వహిస్తామని, అందరూ హామీ ఇవ్వండి అంటారు. ఇలా సంఘ బాధ్యతను గుర్తు చేడమే కదా కవి బాధ్యత.

రెండు శతాబ్దాల పారతంత్ర్యం , తిండికి,బట్టకు లేని స్థితి, ఎన్నో ఉద్యమాలు,పోరాటాల్లో నలిగిన సగటు భారతీయుడు అతడే నువ్వు, నేను, మనం. అతని ముఖాన తిరిగి నవ్వు అతికించమనే శ్రేయోకాంక్షను వెలువరించారు.

అవతారం కవితలోనూ ఫ్యూడలిజం పై తిరుగుబాటు అంశమే. అప్రస్తుతమే అయినా.... శ్రీశ్రీ గారిదే పాట పాడవోయి భారతీయుడా... ఈ సందర్భంగా గుర్తు వస్తుంది. ఏనాటికీ తెలుగు ప్రేక్షకులను ఉర్రూతలూగించే సాహిత్యం. ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా ఆనాడు కవి గారు వ్రాసిన స్థితిలో మార్పు రాకపోవడం మనం గమ నించవచ్చు. ఖడ్గసృష్టి కవితల్లో అంతర్జాతీయ దృక్పథం తో వ్రాశారని కొందరంటారు.కావచ్చునేమో. దేశంతో వారికి సంబంధం లేదు వారు శ్రమజీవుల పక్షం, కార్మికుల వర్గం.

మున్నుడిలో...
ఏమంటావ్ కెన్నడీ
నీ మతాన్ని...

నీ గతాన్ని...
నీ హిట్లరు పాతదనాన్ని...
చావాలని కసురుతాం...

- అంటారు. ఆ అనడంలో నిరంకుశత్వాన్ని ధిక్కరించడం వినబడుతుంది. పెత్తందారులు చేసే శ్రామిక దోపిడీని, కార్మికులను, అట్టడుగు వర్గాలను అణచివేయడాన్ని, అగ్రరాజ్యాల వర్ణాధిక్యతను, నిరసిస్తూ... సదసత్సంశయం లో...ఇలా అంటారు.

"కరువులో...కటిక దరిద్రుల అవస్థ
కథ గానో కవిత గానో
కట్టాలంటే..
ఈ ప్రపంచం నుంచి కోరేది జానెడు సానుభూతి
దోసెడు తిరుగుబాటు...

అని. రేపటిని మనిషిలో మానవత్వం గుర్తించి సరికొత్త మర్యాదలు సృష్టించే మహత్తర కాలంగా ఆకాంక్ష ను వెలువరించారు.

నేటి పాలకుల్లో రసహృదయం లేదని,వాపోతారు ఓ చోట.ఆనందానికి అవకాశాలున్నా తీరుబాటు లేని అసంఖ్యాక ప్రజానీకానికి సానుభూతి చూపుతారు. ఈ ఖడ్గసృష్టి పుస్తకాన్ని ఆ పదం వాడిన వేముల వాడ భీమకవి పద్యాన్ని ఉదహరిస్తూ..."తెలుగు వాడి" కి అంకిత మిచ్చారు శ్రీశ్రీ.

❖❖❖

శ్రీశ్రీ సాహిత్యం - ఖడ్గసృష్టి స్థానం

- కూర్తల లవన్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, నెట్ (ఎస్.ఆర్.ఎఫ్), తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

అభ్యుదయ రచయితగా, విప్లవకవిగా పేరు గడించిన శ్రీశ్రీ తన సాహితీ ప్రస్థానాన్ని భావకవిత్వంతో మొదలుపెట్టి సినిమా సాహిత్యంతో ముగించాడు. భావకవిత్వంలో తాను ఊహించిన ఆనందం కనిపించక పోయేసరికి తన మార్గన్ని అభ్యుదయం వైపు మల్లించిన అపరమేధావి. సమాజాన్ని చైతన్యం చేసి ముందుకు తీసకువెళ్ళాలంటే కావాలసినది భావకవిత్వం కాదు విప్లవకవిత్వం అని తలచి తన దృష్టిని సామాన్య ప్రజల వైపు నిలిపిన యోధుడు. సమస్య వస్తే ఎటువైపు చూడాలో తెలియని నిర్భాగ్యులను సైతం తన సాహిత్యంతో ప్రభుత్వంను విమర్శించే స్థాయికి తీర్చిదిద్దాడు.

నాయకుడిగా ముందుండి విప్లవాన్ని నడిపించక పోయినప్పటికి సాహితీ నాయకుడుగా ప్రజల నాలుకల యందు తాండవ మాడిన శ్రీశ్రీ సమాజానికే నిలువెత్తు విగ్రహమై సమస్త ఆంధ్ర జాతికి ఆదర్శప్రాయుడయ్యాడు. తోటి రచయితలకే కాదు రాబోయే యువరచయితలకు సైతం మార్గదర్శిగా రూపాంతరం చెందాడు. సమాజాన్ని త్వరగా ముందుకు తీసుకెళ్ళాలంటే అభ్యుదయం కంటే ముఖ్యమైనది విప్లవం అని తలచి విప్లవసాహిత్యం వైపు దూసుకెళ్ళిన శ్రీశ్రీ తన వంతు పాత్రను సుసంపన్నం చేశాడు. సామాన్య ప్రజల ఆకలి బాధలు, దోపిడీదారుల ఆదిపత్యం, పెట్టుబడిదారుల పెత్తనం, ధనవంతుల విలాస జీవితం, రాజకీయ నాయకుల అన్యాయపు పాలన సైతం శ్రీశ్రీని విప్లవం వైపు మల్లించాయి. కార్మికుల, శ్రామికులపై నిరంతర దోపిడి, రైతుల ఆత్మహత్యలు శ్రీశ్రీని విప్లవ రచయితగా ముందుకు నడిపించాయి. శ్రీశ్రీకి ముందున్న రచయితల, సమకాలీకుల ప్రభావం శ్రీశ్రీపై బాగా ప్రభావం చూపిందని చెప్పవచ్చు. అలా పుట్టుకొచ్చిందే ఖడ్గసృష్టి. ఖడ్గసృష్టి సర్రియలిజంతో ముందుకు నడిచిన కవితాసంకలనం. ఇందులోని గేయాలు తెలుగు ప్రజలను దృష్టిలో ఉంచుకొని రాసినవే. అందుకే ఖడ్గసృష్టిని తెలుగు 'వాడి'కి అంకితం చేశాడు. కాబట్టే తెలుగు ప్రజల్లో ఈనాటికి సుస్థిరంగా నిలిచి పోయాడు. ఇప్పటికే కాదు తెలుగు ప్రజలు భాషను మరవనంతకాలం గుర్తుండిపోతాడు.

అహింస ఒక ఆశయమే కాని
ఆయుధం ఎప్పుడూకాదు
ఆశయం సాధించాలంటే
ఆయుధం అవసరమే మరి
అందుకే అంటున్నాను నేను
అందుకో ఆయుధం అని
ఆచరణకి దారితీస్తేనే
ఆవేశం సార్థకమవుతుంది

అనే నగ్న సత్యాలు ఖడ్గసృష్టి గేయంలో చూడవచ్చు. యుద్ధం చేయాలంటే ఆయుధం తప్పనిసరి. ఆయుధం లేని యుద్ధంలో విజయం సాధించలేము. హింస చేయకుండా అహింస మార్గంలో ప్రయాణించాలను కోవడం మంచి మనిషిగా నీ ఆశయమే కావచ్చు, కాని సర్వాంతర్యామి అయిన శ్రీకృష్ణుడు సైతం ధర్మం కోసం అన్యాయ్యాన్ని ఎదురించి ఆయుధాన్ని ధరించి దుష్టశిక్షణ శిష్టరక్షణ గావించాడు. సత్యభామా ప్రియుడయిన శ్రీకృష్ణుడు ఇలాంటి ఉదాహరణలకు నిలువెత్తు ప్రతిరూపం. అందుకే నేను పిలుస్తున్నాను ఆయుధాన్ని అందుకో ఆవేశాన్ని ఆచరణలో పెట్టు నీ బానిసత్వాన్ని రూపుమాపుకో అన్న ఇలాంటి మాటలు శ్రీశ్రీకే సాధ్యం.

చక్రవర్తి అశోకుడెచ్చట
జగద్గురు శంకరుండెచ్చట
ఏవి తల్లీ! నిరుడుకురిసిన
హిమసమూహాలు

ఎక్కడమ్మా కృష్ణరాయని
బహు జాగ్రద్బాడ బాగ్గులు
బాలచంద్రుని బ్రహ్మనాయని
ప్రాణవాయువులేవి తల్లీ

'ఏవీ తల్లీ' అను గేయంలో శ్రీశ్రీ నేలకొరిగిన ప్రముఖ లను ఈ విధంగా స్మరించుకుంటాడు.

కళింగ యుద్ధంలో లక్షలాది ప్రాణాలు తీసి పశ్చాత్తాపం చెంది ఇహలోకాలు త్యజించి తన జీవితాన్ని సమాజ సేవకే అర్పించిన అశోకుడు రోడ్లకు ఇరువైపుల చెట్లు నాటించి సత్రాలు కట్టించి ప్రజల దృష్టిలో దేవుడయ్యాడు. అలాంటి అశోకుడు రేపటికి కానరాడు. జగద్గురు ఆదిశంకరాచార్యులు తన జీవితాన్ని సమాజ సేవకే అర్పించి ధర్మం కోసం నిరంతరం కృషి చేశాడు. అలాంటి జగద్గురు ఆదిశంకరాచార్యులు రేపటికి కానరాడు. తన యుగాన్ని స్వర్ణయుగంగా మలచి అష్టదిగ్గజ కవులను పోషించిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవ రాయలు కూడా శాశ్వతంగా కానరాడు. చిన్న వయస్సు లోనే యుద్ధంలో నేలకొరిగిన బాలచంద్రుడు, సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసి అందరూ సమానమే అని భూమండలంతా చాటి చెప్పిన పల్నాటి బ్రహ్మనాయుడు నేడు కానరాడు. వీటిని బట్టి మనకు అవగతం అయ్యేది ఏమిటంటే ఏదీ శాశ్వతం కాదు. వారికి వచ్చిన కీర్తే చిరస్థాయిలో స్థిరంగా నిలిచిపోతుంది. ఈ విషయాలన్నింటిని శ్రీశ్రీ సంపూర్ణంగా వివరించాడు.

మతకలహల మారణహోమాల మధ్య
1947 ఆగష్టు 14-15 అర్ధరాత్రి
ఆవిర్భవించిన స్వాతంత్ర్యం
అవినీతిని భారీ పరిశ్రమ చేసింది
ఆకలికి సార్వభౌమాధికారం ఇచ్చింది
ధనస్వామ్యానికి ప్రజాస్వామ్యం అని పేరు పెట్టి
పేదవాళ్లని మరింత పేదలనే చేసింది.

అను "వెండి పండుగ"లో ఎంతోమంది కష్టపడి ప్రాణాలు అర్పించి తెచ్చుకున్న స్వాతంత్ర్యానికి విలువ లేదంటాడు శ్రీశ్రీ. స్వాతంత్ర్యం ఏనాడైతో వచ్చిందో ఆనాటి నుంచి అవినీతి విచ్చలవిడిగా రాజ్యం ఏలుతూ వచ్చింది. తప్పు అని చెప్పేవాడు కాలగర్భంలో కలిసి పోతున్నాడే తప్ప అవినీతికి పాల్పడే వారి సంఖ్య మాత్రం తగ్గట్లేదు అని శ్రీశ్రీ వాపోతాడు. ఆకలి కేకలు పెరిగాయి. సామాన్యుల జీవితాలు అణచివేయబడ్డాయి. ధనవంతుల పెట్టుబడిదారుల జీవితాలు బాగుపడ్డాయి. ధనస్వామ్యం ప్రజాస్వామ్యంలోని పేదలను మరింత పేదలనే చేసింది. ధనవంతుడు మరీ ధనవంతుడు అవుతున్నాడు. పేదవాడు కటిక ధరిద్రంలోకి నెట్టివేయబడి కనీస నిత్యావసరాలు కూడా తీర్చుకోలేక పోతున్నాడని శ్రీశ్రీ తన వేదనను స్పష్టంగా వివరించాడు.

ఓ మహాత్మా ఓ మహర్షీ!
ఏది చీకటి, ఏది వెలుతురు?
ఏది జీవిత, యేది మృత్యువు?
ఏది పుణ్యం, ఏది పాపం?
ఏది నరకం, ఏది స్వర్గం?
ఓ మహాత్మా.

శ్రీశ్రీ 'ఓ మహాత్మా' అనే గేయంలో ఇలా ప్రశ్నిస్తాడు. చీకటి వెలుతురులు, జీవిత మృత్యువులు, పుణ్య పాపాలు, స్వర్గనరకాలు ఏవి మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేంత వరకు అను నిత్యం అనుభవించేవే కదా క్రొత్తగా ఏమున్నది. చీకటి కొన్ని రోజులు, వెలుతురు కొన్ని రోజులు అంతేగా, పుట్టుక ఉంటే చావు కచ్చితంగా ఉంటుంది. మంచి పనులు చేస్తే పుణ్యం వస్తుంది. చెడ్డ పనులు చేస్తే పాపం వస్తుందని అందరికీ తెలిసిందేగా, మంచోడికి స్వర్గం ఉన్నట్లే చెడ్డోడికి నరకం ఉంటుంది. ఇవన్నీ తెలసినవే కదా మరెందుకు ఈ ప్రాకులాట అని మనిషి సహజత్వాన్ని చిత్రీకరించాడు రచయిత.

నేను దైవాన్ని నేను సత్యాన్ని
దైవాన్ని నేను మాట్లాడుతున్నాను
మానవుణ్ణి నేను సృష్టించలేదు
మానవుడే నన్ను సృష్టించాడు
అతని మనసు నన్ను సృష్టించింది

అనే గేయంలో దేవుడును మనిషే సృష్టించాడని మనిషిని దేవుడు సృష్టించలేదని, మనిషి చేసే పనులలో దైవత్వం కనిపిస్తుంది అంతేకాని దైవం అంటూ ఎక్కడా కానరాదని రచయిత శ్రీశ్రీ క్లుప్తంగా వివరించాడు. దేవుడు ఎక్కడో లేడు సాయం చేసే మనస్సున్న మనిషిలో కనిపిస్తాడని మనకు ఈ గేయం చదువుతే అర్థమవుతుంది.

అట్టడుగు అగాధాల నుండి
కష్టజీవులు కమ్యూనిజంలోని కొస్తారు!
గనుల గర్భాలనుంచి
కొడవళ్ళలోంచి
కార్ఖానాలనుంచి
నేను సమున్నత కవితాశిఖరాలనుంచి
కమ్యూనిజంలోకి దూకుతాను.
కమ్యూనిజం నా హృదయం, అదివినా
నాకు ప్రేమ లేదు.

అను గేయంలో శ్రీశ్రీ కమ్యూనిజం గురించి ఇలా ప్రస్థావించాడు. ఉన్నట్టుండి కమ్యూనిస్ట్‌లు పుట్టుకరారు. ఎన్నో నష్టాలు, ఎన్నో కష్టాలు అనుభవించి ఆర్థిక దోపిడీకి గురై, కడుపులు మాడ్చుకొని, జమీందారుల దాటికి తట్టుకోలేక, ఏండ్ల తరబడి పోరాటం చేసి విసుగు చెంది, తమ ఔనత్యాన్ని పెంచుకోవడానికి ఎంచుకున్న మార్గమే కమ్యూనిజం అని ఈ గేయం చదువుతే అర్థమవుతుంది.

దేశమును ప్రేమించుమన్నాడు
గురుజాడ సత్కవి
మంచి అన్నది పెంచమన్నాడు
దేశమంటే మట్టికాదని
దేశమంటే మనుషులే అని
ఈసురోమని మనుషులుంటే
దేశమేగతి బాగుపడునని

'సఖ్యం' అనే గేయంలో నవయుగ వైతాళికుడగు గురజాడ అప్పారావు దేశభక్తి గేయాన్ని చక్కగా వివరించాడు అభ్యుదయ రచయిత శ్రీశ్రీ. గురజాడ మాటల్లో దేశభక్తి అంటే దేశం మీద, ప్రాంతం మీద ప్రేమ ఉండటం కాదు జనసమూహం మీద ప్రేమ ఉండటం. వీలైతే తనకు తోచినంత సహాయం చేయడం. ఈ విషయాన్నే శ్రీశ్రీ సమర్థిస్తూ తన 'సఖ్యం' గేయాన్ని ముందుకు నడిపించాడు. ఈ విషయాలు నేటి భావి తరాలు వింటున్నప్పటికి ఆచరణలో పెట్టడం గగనమై పోతుంది.

శ్రీకూర్మం మొదలు
సింహాచలం మొదలు
శ్రీశైలం దాకా
చిత్తూరు దాకా
తూరుపు కడలి మొదలు
పడమటి కనుమల దాకా
ఇది నా దేశం
విశాలాంధ్రదేశం

అను 'ఆంధ్రదేశం' కవితలో ఆంధ్రదేశ విస్తీర్ణాన్ని ఆంధ్రదేశంపై ఉన్న మమకారాన్ని గమనించవచ్చు. తెలుగు మాట్లాడే మనిషి నివసిస్తున్న ఆంధ్రా సరిహద్దు ప్రాంతం అంతటిని ఆంధ్రదేశంగా ప్రకటించవచ్చని శ్రీశ్రీ సోదహరణాత్మకుగా పేర్కొన్నాడు. ఇందులో శ్రీశ్రీకి ఆంధ్ర దేశంపై ఉన్న మమకారం ఎటువంటిదో మనం అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి కవిత రాబోయే భావితరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పటం అతిశయోక్తి కాదు.

ఇలా చెప్పుకుంటూ పోతే ఖడ్గసృష్టిలోని ప్రతి గేయం ఒక ఆణిముత్యంలా కనిపిస్తుంది. కలాన్ని ఖడ్గంలా ధరించి, సాహిత్యాన్ని నునంపన్నం చేసిన శ్రీశ్రీ అభ్యుదయ, విప్లవరచయిత సంఘాలకు అధ్యక్షతాభారం వహించి, సాహితీ ప్రపంచంలో తనవంతు పాత్రను పోషించాడు. నాయకుడుగా చేయవలసిన కార్యాన్ని సాహితీప్రియుడుగా చేపట్టి విప్లవాన్ని రేకెత్తించిన అనుభవం శ్రీశ్రీకే దక్కుతుంది.

ఆధార గ్రంథాలు :

ఖడ్గసృష్టి - శ్రీశ్రీ

❖

మహాప్రస్థానం - శ్రీశ్రీ భావాలు

- **తొండి రేవతి,** అతిది అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (అ), రాజమండ్రి, తూ॥గో॥జిల్లా.

1930 ప్రాంతంలో ఆర్థికమాంధ్యం అనే సమస్య యావత్ ప్రపంచాన్ని పీడిస్తున్న సమయంలో 1930కు 1940కి మధ్యకాలంలో వచ్చిన కవితలలో శ్రీశ్రీ మహాప్రస్థానం సర్వోత్తమ క్యావంగా తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచింది. ప్రపంచమంతటా మానవజాతి ఎదర్కొంటున్న బాధలను వస్తువుగా ఉండేటట్లు మహాప్రస్థాన గేయాన్ని రచించారు.

శ్రీశ్రీ ఈ గేయం వ్రాయడానికి ముందే రష్యాలో లెనిన్ నాయకత్వమున 1917లో రష్యా విప్లవం జరిగింది. రష్యాలో కమ్యూనిష్టుల రాజ్యం వచ్చింది. శ్రీశ్రీ రష్యాను మరో ప్రపంచంగా భావించడానికి కారణం ఈ గేయం వ్రాసేటప్పటికి రష్యా భూతల స్వర్గంగా వుంది. అక్కడంతా సుఖమూ, సంతోషాలే శ్రీశ్రీ చెప్పిన మరో ప్రపంచం ఇదే. కాబట్టి ఆ మరో ప్రపంచానికి ఎలా వెళ్ళాలో, ఏమి చెయ్యాలో అక్కడ ఎలా వుంటుందో శ్రీశ్రీ తన మహాప్రస్థాన రచన ద్వారా తెలియచేశారు.

మహాప్రస్థాన రచన ద్వారా శ్రీశ్రీ యొక్క అభ్యుదయ, సామ్యవ్యాద, గతతార్కిక భౌతిక వాదాలను తెలిసికోవచ్చు. తెలుగు సాహిత్యంలో అంతకు ముందు సాగిన సాహిత్య రచనలలో ఈ భావాలు ఎన్నడు లేకపోవడంతో శ్రీశ్రీ మహాప్రస్థానం తెలుగు సాహిత్యాన్ని కొత్త మలుపు తిప్పింది.

శ్రీశ్రీ అభ్యుదయ భావాలు :

అభ్యుదయం అనగా "మంగళము", "శుభము" అని అర్థము "ప్రోగ్రెస్" అని ఆంగ్ల పదానికి అభ్యుదయం అనేది సమానార్థక పదం. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీశ్రీ మహాప్రస్థానం శుభప్రదమయిన సాహిత్యంగా చెప్పవచ్చు ఎందుకంటే ప్రజాజీవనం, జనసాహితి, వాస్తవికతా దృక్పధం.

శ్రీశ్రీ తన మహాప్రస్థానం ద్వారా అభ్యుదయ కవిత్వ భావాలను అంతర్జాతీయ పరిస్థితులను, ఆర్థిక, సామాజిక, రాజకీయ దృక్పథాలను ఆధారంగా ఆవిర్భవించింది. మార్కిస్టు భావజాలంతో ప్రపంచాన్ని అవగాహన చేసుకుని విప్లవాత్మక ధోరణిలో తన రచనను ప్రవేశపెట్టాడు శ్రీశ్రీ. అభ్యుదయ కవిత్వం అనేది మానవజాతి పరివర్తన, నవజీవన శుభసమయం, అభ్యుదయం అని ఎలుగెత్తి చాటాడు శ్రీశ్రీ.

"కదిలేది కదలించేది
మారేది మార్పించేది
మును ముందుకు సాగేది
పెను నిద్దుర వదలించేది.
పరిపూర్ణపు బ్రతుకు నిచ్చేది
కావాలోయ్ నవ కవనానికి"

శ్రీశ్రీ తన గేయంలో నూతన సాహిత్యం అనేది అవసరమని సమాజాన్ని కదిలించేది గాను, మార్చేదిగాను సాహిత్యం ఉండాలని సూచించారు. నూతన సాహిత్యం అనేది పీడితులు, దరిద్రులను ఆహ్వానించాలని వారు పరిపూర్ణ బ్రతుకును శాశ్వతం చేసుకోవాలి అంటూ..

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది !
పదండి ముందుకు
పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి

అని శ్రీశ్రీ తాను కలలు కన్నా క్రొత్త ప్రపంచానికి అభాగ్యులను, పీడితులు, ధరిద్రులను ఆహ్వానించాడు.

శ్రీశ్రీ తన గేయంతో దీర్ఘనిద్రలో ఉన్న మానవాళిని తట్టి పిలుస్తున్నాడు.

"దీర్ఘ శ్రుతిలో తీవ్ర ధ్వనితో
విప్లవ శంఖం పూరిస్తా"

అంటూ శ్రీశ్రీ హెచ్చరించాడు. శ్రీశ్రీ తెలుగు సాహిత్యంలో తనదైన స్థానాన్ని ఇనుమడింపచేసు కున్నాడు. శ్రీశ్రీ కవిత్వం ముందుతరాల వారికి ఆదర్శంగా నిలిచింది.

శ్రీశ్రీ గేయంపై రష్యా ప్రభావం ఉన్నట్లుగా మనకు కనిపిస్తుంది. అభ్యుదయ భావంకు శ్రీశ్రీ ఆధ్యుడు, ఆరాధ్యుడుగా చెప్పవచ్చు.

శ్రీశ్రీ గారి అభ్యుదయవాద కవితా ఖండికలో అనలుసిసలైన అభ్యుదయ భావాలు, విస్పష్టంగా తెలుపబడిన కార్మిక, శ్రామిక వర్గీయుల ప్రాధాన్యము కనిపిస్తుంది.

తరతరాలుగా వస్తున్న సంప్రదాయ గత విలువలు తలక్రిందులు చేస్తూ 1937 ప్రాంతంలో మార్క్సిస్టు దృక్పథములో శ్రీశ్రీ మహాప్రస్థానం జయబేరి మ్రోగిం చింది.

"పాలాలనన్నీ
హలాలదున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యంనిండగ
విరామ మెరుగక పరిశ్రమించే,
బలం ధరిత్రికి బలి కావించే,
కర్షక వీరుల కాయం నిండా
కాలువ కట్టే ఘర్మ జలానికి,
ఘర్మ జలానికి
థర్మ జలానికి
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్!

అని శ్రీశ్రీ కర్షక, కార్మిక వీరుల ఖర్మజలానికి, వారి విషాదాశ్రులకు ఖరీదు కట్టే షరాబు లేడని, కార్మికుని ఘర్మజలములోనే సమాజం ముందుకు సాగుతుందని కార్మికుని శ్రమను దోపిడి చేసే షరాబులు కార్మికుని విలువను గ్రహించలేదని శ్రీశ్రీ వెలుగెత్తి చెప్పారు.

"నాలో కదిలే నవ్యకవిత్వం
కార్మికలోకపు కల్యాణానికి
శ్రామిక లోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా, సమర్చనంగా
త్రిలోకాలలో, త్రికాలాలలో
శ్రమైక జీవన సౌందర్యానికి
కష్ట జీవులకు, కర్మవీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ"

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమయినది లేదని. నవ్వ కవిత్వంలో జనించబోయే జగత్తుకు స్వాగతమిస్తూ పల్లె జీవనంలో భాగమైన వృత్తులు జాలరిపగ్గం, సాలెల మగ్గం, కొడవలి, నాగలి, రంపం మొదలైనవి తన కవితకు ప్రాణమూ, ప్రణవమూ అని శ్రీశ్రీ తెలిపాడు.

నిరంతరం పీడింపబడుతూ, చీకటి నిండిన బ్రతుకు లను సమస్యలతో సరిహద్దులు, సంతృప్తి దొరకని అభాగ్యులు అడ్డుగోడలను పడగొట్టడం. అలజడి సృష్టించడం, ఆందోళన, తిరుగుబాటు చేయడం ఎన్ని సమస్యలు వచ్చిన ముందుకు పయనించడం మొదలగు విషయాలు శ్రీశ్రీ వివరించారు.

శ్రీశ్రీ మహాప్రస్థానం - సామ్యవాద భావాలు :

సామ్యవాదం అనగా సమ సమాజ స్థాపనలో ఆర్థిక అంతరాయాలను క్రమంగా తగ్గించడం. అంటే ధనికులు - పేదలు, యజమాని-కార్మికుడు పెట్టుబడిదారుడు - కర్షకుడు భావనలలో వ్యత్యాసాలు లేకుండా సమాన భావం కలిగి ఉండటమే సామ్యవాదం.

"దారి పొడుగునా గుండె నెత్తురులు
తర్పణం చేస్తూ పదండి ముందుకు
బాటలు నడిచీ
పేటలు కడచీ
కోటలన్నిటిని దాటండి

అంటూ అనేక మంది వీరులు ప్రాణత్యాగాలను, వారి రక్తతర్పణాలను శ్రీశ్రీ గుర్తుకు చేస్తున్నాడు. దీనికి అర్థం

రక్తపాతం సృష్టించమని ప్రోత్సాహించడం కాదు సమ సమాజ స్థాపనకు కృషి చేయడం అనే భావం అంతర్లీనంగా కన్పిస్తుంది. కులాలు, మతాలు పేరుతో ఏర్పడే పేటలా, రాజులూ, జమిందారులూ కట్టిన కోటలు సామ్యవాద లోకంలో ఉండవు. దోపిడీ వ్యవస్థను నాశనం చేసి సామ్యవాద వ్యవస్థలో మానవాళి ప్రవేశించాలి.

"అగ్ని కిరీటపు ధగధగలు
ఎర్రబావుటా నిగనిగలు"

ఇవి మరో ప్రపంచపు స్వరూప స్వభావాలు, పూర్వం నుండి రాజులు రత్నకిరీటాలు ధరిస్తే శ్రామికుడు మాత్రం అగ్ని కిరీటం ధరిస్తాడు. ఎందుకంటే పారిశ్రామిక విప్లవం అగ్ని మీద ఆధారపడి ఉన్నందువల్ల శ్రామికులు విజయం వల్ల అరుణపతాకం ఎగురుతుంది.

గతితార్కిక భౌతికవాద భావాలు :

హెగెల్ అనే జర్మన్ శాస్త్రవేత్త ఈ వాదానికి మూల కారకుడు. హెగెల్ ప్రతిపాదించినది భావవాదము. ఈ భావానికి కాలం, స్థలం ముఖ్యమైనది. శ్రీశ్రీ అభి ప్రాయంలో శాస్త్రీయ దృక్పథంలో ప్రపంచంలో ప్రతి వస్తువూ మార్పు చెందుతుందనేది గతితార్కిక భౌతికవాద సిద్ధాంతం.

శ్రీశ్రీ దేశచరిత్రలు అనే గేయం గతితార్కిక భౌతిక వాదాన్ని తెలియజేస్తుంది.

"బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు.
నరహంతకులు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి"
చిరకాలం జరిగిన మోసం,
బలవంతుల దౌర్జన్యాలూ,
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా! ఇకపై చెల్లవు"

అని బలవంతులు బలహీనులను బానిసలుగా మార్చే పద్ధతిని శ్రీశ్రీ వ్యతిరేకించారు. చరిత్రలో ఎటుచూసిన బలవంతులైన రాజులు కీర్తింపబడే ఘనత మాత్రమే కనిపిస్తుంది. వారే ధరాధిపతులుగా ఉన్నారు. కార్మిక జాతిని పీడించే దోపిడి వర్గాలను హెచ్చరిస్తూ, కార్మిక, శ్రామిక వర్గాలను ఏకం కమ్మని శ్రీశ్రీ పిలుపునిచ్చాడు. అణగారిన జాతులు అన్ని ఒక బాటన నడవాలనే సూత్రాన్ని శ్రీశ్రీ ప్రతిపాదించాడు.

"నైలు నదీ నాగరికతలో
సామాన్యుని జీవన మెట్టిది
తాజ్‌మహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తెన కూలీలెవ్వరు"

అంటు శ్రీశ్రీ సామాన్య మానవుని జీవితం బానిస సంకెళ్ళలో చిక్కుకుని పోయిందని చెప్పారు. చరిత్రలో గొప్పగా పేరొందిన ఈజిప్టు ప్రాంతంలోని నైలునది నాగరికతలో రాజులు యొక్క విలాసవంతమైన జీవన విధానం వర్ణించబడిందే తప్ప నది పరిసరాలలో జీవించే సామాన్య మానవుని జీవితం వర్ణింపబడలేదు.

ప్రపంచవింతలలో ఒకటైన తాజ్‌మహల్‌ను ప్రేమకు చిహ్నంగా ప్రపంచం మొత్తం వెల్లడిస్తుంది. కాని అంత అందమైన కట్టడము వెనుక అనేక మంది శ్రామికులు కష్టం ఉందని గుర్తించరెందుకు? అని శ్రీశ్రీ ప్రశ్నించారు. మానవ చరిత్ర అనేది నిరంతరం వర్గపోరాటంగా శ్రీశ్రీ వర్ణించారు.

ముగింపు :

శ్రామికలోకపు సౌభాగ్యం కోసం రక్తాన్ని అక్షరాల్లో చిలకరించిన కవిత్వం. శ్రీశ్రీ కవిత్వం. సమాజ శ్రేయస్సును లక్ష్యంగా చేసుకొని రచనలు సాగించిన అభ్యుదయ కవి శ్రీశ్రీ.

శ్రీశ్రీ అంటే రెండు అక్షరాలే అవి "ఒక చైతన్య స్ఫూర్తికి సజీవ దర్పణాలు"

శ్రీశ్రీ అభ్యుదయ సాహిత్యానికి, విప్లవ సాహిత్యానికి, ఆధ్యులుగాను, సాహిత్యానికి సమాజానికి వారధిగాను ఉన్నారు.

1933 నుండి 1940 వరకు శ్రీశ్రీ రచించిన "మహా ప్రస్థానం, జగన్నాధుని రధచక్రాలు తెలుగు సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన గ్రంథాలు.

"మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం" అని చాటిన కవి శ్రీశ్రీ. 1930 సం॥వరకు తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత నుంచి దాన్ని నేను నడిపిస్తున్నాను. అని తెలుగు సాహిత్య చరిత్రలో "మహాప్రస్థానం" ఢంకా మోగించిన మహాకవి శ్రీశ్రీ.

శ్రీశ్రీ తన కవిత్వానికి ముందుమాట వ్రాయమని చలంగారిని అడిగితే, కవిత్వాన్ని తూచే రాళ్ళు తన దగ్గర లేవన్నాడు అప్పుడు శ్రీశ్రీ "తూచవద్దు అనుభవించి, పలకరించమన్నాడు.

"కృష్ణశాస్త్రి తన బాధని అందరిలోనూ పలికిస్తే శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలకిస్తాడు".

"కృష్ణశాస్త్రి ప్రపంచానికి బాధ ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ". సాహిత్యం అనేది ప్రజల కోసమే అనే లక్ష్యంతో విద్యాగంధంలేని కర్షకులు, కార్మికులు, కూలి ప్రజలకోసం సాహిత్యం అని తెలియజేసారు. ప్రపంచ బాధను తన బాధగా భావించి గేయాలు వ్రాయడంలో శ్రీశ్రీ ప్రబోధించిన మానవ శ్రేయస్సు మనకు కనిపిస్తుంది.

సమకాలిన పరిస్థితులను వాస్తవికతా దృక్పధంతో సాహిత్యం రచనకు మహా ప్రస్థానం బాటలు వేసింది ఫలితంగా ఆధునిక కవులు అభ్యుదయ భావాలు, రచనలు వైపు దృష్టి పెట్టడం జరిగింది.

ఉపయుక్త గ్రంథాలు :

1. శ్రీశ్రీ - మహాప్రస్థానం
2. మహాకవి శ్రీశ్రీ - బూదరాజు రాధాకృష్ణ
3. సాహిత్య సిద్ధాంతాలు - వెలమల సిమ్మన్న గారు
4. శ్రీశ్రీ కవిత్వం - మిరియాల రామకృష్ణ

❖❖❖

శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' కవితలు

– డా॥. కడివెండి సుమత, అధ్యాపకులు, భద్రుక వాణిజ్య కళాశాల, హైదరాబాద్.

శ్రీ శ్రీ 1930-1940 మధ్యకాలంలో వ్రాసిన 'మహా ప్రస్థానం' లోని కవితలు ఒక బలీయమైన నిరసన లోంచి వచ్చినవి. ఈ నిరసన ఒక సాంద్రమైన డీప్లీ ఫెల్ట్ ఎమోషన్. ఒక తాత్వికచింతన ననుసరించి వచ్చిన నిరసన కాదు. అంతక్రితం వరకు వచ్చిన, వస్తున్న కవిత్వం సమాజంలో తాడితుల, పీడితుల వేదనలకు స్పందించకుండా వుండటంపై వచ్చిన నిరసన. ఇది మహాశక్తిమంతంగా వెల్లువలా, జ్వాలలా వచ్చింది. ఆయన కవిత్వంలో కూడా అంత బలీయంగానూ వెల్లువయింది. అంచేతనే చలం గారన్నట్లు ఈ సంకలనం లోని కవితలు కత్తులుగా, ఈటెలుగా, మంటలుగా, బాధలుగా తిరుగుబాట్లుగా, యుద్ధాలుగా బహిర్గతమయ్యాయి. తనకు, పాఠకునికి మధ్య అక్షరాలు అడ్డుగా నిలవకుండా ఆయన గుండెలోని ఆవేశాలు, ఆక్రందనలు, ఆకాంక్షలు పాఠకుల గుండెల్లోకి మహా వేగంగా చీల్చుకుంటూ దూసుకపోతవి. 'మహా ప్రస్థానం' లోని అత్యధికమైన కవితలు ఈ వేగం, ఈ ఊపు కలిగి వుంటవి. వెనుకచూపు లేనే లేకుండా "పదండి ముందుకు, పదండి ముందుకు" అంటూ పిడికిలి బిగించి కదను త్రొక్కుతూ విరుచుకపడుతుంటే, అడ్డంకులన్నీ బేజారెత్తి పటాపంచలై పారిపోతవి. పాఠకులని జ్వలించే మూర్తులుగా ప్రభావితం చేస్తవి.

ఇంతటి శక్తి ఆ కవితలకుండటానికి కారణం కవి ఆవేశస్ఫూర్తి, శబ్దశక్తి, అనుభూతుల నిజతత్వ నిరూపణకు వ్యక్తీకరణ మాధ్యమాలుగా వాడిన పదచిత్రాలు. శ్రీశ్రీ తన ఆవేశావిష్కరణకు మాధ్యమాలుగా వాడే పద చిత్రాలు, పాఠకుల్ని కదిలించి ఊగించే బలం కలవి. సజెస్టివ్ పవర్ గలవి. మహాప్రస్థానం కావ్యంలో అదే పేరు గల మొదటి ఖండిక యొక్క భావవేగం, శబ్దసౌష్టవం, పదచిత్రాల నిర్మాణ ప్రౌఢిమ, అది సాధించిన మనోహర మైన లయ కావ్యానికే తలమానికంగా నిలబడుతవి. అల్లంత దూరంలో ఉన్న దోపిడీ లేని ప్రపంచం లోని ప్రేమ, స్నేహం, సమత, సౌభ్రాతృత్వ పునాదుల మీద లేచిన సమాజం చేరడానికి పిలుపు, మేల్కొలుపు ఈ మహాప్రస్థానం. ఈ ప్రస్థానం సులభం కాదు. అందుకే కృతనిశ్చయంతో సర్వత్యాగాలకు సిద్ధపడి అవసరమైతే గుండె నెత్తురుల తర్పణ చేస్తూ బాటలు, పేటలు, కోటలు, నదులు, కొండలన్నిటినీ అతిక్రమించి గమ్యం చేరటానికి గొంతెత్తి పిలిచే 'క్లారియన్ కాల్' ఈ గీతం. ఆశయసిద్ధి కోసం పురోగమించే పోరాటయోధుల అచంచల విశ్వాసం 'కదం తొక్కుతూ పదం పాడుతూ' అనడంలోనే ఆయుధాలు చేపట్టి వీరావేశంతో ముందుకు సాగే జనసందోహం దృశ్యమానమవుతుంది. మిలిటరీ బాండ్ సంగీతాన్ని స్ఫురింపజేసే లయతో చరణాలు కదం త్రొక్కుతవి.

"మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరోప్రపంచం పిలిచింది.
పదండి ముందుకు
పడండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి!
...దారి పొడవునా గుండె నెత్తురులు
తర్పణ చేస్తూ పదండి ముందుకు
బాటలు నడచీ
పేటలు కడచీ
కోటలన్నిటిని దాటండి.
నదీనదాలు,
అడవులు, కొండలు
ఎడారులా మనకడ్డంకి?"

'ఎడారులా మనకడ్డంకి' అనడంతోనే అడ్డంకులేవీ

లేవని నిర్లక్ష్యంగా స్ఫురింపజేయడం మంచి ధ్వని ప్రాయంగా జరుగుతుంది. 'ప్రభంజనం వలె హెూరెత్తండీ / భావవేగమున ప్రసరించండీ' అనే ఉద్బోధకు తగినంత వేగంతో అప్రతిహతంగా గీతం ముందుకు సాగుతుంది. ఆ ముమెంటంకు 'త్రాచులవలెనూ రేచులవలెనూ ధనుంజయునిలా సాగండి' లాంటి పదచిత్రాలతో ఒక అపూర్వమైన ఇంటెన్సిటీ పెరుగుతుంది. ఈ సంకలనానికి ధ్యేయ, దిశానిర్దేశం జేస్తుంది ఈ ప్రారంభ కవిత. అలాగే 'జయభేరి'లో చక్కని చిక్కని, ఉర్రూతలూగించే కవితా ప్రస్థానం సాగుతుంది.

నేను సైతం/ ప్రపంచాగ్నికి/ సమిధనొక్కటి/ ఆహుతిచ్చాను
నేనుసైతం/ ప్రపంచాబ్జపు/ తెల్లరేకై పల్లవిస్తాను
నేను సైతం/ భువనభవనపు/ బావుటానై/ పైకిలేస్తాను

అలాగే గంటలు, అమూర్తం, భిక్షువర్షీయసి, అభ్యుదయం, మిథ్యావాది, ప్రతిజ్ఞ (ముఖ్యంగా కాల్చే ఆకలి కూల్చే వేదన/ బాటలు తీస్తూ పాటలు వ్రాస్తూ/ శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదని), కవితా ఓ కవితా, నవకవిత, కేక, గర్జించు రష్యా, నిజంగానే (బానిసల సంకెళ్ళు బిగిసే/ పాడు కాలం లయిస్తుందా? సామరస్యపు, సోదరత్వపు/ సాధుతత్వం జయిస్తుందా), నీడలు, జగన్నాధుని రధచక్రాల్ (ద్రోహాలని కూలగొట్టి/ దోషాలను తుడిచిపెట్టి/ స్వాతంత్ర్యం/ సమభావం/ సౌభ్రాత్రం, సౌహార్దం/ పునాదులై ఇళ్ళు లేచి/ జనావళికి శుభం పూచి) / ఈ కవితలన్నీ గొప్ప కవితలు. ఉర్రూతలూగించే కవితలు. అలజడిని, ఆక్రోశాన్ని, ఆందోళననీ, కలిగించి గుండెలను మండించే కవితలు. రసానందాన్ని కలిగించే కవితలు.

మహాప్రస్థానం, లండన్ ప్రచురణకు 'నా మాట' శ్రీశ్రీ వ్రాస్తూ అంటారు: "ఈ వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా, ఇలాంటి రచనలను 'సామాజిక వాస్తవికత' అంటారనీ దీనికి వెనుక దన్నుగా 'మార్క్సిజం' అనే దార్శనికత ఒకటి ఉందనీ అప్పటికి నాకు తెలియదు."

'నా మాట' ముగిస్తూ శ్రీశ్రీ ఇలా అంటారు: "మహాప్రస్థానంలో అభ్యుదయ కవిత్వము, విప్లవ బీజాలు ఉన్నాయి. విప్లవసాహిత్యం లేదు" అని.

విప్లవసాహిత్యం అంటే ఏంటి? సామాన్యప్రజానీకాన్ని విప్లవాచరణకుద్యుక్తులని జేసే విధంగా సాగేదే! మహాప్రస్థానం వ్రాసే రోజుల్లో సామాజిక వాస్తవికత గురించీ, మార్క్సిజం గురించీ శ్రీశ్రీకి తెలియకపోవటమే మంచిదయింది. తన చుట్టూ ఉన్న సమాజ స్థితిగతులకు చిత్తశుద్ధితో, ఆర్ద్రమైన హృదయంతో స్పందించి వ్రాయబట్టే తన భావుకతకు తోడుగా గొప్ప శబ్దశక్తి, అనుభూతి నిజతత్వ నిరూపణ, వ్యక్తీకరణ మాధ్యమాలుగా శక్తివంతమైన పదచిత్రాలను వాడబట్టే, గొప్ప లయను రచనలో సాధించబట్టే ఆయన గొప్ప కవిత్వం, ఎన్నటికీ మరువలేని కవిత్వం వ్రాయగలిగారు. మార్క్సిజానికి, విప్లవసాహిత్య అలంకారిక కట్టుబాట్లకు ఆయన లోనైన తర్వాత కవిగా ఆయన స్వతంత్రం కోల్పోయారు. సిద్ధాంత ప్రవచనం తన కర్తవ్యంగా స్వీకరించి, తన కవితా వ్యాసంగంపై మార్క్సిస్ట్ సిద్ధాంతానికి పెత్తనం అప్పజెప్పారు. ఆయన దృక్పధంలో సాహిత్యప్రయోజనానికి, సాహిత్యమార్గానికి సంబంధించి ఈ మార్పు వచ్చిన తర్వాత కవిత్వరచనలో శిల్పం యొక్క ప్రాధాన్యతను దాదాపు త్యజించినట్లుగా భావించవచ్చు. 'శ్రీశ్రీ సాహిత్య విమర్శ దృక్పధం'పై జూన్ 10, 2010 ప్రజాసాహితి సంచికలో కాత్యాయనీ విద్మహే అంటారు:" 'కాదేదీ కవితకనర్హం, అవునవును శిల్ప మనర్హం'. సాహిత్యవస్తువు ఏదైనా కావచ్చు. సాహిత్యంగా దానిని నిర్మించే తీరుకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రారంభంలో శ్రీశ్రీ శిల్పవాది. చెప్పటంలోని చమత్కారం మీదనే దృష్టి. సంవిధానమే సమస్తమూ అనుకునే దశలో ఎలా చెబుతున్నాననే దానికి ప్రాధాన్యతనిచ్చారు. కళ కళ కోసమే అనేవారి దంతప్రాకారంలో జీవిస్తూ అందులోంచి బయటపడి ప్రజలకోసమే కళ అనే నిశ్చయానికి ప్రయత్న పూర్వకంగా వచ్చినవారు శ్రీశ్రీ."

కళ కళ కోసమే అనే మహాసూక్తిని ఎందుకో మహా మేధావులు కూడా సరిగా అర్థం చేసుకోలేదనిపిస్తుంది.

కళ కళ కోసమే అనడం కళ ప్రజల కోసమే అనేదానికి వ్యతిరేకం కాదు. జాగ్రత్తగా గమనిస్తే ప్రజల కోసమే కళ. అంటే మొదట దేనినైతే మనం కళ అని పిలవదలచుకున్నామో అది కళ కావాలి కదా. కవిత్వం ద్వారా గానీ, లేదా ఇతర సాహిత్య రూపాల ద్వారా కానీ చెప్పదలచుకున్న వస్తువు లేదా విషయం కళగా మారాలి కదా! అది కళగా మారాలి అంటే అది కొన్ని నిర్దుష్టమైన విషయ నియమాలకూ, విధానాలకూ అనుగుణంగా శిల్ప సౌందర్యాత్మకమైన, గుణాత్మకమైన మార్పులకు లోనై తీరాలి. లేకపోతే అది కళ కాదు. కళ కాని దానిని కళ అని పిలిచి ఇది ప్రజల కోసం అనడం అసంబద్ధమయిన విషయం. కళ కళ కోసం కానిది ప్రజల కోసం కానేరదు. కారణం కళ కళ కోసం కానప్పుడు అది కళే కాకుండా పోతుంది. ప్రజలను చైతన్యవంతులనే చేయటం ధ్యేయమైతే దానికి కవిత్వమే ఉపయోగించక్కరలేదు. వారికర్థమయ్యే భాషలో, సరళమైన రీతిలో కరపత్రాలు రచించి, వారు నిరక్షరాస్యులైతే వారిని చిన్న చిన్న కూటములుగా చేర్చి సరళమైన భాషలో నూటిగా మాట్లాడి చైతన్యవంతులను చేయవచ్చు. చక్కగా అర్థమయ్యే భాషలో చెప్పవచ్చు. కవిత్వం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలంటే వారినది ఆకట్టుకోవాలి. అంటే వినేట్లు లేదా చదివేట్లు చేయాలి. దానిలో ఒక ఆకర్షణ, అందం అంతర్లీనంగా వుండి తీరాలి. కవిత్వం కాని అక్షరాలు కవిత్వంగా నిప్రయోజనం.

మాట్లాడినపుడు కూడా కళ యొక్క ప్రభావం నిబిడీకృతమై ఉంది. కళకు ప్రభావం లేకుండా చేయటం అసంభవం. ఏ రకమైన కమ్యూనికేషన్ విధానంలోనైనా రీతికి ప్రాధాన్యత ఉంటుంది. దానినెవ్వరూ విచ్ఛిన్నం చేయలేరు. రీతిని విస్మరిస్తే నిర్జీవమైన కవిత్వం, నిర్జీవమైన ఇతర సాహితీ రూపాలు, నిర్జీవమైన ప్రసంగాలు మాత్రమే ఉంటవి. ఇళ్ళు ప్రజల కోసమే. కానీ ఇళ్ళు కట్టే రీతిలో నియమభంగం కాని రీతి ఒకటి ఉండాలి కదా! లేకపోతే అది కుప్పకూలి పోతుంది. కళ కూడా అంతే. అంచేత మానవసమాజానికి నీతి ఎంత ముఖ్యమో, రచనకు ముఖ్యంగా సృజనాత్మక రచనకు రీతి అంత ముఖ్యం.

పైనుదహరించిన వ్యాసంలోనే కాత్యాయనీ విద్మహే అంటారు: "కవిత్వం జీవితానికి వ్యాఖ్యానంగా ఉండాలని భావించే శ్రీ శ్రీ కవిత్వాన్ని సౌందర్యంతో ముడిపెట్టి చూసే దృష్టిని విమర్శకు పెట్టారు. అసౌందర్యం ఒక జీవిత వాస్తవం. అది అసలు లేదనుకోవడం భ్రమ అయినా కావాలిబీ ఆత్మవంచన/ పలాయనవాదం అయినా కావాలి. సౌందర్యారాధకుల అసౌందర్య వ్యతిరేకతను శ్రీశ్రీ నిరసించాడు. అసౌందర్యాన్ని సాహిత్య వస్తువుగా చేసుకుని దాని పట్ల అనహ్యం కలిగించేట్లు వ్రాస్తే - దాని నిర్మూలనకు ప్రేరణలు సమకూడి సత్యసుందరాత్మక ప్రపంచనిర్మాణానికి మార్గం సుగమం అవుతుంది కనుక అది గొప్ప సాహిత్యం అవుతుందని.." పేర్కొన్నారు. అసౌందర్యం జీవిత వాస్తవికత అయితే అసౌందర్య వ్యతిరేకత కూడా జీవిత వాస్తవమే. శ్రీశ్రీ దృష్టిలో ధ్యేయం 'సత్యసుందరాత్మక ప్రపంచనిర్మాణ'మని రూఢిగానే చెప్పినట్లయింది. ఈ నిర్మాణానికి మార్గంగా 'అసౌందర్యాన్ని సాహిత్యవస్తువు'గా చేసికొనడం బాగానే ఉంది. 'దానిపట్ల అసహ్యం కలిగించేట్లు వ్రాయాలనే సంకల్పం' కూడా బాగానే ఉంది.కానీ, అసౌందర్యం యడల అసహ్యతను కలిగించే విధంగా వ్రాయడమంటే అసహ్యంగా వ్రాయడం కాదు. దానిలోని అసౌందర్యతను అది అసహ్యించుకోవలసినదిగా స్థిరముద్ర పాఠకుని మనసుపై వేసేటట్లు వ్రాయడం. అంటే వినసొంపుగానే రాయాలి. అపుడే అది అసహ్యతను చూపించగలుగుతుంది.

ఎవరైనా అర్థం లేకుండా మాట్లాడారని మనం నిరూపించదలచుకుంటే మనం అర్థం లేకుండా మాట్లాడి నిరూపించలేం. మనం నిరూపించదలచుకున్న అర్థ రాహిత్యాన్ని పదిమంది నిరసించేలా చేయాలంటే మనం చాలా అర్థవంతంగా మాట్లాడి మాత్రమే చేయగలం. 'సత్యసుందరాత్మక ప్రపంచనిర్మాణం' శ్రీశ్రీ కోరుకుంటున్నారంటే ఆయన అసౌందర్య వ్యతిరేకతను

నిరసించినట్లు ఎలా అవుతుంది? ఆయన భావనలో గందరగోళం ఉంది. రచనా రీతిలో వైరుధ్యాలు ఉన్నాయి.

శ్రీశ్రీ ఈ విధమైన ఈస్తటిక్ ప్రభావాలకు లోనై కవితా సౌందర్య భావనలకు, సుందరాత్మక కవిత్వావిర్భావ తత్వానికి వ్యతిరేకంగా రియాక్షనరీగా తయారై తనలోని సహజమైన కవితాశక్తిని బలహీనపరచుకున్నారు. ఎక్కడో తన మనసులో ఒక చోట తనకు కవిగా ఎంతపేరు వచ్చిందో తనకు తెలుసు కాబట్టి ఇక తాను ఏమి వ్రాసినా కవిత్వంగా చెల్లుబాటవుతుందనే అపోహకు గురయ్యారు. పైపెచ్చు మార్క్సిస్ట్ భావనల అండ ఉండనే ఉంది. మార్క్సిస్ట్ భావనలు ఏ మాత్రం లేని కవితలలో కూడా ఒక నిర్లక్ష్య రచనా వైఖరి చాలాచోట్ల 'ఖడ్గసృష్టి'లో, 'మరోప్రస్థానం'లో కనిపిస్తవి. శ్రీ శ్రీ ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా రచనా సామర్థ్యం లేకుండా రచనా కండూతి ఉన్నవాండ్ల మీద పడి, దోపిడీనో, పెత్తందారీతనాన్నో నిరసిస్తూ, బూర్జువా లాంటి పడికట్టు పదాలను వాడుతూ, ఆకలి, అనారోగ్యం లాంటి వస్తువిశేషాల మీద ఇష్ట మొచ్చినట్లు వ్రాసి కవిత్వంగా చదువరులను భ్రమింప జేయాలనే తహతహలో ఒక వ్యర్థమైన వర్గం తయారయింది. దీనికి తోడు ఆయన పేరడీలు, ప్రాసక్రీడలు, లిమరిక్కుల జిమ్మిక్కులు తోడైనాయి. దీనినే వేటూరి, శ్రీశ్రీ మరణించినపుడు నివాళులర్పిస్తూ చేసిన రచన 'చిరంజీవి శ్రీ శ్రీ' (పునర్ముద్రణ ప్రజాసాహితి,జూన్ 2010)లో చూస్తాం: ''అతడి పేరడీ, ప్రాసక్రీడలు, లిమరిక్కులు, పలుకుల జిమ్మిక్కులు ఎందరినో కవులను జేసి కాగితాలను కొలుకిచ్చాయి.'' పైన పేర్కొన్నబడిన సామర్థ్యం, నిబద్ధత లేని వర్గం మీద వేటూరి ఈసడింపు ఈ వ్యాఖ్యలో స్పష్టంగా తెలుస్తుంది.

మహాప్రస్థానంలోని కవితలతో సరితూగగలిగిన కవితలు ఆయన ఇతర సంకలనాలలో చాలా అరుదుగా కనిపిస్తవి. నీరసమయిన రచనలు, శుష్కవచనప్రాయమైన కవితలు మాత్రమే 'ఖడ్గసృష్టి' 'మరోప్రస్థానం' సంకలనాలలో అత్యధికంగా కనిపిస్తవి. స్టేట్‌మెంట్స్ స్థాయిని దాటలేకపోయిన వాటిని ఎక్కువగా చూస్తాం. 'ఖడ్గసృష్టి'లో ఖడ్గసృష్టి, శరశ్చంద్రిక, విషాదాంధ్ర, సదసత్సంశయం, మహాసంకలనం ఈ కవితల శీర్షికలన్నీ ఎంత అందమైన సంస్కృతపదబంధాలో చూడండి. కానీ అన్నీ ప్రొజాయిక్ రచనలే.

శ్రీశ్రీ కవితాప్రస్థానం మహాప్రస్థానంగా జరిగింది, సాగింది మహాప్రస్థానం లోనే. డైడాక్టిసిజానికి చోటివ్వని సాంద్రమైన అనుభూతులు భూమికగా ఉన్న కవితలే మరువలేని కవితలుగా మిగిలిపోయేవి. మార్క్సిస్ట్ సిద్ధాంతం అబ్సెషన్ అయ్యాక శ్రీశ్రీ వ్రాసిన కవితలు అతి స్వల్పసంఖ్యలో ఏవో కొన్ని మినహాయించి హృదయాన్ని తాకలేనివి. దాదాపు రీడబిలిటీ కూడా లేనివి. తత్ఫలితంగా ఆయన కవితాప్రస్థానం అవరోహణ క్రమంలో దిగజారింది. పరిణామం విపరిమాణం అయింది. అయినా ఆయనకొచ్చిన లోటు లేదు. చాలా గొప్ప కవిగా ఆయనకు శాశ్వత స్థానం 'మహాప్రస్థానం' కల్పించడం జరగనే జరిగింది.

❖❖❖

మహాకవి "శ్రీశ్రీ" - మహాప్రస్థానం : కావ్య స్వరూపం - వస్తు పరిచయం

- రామకృష్ణ ఇడుకుల్ల, సహాయ ఆచార్యులు, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ కామర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, వాసవీ ఫౌండేషన్ ,ఉస్మానియా విశ్వవిద్యాలయం.

"మరో ప్రపంచం, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది! పదండి ముందుకు , పదండి త్రోసుకు! పోదాం పోదాం పైపైకి" అంటూ సాగిన మహా ప్రస్థానం నలభై గీతాల సంపుటి. శ్రీశ్రీ ఈ గీతాల సంపుటిని తన మిత్రుడు, అకాల మరణం పొందిన 'కొంపెల్ల జనార్ధన రావు' కోసం అంకితం ఇస్తూ వ్రాసిన మరొక గీతం కూడా ఇందులో ఉంది. తెలుగు కవిత్వంలో కొత్త శకాన్ని సృష్టించింది శ్రీశ్రీ మహా ప్రస్థానం.

వ్యక్తిత్వము వున్నవాడు / దాసుడు ఎవరికి కాడు / వ్యక్తిత్వము కోరువాడు / దాసునొకని చేసుకోడు / శిష్యుడు కాలేడెవనికి / గురువు ఎవ్వరికి కాడు / మనవంటివాడు సామాన్యుడు / మనవలె బ్రతికున్నవాడు / మనిషికి మనసిచ్చిన వాడు / మనందరికి నచ్చినవాడు / ఋషి అంతటివాడు కాడు / దేవుడు కానే కాదు / అందుకే మనవాడు / మనవలె బ్రతికున్నవాడు / ప్రజల సిరి యీ శ్రీశ్రీ / ప్రజాక్రోధశ్రీ యీ శ్రీశ్రీ " అని కాళోజి గారు ఈ "ఏ శ్రీ ఈ శ్రీశ్రీ" అనే కవిత ద్వారా శ్రీశ్రీ వరంగల్ విచ్చేసిన సందర్భంలో శ్రీశ్రీ యొక్క వ్యక్తిత్వాన్ని కొనియాడారు. దీని ద్వారా శ్రీశ్రీ వ్యక్తిత్వం ఎంత ఉన్నత మైనదో మనం అర్థం చేసుకోవచ్చు.

శ్రీశ్రీ 1910లో విశాఖపట్టణంలో పుట్టాడు. 1915లో బడి చదువు ప్రారంభించాడు. పదేళ్ళ వయసుకే కవిత్వ రచన పట్ల ఆసక్తి కలిగింది. తండ్రి ప్రోత్సాహంతో సంప్రదాయ చంధోజ్ఞాన సంపన్నుడయ్యాడు. పద్య రచనాభ్యాసం చేశాడు. అప్పటికి తెలుగు కవిత్వరంగాన్ని కాల్పనికోద్వేగంతో ఊపేస్తున్న కృష్ణశాస్త్రి, విశ్వనాథల ప్రభావంతో గీత పద్య రచన యందు ఉత్సాహం కలిగింది. కృష్ణపక్షం, గిరికుమారుని ప్రేమగీతాలు శ్రీశ్రీని ఆకర్షించిన కవిత్వ గ్రంథాలు. పురిపండా అప్పలస్వామి, వడ్డాది రామాంజనేయులు మొదలైన వాళ్ళు అతని కవిమిత్రులు. వారితో కలిసి విశాఖపట్టణంలో 'కవితా సమితి' స్థాపించాడు. 1928లో తన పద్దెనిమిదవ ఏట ప్రభవ కవితా సంపుటితో కవిగా తెలుగు సాహిత్య రంగంలోకి తారాజువ్వలాగా దూసుకుని వచ్చాడు శ్రీశ్రీ. ప్రకృతి ప్రశంస, ప్రకృతితో తాదాత్మ్యం ప్రణయం, విరహం వంటివి ప్రభవలకు వస్తువు.

శ్రీశ్రీ కాలేజి చదువు కొరకు మద్రాసు రావటంతో కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి, కొంపెల్ల జనార్ధనరావు మొదలైన సాహిత్య సాంస్కృతిక రంగ ప్రముఖులతో ముఖాముఖి సంబంధాలు ఏర్పడ్డాయి. వేమన కవిత్వం, గురజాడ మాత్రా ఛందస్సు, గిడుగు వ్యావహారిక భాషావాదం శ్రీశ్రీలో నూతన ప్రాపంచిక ఆలోచనల వికాసానికి దోహదం చేశాయి. సరిగా ఆ సమయానికే కమ్యూనిస్టు భావజాలం భారతదేశ కార్మికోద్యమాలను మాత్రమే కాక మధ్య తరగతి మేధావి వర్గపు ఆలోచనా విధానాన్ని కూడా ప్రభావితం చేస్తూ జాతీయోద్యమంలోకి ప్రవేశించింది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం వచ్చిన ఆర్థికమాంద్యం బీదల జీవితాన్ని మరింత దుర్భరం చేసింది. ఇవన్నీ చూస్తూ, వీటి ప్రభావాలకు లోనవుతూ ఒక సంవేదనా జీవిగా శ్రీశ్రీ పూర్వంలాగా ఉండలేకపోయాడు. సాహిత్యంలో కొత్త మార్గాల అన్వేషణకై తపన పడ్డాడు.

శ్రీశ్రీ 'భావ కవిత్వం నుండి అభ్యుదయ కవిత్వానికి' మారిన వైనం:

మద్రాసులో బి.ఎ. చదువు పూర్తి చేసుకుని విశాఖ పట్టణం తిరిగి వచ్చాడు. నిరుద్యోగిగా విశాఖలో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న శ్రీశ్రీకి అది తన ఒక్కడి సమస్యే కాదని, ప్రపంచ సమస్య అని అర్థం కావటానికి పుస్తక పఠనం ఎంతో ఉపకరించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్‌గా ఉన్న అబ్బూరి రామకృష్ణారావు శ్రీశ్రీని అందుకు ప్రోత్సహించాడు. శ్రీశ్రీ ఆలోచనలను కమ్యూనిజం వైపు మళ్ళించాడు. 'ప్రపంచాన్ని కుదిపేసిన పది రోజులు' వంటి పుస్తకాలెన్నో చదివి నూతన జీవిత దృక్పథానికి కళ్ళు తెరిచాడు శ్రీశ్రీ. 1935 లక్నోలో జరిగిన జాతీయ స్థాయి అభ్యుదయ రచయితల సమావేశానికి హాజరై వచ్చిన అబ్బూరి ద్వారా శ్రీశ్రీకి 'ప్రొగ్రెసివ్ రైటర్స్ మానిఫెస్టో' అందింది. రచయితకు ఉండవలసిన సాహిత్య నిబద్ధతను గురించిన అవగాహనను ఈ కరపత్రం నుండే పదునెక్కించుకున్నాడు శ్రీశ్రీ. అబ్బూరితో కలిసి ఈ మానిఫెస్టోను తెలుగులోకి అనువదించారు. ఆంధ్ర వర్ధమాన లేఖక సంఘాన్ని స్థాపించాడు. ఆ తరువాత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడటానికి కావలసిన భూమికను ఆ రకంగా సిద్ధం చేశాడు శ్రీశ్రీ. ఈ పరివర్తనా కాలంలోనే మహాప్రస్థాన గీతాల రచన జరిగింది.

శ్రీశ్రీ మహాప్రస్థాన కవితలు రాయడానికి దారితీసిన కారణాలు :

1930లలో స్పెయిన్ అంతర్యుద్ధంతో అంతర్జాతీయ కవితా ప్రపంచమే గొప్ప మార్పుకు లోనయింది. ఈ పోరాటానికి మద్ధతుగా రాల్ఫ్ ఫాక్స్, క్రిస్టోఫర్ కార్వెల్ వంటి రచయితలు కూడా యుద్ధంలోకి దిగిన గొప్ప చారిత్రక సందర్భం అది. అంతర్జాతీయ కవి ప్రపంచాన్ని ప్రభావితం చేసిన ఘటన, అదే విధంగా మొదటి ప్రపంచ యుద్ధానంతరం కలిగిన ఆర్థిక సంక్షోభం ఈ దశాబ్ది రచయితలను, కళాకారులను తీవ్రంగా కదిలించింది. ఈ ముప్పయ్యవ దశకాన్ని 'హంగ్రీ థర్టీస్' అంటారు. ఈ ఆకలి దశాబ్ది కవులుగా అనేక మంది ఆకలి లేని మరో ప్రపంచం గురించి కలలు కన్నారు. రష్యాలో అప్పటికి విజయవంతంగా స్థిరపడుతూ అభివృద్ధిపథంలో సాగుతున్న కమ్యూనిజమ్ పట్ల అభిమానాన్ని, ఆశను పెంచుకున్నారు. ఈ అంతర్జాతీయ పరిణామాల ప్రభావం నుండే శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాలు రచించాడు.

మహాప్రస్థానం - కావ్య స్వరూపం :

'మహాప్రస్థానంలోని నలభై గీతాలలో గర్జించు రష్యా, నిజంగానే, నీడలు వంటి మూడు నాలుగు రచనలు తప్ప మిగిలినవన్నీ 1930-40ల మధ్యకాలంలో రాసినవే. శ్రీశ్రీ తన జీవిత చరిత్రలో చాలా సందర్భాలలో 1930-40 సంవత్సరాల మధ్యకాలాన్ని మహాప్రస్థాన దశాబ్దంగా పేర్కొంటూ వచ్చాడు. 1930 నుండి 1940 వరకూ పదేళ్ళపాటు ప్రధానంగా 'భీభత్సాలను అనుభవాలతో వడబోస్తూ' జీవితాన్ని కవిత్వంలోకి తర్జుమా చేస్తూ, ఆవేశాలకు ఆకారాలు వెదుకుతూ సాగించిన మహా ప్రస్థానం ఫలితమే కవితలు అని కూడా చెప్పుకున్నాడు శ్రీశ్రీ.

మహాప్రస్థాన కవితలకు ప్రథమ శ్రోతలు అబ్బూరి రామకృష్ణారావు తదితర ఆప్తమిత్రులు. తరువాత సభలలో అశేష జనం. అబ్బూరి సాహచర్యంలో శ్రీశ్రీకి శ్రామిక వర్గ పక్షపాత దృష్టి పెరిగింది. కాకినాడ ఆంధ్రరాష్ట్ర యువజన సంఘం సభలో పాల్గొనేట్లు చేసింది. ఆ సభలోనే ఆయన మహాప్రస్థాన గేయాన్ని చదివాడు. శ్రీశ్రీకి దేశంలో రెక్కలు విప్పుకొంటున్న రివల్యూషనుకు బాంధవ్యం ఏర్పరచిన ఘటనగా దానిని కె.వి. రమణారెడ్డి అభివర్ణించాడు. అక్కడ నుండి శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాలు ఆనోటా ఈనోటా శ్రామికోద్యమాలతో కలగలసి విస్తరించాయి. దేశచరిత్రలు వంటి కవితలు ఎందరెందరో అనేక సభలలో గానం చేస్తూ వచ్చారు. అవి కష్టజీవులను కదిలించి ఉత్సాహోద్రేకాలను పంచాయి. పదేళ్ళ పాటు అవి అట్లా ఆంధ్రప్రదేశ్ సాహిత్య సాంస్కృతిక జీవిత పార్శ్వాలను కదిలిస్తూ ప్రచారం అయినాయి.

శ్రీశ్రీ మహాప్రస్థాన కవితలను సాహిత్య ప్రపంచంలో ప్రచారంలోకి తెచ్చినవాడు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి. చలం చేత చదివించింది, చలం చేత అభిప్రాయాన్ని వ్రాయించి పెట్టింది కూడా ఆయనే. 'యోగ్యతా పత్రం' అనే శీర్షికతో చలం వ్రాసిన అభిప్రాయం మహాప్రస్థాన గీతాలకు ముందు మాటగా అచ్చయింది. ఈ పుస్తక ప్రచురణకు నళినీకుమార్ అనే మిత్రుడు ఆర్థిక సహాయం చేశాడు. 'మహాప్రస్థానం మొదలైన గీతాలు' అనే కవరు పేజీ శీర్షికను ఆంధ్రపత్రిక ఆఫీసులో పని చేసే తేజోమూర్తులు కేశవరావు వ్రాసిపెట్టాడు. ఆ విధంగా పదేళ్ళ జీవిత మధనం నుండి వెలువడి మరో పదేళ్ళ ఎదురు చూపులు తరువాత 1950లో అక్షర సాహిత్య ప్రపంచంలోకి వచ్చింది. 'మహాప్రస్థానం' కావ్యం.

వస్తువులో, భావనలో, అభివ్యక్తిలో నవ్యతను సామాజిక ప్రయోజనం కొరకు సంభావించి సామ్యవాద తత్వాన్ని కవిత్వీకరించటానికి చక్కని ప్రాతిపదిక వేసింది మహా ప్రస్థానం. కుబేర వైభవం ఒక పక్క, కుచేల దారిద్ర్యం మరొక ప్రక్క ఉన్న సామాజిక జీవిత విషాదంలో తలమునకలైనప్పుడే కవిత్వం అగ్నిలో పుటం పెట్టబడిన లోహ స్వచ్ఛతను పొందుతుంది. అందుకే బాధ కవిత్వానికి పర్యాయపదమన్నాడు శ్రీశ్రీ. అటువంటి అసలైన కవిత్వం వ్రాయటానికి తరువాతి తరం వాళ్ళకి మహా ప్రస్థాన కవితల ద్వారా గొప్ప నమూనాలిచ్చాడు శ్రీశ్రీ.

మహాప్రస్థానం పరిచయం :

మహాప్రస్థానంలోని మొదటి గీతం మహాప్రస్థానం. చివరిది జగన్నాధుని రధ చక్రాలు. చాలా వరకు కవితలను ఒక పూటలో, ఒక సిట్టింగ్‌లో పూర్తి చేసే శ్రీశ్రీకి జగన్నాధుని రధచక్రాలు కవిత పూర్తి చేయటానికి చాలా కాలం తీసుకున్నది. మహాప్రస్థానం, జగన్నాధుని రధచక్రాలు మహా ప్రస్థానం కవితా సంపుటికి ఆద్యంతాలలో వుండాలనేది శ్రీశ్రీ సంకల్పమే. మహాప్రస్థానం 1934 ఏప్రిల్ 12న వ్రాసిందయితే జగన్నాధుని రధచక్రాలు ఆ తరువాత ఆరేళ్ళకు 1940లో పూర్తయింది. మహాప్రస్థాన కవితలలో కాలక్రమ వరుసలో మొదటిది జయభేరి. 1933 జూన్ 2న వ్రాయబడింది.

నేనుసైతం / ప్రపంచాగ్నికి / సమిధనొక్కటి ఆహుతి చ్చాను / నేను సైతం / విశ్వవృష్టికి / అశ్రువొక్కటి ధార పోశాను! / నేను సైతం / భువన ఘోషకు / వెర్రి గొంతుక విచ్చి మ్రోశాను

అని ప్రపంచ ప్రయోజనాల కొరకు తన క్రియను అనుభూతిని, గొంతును సమర్పించే ప్రక్రియలో భాగంగా మందిలో మనిషిగా పరివర్తన చెందటం ప్రారంభించాడు శ్రీశ్రీ. అంతర్జాతీయ మానవుడుగా పరిమాణం చెందటం దీని అంతిమ లక్ష్యం ఈ కవితలో 'నేను' అంతర్జాతీయ కార్మిక వర్గానికి ప్రతినిధి అన్న సూచన- ఎండకాలం మండినప్పుడు / గబ్బిలం వలె / క్రాగిపోలేదా? / వానకాలం ముసిరిరాగా / నిలువు నిలువున / నీరు కాలేదా? / శీతకాలం కోత పెట్టగ / కొరడు కట్టి / ఆకలేసే కేకలేశానే అనే కవితా పంక్తులలో ఉంది. ఎండకు ఎండి, వానకు తడిసి చలికి గడ్డకట్టి అన్ని కాలాలలోనూ ఆకలి వేసి కేకలేసిన వర్గపు వాడతను. తనను భాదించిన త్రికాలలతోనూ త్రికరణ శుద్ధిగా యుద్ధానికి తలపడ్డవాడు కూడా అతను.

నేనొక్కన్నే / నిలిచిపోతే / చంద్రగాడ్పులు, వాన మబ్బులు, మంచుసోనలు / భూమి మీదా / భగ్న మౌతాయి అన్న విశ్వాసంతో ఉన్నవాడు- ఈ యుద్ధం ఎందుకంటే ఆకలి లేని, అశాంతి లేని సమాజం కొరకు అసమానతలు లేని కొత్త సమాజంలోనే శాంతి స్థాపన సాధ్యమవుతుంది.

''నేను సైతం / ప్రపంచాబ్జపు / తెల్లరేకై పల్లవిస్తాను. అనటంలో వ్యక్తమయ్యే కవి ఆకాంక్ష అదే. ఒకరాత్రి అనే కవిత కూడా 1933లో వ్రాయబడినదే. గంటలు, ఆకాశదీపం, మహాప్రస్థానం అవతారం, ఋక్కులు, బాటసారి, ఐ, ఆశాదూతలు, శైశవగీతి, అవతలిగట్టు, సాహసి, కళారవి, భిక్షువర్షీయసి, ఒక క్షణంలో- మొత్తం 14 కవితలు 1934 ఫిబ్రవరి నుండి అక్టోబరు లోగా

వ్రాయబడ్డాయి. 1935లో వ్రాసిన కవితలు మూడు. పరాజితులు, ఆ:, ఉన్మాది. 1936లో వ్రాసిన కవితలు అద్వైతం, స్వీస్బర్న్ కవికి అనే రెండు. మళ్ళీ 1937లో వ్రాసిన కవితలు ఎక్కువ. ఏప్రిల్ ల్లో అభ్యుదయం కవితతో ప్రారంభించి.. వ్యత్యాసం, ప్రతిజ్ఞ, చేదుపాట, నవకవిత, కవితాఓకవితా, వాడు, మిధ్యావాది మొదలైన 8 కవితలు ఈ 1937లో వచ్చాయి. 1938లో వ్రాసిన కవితలు మూడు- అవి దేశచరిత్రలు, జ్వాలాతోరణం, మానవుడా- 1939లో వ్రాసినవి- కేక, సంధ్యాసమస్యలు, దేనికొరకు, పేదలు అన్న నాలుగు కవితలు. జగన్నాధుని రథ చక్రాలు ఒక్కటే 1940లో వ్రాసినది. నిజంగానే గర్జించు రష్యా అన్న రెండు కవితలు 41లో వ్రాసాడు. కొంపెల్ల జనార్ధనరావు కోసం వ్రాసిన అంకిత గీతం 1938లో వ్రాసినది.

మొత్తం మీద గమనిస్తే 1934లో వ్రాసిన కవితలు ఎక్కువ(14) మళ్ళీ 1937లో వ్రాసినవి ఎక్కువ(8) 1939లో వ్రాసినవి 4 కాగా 1938లోనూ రెండేసి కవితలు వచ్చాయి. 1940లో ఒకటి 1947లో మరొకటి వచ్చాయి. మహాప్రస్థానంలోని ఈ మొత్తం 40 కవితలలో అద్వైతం ఎసి స్నిన్బర్న్ వ్రాసిన ూా మీఘ్ఎఫ్ట్ గీతానికిఅనుకరణ. పేదలు అనే కవితలు Emile verhaeren (ఎమిలె వెరెహెరెన్) వ్రాసిన Lesparvres (లెస్ పావరెస్) అనే గీతానికి అనువాదం.

మహాప్రస్థానం - వస్తు పరిచయం :

వస్తు స్వభావాల రీత్యా మహాప్రస్థాన గీతాలను ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి 1. ఆత్మాశ్రయ కవితలు 2. కథాకవితలు 3. మానవ జీవన హేలను ప్రదర్శించిన కవితలు. 4. సామాజిక వ్యత్యాసాలను గురించిన కవితలు 5. తిరుగుబాటు కవితలు 6. కవితా తాత్విక కవితలు. నిజానికి ఈ వర్గీకరణ అధ్యయన సౌలభ్యం కొరకు చేసినదే కానీ ఇది ఇంతే అని గిరిగీసి చెప్పటానికి వీలులేదు. ఒక వర్గపు కవితలలో మరొక వర్గపు కవితావస్తు స్వభావపు ఛాయలు తరచు కనబడుతుంటాయి. ఏది ప్రముఖంగా ఉన్నది అన్న దానిని బట్టి ఈ విభాగం. ఈ అవగాహనతో మహాప్రస్థానంలోని కవిత్వ వస్తు స్వభావాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది.

ఆత్మాశ్రయ కవితలు :

నిజానికి ఆత్మాశ్రయ కవిత్వం అనేమాట కవిత్వ వస్తువుకు సంబంధించినది కాదు. కవితా వస్తువుతో కవి ఏర్పరుచుకున్న సంబంధానికి సంబంధించినది. కవికి వస్తువు ఎప్పుడూ భౌతిక వస్తు ప్రపంచమే. ఈ భౌతిక వస్తు ప్రపంచం తనలో కలిగించే ఉద్వేగానుభూతులే ఆ భౌతిక వస్తు ప్రపంచం వల్ల కేవలం తనకు కలిగే అనుభవం, అనుభూతి కారణంగా ఆ వస్తు ప్రపంచం కంటే తనను అభిన్నంగా భావించుకునే ఒకానొక తాదాత్మ్యస్థితిలో కవి చెప్పే కవిత్వం అత్మాశ్రయ కవిత్వం. వస్తు ప్రపంచానికి భిన్నంగా కొంచెం దూరంగా నిలబడిఆ వస్తు ప్రపంచం వల్ల తనలో కలిగే సంచలనాలను, జ్ఞాన చైతన్యాలను అనుభూతిని ఒక సహృదయ పరిశీలనా దృష్టితో కవిత్వీకరించటం అత్మాశ్రయ కవిత్వం కన్నా భిన్నమైనది. ఆత్మాశ్రయ కవిత్వంలో కవిత్వానికి వస్తువైన అంశం అభావమై ఆ వస్తువు కవిలో కలిగించే అనుభూతే సమస్తంగా ఉంటుంది. ఒక రాత్రి కవితను పరిశీలిద్దాం.

గగనమంతా నిండి / పొగలాగు క్రమ్మి / బహుళ పంచమి జ్యోత్స్న / భయపెట్టునన్ను

అని ప్రారంభమయ్యే ఈ కవితలో తరువాతి భాగాలు కవి భయాందోళన స్థితికి సంకేతాలతో ఉన్నాయి. ఆనాటి రేయి రేగిన ఇసుక తుఫాను కవి ఆలోచనాకాశంలోని సంక్షోభానికి గుర్తు. గాలిలో కనరాని గడుసుదయ్యాలు కవిని బాధించే సందేహాలు. ఆబాధ వల్ల ఎదలో కలిగిన హోరు సాగరపు హోరుతో సూచితమైంది. ఆందోళ నామయమైన ఆ రాత్రి ఎంతకూ గడవకపోవటాన్ని కరి కళేబేరములా కదలని కొండ అన్న భావన వ్యక్తం చేస్తుంది జాబిల్లి ఆకాశపుటెడారిలో కాళ్లుతెగిన ఒంటరి ఓడలా ఉంది. ఎడారిలో నడక కాళ్ళీడ్చుకుంటూ సాగించాల్సినది. ఈడ్చుకుంటూ నడవటం భారాన్ని, సమయం ఎక్కువ

తీసుకొనటాన్ని సూచిస్తుంది. ఈడ్చుకుని పోవటానికి కాళ్ళు అయినా లేని జాబిల్లి కదలటమే అసాధ్యం అంటే రాత్రి ఎంతకూ అయిపోయే స్థితి లేదు. అందువల్ల బహుళ పంచమి జ్యోత్స్న కూడా కవిని భయపెట్టేదే అయింది. కవి మనసులోని ఆందోళన, దిగులు, దు:ఖం, భయం మొదలైన వాటిని- ప్రకృతి గత వస్తు సంచయం ఎడారి, రాత్రి, గాలి, సముద్రం, జాబిల్లి, కొండ మొదలైన వానిలోకి పరివర్తింపజేసి చెప్పటంలో కవి. అనుభవ తీవ్రత, అనుభూతి సాంద్రత గొప్ప భావనాత్మక సౌందర్యంతో వ్యక్తమైంది.

'ఐ'నేను అన్నమాటకు ఇంగ్లీషు రూపం 'ఐ' అనేది సగర్వమైన అహం అభివ్యక్తి. ఒకరాత్రి కవితలో ఏ గిరులు, సాగరులు, సముద్రలు ప్రవాహాలను తనలోని భయాందోళనలకు ప్రతీకగా వ్యక్తం చేశాడో ఆ గిరులతో, సాగరాలతో. సముద్ర ప్రవాహాలతో సోదరత్వాన్ని ఆవాహన చేస్తూ వ్రాసిన కవిత ఐ. ప్రకృతి శక్తులకు భయపడే వాళ్ళు చేయగలిగింది ఏమీ లేదు. అది అర్థవంతమైన తరువాత ప్రకృతిని తనదిగా చేసుకుని తాను ప్రకృతితో మమేకమైతే తనకిక భయమనేదే ఉండదు. తనకు ఎదురూ ఉండదు. ఆ స్థాయికి చేరటాన్ని "నేనొక దుర్గం! / నాదొక స్వర్గం! / అనర్గళం అనితర సాధ్యం / నామార్గం' అన్న మాటలో వ్యక్తం చేశాడు కవి.

నిద్రకు వెలియై..! / నేనొంటరినై..! / నా గదిలోపల చీకటిలోపల నా గదిలో! /నా గదిలో! చీకటిలో అని ప్రారంభమయ్యే 'కేక' అనే కవిత ఒంటరిగా చీకటిలో ఒక సుదీర్ఘమైన రాత్రిని గడిపిన కవి అనుభవాన్ని తెలియజేస్తుంది. ఒక రాత్రి కవిత వలెనే ఈ కవిత కూడా నిస్సహాయ స్థితిలో ఉన్న మానవుని ఒంటరి భయానుభవాన్ని వ్యక్తీకరిస్తుంది. 'బ' దీనికి భిన్నమైనది. తనంత వాడింక లేదని ధైర్యాన్ని కూడగట్టుకుంటున్న స్థితికి సంబంధించినది. ఈ రెండు విరుద్ధ అనుభవాల అనుభూతుల సంఘర్షణ నుండే కవి స్థానంలోని మనిషి వ్యక్తిత్వం రాటు తేలేది. ఈ మూడు కవితలు ఉత్తమ పురుషలో రచించబడినాయి. అవతలిగట్టు, సాహసి, దేని కొరకు అన్న కవితలో కవి తనను తాను పరాయి వాడుగా చూచుకొనటం కనిపిస్తుంది.

ఇవేమిటి వింత భయాలు? / ఇంట్లో చీకటి! అని ప్రారంభమయ్యే కవితలో ఒక ప్రశ్న ఒక జవాబుతో కూడిన నాలుగు రెండ్ల కవితా పంక్తులున్నాయి. ప్రశ్న వేసిందీ జవాబు చెప్పిందీ రెండూ ఒక వ్యక్తే తనను తాను ప్రశ్న వేసుకొనటం. తాను వేసిన ప్రశ్నకు తానే జవాబు చెప్పటం - ఎచటికి పోతావీ రాత్రి / అవతలిగట్టుకు అన్న చివరి కవితాభాగంలో నిర్జీవమవుతున్న పాత వ్యవస్థలను, అధిగమించి అజ్ఞాన సముద్రాన్ని ఈది కొత్త వ్యవస్థలోకి కొత్త జ్ఞాన చైతన్యాలతో తనను తాను ఆవిష్కరించు కొనటానికి ఆరాటపడుతున్న జీవుని వేదన కనబడుతుంది. సాహసి కవితలో నిస్సహాయుడు, పిరికివాడు అవుతున్న మనిషికి మరొక ముఖం. నిస్సహాయుడైన మనిషి తనలోని సాహసిని సంబోధించటం ఈ కవితలోని అంశం.

ఎగిరించకు లోహ విహంగాలను / కదిలించకు సుప్తభుజంగాలను ప్రారంభమైన ఈ కవిత అంతా నిషేధరూపంలోనే సాగుతుంది.పలికించకు మౌన మృదంగాలను! కెరవించకు శాంత తరంగాలను! హృదయంలో దీపం పెట్టకు మంత్రనగరి సరిహద్దులు ముట్టకు అని ముగుస్తుంది. నిషేధించిన పనిని చేయటమే సాహస లక్షణం. నిషేధించినవన్నీ ఎదుటివాడి క్షేమం కొరకే నిషేధించినట్లుంటాయి. కానీ నిషేధం మనిషిని మౌనంలోకి. అశాంతిలోకి, చీకటిలోకి, హద్దుల లోకి నెట్టేస్తుంది. నిషేధాన్ని ధిక్కరించి మనిషి తాను పోగొట్టుకున్నవి పొందటంలోనే సాహసి అవటం జరుగు తుంది. దేనికొరకు కవిత వేళకాని వేళలలో / లేనిపోని వాంఛలతో / దారికాని దారులలో / కానరాని కాంక్షలతో / దేనికొరకు పదే పదే దేవులాడుతావ్? / ఆకలితో, అలసటతో పాకులాడుతావ్ /శ్రీనివాసరావ్ అని ప్రారంభం అవుతుంది. ఈ కవితలో కవి తనను తాను పరాయి వాడుగా చూచుకొని మధ్యమ పురుషలో సంబోధిస్తాడు.

ఆకలితో ఉన్న మనిషి, ఆకాంక్షలతో ఉన్నమనిషి, అన్వేషణలో కూడా ఉన్నాడు. దేని కొరకు ఆ అన్వేషణ? ఆకలిని జయించే మర్గాల కొరకు, ఆకలి లేని ప్రపంచాలను నిర్మించే కొరకు ఆ క్రమంలో జగమంతా నిదుర మనిగి / సద్దణగిన నడిరాతిరి తన నుండే కొత్త బోధను వినగలుగుతాడు. జగమంతా నిదురలో మునిగినప్పుడు మేల్కొన్నవాడే క్రాంతదర్శి. సాధారణ వ్యక్తి క్రాంతదర్శిగా మారే క్రమంలోని ఆరాటం, ఆవేదన, అనుభవ తీవ్రత, ఈ కవితకు వస్తువైంది.

ఈ ధోరణిలోని మరొక కవిత 'ఆ:'. ఇది మరీ చిన్న కవిత. ఇందులో కవి తన గురించి ప్రపంచం ఏమనుకుంటుందో అంచనా వేయటం ఉంది.

నిప్పులు చిమ్ముకుంటూ / నింగికి నేనెగిరిపోతే / నిబిడాశ్చర్యంతో వీరు / నెత్తురు కక్కుకుంటూ / నేలకు నేరాలి పోతే / నిర్దాక్షిణ్యంగా వీరే.. ఈ కవితలో కవి తన విజృంభణకు ఆశ్చర్యపడే ప్రపంచమే నిస్సహాయుడై తాను నేలరాలినప్పుడు నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తుందని చెప్పటంలో లోక ప్రవృత్తిని వ్యాఖ్యానించటం ఉంది. వ్యక్తి సంసిద్ధతను, కార్యాచరణను గురించి లోకానికి ఉండే విశ్వాసం సందిగ్ధం అనే రెండు భిన్నంశాలను ఏక కాలంలో చెప్పగలగటం ఈ కవితలోని విశిష్టత. జీన్ పాల్ సార్త్రె అస్తిత్వంలో ఉన్నాయని చెప్పిన మూడు దశలకు అ కవితలు ప్రాతినిధ్యం వహిస్తాయి, అస్తిత్వంలోని మొదటి దశ Being in it self అంటే తనలో తానుండటం, రెండవది Being for it self అంటే తన కొరకు తానుండటం- తాను తన నుండి విడివడి తనను తనకు బాహ్యంగా తన సమక్షాన నిలుపుకొనటం మూడు Being for others అంటే ఇతరులకు తానెలా ఉన్నాడో వుండాలో ఊహించుకుని అలా ఉండేందుకు ప్రయత్నించటం- ఒక రాత్రి ఐ, కేక కవితలు అస్తిత్వంలోని మొదటి దశకు, అవతలిగట్టు, సాహసి, దేనికొరకు అనే కవితలు మూడు అస్తిత్వంలోని రెండవ దశకు, చివరిది మూడవ దశకు చెందుతాయి.

కథా కవితలు :

ఆధునిక కవిత్వం చాలా వరకు భావాన్ని, ఆలోచనాంశాన్ని ఆశ్రయించుకుని ఉంటుంది. ఒక కొత్త చూపును ఆలోచనలతో నుడి తిప్పి అనుభూతిమయం చేసి ప్రపంచంలోకి వదలటం ఆధునిక కవిత లక్షణం. ఆ మేరకు దాని నిడివి కూడా చిన్నదిగానే ఉంటుంది. అయితే తక్కువ నిడివిలో వ్రాసి కవితాఖండికలోనే ఒక కథను వినిపించటం శ్రీశ్రీ ప్రత్యేకత. కథ అంటే పాత్రలు వాటి మధ్య సంబంధాలు, వాళ్ళ జీవితం, ఆ జీవితంలోని ఒక వైరుధ్యమో, వైచిత్రమో వ్యక్తం కావటం; ఆకాశదీపం, బాటసారి, భిక్షువర్షీయసి, ఉన్మాది అన్న నాలుగు కవితలు ఈ ధోరణి కవితలు.

గదిలో ఎవరూ లేరు / గదినిండా నిశ్శబ్దం / సాయంత్రం ఆరున్నర / గదిలోపల చినుకుల వలె చీకట్లు అని ప్రారంభమయ్యే ఆకాశ దీపం ఒక దురదృష్టజీవి దిక్కులేని చావును గురించి చెప్పింది. కథకు అవసరమైన వాతావరణ చిత్రణ వంటిది ఈ ప్రారంభంలో ఉంది. ఉదయం 'ఆరున్నరకు ఆ గదిలోనే ఆరిపోయిన' వ్యక్తి అతను. ఎవరికీ పట్టని మరణం అది. ఒకరి గురించి ఒకరు పట్టించుకోని యాంత్రిక నేపథ్యంలో ఒంటరి వేదనలు, ఒంటరి మరణాలు ఎంత విషాద భీభత్సంగా ఉంటాయో ఈ కవిత చెప్పింది. బాటసారి కవితలో బాటసారి / కూటికోసం, కూలికోసం / పట్టణంలో బ్రదుకు దామని / తల్లిమాటలు చెవిని పెట్టక / బయలుదేరిన' వాడు గ్రామ జీవితం భగ్నమై పనికొరకు బస్తీలకు వలస ప్రారంభించిన వారికి అతను ప్రతినిధి, ఆ బస్తీలో కూడా పనిదొరకక దిక్కక్కు తెన్నూ తెలియక దీనంగా హీనంగా బ్రతకటమో, చావటమో జరుగుతున్న స్థితిలో తమ వాళ్ళ జాడ తెలియక రక్త సంబంధీకులు అందోళన చెందటం ఈ దృశ్యాలతో కూడిన భీభత్స వాతావరణం ఈ కవిత నిండా పరుచుకుని ఉంది. బాటసారి కళేబరంతో / శీతావాయువు ఆడుకుంటోంది / పల్లెటూళ్ళో తల్లికేదో / పాడు కలలో పేగు కదిలింది అని ముగిసే ఈ కవిత

భూమితల్లితో సంబంధాలు కోల్పతున్న జనం వేతన కూలీలుగా మారే క్రమంలో తమ జీవితాలు నుండే పరాయీకరింపబడటాన్ని సూచించింది. పెట్టుబడిదారీ పారిశ్రామి నాగరికత మనుషులతోని జీవశక్తిని వాడుకుని ఇక శ్రమ చేయగల శక్తిలేని దశలో వాళ్ళని వదిలేస్తుంది. బిచ్చగాళ్ళుగా వాళ్లను మారుస్తుంది. లేకపోతే పిచ్చి వాళ్ళుగా అయినా చేస్తుంది. భిక్షువర్షీయసి కవితలో దారి పక్కచెట్టు కింద / ఆరిన కుంపటి విధాన / కూర్చున్న బిచ్చగత్తె అయిన ముసలిని గురించి చెప్పిన శ్రీశ్రీ ఉన్మాది కవితలో ''వీధికంతా వెక్కిరింతగా / ఊరికంతా దిష్టబొమ్మగా / తూము పక్కన ధూళిలోనే / తూలుతున్న కుర్రవాడి గురించి చెప్పాడు. జనాన్ని ఈ విధంగా అడుక్కుతినే వాళ్లుగా అనాధలుగా మార్చే వర్గ వ్యవస్థ స్వభావాన్ని, బాధ్యతను ఆ అవ్వే మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని - వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్ళిపోయింది. అన్న భిక్షువర్షీయసి కవిత ముగింపులోను ''వెర్రివాడా! కుర్రవాడా! క్షమిస్తావా? సహిస్తావా? బుద్ధిమంతులు నీకు చేసిన దురన్యాయాన్ని''అన్న ఉన్మాది. కవితా ముగింపు లోనూ శ్రీశ్రీ స్పష్టం చేశాడు.

మానవ జీవనహేలను ప్రదర్శించిన కవితలు :

మానవ జీవితంలో బాల్య యవ్వన దశలున్నాయి. అలాగే మానవ జీవిత మహా ఇతిహాసంలో అనేక అధ్యాయాలు, అనేక ముఖాలు, వైరుధ్యాలు ఉన్నాయి. శైశవగీతి బాల్యదశా విశేషాలను వస్తువుగా చేసుకున్న కవిత కాగా అద్వైతం స్త్రీ. పురుష యవ్వన దశా విలాసాన్ని వస్తువుగా చేసుకున్నది. మానవుడా, ఒక క్షణంలో కవితలు వైవిధ్య భరితమైన మానవ జీవన వైచిత్రిని పుటలు పుటలుగా మన ముందు విప్పి చూపుతాయి.

పాపం, పుణ్యం, ప్రపంచమార్గం / కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ / ఏమీ ఎరుగని పూవుల్లారా / అయిదారేడుల పాపల్లారా అని పసిపిల్లలను సంబోధిస్తూ శైశవగీతి ప్రారంభించాడు శ్రీశ్రీ. ప్రకృతిలో భాగమై, ప్రకృతే తమకొరకని ఆనందపడుతూ స్వచ్ఛంగా, స్వేచ్ఛగా ఉండే పిల్లలదే ఈ సమస్త విశ్వమని ప్రకటించాడు శ్రీశ్రీ ఋతువులన్నీ పిల్లల కొరకు వస్తూపోతూ దాగుడుమూతల క్రీడ లాడుతవి అని, చరాచర ప్రకృతి సంపదకంతా వారసులు పిల్లలేనని అనన్య మనోహరంగా వర్ణించాడు. కష్ట సుఖాలు, వ్యసనహసనాలు, భేద మోదాలు, మరణ జీవనాలు మొదలైన ద్వంద్వాలన్నీ జీవితం అనే నాణానికి రెండు ముఖాలు. ఆ ద్వంద్వాలన్నీ జీవితం అనే నాణానికి రెండుముఖాలు. ఆ ద్వంద్వాలకు ప్రతీకలుగా స్త్రీ పురుషు లను నిలిపాడు. పురుషుడు సుఖానికి, హసనానికి, జీవనానికి ప్రీతిక అయిన స్త్రీని ఉద్దేశించి మాట్లాడుతూ, ఆమె కొరకైన అన్వేషణలోని తపనను, మోహాన్ని వ్యక్తీకరించటమే కాక ఆమె కటాక్షిస్తే ప్రపంచమును పరి హసించే, భవిష్యమును పరిపాలించే శక్తి తమ ఇద్దరి కలయిక వల్ల సంభవిస్తుందంటాడు.

ఒక క్షణంలో కవిత స్మృతి రూపమైన జీవన జ్ఞానం యొక్క చలనవేగాన్ని పట్టి చూపిస్తుంది. ఒక క్షణంలో జ్ఞాపకం ఏడనో మరపులలో- మరపుల మడతలలో కనబడక ఉన్న ముఖాలను ముందు తెచ్చి పెడుతుంది. యుగయుగాల మానవ స్మృతులను మోసుకొచ్చే రథనాథం గుండెలలో మార్మోగి మనిషిని కదిలించే స్థితిని ఈ కవిత సూచించింది. 'ఇక మానవుడా' అనే కవిత మానవుడి పురాతనత్వాన్ని, సంకుచితత్వాన్ని, సమగ్రత్వాన్ని, బలాన్ని, బలహీనతను, స్వార్థాన్ని, త్యాగాన్ని, వ్యక్తి దృష్టిని, సమిష్టి స్వరూపాన్ని, పూర్ణత్వం వైపుకు ప్రయాణాన్ని విస్తృతమైన కాన్వాస్ మీద రూపు కట్టించింది. సుఖం, దు:ఖం, సౌందర్యం, వికారం, వీరత్వం, విహలత్వం మొదలైన అన్ని రకాలు ద్వంద్వాలతో సహజీవనం చేస్తూ, సంఘర్షిస్తూ, సర్వ వ్యాపకుడుగా, సర్వజ్ఞుడుగా, నిర్మాణ తత్పరుడుగా, జ్ఞాన స్వరూపుడుగా ఉన్న వైవిధ్య పూరిత మైన మానవుడి గురించిన కవిత ఇది. అనేక దేశాలలో, ప్రాంతాలలో వేరు వేరు వయసులతో, రంగులతో అనేక భాషలు మాట్లాడుతూ అనేక పనులు చేస్తూ ఉన్న మానవుడు, ఒకే రక్తం ప్రవహిస్తున్న మానవుడు అతను

ఆ మానవుడే నిరంతర అన్వేషణా శీలి, నిరంతర చింతనా శీలి, సంపదల సృష్టి కర్త, జ్ఞాన సంపదకు సృష్టి కర్త అహింసావాది. అన్యాయాన్ని భరించలేనివాడు. తిరగబడే వాడు. ప్రశ్నించేవాడు కూడా ఆ మానవుడే ఇట్లా మానవుడి విశ్వరూపాన్ని ప్రదర్శించిందీ కవిత.

సామాజిక వ్యత్యాసాలను గురించిన కవితలు :

మానవుడు ఒక్కడే అయినా ఆ మానవుడు నివసిస్తున్న సమాజం యొక్క పునాది లక్షణం వల్ల మానవుడికి మధ్య వ్యత్యాసాలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. అది ప్రధానంగా ఆర్థిక సంబంధమైనది. ఉన్నవాళ్లు, లేని వాళ్లు పీడించేవారు. పీడింపబడేవాళ్ళు, దోచుకునేవాళ్లు, దోపిడికి గురయ్యేవాళ్ళు అని రెండు భిన్న రూపాలను ఎత్తటంలో మానవుడు అనేకం అయి పరస్పరం సంఘర్షించే స్థితికి నెట్టబడుతున్నాడు. ఈ స్థితిని గురించిన కవితలు మహాప్రస్థానంలో ప్రధానమైనవి.

చేదుపాటలో శ్రీశ్రీ వెనుక దగా. ముందు దగా / కుడియెడమల దగా దగా!" అని మోసపూరిత సమాజ లక్షణాన్ని స్పష్టంగా పేర్కొన్నాడు. ఈ సమాజ లక్షణమే మనుషులను బానిసలుగా యాంత్రిక జీవనశైలిలో నడిచిపోయే గానుగలుగా, చివరకు జీవ చైతన్య లక్షణం కల్పోయే పీనుగులుగా మారుస్తున్నదని ఆందోళన పడ్డాడు. జీవఫలం చేదు. విషయం అయిందని ఆవేదన చెందాడు. దీనిని మార్చుకొనటానికి ప్రయత్నించని బ్రతుకులు అని క్రోధాన్ని ప్రకటించాడు.

సంధ్యా సమస్యలు కవితలో డబ్బు ఎక్కువై ఏ సినిమాకి వెళ్ళాలో, ఏది తినాలో తేల్చుకోలేని వాళ్ళదీ సమస్యే, అప్పులవాళ్ళకు బదులు చెప్పలేక బిడ్డల ఆకలి తీర్చలేక 'ఉరిపోసుకు చనిపోవడమో - సముద్రమున పడిపోవడమో' తేల్చుకోలేని సంసారిదీ సమస్యే. అయితే సమస్యల మధ్య వ్యత్యాసం డబ్బు ఉండటానికి లేకపోవ టానికి సంబంధించింది. సుఖభోగాలు ఎంపికకు వినోద విలాసాల ఎంపికకు, అవసరాలు తీర్చుకొనటానికే దిక్కులేని స్థితికి సంబంధించింది అని సమాజంలో విద్యార్థి ఉద్యోగ దిగువ మధ్య తరగతి సంసారుల జీవిత వ్యత్యాసాలను నెపంగా చూపి చెప్పాడు శ్రీశ్రీ.

సంధ్యాసమస్యలు కవితలోని సంసారులు కనీసా వసరాలు తీర్చలేక ఆత్మహత్యవైపుకు నెట్టబడుతున్న వాళ్ళు. అలాంటి సంసారులంతా పరాజితులే. జీవన సమరంలో అలసిపోయినవాళ్ళే, భౌతిక సామాజిక పరిస్థితు లలోని అసమజీవన విధానం వారిని ఆ స్థితికి తెచ్చింది. అలసిపోయిన వాళ్ళు నిలకడైన కలలు కనలేరు. చెదిరిన గుండెల వాళ్ళకు చుట్టూ చీకటే.విసిగిన ప్రాణులను ఆహ్వానించేది దుర్మార్గమైన మరణం ఆ విషయాన్ని చెప్పిన కవిత పరాజితులు. 'నీడలు' కవితలో శ్రీశ్రీ యుగ యుగాల దోపిడిని వాచ్యంగానే చెప్పాడు. పేదవాళ్ళ వాడలవైపు, పడిన బతుకు గోడలవైపు వేలు పెట్టి చూపించాడు

ఆర్థిక వ్యత్యాసాలు మనుషులను రెండువర్గాలుగా చీలుస్తున్న స్థితిని వ్యత్యానం కవితలో చక్కగా నిరూపించాడు. శ్రీశ్రీమీరు, మేము అని రెండు భాగాలుగా ఉంటుంది కవిత. సరిహద్దులు దొరకని సంధ్యలలో సంచారం చేసే అభాగ్యులకు ప్రతినిధిగా నిలబడి కవి 'వడ్డించిన విస్తరి వంటి జీవితాలు' కలవాళ్ళను సంబోధిస్తూ ఈ కవితను నడిపించాడు. వ్యత్యాసాలు సృష్టించింది. వాటిని కాపాడేది ఉన్న వర్గమేనని శ్రీశ్రీ- మంచిని గురించి / మర్యాద, ముప్పితం గురించి / నడతా, నాణ్యం, విలువల విషయం। / నిశ్చల నిశ్చితాలు మీవి / మీ కన్నుల చూపులు సరళరేఖలో / రేఖ చెదిరితే గొల్లుమని పోతారు / రేఖ కవతలి వారంతా నేరగాళ్ళు / రేఖను రక్షించటానికే / న్యాయస్థానాలు, రక్షకభట వర్గాలు / చెరసాలలు, ఉరికొయ్యలు అన్న కవితా పంక్తులలో స్పష్టం చేసాడు. వ్యత్యాసాల ప్రపంచంలో ఏమీలేని వాళ్ళకు ఉన్నదానిని బద్దలు కొట్టటమే కర్తవ్యమవుతుంది. 'మాకు గోడలు లేవు గోడలను పగులగొట్టటమే మాపని' అని లేనివాళ్ళ ప్రతినిధిగా పలికాడు కవి. అలజడి మా జీవితం / ఆందోళన మా ఊపిరి /తిరుగుబాటు

మావేదాంతం అని వాళ్ళ పక్షాన లేనివాళ్ళ కార్యక్రమమేదో కూడా ప్రకటించాడు.

ఉన్నవాళ్ళు పెట్టుబడిదారీవర్గం లేనివాళ్లు శ్రామిక వర్గం ఈ రెండు ప్రత్యర్థి వర్గాలలో చేరని మధ్యతరగతి వర్గం కర్షక విద్యార్థి మేధావి వర్గం ఈ రెండు వర్గాలలో ఎవరో ఒకరి పక్షం వహించాలి. ఎవరు ఎటువైపు చేరతారో శ్రీశ్రీ వ్యత్యాసాలు కవితలో సులువుగా చెప్పాడు. అభిప్రాయాలు మార్చుకుని సుఖాలు కామించే వాళ్ళు మాలోకి వస్తారు అని విరుద్ధ లక్షణాలను ఒకదగ్గర చెప్పి వర్గాల మధ్య ఉన్న వైరుధ్యాన్ని సూచించాడు. శ్రామిక వర్గం పక్షం వహించాలంటే బాధలు లక్ష్య పెట్టనివాళ్ళు కావాలి. వీళ్ళకు పూర్తిగా వ్యతిరేకులు సుఖాలు కామించేవాళ్ళు. వాళ్ళూ పెట్టుబడిదారీ వర్గం వైపే మొగ్గు చూపుతారు. వర్గ స్వభావాన్ని ఇంత చక్కగా చెప్పగలగటం శ్రీశ్రీకే సాధ్యమైంది.

వ్యత్యాసం కవితకు మరొక కోణం మిధ్యావాది. వ్యత్యాసం కవితలో 'మీరు' అని కవి చేత సంబోధించ బడిన ఉన్నవాళ్ళు వర్గం వైపుకు చేరిన సుఖాలు కామించేవాడి కోవలో వాడు మిధ్యావాది. కవి శ్రామిక వర్గంలో వాడుగా ఆ మిధ్యావాదిని విమర్శిస్తాడు. హేళన చేస్తాడు. మాయంటావా! అంతా మిధ్యంటావా! నా ముద్దుల వేదాంతీ! ఏమంటావు'' అని ప్రారంభమవు తుంది. ఈ కవిత. 'అంతా మిధ్య' అనే మాట లేనివాళ్ళ కళ్ళు కప్పటానికి, లేదా జ్ఞాన చైతన్యాలు వికసించకుండా అడ్డుకొనటానికి ఈ మాయాలక్షణం తెలిసినవాడు మిధ్యావాదిని గట్టిగా ఎదుర్కొంటాడు. జమీందారు రోల్సుకారు. మహారాజు మనీపర్సు, పాలికాపు నుదుటి చెమట కూలివాని గుండె చెరువు అన్నీ అంతా మిధ్య అనటం వాస్తవాలను కప్పి పుచ్చటమేనని, శ్రీశ్రీకి తెలుసు. మాయ, మిధ్య అనే మాటలు చెప్పి తమ పని తాము తమ దోపిడి తాము చేసుకుని పోయే వర్గాల కొమ్ముకాచే మిధ్యావాదిని ఏయ్ ఇదంతా మాయంటావా అని ధిక్కరించి అడగటంలోనే ఇది మాయ కాదు అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పటం కనిపిస్తుంది.

వాడు కవిత కూడా శ్రమ దోపిడి క్రమాన్ని, స్వభావాన్ని చెప్పినదే. ఈ కవితలో వాడు అన్న సర్వనామం పెట్టుబడిదారీ వర్గాన్ని సంబోధిస్తుంది. అందరు కలిసి సృష్టించిన సంపదను ఏ ఒక్కడో అంతా తనదేననటం దోపిడి క్రమంలో మొదటి స్థితి. సంపద సృష్టించిన వాళ్ళు ఇలా సంపదను ఒక్కడే దక్కించుకొనటాన్ని అన్యాయమని అంటారు. 'అనుభవించాలి మీ కర్మం అని దోపిడిదారులు కర్మ సిద్ధాంతం చెప్పి వాళ్ళ నోరు మూయించే ప్రయత్నం చేస్తాడు. పొద్దు పొడిచిన దగ్గర నుండి పొద్దుగ్రుంకే దాకా శ్రమ చేసినా ముద్దకు కూడా నోచుకోని జనం తమపై జరుగుతున్న శ్రమదోపిడిని గుర్తించి ఇది దారుణమంటే దోపిడిదారు ఆచారం పేరు చెప్పి యధాతథ స్థితిని కొనసాగించాలంటాడు. ఇది రెండవది.చేసిన శ్రమకు సృష్టించిన సంపదకు పరాయివాళ్ళు జీవనమే గడవని దుర్భర పరిస్థితులలో ఉన్న శ్రామికులు పనిముట్లు క్రింద పడేసి శ్రమకు తగిన విలువ కట్టాలని సమ్మెకు దిగితే దోపిడిదారు ''నోరు మూసి, జోడు తీసికొట్టి- దౌర్జన్యానికి దౌర్జన్యం మందం టాడు. ఇది పరిణామం- నిజానికి శ్రమ సంపదలను దోచుకునే ప్రక్రియ అంతా దౌర్జన్యపూరితమైనదే. కర్మ సిద్ధాంతం పేరు మీద, ఆచారం పేరు మీద అణచి ఉండే సంస్కృతిలోనూ దౌర్జన్యం ఉంది. అయితే దౌర్జన్యాన్ని ప్రశ్నించటమే దౌర్జన్యంగా చెప్పబడటం, ఆ పేరు మీద శ్రామికులపై దౌర్జన్యానికి న్యాయ సంబంధతను సమకూర్చుకొనటం అధికార రాజకీయాల లోని అసలు సూత్రం. ఆ సూత్రాన్ని సులభమాత్రంగా నిరూపించింది వాడు కవిత సామాజిక వ్యత్యాసాల తీవ్రతను ఇది ఎత్తి చూపింది.

తిరుగుబాటు కవితలు :

దోపిడిని అంతం చేసి వ్యత్యాసాల సమాజాన్ని సమసమాజంగా మార్చటానికి తిరుగుబాటు తప్పనిసరి అవతారం, జ్వాలాతోరణం వంటి కవితలు ఈ తిరుగు బాటునే వస్తువుగా చేసుకుని వచ్చాయి. అవతారం కవితలో

దేవలోకపు వాహనాలన్నీ తామిన్నాళ్ళు మోస్తున్న బరువును ఇకపై మోయమని తిరగబడ్డాయి. యముని మహిషం, నరలోకపు జాగిలమ్ములు, ఉదయ సూర్యుని సప్తహయములు. కనకదుర్గాచండ సింహం, ఇంద్రదేవుని మదపుటేనుగు, ఈశ్వరుని నందికేశుడు, ఆది నూకరం పనిభారమే గౌరవంగా ఇన్నాళ్ళూ ఏ ప్రశ్నా, ధిక్కారం లేని జీవితాలు జీవించిన శక్తులన్నీ తిరగబడటం అసాధ్యమైన శక్తులన్నీ, తిరగబడ్డట్లు చెప్పటం ద్వారా ఇన్నాళ్ళు బానిస బ్రతుకులు బ్రతికిన వున్న వాళ్ళందరి బరువును తామే మోస్తున్న వర్గాల తిరుగుబాటు అనివార్యతను సూచించాడు. శ్రీశ్రీ బానిసలుగా వొంగి వొంగి పడివున్న వాళ్ళు కొత్త చైతన్యంతో స్వేచ్ఛ కోసం ప్రయత్నించటం అంటే కొత్త అవతారం ఎత్తటమే. దానినే శ్రీశ్రీ పుడమి తల్లికి పురిటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురించాయి' అన్న ముగింపు ద్వారా సూచించాడు.

బానిసలు, శ్రామికులు తామిక పూర్వంలాగా దోపిడికి పీడనకు తలవంచము అన్న స్థిర సంకల్పంతో మనుషులతో కొత్త అవతారమెత్తటాన్ని జ్వాలాతోరణం, కవిత కూడా సూచించింది. 'పుడమికి నేడే పుట్టిన రోజుట' అన్న వాక్యంతో ముగుస్తుంది. ఈ కవిత పుడమికి పుట్టిన రోజు ఏమిటి?- 'అనాధజీవుల సమాధులన్నీ అఘోరించి ఘోషించాయి'-కనుక. సమాజంలో లేనివాళ్ళు, శ్రమ దోపడికి గురి అవుతున్న వాళ్ళు ఇన్నాళ్ళుగా దిక్కులేని వాళ్ళయి మరణాలకు చేరువ అవుతున్నారు. సమాధులలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కానీ ఇప్పుడలా కాదు. సమాధులను బద్దలు కొట్టుకుని పునరుజ్జీవిస్తున్నారు. తమకు కావలసిన దానిని గురించి గట్టిగా నిలబడి అడగగలగటమే కార్మిక వర్గ పునరుజ్జీవన స్థితిని తెలిపే అంశం. పునరుజ్జీవించిన కార్మిక శక్తి భీమశక్తి అయి విజృంభించటాన్ని- కురుక్షేత్రమున క్రుద్ధవృకోదరు / గదా ఘాతమున గజగజలాడగ / జాతి జాతి నిర్ఘాత పాత సం / ఘాత హేతువై, కాలకేతువై / అది సంవర్తపు తుఫాను మేఘం / తొలి గర్జించిన తూర్య విరావం అన్న కవితా పంక్తులలో సూచించాడు శ్రీశ్రీ. కార్మిక వర్గం ఈ విధంగా యుద్ధ ప్రకటన చేయటం వల్ల కొత్త ప్రపంచ పరిణామాలకు వేదిక సిద్ధమవుతున్నది. కనుకనే అది పుడమికి పుట్టిన రోజవుతున్నది.

మార్పు సులభమార్గాన సుఖప్రదంగా వచ్చేది కాదు. కొత్త సృష్టి ఎప్పుడూ హింసతో, రక్తపాతంతోనే ఉంటుంది. భూమిని చీల్చుకుని విత్తురావటం దగ్గర నుండి తల్లి గర్భాన్ని చీల్చుకుని శిశువు బయట పడటం వరకు అన్ని స్థాయిలలోను, ఏదో ఒక మోతాదులో హింస ఉంటుంది. హింస నుండి అభ్యుదయం పొడచూపుతుంది. "ఏదో! ఏవేవో, ఏవేవో! ఘోషలు వినబడుతున్నాయ్! గుండెలు విడిపోతున్నాయ్" అని ప్రారంభమయ్యే అభ్యుదయం అనే కవిత ఆర్తుల దు:ఖాన్ని, భయాన్ని, ఉద్రేకాన్ని చెప్పి వీటి నుండి బయటపడటానికి వాళ్ళు యోధులుగా జీవితంతో తలపటానికి సిద్ధమవుతున్న విషయాన్ని కూడా చెప్పింది. అప్పుడు మాత్రమే 'నరజాతికి పరివర్తన నవ జీవన శుభసమయం అభ్యుదయం' అని మంగళాశాసనం కూడా చేయబడింది ఈ కవితలో.

అభ్యుదయాన్ని ఆచరణ వాస్తవం చేయటానికి చైతన్యవంతమైన కొత్త సమాజం కావాలి నాయకులంటే క్రాంతదర్శులు. కొత్త సమాజం గురించి కలలు కనే వాళ్ళు. రాజ్యాన్ని ప్రశ్నించేవాళ్లు. భావాలను, తిరుగుబాటు భావాలను అగ్నివలె ప్రజ్వలింప చేసేవాళ్ళు. ఇళ్ళు వదిలి ఆకాశమే హద్దుగా విస్తరించేవాళ్ళు. ఎరుపు రంగు అలంకారాలతో సాగిపోయేవారు. అలాంటి నాయకులను శ్రీశ్రీ 'అశాదూతలు' అన్నాడు. వాళ్లు ప్రారంభించిన ప్రస్థానాన్ని గొప్పగా వర్ణించాడు అశాదూతలు కవితలో.

కవితా తాత్విక కవితలు :

కవిత్వాన్ని గురించి కవిత్వం వ్రాయని కవి ఉండడు. పూర్వ కవులు అవతారికలలో తమ కవిత్వ లక్షణాలను, లక్ష్యాలను ప్రకటించుకొనటం అందరికీ తెలిసిందే. ఆధునిక కవులు కవిత్వం గురించి తమ దృక్పథాన్ని వ్యక్తం చేస్తూ కవితలే వ్రాశారు. శ్రీశ్రీ ఒక చారిత్రక సందర్భం

నుండి కవిగా మొనదేలిన వాడే కనుక తాను కవిత్వం ఎవరికొరకు, ఎందుకొరకు వ్రాస్తున్నాననే కీలకమైన ప్రశ్నలకు జవాబు చెప్పుకొనవలసిన వాడైనాడు. సంప్రదాయ భావ కవిత్వ వారసత్వం నుండి తనను తాను విడదీసుకుని అభ్యుదయ కవితా ప్రస్థానాన్ని ప్రారంభించిన క్రమంలో కావ్య వస్తువును, కావ్య ప్రయోజనాన్ని నిర్దేశిస్తూ కవితలు వ్రాశాడు. అటువంటి కవితలు మహాప్రస్థానంలో ఆరు ఉన్నాయి.

ఋక్కులు - కుక్కపిల్లా / అగ్గిపుల్లా / సబ్బుబిళ్ళ / హీనంగా చూడకుదేన్నీ / కవితామయమేనోయ్ అన్నీ అని ప్రారంభమవుతుంది. ఈ మూడింటితో పాటు రొట్టెముక్క అరటి తొక్క బల్ల చెక్క, తలుపుగొళ్ళెం, హారతి పళ్ళెం, గుర్రపు కళ్ళెం- కూడా కవితా వస్తువులు కావచ్చునని ప్రకటించాడు. వస్తువు కన్నా దాని వెనుక ఉండే జీవిత నేపథ్యం లోతు తెలియటం ముఖ్యమని చెప్పటమే కాక అన్నిటికన్నా శిల్పం గొప్పది అని ప్రతిపాదించాడు. పరమ సామాన్యమైన వస్తువుల నుండి కూడా కవిత్వం రాబట్టవచ్చునని చెప్పటంలో శ్రీశ్రీ మీద కాల్పనిక వాద ప్రభావమే పని చేసిందని కె.వి.రమణారెడ్డి అంటారు. సంపన్న వర్గపు శిష్టసాహిత్య ధోరణికి వ్యతిరేకంగా అతి సామాన్యాంశాలకు కూడా సాహిత్య గౌరవం కల్పించటం కాల్పనిక వాదంలోని అంశం. దీనిని స్వీకరించి చెప్పటం ద్వారా శ్రీశ్రీ తరువాతి కాలంలో సామాన్యుడిని, శ్రామికుడిని సాహిత్య నాయకుడిగా చేయటానికి రంగం సిద్ధం చేసినట్లయింది.

కళారవి కవిత కళా ప్రపంచాన్ని కలయ తిరుగుతూ వెలుగును వేడిమిని పంచే కవిని సంబోధిస్తూ వ్రాసినది కవిని 'ఏవీ' అని సంబోధించి కవి వాక్కుకు వజ్రాయుధపు పదును ఉంటుందని కవిత చివరలో ధ్వనింపచేశారు. కవిత్వానికి ఉండే ఆ పదునే కవికి కావలసినవాళ్ళను దూరం చేయవచ్చు. ఎవరెవరి కోపానికో గురి చేయవచ్చు. స్వీన్‌బర్న్ కవిపై తనకున్న ఆకర్షణను, ఆరాధనను చెప్పుకొనటానికి 'స్వీన్‌బర్న్ కవికి' అనే కవిత రాశాడు.

శ్రీశ్రీ కవితా దృక్పథం శ్రామిక వర్గ పక్షపాత దృక్పథంగా పదునెక్కి ప్రస్ఫుటం కావటం మరింత స్పష్టంగా కవితా ఓ కవితా, ప్రతిజ్ఞ, నవ కవిత అన్న మూడు కవితలలో కనబడుతుంది. ఈ మూడు కవితలు 1937లో రాసినవి. కవితా ఓ కవితా! కవిత్వాన్ని అన్వేషిస్తూ ఒక ఉద్వేగంతో ఊపుతో వ్రాసిన కవిత.

కవితా! ఓ కవితా / నాయువకాశల సుమగీతా వరణంలో / నినునేనొక సుముహూర్తంలో / అతి సుందర సున్యందన మందున / దూరంగా వినువీధుల్లో విహరించే /అందని అందనివిగా / భావించిన రోజులలో.... అని ప్రారంభమయ్యేలా ఈ కవితలో శ్రీశ్రీ కవితే తన బ్రతుకనుకుని కవితా రూపానికై అన్వేషిస్తూ అది కనబడక పడిన ఆవేదనను వ్యక్తీకరించటం మొదటి భాగంకవిత్వం కొరకు 'చిరదీక్షా శిక్షాతపస్సు' చేసాడు. సమస్త ప్రపంచ చైతన్య శక్తుల నుండి తన గీతం ప్రాణ స్పందన పొందటాన్ని కవి అనుభవంలో గుర్తించాడు. కవిత్వ విశ్వరూపం అతనికి సాక్షాత్కరించింది. కవిత్వాన్ని స్మరిస్తే కళ్ళముందు కనిపించే దృశ్యాల పరంపరను చెప్పటం ఈ కవితలో రెండవభాగం.

"నడిరేనిద్దురలో / అపుడే ప్రసవించిన శిశువు నెడద నిడుకుని /రుచిర స్వప్నాలను కాంచే / జవరాలి మన: ప్రపంచపు టావర్తాలు దగ్గర ప్రారంభించి నిద్రలో శిశువు అనుభవంలోకి వచ్చే ప్రాచీన స్మృతులు, జబ్బుపడ్డవాళ్ళ రక్తనాళ స్పందన, కాలవ నీళ్ళల్లో జారిపడ్డ తాగుబోతువాడి వినిపించి వినిపించని మాటలు, ఆకలి తీర్చుకోవటానికి వేశ్య అయిన స్త్రీ కళ్ళల్లోని బాధల పాటల పల్లవి, ఉరి తీయబడ్డ శిరస్సు, ఉన్మాది మనస్సు చెప్పిన రహస్యాలు, సమ్మె కట్టిన కూలీలు, కూలీల భార్యల బిడ్డల ఆకలి కేకలు- అన్నీ వినబడ్డాయి కవికి. కవి చూచిన విస్తృత వైవిధ్య పూరిత సామాజిక మానవ సంబంధాలు ఇవి. వీటినే ఆయన కవిత్వంగా చెప్పదలిచాడు. తన రచనలలో లోకం ప్రతిఫలించాలని సంకల్పించాడు. లోకంలో కవి చూచిన దృశ్యాలుగా చెప్పబడినవన్నీ దు:ఖానికి.

దైన్యానికి, పీడనకు సంబంధించినవే. వీటిని కవితా వస్తువుగా చేయాలనుకొనటంలోనే సామాజిక విషాదం వైపు అందరి ఆలోచనను మళ్ళించాలనే ఆకాంక్ష. బలవంతపు మరణాలు, ఆర్థిక లైంగిక పీడనలు, ఆకలి లేని కొత్త ప్రపంచాన్ని సృష్టించుకొనాలనే ఆశ కనబడ తాయి.

''నా గీతం గుండెలలో మరి / నా జాతి జనులు పాడుకొనే / మంత్రంగా మ్రోగించాలని / నా ఆకాశాలను / లోకానికి చేరువగా / నా ఆదర్శాలను / సోదరులంతా పంచుకునే / వెలుగుల రవ్వల జడిగా'' చేయాలనే కవి సంకల్పంలో ఆ ఆకాంక్ష, ఆ ఆశలే సంకేతించబడ్డాయి. ప్రతిజ్ఞ కవితలో శ్రీశ్రీ పూర్తిగా శ్రామిక వర్గ పక్షపాత దృష్టి గల కవిగాదర్శనమిస్తాడు. పొలాలనన్నీ / హలాల దున్నీ / ఇలాతలంలో హేమం పిండగ / బలం ధరిత్రికి బలికావించే / కర్షక వీరుల కాయం నిండా / కాలువ కట్టే ఘర్మ జలానికి ఖరీదు లేదని- కర్షకుల శ్రమకు తగిన విలువ కట్టబడటం లేదని సూచించాడు. నరాల బిగువూ / కరాల సత్తువ / వరాల వర్షం కురిపించాని / ధనిక స్వామికి దాస్యం చేసే / యంత్ర భూతముల కోరలు తోమే /కార్మిక ధీరుల- ''శ్రమకు తగిన విలువ కట్టే సామాజిక న్యాయమే కొరవడిందని వేదన పడతాడు. అయితే ''కష్టం చాలక కడుపుమంటచే తెగించి సమ్మెలు కట్టేవాళ్ళూ / శ్రమనిష్పలమై / జననిష్ఠురమై / నూతిని గోతిని వెతికేవాళ్ళూ అందరూ దీర్ఘశ్రుతితో తీవ్రధ్వనితో విప్లవ శంఖం వినిపించటం అనివార్యమవుతుందని ప్రకటించాడు. అనాధలు, అభాగ్యులు, అశాంతులు అనేకమంది అవుతున్నపుడు వాళ్ళందరూ జీవితం కొరకు ఏమి చేస్తారో కవి వాళ్ళ తరువాతి చర్యను వాస్తవ చారిత్రక జీవితానుభవం నుండి ఊహించి చెప్పాడు. ఇక్కడి వరకు ఈ కవితలో ఒక భాగం- శ్రమ దోపిడికి గురవుతూ జీవన భద్రతే కొరవడుతూ ఉన్న వర్గం సంఘటితమవుతూ విప్లవకర వర్గంగా రూపొందుతున్న చారిత్రక సందర్భంలో కవి తన పాత్రను నిర్దేశించుకొనట ప్రతిజ్ఞ కవితలో రెండవ భాగం కావున - ''లోకపుటన్యాయాలూ / కాల్చే ఆకలి, కూల్చే వేదన / దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ / పరిష్కరించే, బహిష్కరించే / బాటలు తీస్తూ / పాటలు వ్రాస్తూ - కవి ముందుకు సాగాలని ఆకాంక్షించాడు. శ్రీశ్రీ కవిత్వం ''కార్మిక లోపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి'' అని స్పష్టంగా ప్రకటించాడు. ''శ్రమైక జీవన సుందర్యానికి సమానమైనది లేనే లేదని నిశ్చయ బుద్ధితో చెప్పిన శ్రీశ్రీ సాహిత్య సౌందర్యం శ్రమజీవన వైచిత్రిని చిత్రించటం పైనా, వ్యథార్తజీవిత యథార్థ దృశ్యాలను పునాదిగా చేసి సృజన వ్యాపారం చేయటం పైనా ఆధారపడి ఉంటుందని కొత్త సాహిత్య సౌందర్య సూత్రాన్ని ప్రతి పాదించాడు.

కమ్మరి కొలిమీ / కుమ్మరి చక్రం / జాలరి మగ్గం / సాలెల మగ్గం / శరీర కష్టం స్ఫురింపజేసే / గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి / సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు- తను వినిపించే నవీన గీతికి విరచించే నవీన రీతికి భావం భాగ్యం, ప్రాణం, ప్రణవం అని ప్రకటించాడు. శ్రీశ్రీ ఉత్పత్తి సాధనాలకు సాహిత్య సృజనలో అనితర ప్రాధాన్యతను కల్పించి ఆ సాధనాలను వాడుతూ పనిచేసే శ్రామికులు, వాళ్ళ జీవితం మాత్రమే కవి శక్తికి ప్రేరకమని, కవితాశక్తికి ప్రాణమని నిర్ద్వంద్వంగా పేర్కొన్నాడు.

విప్లవానికి సంకేతమైన 'ఎరుపును చూపించగల సింధూరం, రక్తచందనం, సంధ్యారాగం మొదలైన వస్తు జాలాన్ని, విప్లవకర శక్తులుగా సంఘటితం కావలసిన కార్మిక వర్గాన్ని సూచించగల ఘాటెక్కిన గంధకధూమం, పోటెత్తిన సప్త సముద్రాలు మొదలైన వాతావరణ సూచక పదబంధాలను 'నవకవిత' మొదటి మూడు భాగాలలో ఉపయోగించిన శ్రీశ్రీ కొత్త కవిత్వ వస్తువు, విప్లవం, విప్లవకర శక్తులుగా ఎదుగుతున్న కార్మిక వర్గం అని స్పష్టం చేసాడు.

''కదిలేదీ కదిలించేదీ / మారేదీ మార్పించేదీ / పాడేదీ పాడించేదీ / పెనునిద్దుర వదిలించేదీ / మునుముందుకు

సాగించేదీ / పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ / కావాలోయ్ నవకవ నానికి- అనే చివరి భాగంలో చలనంలో ఉంటూ చలనా నికి కారణమయ్యే జీవితాంశమే సమగ్ర జీవిత నిర్మాణానికి కారణమవుతుందని కొత్త కవిత్వానికి కావలసిన కొత్త శక్తి అని ప్రకటించాడు. ప్రతిజ్ఞ కవితలో 'నాలో కదిలే నవ్య కవిత్వం', 'నా వినిపించే నవీన గీతి', నా విరచించే నవీన రీతి'- అనే మూడంశాలను పేర్కొన్న శ్రీశ్రీ వాటి స్వభావాన్ని నవకవితలోని ఈ చివరి భాగంలో నిరూ పించాడు.

ఇంత వైవిధ్యభరితమైన మహాప్రస్థాన గీతాలు సర్వమానవ లోక చరిత్రకు చెందిన విశాల ధోరణులను స్పృశించాయి. కానీ నిర్దిష్ట చారిత్రక సందర్భాలను ఎక్కడా ప్రస్తావించలేదు. సమ్మెకట్టిన కూలీల ప్రస్తావన, వాళ్ళ కుటుంబాల ప్రస్తావన వచ్చిన కవితలు ఉన్నాయి. కానీ అవి ఏ దేశంలో ఏ ప్రాంతములో జరిగిన సమ్మెలో సూచించలేదు. 'గర్జించు రష్యా' కవిత మాత్రం ఇందుకు మినహాయింపు. ద్వితీయ ప్రపంచ యుద్ధం మొదలై నప్పుడు ఫాసిస్టు మూకల విజృంభణను ఎదుర్కొనటానికి రష్యా యుద్ధంలోకి దిగినప్పుడు ప్రజాస్వామిక శక్తులకు అభయముద్ర ఇస్తూ రష్యా పురోగమించాలని ఆకాంక్షిస్తూ శ్రీశ్రీ ఈ కవిత రాసాడు. 'అనంత ప్రపంచం అంతటా నీవై, నీ గొడుగు నీడల్ని గర్జించు రష్యా' అని సోషలిస్టు తరహా రాజ్య నిర్మాణానికి రష్యాను ఒక ఆదర్శ నమూనాగా సంభావిస్తూ శ్రీశ్రీ ఈ కవిత రాసాడు. అసమానతలకు వ్యతిరేకంగా శ్రీశ్రీ ప్రారంభించిన కవితా ప్రస్థానం అసమానతలు లేని సోషలిస్టు రాజ్య నిర్మాణం వైపుకు ఆశగా సాగటం గమనించవచ్చు.

ముగింపు పలుకులు :

వచ్చేశాయ్, విచ్చేశాయ్ / జగన్నాథ, జగన్నాథ, జగన్నాథ రథచక్రాల్ / జగన్నాథుని రథ చక్రాల్ / రథ చక్రాల్, రథ చక్రాల్ / రథ చక్రాల్, రథ చక్రాల్ / రారండో! రండో రండి! / ఈ లోకం మీదేనండి! / మీ రాజ్యం మీరేలండి! అంటూ నవయుగ కవితకు శ్రీకారం చుట్టిన కవి శ్రీరంగం శ్రీనివాసరావుగారు. ఛందోబందోబస్తుల్ని ఛేదించే ముందు వాటిపై, మాటపై తన పలుకుబడిని నిరూపించి, ప్రభుత్వం స్థాపించి, అదీ ఇదీ తెలుసు నాకు- ఇదే మంచి మీకు అని సాధికారంగా ప్రకటించి జెండా ఎగరేసిన విప్లవ కవి శ్రీశ్రీ. రేపటి రోజుకు ఊపిరి శ్రీశ్రీ. ఈ తెలుగువాడి జీవన నాడిని, మాటవాడిని కవిత వేడిని లోకమంతటా సహృదయాలలో పలికించిన ఉద్యమపు మహాప్రస్థానం- మహాకవి శ్రీశ్రీ గారికి 'నా జోహార్లు'.

పరిశీలనా గ్రంథాలు :

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ
2. అనంతం - శ్రీశ్రీ
3. మహాకవి శ్రీశ్రీ - బూదరాజు రాధాకృష్ణ

❖❖❖

శ్రీశ్రీ కవిత్వంలో 'అధివాస్తవికత'

– భమిడిపాటి గౌరీశంకర్, తెలుగు విభాగాధిపతి, గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ & మేనేజ్‌మెంట్ శ్రీకాకుళం.

సాహిత్య ప్రక్రియలలో 'అధివాస్తవికత'కు పెద్ద పీట వేసిన కవులు, రచయితలెందరో ఉన్నారు. వీరంతా టి.ఎస్.ఇలియట్, ఎజ్రాపౌండ్, ఆడెన్, సిట్వెల్, బార్కర్, కమింగ్స్, డిలానాథామస్, గ్యాస్కాయిన్ వంటి వారి రచనలే కాక... ఫ్రెంచి సాహిత్య రంగమున సర్రియలిజమ్ ప్రవేశపెట్టిన 'ఆండ్రేబ్రిటన్', పాల్ ఎల్వర్డ్ వంటి కవుల రచనలను చదివి 'స్ఫూర్తిని పొందారు. కేవలం ఈ రచనల ద్వారానే కాక. శ్రీశ్రీ నారాయణ బాబు వంటి కవులను 1924లో ప్రచురించబడిన 'సర్రియలిస్టు మ్యానిఫెస్టో', జెరార్డ్‌మనీహాప్కిన్స్ రాజూతీబఅస్త్ర-=ష్ట్రవ్ష్ట్రఎ వంటి నూతనచ్ఛందోరీతులు, జేమ్స్ జాయిన్ 'యులిసిస్' నవలలో ప్రవేశపెట్టిన 'చైతన్యస్రవంతి' చిత్రణ... సాల్వడర్ లీ, మాక్స్ ఎర్నస్ట్, పికాసో వంటి అధివాస్తవిక క్యూబిస్టు చిత్రకారుల చిత్రములు, 'మాన్రే' వంటి అధివాస్తవిక ఛాయాచిత్రములు ప్రభావితం చేసాయని చెప్పవచ్చు.

ఇక్కడ విషయమును గమనించాలి... మానవుడు సంఘజీవి... ఈ గుంపు జీవితములో మనిషికి తెలియని సంకెళ్ళు వేయబడి ఉంటాయి... వీటిని బహిరంగంగా చేధించలేడు. అలాగని బందీగాను ఉండలేడు. సమాజం మనిషి వ్యక్తిగత జీవితంలో కలిగే అనేకానేక కోరికలను తీర్చుకొననీయదు. వాటినిన బహిర్గతం చేసే అవకాశ ములు కల్పించదు. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన ఒక సిద్ధాం తమును ఇక్కడ వివరించవలసిన అవసరముంది. అదేమిటంటే... మనిషిలో ఒక పార్శ్యమందు పూర్వ సంవేదనములనేకం అ 'వ్యక్త' దశలో నిగూఢముగా ఉంటాయి. ఈ స్థితిలో 'వ్యక్తి' యొక్క వ్యక్తిత్వము' నంపూర్ణముగా గోచరము కాదు. ఒక విధమైన కృతిమత్వమునకతడు లోనవుతాడు. మరుగునపడిన 'భాగమును' వ్యక్తీకరించుకొను అవకాశము కల్పించాలి. 'అతని' యొక్క సంపూర్ణ వ్యక్తిత్వము బహిర్గతం కాగలదని ఫ్రాయిడ్ సిద్ధాంతం. ఈ విధముగా కృతిమ వాసన లేని 'అణగదొక్కబడిన' కోరికలు, ఊహలను యధాతదముగా "హేతుకర్తరీ" ప్రయోగము చేత బహిర్గతమొనర్చుటయే సమంజసమనేది 'అధివాస్తవికుల మతము' దీనినే వారు ఖీతీవవ ూాంంశిఎఱఖ్ఱఅశీఅ స్వచ్ఛందాను బోధ" అంటారు. వీరికి 'సమాజము' భూతద్దము నుండి కనిపించు ప్రకృతి వలె ఉండును. చమత్కారము వీరి అజెండా... అధిక్షేపము, అవహేళన వీరి అభిమతము. మానవుని కోరికలకు 'సెక్స్' మూలమన్న కొత్త వాదన వీరి రచనలో కనిపిస్తుంది. (ఉదా: పట్టాభి-ఫిడేలురాగాలు డజన్, నారాయణబాబు - "ప్రవర'లో స్వచ్ఛందాను భోధ వంటి లక్షణాలు కనిపిస్తాయి.)

శ్రీశ్రీ పైన నారాయణబాబు ప్రభావం ఉందని సాహితీకారులందరికి తెలిసిన సత్యమే "యథార్థాన్ని గుర్తించము...కలలు మాకు యధార్థాలు... ఈ జగత్తుతో మాకు పని లేదు... మాది స్వప్న జగత్తు... సంపన్నులు... భాషా సంపన్నులు మాకు విరోధులు. కావ్య లక్షణాలే అవలక్షణాలు. వ్యక్తావ్యక్తంలో ఈత కొడతాము. ఏదో విధమైన శక్తి మమ్మల్ని పూనుతుంది. అదేదో రాయిస్తుంది. అర్థమనర్థం..." ఇది అధివాస్తవికుల మతం (సంఘర్షణ", "ప్రవర" నుంచి) అనేది నారాయణబాబు అభిమతాన్ని శ్రీశ్రీ తన అభివ్యక్తంతో ఆచరించి చూపించారు. శ్రీశ్రీ ఈసూత్రాన్ని అనుసరించే, రుబాయిత్, కొంటెకోణాలు, విదూషకుని ఆత్మహత్య అను మూడు గేయములను ప్రకటించాడు. వీటిలో 'ఛందోబంధనాలు' లేవు. 'అర్థమనే అద్వానపు అడవులు' లేవు. 'గద్యం పద్యం' కలసిమెలసి ఉంటాయి. 'హాష్ హాష్' అనే కేకలు కూడా కనిపిస్తాయి. 'న....న....న...' అనే నత్తి మాటలు కూడా ఉన్నయి.

జీబ్రాకి, చిహ్నాలు
లాంకోటు, పాంకోళ్ళుగా తొడగి
సాహిత్య పౌరోహిత్యం యిస్తే.
వెర్రికాదు, Sur-realism సోదరా (కొంటె కోణాలు)

పై పాదాలలో 'శబ్ద సామ్యము' మాత్రమే ఉంది. చాలా పదముల మధ్య సంబంధము సహితం కనబడదు. కావున ''అసంబద్ధత.. అనర్ధకత...శబ్ద చమత్కారము సర్రియలిజయు లక్షణమని'' శ్రీశ్రీ చెబుతారు.

గమనించదగ్గ అంశమేమిటంటే... పాశ్చాత్య సాహిత్యంలో ర్రియలిజమును ప్రతిపాదించిన వారంతా కమ్యూనిస్టులు కావటం. కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం శ్రీశ్రీ పైన అధికంగా ఉండటం. మహాప్రస్థానం దశాబ్దం లోనే శ్రీశ్రీని ఈ ఉద్యమం ఆకర్షించింది. అయితే శ్రీశ్రీకున్న అభ్యుదయ భావాలు, సర్రియలిజమ్ ప్రభావానికి వరకు అడ్డుకట్టలు వేసాయి. అయితే ఒకరకరంగా అటు అభ్యుదయం.. ఇటు సర్రియలిజమ్. శ్రీశ్రీ కవితను 'నైరూప్య కవిత్వంగా అద్భుత భావ పరిణితికి మేలు చేసాయని చెప్పాలి. కాని ఈ కొత్త భావాలను జనం అంగీకరించరేమోనని చలం తన భావాన్ని వ్యక్తీకరించారు.

శ్రీశ్రీకి అధివాస్తవికత అంటే మక్కువ ఎక్కువ. ''అధివాస్తవికతను అధ్యయనం చేసిన వారిలో నేను కూడా ఒకడిని. అతివాస్తవికతలో వాస్తవికత గర్భితమై ఉంటుంది. సర్రియలిజమ్ అనే పదం ఒక ఫ్రెంచి నాటకంతో ఏర్పడినది. అంతకు ముందే క్యూబిజం, ఇంప్రెషనిజం, పోస్టింప్రెషనిజం మొదలైనవి వచ్చాయి.

ఒక సత్యం మనమిక్కడ ప్రస్తావించుకోవాలి... సర్రియలిస్టు శ్రీశ్రీలో అనాకాన్షియస్‌గా బీజరూపంలో,

'భావాల' చిత్రరూపమే అనేక ''కవితాఖండికలు'' అనేది వాస్తవం. ఇందుకు ఉదాహరణగా ''మహాకవి ఆశ్చర్యం'' (ఖడ్గసృష్టి) మరియు ప్రతిజ్ఞ'' అనే గేయాలను చెప్పుకోవచ్చు.

''ఛందోబందోబస్తులన్ని
ఛట్ ! ఫట్ ఫట్ మని తెంచి
డామిట్! ఏమిట్రా ఇదంటే
ప్రే! ఇటీజ్ పొయిట్రీ అందాం ...

ఈ సర్రియలిస్టు గీత భావమే ఈయన 1937లో రచించిన 'కవితా! ఓ కవితా!!', సిరిసిరిమువ్వలో కూడా ఈ ధోరణి కనిపిస్తుంది.

హిప్పోపొటామసొక్క
యడిగెనిట్లు, 'స్వామి! మీరె
ల్లప్పుడు చెప్పిందాన్నే
చెప్పడమెంచేత? ననుచు సిరిసిరిమువ్వా!

శ్రీశ్రీ తొలుత సంప్రదాయవాది. సమాజంలో అసమానతల భాదానర్పదష్టులు...వారి వెతలు... వారి ఆయనను కదిలించాయి. ''మానిషాదగీతాల''ను సృజియించజేసాయి. ఆ పైన కమ్యూనిస్టు భావాలు సమాజం పట్ల బాధ్యతను పెంచాయి. ఆదిశగా అయన కలాన్ని నడిపించాయి. మహాప్రస్థానకవిగా మనకు మిగిల్చాయి.

చివరగా.... ఫ్రాన్స్‌లో ప్రారంభమై అధివాస్తవికోద్యమం ప్రపంచలోని కవులందరిమీద తన ప్రభావాన్ని ప్రసరించింది. ఒక్క కవిత్వమనే కాదు అన్ని కళలలోను ఎన్నో ప్రయోగాలు చెయ్యడానికి దోహదపడింది. సాహిత్యంలో అధివాస్తవికత ఒక విమోచనోద్యమం.

పచ్చిక మచ్చికైనది
ప్రపంచపు నెత్తురుమంటపాలన్
మెచ్చని వాడనీ మెడల
మీద వినే ఉదయాద్రి రౌద్రముల్'' దీన్ని కవిత్వంగా

అంగీకరించని వాడిని పిండి వంటలలో విషం పెట్టి తినిపించి చంపాలనిపిస్తుంది. ఇవి శ్రీశ్రీ భావాలలోని సర్రియలిజపు 1933 నుండి 1947 వరకు దాదాపు 15 సంవత్సరాల కాలంలో ఆయన రాసిన గీతాలు మహా ప్రస్థానం పేరిట ముద్రితమైనాయి. జనులు పాడుకునే గీతాలుగా రూపాంతరం చెందాయి. ఏ సమకాలీన

మహాకవి నముపార్జించుకోలేని కీర్తి ప్రతిష్టలను సంపాదించిపెట్టాయి. సాహితీ చరిత్రలో అభ్యుదయ సాహితి రీతికి ఒక వినూత్న అధ్యాయాన్ని సృష్టించాయి. శ్రీశ్రీ ప్రతిపాదించిన అధివాస్తవిక ప్రయోగం.. తరువాత కాలంలో 'దిగంబర కవులు'' ఆయనను మరింతగా బలపరిచేందుకు దోహదపడిందని చెప్పవచ్చు....

ఆధార గ్రంథాలు :

1. అనంతం - శ్రీశ్రీ ప్రజాశక్తి ప్రచురణలు, 2010
2. ఆధునిక కవిత్వ సిద్ధాంతాలు, శిల్ప రీతులు -రచన - డా॥ అద్దేపల్లి రామ్‌మోహనరావు దిశ ప్రచురణలు, 2009

❖❖❖

శ్రీశ్రీ మహాప్రస్థానం - అనుశీలన

- కొమఱిందు వేదుల, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం.

''మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం'' [1] అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ. తెలుగు కవిత్వాన్ని మరో మలుపు తిప్పిన మహాకవి శ్రీశ్రీ ''మహాప్రస్థానం'' 1950వ దశకంలో పుస్తకరూపం దాల్చింది. తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించిన మహాకవి. ఈ మహాప్రస్థానంలోని కవితలను శ్రీశ్రీ ప్రతీకవాదంలో రచించారని చెప్పవచ్చు. ''పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆధునిక కవిత్వంలోకి వచ్చినదే ప్రతీకవాదం. విలక్షణమైన శైలి, సంవిధాన శిల్పం, ప్రగాఢమైన కూర్పు ఉన్నదే ప్రతీకవాదం. ఒక భావాన్ని చెప్పడానికి ఏదో ఒక వస్తువునో, ఊహనో గుర్తుగా చెప్పడం ప్రతీకవాదం.'' [2] ప్రతీకవాదం అంటే ముఖ్యంగా శబ్దం యొక్క అర్థం వివరించడం కాదు, సూచించడం.

ఈ ప్రతీకవాదంలో చాలామందె రచనలు చేశారు. ఉదాహరణకి ఆరుద్ర, శ్రీశ్రీ, బైరాగి తదితరులు. పాశ్చాత్యుడైన టి.యస్.ఇలియట్ ప్రభావం వీరిపై చాలానే వుంది. ఆరుద్ర గారి రచనను గమనిస్తే,

''ఈ కాంతను చెరపట్టగ [3]

రాకాసులు తలపెట్టిరి'' ఇలా ఎంతోమంది ప్రతీకాత్మకంగా రచనలు చేశారు. అందులో శ్రీశ్రీ గారి రచనలు కూడా అద్భుతమే. మహాప్రస్థానంలో కొన్ని వచనాలను పరిశీలిస్తే

తెల్లవాడు నిన్న నిన్ను [4]
భగత్సింగువన్నాడు
నల్లవాడు నేడు నిన్ను
నక్సలైటువన్నాడు
ఎల్లవారు రేపు నిన్ను
కాంతిరేఖవంటారని,

మహాప్రస్థానానికి 'యోగ్యత పత్రం' అనే పేరుతో ముందుమాటను రాశారు చెలం. అందులో ఒక వాక్యాన్ని గమనిస్తే,

''క్రిష్ణశాస్త్రి తన బాధని అందరిలోనూ పలికిస్తే,[5] శ్రీశ్రీ అందరి బాధను తనలో పలికిస్తాడు.

క్రిష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ,
ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ.''

ఆ వాక్యాలు అక్షరసత్యాలు. శ్రీశ్రీ రచనల్లో శ్రామిక వర్గాలు, పీడిత వర్గాలు, అనాధలు, అభాగ్యులు వీరే ప్రతీకలు.

తిక్కన, వేమన, గురజాడ వీరి ముగ్గురిని కవిత్రయం అన్నాడు ఆ మహాకవి. వారన్న, వారి రచనలన్న ఆయనకి ఎంతో ఇష్టం. సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజల తరుపున గొంతెత్తి అరిచిన శ్రీశ్రీ... మహాప్రస్థానంలోని చాలా గీతాల్లో మార్క్సిజంలోని పదాలు, పురాణ పదాలు వాడుతూ అల్పాక్షరాలతో అనల్పమైన రచన చేశారు. అల్పాక్షరాలలో అనల్పార్థమైన రచన అనేది మన తిక్కన మహాకవినే అనుసరించి వుండవచ్చు.

అంతేకాకుండా చెలం గారు ఇంకో మాటను కూడా ప్రస్తావించారు. దీనుల కోసం, హీనుల కోసం అనగా సామాన్య ప్రజలకోసం ''నెత్తురు, కన్నీళ్ళు కలిపి కొత్త టానిక్ తయారు చేశాడు ఈ వృద్ధ ప్రపంచానికి.''[6]

పతితులారా!
భ్రష్టులార!
బాధా సర్పదష్టులార!
బ్రదుకు కాలి,
పనికిమాలి,
శనిదేవత రథచక్రపు
టిరుసులలో పడి నలిగిన

దీనులారా!
హీనులారా!

ఈ జగన్నాథ రథచక్రాలలోని ప్రతి వాక్యం అద్భుతమే మోసపోయినవారు, పనికిమాలినవారు, పీడింపబడేవారు దగాపడినవారు, దీనులు, హీనులు, బ్రతుకుని ఎలా నడిపించాలో తెలియని అభాగ్యులు, అమాయకులు ఇలా అందర్ని ఉద్దేశించి రాసినదీ కవిత.

సఖులవలన పరిచ్యుతులు
జనుల వలన తిరస్కృతులు
సంఘానికి బహిష్కృతులు
ఏడవకండేడవకండి!
వస్తున్నా యొస్తున్నాయి
జగన్నాథ, జగన్నాథ
జగన్నాథ రథచక్రాలు.

కాలగమనంలో వారి కథలకి ముగింపు లేనివారు, బాధల్లో, వ్యధలలో వున్నవారు, సంఘంచేత, కావల్సిన వారిచేత వెలివేయబడినవారు. ఇలా ఎందరో అనాథలు, అభాగ్యులు అందరికి నేనున్నాను. నా కలంతో జగన్నాథ రథచక్రాలను ఆకాశం నుండి భూమిపైకి తిరిగి తీసుకు వస్తాను అని ఆ మహాకవి తన రాతల ద్వారా సామాన్య వర్గాలలో ధైర్యం నింపినవాడు.

హైందవ సంప్రదాయంలో (విష్ణువు) కృష్ణుడి నామాల్లో ఒకటి జగన్నాథుడు. పూరి క్షేత్రంలో ఈ ప్రసిద్ధ జగన్నాథ ఆలయం వుంది. ఆదిశంకరాచార్యులు కూడా జగన్నాథ స్వామిని కీర్తించారు. ప్రతి యేట ఇక్కడ వున్న మహారథాన్ని ఒక బ్రహ్మాండమైన ఊరేగింపుగా తీసుకువెడతారు. అదే రథయాత్ర. ఆ రథచక్రాల కిందపడి నలిగిపోతే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం అనగా సిద్ధి కోసం కదిలే మహా రథయాత్ర. అంతటి మహా రథచక్రాలను ప్రతీకలుగా తీసుకొని పతితుల్ని, భ్రష్టుల్ని, కథావశిష్టుల్ని వ్యధానివిష్టుల్ని ఉద్ధరించడం కోసం తను కలం పట్టి జగన్నాథ రథచక్రాలను భూమార్గం పట్టిస్తానని, ప్రజలకు ఈ లోకాన్ని అర్పించి, రాజ్యం మీదే, ఏలుకోండి అని ఎంతో ఆశావహంగా చెప్పిన కవిత.

ఈ సందర్భంగా ఇంకోమాట చెప్పుకోవాలి. 'Juggernauts'[3] అనగా భారీ వాహనం అని అర్థం. పెద్ద, పెద్ద ట్రక్కులు, లారీలు వెడుతూ వుంటే "Juggernauts are roaring through Country Villages"[4] అనడం ఆనవాయితీ. అదే విధంగా అదుపు చెయ్యలేని భారీ సంస్థనో, శక్తినో కూడా ఈ పదం సూచిస్తుంది. కవి ఎంతో దూరదృష్టితో ఆలోచించి, పెద్దవారి అహం వలన సామాన్య ప్రజలు వారి అహంకారపు చక్రాలలో పడి నలిగిపోతున్నారు.

శ్రీశ్రీ దేశ చరిత్రలు పరిశీలిస్తే
ఏ దేశ చరిత్ర చూసిన
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.
ఒక వ్యక్తిని మరొక వ్యక్తి
ఒక జాతిని వేరొక జాతి,
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా? ఇకపై సాగదు.

నిజమే కదా, ఏ దేశ చరిత్ర చూసిన గర్వంగా చెప్పుకోవాల్సిన పెద్ద పెద్ద విషయాలేమి లేవు. ఒక రాజు తర్వాత ఇంకో రాజు పరిపాలిస్తాడు. నిర్భాగ్యులు మాత్రము వారికి ఎదుగుదల లేకుండా అలాగే వుండి పోతున్నారు. ఇప్పటికి చరిత్ర పుటల్లో తాజ్‌మహల్‌ని షాజహాన్ కట్టించారు అని చెప్పుకుంటున్నాము కాని, దానిని కట్టిన కూలీలు వివరాలు మాత్రం తెలీదు. ఇలా ఈ పెట్టుబడిదారి వ్యవస్థలో పెట్టుబడి పెట్టినవాడే గుర్తు వుంటాడు. కానీ కష్టపడినవారిని మాత్రం ఈ చరిత్ర గుర్తించదు. ఇక్కడ కవి మనకు చెప్పాలి అనుకున్నది పెద్ద పెద్ద సంస్థల్లోనూ, శక్తుల చేత వారి ధనగర్వం చేత పేదవాడు అణచివేతకు గురి అవుతున్నాడు.

సమాజంలోని ఆలోచన విధానం మారాలి. సమాజం అంటే ప్రజలు, ప్రజలు అంటే మనం. అంటే మన అందరిలో మార్పు రావాలి. కవి ముందుచూపుతో ఆలోచించి ఈ సమాజంలోని దోపిడి గురించి, ప్రజల దైన్య స్థితి గూరించి చాలా చక్కగా విశ్లేషించారు. ఇప్పటికీ చాలా మంది పేద, బడుగు, బలహీన వర్గాల వారు అణిచివేతకు గురి అవుతున్నారు.

ఇప్పటికీ ఈ సమాజంలో బీదవాడు అతని కష్టాన్ని నమ్ముకొని అలాగే బీదవాడిలాగే జీవిస్తున్నాడు. ధన వంతులు బీదవారి కష్టాన్ని అమ్ముకొని ధనవంతులుగా ఎదుగుతున్నారు. మరి మధ్యతరగతి వాని పరిస్థితి ఏమిటి? అందుకే కవి సమాజాన్ని నేరుగా ప్రశ్నించాడు. ఒకరు ఎదిగితే చూడలేము ఒకరు బాగుపడితే మనకి కడుపు మంట, ఎప్పటికి మారుతుంది ఈ సంఘం.

ఈ సమాజంలో పేదవాడి నెత్తురు దోపిడి, వాడి కష్టం దోపిడి, వాడి ఎదుగుదల దోపిడి ఇలా చెప్పుకుంటూ పోతే వాడి జీవితమే ఈ సమాజం చేతిలో నలిగిపోతుంది.

నిప్పులు చిమ్ముకుంటూ
నింగికి నేనెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో వీరు -
నెత్తురు క్రక్కుకుంటూ
నేలకు నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరె...

కవి కలం నుండి జాలువారిన నగ్నసత్యాలు. శ్రామిక, పీడిత, కర్షక వర్గాల వారు వారి ఎదుగుదల కోసం ప్రశ్నించే హక్కు లేదు. ఒక రైతు కొడుకు కలెక్టరు అయితే అది మనకి ఆశ్చర్యం, వీడికి ఇది ఎలా సాధ్యం, ఇది ఇలా జరగకూడదు అనే ఆంతర్యం. ఏం ఎందుకు జరగ కూడదు? "కష్టే ఫలి" అన్నారు. మన కష్టం మనల్ని విజయ తీరాన నిలబెడుతుంది. అదే ఒక రైతు తన పంటను సైతం కోల్పోయి అప్పుల పాలయిపోయి దిక్కు తోచని స్థితిలో సాయం చేసే నాథుడు లేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే నిర్దాక్షిణ్యంగా, ఈ సమాజం వదిలేస్తుంది. ఇదెక్కడి న్యాయం.

అందుకే కవిగారు చాలా చక్కగా చెప్పారు.
ఎముకులు కృళ్ళిన, వయస్సు మళ్ళిన
సోమరులారా! చావండి!
నెత్తురు మండే,
శక్తులు నిండే,
సైనికులారా! రారండి!

ఎంత చక్కటి వచనం, బాధ్యతలేనివారు, మనకెందు కులే అనుకొనే సోమరులార చచ్చిపోండి. సమాజం కోసం ఏదోకటి చేయాలి అనే తపన ఉన్నవారు మాత్రం ముందుకు సాగండి. కవి ముఖ్య ఉద్దేశం ఏమిటి అంటే ఈ సమాజంలో వుండే చిన్న, పెద్ద ప్రతిఒక్కరూ బాధ్యత రాహిత్యంగా కాకుండా బాధ్యతగా వ్యవహరించండి.

ముగింపు :

కవి ఈ మహాప్రస్థానంలో అన్ని వచన కవితలు (ఖండికలు) నిజంగా మహాప్రస్థానమే. ఈ మహాప్రస్థాన ఖండికలలో కవి ఆంతర్యం అందుకోవాలంటే చాలా కష్టం అయిన పని. కవి ఈ మహాప్రస్థానంలోని ఖండికలను ప్రతీకవాద ధోరణిలో రచించారు. విత్తు నుండి చెట్టు వరకు, భూమి ఆకాశాలను, పంచభూతాలను, పక్షులను, జంతువులను ఇలా ప్రతీదాన్ని కవి తన వచన కవితలో ప్రతీకలుగా చూపించారు.

భావకవులు వాడుకున్న కొండలు, సెలయేళ్ళు, అడవులు, సముద్రాలు శ్రీశ్రీకి చైతన్యమయాలుగా కనిపించాయి. వాటిని ప్రతీకలుగా వాడాడు. దృఢత్వానికి, నిశ్చలత్వానికి, ఔన్నత్యానికి గిరులు, అనంతత్వానికి, అగాధత్వానికి సాగరులు ఇలా భావకవిత్వంలోని లేని ప్రతీకత్వాన్ని శ్రీశ్రీ కల్పించుకొని తన మహాప్రస్థాన గీతాలలో వాడుకున్నాడు.

ప్రతీకత్వానికి చిన్న ఉదాహరణ

పక్షినయ్యెద చిన్ని ఋక్షమయ్యెదను

మధుపమయ్యెద చందమామనయ్యెదను.

కృష్ణశాస్త్రి స్వేచ్ఛా గానానికి నిదర్శనం.

ఇదే విధంగా శ్రీశ్రీ కూడా తను చెప్పాలన్న విషయాన్ని ప్రతీకలను ఉపయోగించి అందరికి అర్థమయ్యే విధంగా వివరించారు. ఇప్పటికి కవి రచనలు చదివినపుడు నిజంగానే ప్రతి ఒక్కరిలో ఒకింత మార్పు అనేది కన్పిస్తుంది.

వివేకానందుడు యువతరం ఈ ప్రపంచానికి ఎంత అవసరమో చెప్పినట్టుగా, శ్రీశ్రీ కూడా సోమరితనాన్ని విడిచి, స్వశక్తులుగా మారి, ఈ దోపిడి రాజ్యం యొక్క అన్యాయాన్ని అణచివేసి, ధనికవర్గాల దాహాన్ని ఎండగట్టి, ప్రజలలో చైతన్యం తీసుకురావాలి అనేది కవి ఆకాంక్ష.

మహాప్రస్థానంలోని ప్రతి కవితా... దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది. శ్రీశ్రీ ప్రయోగించిన కొన్ని పదాలు అర్థం కాకపోయినా అందులోని అంతరార్థం మాత్రం చాలా లోతుగా ఉంటుంది. తెలుగు పదాలలోని దమ్ము తెలియాలంటే శ్రీశ్రీ మెదడులో పుట్టిన మహాప్రస్థాన కవితలు ఖచ్చితంగా చదవాలి.

పాదసూచికలు :

1. కె.వి.ఆర్ - జగన్నాథ రథచక్రాలు - పేజి 164
2. సి.నా.రె - ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు - ప్రయోగాలు - పేజి 593
3. సి.నా.రె - ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు - ప్రయోగాలు - పేజి 597
4. కె.వి.ఆర్ - జగన్నాథ - పేజి 162
5. 6 శ్రీశ్రీ - మహాప్రస్థానం - పేజి 10,11

గ్రంథ సూచి :

1. శ్రీశ్రీ - మహాప్రస్థానం.
2. సత్యాన్వేషి చలం - ఒక పరిశీలన
3. తెలుగు అకాడమీ - తెలుగులో కవితోద్యమాలు
4. కె.వి.ఆర్ - జగన్నాథ రథచక్రాలు
5. సి.నా.రె. - ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు ప్రయోగాలు.

❖❖❖

శ్రీ శ్రీ జయభేరి - ఒక విశ్లేషణ

- డా॥. టి. శ్రీదేవి, కొలనుకొండ, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.

శ్రీరంగం శ్రీనివాసరావు శ్రీశ్రీగా తెలుగువారికి సుపరిచితమైన పేరు. ఈ పేరు వింటే తెలుగు సాహిత్యం పులకించిపోతుంది. తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పిన శ్రీశ్రీగా ఎదిగి, మహాకవిగా గుర్తింపు పొందిన శ్రీశ్రీ 1910లో ఏప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించారు. 18 ఏళ్ల వయస్సులో 1928లో ప్రభవ అనే గేయ సంకలనం రచించారు. ఇది ''భావకవిత్వం'' అంటే ''ప్రణమ కవిత్వం'' ప్రేమ కవిత్వం అని అర్థం. భావకవిత్వం యొక్క ప్రధాన లక్షణం ఊహల్లో బతకడం/ఊహ జనితం. భావకవి సంఘమూన్ని విస్మరిస్తారు./పట్టించుకోడు. భావకవిత్వంలో సామాజిక చింతనకి చోటులేదు. తెలుగు సాహిత్యంలోనే మొదటి సారిగా సామాజిక చింతనని చెప్పింది శ్రీశ్రీ 1930లో 63రోజుల పాటు టైఫాయిడ్ జ్వరంతో మంచాన ఉండిపోవడంతో ఆకలి, బాధ, జ్వరం, వేదన మొ॥ వి శ్రీశ్రీకి బోధపడ్డాయి. అంటే శ్రీశ్రీలో ఉన్న ప్రణయకవి సామాజిక చింతన వైపు వెళ్లాడు. నూతన కవితా పంథాల వైపునడిచాడు. సాహిత్యాన్ని సరికొత్తగా చూసారు. ఆ సరికొత్త కోణంలో కొత్త వస్తువు, కొత్త ధోరణి, కొత్తశైలి, కొత్త పదబంధం మొ॥వి ఉంటాయి. అటువంటి సమయంలో ''సుప్తోద్ధికలు'' లాంటి గేయాలు రాశారు. ఈ మార్పు 1930-33లో జరిగింది. 1933 జూన్ 2వ తారీకున ఒక గేయం ''జయభేరి'' రాశారు. 1933 జూన్ 2 నుంచి 1940 వరకు 7సం॥ కాలంలో 40 గేయాలు రచించారు. అదే ''మహాప్రస్థానం''.

తెలుగు సాహిత్యానికి దిక్సూచిలా వెలుగొందిన కవితా సంకలనం మహాప్రస్థానం.

''జయభేరి'' అంటే విజయం సాధించిన తరువాత మోగించే ''ఢంకాధ్వానం'' అని అర్థం. కవి సూచించే విజయం సమసమాజ స్థాపన. సమసమాజస్థాపన అన్నా కమ్యూనిస్టు స్థాపన అన్నా ఒక్కటే. కమ్యూనిస్టు స్థాపన అన్నా సోషలిస్టు వ్యవస్థ అన్నా ఒక్కటే. సోషలిస్టు వ్యవస్థ అన్నా సామ్యవాద వ్యవస్థ అన్నా ఒక్కటే. కవి యొక్క సామ్యవాద వ్యవస్థ నెరవేరింది. అని ఆయన ఉద్దేశం. కార్ల్ మార్క్స్ కన్న కల ఇదే అని శ్రీశ్రీ భావన. ఇందులో 5 భాగాలు ఉన్నాయి.

మొదటి భాగం :

''నేను సైతం
ప్రపంచాగ్నిని
సమిధనొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వ వృష్టికి
అశ్రువొక్కటి ధార పోశాను!
నేను సైతం
భువన ఘోషకు
వెర్రిగొంతుకు విచ్చి మ్రోశాను!

''నేనుసైతం'' ..... ఇక్కడ నేను అంటే కార్మికుడు/శ్రామికుడు అని అర్థం. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగం. ఇక్కడ బానిసలు, పేదలు, పీడితులు మొదలైన వారు దోపిడీకి గురవుతున్నవారు కావచ్చు. సమాజంలో ఉన్న అణగారిన వర్గాలు అనికూడా చెప్పవచ్చు.

నేను - చైతన్యశక్తి
నేను - అభ్యుదయ కవి
నేను - శ్రీశ్రీ కావచ్చు

ప్రపంచాగ్నికి అంటే ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన విప్లవానికి ఆహుతిచ్చాను, బలి అయ్యాను అని అర్థం.

వృష్టి -వాన /వర్షం

విశ్వ వృష్టి - ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వర్షం. కార్మికలోకం యొక్క శోకం. అందులో నా కన్నీరు కూడా ఉంది.

ఘోష - వాహకారాలు (బాధతో ఏడవడం)

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మిక పీడితులలో నా గొంతుక కూడా ఉంది.

మొదటి భాగంలో ప్రపంచ వ్యాప్తంగా కార్మికు లందరూ బాధలుపడుతున్నారు. పోరాటాలు చేస్తున్నారు. అందులో నేను ఉన్నాను అని శ్రీశ్రీ తన గొంతుకను వినిపిస్తున్నారు.

రెండవ భాగం :

ఎండకాలం మండినప్పుడు
గబ్బిలం వలె
క్రాగి పోలేదా!
వానకాలం ముసిరిరాగా
నిలువు నిలువున
నీరు కాలేదా?
శీతకాలం కోతపెట్టగ
కొరడు కట్టే,
ఆకలేసీ కేకలేశానే!

ఎండాకాలం, వానాకాలం, శీతాకాలం అంటే మూడు వ్యవస్థల్లోనూ యుగాల వారీగా ఈ దోపిడీ నిరంతరంగా కొనసాగుతుంది. ఇందులో యుగయుగాల దోపిడీ, వేదనా ఉంది. రెండవ భాగం చిరవకు గతి తార్కిక ప్రక్రియ పూర్తయింది.

మూడవ భాగం :

నే నొక ణ్ణే
నిల్చిపోతే
చండ్రగాడ్పులు, వానమబ్బులు, మంచుసోనలు
భూమి మీదా
భుగ్గమౌతాయి!
నింగినుండీ తొంగి చూసే
రంగు రంగుల చుక్కలన్నీ
రాలి నెత్తురు క్రక్కుకుంటూ
పేలిపోతాయి!
పగళ్ళన్నీ పగిలిపోయీ,
నిశీథాలు విశీర్ణిల్లీ,
మహాప్రళయం జగంనిండా
ప్రగల్భిస్తుంది!

నేనొకణ్ణే నిల్చిపోతే - సమ్మె చేయడం / నిరసన వ్యక్తం చేయడం.

చండ్ర ... భుగ్గమౌతాయి - మూడు కాలాలుగా జరిగిన వేదన పోతుంది. భూమి మీద నశిస్తుంది.

నింగి నుండి .. చుక్కలన్నీ -పెట్టుబడి దారులు

రాలి, నెత్తురు .. పేలిపోతాయి - పెట్టుబడి దారీ వ్యవస్థ అంతమైపోతుంది.

పగళ్ళన్నీ ... ప్రగల్భిస్తుంది - మహాప్రళయం/విప్లవం వస్తుంది.

నాల్గవ భాగం :

నేనొకణ్ణీ ధాత్రినిండా
నిండిపోయీ
నా కూహురత శీకరాలే
లోమంతా జల్లులాడే
ఆ ముహుర్తా లాగమిస్తాయి!

శ్రామిక నియంతృత్వ ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాయి.

ధాత్రి నిండా - ప్రపంచమంతా

కుహురుత శీకరాలే - కోకిల గానం (వసంతకాలం) అంటే శిశిరం తరువాత వచ్చే కాలం. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ పోయాక వచ్చేది. ఆ ముహుర్తా లాగమిస్తాయి - ఆ ముహుర్తం రానే వచ్చింది.

అంటే కమ్యూనిస్టు వ్యవస్థ వచ్చింది అని అర్థం.

ఐదవ భాగం :

నేను సైతం
ప్రపంచాబ్దపు
తెల్లరేకై పల్లవిస్తాను!

నేనుసైతం
విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను!
నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను!

ఆ సమసమాజ వ్యవస్థలో తానూ భాగస్వామిని అయ్యాను అని శ్రీశ్రీ అభిప్రాయం.

ప్రపంచాబ్జపు - ప్రపంచమూ అనే కలువ పువ్వు.
తెల్లరేకై - శాంతి

విశ్వవీణ - ప్రపంచపు వీణ/ప్రపంచ దేశాల్లోని ప్రభుత్వాలు భువన భవనపు - ప్రపంచమనే భవనంలో / ప్రపంచంలో నేనూ విజయం సాధించాను అని శ్రీశ్రీ ఉద్దేశం.

అంటే పాత వ్యవస్థ పూర్తిగా ధ్వంసమై కొత్త వ్యవస్థ రావాలన్నమాట. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్తిగా విధ్వంసం అవ్వాలి. పరిమాణం హెచ్చి ఒక వస్తువు సరికొత్త రూపాన్ని పొందుతుంది. దానితో పాటు సరికొత్త గుణాన్ని కూడా పొందుతుంది. అట్లాగే పెట్టుబడిదారీ వ్యవస్థ పరిమాణం హెచ్చి విప్లవ శక్తులతో అది విధ్వంసమై సరికొత్త రూపాన్ని, గుణాన్ని పొందుతుంది. అప్పుడు శ్రామికుల విప్లవ ఫలతంగా పెట్టుబడిదారీ వర్గము అంతరించి శ్రామిక నియంతృత్వ ప్రభుత్వం ఏర్పడుతుంది. దీనిని మార్క్స్ కమ్యూనిస్టు వ్యవస్థ అన్నారు. ఇందులో వర్గాలు లేవు కాబట్టి ఇది వర్గ రహిత వ్యవస్థ అవుతుంది. పరస్పర ఘర్షణ లేదు కాబట్టి ఇది శాస్వతంగా ఉండిపోతుంది అని శ్రీశ్రీ అభిప్రాయపడ్డారు.

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ చేపట్టని ప్రక్రియలేదు. ప్రపంచ స్థాయికి ఎదిగి, తెలుగు నేల మీద నిలకడగా నిటారుగా నిలబడ్డవాడు శ్రీశ్రీ. అందుకే కాబోలు ఆయన కవిత్వం అనువాదం కాకపోయినా తెలుగు రాని వాళ్ళని కూడా ఆకట్టుకుంటుంది. భాషల అవధులు దాటిన శక్తి తన మాటలకి వుందని శ్రీశ్రీ రుజువు చేశారు.

ఉపయుక్త గ్రంధసూచి :

శ్రీశ్రీ - మహాప్రస్థానం

❖❖❖

సాహిత్యంపై మహాకవి శ్రీశ్రీ ప్రభావం

– పి. గాయిత్రి, పరిశోధక విద్యార్థిని (యూజీసీ జేఆర్ఎఫ్), తెలుగు & తులనాత్మక సాహిత్యశాఖ,
శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

ఆయన కవితలో, పాటలో సగటు మనిషి ఆవేదన ఉంటుంది. వారి బాధలను పోగొట్టే కర్తవ్య బోధన ఉంటుంది. విప్లవ కవితలైనా, గీతాలైనా, దేశభక్తి గీతాలైనా ఆయన కలం నుండి అలవోకగా జాలువారు తాయి. తెలుగు పాటకు కావ్య గౌరవం కల్పించిన మహాకవి. మహనీయుడు. విప్లవ కవిగా తన రచనలతో ప్రజలను చైతన్య పరుస్తూనే ఆయన కలంతో సామాన్య మానవుడి బాధల్ని పాటల్లో వినిపించిన యుగకవి మహాప్రస్థాన కవి శ్రీశ్రీ.

శ్రీరంగం శ్రీనివాసరావు అనే శ్రీశ్రీ 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకట రమణయ్య, అప్పలకొండ దంపతులకు జన్మించారు. శ్రీరంగం సూర్యనారాయణ దత్తత తీసుకోవడం వల్ల ఆయనకు శ్రీరంగంగా మారింది. శ్రీశ్రీ విశాఖపట్టణంలోనే 1915 సం॥లో గోదావరయ్య బడి లోనూ, శివరామయ్య బడిలోనూ, ప్రాథమిక విద్యను, 1925-27 సం॥ల మధ్య విశాఖ మిసెన్ ఎ.వి.ఎన్ కళాశాలలో ఇంటర్ మీడియట్ చదువు, 1928-31 సం॥ల మధ్య మద్రాస్ వెళ్ళి బి.ఏ. పూర్తి చేసారు. శ్రీశ్రీ చదువు తున్న రోజుల్లోనే సాహిత్యంపై ఎక్కువ ప్రభావితు లయ్యారని చెప్పవచ్చు. 1920లో ఆరవ తరగతి చదువుతున్నపుడు వీరసింహ విజయ సింహ అనే నవలను రాసాడంటారు. కాని అది లిఖిత ప్రతి దొరకలేదు.

శ్రీశ్రీ 8వ ఏట పాడుగు పాట్టి పదాలతో కందపద్యం రాసారు. బాల నటుడిగా కూడా శ్రీశ్రీకి అనుభవం ఉంది. చిన్న వయస్సులోనే "సావిత్రీ సత్యవంతుడు" అనే పద్యనాటకం రచించారు. శ్రీశ్రీ ఇంటర్‌మీడియట్ చదువుతున్న రోజుల్లో వివాహం జరగటం ఆ తర్వాత "పరిణయ రహస్యమనే" భావ కవిత్వ ధోరణి గల నవలను రాసారు.

విశాఖపట్నంలో మిసెన్ ఎ.వి.ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వడ్డి కేశవరావు ఛందస్సు నేర్పాడు. అలాగే విశాఖలో కాళూరి నరిసింగరావుతోనూ, విజయనగరంలోని శ్రీరంగం నారాయణబాబుతోనూ సాహితీ చర్చలు చేయటం వీలు పడింది. బాల్యదశలోనే శ్రీశ్రీ రాసిన కవిత 'దివ్య లోచనములు" స్వశక్తి పత్రికలో ప్రచురితమైన తరువాత వర్ధమాన కవిగా స్థానికంగా గుర్తింపు వచ్చింది.

ఉన్నత పాఠశాల విద్య పూర్తికాక ముందే తాను చదివిన పుస్తకాలను అనుకరిస్తూ గ్రంథ రచన మొదలుపెట్టాడు. దేశభక్తి ప్రధాన విషయంగా "వీరసింహ విజయ సింహ" అనే కల్పిత కథను రాశారు. ఆ రోజుల్లోనే ఎవరు పట్టించుకోని మారుమూల ఛందస్సులో సావిత్రీ సత్యవంతుడనే పద్యనాటకం రచించారు. తన అభి ప్రాయాలను వ్యక్త పరచడానికి విద్యార్థిగా ఉండగానే "పరిణయ రహస్యం" అనే నవల రాశారు. ఆనాడు రాసిన కొన్ని రచనలు కనుమరుగయ్యాయని ఒక పరిణయ రహస్యం ఈ మధ్యే దొరికిందని బూదరాజు రాధాకృష్ణ మహాకవి శ్రీశ్రీ పుస్తకంలో రాశారు.

శ్రీశ్రీ నిరంతరం సమకాలీన సాహిత్యాన్ని చదువుతూ ఉండేవారు. విశ్వనాథ నిత్యే నారాయణ మేఘనినాదం, దేవులపల్లి, మోహినీ, గాందర్వగానం వంటి ఖండ కావ్యాలు అతణ్ణి ఎంతో ప్రభావితం చేశాయి. పద్య రచనలో విశ్వనాథను అనుకరించటానికి ప్రయత్నించాడు. అదే సమయంలో ఆధునిక భావాలను, కార్యక్రమాలను అభిమానించే విశాఖ వాస్తవ్యులైన శెట్టి మాష్టారుతో సన్నిహిత పరిచయం ఏర్పడింది. నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు (1861-1915) రచనల ప్రభావానికి ముగ్ధుడయ్యేలోపే శ్రీశ్రీ బసవరాజు అప్పారావు, కవి

కొండల, చింతాదీక్షితులు రాసిన కవితల మీద అభిరుచిని పెంచుకున్నాడు. గురజాడ ప్రభావానికి లోబడే ముందే ముగ్గురే తన బాల్య గురువులున్నారు. తరవాత కాలంలో ఇద్దరే తనకు నజమైన గురువులని మొదటి వ్యఇక్త తండ్రి, రెండో వ్యక్తి అబ్బూరి రామకృష్ణ అని చెప్పు కున్నారు. అబ్బూరి వృత్తి రీత్యా విద్వాంసుడు. ప్రసిద్ధ కవి. ఆంధ్రవిశ్వవిద్యాలయ గ్రంథాలయాధిపతి. ఆయన ద్వారానే ఆస్థాన కవి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి మీద అపార గౌరవం కల్గిందని శ్రీశ్రీ చెప్పుకున్నాడు.

1928లో విద్యాభ్యాసం కోసం మద్రాస్ వెళ్ళినపుడు కొందరు మహా విద్వాంసులతో పరిచయం ఏర్పడింది. శ్రీశ్రీకి ప్రసిద్ధ భారతి పత్రిక కార్యాలయమున్న వీధిలోనే వసతి గృహం కలిగింది. విద్వత్కవి వేటూరి ప్రభాకర శాస్త్రి, ఆంధ్ర ఇతిహాస పరిశోధకుల్లో అగ్రగణ్యుడైన మల్లంపల్లి సోమశేఖరశర్మ, జానపద భాషాశైలుల్లో కవితలు వెలయించి ప్రశాంతంగా ఉన్న సాహితీ సదస్సును అల్లకల్లోలం చేసిన నండూరి సుబ్బారావు వంటి ఉత్తమ సాహితీపరులతో పరిచయం కల్గింది. అక్కడే తన "ప్రభవ" కావ్యాన్ని విమర్శించిన కొంపెల్ల జనార్ధనరావుతో ప్రథమ పరిచయం కలిగి అది స్నేహంగా పెరిగి, తరువాతి కాలంలో తన మహాప్రస్థాన గేయాలను అంకితం చేసేంతగా పరిణమించింది. అధిక్షేప కవిగా పేరుగాంచిన జలసూత్రం రుక్మిణీ నాథశాస్త్రి "జ్వాల" సాహితీ పత్రిక సంపాదకుడు సామినేని ముద్దుకృష్ణ భారతి పత్రికకు సంపాదకుడిగా ఉండి తన సుప్తాస్థికలు తిరుగుటపాలో తిరిగి పంపిన గన్నవరపు సుబ్బరామయ్య మిత్రుల య్యారు. ఈ మిత్రులతో తెలుగు సాహితీ రంగంలోని విభిన్న భావ స్రవంతుల గురించి చేసిన చర్చల వల్ల శ్రీశ్రీకి విశాల దృష్టి కలిగింది. అతడి విమర్శన దృష్టి పదునుబారింది.

శ్రీశ్రీకి చాలా చిన్న వయసు నుంచే పుస్తకాల పురుగైనాడని అందుకు సాక్ష్యం అతని బాల్య స్నేహితులైన పద్యాల రంగనాథరావు, మల్లవరపు విశ్వేశ్వరరావులు తన చిన్నతనంలోనే 'మొపాసా'ను తరువాత బెలోవును చదివి ఉత్తేజితులైనారని శ్రీశ్రీ చెప్పాడు. యువకుడిగా ఉండగా జేమ్స్‌జాయిస్, యులైసిన్, మయకోవిస్కి లెనిన్ అనే రచనలూ, గురజాడ రచనలన్నీ శాశ్వత ప్రభావం చూపాయని చెప్పుకున్నాడు.

విద్రోహకవి అనే పేరు తెచ్చుకున్న నజ్రుల్ ఇస్లాం రచనలతో తనకు పురిపండా పరిచయ భాగ్యం కలిగించు కున్నాడు. శ్రీశ్రీ హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ రచనలను చదివి వాటిని తెలుగులోకి అనువదించాడు.

శ్రీశ్రీకి జీవితాంతం ఒక అలవాటు ఉండేది. అది తాను చదివి తన మనస్సుకు నచ్చితే ఆ సాహితీ రూపా లను అనువదించటం అనేది అబ్బూరి విశ్వవిద్యాలయ గ్రంథాలయ తలుపులు శ్రీశ్రీ కోసం ఎప్పుడు తెరిచే ఉండేవాడు. అప్పటిదాకా శ్రీశ్రీ కావ్యభాషాశైలిలోనే ఛందోబద్ధంగా పద్యరచన చేస్తుండేవాడు. తరువాత కాలంలో విశ్వనాధ, దేవులపల్లిల ప్రభావం నుంచి బయట పడి సొంత గొంతుకను ఆధునికాంధ్ర సాహితీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే స్వీయ ధోరణి సవరించుకోవడానికి దశాబ్దికాలం కావాలని వచ్చిందని చెప్పుకున్నాడు.

శ్రీశ్రీ మొదటి కవిత బావ కవిత్వ ధోరణిలో నడచిన "ప్రభవ" (1927) తర్వాత సుప్తాస్థికలు 1928 ఆ కాలంలో వచన పద్య రచనలో ప్రయోగాలు చేస్తున్న శిష్ట్లా ఉమామహేశ్వర రావు రచనలను గమనించి తనెందుకు అలా రాయకూడదని ఆవేశ పడ్డాడు. గురజాడ ప్రభావం సరికొత్త ఛందస్సును కనిపెట్టి మార్గాలనుఅన్వేషించమని ప్రోత్సహించింది. ఇంటర్‌మీడియట్ కోర్సు పూర్తి చేసే లోపే అతను అబ్బూరి వశీకరణ శక్తికి మైమరిచాడు. రాడికల్ హ్యూమనిజం వైపు మొగ్గలేదు గాని రాడిక లాభాన్ని అభిమానించారు.

మద్రాస్‌లోని అడయార్, కన్నెమరా పబ్లిక్ లైబ్రరీలను శ్రీశ్రీ కొల్లగొట్టాడు. మద్రాస్ క్రిష్టియన్ కళాశాలలో బి.ఏ. విద్యార్థిగా ఆ నగరంలో 2సం॥ ఉన్న కాలంలో ఎడ్గార్ ఎలెన్‌పో కవిత్వము (1808-1849) ఛార్లెస్ బాదిలాయిర్

(1821-1867) రచనల అనువాదాలు అతన్ని ముగ్ధుల్ని చేసాయి. అమెరికాలోని బీటా తీరం వారి కవితలను ఇంగ్లండులోని కొద్ది యువకుల 'యాంగ్రీ యంగ్ మెన్" రచనలనూ అధ్యయనం చేశాడు. మహాత్మాగాంధీని ప్రభావితం చేసిన ఆఫ్రికన్ యువకుల రచనల కోసం గాలించాడు. జాన్‌పాల్‌స్మార్ట్ (1905-1980) రచనలను పఠించాడు. జర్మనీ విద్వంసుడు ముక్స్‌ధర్టానో అనేకమంది ఫ్రెంచి కవులను ఉల్లేఖిస్తూ ప్రచురించిన 'డీ' జనరేషన్ సంకలనం అతన్ని ఆకట్టుకుంది. "సర్ ఆర్థర్ కానన్‌దాయిల్" సృష్టించిన పరిష్కారాలను పరిశీలించాడు. అమెరికన్ రచయిత దిన్‌క్లెయిర్ లూయూ(1885-1957) నవలలు, అమెరికన్ పెట్టుబడిదారి వ్యవస్థను అతడు వ్యతిరేకించిన విధానం కూడా ఆకర్షణకరమైనాయి. అంతేకాకుండా ఎ.సి. స్వీన్‌బర్న్, అల్గర్నాన్ చార్లీల కవితలు చదివి వారిని అనుకరించాడు. తన గేయాలలో కొన్నింటిలో రవీంద్రనాథ్ ఠాగూర్ లాగా ఒకసారి శబ్ద సౌందర్యం కోసం, మరోసారి అర్థానుభూతికోసం కవిత లను రెండుసార్లు చదవటం అనే బలహీనతను అలవర్చు కున్నారు.

విలియం సర్‌మూన్, ప్రాంభ్‌కాఫ్కా, స్వాలదార్ తాల్ని, మార్రినీ, ఆనతాల్ బ్రెటన్, ఆంతోనీ ఛెహుప్, రసెల్ బేకర్, గ్రీకు కవి మొ॥న కవుల రచనలు కొన్నింటిని అనువదించాడు. శ్రీశ్రీకి నచ్చిన ఏ కవితలైన అనువదించటం అనే ప్రయోగం ద్వారా తన అభివ్యక్తి పద్ధతిని ఆవిష్కరించటానికి ప్రయత్నం చేశారు.

బి.ఏ. పాసయ్యి విశాఖకు తిరిగి వచ్చిన శ్రీశ్రీ మరోసారి అబ్బూరి ప్రభావంలో తనమునకలై తన గురువు ప్రపంచ అభ్యుదయ రచయితల సమాఖ్యకు శాఖగా స్థాపించిన పర్వమున లేఖక సంఘంలో చేరాడు. అక్కడ అనేకమంది మేధావులతో పరిచయం ఏర్పడింది. వచనంలో విమర్శనాత్మక వ్యాసరచనను అభ్యసిస్తూ గురజాడ కన్యాశుల్కంలోని స్త్రీ పాత్రలను గురించిన అలాంటి వ్యాసం 1932లో ప్రచురించాడు.

1938 మధ్యలో బరంపురంలో జరిగిన అఖిలాంధ్ర కవి పండిత సభకు హాజరయినపుడు సుప్రసిద్ధ కథానిక రచయిత, నవలాకారుడు అయిన చింతాదీక్షితులతో పరిచయం కలిగింది. అప్పటికేలబ్ధి ప్రతిష్టులైన కొందరు విద్వాంసులకు అతడి కవితలు ఆకర్షితులయ్యాయి. 1934లో మండపాక పార్వతీశ్వరశాస్త్రి (1885-1940) ప్రశంసించటమే విద్వత్పపంచం మొదటిసారి ప్రసాదిం చిన గుర్తింపు కావచ్చు బహుశా!

తరువాతకాలంలో అభ్యుదయ భావజాలంతో రాసిన మహాప్రస్థానమనే గ్రంథరూపంలో ప్రచురించిన విడివిడి గేయాలను శ్రీశ్రీ మిత్రుల వద్ద బహిరంగంగా చదివి తక్షణ ఆమోదం సంపాదించటం మొదలైంది.

1934 ఏప్రిల్ 12 కాకినాడలో యువజన బహిరంగ సభలో ఇతను రాసిన మరో ప్రపంచగీతం ఆలపించగా ప్రశంసల వర్షం కురిసింది. ఇతని కవితలకు దేవులపల్లి కృష్ణశాస్త్రి, గుడిపాటి వెంకటాచలం, జలసూత్రం వంటి మొ॥వారు మెచ్చుకున్నారు. అతడి సుస్థాస్థికలను, మహాప్రస్థాన గేయాలను భారతి పత్రిక ఒకప్పుడు తిప్పి పంపిన తరువాత మెచ్చుకుని ప్రచురించింది. ఇలా తనను ప్రభావితుల్ని చేసిన వారిని కూళిఐడా శ్రీశ్రీ ప్రభా వితులను చేయటం మొదలైంది. కాకినాడ, విశాఖపట్నం, విజయవాడలో జరిగిన సాహిత్య పరిషత్ సమావేశాల్లో శ్రీశ్రీకి అగ్రపీఠం లభించింది. 1940 నాటికి సంప్రదాయ పత్రిక కృష్ణాపత్రిక కూడా సమకాలీన మహాకవుల్లో అతన్ని చేర్చవలసి వచ్చింది. 'ప్రతిభ' సంపాదక మండలిలో 1940లో సభ్యుడై సాహితీ ప్రపంచంలో శ్రీనివాసరావుగా శ్రీశ్రీగా పునర్జన్మించారు.

1945లో మరోసారి మద్రాస్ చేరుకుని సినిమా రంగంలో ప్రవేశించి చలన చిత్రాలకు పాటలను రాసారు. అల్లూరి సీతారామరాజు సినిమాకు "తెలుగువీర లేవరా" శ్రీశ్రీ రాసిన అణిముత్యాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. పాటలను రాస్తూనే ప్రపంచ సాహిత్యాన్ని తనకు నచ్చిన రచనలను అనుకరించటం చేస్తు సాహిత్యాధ్యయనం

మానలేదు. 1946-49 నం॥ల మధ్యకాలంలో ఆనందవాణి పత్రికకు సంపాదకత్వం వహించారు. 1947లో ప్రాంతాల నుంచి కమ్యూనిస్టు ఉద్యమాలలో క్రియాశీల పాత్ర వహిస్తూ బహిరంగ ఉపన్యాసాలు చేయడం ప్రారంభించారు. పురిపండా కవితను ఇంగ్లీషులోని అనువాదం చేశారు. కాళోజీ, శేషేంద్రశర్మ, రావిశాస్త్రి, విశ్వనాథశాస్త్రి, గజ్జల మల్లారెడ్డి మొ॥ వారిని రచనలకు పీఠికలు రాసేవారు.

యువతరం మీద శ్రీశ్రీ ప్రభావం స్పష్టరూపం ధరించింది. హైదరాబాద్, నిజాం అశిక్షిత సేనలు, రజాకార్లు, తెలంగాణా ప్రజల మీద నడిపిన కిరాతక చర్యలనూ, భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభలు, ప్రతీకారంగా లేవదీసిన సాయుధ సమరాన్ని సమర్థిస్తూ అతడొక్క అక్షరమైన రాయకుండా మౌనం పాటించాడు. కానీ పీడిత ప్రజల మీద సానుభూతితో నిజాం రాక్షసచర్యలను కవితారూపంలో ఖండించిన వారిని మాత్రం ప్రోత్సహించాడు.

శ్రీశ్రీ 1933-1940 వరకు ఆయన రాసిన మహాప్రస్థానం, జగన్నాథ రథచక్రాలు, గర్జించురష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహాప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించారు. ఈ పుస్తకం తెలుగు సాహిత్య దశను, దిశను మార్చిన పుస్తకంలా చరిత్రలో నిలిచి పోయింది. బాటసారి, భిక్షువర్షీయసి మొ॥ కవితలను రాసారు.

శ్రీశ్రీ ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో మహాప్రస్థాన కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీని మహాకవిని చేసింది. తరువాత మరోప్రస్థానం , ఖడ్గసృష్టి అనే కవితా సంకలనాలను చరమరాత్రి అనే కథల సంపుటిని, రేడియో నాటికలను రచించాడు. ''మహాప్రస్థానం'' వంటి గేయాలన్ని మార్క్సిజం దృక్పథంతో రాసినవే అయినా అతను రాసేనాటికి మార్క్సిజం అనేది ఒకటుందని అతనికి తెలియదు.

శ్రీశ్రీ వ్యక్తిత్వం ఎన్నో విరుద్ధమైన భావాలు, విచిత్రమైన సంఘర్షణలు కనిపిస్తాయి. అతను మొత్తంగా బహిర్ముఖుడు. తీవ్ర విమర్శలకు, పసితనపు మాటలకు సమంగా ప్రసిద్ధుడు. సిద్ధాంతాల గురించి, తోటికవుల గురించి, అతను అభిప్రాయాలుఅత్యంత వేగంగా,అతితక్కువ హేతుబద్ధంగా మారుతుండేవి. ఉద్యోగాల్లో ఇమడలేకపోవడం, మొదటి వివాహంలో పిల్లలు కలగకపోవడం, చివరి దశలో దాదాపు 50సం॥ల వయసులో రెండోభార్యతో పిల్లలు పుట్టడం, సినిమాలో సంపాదించింది మొత్తం కోల్పవడం, తన అస్థిరత వల్ల సాహితీ సంఘాల్లో వివాదాలు రావడం ఎన్నెన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. మద్రాసులో ఉన్న రోజుల్లో నను బ్రతికించిన వారు ఇద్దరే. ఒకరు మున్సిపాలిటీ కుళాయి. రెండోది విశ్వనాథసత్యనారాయణ పద్యాలు అని చెప్పుకున్నాడు.

1955 సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టుల తరపున శ్రీశ్రీ చురుగ్గా ప్రచారం నిర్వహించాడు. హనుమాన్ జంక్షన్‌లో ఒక ప్రచార సభలో అతని ఆరోగ్యం దెబ్బతిని కొన్ని నెలలపాటు ఆసుపత్రిలో ఉండవలసి వచ్చింది. 1969 లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రంగాఉన్న సమయంలో శ్రీశ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యతో కలిసి ఖమ్మంలో సమైక్యవాదాన్ని వినిపిస్తూ ప్రదర్శన జరిపారు. ఎన్నో పురస్కారాలు పొందాడు. రాజ్యలక్ష్మీ ఫౌండేషన్ అవార్డు, కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు మొ॥. అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షునిగా పనిచేశారు.

1970లో శ్రీశ్రీ షష్టిపూర్తి ఉత్సవం విశాఖపట్నంలో జరిగింది. ఆ సందర్భంలో అతను అధ్యక్షుడిగా విప్లవ రచయితల సంఘం ఏర్పడింది.

తెలుగు సాహిత్యంలోనే చెరగని ముద్ర వేసుకున్న శ్రీశ్రీ 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి.... సంప్రదాయ ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన విప్లవకవి, అభ్యుదయ భావాలతో జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైతాళికుడు. కొంతకాలం క్యాన్సరు వ్యాధి బాధకు లోనై 1983 జూన్15న మరణించారు.

1940 తర్వాత ఒక దశాబ్దము పాటు ఆంధ్ర సాహిత్య లోకమును ఉత్తేజితమొనర్చిన అభ్యుదయ కవిత్వోద్యమ మూల విరాట్టు, భావ కవిత్వమునకు విరుద్ధముగా జెండా యెత్తుటతోనే కాక, శ్రామిక వర్గ చైతన్యమూపిరిగా గల సరికొత్త కవితారీతికి పాదులు వేసిన స్రష్ట. వాస్తవికతతో పాటు, అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యముతో పాటు సంఘ చైతన్యమును సమానాధికరణముతో ప్రవచించిన ప్రవక్త శ్రీశ్రీ అని సి.నా.రె గారు ప్రశంసించారు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మహాప్రస్థానం - పీడిత తాడిత వర్గాల రాజ్యాంగం

- కొండ మోహన్, డి.ఎఫ్.ఓ., జలమండలి, హైదరాబాద్.

శ్రీ శ్రీ, శ్రీరంగం శ్రీనివాసరావు గారు, ఆ పేరు వింటేనే ఒక ఉప్పెన, ఒక సునామీ. అణగారిన వర్గాలకు సామాజిక దోపిడీ నుండి విడుదల చేసే ఒక నిశ్చయ సంకల్పం. తాడిత పీడిత వర్గాలను కర్షక కార్మిక శ్రామిక వర్గాలను హృదయాలలో హత్తుకుని తమ కార్యాచరణకు ఉద్యుక్తులవడానికి దిశానిర్దేశం చేసే మంత్రాక్షరాలు. ప్రపంచ శ్రామిక వర్గాలన్నిటినీ ఏకం చేసి తమకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాట పటిమను నేర్పే బీజాక్షరాలు.

యుగయుగాలుగా, తరతరాలుగా తమకు జరుగు తున్న అన్యాయాన్ని, అణిచివేతను తెలిసీ తెలియ కుండానే భరిస్తూ తమ రక్తాన్ని స్వేదపుటేరులుగా ప్రవహింపజేస్తూ ప్రపంచంలోని కొద్దిమంది పెత్తం దారులు, భూకామాంధులు, పారిశ్రామిక వేత్తలకు సకలైశ్వర్యాలు సమకూరుస్తూ కనీసం తమకు కూడు గుడ్డ, తమ కుటుంబ సభ్యులకు కడుపునిండా బువ్వకూడా పెట్టలేని బ్రతుకులకు తమకు తామే కుమిలిపోతున్న సమయంలో శ్రీ శ్రీ గారి కవిత్వం ముఖ్యంగా మహాప్రస్థానం కావ్యం, ఈ వర్గాల వారి నందరికీ వెలుగు రేకలు కనిపిస్తున్న ఒక నూతన ప్రస్థానం వైపుకు, తమ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే నవీన మార్గం వైపుకు దారులు చూపిన విశిష్ట గ్రంధం. ఈ వర్గాల పాలిట ఇది నూటికి నూరు శాతం వారి జీవితాలకు వెలుగు చూపడానికి సృష్టించిన రాజ్యాంగమే ఈ రాజ్యాంగంలో ఈ వర్గాలు తమ బతుకులు బాగు చేసుకోవడానికి చేయవల్సిన కార్యక్రమ వివరాలు, ఆచరించవల్సిన నియమ నిబంధనలు గుదిగుచ్చి రాసిన మహాకావ్యం. వీరి బాధల నుండి విడుదలకు వీరందరూ ఏకమై వీరు ఏ విధంగా మునుముందుకు వెళ్ళాలి అని సునిశితంగా వివరించారు శ్రీ శ్రీ. శ్రీ శ్రీ తానే చెప్పుకున్నట్టుగా తన కవితను ఛందస్సుల పరిష్వంగమ్ నుండి బయట వేయడానికి తన ప్రారంభ జీవితంలో ఎంతో క్షోభపడ్డధీ తర్వాతి కాలంలో తన కవిత్వాన్ని అభ్యుదయ పథంలోకి నడిపించి సమాజ క్షేమం కోసం ఏ విధంగా బాటలు వేసిందీ వివరించారు.

శ్రీ శ్రీ గారు తన మహాప్రస్థానం కావ్యాన్ని 1930-40 దశకంలో 41 కవితా ఖండికలతో రచించి కూర్చిన కవితా సంపుటి. ఈ కార్యంలో తన మిత్రుడు కొంపెల్లి జనార్ధన రావుకు ప్రేమతో, తన హృదయాంతరాల నుండి వచ్చిన బాధతో రాసిన 'అంకితం' మొదటి కవిత ఐతే 'జగన్నాధ రధచక్రాలు' చివరి కవిత. 'నామాట' లో శ్రీ శ్రీ గారు "అందమైన అబద్దాలకన్నా నిష్ఠురమైన నిజంలోనే మంచి కవిత్వం దర్శనీ యమౌతుందని విశ్వసించి, గ్రాంధిక శైలికీ, గణబద్ధ చందస్సులకి గుడ్ బై కొట్టేశానని చెప్పారు, ఇదే గురజాడ అడుగుజాడ అనీ, అంతవరకూ వెయ్యేళ్ళ అన్యాహతంగా సాగుతూ నలిగినా క్లాసికల్ బండి దారి నుంచి గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్త మలుపు ఇచ్చాడు.

రథాలు, పల్లకీలు, గుర్రబ్బళ్లూ తిరిగే ఆధునిక యుగానికి తెలుగు కవిత్వాన్ని మళ్ళించాడు. గురజాడ చూపించిన మలుపును నేను మహాప్రస్థాన గీతాలతో మరింత వెడల్పు చేశాను." అని మహాకవి తన మనసులో మాట చెప్పుకున్నాడు. "మహాస్థానం' లో నేను చేసిందంతా సామాజిక రుగ్మతను నిదానించడం మాత్రమే. ఇది మన ప్రపంచం! ఇలా ఉన్నారు ఇచ్చటి ప్రజలు అన్నాన్నేను అని చెప్పుకు వచ్చారు. ఇక ఇంతటితో ఆగిపోకుండా జబ్బుకు తగ్గ ముందు వెదకాలనీ, పై పై పూతలతో ఈ జబ్బులు కుదురవు కావాల్సింది "శస్త్రచికిత్స" దాన్నే

విప్లవం అంటున్నామని చెప్పుకొచ్చారు. నా మహాప్రస్థానం విప్లవసాహిత్యం కాదనీ, విపల్వఇబీజాలు యున్న అభ్యుదయ కవిత్వమనీ సామాన్య ప్రజానీకాన్ని విప్లవాచరణకుద్యుక్తుల్ని చేసే విధంగా సాగుతుందని తెలిపారు. యోగ్యతా పత్రంలో శ్రీ చెలం గారు 1940 లలో నాటి సామాజిక పరిస్థితులను నాటి గ్రాంధిక కవిత్వాలను శ్రీ శ్రీ గారి మహాప్రస్థానంలో కవితలతో చక్కగా పోల్చి చూపించారు. తనకి ప్రపంచానికి సామ రస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్ బాహర్ యుద్ధా రావమే కవిత్వమంటాడు చెలం. హృదయం ఎలా కంపిస్తే ఆ కంపనకి మాటల రూపం యివ్వడం శ్రీ శ్రీ కే తెలుసనీ, మాటల్ని కత్తులూ, యీటెలూ, మంటలుగా మార్చడం అతనికే చేతనవుననీ చెలం చెపుతారు.

ఇక కృష్ణ శాస్త్రి తన బాధని అందరిలో పలికిస్తే శ్రీ శ్రీ అందరి బాధని తనలో పలికిస్తాడని, కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ ఐతే, ప్రపంచపు బాధ అంతా శ్రీ శ్రీ బాధనే అని చక్కగా చెప్పారు శ్రీ శ్రీ గురించి. ఇక చివరగా ఈ కావ్యంలో రాబందుల రెక్కలచప్పుడు వయోధర ప్రచండ ఘోషం ఘున్ఘానిల షడ్జధ్వానం విని తట్టుకోగల చావ వుంటేనే ఈ పుస్తకం తెరవమని చేసిన హెచ్చరిక నాడే కాదు అది నేటికీ నూటికి నూరు పాళ్ళు నిజం.

ఇక కావ్యంలోని ఇతివృత్తింలోకి వచ్చినట్లైతే శ్రీ శ్రీ తన "మహాస్థానం" కవితలో దారిపొడుగునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ మరో ప్రపంచం కొరకు వెళ్లాలని ఉద్బోధిస్తూ ఎముకలు కుళ్లిన, వయసు మళ్ళిన సోమరు లకు భారమంటాడు. నెత్తురు మండే వారిని శక్తులు నిండిన వారిని సైనికల్లా కదలిరమ్మన్నాడు. మహా ప్రపంచంలోని అగ్ని కిరీటపు ధగధగలు, ఎర్ర బావుటా నిగనిగలు, హోమజ్వాలల భుగభుగలు కనబడటం లేదా? అని ప్రశ్నిస్తాడు. బయభురిలో నేను సైతం ప్రపంచాబ్దపు తెల్లరేకై పల్లవిస్తాననియు భువనభవనపు బావుటాగా పైకి లేస్తానని చెప్పాడు.

ఒక రాత్రిలో జాబిల్లిని ఆకాశపుటెడారిలో మబ్బుల్ని కాళ్ళు తెగిన ఒంటెలా ఉందనడ ఒక నూతన ఉపమానం. బుక్కులు శీర్షికన చెప్పిన కవితలో కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లలను నూతన కవితా వస్తువులుగా పరిచయం చెసాడు. అంతవరకు యున్న రాజకుమారులు, ఉద్యానవనాలు, ఐరావతాలు, ప్రేమబంధాలు అనే వివిధ వర్ణనల నుండి ప్రతీది కవితావస్తువేనంటూ, దేన్నీ హీనంగా హేయంగా చూడవద్దనీ కవితావేశం యుంటే ప్రతి దానిపై కవిత్వం అనర్గళంగా రాయవచ్చని చెప్పాడు. ప్రపంచం పద్మవ్యూహమనీ కవిత్వం తీరిన దాహమనీ తీర్మానించాడు కవి.

తాను చెప్పినట్టుగానే తన కవితావస్తువుగా ఒక మామూలు బాటసారి కళేభరంతో శీతవాయువు ఆడుకుంటోంది, పల్లెటూళ్ళో తల్లికేదో పాడుకలలో పేగు కదిలిందీ అనడంతో ఆ పేద బాటసారి జీవితం అంతమయ్యిందని చెప్పకనే చెప్పాడు కవి.

ఇక తన నవకవితలో నవకవనానికి కావల్సిన కధా వస్తువులు నూతనంగా, సమాజ పరివర్తనానికి కావల్సినవి ప్రపంచ శ్రామిక, కర్షక, కార్మిక వర్గాల శ్రేయస్సును కాంక్షించే కవిత్వం రావాలనీ, కదిలేదీ కదిలించేదీ, మారేది మార్పించేదీ మునుముందుకు సాగించేది, పెనునిద్దుర వదిలించేది పరిపూర్ణపు బ్రతుకిచ్చేదే నవకవనానికి కావా లని కవిత్వంలో యుండాలని చెప్పారు కవి.

దేశ చరిత్రలు కవితలో ప్రతీ జాతి చరిత్రా పరపీడన పరాయణత్వ మనీ, బలవంతులు దుర్బలజాతిని బానిసలుగా మార్చుకొన్నారనీ నరహంతకులు దేశాధిపతులైన వికృత పరిపాలనలో ఎన్నో సంసారాలు చల్లారినవనీ, చరిత్ర మొత్తం అసహాయుల హాహాకారాలతో నిండినవని బాధపడ్తాడు.

చీనాలో రిక్షారాలా, చెక్ దేశపు గనిపని మనిషీ ఐర్లాండున ఓడ కళాసీ, దేశమేదైనా అచ్చట అణగారిన వారందరూ ప్రపంచమంతట కుటుంబమనీ, పీడిత తాడిత వర్గమని అణగారిన వర్గమని గొంతెత్తి నినదించారు.

నైలునదీనాగరికతలో సామాన్యుని జీవనం, తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీల వివరాలు ప్రభువెక్కిన పల్లకీ వర్ణన కాదు దానినిమోసిన బోయిల వివరాలు కావాలిప్పుడు అంటాడు. ఇక చివరగా 'జగన్నాధుని రథచక్రాలు' లో పతితులను, భ్రష్టులను, బాధా సర్పదష్టులను ఏడవవద్దని ఓదారుస్తూ, తన కవిత్వంతో జగన్నాధరధచక్రాలను భూమార్గం పట్టిస్తానని, దానితో స్వాత్యంత్ర్యం, సమభావం, సౌహార్ధం పునాదులై ఇల్లులేచి, జనావళికి శుభం పూచి జగమంతా శుభకరమౌతుందని ఇక మీ రాజ్యం మీరే ఏలుకోండని ఉద్బోధ చేశారు మహా కవి శ్రీ శ్రీ.

ఈ విధంగా మహాప్రస్థానం కాహాప్రస్థానం కావ్యంలోని ప్రతి అక్షరమూ తాడిత పీడిత శ్రామిక కార్మిక కర్షక శ్రేయష్షు కొరకు రచియించినాడు మహా కవి. దాదాపు ఎనబది ఏళ్ళ క్రితము రాసిన గ్రంధమైనా అందులోని అంశాలు నేటికీ సమాజములో ఉపయోగపడే విధంగా వున్నాయి ఒక దేశానికీ రాజ్యాంగమేలా శాశ్వత గ్రంధమో, ఈ మహా ప్రస్థానము - తాడిత పీడిత వర్గాలున్నంత వరకూ వారికి ఉపయోగపడే రాజ్యాంగ గ్రందంగా ఆచంద్ర తారార్కమూ నిలిచి పోతుందనడములో ఎలాంటి సందేహము లేదు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ శ్రీ మహా ప్రస్థానం - సామాజిక చిత్రణ

- ఖి. క్ష్మధరీన, అసిస్టెంట్ ప్రొఫిసర్, తెలుగుశాఖ, గవర్నమెంటు డిగ్రీ సిటీ కాలేజ్, హైదరాబాద్.

తెలుగు సాహిత్య ప్రపంచంలో అభ్యుదయ మార్గ ప్రవర్తకుడు శ్రీరంగం శ్రీనివాసరావుగారి పేరు వినగానే మనకు స్ఫురణకు వచ్చు కావ్యం మహా ప్రస్థానం. దానిని కావ్యమును కన్న గీతముల సంపుటి అనవచ్చు. ఒక దశాబ్ద కాలములో 1933-43 వరకు అప్పుడప్పుడు ఆయన వ్రాస్తూ వచ్చిన గీతములను సంపుటికరించి గ్రంథముగా 1950లో ప్రకటింపబడినది. భావ కవిత్వపు రోజులలో భావ కవిత్వము వ్రాస్తూ కవిగా చలామణి అవుతూ ఇంతో అంతో కీర్తి సంపాదించి నప్పటికిని సుప్రతిష్ఠితమైన కవిగా అందులోనూ అభ్యుదయ మార్గ ప్రవర్తకుడుగా కీర్తి నందుకొన్నది, మహాప్రస్థాన కావ్య ప్రచురణము తరువాతనే.

'నేను సైతం'' అనడంలోనే తన వ్యక్తిత్వపు ప్రత్యేకతను, కవి స్థిరపరచు కొన్నాడు.

''నేనొక్కణ్ణే నిలిచిపోతే, చంద్రగాడ్పులు, వాన మబ్బులు, మంచుపోనలు, భుగ్గమౌతాయి'' నింగినుండి తొంగిచూచే రంగురంగుల చుక్కలన్నీ రాలి నెత్తురు కక్కుకుంటూ పేలిపోతాయి'' ''పగళ్లు పగిలి పోయి'' నిశీతాలు విశీర్ణిల్లుతాయి'' ''మహా ప్రళయ జగం నింగా ప్రగల్పిస్తుంది.'' నేనొక్కనే ధాత్రి నిండా నిండిపోయి, ''నాకుహూరుత శికరాల్ లోకమంతా జల్లులా ముహూర్తా లాగ మిస్తాయి.'' ఈ భాగంలో కవి విశ్వాన్ని శాశించేంత వరకు ఎదిగిపోయాడు. పూర్వ భాగంలో submissiveness, sympathy and suffering ఆకారులు భావము, సహానుభూతి, బాధ ఉండగా ఉత్తర భాగంలో జగత్తునే శాసించే భావన ఈ పలస్పర విరుద్ధ భావనలు ఏక కాలంలో ఒకే వ్యక్తి లో కాననవడం.

''అగ్నికి సమిధను ఆహుతి ఇచ్చుట'' ''విశ్వ వృష్టి'' ''భువన ఘోష'' ''భుగ్గమగుట'' ''నిశీధాలు, ''విశీర్ణిల్లి'' ''కుహురుత శికరాలు'' మున్నగు ప్రయోగము లన్నియు సంప్రదాయ కవితా ప్రయోగములే. అశ్రువు, గబ్బిలం వలె కాగిపోపుట, నిలుపున నీరు కారిపోవుట, కోత పెట్టగ కొరడు కట్టుట ఆకలేసి కేకేయుట మున్నగునవన్నీ కవిలో గల చీకటిని దర్శించు తత్వమునకు సంకేతము.

అడవులు, సముద్రము , పర్వత గుహలు, వెన్నెల, చీకటి, ఎండ, జడి వాన ఇత్యాదులన్నియు ఆ దశవర్ణన లకు సంబందించిన వాననలను తెలుపుచున్నవి. భయము, పరిహాసము, ఉద్రేకము, ఉల్లాసము, క్రోధము, జాలి, అసూగము, ఆర్భాటము ఇత్యాదులు సవరసపోషణకు సంబం ధించిన స్మృతులు, సింహము, సివంగి, కురంగి, సర్పము, సృగాలము, బిడాలము, ఇత్యాదుల అరణ్య పర్ణనలకు సంబంధించినవి. ఇక కవి నైజ ప్రవృత్తికి సంబంధించిన గుణము, ఒకేచోట పరస్పర విరుద్ధములగు విషయములను దర్శించే తత్వమునకు సంబందించినది.

శ్రీరంగం శ్రీనివాసరావు గారికి అశేషమైన ఖ్యాతి గూర్చిన రచన ''మహా ప్రస్థానం.'' తెలుగు సాహిత్యమున సమాజాన్ని ప్రభావితం చేసిన రచనకు ఇదియే ప్రథమ ఉదాహారణ అని చెప్పవచ్చును. నడకలోనూ, ఇతివృత్తంలోను, ఆవేశంలో నూ, అర్థంలోనూ నూతన మార్గమును ఆంధ్ర దేశంలో సంచలనం కలిగించిన రచన యిది.

ఈ ఖండ కావ్యంలో ప్రస్తుతం భిన్న ముగానున్న ఈ రచనలోని ఇతివృత్తము వామపక్షీయ ధోరణిలో సున్నదని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

''మహాప్రస్థానం'' లాంటి గేయ రచనకు బాహ్యమైన రాజకీయాల కారణాల కన్న అంతరంగికంగా పెల్లు బుతున్న ఆశాంతి, నెలకొంటున్న నిశానిస్పృహాలు,

మనోవసాదకత, ఆ బాల్యం తాను అనుభవిస్తూ వచ్చిన జీవితం ఎడల అవిశ్వసనీయత, ప్రేమ రాహిత్యం, ఆర్థికా లోపము మున్నగునవి ప్రబలకారణాలై ఉంటాయని ఊహించుటకు సముచితముగా నున్నది. అంతరంగిక ప్రపంచ ముసకనుగుణమైన బాహ్య వస్తువును తన కవితా ప్రపంచమునకనుగుణమైన ఇతివృత్తమును గైగొనుట సహజమైన విషయమే.

జీవచ్ఛవాల వలె బ్రతుకుతున్న జాతీయులను ద్వేశించి, ''ఎముకలు కుళ్ళిన, వయస్సు మళ్ళిన సోమరులా చావండి'' ''నెత్తురు మండే, శక్తులు నిండే సైనికులారా రారండి'' అని ఒక వైపు పాతవ్యవస్థ పట్టుకు వేలాడే జీవచ్ఛవాలను తిరస్కరిస్తూనే ఉద్రేకంతో కొణికిస లాడుతున్న యువతరాన్ని ''పదండి ముందుకు'' పదండి త్రోసుకు, పోదాం పోదాం పై పైకి'' అని మరో ప్రపంచపు ప్రభాత భేరీ నాదము వినివచ్చిన వైపు నిర్దేశిస్తున్నాడు.

ఆదిగో అల్లంత దూరంలో కనబడుతున్న మరో ప్రపంచపు త్రేతాగ్ని వైపు సాగండి అని ఉద్వేగాత్మకంగా ఉద్బోధిస్తున్నాడు. తరతరాలుగా సంప్రదాయకపు కృత్రిమ విలువల వలలో కొట్టుమిట్టాడు కూ తరతమ భేదాలను పెంచుకుంటు దానికి తోడు పరాయి ప్రభుత్వపు బానిసతనము పీడనము, దోపిడీ వీటన్నింటిచే కల్మషమైన ప్రపంచము నుండి విముక్తి పొంది దోపిడీ లేని మరో ప్రపంచము వైపు సర్వసమానత్వము ప్రాతిపదికగా గల సంఘము నిర్మించుటకు గాను సాగండి. పాతది నశించినపుడే నూత్న మైనది వెలయును.

''మహాప్రస్థానం'' గేయాల రచనకు ప్రోద్బలములగు కారణము, కవి వైయక్తిక మగు అంతరంగిక, బాహ్య, కారకాలు ప్రధాన పాత్ర వహిస్తున్నప్పటికీ, సమకాలీన సాంఘిక రాజకీయ, ఆర్థిక కారకాలు గూడ సముచిత పాత్ర వహిస్తున్న పని గూడ గమనించనైనది. అంతర్జా తీయ రంగంలోని వామపక్షీయ ప్రాచుర్యము, పాశ్చాత్య నూత్న సాహిత్య ధోరణు, జాతీయోద్యమము, ఆర్థిక మాంద్యము, దేశమందలి వివిధ సాంఘికోద్యమము కూడ కవిత్వము పై పరోక్షంగా తమ ప్రభావమును చూసినవి.

''మహా ప్రస్థానం'' గీతంలోని కవితావేశం ధారగా సాగుతున్న రోజులవి. కవితా వేశం కవిని ఆవహించి కట్టలు త్రెంచుకొని పొర్లుకున్న రోజులవి. కవికకు ఆవేశమే ప్రధానమన్న విషయము స్వానుభవంతో తెలుసుకొన్నాడు కాబోలు, విషయమేదైనా ఫరవాలేదు. కవిత చెప్పే య్యొచ్చునంటున్నాడు. ''కాదేదీ' కవిత కనర్హం'' కాని కావలసింది మాత్రం శిల్పం! ''కవితావేశం'' ఉం చాలంటున్నాడు. ఆ కవికావేశం కనుక ఉంటే, కుక్క పిల్ల అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, రొట్టెముక్క, అరటితొక్క, ఒక టేమిటి, ఎంత హీనమైన విషయాన్ని గురించి నా కవిత్వం చెప్పవచ్చునంటున్నాడు. కావలసింది మాత్రం ఆవేశం. ఇచట అన్నింటికన్నా ముందు ఒక విషయం చెప్ప వలసి ఉన్నది. అది యాయన పేర్కొన్న పై విషయాలు కవితా వస్తువులు ఆగుటకు అర్హములైనవిగా పేర్కొనబడినవి, కుక్క పిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, రొట్టెముక్క అరటితొక్క, బల్ల చెక్క, తలుపు గొళ్ళెం, హారతి పళ్ళెం - వీనిలో కనీసం ఏ ఒక్క దానిని గురించైనా శ్రీనివాసరావుగారు ఒక గీతాన్నైనా వ్రాయలేదు, హీనమైన ఏ ఒక వస్తువును గురించైనా కవిత్వం వ్రాస్తే బాగుండేది. వ్రాయవచ్చని చెప్పాడే గాని వ్రాయలేదు, ఇక యీ కవితలో పై విషయాలను మినహాయిస్తే మిగిలేది, ఆవేశం మాత్రమే. ఆవేశంతోపాటు రసనికము గూడ ఉంచాలంటున్నారు! ఆవేశము, రసము యీ రెండు కవితను గురించి చర్చించిన వారంతా చెప్పిన విషయము, కాకపోతే హీనమైన విషయాలు కవితా వస్తువులుగా పనికిరావని సంప్రదాయ కవివాదులు వాదిస్తే తాను కొత్త గా, ఆ విషయం చెప్పాడా అంటే అది కూడ నిలవడం లేదు. 'మహాప్రస్థానం' అన్న గీతం రాసేనాటికి నాకు Marxismను గుర్చి తెలియగానే తెలియదు. నేను Marxismను తెలుసుకున్నది. సాహిత్యం ద్వారానేగాని రాజకీయాలద్వారా కాదు.

''ప్రపంచ మొక పద్మవ్యూహం'' అందరూ తన్నే వేదిస్తున్నారు. అందరూ తన్ను బాధించుటకు చూస్తున్నారు. అన్ని విషయాలు తనకు ప్రతికూలంగా నడుస్తున్నాయి. అని అనుకునే మనస్తత్వం కల వారికి యీ ప్రపంచం ఒక పద్మ వ్యూహవే ! కవికి సమాలీనమైన ఉద్యమములు రష్యాయందలి కర్షక కార్మిక విప్లవము. బానిసత్వమును, దోపిడీని, అధికార మనాంధతను, తెంచుకొని ఎవరు దెబ్బ కొట్టిన బోల్షివిక్ విప్లవము కవి యువము కవి మనస్సులో మెదలినది. దానిని సంకేత ప్రాయంగా యీ కవితలో అమ్మ పోసినాడు. విప్లవభావాలు తీవ్రంగా వ్యక్తం చేయుటకు పారాణిక విషయాల రూపంలో చెప్పడం కవి మానసిక ప్రపంచంలో నంప్రదాయకున్న ప్రాధాన్యము వ్యక్తము చేయుచున్నది.

బాటసారి యా ఖండికలో పల్లెటూరిలో పూట గడవక బ్రతుకు తెరుపు కోసం పట్టణం వెళ్ళిన యువకుడు మద్యే మార్గంలో జ్వరంకులోనై కారుచీకట్లలో పెనుతుఫానులో చిక్కుకొని దారి తప్పి ఆ తుఫానులోనే మరణించడం వర్ణితం, సమకాలీన వాతావరణమే ఇందులో ప్రతిబింబిం పబడినది. ఇక కవి మనన్తత్వం ప్రతి బింబించే విషయాలు, దిగులు పడుతూ, దీనుడైన బాటసారి, జ్వరం, భయంతో కూడుకున్నవాడు. దారి తప్పినవాడు చీకటిలో చిక్కుకున్న వాడు. చివరకు మరణించిన వారు. ఇలాంటి పాత్రను చిత్రించడంలో కవి మనసులో నున్న చీకటి, నిరాశ, నిస్పృహ, వేదనలు, పరోక్షంగా వ్యక్త మౌతున్నాయి. చీకటి ప్రసక్తి యీ ఖండికలో రెండుసార్లు రానే వచ్చింది. ''చిమ్మచీకటి క్రమ్ముకొస్తే'' ''రాత్రి. నల్లని రాతిపోలిక'' ''గ్రుడ్లి చీకటిలోన గూబలు'' ''సౌందర్య రాహిత్యం, ''కళ్ళు వాకిట నిలిపి చూచే పల్లెటూళ్ళో తల్లి ఏమని పలవరిస్తుందో ''తల్లి పిల్చేకళ్ళ దృశ్యం'' 'చెవులు సోకని పిలుపులేవో '' ఇవి కవి అవక్తంలో నున్న 'అమ్మ'కు సంబందించిన భావనలు. జీవితంలోని నిరాశావాద దృక్పథము ఇందులో ప్రదర్శితము.

కవి అంటున్నారు (నేను) 'భూతాన్ని' యజ్ఞోపవీకాన్ని'' 'వైప్లవ్య గీతాన్ని అని. కవి మానవమాత్రుడు. అందులో శ్రీనివాసరావుగారు నిరంతరం ఏదో ఒక బలహీనతచే రోగాల క్షణముచే బాధపడ్తూనే ఉన్న వాడు. కొంత గాకున్న కొంత వింత మనస్తత్వమున్నవాడు. అలాంటి కవి తాను భూతాన్నని, యజ్ఞోపవీతాన్నియని, విప్లవ గీతాన్ని యని చెప్పుకొనడంలో ఆయన అవ్యక్త చేత నావస్థలోని కొన్ని అంగములను, ముఖ్యంగా శైశవాస్థకు చెంది. దమితము లైన ''వానిని పరోక్షంగా వ్యక్తీకరిస్తున్నారని మనం గమనించవచ్చును. తనలో ఆ బాల్యంగానున్న బల హీనతకు ప్రతిగా అధిక బలవత్తతను తనలోని న్యూనతా భావాలకు బదులుగా(ప్రతిగా) జౌన్నత్య భావాలను ప్రదర్శిస్తున్నాడు అని. ఇక శైశవాస్థలో తాను సర్వశక్తి సమన్వితుడనన్న భావమునకు పాదు.

''భూతము'' అన్నది మానవుని ఊహాత్మక లోకంలో జన్మించిన ఆది వాస్తవిక ప్రతీక లాంటిది. మానవుని శ క్తికన్నా మించిన శక్తి అన్న భావంలో వాడ బడుతుంది. అది సర్వశక్తి సమన్వితమన్న భావము గూడ కొందరిలో వుంటుంది.

''యజ్ఞోపవీతము''. ఇది వైదికాచార పరంపరలో గృహస్థులను, బ్రహ్మ ''చారులును ధరించవలసిన పవిత్ర సూత్రము, బలమును తేజస్సును కలిగించుటకు దీనికి గలదు, మిక్కిలి పవిత్రమైనదిగా నిది భావించబడును. యజ్ఞోపవీతధారణ మంత్రము ఆయుర్వృద్ధికరమని గూడ చెప్పబడినది. ఇది బ్రహ్మకర్మగా కూడా పేర్కొ నబడినది.

ఇక ''విప్లవ గీతము''. ఎదురు దెబ్బతీసే తత్వానికి చిహ్నము. వీన న్నింటిలో గల శక్తి తనలో వున్నదని శక్తి సమన్వితత థాపన కవిలో కొట్టవచ్చినట్లు కాననగుచున్నది. ఇచట భూతము గాని, యజ్ఞోపవీతము గాని, విప్లవ గీతము గాని ప్రధానములు గావు. వాని వెనుక మూల భావన మే ప్రధానము. ఆ మూలభావన '' సర్వశక్తి సమన్వితుడనన్న' శైశవ సంబంధిత భావనల శేషమును సూచిస్తుంది. కావున భూతము, యజ్ఞోపవీతము, మున్నగు విషయముల వెనుక నున్న తత్వమును నిర్ణయించనైనది.

ఇక 'స్మరిస్తే పద్యం' 'అరిస్తే వాద్యం', అనర్గళం, అనితర సాధ్యం, నా మార్గం, ఇత్యాదుల శైశవావస్థయందలి శబ్దశక్తి విశ్వాసమునకు సంబంధించిన విషయములు.

ఇక ఈ కవితలో గమనించదగిన ఇంకొక ముఖ్యాంశం కవి మానసిక ప్రపంచంలో సురక్షితమైన ముద్ర వేసిన సంప్రదాయకత- భూతము, యజ్ఞోపవీతము, అనల వేదిక, ఆజ్య నైవేద్యము, పరమేష్ఠి జూకాలు, కంకేళికామంజరులు, స్వర్గం ఇత్యాది విషయము లన్నియు హిందూ మత విశ్వాసములను, పైదికాచార వ్యవహారములకు సంబంధించిన విషయములును అయి యున్నవి. బాల్యంలో కవిపై ముద్రవేసిన సంప్రదాయ ముద్ర ఆవేశంలో అడుగంట కుండా అధివాస్తవిక రూపంలో ఆవిర్భవించింది.

అది వాస్తవిక ధోరణి ప్రదర్శించినా, విప్లవ భావాలను గురించి వ్రాసినా, తిరుగుబాటు తనం వ్యక్తీకరించి, వాటన్నింటిలో సంప్రదాయక ముద్ర స్పష్టంగా కనబడుతున్న విషయం యింతకు ముందు తెలిసి యుంటిని. యా గీతంలో కూడా సంప్రదాయకత ముద్ర స్పష్టంగా గోచరిస్తున్నది.

"నాగత శైశవ రాగమాలికల ప్రతిధ్వనులకై, పోయిన బాల్యపు చెరగిన పదముల చిహ్నాల కోసం ఒంటరిగా కూర్చుండి ఉరుములు కదిలే గాలికి కబళము నిస్తూ, ప్రమాద వీచికలు కమాచి పాడగా, సెలయేళ్ళను లేళ్ళను లాలిస్తూ, పాతాళానికి పల్టీకొట్టి పైతరణి నది లోతులు చూస్తూ శాంతము లేక ఏకాంతముగా, దిగ్భ్రాంతితో మునిగి గుటకలు వేస్తున్నానని కవి వివరించాడు. శాంతములేక దిగ్భ్రాంతిలో మునిగి, వైతరణీనది లోతులు చూస్తున్నాడు కవి. కవి మనస్సు అ శాంతి'తో నిండి యున్నది. యింతా అంతా కాదు.

కవిలోని భయమూ, ఆశాంతి, నిరంతరము ప్రమాదాన్ని శంకించే మనస్తత్వము, అమాయకులైన బాలల గురించి రచించిన గీతంలో గూడ ప్రతిధ్వనించి, ఆయన నైజమును ప్రకటిస్తున్నవి.

ఒక క్షణ లో: క్షణక్షణంలో కవి మనసులో మారే దృశ్యములు, కవి మనో యవనికతపై తళుక్కుమనే స్మృతులు, తెరలు తెరలుగా దొరిలే జ్ఞాపకాలు మరపుల దొంతరల క్రింద అణగిబోయిన స్మృతిరేఖలు.

కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను కాని, తత్వాన్ని గాని రాజకీయపు ధోరణిలో అధ్యయనం చేసిన వాడు కాడు. మహా ప్రస్థానాది గీతాలు వ్రాసే నాటికి పాశ్చాత్య సాహిత్యంలో విప్లవ భావాల పఠనంతో కొన్ని వామపక్రియ దావనల నాకళింపు చేసుకున్నారు. అన్యాయము, దోపిడి, పీడన మున్నగు వానిపై ధ్వజమెత్తి విజయం సాధించిన సోవియట్ విప్లవమును గురించి కొంత తెలిసికొన్నాడు. ఆ భావాలను రాను కూడ స్థానిక పరిస్థితుల ననుసరించి తన గీతాల్లో వెలిబుచ్చాడు.

మచ్చుకు 'వాడు' అనే గీతంలో ఓ జమీందారు, పోనీ ఓ పెట్టుబడివారు శ్రామికులచే అరవాకిరీ చేయించుకొని వారి శ్రమకు తగిన ఫలితం ఇవ్వకుండ ఒక్కప్పుడు వెట్టి చాకిరీ గూడ చేయించుకుని వారిని పశువుల్లా చూసిన దురంతాన్ని, కాదు కూడదని ఎదురు తిరగిన వారిపై జరిపిన అఘాయిత్యాన్ని గూర్చి వ్రాసాడు. దోపిడీ వ్యవస్థపై విమర్శ జమీందారీ పద్ధతి రద్దుకై ఆందోళన మున్నగు విషయములు అప్పటికే రాజకీయ సంచలనంతో సముచితమైన స్థానము ఇంకా లభించలేదు. ఈ విధంగా శ్రీ శ్రీ మహాప్రస్థానం కావ్యంలో సామాజిక చిత్రణను తెలుసుకోవచ్చు.

అభ్యుదయం :

ప్రగతి పథంలో నడుచుటకుత్సహించిన సాహిత్యాన్ని అభ్యుదయ సాహిత్యమని, అభ్యుదయమనే పదాన్ని తానే తొలిసారిగా వాడినానని శ్రీనివాసరావుగారు తెలిపారు.

"మహాప్రస్థానం ఈ శతాబ్దంలో వచ్చిన ఏకైక మహా కావ్యం"అంటాడు పురిపండ అప్పలస్వామి. ఇక ఆయన రాసిన "కవితా ! ఓ కవితా"అనే కవిత ఆయన కీర్తిని శిఖరాయమానం చేసిందనే చెప్పాలి. అక్షర లక్షాధికారి

కోటీశ్వరుడు అయిన శ్రీశ్రీ ''కవితా ! ఓ కవితా''లో ఒక్క అక్షరం తీసెయ్యడానికి వీలులేదు. ''కనీసం వేయి సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో కవితను ఇలా నిర్వచించి, ఇంత కవితాత్మకంగా వర్ణించి, ఇంత అద్భుత సృష్టి చేసిన మరో కవి లేనే లేడు. యోగ్యతాపత్రం పేరుతో మహాప్రస్థానం పుస్తకానికి 1940లో చలం రాసిన పీఠిక. తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప పీఠికల్లో ఇది ఒకటి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు విజ్ఞాన సర్వస్వం సంపుటి-2, తెలుగు విశ్వవిద్యాలయం, 1988
2. ఆధునికాంధ్ర సాహిత్య నిర్మాతలు, హైదారాబాద్ కళాసాగరం, 1974
3. ఆధునికాంధ్ర గేయ కవిత్వం, డా॥.జి.చెన్నాకేశవరెడ్డి

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ కథలు - స్త్రీ జీవన చిత్రణ

- డా॥. పులపర్తి శ్రీనివాసరావు, సహాయాచార్యులు(పి), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య పీఠం, బొమ్మూరు, తూర్పుగోదావరి జిల్లా.

ఆధునిక సాహిత్యాన్ని పరిశీలిస్తే అనేక సాహిత్య ప్రక్రియలు తెలుగులోకి అడుగిడినాయి. వాటిలో ప్రధానంగా కథ, వచనకవిత్వాలు సమానంగా అభివృద్ధి చెందాయి. భాషలో ఏ కొంత ప్రవేశమున్నా కథలను చదివి అర్థం చేసుకొనే అవకాశముంటుంది. కాని భాష తెలిసినంత మాత్రాన కవిత్వాన్ని అర్థం చేసుకోలేరు. సాహిత్యం మీద కొంత అవగాహన ఉండి దానితోపాటు ఆసక్తి, అభినివేశాలుంటేనే కవిత్వాన్ని చదివి అర్థం చేసుకోగలుగతారు. కథా రచన చేయాలంటే సాహిత్యం తెలియవలసిన అవసరం లేదు. వస్తువును ఎన్నుకొని భావాన్ని వ్యక్తం చేయగలిగితే చాలు కథారచయితలుగా తయారుకావచ్చు. కవిత్వ రచనకు భాషతో పాటు సాహిత్యంలో ఏ కొంతైనా ప్రవేశం ఉండాలి. దానితో సరియైన పదాలవాడుక అలవాటు కావాలి. అప్పుడే వచన కవితలో రాణించగలరు. వచన కవిత్వంలో మంచి ప్రావీణ్యమున్న వాళ్లు ఏ కొద్దిమందో కథారచయితలుగా ప్రసిద్ధిపొందారు. ఇలాంటి వారిని వేళ్ళమీద లెక్క పెట్టవచ్చు. అలాంటి ప్రావీణ్యముండి, అటు వచన కవిత్వంలోనూ, ఇటు కథా సాహిత్యంలోనూ పేరు తెచ్చు కుని సాహితీలోకంలో తనకంటూ పుటను లిఖించుకున్న వారిలో శ్రీరంగం శ్రీనివాసరావుని పేర్కొవచ్చు.

అభ్యుదయ కవిత్వానికి మార్గదర్శిగా ఎందరో వచన కవులకు బాసటగా ఉన్న శ్రీశ్రీ తెలుగు సాహితీలోకంలో తనదైన ముద్రను చాటుకున్నారు. సాహితీ వేత్తగా సామాజిక కార్యకర్తగా శ్రీ శ్రీ తెలుగు వారికి అందిన గొప్ప వరం. అసమసమాజం పై ఆగ్రహంతో కవిత్వ కొరడా ఝుళిపించాడు. కార్మిక లోకపు కళ్యాణం కోసం శ్రామిక లోకపు సౌభాగ్యం కోసం రక్తాన్ని అక్షరాల్లో రంగరించి కవిత్వీకరించాడు. సాహిత్యానికి, సమాజానికి ఉన్న బంధాన్ని విస్పష్టం చేసిన దివ్యమైన వెలుగు ఆయన కవిత్వం. తెలుగు సాహితీ సమాజాలలో తనకు కనిపించిన మంచి చెడ్డలను ప్రేమగా హత్తుకున్నట్టే... కసిగా ఖండించినట్టే... తన వ్యక్తిగత జీవిత అంత రంగాన్ని లోకం ముందు బహిరంగ పరచిన నిజాయితీ పరుడు శ్రీ శ్రీ. శ్రీ శ్రీ భావ వ్యక్తీకణలో అనేక అనువైన ప్రక్రియలు ఒద్దికగా ఒదిగిపోయాయి. ఉన్నత సమాజం కోసం అక్షరాక్షరం అగ్నికణమై జ్వలించిన మహోన్నత సాహితీ మూర్తి శ్రీ శ్రీ.

వచన కవిత్వంలో తన కలాన్ని, గళాన్ని వినిపించిన శ్రీశ్రీ కథా రచయిత అని చాలా కాలం వరకు ఎక్కువ మందికి తెలియదు. ఆయన రాసిన కథలను ముద్రించిన తర్వాత శ్రీశ్రీ కూడా గొప్ప కథా రచయితగా గుర్తింఎ బడ్డారు. అతని కవిత్వం మాదిరిగా కథలు కూడా నూతన పోకడలను సంతరించు కున్నాయి. శ్రీశ్రీ కథలు మొత్తం 35 ఉన్నాయి. అవిగాక 27 అనువాదకథలు కూడా ఉన్నాయి. వీరి కథలు మొత్తంలో స్త్రీ జీవన చిత్రణ చాలా స్వల్పమేనని చెప్ప వచ్చు. అయినప్పటికీ పరిశీలించి చూస్తే ప్రస్తావించిన కథలు తక్కువే అయినా ఆ కొద్ది స్త్రీ జీవన చిత్రణ వాస్తవికంగా సమాజానికి అద్దంపట్టే విధంగా కనిపిస్తుంది.ప్రస్తుతం ఆయన స్వీయ కథల్లో స్త్రీ జీవన చిత్రణ ఏ విధంగా ఉందో పరిశీలించి చెప్పేదే ఈ వ్యాస ఉద్దేశ్యం.

"ఆనందమందిరము" కథ పూనా నగరంలో జరిగినట్లు వర్ణించారు. మన్మథరావు మాలతి భార్యా భర్తలు. కథా రచన కాలంలో (1926) సంఘ సంస్కరణ కోసం కవులు, రచయితలు ప్రయత్నించేవారిని కందుకూరి వీరేశలింగం, గురజాడ వారి రచనలవలన తెలుసుకోవచ్చు. అందులో

కొంత హాస్యాన్ని జోడిస్తూ సాంఘిక సమస్యలను తెలియజేసేవారు. ఈ విధానాన్ని గురజాడ కథల్లో గమనించవచ్చు. దిద్దుబాటు కథలో వేశ్యాలోలుడైన భర్తలో మార్పు తీసుకురావాలనే తలంపుతో భార్య చిన్న నాటకమాడి శాశ్వతంగా తనను వదలి పుట్టింటికి పోతున్నానని ఉత్తరం రాసి, పరోక్షంగా భర్త అభిప్రాయాలు గమనించి, అతనిలో నిజమైన మార్పును చూసిన తర్వాత నిజంగా పుట్టింటికి వెళ్ళలేదని చెప్పి భార్యాభర్తలు ప్రేమాభిమానాలతో ఒక్కటై జీవితం కొనసాగించినట్లు చిత్రించారు. ఆనాటి కాలంలో వేశ్యాలోలత్వం ప్రధాన సమస్యగా ఉండి ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమై పోతున్నాయి. అందుకే దాని నేపథ్యంతో అందరికి అందుబాటులో ఉండేటట్లు దిద్దుబాటు కథ రాశారు.

ఆధునిక సమాజాలలో అనేక కుటుంబాలు నాశన మవడానికి మద్యపానం కూడా ప్రధానంగా ఉందని చెప్పవచ్చు. ఈ నేపథ్యంతో రాయబడిందే 'ఆనంద మందిరం'. ఈ కథలో మన్మధరావు-మాలతి భార్యా - భర్తలు. పూనా నగరంలో గొప్ప సంపదలతో నివసిస్తుండే వారు. ఆ నగరంలో ఉన్నత కుటుంబాలలో ఒకటిగా ఉంది. మన్మధరావు మంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఏ చెడు అలవాట్లు లేకుండా, దానగుణం గలవాడిగా పేరు గడించాడు. అలాంటి వాడు అనుకోకుండా మద్యపానానికి బానిసయ్యాడు. అందుకు కారణం, కుమారుడు కలిగినందుకు మిత్రులంతా బలవంతం చేసి త్రాగుడు అలవాటు చేసారు. అంతకు మునుపెన్నడూ త్రాగుడు అలవాటు లేనివాడు. చివరికి ఆ అలవాటే వ్యసనంగా మారింది. ఇంటికి,ఉద్యోగానికీ దూరమై ఆనంద మందిరంలో తాగుతూ కాలం గడిపేవాడు. భార్య ఉపాయమాలోచించి, భర్త చేత తాగుడు మాన్పించటానికి ప్రయత్నం చేస్తుంది. ఆ ప్రయత్నంలో అది కష్టమైనా ఈ విధంగా అంటుంది.-

"మీరను దినమున వందలకొలది సీసాలనుత్తవి
గావించుచుండ నేను దినమునకొక యాలిచిప్పెడు
పానీయము నర్థించినపరాధమేమి? ఈ నా చిన్న
కోరికనే నిరాకరింతురా?"

ఈ మాటలకు మొదట ఆశ్చర్యపడి, తనతో పాటు భార్యకూడా తాగుతున్నందుకు ఆనందాన్ని పొంది, ఆనాటి నుండి ఇంటో జమాఖర్చులంతా భార్యకే అప్పగించగలిగాడు. ఇది భర్తలో వచ్చిన మార్పు.

అనాదిగా పరిశీలించి చూస్తే, భారతీయ సంప్ర దాయంలో, అందునా తెలుగువారిలో స్త్రీలు మద్యం సేవించే అలవాటు లేదు. ఎక్కడో ఒకరు ఆధునిక కాలంలో ఇతరులు ప్రభావంతో వచ్చిన అలవాటును చేసుకోవచ్చు. భర్తలో మార్పు తీసుకొని వచ్చేందుకే ఇష్టంలేనిదాన్ని ఇష్టమున్నట్లు అబద్ధమాడింది. ఆమె మనస్సులోని బాధను అర్థం చేసుకోవాలి తప్ప తప్పు పట్టకూడదు. అది కూడా ఒక నాటకమేగాని నిజంగా తాగదు అనే విషయాన్ని మనం ఇక్కడ గమనించాలి.

ప్రతిరోజు తాగుతున్నందుకు అయ్యే ఖర్చును చూపించేది. నిజానికి ఆమె తాగలేదనే విషయం అతనికి తెలియదు. కనుక అలా తాగుడుకు అవుతుందని చెబుతున్న ఖర్చు పేరుతో ఆ డబ్బును పొదుపుగా దాస్తూ ఉంటుంది. అందువల్ల చివరికి చాలా డబ్బును కూడ బెట్టింది. అదే పట్టణంలో పేరుప్రఖ్యాతలున్న జస్వంత రావు మరణిస్తే, అతని స్మృత్యర్థం ఆసుపత్రిని నిర్మించి, దానిలో అతని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తలుస్తారు. అందుకు మన్మధరావును రెండు వందల రూపాయలు చందా అడిగితే, ఇవ్వలేని స్థితిలో బాధపడతాడు. ఆ సందర్భంలో ఈ విధంగా అంటాడు-

"సుదతీ! జస్వంతుని మృతికి నేను పొందు విచారము
కంటే అతని ఋణము దీర్చుకొనజాలనైతిగదాయను
చింతయే సహస్రాధికమై నన్ను బాధించు చున్నది సుమా!
మాలతీ! వ్యర్థుడను, నిర్ధనుడగు నేనిక చేయ
గల్గునదేమి?
మనయవన్థ నీకు గరతలామలకమే కదా!
నాయుద్యోగము

నాడే యాడినది. చరాస్థియందు గవ్వయైన గన్పించుటలేదు
భూము అమ్మబడినవని నీవే పల్కితివి! .....
జస్వంతుని జ్ఞాపకార్థము పురజనులోక వైద్యశాలను నిర్మించి యందాతని విగ్రహము బ్రతిష్ఠింపదలచిరి రెండు వందల రూపాయల నిమ్మనిరి.....
మనయింటిమీద నామొత్తము వెచ్చియొసంగ గృత నిశ్చయుడనైతిని. ఇంతకంటే నాకు గత్యంతర మేమి?"

ఈ విధంగా నాటకమాడటానికి ధైర్యం, మరొక పక్క త్యాగం ఆమెలో కనిపిస్తున్నాయి. అందువలననే గురజాడ వారి దిద్దుబాటు కథకు, ఈ కథకు చాలాపోలికలున్నాయి. దిద్దుబాటులో భర్తను అక్రమ మార్గంలో నున్నవానిని సక్రమ మార్గంలోనికి తీసుకొనిరావటంలో ప్రధానపాత్రను పోషించి భర్తను ఉత్తమునిగా తీర్చి దిద్దింది. శ్రీశ్రీ కథలో కూడా భార్యచేసింది అదే కాకుంటే వ్యసనాలలోనే వ్యత్యానం మద్యపానంతో ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా, శారీరకంగా నాశనమవు తున్నాయి. దానిలో ఎలాగైనా మార్పు తీసుకొనివస్తే ముఖ్యంగా స్త్రీలు సంతోషంగా జీవిస్తారు. అందుకే శ్రీశ్రీ ఈ విషయాన్ని గ్రహించి కథను మంచి మలుపు తిప్పి ఉత్తమమైనదిగా తీర్చి దిద్దాడు. స్త్రీ తలచుకుంటే ఎలాంటి సమస్యనైనా సరిదిద్దగలదని సూచించటానికే ఈ కథ రాయబడిందని తెలుస్తుంది. సామాజిక సమస్యలలో ఇదొక గొప్ప సంచలనమే. 'నేను తాగకుండా తాగినట్లు నటించి, డబ్బును దాచాను' అనే మాటతో ఆమె ఉత్తమ ఇల్లాలుగా తీర్చిదిద్దబడింది. కథకు ఆ విషయమే ప్రాణాధారమైంది. కథను ముందుకు నడిపించి, పెనుమార్పుకు కారణమైంది. ఇదొక సాంఘిక విప్లవంగా చెప్పుకోవచ్చు. ఈ రకమైన మార్పును శ్రీశ్రీ కోరుకున్నాడు కాబట్టే కథను ఈ విధంగా రాశారనిపించింది.

మరో కథ పరిశీలిస్తే, "ఓసే తువ్వాలు అందుకో" అనే కథ గురించి చెప్పుకోవాలి. స్నానాలగదిలో స్నానం చేస్తూ మొదలైన కథ స్నానం పూర్తి అవటంతో కథ ముగుస్తుంది. దీనిలో భార్యాభర్తలకు పేర్లుపెట్టలేదు. చాలా వైవిధ్యంగా కథను నడిపాడు. భార్య వంట ప్రారంభించి, భర్త స్నానం ముగిసే సమయానికి వంట పూర్తవుతుంది. స్నానం ముగిసి భార్యను తువ్వాలు ఇవ్వమంటాడు. అదే కథకు పేరు పెట్టి తన రచనా వైశిష్ట్యాన్ని ప్రదర్శించాడు రచయిత శ్రీశ్రీ.

"చదువుకుంటానంటే, సంగీతం నేర్చుకుంటానంటే బలవంతంమీద ముడివేయించారు. వద్దంటే వినక నన్ను నరకంలో తోసేరు. ఎన్నాళ్ళయినా ఇంతే నాకిది జన్మశిక్ష. వీణమరిచిపోతున్నాను. నేర్చుకోని వంట నానెత్తిమీద పడింది."

అని బాధపడే భార్యను చూస్తే ఎవరికైనా అయ్యో పాపం అనిపించకపోదు. స్త్రీ అయినంత మాత్రాన పెళ్ళిచేసుకొని, భర్తతో కాపురం మాత్రమే చేయడమే నంటే అది చాలా దుర్మార్గమైంది. భర్తతో కాపురం చేస్తూ తన కిష్టమైన కళను కొనసాగించే అవకాశం కల్పించాలి. పెళ్లి కాకముందు వీణనేర్చుకుంది. చదువుతోపాటు సంగీతం లాంటి ఏదో ఒక కళ అభ్యసించి ఉంటే స్త్రీకి ఔన్నత్యం కల్గించినట్లవుతుంది. తనకిష్టమైన వీణావాదన దూరం చేసినందుకు ఆమె ఎంతో బాధపడుతుంది. ఇది అసహనంగా మారుతుంది. ఒక సందర్భంలో అది వ్యక్తమవుతుంది.

"ఎందుకో ఈ జైళ్ళకి వెళ్ళడం? ఎవరి స్వాతంత్ర్యం కోసం? ఆడదానికి అడుగుతీసి అడుగువేసే అధికారం లేదుకదా
నేనసలు పెళ్ళిచేసుకోననే అన్నాను. స్వతంత్రంగ బదుకు
దామనుకున్నాను. నాలుగేళ్ళలోనే ఆ బదుకెంత నాశన మయిపోయిందో, రెండు మార్లు ఆసుపత్రిలో పడ్డాను ఈ మాటయినా నిలుస్తుందో నిలవదో వీడికేవో జబ్బు లున్నాయి. ఏవో దురలవాట్లున్నాయి. ప్రతీరాత్రి ఆలస్యంగా
ఇంటికి రావడమే ఎలా తప్పుతుంది నాకీ ఖైదు"

ఈ మాటలు పరిశీలిస్తే స్త్రీ ఆవేదన ఏంటో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో నాయకులు ఆనాడు జైళ్ళకెళ్ళారు. అది నిస్వార్థంగా జరిగిందని అందరికీ తెలుసు. దేశ స్వాతంత్ర్యమంటే మానవులకేనా? మానవులకయితే స్త్రీలు కూడా మానవులే కదా! అలాంటప్పుడు మగవాళ్ళతో పాటు వారికి కూడా అన్నిట్లో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కావాలని కోరుకోవటంలో తప్పు లేదు కదా!. ఈ కథలో అదే ఆమె కోరుకుంది. పెళ్ళి చేసుకున్న తర్వాత కూడా స్త్రీలంతా అభిలషించేది కూడా అదే. కోరుకున్నవి జరగకపోతే కుటుంబమే ఒక జైలుగా ఉంటుంది. చివరకు ఆ జైలులోని ఖైదుగా ఉంటామని స్త్రీలందరూ భావిస్తారని ఈ కథలో అంతర్గతంగా తెలియజేయబడింది.

'నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనేది ప్రాచీన కాలంనాటి మాట. కాని కాలం మారింది. ఏ పని చేయలన్నా భర్త, అత్తమామల అనుమతి తప్పనిసరి. ఇవన్నీ చూసి లోకం స్థితిగతులు తెలుసుకున్న ప్రతీ స్త్రీ స్వాతంత్ర్యం కోరుకుంటుంది. పెళ్ళి చేసుకొని బాధలు పడేకంటే వివాహం చేసుకోకుండా ఒంటరిగా బతికితే బాగుంటుందని తలుస్తున్నారు. అదీగాక అనేక దురలవాట్లు గల భర్త ఇష్టమొచ్చినట్లు చెడు అలవాట్లతో తిరిగే వాడయితే, ఆమెకు కుటుంబమే ఖైదుగా ఉంటుందని భావించటం సమంజసమే. అంతేగాక,

"ఎక్కడెక్కడకో పోతాడు. ఏవేవో ఖర్చులు
నేను మాత్రం దమ్మిడీలతో సహా పద్దులు రాయాలి
నేనీ సంసారం చెయ్యలేను. నాకు స్వాతంత్ర్యం
కావాలి. సమానత్వం కావాలి.....
నాకకు పెళ్ళి అక్కర్లేదు. ఏ ఉద్యోగం చేసినా బడికి పోగలను. తిరగబడాలనుకుంటాను. షధైర్యం చాలదు.
ఈ లోకంలో ఆడదై పుట్టడమొంత హీనం ఇంకోటి లేదు."

భర్త ఉద్యోగం చేస్తాడు కాబట్టి తాను ఇష్టమొచ్చినట్లు ఖర్చుచేయవచ్చు. భార్య ఉద్యోగం చేయ లేదు కనుక ఎక్కడికీ వెళ్ళకూడదు. ఒక వేళ డబ్బు ఖర్చు చేస్తే దేనికెంత అయిందో అన్నీ భర్తకు చెప్పాలి. ఇన్ని ఇబ్బందులున్నాయి కనుకనే స్త్రీ స్వాతంత్ర్యం కోరుకునేది. ఒకరిమీద ఆధారపడితే పరిస్థితులన్నీ ఇలాగే ఉంటాయి. స్త్రీ కూడా సంపాదన పరురాలైతే తన అవసరాలకు ఇతరుల మీద ఆధారపడకుండా ఉండవచ్చు. కాబట్టి తనను మనిషిగా గుర్తించిన వారితోనే పెళ్ళి చేసుకోవాలని, లేకుంటే పెళ్ళి లేకున్నా పరవాలేదు. ఒంటరిగా ఉండవచ్చని భావిస్తుంది. చివరికి ఈ లోకంలో స్త్రీగా పుట్టడమంత హీనస్థితి మరొకటి లేదని తలంచిందంటే స్త్రీల పరిస్థితులు ఎంత హృదయవిదారకంగా ఉన్నాయో గమనించవచ్చు. ఈ విధంగా శ్రీశ్రీ కొన్ని కథల్లోనే స్త్రీ గురించిన ప్రస్తావన చేసినా, ఆయా కథల్లోని వస్తువు స్పష్టంగా అర్థ మవడంతోపాటు, రచయిత ఇవ్వదలచుకున్న సందేశం సూటిగా పాఠకులను చేరగలిగేదిగా ఉంది. స్త్రీలలో ధైర్యం కలిగించడం ఒక ఉద్దేశ్యం అయితే, స్త్రీలు కూడా తన కుటుంబాన్ని సక్రమంగా చక్కదిద్దుకోగలరనే అభిప్రాయాన్ని ఈ కథలల్లో తెలియజేశారు.

ఆధార గ్రంథాలు :

1. నవరసాల శ్రీశ్రీ కథలు-సింగంపల్లి అశోక్ కుమార్, అఖిల భారత రచయితల సంఘం,1960.
2. శ్రీశ్రీ కథలు -అనువాద కథలు-విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
3. తెలుగు సాహిత్య చరిత్ర- డా॥ద్వానా. శాస్త్రి.
4. మహాకవి శ్రీశ్రీ-తంజావూరు కిరణ్ కుమార్
5. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు-వెలమల సిమ్మన్న.

❖

తెలుగు సాహిత్యంపై శ్రీ శ్రీ ప్రభావం

- కాళేశ్వరం కృష్ణమూర్తి, ఇం.నెం.35.6.395, వివేక్ నగర్ కాలని, గోపాలపూర్, న్మకొండ, కాకతీయ యూనివర్సిటి,.

తెలుగు సాహితి ప్రపంచంలో అక్షర సమిధను ధారపోసిన కవి కర్షకుడు.

ఏ దేశచరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం

ఆయన పాటల్లో సగటు మనిషి ఆవేదన ఉంటుంది. వారి బాధలను పోగోట్టే ఆనందం ఉంటుంది. విప్లవ గీతాలైనా,భావాత్మక గీతాలైనా,దేశభక్తి గీతాలైనా,ప్రణయ గీతాలైనా,విరహ గీతాలైనా,విషాద గీతాలైనా,భక్తి గీతాలైనా ఆయన కలం నుంచి అలవోకగా జాలువారుతాయి. శ్రీశ్రీ గారు తెలుగు సాహిత్యంలో సూర్యుని వలె వెలుగుతూ తెలుగు సాహిత్యాన్ని వెలిగించినా అభ్యుదయ కవి, విప్లవ యోగి.తెలుగు పాటకు కావ్య గౌరవం కల్పించిన మహాకవి.తెలుగు పాటకు తొలిసారి జాతీయ స్థాయిలో అవార్డు తెచ్చిన మహనీయుడు.విప్లవ కవిగా తన రచనలతో ప్రజలను చైతన్య పరుస్తూనే,సినీ కవిగా తన రచనలతో ప్రేక్షకులపై పాటల జల్లులు కురిపించారు. తన కలంతో సామాన్య మానవుడి బాధల్ని పాటల్లో వినిపించిన యుగకర్త శ్రీశ్రీ. ''నేను సైతం ప్రపంచాగ్నికి కవితనొక్కటి ఆహుతిచ్చాను'' అంటూ సినీకవిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. విప్లవ గీతాలను తెలుగు ప్రపంచానికి రుచి చూపించిన మహా ప్రస్థాన కవి. సమ సమాజ స్థాపన తన లక్ష్యం అంటూ తన కలంతో ప్రవచించిన ఆధునిక యుగ ప్రవక్త.

జననం :

ఆయన అసలు పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పటకొండ దంపతులకు విశాఖపట్నంలో జన్మించారు.శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఈయన ఇంటి పేరు శ్రీరంగంగా మారింది. శ్రీశ్రీ ప్రాథమిక విద్యాభ్యాసం మొత్తం విశాఖపట్నంలో జరిగింది. 1931లో మద్రాసు యూనివర్సిటీలో బి.ఏ పూర్తి చేశారు.1935లో విశాఖలోని మిసెస్ ఎవిఎస్ కాలేజీలో డిమాన్స్టేటరుగా చేరారు. 1938 లో మద్రాసు ఆంధ్రప్రభలో సబ్ ఎడిటరుగా చేరారు. ఆ తర్వాత ఢిల్లీ ఆకాశవాణిలోను, నిజాం సంస్థానంలోను, ఆంధ్రవాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1933 నుంచి 1940 వరకు తాను రాసిన 'గర్జించు రష్యా', 'జగన్నాథ రథ చక్రాలు' వంటి గొప్ప కవితలను సంకలనం చేసి 'మహా ప్రస్థానం' అనే పుస్తకంగా ప్రచురించారు.

మహా ప్రస్థానం :

తెలుగు సాహిత్యపు దశను, దిశను మార్చిన పుస్తకంగా శ్రీశ్రీ మహాప్రస్థానం మిగిలిపోయింది. ఇందులో ఉపయోగించిన పదబంధం, వాక్య నిర్మాణం ఇంకా మహాప్రస్థాన కవితలలో నిండిన సాహితి వస్తువులన్నీ చాలా గొప్పవి. మహాప్రస్థానం అంతా సామాజిక స్పృహను రగిలించేటట్లుగా ఉంటుంది.విరసం కవిగా మరెన్నో రచనలు చేసినా, శ్రీశ్రీ పేరు వినగానే గుర్తుకొచ్చేది మహాప్రస్థానమే. శ్రీశ్రీ రచించిన సంచలన కవితా సంకలనం మహా ప్రస్థానం, ఇది వెలువడిన తరువాత తెలుగు సాహిత్యపు ప్రస్థానానికే ఓ దిక్సూచిలా వెలుగొందినది. ఆధునిక తెలుగు సాహిత్యాన్ని 'మహా ప్రస్థానానికి ముందు, మహా ప్రస్థానానికి తరువాత' అని విభజించవచ్చు అని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం రాస్తూ "కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అన్నాడు చలం. అసలు ఎవరీ శ్రీశ్రీ. తెలుగులో కవిత్వం పేరెత్తగానే అందరి తలలూ ఆయన వైపెందుకు

తిరుగుతాయి? "రెండు శ్రీల ధన దరిద్రుడు,కవితా ఘన సముద్రుడు శ్రీశ్రీ" అని వేటూరి అంటారు.

అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షులుగా, సినిమా పాటల రచయితగా శ్రీశ్రీ అనేక భూమికలు పోషించారు. సమరానికి నేడే ఆరంభం,ఎవరో వస్తారని ఏదో చేస్తారని అంటూ సందేశాత్మక గీతాలు నేటికి తెలుగు నేలపై ఏదో సందర్భంలో గుర్తించుకోని తెలుగు వారుండరు. మనసున మనసై బ్రతుకున బ్రతుకై అంటూ మదిలోని భావాలను మనసుతో ముడిపడిన బ్రతుకును ఆవిష్కరించిన అద్భుత కవి శ్రీశ్రీ.'ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా! అంటూ సోమరి పోతులను జాగృతం చేసిన చైతన్యశీలి శ్రీశ్రీ. మాంగల్య బలంలోని 'ఆకాశ వీధిలో అందాల జాబిలి' అంటూ చందమామ పై రాసిన ఈ గీతం శ్రీశ్రీ కలం నుంచి జాలు వారింది. అల్లూరి సీతారామరాజు' చిత్రంలో శ్రీశ్రీ రాసిన 'తెలుగు వీర లేవరా' పాట తెలుగు సినీ పాటల్లో ఆణిముత్యంలా నిలిచిపోయింది. ఈ మూవీలోని గీతానికే తొలిసారి తెలుగు సినిమా పాటకు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. ఇలా తెలుగు సినీ పాటకు తన రచనతో గౌరవం దక్కేలా చేసారు శ్రీశ్రీ.సినిమా పాటలలో తమదైన ముద్రను వేశారు. విప్లవ గీతాలతో పాటు, కొన్ని భావ కవిత్వంతో కూడిన యుగళ గీతాలను, జాతిని జాగృతం చేసే గీతాలను సినిమాలకు రాశారు. యే గీతం రాసినప్పటికి శ్రీశ్రీ గారి ముద్ర సినీ జగత్తు లో ప్రత్యేకంగా ఉండేది

శ్రీ శ్రీ మహాకవి :

1952లో ప్రారంభమైన ఆయన సినీ గేయ ప్రస్థానం 1982 వరకు నిరాటంకంగా కొనసాగింది. దాదాపు 50 చిత్రాల వరకు సినీ సాహిత్యాన్ని అందించారు. ప్రతి అంశాన్ని గురించి రచనలు చేసిన ఘనత ఈయన సొంతం.గద్య కవిత్వమే కాదు పద్య కవిత్వంలో కూడా శ్రీశ్రీది అందెవేసిన చేయి. 1930 వరకు తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత తెలుగు సాహిత్యం అంతటినీ నేను నడిపిస్తున్నాను అని సగర్వంగా చెప్పుకున్న కవి శ్రీ శ్రీ. తన రచనలతో ఎంతో మందిని చైతన్యపరిచిన ఈ మహా ప్రస్థాన కర్త 1983 జూన్ 15న స్వర్గస్తులైనారు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీశ్రీ మేటి. "వ్యక్తికి బహువచనం శక్తి" అనేది ఆయన సృజించిన మహత్తర వాక్యమే! శబ్ద ప్రయోగంలో నవ్యతను చూపించడంలో విజయం సాధించారు శ్రీశ్రీ. ఆయన మన మధ్య లేక పోయిన ఆయన అందించిన సాహితి సౌరభాలు,విప్లవ రచనలు ఇప్పటికీ, ఎప్పటికీ సజీవంగానే ఉన్నాయి.

పంచేంద్రియాల్నే కాదు ప్రపంచాన్నే రాయిలా
నిలిపేవాడు ఋషి.
రాయిలా పడి ఉన్న ప్రపంచాన్ని...అహల్యలా
మలచేవాడు మనిషి!
గ్రేట్ పొయిట్రీ!....

ఇంతటి కవికి, విద్వాంసుడికీ, సాహితీవేత్తకు ప్రూఫ్ రీడర్ ఉద్యోగమా ఇచ్చేది?అని శరత్ బాబు కోసం కమల్ హాసన్ న్యూస్ పేపర్ ఎడిటర్ చొక్కా పట్టుకుని అడుగుతాడు. మరి విశాఖ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా చేస్తున్న ఆ సాహితీ వేత్తకు ఇలాంటి సపోర్ట్ అప్పట్లో ఏ మిత్రుడైనా ఇచ్చాడో లేడో.1931లో గ్రాడ్యుయేషన్ అయ్యాక చెయ్యని పనంటూ లేదు.బడిపంతులుగా,ప్రూఫ్ రీడర్‌గా,సహాయ సంపాదకుడుగా, కొంత కాలం ఢిల్లీలో రేడియో వార్తలు చదివేవాడిగా, ఆంధ్రప్రభ డైలీ న్యూస్ పేపర్లో ఇలా ఏది పడ్తే అది చేస్తూ వస్తున్నాడాయన.

ఓ మహాత్మా ఓ మహర్షీ
ఏది చీకటి ఏది వెలుతురు

ఒకే కాంతి ఒకే శాంతి
ఓ మహర్షీ ఓ మహాత్మ.....

ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ.శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీశ్రీగా ప్రసిద్ధుడయ్యారు. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించివారిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షులుగా, సినిమా పాటల రచయితగా ప్రసిద్ధులు. శ్రీశ్రీ హేతువాది, నాస్తికుడు. మహాకవిగా శ్రీశ్రీ విస్తృతా మోదం పొందారు. మహాప్రస్థానం రచించిన కావ్యాల్లో ప్రసిద్ధమైనది.తెలుగు కవితకు గ్రాంధిక భాషా రూపం నుండి వాడుక భాషలో క్రొత్త రూపు తీసుకురావాలని ఆకాంక్ష ఆయనకు. కవిత ఊహల్లోనే విహరిస్తుంటే, సమాజానికి జరిగేదేమిటి, ఒరిగేదేమిటి. అందుకే ఆ ఆర్తి నుండే పుట్టింది మహా ప్రస్థానం. అప్పటికే ఆయన ప్రభవ, వారం వారం, సంపంగి తోట వంటి కవితా సంపుటాలను వెలువరించి ఉన్నారు. 1950లో ముద్రితమైన అద్భుత కవితా సంకలనం మహా ప్రస్థానం.

ఆంధ్రప్రభ మరియు ఆనందవాణి పత్రికల్లో పనిచేస్తున్న సమయంలో శ్రీశ్రీ రచనల్లో చేయని ప్రక్రియ లేదు. గద్య, పద్యాలలో సవ్యసాచి. గేయాలు, లిమరిక్కులు, శతకాలు తెలుగు భాషలో ఉన్న అన్ని ప్రక్రియలనూ ఔపోసన పట్టేశారు. ఇక ఆయన, ఫన్‌లు, రిటార్టులు బాగా పాపులర్. ఇలాంటి అద్భుత రచయితను డబ్బింగ్ కోసం మొదట ఆహ్వానించింది సినీ రంగం.1955 సార్వత్రిక ఎన్నికలలో కమ్యూనిస్టుల తరపున శ్రీశ్రీ చురుగ్గా ప్రచారం నిర్వహించారు.1969లో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో శ్రీశ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యతో కలిసి ఖమ్మంలో సమైక్య వాదాన్ని వినిపిస్తూ ప్రదర్శన జరిపారు.

1950లో ఆహుతి అని ఓ డబ్బింగ్ చిత్రం (నీర్ ఔర్ నందా- హిందీ)కోసం మాటలు, పాటలు వ్రాయడంతో మొదలైంది శ్రీశ్రీ సినీ ప్రస్థానం. కాకపోతే ఆయన వ్రాసిన మరో ప్రపంచం పిలిచింది గేయాన్ని 1940లోనే కాలచక్రం అనే మూవీ ఉపయోగించుకుంది.

జనన మరణ లీల ప్రేమయే
జనన మరణ లీల
మృత్యు పాశమే అమరబంధమౌ నిలచు
ధృఢముగా మానస గాధ..

అంటూ ఆహుతి(1950) మూవీ కోసం వ్రాసిన ఈ పాట ఘంటశాల వారు, రావు బాల సరస్వతితో కలిసి పాడారు. పాటలన్నీ సూపర్ హిట్. మూవీ కూడా. దాంతో డబ్బింగ్ మాటలు,పాటలు అంటే సినిమా వాళ్ళకు శ్రీశ్రీ యే గుర్తుకొచ్చేవారు. హెచ్.ఎం. రెడ్డి గారి రోహిణికి ఆస్థాన కవిగా, నిర్దోషి (51), మూనాస ప్రపంచం(53), విఠలాచార్య గారి కన్యాదానం (55) అలా మెల్ల మెల్లగా చిత్రసీమలో శ్రీశ్రీ అల్లుకుపోయారు.

కథ సందర్భం చెప్తే ఒకేరోజు 12 పాటలు వ్రాశారట శ్రీశ్రీ. విఠలాచార్య మూవీ కన్యాదానం కోసం.అదీ ఆయన సత్తా.

తెలుగు వీర లేవరా/దీక్షబూని సాగరా
పాడవోయి భారతీయుడా/ఆడిపాడవోయి విజయ గీతికా
మరోప్రపంచం పిలిచింది
ఓ మహాత్మా ఓ మహర్షి

వంటి ప్రబోధాత్మక గీతాలే శ్రీశ్రీ ఎక్కువగా వ్రాశారనుకుంటే పొరబాటు.

నా హృదయంలో నిదురించే చెలి
మనసున మనసై బ్రతుకున బ్రతుకై
ఎవరివో నీ వెవరివో
వంటి అద్భుతమైన భావ గీతాలు
శ్రీనగజాతనయం సహృదయం

అంటూ వాగ్దానంలోని సీతాకల్యాణం హరికథ వ్రాసినది శ్రీశ్రీ అంటే నమ్మలేం.

నాస్తికుడా, హేతువాదా, అతివాదా, ఇవన్నీ అనవసరం మనకు. ఆయన సబ్జెక్ట్ ఏదైనా సరే అత్యద్భుతంగా ఆవిష్కరించగలరు. కవితా రూపాన ఎవరో అన్నట్లు.

కృష్ణశాస్త్రి వేదన ప్రపంచానికి చాటి చెప్తే
ప్రపంచం వేదన శ్రీ.శ్రీ. చాటాడు
కృష్ణశాస్త్రి బాధ ప్రపంచం బాధ అయితే!
ప్రపంచం బాధ శ్రీ.శ్రీ బాధ అయ్యింది

ఎర్రటి ఛాయలో ఉండే శ్రీ.శ్రీ సిగరెట్టు బిగించి లాగి నప్పుడు నిప్పు మరింత మండి వారి ముఖాన్ని మరింత ఎర్రగా చూపేది.చాలా సౌమ్యమైన కంఠం, చిరునవ్వు ముఖం పైజామా,షర్టు తో సింపుల్ గా ఉండే శ్రీ.శ్రీ మహా చమత్కారి కూడా.మాటకు మాట వెంటనే రిటార్న్ ఇవ్వడం, చమత్కరించడం ఆయన అలవాటు. ఆయనో పత్రికాఫీస్ మిత్రుడి దగ్గరకెళ్ళి పదవోయ్ అలా వెళ్ళొద్దాం. ఏమిటలా ఆలోచిస్తున్నావ్?అంటే పత్రిక ముఖ చిత్రంగా ఏ వేద్దాం. కొచ్చిన్. సిస్టర్స్ ఫొటో వేద్దామా అని అంటే ఎందుకొచ్చిన సిస్టర్స్ పదండి అంటూ ఆ మిత్రుణ్ణి లాక్కెళ్ళారు.

ఈ క్షణంలో ఎవరైనా నాకు రెండొందలు అప్పిస్తే బాగుండును అని గోరా శాస్త్రి వారంటే,నాకంత అవసరం లేదు అన్నాడు శ్రీ.శ్రీ ఠపీమనీ. హాస్య నటుడు రాజబాబుకు తోడల్లుడు శ్రీ.శ్రీ.ఇది ఆయన వ్యక్తిగతం.

ఇక గుర్తింపు అవార్డులకొస్తే...

- పెన్ ఇండియా - సాహిత్య అకాడెమీ,మెంబర్.
- వైస్ ప్రెసిడెంట్ - సౌత్ ఇండియన్ ఫిల్మ్ రైటర్స్ అసోసియేషన్.
- ప్రెసిడెంట్ - రెవెల్యూషనరీ రైటర్స్ అసోసియేషన్.
- సాహిత్య అకాడమీ అవార్డ్ - 1972.
- మొదటి ప్రెసిడెంట్ - ఆంధ్రప్రదేశ్ సివిల్ లిబర్టీస్ కమిటీ.
- సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డ్.
- రాజలక్ష్మి అవార్డ్.
- నంది అవార్డ్ - 1981 - అందమైన లోకమని రంగు రంగులుంటాయని పాటకు(తొలి కోడి కూసింది).

ఒక్క సివిలియన్ అవార్డ్ కూడా రాలేదు ఆ మహాకవికి!

సాహితీవేత్తగా మహాప్రస్థానం తరువాత కూడా ఎన్నో వ్రాశారు.అమ్మ, మరో ప్రపంచం,మానవుడి పాట్లు, ఖడ్గ సృష్టి, రెక్క విప్పిన రెవెల్యూషన్,పాడవోయి భారతీయుడా, మరో ప్రస్థానం, అనంతం ఇవి కొన్ని.పురాణ విశేషాలు, ప్రాచీన గ్రాంథిక సాహిత్యం నుండి రచనలో నవ్యతతో సామాన్యుని కడగండ్లు/సామాజిక అసమతుల్యతలు/ అన్యాయాలు/బడుగు జీవుల మరియు సగటు జీవుల ఆత్మ ఘోష.ఇవన్నీ కవితా వస్తువులుగా అద్భుతమైన పంటలు పండించిన ఆధునికాంధ్ర మహాకవి.శ్రీరంగం శ్రీనివాసరావుని కేవలం ఓ వెయ్యికి పైగా పాటలు వ్రాసిన కవిగా మాత్రమే గుర్తించడం నేరమేమో.ఏ మహా కవికైనా గుర్తింపు వారుండగా జరగడం అరుదు. బ్రతికి ఉన్నప్పుడు చెయిన్ స్మోకర్ అని,త్రాగుబోతని లోటు పాట్లే కనిపిస్తాయి విమర్శకులకు.విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో శ్రీ.శ్రీ నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పోయినోళ్ళందరూ మంచోళ్ళు.మహా జనానికి వారి దివ్య స్మృతికి నివాళి సమర్పిస్తూ, వారు రాసిన కొన్ని గీతాలు.

విప్లవ - ప్రభోధ గీతాలు :

మహా ప్రస్థానం శ్రీ.శ్రీ స్వరాన...
కుదిరితే పరిగెత్తు, లేకపోతే నడువు.
నేను సైతం ప్రపంచాగ్నికి.
మహాత్ముడే కలలుగన్న మరో ప్రపంచం.
మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది... మహా ప్రస్థానం.
పతితులార భ్రష్టులార ఎం.ఎల్.ఎ. ఏడుకొండలు.
శ్రమైక జీవన సౌందర్యానికి.....ఊరుమ్మడి బ్రతుకులు.
మహాత్మా ఓ మహర్షి..ఆకలి రాజ్యం.
కలసి పాడుదాం తెలుగు పాట..బలిపీఠం.
కూటి కోసం..కూలి కోసం..ఆకలి రాజ్యం.
దేవుడు లేడని అనకుండ మరి ఏమని నన్నన మంటారు.. కరుణామయుడు

తెలుగు వీర లేవరా..అల్లూరి సీతారామ రాజు.
ఎవరో వస్తారని ఏదో చేస్తారని..భూమి కోసం.
మారలేదులే ఈ కాలం...కాలం మారింది.
దేవుడ చేసిన మనుషుల్లారా..దేవుడు చేసిన మనుషులు.
పాడవోయి భారతీయుడా..వెలుగు నీడలు.
జయమ్ము నిశ్చయమ్మురా..శభాష్ రాముడు.
ఉందిలే మంచి కాలం..రాముడు - భీముడు.
ఓ రంగయో..పూల రంగయో..వెలుగు నీడలు.
తూరుపు సింధూరపు మందారపు...మనుషులు మారాలి
నందుని చరితము వినుమా..జయభేరి.
ధర్మ క్షేత్రం ఇది కురు క్షేత్రం...కురుక్షేత్రము.
భావ గీతాలు.
ప్రేమయే జనన మరణ లీల...ఆహుతి(1950).
మనసున మనసై.....డాక్టర్ చక్రవర్తి.
కల కానిది విలువైనది....వెలుగు నీడలు.
ఎవరివో నీవెవరివో.....పునర్జన్మ.
తెలియని ఆనందం....మాంగల్య బలం.
నా హృదయంలో నిదురించే చెలి...ఆరాధన.
పాడవేల రాధిక...ఇద్దరు మిత్రులు.
ఈరోజు మంచి రోజు.....ప్రేమ లేఖలు.
ఏమని పాడెదనో ఈ వేళ....భార్యా భర్తలు.
అందమైన లోకమని రంగురంగులుంటా యని...
తొలికోడి కూసింది.
ఇలా ఇలా జీవితం.....పరువు - ప్రతిష్ట.
పదునాలుగు లోకముల ఎదురేలేదే....గాంధారి గర్వ భంగం.
బొమ్మను చేసి ప్రాణము పోసి.... దేవతా

శృంగార - యుగళ గీతాలు :

జోరుగా హుషారుగా షికారు పోదమా....భార్యా భర్తలు.
ఆనందం అర్ణవమైతే....కన్యాశుల్కం.
నా రాణి కనులలోనే ఆ నాటి కలలు దాగె....చిలక - గోరింక.
వాడిన పూలే వికసించెలే.....మాంగల్య బలం.
ఎవరి కోసం ఈ మందహాసం....నర్తన శాల.
మురిపించే అందాలే....బొబ్బిలి యుద్ధం.
ఆ మబ్బు తెరలలోన దాగుంది...పరువు - ప్రతిష్ట.
వలపులు విరిసిన పూవులే....ఆత్మ గౌరవం.
దొరికేరు దొరగారు.....ప్రేమించి చూడు.
ఏమండోయ్ శ్రీవారు.....మంచి మనసులు.
ఇద్దరమే మనమిద్దరమే.....కొల్లేటి కాపురం.
ఇలాగ వచ్చి..అలాగ తెచ్చి.....గోరింటాకు.
భక్తి గీతాలు.
శ్రీనగజా తనయం సహృదయం...వాగ్దానం.
ఒహో మోహన రూప.. కేళీ కలాప....శ్రీకృష్ణ తులా భారం.
ముక్తిని చూపించుము.....గాంధారి గర్వభంగం

ఆధార గ్రంథాలు :

1. మహా ప్రస్థానం...శ్రీశ్రీ
2. సిప్రాలి...శ్రీశ్రీ
3. https://youtu.be/RjCyMD7o3Lk.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ మహాప్రస్థానం- అభ్యుదయవాదం

- డా॥ కె.చెన్నకేశవరెడ్డి, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప.ఆంధ్రప్రదేశ్.

అభ్యుదయ కవిత్వానికి మార్క్సిజం పునాది. 1933-34లోనే అభ్యుదయ కవిత్వం తెలుగునాట మొదలైంది. మొట్టమొదటగా భావకవిత్వంపై తిరుగుబాటు చేసినవాళ్ళు శ్రీశ్రీ, శిష్ట్లా,పఠాభి,నారాయణబాబు కాని వీళ్ళలో అభ్యుదయ ప్రవక్త శ్రీశ్రీ మాత్రమే. 1934లో అనేక ప్రేరణలతో, ప్రభావాలతో వచ్చిన "మహాప్రస్థానం" అభ్యుదయ శకానికి నాందివలికింది. చలం అన్నట్లు "నెత్తురు కన్నీళ్ళు తడిపి కొత్తటానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి".

"నేడే ఈనాడే
జగమంతా బలివితర్ది
నరజాతికి పరివర్తన

నవజీవన శుభ సమయం అభ్యుదయం" అని శ్రీశ్రీ మొదటిసారిగా అభ్యుదయం అనే పదాన్ని వాడారు. అభ్యుదయ కవిత్వం ఎలావుండాలో తన కవిత్వంలోనే చెప్పాడు.

ఒక మహాకవి రంగప్రవేశం చేసిన తర్వాత ఏకవితా యథాతథంగా మిగలదు. దాని స్వరూపం మారిపోతుంది. శ్రీశ్రీ చేసిన పని అదే. ఆంధ్రకవిత్వ స్వరూప,స్వభావాలను సమూలంగా మార్చివేశారు.ఆయన చేతిలో తెలుగు కవిత్వపు వస్తువు మారిపోయింది. భాష మారిపోయింది. నడక మారిపోయింది.ఒక సరికొత్త తెలుగు కవిత ఆవిర్భవించింది. తెలుగు నాట అభ్యుదయ కవిత్వంతో పాటు సమాజాన్ని జాగృతంచేసిన అనేక సాహితీ ప్రక్రియలను సుసంపన్నంచేసిన ఘనత శ్రీశ్రీకే దక్కుతుంది. "ఈ వ్యవస్థకి రకరకాలుగా కొమ్ముకాసే ఈ రాతగాళ్ళంతా నాదృష్టిలో ప్రజాద్రోహులే" అంటూ శ్రామికవర్గ చైతన్యం ఊపిరిగాగల అభ్యుదయ యుగానికి యుగకర్తగా నిలిచాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీ కళ్ళు తెరిచిన నాటికి తెలుగులో భావకవితా మార్గానిదే ప్రాబల్యం. దాని ప్రభావంతోనే శ్రీశ్రీ తనకవిత్వ సౌధానికి పునాదులు నిర్మించుకున్నాడు.భావకవిత్వ ప్రభావంతో అనేక పద్య కవితా ఖండికలను రచించాడు. అనతికాలంలోనే అయనకు భావకవిత్వంపై విరక్తి కల్గిందేమో పూర్తిగా తనదైన శైలిలో నూతన వ్యక్తిత్వానికై అన్వేషించాడు. ఆ అన్వేషణ ఫలితమే.1933 లో శ్రీశ్రీ రచించిన "నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను! నేను సైతం విశ్వవృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను! నేను సైతం భువన ఘోషకు వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!" అని ప్రారంభమయ్యే జయభేరి గీతం పాత కొత్తలకు వారధి వంటిది . వాడక భాషకి ప్రాధాన్య మిచ్చి ముత్యాల సరంలో రాసిన ఈగీతం అభ్యుదయ కవిత్వానికి నూతనకవాటాలు తెరిచింది. ఇక్కడ నేను అంటే శ్రీశ్రీ కంఠంలో పలుకుతున్న శ్రామికుడు. ఈగీతం వాస్తవానికి సమాజ పరివర్తనకై పోరాడే ప్రతి ఒక్కరికి ప్రతిధ్వని అని చెప్పవచ్చు. ఒకవ్యక్తి తనవంతు పాత్రను కర్తవ్యాన్ని, వినయంగాను అదే సమయంలో విశ్వాసంతో చెప్పుకోవటానికి ఇంతకన్నా గొప్ప వ్యక్తీకరణ అప్పటికి ఇప్పటికీ లేదేమో!" ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అని చెలం అనడానికి నిదర్శనమిదే.

"మహాప్రస్థానం" లోని మొత్తం ఖండికలు 41 (అంకిత గేయంతో కలిపి) 1933- నుండి 1944 మధ్య కాలంలో రాయబడినవి. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం మొదటిసారి అత్యంత తీవ్రరూపంలో సంక్షోభానికి గురైనకాలమది. ఈ కాలపు వేదన అత్యంత తీవ్రస్థాయిలోనే మహాప్రస్థాన గీతాల్లో పలుకుతుంది. మహాప్రస్థానంతనకాలపు ప్రజల ఆర్తనాదంగానూ, విజయశంఖంగానూ చరిత్రలో తన స్థానం కేటాయించుకుంది. అంతేకాదు మహాప్రస్థానం అనాటి పురోగామి

శక్తుల పోరాటం నుండి ఎక్కువగా అంతర్జాతీయ పోరాటాల నుండి వుత్తేజంతో జన్మించింది.

మహాప్రస్థానంలోని శ్రీశ్రీ రాసిన 'దేశచరిత్రలు', 'జగన్నాధ రథచక్రాలు', ప్రతిజ్ఞ, మహాప్రస్థానం' వంటి గీతాలు అభ్యుదయ కవితోద్యమానికి పునాదుల వంటివి. ఈ గీతాలు అభ్యుదయ కవిత్వంలోని సంఘర్షణను బూర్జువా తిరస్కారాన్ని వెల్లడిస్తాయి.1934 లో శ్రీశ్రీ పూర్తిగా నూతన మార్గానికి మరలి

"మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు,
పడండి త్రోసుకు! పోదాం, పోదాం పైపైకి!
కదం త్రొక్కుతూ,
పదం పాడుతూ,
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం,

వినబడలేదా మరో ప్రపంచపు జలపాతం? - అనే సుప్రసిద్ధ గీతంతో ఒక నవశకాన్ని అవిష్కరించాడు శ్రీశ్రీ. ప్యూడల్, బూర్జువా వ్యవస్థలో కష్టాలనూ, బానిసత్వానికీ, దోపిడికీ గురి అవుతున్న కర్షక, కార్మిక వర్గాలను మరో ప్రపంచం పిలుస్తోందని వారికి శ్రీశ్రీ ఆహ్వానాన్ని అందించాడు. ఇది ఆనాడు 'జ్వాల' పత్రికలో ప్రచురితమై గొప్ప సంచలనం కలిగించింది. ఎందరో యువకులకు స్ఫూర్తి నిచ్చింది. తెలుగులో అభ్యుదయ కవితా స్రవంతికి అదే జన్మగీతమైంది. ఈ మహాప్రస్థాన గేయం ఒక సమర గీతిలా నడిచింది. ఈ దోపిడి వ్యవస్థనుంచి, ఈ పీడిత సమాజం నుంచి సామ్యవాద వ్యవస్థకీ, సమసమాజ వ్యవస్థకీ పయనించడమే మహాప్రస్థానం. అభ్యుదయ పథం వైపు మహాప్రస్థానం సాగించాలన్నది శ్రీ శ్రీ ప్రబోధం.

అభ్యుదయ సిద్ధాంతం సామ్యవాద కవి లక్షణం. శ్రామిక రాజ్యం గొప్పదనం, పీడితవ్యవస్థ అవలక్షణం మొదలైనవాటిని వివరిస్తూ శ్రీశ్రీ రాసిన మరోగీతం" ప్రతిజ్ఞ". శ్రీశ్రీ రాసిన ప్రతిజ్ఞ కవిత శ్రీశ్రీ కవిత్వానికే కాదు అభ్యుదయకవిత్వానికే 'మానిఫెస్టో' వంటిది. శ్రీశ్రీ జీవన సౌందర్యానికి నివాళి పట్టిన గేయమిది.

"పొలాల నన్నీ, హలాల దున్నీ,
ఇలాతలంలో హేమం పిండగా
జగానికంతా సౌఖ్యం నిండగ-
విరామ మెరుగక పరిశ్రమించే,
బలం ధరిత్రికి బలికావించే,
కర్షక వీరుల కాయం నిండా
కాలువ కట్టే ఘర్మజలానికి,
ఘర్మజలానికి,ధర్మజలానికి,
ఘర్మజలానికి, ఖరీదు లేదోయ్!. - పొలాలను అన్నింటినీ నాగళ్ళతో దున్ని భూమండలంలో బంగారాన్ని పండించడానికి, లోకానికంతా సౌఖ్యం నింపడానికి, విశ్రాంతి తెలియకుండా శ్రమపడి తనకున్నా శక్తినంతా భూమికి బలిచేసే రైతువీరుల శరీరం నిండా కాలువ కట్టి ప్రవహించే ధర్మజలమైన చెమటనీటికి ఖరీదు కట్ట లేమని శ్రీశ్రీ భావన. శ్రీశ్రీ తెలుగు కవిత్వాన్ని వాస్తవికత వైపు పయనింపజేశాడు అనడానికి ఈ ఖండిక నిదర్శనం. సామాన్య మానవుణ్ణి కథానాయకుణ్ణి చేసి రాసిన 'ప్రతిజ్ఞ' గీతం ఆధునికాంధ్ర కవిత్వానికి ధృవతార వంటిది.

మహాప్రస్థానంలోని శ్రీశ్రీ రాసిన 'దేశచరిత్రలు' అనే గేయం గతితార్కిక భౌతిక వాదానికి నిలువుటద్దం వంటిది. ఈ గేయంలో బడుగు జీవుల శ్రమవేదం ఉంది. సామాన్యుడు, అసామాన్యుడై ఎదగాలనే బోధ అంతర్లీనంగా కన్పిస్తుంది. ఈ గేయంలో అభ్యుదయోద్యమానికి పునాది రాళ్ళుగా ఉన్న భావాల సంపూర్ణ స్పందన ప్రతి పదంలోను వినబడుతుంది. గత చరిత్రను అక్రమ సంఘర్షణ ప్రధానంగా దర్శించి, భవిష్యత్ చరిత్ర గతికి ఉపయోగించే భావాన్ని అన్వేషించడమే అభ్యుదయ వాదుల లక్ష్యం. దేశచరిత్రలలోని ఆంతర్యాన్ని శ్రీశ్రీ కుండ బ్రద్దలు కొట్టినట్లు -

"ఏ దేశ చరిత్ర చూచినా, ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం, పరపీడన పరాయణత్వం"

ఏ దేశ చరిత్రను చూచినా గర్వించదగ్గ విషయం ఏమీలేదనీ, నరజాతి చరిత్ర సమస్తమూ, పరపీడన పరాయణత్వమే అని శ్రీశ్రీ భావన. గతచరిత్రలో బలవంతమైన,ధనవంతమైనవ్యక్తి లేక జాతి బలహీనతపై దండెత్తి, పీడించి వారిని కాలరాసింది. అటువంటి వ్యవస్థను సాధికారికంగా ఎదిరించి, పీడితుల పక్షాన శ్రీశ్రీ సింహనాదం చేశాడు.

"ఒక వ్యక్తిని మరొక్కవ్యక్తి / ఒకజాతిని వేరొకజాతీ
పీడించే సాంఘిక ధర్మం / ఇంకానా? ఇకపై సాగదు". -మార్క్సిజమ్ వర్గపీడన పోగొట్టడానికి ఉద్యమించమని ప్రబోధిస్తుంది. ఒక వ్యక్తిని మరొక వ్యక్తి పీడించడం శ్రమదోపిడీ. ఒకజాతిని వేరొకజాతి పీడించడం సామ్రాజ్యవాదం. ఇలా మహాప్రస్థానంలోని చాలా కవితల్లో శ్రీశ్రీ కొత్త దర్శనానికి అక్షర రూపమిచ్చాడు. "ఏ యుద్ధం ఎందుకు జరిగెనో? ఏరాజ్యం ఎన్నాళ్ళుందో? తారీఖులు, దస్తావేజులు ఇవి కావోయ్ చరిత్రకర్థం." ప్రపంచంలోని అన్ని దేశచరిత్రలూ, రాజుల యుద్ధాల, రాణుల ప్రేమపురాణాల కథలగా రచింపబడ్డాయనీ, బడుగుజీవుల రక్తంతో కన్నీళ్ళతో తడిసిపోయినందువల్ల అవి నిజమైన చరిత్రలు కావనీ శ్రీశ్రీ అభిప్రాయం. శ్రామిక వర్గం, పాలక వర్గం సంఘర్షించి నపుడే చరిత్ర పుట్టింది. ఆ దృక్పథములోనే చరిత్ర లిఖింపబడాలనీ, చరిత్ర మరుగున పడియున్న బడుగుజీవుల కథలు వెలికి చూడాలనీ, సామాన్యుని చరిత్రే చరిత్ర అనీ శ్రీశ్రీ ఉద్దేశ్యం.

శ్రీశ్రీ దోపిడి వర్గాల స్వభావాన్ని చీల్చి చెండాడి, వారు చరిత్రనెలా వక్రీకరిస్తారో కళ్ళకు కట్టినట్టు చూపించాడు. 'ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిపుడు! దాచేస్తే దాగని సత్యం' అంటూ యువతకు శాస్త్రీయ జ్ఞానం కల్గించాడు.

"కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిల్లా కాదేది కవిత కనర్హం" అంటూ కవిత్వ చైతన్య పరిధిని దూర భూరేఖ వరకు విస్తరింపజేసిన కవిశ్రీశ్రీ. పతితులు భ్రష్టులు, బాధాసర్పదష్టులు అయిన దగాపడిన తమ్ములు కోసం తన కవితా రథచక్రాలను భూమార్గం పట్టించి భూకంపం పుట్టించిన అభ్యుదయవాది శ్రీశ్రీ.

తెలుగు కవిత్వంలో ఒక ఉజ్వలయుగానికి కర్త శ్రీశ్రీ. ప్రభవ నుంచి మహాప్రస్థానం ద్వారా మరోప్రస్థానం వరకు తన సాహిత్య జీవితంలో ఎన్నోదశలను గడిచాడు. ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్లిన సోమరులను చావండని శపించి యువకుల పెనునిద్దుర వదలించి ఉత్తేజపరచి మరో ప్రపంచానికి మునుముందుకు సాగిపోయేటట్టు చేశాడు శ్రీశ్రీ. మన ప్రపంచం విడిచి మరో ప్రపంచంలోకి "మహాప్రస్థానం" చేశాడు. కర్షకుల, కార్మికుల ఘర్మజలానికి ఖరీదు కట్టిన మహాకవిని తెలుగుజాతితరతరాలకు మర్చిపోగలదా?. మహాకవిని మరోప్రపంచం పిలిచినా, ఆకవి రాసిన 'మహాప్రస్థానం' మనముందు మార్మ్రోగుతూ ఉండిపోతుంది. సామాన్య పాఠకులనూ, నిరక్ష్యరాసులనూ సైతం ఉత్తేజపరచగలిగిన మహాతపస్వి శ్రీశ్రీ. అభ్యుదయ కవితా మందిరంలో అరని అఖండ జ్యోతి. అన్ని సాహిత్య ప్రక్రియల్లో తన కవితాత్మను ఎలుగెత్తి చాటి చెప్పినా ప్రధానంగా శ్రీశ్రీ అభ్యుదయ వైతాళికుడు. తెలుగు కవిత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన యుగభానుడు.

❖❖❖

"శ్రీశ్రీ దేశచరిత్రలు - మార్క్సిస్టు దృక్పథం"

- డా॥. జె. సంగీత, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉట్నూర్, జిల్లా: ఆదిలాబాద్.

'మహాప్రస్థానం' రష్యాలో నెలకొల్పబడిన శ్రామికవర్గ ప్రభుత్వం చేత రష్యా సాధించిన కార్మిక స్వర్గం చేత ప్రభావితమైన గేయం. తరతరాలుగా దాస్యంతో క్రుంగి పోతున్న పీడిత ప్రజలకు ఆశావహదృక్పథాన్ని ఇచ్చిన రచన. పెట్టబుడిదారీ వ్యవస్థ, జమీందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా తిరుగుబాటును సూచించే రచన మహా ప్రస్థానం. శ్రీశ్రీపై మార్క్సిజం ఎంతటి ప్రభావాన్ని చూపిందో సూచించు రచన మహాప్రస్థానం.

శ్రీశ్రీపై మార్క్సిజం ప్రభావాన్ని చూపింది అని చెప్పుటకు ముందు మార్క్సిజం అంటే తెలుసుకుందా. "బాహ్య ప్రకృతిలో జరుగు మార్పులే సామాజిక పరివర్తనకు మూలహేతువులు. భౌతిక శక్తుల ప్రభావం మన ఆలోచన లపై పడిన తర్వాతే మనం ప్రపంచాన్ని మార్చడానికి ప్రయత్నిస్తాం" - కారల్ మార్క్స్. మార్క్స్ దీనిలో మూడు సూత్రాలను ప్రతిపాదించాడు.

1. పరస్పర విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణ 2. విరోధ వైరుధ్యసూత్రం 3. పరిమాణము గుణంగా మారు పద్ధతి.

మన భారతదేశంలో మేడే మొదట చెన్నై(మద్రాస్)లో 1923లో జరుపబడింది. తరువాత 1927లో బొంబాయి కార్మికుల చేత విజయవంతంగా జరుపబడింది. దేశీయ శ్రామికవర్గం అంతర్జాతీయ కార్మిక మహోద్యమం చేత ప్రభావితం అయ్యింది అనుటకు ఇవి నిదర్శనాలు.

వివరణ :

శ్రీశ్రీ కూడా మార్క్సిస్టు దృక్పథానికి ప్రభావితు డయ్యాడు అనడానికి మహాప్రస్థానాన్ని నిదర్శనంగా చూపవచ్చు. 1926 నుండి 1940లలో భారతదేశంలోనూ, విదేశాలలో ఉన్న రాజకీయ పరిస్థితుల పట్ల ప్రేరేపితుడై శ్రీశ్రీ మహాప్రస్థానం రచించారు. మాటల్నే ఈటెలు, కత్తులుగా మార్చి సామాన్యుని బాధను, తిరుగుబాటు తత్వాన్ని కవితా ప్రపంచానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తిత్వం శ్రీశ్రీది.

శ్రీశ్రీ "దేశచరిత్రలు"లో

'ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం'లో గతి తార్కిక భౌతిక వాదానికి సంబంధించిన లక్షణాలు కన్పిస్తాయి.

మార్క్సిజం ప్రధాన లక్షణం సామాన్య పౌరుడు మాత్రమే. రాజుల దండయాత్రల్ని మార్క్సిజం అసలు సమ్మతించదు. దీనినే శ్రీశ్రీ 'దేశచరిత్రలు'లో

'ఏ యుద్ధం ఎందుకు జరిగెనో?
ఏ రాజ్యం ఎన్నాళ్ళుందో?
తారీఖులు, దస్తావేజులు
ఇవి కావోయి చరిత్రకర్థం' - అంటూ రాజు గురించి కాదని 'ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున కన్పించని కథలన్నీ కావాలిప్పుడు' అంటాడు. సామాన్యుని గురించి కూడా చరిత్రలో తెలియచెయ్యాలని

'నైలునదీ నాగరికతలో
సామాన్యుని జీవనమెట్టిది?
తాజ్‌మహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు'

'ప్రభువెక్కిన పల్లకీ కాదోయ్ అది మోసిన బోయీ లెవ్వరు అన్న పంక్తులు మార్క్సిజం ప్రధాన లక్షణమైన సామాన్య పౌరుని గురించి వివరిస్తాయి.

సికిందర్, ఘజ్నీ, అలెగ్జాండర్ లాంటివాళ్లు ప్రపంచ విజేతలు కాదని నరహంతకులని అంటూ వారి వల్ల ప్రాణాలు కోల్పోయిన సైనికుల వారి కుటుంబ సభ్యుల ఆవేదనను, బాధను శ్రీశ్రీ

'రణరంగం కాని చోటు భూ
స్థలమంతా వెదికినా దొరకదు;
గతమంతా తడిసె రక్తమున
కాకుంటె కన్నీళులతో'

ఈ పంక్తులలో రక్తమంతా యుద్ధంలో పాల్గొన్న సైనికులది. కన్నీళ్ళు వారి కుటుంబ సభ్యులవి.

మార్క్స్ ప్రతిపాదించిన సూత్రం పరస్పర విరుద్ధశక్తుల మధ్య సంఘర్షణను శ్రీశ్రీ

'ఇతరేతర శక్తులు లేస్తే
పడిపోయెను పేకమేడలై!
పరస్పరం సంఘర్షించిన
శక్తులలో చరిత్ర పుట్టెను'

ఈ పంక్తులలలో 'పరస్పరం సంఘర్షించిన శక్తులు' మార్క్స్ వివరించినవే. చరిత్రలో, ప్రతీ యుగంలో కష్టించేవాడు ఒకడైతే ఫలితాన్ని అనుభవించేవాడు ఒకడు. అది బానిస, యజమాని కావచ్చు. రైతు, జమీందారు, కార్మికుడు, పెట్టుబడిదారుడు కావచ్చు. ఈ వర్గాలన్నీ పరస్పర విభిన్న గుణాలు కలిగినవి కాబట్టి వీటికి ఘర్షణ తప్పదని మార్క్స్ భావం.

బానిన యుగంలో, జమీందారీ యుగంలో సామాన్యుని కష్టాన్ని శ్రీశ్రీ

'బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు
నరహంతలు ధరాదిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి'

అన్న పంక్తులు బానిసయుగంలో యజమానులు బానిసలను బాధించిన విధం, జమీందారీ యుగంలో భూస్వాములు రైతుల నోళ్లు కొట్టి గద్దెలెక్కిన విషయాన్ని వెల్లడిస్తాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ విధానం చిరకాలం సాగదని చెప్తూ శ్రీశ్రీ

'చిరకాలం జరిగిన మోసం
బలవంతుల దౌర్జన్యాలూ
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా! ఇకపై చెల్లవు'

ఇంకానా! ఇకపై చెల్లవు అంటూ పెట్టుబడిదారీ వర్గాన్ని ప్రతిఘటించాడు. ఈ పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడీవిధానాన్ని నిర్మూలించడానికి విశ్వశ్రామికులంతా ఏకంకావాలని మార్క్స్ ప్రబోధించాడు. మార్క్స్ ప్రభావంతో శ్రీశ్రీ

'చీనాలో రిక్షావాలా
చెక్‌దేశపు గని పనిమనిషీ
ఐర్లాండున ఓడ కళాసీ
ఆణగారిన ఆర్తులందరూ -
హాటెన్‌టాట్, జూలూ నీగ్రో
ఖండాంతర నానా జాతులు
చారిత్రక యథార్థతత్వం
చాటిస్తారొక గొంతుకతో' అని

విశ్వశ్రామికుల సమిష్టి చైతన్యాన్ని గూర్చి తెలిపారు. ప్రపంచంలోని కార్మికులంతా ఏకమైతే ఈ పెట్టుబడిదారీ వ్యవస్త, జమీందారీ వ్యవస్థ పతనమై కొత్త యుగం ఆవిర్భవిస్తుందని ఆ యుగంలో సామాన్య పౌరుడే నాయకుడని మార్క్స్ సిద్ధాంతాన్నీ మనకు దేశచరిత్రలో శ్రీశ్రీ తెలియజేసారు.

ముగింపు :

'మానవుడే నా సందేశం, మానవుడే నా సంగీతం' అని ఎలుగెత్తి చాటిన శ్రీశ్రీ తన రచనల్లో సామాన్య మానవునికే పెద్దపీట వేసారు. సామాన్యుని బాధను తన బాధగా భావించి, సామాన్యున్ని చైతన్యపరిచి, ప్రతి ఘటించేలా చేసిన చైతన్యశీలి శ్రీశ్రీ. 'వ్యదార్థ జీవిత యథార్థదృశ్యం పునాదిగా, జనించబోవు భావివేదములను జగత్తు కందింతును' అని ప్రతిజ్ఞ చేసాడు. రష్యాలో నెలకొల్పబడిన శ్రామిక వర్గ ప్రభుత్వం చేత ప్రభావితమైన

గేయం మహాప్రస్థానం మార్క్సిస్టు తత్వం మనకు 'నవకవిత' బుక్కులు, అవతారం, నీడలు, పేదలు, గర్జించు రష్యా మొ॥ గేయాలన్నీ మార్క్సిస్టు తత్వాన్ని జీర్ణించుకొన్నవే.

అందుకే 'చలం' తన యోగ్యతాపత్రంలో ''కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ'' అంటాడు. నిజమే ప్రపంచపు బాధను తన బాధగా తన గేయాల్లో అభివర్ణించిన మహనీయుడు శ్రీశ్రీ.

ఆధార గ్రంథాలు:

1. శ్రీశ్రీ, మహాప్రస్థానం, శ్రీ కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్, 1950.
2. డా॥ సి. నారాయణరెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగములు, శ్రీ కళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్, 1961.

❖❖❖

శ్రీ శ్రీ కవిత్వంలో - ఆలంకారిత

- డా॥ పెద్దింటి ముకుందరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఆర్.జి.యు.కె.టి - శ్రీకాకుళం.

భావకవితనంతరపు తెలుగు సాహిత్యాన్ని అభ్యుదయ యుగంగా భావించి ఆయుగానికా 'శ్రీశ్రీ యుగం' అని నామకరణం చెయ్యడం ఏనాడో జరిగింది. శ్రీశ్రీ తనకు పూర్వం ఉన్న సాహిత్య సంప్రదాయం మీద తిరుగుబాటు లేవదీశాడు. తెలుగుసాహిత్యంలో సరికొత్త యుగానికి శ్రీశ్రీ సింహద్వారం తెరచినమాట వాస్తవమే. జీవితం, కాలం, సాహిత్యం అన్నీ పరిణామ శీలములే. కానీ అన్ని పరిణామములు మంచిని చేకూర్చలేవు. పాతపదాలు, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు, ఉపమానాలు, పద్ధతులు, ఆచారాలు, ఆయన కవిత్వంలోనివి, జీవితంలోనివి ఇంకా మళ్లీ లేవకుండా వాటినడ్డి విరక్కొట్టాడు శ్రీశ్రీ. ధ్వంసంచేసి రోడ్డు వేశాడు.

ఇవి మహాప్రస్థానానికి ముందు చలం గారు ముందు రాసిన యోగ్యత పత్రంలోని మాటలు ఈ మాటలు.ఎంత శక్తివంతమైనవో అంత అబద్ధమైనవి. నిజంగా చూస్తే ఆ పద్ధతులు నడ్డి ఎవరూ విక్కొట్టలేదు. ఎంత కొత్త వస్తువు తీసుకున్నా, ఎన్ని కొత్త పోకడాలు పోయినా అలంకారికులు సిద్ధాంతీకరించినా మహావిషయాలు ఎవరి కవితలో పరిపక్వస్థితిలో పోషింపబడతాయో వారే మహాకవులు కాగలరు. ఆ శాస్త్రాలు అధ్యయన పూర్వకంగా చదవాల్సిన అవసరం లేదు. శ్రీశ్రీ తన కవితలో ఎన్ని కొత్తబాటలు తీసినా, అతని రచనలోని ప్రాణ భూతమైన విషయాలు, అలంకారిక మార్గనిష్ఠమై కనబడుతున్నవి. వాటిని స్థూలంగా వివరించడమే వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.

ప్రాచీన మార్గంలో ముఖ్యంగా ఆధార పాత్రమైనది శయ్య. అనగా శబ్దాల యొక్క ఒద్దిక. పరివృత్త్య సహిష్ణువులైన శబ్దాలు శ్రుతిపేయములై ఒక దానితో ఒకటి పొత్తు కుదిరి ఉండటం దీనిని నరసభూపాలీయ కారుడు ఈ క్రింది విధంగా చెప్పాడు.

"కదిసి పదంబులు ముందఱి
పదములతో మైత్రి పరగి, పరపదా
స్పద మనకుండిన గతులందది శయ్య"

దీన్నే పింగలి సూరన "పొసగు ముత్తెపు సరుల్ పోహళించినరీతి తమలోన దొరయు శబ్దములు గూర్చి" అన్నాడు. ఇటువంటి శబ్దాల మైత్రి శ్రీశ్రీకి బాగా తెలుసు. ఒక్కొచోట శయ్యా సౌభాగ్యం చాలా రమణీయమై, పూర్వకవి పక్కీకలో ఉంటుంది.

ఉదా : "ఆశాదూతలు" అనే కవితా ఖండికలో.....

"సిందూరభస్మాలు మందారహారాలు
సాంద్రచందనచర్చ సవరించి ఒకడు..పడమటికి
మానవకోటి సామ్రాజ్యదూతలు
.....
నన్నుచూస్తుంటే నవ్వొస్తుందా?"

ఇదే విధంగా శైలిలో ఎక్కడా కుంటుపడకుండా ఎన్నిపాదాలైనా వ్రాసుకుపోగల శక్తి శ్రీశ్రీకి ఉన్నది.

కానీ శయ్య ఒక్కటే ప్రధానమైనది. శయ్య దుస్తులవంటిది. కేవల శబ్ద సంయోజనకు సంబంధించినది. కావ్యంలో ముఖ్యమైనది భావం. శయ్యా సౌభాగ్యం ఎంతగా జీర్ణించుకొన్నవాడైనా భావవ్యంజకతా లక్షణ పరమావధిని చూడలేనివాడైతే వాడు మహాకవి కాలేడు. ఈ భావవ్యంజకత ప్రధాన రచననే అలంకారికులు "రీతి" గా విభజించారు. రీతులు రసానుగుణ పదబంధంచేత వ్యక్తమౌతాయి. కోమల పదబంధం శృంగారాదులకీ, ప్రౌఢబంధం వీరాదులకీ, మధ్యస్తమైన బంధం అద్భుతాలకీ సమూచితంగా ప్రయోగింపబడాలి. ఈ బంధాలనే వైదర్భీ, గౌడీ, పాంచాలీ రీతులుగా అలంకారికులు పేర్కొన్నారు.

"శైశవగీత"లో పసిబాలుర నిర్వ్యాజానందం వర్ణింపబడింది.

గరికపచ్చ మైదానాల్లోనూ
తామరపూవుల కోనేరులలో
పంటచేలలో, బొమ్మరిళ్ళలో
తండ్రిసందిటా, తల్లికౌగిట
దేహదూళితో, కచభారంతో
నోళుల వ్రేళుల, పాలబుగ్గలూ
ఎక్కడ చూస్తే అక్కడ మీరై
విశ్వరూపమున విహరిస్తుండే
పరమాత్ములు, ఓ చిరుతుల్లారా.

పై పాదాల్లో ప్రతి పాదమూ కోమలత్వ స్పోరకంగా ఉన్నదనడంలో సందేహం లేదు. పైగా పరమాత్ములు అని బాలురు వర్ణింపబడ్డారు. ఆచారాల నడ్డి శ్రీశ్రీ విరక్కొట్టలేదనటానికి ఇటువంటి సందర్భాలు మహా ప్రస్థానంలో కొన్ని వందలున్నాయి.

మొత్తం మీద రచనారీతి, సందర్భానుగుణంగా ఉండటమేగాక, మహాకవులకు మాత్రమే తెలిసిన రహస్యం ఒకటున్నది. భావంలో ఛాయల యొక్క మార్పులతో బాటు శబ్ద సంయోజన మారిపోవడం. శబ్దాల కూర్పు సూక్ష్మభావచ్ఛాయలను నిరూపించడానికి శక్తికలిగి ఉండటం. ఇది అలంకార శాస్త్రాలు క్షుణ్ణంగా పఠించడం వలన వచ్చేశక్తి కాదు. తన కవితావేశాన్ని, తన శబ్ద పరిజ్ఞానంతో క్షీర, నీర న్యాయంగా మిళితం చేయగల ప్రతిభాసంపన్నతియే యిది. అచ్చమైన కవితా శక్తులలో ఇది ప్రధానమైనది. ఈ శక్తి శ్రీశ్రీలో పుష్కలంగా కనిపిస్తోంది.

"ఒకరాత్రి" అనే కవితా ఖండికలో.....

"నో రెత్తి హెూ రెత్తి
నొగులు సాగరము
కరికళేబరములా
కదలదు కొండ"

నోరెత్తి హెూరెత్తి అనే పదాలు ఉత్తుంగ తరంగవృత్తాన్ని ధ్వనింపజేస్తున్నవి.

శ్రీశ్రీని చాలామంది తేలికగా మాట్లాడుతూ, ఆయన్ని వెక్కిరించడానికి ఉపయోగించే పాదాలు "బుక్కులు" అనే ఖండికలో ఉన్నై. ఆ మాటలు ఇవి..

"కుక్కపిల్లా
అగ్గిపుల్లా
సబ్బుబిళ్లా - హీనంగా చూడకుదేన్నీ
కవితామయమేనోయన్నీ"

ఈ పాదాలు చదివి వెంటనే అంటారు కొందరు ఛీ ఛీ! ఏమిటి నడక! ఏం పదాలు!" అని. కాని అట్లా వాళ్లు అనడంలోనే శ్రీశ్రీ రచన సఫలమౌతోందని ఝంటాపథంగా చెప్పవచ్చును.

ఒక్కొక్క సినిమాలో దుర్మార్గుణ్ణి చూచి వాడిపీక పిసికేద్దామన్నంత కోపం వస్తుంది ప్రేక్షకునికి. అట్లా ఎవడు ఎంత బాగా కోపం తెప్పించగలడో వాడు అంత గొప్ప నటుడు అన్న మాట! ఇట్లా శ్రీశ్రీ శబ్దశక్తి తత్వాన్ని వివరించాలంటే మూడుపాళ్ళ మహాప్రస్థానం కావ్యాన్ని ఉదహరించవలసి వస్తోంది. శ్రీశ్రీ అలంకారిక ప్రయోగంలో మంచి చాతుర్యం గలవాడు. కించిత్తుగూడా తడుముకో బడనివి ఆయన శబ్దాలంకారాలు. అవి కేవలం అనుప్రాసలేకాకుండా, భావవ్యంజకతలో ఎట్లా పర్యవసిస్తున్నవో అంతకు పూర్వమో నిరూపించారు. ఉపమా, రూపకాలంకారాలను శ్రీశ్రీ చాలా సముచితంగా ప్రయోగించగలడు. గుండెకు హత్తుకొనే ఉపమానాలు అతనికి ఛందోగమనంతో ఏకమై స్ఫురింపచేయటం ఆయన ప్రతిభాసూచకం.

"త్రాచువలెనూ
రేచులవలెనూ
ధనంజయునిలా సాగండి"!

పై ఉపమానాలు తీవ్రతకు పరాకాష్ఠమైనవి. 'ఒక రాత్రి' అనే ఖండికలో కవి తన దీనదశను వర్ణింపదలచాడు.

"విశ్వమంతా నిండి
వెలిబుదివోలె
భహుళపంచమి జ్యోత్స్న
భయపెట్టు నన్ను"

దీపాన్ని ''కత్తిగంటు మీద నెత్తుటి బొట్టులాగా ఉన్నది''. అని సరికొత్త ఉపమానాన్ని తెస్తాడు. దారి తప్పిన బాటసారికి రాత్రి నల్లని రాతిపోలిక గుండెమీదనె కూరు చుండగ'' అని రాత్రి యొక్క భయంకర స్వరూపాన్ని మన వూహపై బరువుగా నిలబెడతాడు. భాగ్యవంతుల జీవితాన్ని ''వడ్డించిన విస్తరి'' అనే రూపకం ద్వారా, వారి తిండికి లోటులేనితనాన్ని విచిత్రంగా ధ్వనింపజేశాడు. పేదవాళ్ళ వాడలు ''పూలులేని కాడలు'' అనే రూపకం చేసి, సౌఖ్యం మినహాయించిన బ్రతుకు వారిది అనే విషయాన్ని హృదయం మీద ముద్రపడేటట్లు చెప్తాడు. ఇలా ఎన్నో చోట్ల అనేక శ్రీశ్రీ యింకా అనేక అలంకారాలు ప్రయోగిస్తాడు.

ఒక్కొక్క చోట ఉపమానాన్ని మాత్రమే చెప్పి సా:్యవసాయ లక్షణ మూలకంగా ఉపమేయాన్ని గమ్యం చేస్తాడు. నా అకాశాలను లోకానికి చేరువగా''. ఉన్నత భావాలు అనే ఆకాశాలు .. అనడానికి కేవలం. ''ఆకాశాలు'' మాత్రమే అంటాడు. కొన్ని చోట్ల అలంకార ధ్వని ఉన్నది.

''ప్రపంచ మొక పద్మవ్యూహం
కవిత్వ మొక తీరని దాహం''.

ఈ రెండు పాదాలు చదవగానే పఠిత హృదయంలో హత్తుకుంటై. దానికి కారణం అర్థంలోని నిర్వచనాత్మకత, దానికి శక్తినిచ్చే అంత్యప్రాస. కానీ కొంచెం ఆలోచిస్తే ఈ రెండింటికి కార్యాకారణ సంబంధం ఉంది. ఈ ప్రపంచం పద్మవ్యూహం.. అంటే అనేక సమస్యానిరంతర జటిలత్వం కలిగినది. ఎంతవరకూ ఈ సమస్యలు సంఘంలో ఉంటాయో అంతవరకూ కవి కలానికి విశ్రాంతి ఉండదు. అందువలన అది తీరనిదాహమే ఔతుంది. కాబట్టి ఇది ''కావ్యలింగ'' అలంకారధ్వనిగా పర్యవసిస్తోంది.

మరికొన్ని చోట్ల అత్యంత తిరస్కృతమైన ధ్వనులు, అతి సమర్థంగా ప్రయోగిస్తాడు. ''దేశచరిత్రలు'' అనే ఖండికలో.....

''రణరంగం కాని చోటు భూ
స్థలమంతా వెదికిన దొరకదు
గతమంతా తడిసె రక్తమున
కాకుంటె కన్నీళులతో.....''

గతకాలమంతా రక్తంతా తడిపోయిందట! అంటే చరిత్ర అంతా హత్యామయం అన్నది ధ్వని. ఈ పాదాల్లో ''గతం రక్తంతో తడిసింది'' అనడంలో విలక్షణమైన ఉక్తిచాతుర్యం ఉన్నది. ఒకే వాక్యంలో క్రూరమైన యుద్ధాలనీ, వెంటనే తత్పలితమైన జనాక్రోశాన్ని వ్యంగ్యం చేస్తున్నాడు.

ఇట్లా చాలా వరకు శ్రీశ్రీ కవిత్వంలో అనల్పార్థ కవ్యంజక రచన కనిపిస్తుంది. ఎక్కువచోట్ల ఒక్కొక్క పాదంలో శిల్పం గోచరిస్తుంది. శబ్దప్రయోగంలోని అర్థవ్యంజకతని గూర్చి యింతకు ముందు వివరించే యే ఉన్నాను. కాబట్టి మహాప్రస్థాన కావ్యం ధ్వని ప్రధాన మైనది.

కాబట్టి మహాప్రస్థానంలో కవితాశక్తి మాత్రదృష్టితో విమర్సిస్తే, పూర్వాలంకారిక మార్గమే ఎక్కువగా కని పిస్తోంది. ఐతే అందులో నవ్యలక్షణాలు మహావిశిష్టమైనవి చాలా ఉన్నవి. శ్రీశ్రీ తన భాష ద్వారా, ప్రాచీనతా ప్రభావంతో భావస్ఫూర్తి సాధించడం ద్వారా, అలంకారిక దృష్టితో కొన్ని అంశాలను విశ్లేషించే అవకాశం కల్పించాడు.

ఆధార గ్రంథాలు :

1. సాహిత్య చరిత్ర - ద్వానా. శాస్త్రి
2. కవితాలోకనం- సాహిత్య విమర్శ వ్యాసాలు - టి.ఎల్. కాంతారావు
3. మహాప్రస్థానం - శ్రీరంగం శ్రీనివాసరావు
4. శ్రీశ్రీ కవితా ప్రస్థానం - అద్దేపల్లి రామమోహన్‌రావు

❖❖❖

శ్రీశ్రీ మహా ప్రస్థానం - కవితా వస్తువు

- పి. భార్గవీ ప్రియదర్శిని, పరిశోధక విద్యార్థి, యోగి వేమన యూనివర్శిటి, కడప.

శ్రీశ్రీ శబ్దం వినబడగానే ఉరకలెత్తించే ఓ ఉత్తేజం
ఓ ఉద్వేగం
ఓ చేతనత్వం
ఓ నూతనత్వం
ఓ భావావేశం
ఓ సమ్మోహనా శక్తి
పీడిత ప్రజల గొంతుక
అభ్యుదయ కవితా వైతాళికుడు
విప్లవ కవితా చోదకుడు

శ్రీశ్రీలో సర్వజన ప్రియమైన కొన్ని అద్భుత శక్తు లున్నాయి. ఎంతటి విమర్శకుడైనా మెచ్చుకోక తప్పని సంవిధాన చాతుర్యం, వైవిధ్యం, వైయుక్తిక బాణి శ్రీశ్రీకి స్వార్జితమైన ఆస్థి. మామూలు మాటలకు ప్రాణంపోసి బరువులేని బలంతో మరుగులేని స్వచ్ఛతతో, కరువులేని శిల్పంతో పలకడం వలన ప్రతిమాటా ప్రతి ఊహా మనసులో నాటుకుపోతుంది. ఏకకాలంలో అనేక రసాలు ఉప్పొంగగానే రచనాపద్ధతి, రచనా సందర్భాన్ని బట్టి మార్క్సిజం, ఫ్రాయిడిజంలోని భౌతిక మానసిక ప్రపంచపు సంబంధాన్ని, లోతుల్ని అందుకోవటానికి ప్రయత్నించాడు.

సమాజ ప్రభావం కవిమీద, కవి ప్రభావం సమాజం మీద ఉంటుందంటారు. హంగ్రీ థర్టీస్ కాలంలో తన చుట్టూ ఉన్న సమాజంలోని అసమానతలు, నిరుద్యోగానికి యువకులు బలికావడం, భిక్షగాళ్ళను ఎవరూ పట్టించుకోకపోవడం. ఆకలి తీరని యువతులు పడుపు వృత్తికి దిగడం, యుద్ధాల్లో యువకులు చనిపోవడం, సమ్మెకట్టిన కార్మికుల భార్యాపిల్లల హాహాకారాలు, దిక్కులేక మరణించిన వారి శవాలను ఎవరూ పట్టించు కోకపోవడం, ఒకవ్యక్తిని మరొక వ్యక్తి, ఒకజాతిని మరొక జాతి పీడిస్తూ ఉండడం, ప్రపంచయుద్ధాలను సృష్టించడం బూర్జువా వ్యవస్థలోని లోపాలు. ఈ లోపాలకు పరిష్కారం సంస్కరణ కాదు. ఈ వ్యవస్థలోని అరిష్టాలు కేవలం సాంఘికాలు కాదు. ఇవి రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతికాది రంగాలన్నింటికి సంబంధించినది. కనుక మొత్తం వ్యవస్థే మారిపోవాలి. ఆ పని చేయగల్గినది విప్లవమే. ఈ విప్లవం తేగల శ్రామికవర్గానికి మనస్సైచైతన్యం కలిగించాడు శ్రీశ్రీ. మార్క్స్ సిద్ధాంత ప్రభావం శ్రీశ్రీ జీవిత దృక్పథాన్ని మార్చి మహాప్రస్థానానికి దారితీసింది.

సామాజిక వాస్తవికతను కావ్యవస్తువుగా చేసుకుని కలం పట్టిన శ్రీశ్రీ ఛందస్సుల సర్వ పరిష్వంగంలోంచి బయటపడి, ఛందో బందోబస్తుల్ని ఛట్‌ఫట్ మని తెంచి పీడిత వర్గపు వాస్తవ జీవితాలను మొదటిసారిగా కావ్యవస్తువులుగా చూపించి "కదిలేది కదిలించేది.. పెను నిద్దుర వదిలించేది.. పరిపూర్ణపు బ్రతుకిచ్చేది కావాలోయ్ నవకవనానికి" అని ఎలుగెత్తి అభ్యుదయ కవిత్వపు నిజలక్షణాలన్నీ నిర్వచించారు. పద్యాన్ని ఎలుగెత్తి పాడడానికి కావలసిన రెండు లక్షణాలు యమకం, తాళం తన కవితల్లో గుప్పించాడు. అకుంఠిత పఠిమతో, అమోఘమైన శిల్పంతో నివేదనా లాఘవం చెడకుండా పలకడం వలన శ్రీశ్రీ కవిత సగటు మనిషి గుండెను సూటిగా తాకింది. ముఖ్యంగా మార్క్స్ సిద్ధాంత ప్రభావం శ్రీశ్రీ జీవిత దృక్పథాన్ని మార్చి మహాప్రస్థానానికి దారితీసింది.

మొదటి ప్రపంచ యుద్ధ ఫలితాల పరోక్ష ప్రభావం కృష్ణశాస్త్రి కవితా వస్తువు మీద కన్పిస్తుంది. ఈయనది భావ కవిత్వం. ఇందులో కాల్పనికం, ప్రకృతి, అనుభూతి, స్వీయవేదన, ఊహలు కన్పిస్తాయి. ఇది ఆత్మాశ్రయం. భావకవిత్వం మీద తిరుగుబాటుగా వచ్చిన శ్రీశ్రీ కవిత్వం వస్తుకవిత్వం. ఇందులో కథావస్తువు, సమాజం, పాత్రలు,

సంఘటనలు, సమస్యలు కన్పిస్తాయి. ఇది పాత్రాశయం. ఇందులో శ్రీశ్రీ కూడా ఒక విప్లవ నాయకుడి, శ్రామికుడి పాత్రనే ధరించి కన్పిస్తారు. 1930 ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనడంలో బూర్జువా వర్గం చేతకానిదనీ, శ్రామిక వర్గమే సామ్యవాద విప్లవాన్ని తెస్తుందని శంఖారావం చేస్తూ ఆ విప్లవాన్నే కవితా వస్తువులుగా గ్రహించారు. ప్రపంచ ప్రజలు పడిన కష్టాలు శ్రీశ్రీకి అనేక కావ్య వస్తువులను సరఫరా చేసాయి. శ్రీశ్రీ కవితా వస్తువును పరిశీలించి సిద్ధాంతీకరించటానికి కొన్ని ప్రమాణాలు పరిశీలిద్దాం.

ప్రయోజనం :

పీడిత వర్గాన్ని చైతన్యవంతం చేసి తిరుగుబాటు జరిపించడమే శ్రీశ్రీ కవిత్వానికి ప్రధాన ప్రయోజనం. ఈ ప్రయోజనానికి 1.వాస్తవికత 2. పురోగమనం 3. శ్రామిక వర్గజీవితం 4.బూర్జువా వర్గజీవితం అనే నాల్గు అంశాలు ఉపాధులు. వీటి నుండే శ్రీశ్రీ కథా వస్తువు విస్తరించింది.

సమకాలీన సమాజం :

గురజాడ అడుగు జాడల్లో నడిచానని స్వయంగా చెప్పుకున్నా, సమాజ సంస్కరణం నుండి సమాజ విప్లవీకరణం వరకూ సాగిన కవితా పురోగమనమే గురజాడ నుండి శ్రీశ్రీ వరకు సాగిన కవితా ప్రస్థానం. ఇందు వల్లనే వస్తువులో మార్పు వచ్చింది. బూర్జువా యుగపు చైతన్యాన్ని గురజాడ ప్రజలకందించగా, సామ్యవాద యుగపు చైతన్యాన్ని శ్రీశ్రీ శ్రామికులకందించరాదు. వీరిద్దరికీ పోలికలేమిటంటే ఇద్దరి కవితా వస్తువూ సమకాలికమే గాక భావకాలకం కూడా. గురజాడ కవిత్వంలో ఫ్యూడల్ సమాజ వాస్తవికత బూర్జువా సమాజపు ఊహలు ప్రతిబింబించగా, శ్రీశ్రీ కవిత్వంలో బూర్జువా సమాజపు వాస్తవికత, సామ్యవాద సమాజపుటూహలు ప్రతిబింబించాయి

సమకాలీన సమాజమూ, ఆ సమాజ జీవితమూ స్థూలంగా శ్రీశ్రీ కవితా వస్తువులని తేలింది. బూర్జువా సమాజ జీవితం వైవిధ్యంతో కూడినది, నానాభావ వస్తు సంకలితమూ సంకీర్ణమూ అయింది. సుఖదు:ఖాలతో, జీవన క్లేశాలతో జీవన భోగాలతో నిండిపోయి ఉన్న జీవితాలను వస్తువుగా తీసుకోవడం వల్ల శ్రీశ్రీకి కవితా వస్తు వైవిధ్యం లభించింది.

సమకాలీన సమాజ జీవితాన్ని కథా వస్తువుగా తీసుకుని సామాజిక వాస్తవికత, విమర్శ, విప్లవం అనే మూడు శాలతో ఆ వస్తువును మలుచుకోవడమే శ్రీశ్రీ పద్ధతి. మహాప్రస్థానం, సాహసి, బాటసారి, భిక్షువర్షీయసి, ఉన్మాది, చేదుపాట, సంధ్యాసమస్యలు, ఆకాశదీపం, అవతలిగట్టు, పరాజితులు, ఆ:, నీడలు, శైశవగీతి, అద్వైతము, వాడు, వ్యత్యాసం, మిథ్యావాది అనే 17 ఖండికల్లో సమాజాన్ని వర్గదృక్పథంతోనూ, ష్టనీడిత వర్గాభిమానంతోనూ, పీడక వర్గద్వేషంతోనూ, విప్లవాదేశంతోనూ చిత్రించాడు. వీటిలో కొన్నింటిని స్పృశించే ప్రయత్నం చేస్తాను.

మహాప్రస్థానం :

ఇది జాతిని ముందుకు నడిపించే సమరగీతి మరో ప్రపంచం అంటే సామ్యవాద ప్రపంచం, ప్రస్థానం అంటే ప్రయాణం

"మరో ప్రపంచం మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది అనడంలోనే ఉంది వైచిత్రి
పదండి ముందుకు పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి" అంటూ సమయం దాటి పోకుండా పరిగెత్తాలని చూపుతున్న ఉత్సాహావేశాలు ఆ నూతన ప్రపంచం పట్ల కుతూహలాన్ని రగులు కొల్పుతాయి.

"ఎముకలు కుళ్ళిన వయస్సు మళ్ళిన సోమరులారా చావండి" అంటూ శ్రామిక వర్గ పక్షపాతిగా శపిస్తాడు శ్రీశ్రీ.

నెత్తురు మండే శక్తులు నిండే సైనికులారా రారండి అని సమాజాన్ని ముందుకు తీసుకుపోవడంలో నిమగ్నులైన వారిని ఆహ్వానించాడు. శ్రీశ్రీ ప్రతీకలతోనే రెండు ప్రపంచాలను వాటి స్వరూపాలను, స్వభావాలను ధ్వనింపగల్గాడు. "మరో ప్రపంచపు హోమజ్వాలల భుగభుగల్ని" చూపిస్తూ

గీతాన్ని ముగించి సామ్యవాద ప్రపంచపు చైతన్యాన్ని స్ఫురింపచేశాడు.

బాటసారి :

నిరుద్యోగ సమస్యకు బలైపోయిన ఒక యువకుడి కథను విషాదాంతంగా శ్రీశ్రీ బాటసారి అనే శీర్షికలో రచించాడు. పీడితవర్గంలోని బాటసారిని కథా నాయకుడుగా గ్రహించి అతని మృతికి కారణాలను పాఠకుల ఊహకే శ్రీశ్రీ వదిలేశాడు. రెండు భిన్న స్థలాలలో, రెండు భిన్న పాత్రల దుస్థితిని సూచిస్తూ సమాంతర సంఘటనలను నడిపించాడు.

"బాటసారి కళేబరంతో శీతాయువు ఆడుకుంటోంది.
పల్లెటూళ్లో తల్లికేదో పాడుకలలో పేగు కదిలింది."
అంటూ నిరాడంబర పదాలతోనే హృద్యంగా ముగిస్తాడు.

ఇలాంటి విషాదగాథే భిక్షువర్షీయసి: దారి పక్కన చెట్టుకింద జబ్బుచేసి తిండిలేక, గుడ్డలేక చనిపోయిన ముసల్దాని గాథను కథావస్తువుగా ఎంచుకున్నాడు. "ఆ అవ్వే మరణిస్తే.. ఆపాపం ఎవ్వరిదని.. వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్లిపోయిందని" సమాజపు నిర్లక్ష్యాన్ని నిగ్గదీసి ప్రశ్నిస్తాడు.

సంధ్యా సమస్యలు :

ఆధునిక నగర జీవితాన్ని కావ్య వస్తువుగా తీసుకుని సంధ్యాసమయం విద్యార్థి. ఉద్యోగి, నిరుద్యోగ సంసారి సమస్యలను. పీడితవర్గమైన నగరవాసులు అనుభవించే నికృష్టజీవితంను తులనాత్మకంగా చిత్రించడం కోసం శ్రీశ్రీ ప్రయత్నించాడు.

శైశవగీతి :

శిశువులు లేకపోతే మానవ ప్రపంచానికి మనుగడే లేదని, భౌతిక ప్రపంచమంతా వారి సుఖం కోసమేనని శ్రీశ్రీ భావించాడంటే శిశువును వినోద వస్తువులుగా చూడడం లేదన్నమాట.

"మీదే మీదే సమస్త విశ్వం
మీరే లోకపు భాగ్య విధాతలు
మీ హాసంలో మెరుగులు తీరును
వచ్చేనాళ్ళ విభాప్రభాతములు"

సమకాలీక సమాజ జీవితమే సమకాలిక చరిత్రకు ముడి పదార్థం. ఈ చరిత్రకు గతచరిత్ర పునాది. ఈ రెండు చరిత్రలూ భవిష్యచ్చరిత్రను నిర్ణయిస్తాయి. అందువలన శ్రీశ్రీ కవితావస్తువులో చారిత్రకాంశం కూడా ప్రవేశించింది. చారిత్రక వాస్తవికత, చరిత్ర విమర్శ, చారిత్రక భౌతికవాదం అనే మూడంశాలతో చారిత్రక కవితా వస్తువును నిర్వహిస్తాడు. ఐ, జ్వాలాతోరణం, అవతారం, దేశచరిత్రలు, జయభేరి, ఆశాదూతలు, మానవుడా, కొంపెల్ల జనార్ధనరావు కోసం అనే 8 ఖండికల్లో భూత భవిష్యద్వర్తమానాల చరిత్ర వివిధ కోణాల్లో చిత్రించబడింది.....

అవతారం :

శ్రీశ్రీ అవతారం రాసిన నాటి వాతావరణాన్నే అవతార గీతికలో చూపాడు.

"పుడమితల్లికి పురిటినొప్పులు కొత్త సృష్టిని స్ఫురించాయి." అనే పదచిత్రంలో అభ్యుదయ కవిత్వ జననానికి ప్రసవ వేదన ఉందన్నారు. మహాప్రస్థాన కవిత్వ యుగ పురుషుడు పుట్టబోతుండగా తోచిన శకునాల వంటివే అవతారం ఖండికలో సూచించబడిప కదలిక అన్నారు. ఈ కవితలో శ్రీశ్రీ కేవలం వైచిత్రి కోసమే పురాణ ప్రతీకలు తీసుకున్నాడు తప్ప మూఢ విశ్వాసాల వల్ల కాదు.

జయభేరి :

ఈ ఖండికలో ప్రపంచంలో కలిగే మార్పులను ఆకలింపు చేసుకుని పెట్టుబడిదారీ వ్యవస్థపై పెత్తందారీ వ్యవస్థపై శ్రామికులు తిరుగుబాటు చెయ్యడాన్ని ప్రతీకాత్మకంగా చెప్పాడు.

"నేను సైతం ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను
నేను సైతం విశ్వవృష్టికి అశ్రువొక్కటి ధారపోశాను
అంటూ మొదలు పెట్టి
నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను.
నేను సైతం భువన భవనపు బావుటపై పైకిలేస్తాను"

అంటూ ఆశావాద దృక్పథాన్ని సూచిస్తూ ముగిస్తాడు.

దేశచరిత్రలు:

"ఏ దేశచరిత్ర చూచినా... ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం... పరపీడన పరాయణత్వం"

మార్క్సిజం స్ఫూర్తితో చరిత్రను వ్యాఖ్యానించిన కవిత ఇది. భౌతికవాద దృక్పథంతో చరిత్రను పరిశీలించాడు. సామాన్యుని పాత్రను విస్మరించే చరిత్రను చరిత్రే కాదన్నాండు. ఇందులో వక్తనామాలు, జాతినామాలు, స్థల నామాలు అనే 3 రకాల కావ్య సామగ్రిని ఉప యోగించారు.

సమకాలీన సమాజ జీవితం మీద రాజకీయాల ప్రభావం ఉంటుంది. కనుక శ్రీశ్రీ రాజకీయ వస్తువును స్వీకరించారు. రాజకీయ వాస్తవికత, రాజకీయ విమర్శ, రాజకీయ విప్లవం అనే మూడు అంశాలు ఈ వస్తువులోని భాగాలు, గర్జించు రష్యా, అభ్యుదయం, నిజంగానే, జగన్నథుని రథచక్రాలు అనే 4 ఖండికలు ఇందుకు నిదర్శనం.

గర్జించు రష్యా :

1941లో రాసిన గర్జించు రష్యా గీతం సామ్యవాద రాజకీయ కవిత్వానికి ఒక మచ్చుతునక. పీడిత వర్గాన్ని సమర్థించే రష్యా మీద నాజీ సామ్రాజ్యవాదులు దాడి చేసినపుడు ఇది ఒక అంతర్జాతీయ వర్గకలహంగా శ్రీశ్రీకి అన్పించి ఎంతో ఉద్వేగానికి లోనై ఉద్వేగహేతువైన రాజకీయ యదార్థ వార్తనే కవితా వస్తువుగా స్వీకరించి

"గర్జించు రష్యా... గాండ్రించు రష్యా
పర్జన్య శంఖం... పలికించు రష్యా
లేలే రష్యా... రారా రష్యా" అంటూ మానవ సంక్షేమం కోసం శ్రీశ్రీ హెచ్చరించాడు.

జగన్నాథ రథచక్రాలు :

జగన్నాథ రథం శ్రీశ్రీ కలల ప్రపంచానికి సంకేతం, రథచక్రాలు కర్షక, కార్మికులకు ప్రతీకగా సామాన్య దుస్థితిని, సామ్రాజ్యవాదుల దౌర్జన్యాన్ని వెల్లడించాడు.

"పతితులారా! భ్రష్టులార, బాధాసర్పదష్టులార
ఏడవకండేడవకండి!
వస్తున్నా యొస్తున్నాయి... జగన్నాథ.. జగన్నాథ..
జగన్నాథ రథచక్రాలొస్తున్నాయి."

అంటూ శ్రీశ్రీ మానవాళి భవిష్యత్తు గురించి ఆశావాద దృక్పథాన్ని ప్రదర్శిస్తారు.

నిజంగానే :

నిరాశావాదులు వేసిన ప్రశ్నలదే శ్రీశ్రీ కవితా వస్తువు లుగా స్వీకరించి నిరూపించి వేళాకోలం చేశాడు. నిజంగానే అనే ఖండికలో.

"నిఖిలలోకం నిండుహర్షం వహిస్తుందా?
మానవాళికి మంచికాలం రహిస్తుందా?
దారుణ ద్వేషాన్ని పెంచే దానవత్వం వరిస్తుందా?
సాధుసత్వపు, సోదరత్వపు స్వాధుతత్వం జయిస్తుందా?
జడలు విచ్చిన, సుడులు రెచ్చిన కడలి నృత్యం నశిస్తుందా?
నడుమ తడబడి, సడలి, ముడుగక పదవతరం క్రమిస్తుందా?"

అంటూ ప్రశ్నలకు సమాధానం మన ఊహకే వదిలేశాడు.

సమకాలిక సమాజానికి ఉపయోగించే కవిత్వం ఎలా ఉండాలో కవిత్వంలోనే సూత్రప్రాయంగా చెప్పాడు శ్రీశ్రీ. కవితావస్తువు, సామగ్రి, సంవిధానం, ప్రయోజనం, దృక్పథం, పాఠక వర్గం అనే వాటి గురించి సూచనలు చేస్తూ బుక్కులు, కవితా ఓ కవితా, నవ కవిత, ప్రతిజ్ఞ, కళారవి, స్వన్‌బర్న్ కవికి, గంటలు అనే 7 ఖండికలు రాశాడు.

బుక్కులు :

యజమాని సంపదను కావలి కాసే కుక్కపిల్ల, కాంతినిస్తూ తన సంపదను వదులుకునే అగ్గిపుల్ల, పరిశు భ్రం చేస్తూ క్షీణించే సబ్బుబిళ్ళ వంటి వాటిని కవితా

వస్తువులుగా ఎంచుకుని బుక్కులు రాశాడు శ్రీశ్రీ. కవి వస్తువులను హీనంగా చూడకుండా ఉంటే ఆ వస్తువులు అతని వైపే చూస్తూ తమ లోతులను కనుక్కోమంటాడు శ్రీశ్రీ. ఖండికలో ఇచ్చిన జాబితాలో కుక్కపిల్ల తప్ప అన్నీ అచేతన భౌతిక వస్తువులే అయినా వాటిచుట్టూ ఉండే వాతావరణం వల్ల, వాటిఉపయోగిత్వ, వినియోగిత్వాల వల్ల ఎన్నో విషయాలు జ్ఞప్తికి వస్తాయి. కుక్కపిల్ల (ఆకలి), అగ్గిపుల్ల (పరిశ్రమ), సబ్బుబిళ్ళ (ఫ్యాక్టరీ) రొట్టెముక్క (బేకరీ) అరటితొక్క(కర్షకుడు), బల్లచెక్క(కార్మికుడు), తలుపుగొళ్ళెం (స్వాతంత్ర్యం), హారతి పళ్ళెం (విజయం), (గుర్రపు కళ్ళెం (వేగం) మొ॥ వస్తువులన్నింటిలో శ్రీశ్రీ కవిత్వాన్ని చూడగల్గుతాడు. వికృత వస్తువునైనా కవితావేశం కల శ్రీశ్రీ తన సంవిధానం వల్ల సుందరంగా పున:సృష్టి చేశాడు.

నవకవిత :

"సిందూరం రక్తచందనం... బంధూకం సంధ్యారాగం
పులి చంపిన లేడి నెత్తురు... ఎగరేసిన ఎర్రని జెండా
రుద్రాలిక నయన జ్వాలిక... కలకత్తా కాళిక నాలిక
కావాలోయ్ నవకవనానికి" అంటాడు నవకవిత ఖండికలో.

శబ్దం శ్రీశ్రీకి బానిస, ఫాసిస్టుల ప్రళయోన్మాదానికి, వ్యంజకమైన ధ్వని, హడలెత్తించే చప్పుడు ఈ చరగాలిలో వినిపిస్తుంది.

సమకాలిక సమాజంలోని పీడిత మానవుడి మానసికా వేదనను వ్యక్తం చేస్తూ దేనికొరకు, కేక, ఒకరాత్రి, ఒకక్షణంలో అనే ఖండికలు రాశాడు శ్రీశ్రీ.. వీటిలో మనో వాస్తవికత, మనోవిశ్లేషణ ప్రధానాంశాలు.

ఉదా : ఆనాటి అంతర్జాతీయ రాజకీయ దురవస్థకు ప్రతిబింబమే శ్రీశ్రీ రాసిన కేక. ఆ కేక ఆర్తికి, బాధకి ప్రతీక అయ్యింది.

సమకాలిక సమాజ జీవితాన్ని ప్రదర్శించి, వ్యాఖ్యానించి, విమర్శించి, విప్లవీకరించడానికి శ్రీశ్రీ వాడుకున్న కవితా సామాగ్రి విపులమైనది. దానికి చరిత్ర పురాణాలు, విజ్ఞానశాస్త్రం, సామాజిక శాస్త్రం, తత్త్వ శాస్త్రం, గతితార్కిక భౌతికశాస్త్రం, ఆర్థిక రాజకీయ సిద్ధాంతాలు, మానవ పరిణామ శాస్త్రం, విజాతీయ జాతీయ సాహిత్యాలు, సంస్కృతి, మనోవిశ్లేషణ శాస్త్రం అంతర్జా తీయ సాహిత్యవాదాలు వంటివెన్నో నిలయాలు. రస దృష్టితో చూస్తే శ్రీశ్రీ మహాప్రస్థానం ఉత్సాహం (వీర రసం)తో మొదలై శమం (శాంతం)తో ముగుస్తాయి. రసభావాలు తొమ్మిది భౌతిక స్పర్శతో మహాప్రస్థానంలో ఉన్నాయి. వీటి ప్రయోజనం కేవలం రసానందం కాదు, భౌతిక చైతన్యం కనుక మహాప్రస్థానం నవరసరుచికరం. ఆనాటినుండి నేటి వరకూ తెలుగులో చెప్పుకోదగ్గ నవ కవిత్వం అంతా శ్రీశ్రీ బాటలో కొత్త పరిధిలో నడిచింది. బూర్జువా వ్యవస్థ వాసనలు కొనసాగినంతకాలం అన్యాయాలపై తిరగబడమని శ్రీశ్రీ గొంతుక వినిపిస్తూనే ఉంటుంది.. ఆనాటి వరకూ శ్రీశ్రీ కవిత్వానికి ప్రపంచీకరణ, సమకాతినత, ప్రాసంగికత ఉంటూనే ఉంటాయి. అందుకే శ్రీశ్రీ మహాకవి..

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ మహాప్రస్థానం - కావ్య ప్రయోజనం

- డా॥. నేకూని శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.వి.యస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ), విశాఖపట్నం.

"కవికర్మనిషీ పరిభూ: స్వయం భూ:" అని కవి శబ్దం పరమాత్మ పరంగా వాడబడినప్పటికీ, అనంతర కాలంలో 'ఋషి' పరంగా వ్యవహారానికి వచ్చింది. "నానృషి: కురుతే కావ్యమ్" అనగా ఋషి కానివాడు కవిగాడు. ఋషి అనగా ద్రష్ట. తత్త్వదర్శనం చేయగలవాడు, అదే ప్రతిభ. అనగా ఋషి ముందుగా లోకాన్ని దర్శించి, దానినివర్ణిస్తే కవి అవుతాడు.వాల్మీకి మహర్షి మొదట ద్రష్ట, తరువాత తాను చూసిన దానిని వర్ణించి (రామాయణం) కవిగా మారాడు.

- కావ్యాలంకార సంగ్రహం- భట్టుమూర్తి, పుట-110

"లోకోత్తర వర్ణనా నిపుణ: కవి:" అన్నప్పుడు కవికి లోకోత్తర వర్ణనా నైపుణ్యం ప్రతిభ వల్లనే కలుగుతుంది. ఆత్మానందాన్ని స్వయంగా పొందిన కవి వర్ణన చేస్తాడు. దీని వలన అతడు ఆనందాన్ని అనుభవిస్తాడు. ఆ వర్ణన లను చదివిన సహృదయుడైన పాఠకుడు అదే ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. ఈ అనుభూతే కావ్య ప్రయోజనమా?

కవులు మూడు రకాలు. శాస్త్రకవి, కావ్య కవి, ఉభయకవి. వీరిలో ఉత్తరోత్తరుడు శ్రేష్ఠుడు. ఉభయ కవినే విద్వత్కవి అంటారు. అటువంటి విద్వత్కవి ద్వారా లభించిన కావ్యానికి ప్రయోజనమేమిటి?

కావ్య ప్రయోజనం :

"కావ్యం యశసే అర్థకృతే వ్యవహారవిదే శివేత రక్షతయే।
సద్య: పరనిర్వృతయే కాంతా సమ్మిత యోప దేశయుజే॥

అనే మమ్మటుని కావ్యప్రకాశం లోని నిర్వచనం అందరికీ తెలిసినదే. యశస్సు కోసం, ధనం కోసం, వ్యవహార జ్ఞానం, అశుభ నివారణతో పాటు ఐహికాన్ని విడిచి పెట్టించగలిగేది కూడా కావ్యమే.

ముఖ్యంగా మన ప్రాచీన కవులలో నన్నయ తన భారతాన్ని 'జగద్ధితంబు'గా రచించాడు. తిక్కన సోమయాజి ఆంధ్రావళికి మోదం కలిగించడం కోసం రచించానని చెప్పాడు. 'కాంతాసమ్మితమైన ఉపదేశం కావ్యప్రయోజనమని రామరాజభూషణుడు తన 'కావ్యా లంకార సంగ్రహం'లో వివరించాడు. పాశ్చాత్య కవులు కూడా ఉపదేశానందాలే కావ్య ప్రయోజనంగా పేర్కొన్నారు.

ఆ బ్రహ్మానంద సహోదరమైన కావ్య ప్రయోజనాన్ని అందించే విద్వత్కవుల కోవలోనివాడే శ్రీశ్రీ. శ్రీశ్రీగా ప్రసిద్ధికెక్కిన శ్రీరంగం శ్రీనివాసరావు తెలుగు సాహిత్యం లోనే అగ్రస్థానంలో నిలిచిన మహాకవి. కవితలు, కథలు, నవల, స్వీయచరిత్ర వంటి ఎన్నో రచనలు చేసిన శ్రీశ్రీ సాహిత్య వినీలాకాశంలో ధ్రువతార. శ్రీశ్రీ కవిత రసభావ ఝరి. ఆయన రాసినకావ్యాలలోకెల్లా మకుటాయమాన మైనది మహాప్రస్థానం. ఈ కావ్యరచనతో తెలుగు సాహితీ ప్రపంచాన్నంతా ఒక్కసారిగా తనవైపు తిప్పుకున్నాడు. తదనంతర కాలంలో ఎందరో యువకవులు శ్రీశ్రీ భావజాలంలో చిక్కుకుపోయారు.

"గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్తమలుపు యిచ్చాడు. రథాలూ, పల్లకీలూ, గుర్రబ్బళ్ళూ వెళ్ళేదారిని తప్పించి, మోటార్లూ, రైలుబళ్ళూ తిరిగే ఆధునిక యుగానికి తెలుగు కవిత్వాన్ని మళ్ళించాడు. గురజాడ చూపించిన మలుపును నేను మహాప్రస్థాన గీతాలతో మరింత వెడల్పు చేశాను."

(శ్రీశ్రీ- మహాప్రస్థానం- నామాట- పుట-4)

శ్రీశ్రీ మహాప్రస్థాన కావ్యానికి చెలం "యోగ్యతాపత్రం" రాస్తూ

''నెత్తురూ, కన్నీళ్ళు కలిపి ఒక కొత్త టానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ యీ వృద్ధ ప్రపంచానికి''

''మాటల్ని కత్తులూ, యీటెలూ, మంటలుగా మార్చటం అతనికే చేతనవును....''

''అతని హృదయం లోంచి మన హృదయంలోకి .....గా పంపిన ఉత్సాహాలు నెత్తురు
కాలవ అనిపిస్తుంది.

(మహాప్రస్థానం- యోగ్యతాపత్రం- చెలం- పుట 8)

అదే కదా అందరూ చెప్పిన కావ్య ప్రయోజనం. కవి హృదయం లోంచి పాఠకుని హృదయంలో ప్రవేశపెట్టే భావాల పరంపర.

రాబందుల రెక్కల చప్పుడు, పయోధర ప్రచండ ఘోషం, ఝంఝానిల షడ్జధ్వానం వినిపించే ఈ మహా ప్రస్థానంలో మొత్తం 40 ఖండికలున్నాయి. ఇందులో మొదటి ఖండిక మహాప్రస్థానం:

బాటలు నడచీ
పేటలు కడచీ
కోటలన్నిటిని దాటండి
నదీనదాలు
అడవులు కొండలు
ఎడారులా మనకడ్డంకి
పదండి ముందుకు
పదండి త్రోసుకు

అంటూ సామ్యవాద ప్రపంచం పిలించిందనీ ఈ పీడిత పెట్టుబడిదారీ ప్రపంచాన్ని వదిలి సామ్యవాద బాటలోకి పదమని శ్రీశ్రీ యిచ్చిన పిలుపిది. కనబడలేదా మరో ప్రపంచపు ధగధగలు అంటూ పీడిత జనులలో తన కావ్యంతో ఉత్సాహాన్ని నింపుతున్నాడు.

జయభేరి :

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను। అంటూ సాగిన ఈ గీతంలో నేను అనేది ఆత్మాశ్రయం కాదు. ఈ నేను పెట్టుబడిదారీ, దోపిడీ సమాజంలో ఒళ్ళొంచి కష్టపడి పనిచేసే ఒక శ్రామికుడు, కర్షకుడు, కార్మికుడు. ఈ కవితతో ఒక్కసారిగా దేశం కోసం పనిచేసే కష్టజీవులంతా కావ్యనాయకులైపోయారు. ప్రాచీన సాహిత్యానికి ఎదురు చుక్కలా ఒక సామాన్యుడిని కావ్య నాయకునిగా 'నేను' ప్రతిధ్వనిస్తున్న ఈ గేయం అజరామరం.

ఋక్కులు :

కుక్కపిల్లా అగ్గిపుల్లా సబ్బుబిళ్ళా
హీనంగా చూడకు దేన్నీ
కవితామయమేనోయ్ అన్నీ

దశరూపక కర్త ''రమ్యం జుగుప్సితముదార మధాపి నీచం...'' అనే శ్లోకంలో రమ్యమైనదైనా, రోతగొలిపేదైనా, ఉత్తమమైనా, నీచమైనా, వస్తువైనా కాకపోయినా లోకంలో కవిచే భావ్యమానమై రసభావాన్ని కలిగించనిది ఏదీ లేదు అనే భావార్థం ఋక్కులు గేయంలో కనిపిస్తుంది.

'అవతారం' ఖండికలో పెత్తందారీ భూస్వాములపై శ్రామికుల తిరుగుబాటును ప్రతీకాత్మకంగా చెప్తూ

పుడమి తల్లికి
పురుటి నొప్పులు
కొత్త సృష్టిని స్ఫురించాయి.

అంటూ నూతన సమ సమాజ స్థాపనను సూచించాడు.

భిక్షువర్షీయసి :

దారిపక్క, చెట్టుకింద,
ఆరిన కుంపటి విధాన
కూర్చున్నది ముసల్దొకతె
.....
.....
దిక్కులేని దీనురాలు
.....
ఆ అవ్వే మరణిస్తే
ఆ పాపం ఎవ్వరిదని

(మహాప్రస్థానం- పుట43)

అంటూ అవ్వ మరణానికి సమాజంలో వున్న అందరి పైనా బాధ్యత మోపుతూ, సమాజం సిగ్గుపడేలా చేసాడు శ్రీశ్రీ. సమాజంలో జరుగుతున్న అన్యాయాలూ, అక్రమాల పట్ల మనందరి బాధ్యతను గుర్తు చేయడమే ఈ కవిత ప్రయోజనం.

ప్రతిజ్ఞ :

తెలుగు సాహిత్యాన్ని వాస్తవికత వైపు నడిపిన కవిత యిది. దేశం కోసం తమ రక్తాన్ని చిందించి పనిచేసే కర్షకులు, కార్మికులు, శ్రామికులు, కమ్మరి, కుమ్మరి, జాలరి, సాలెలు, అనాధలు, అభాగ్యులంతా కలిసి ఈ దోపిడీ వ్యవస్థపై విప్లవ శంఖం పూరిస్తారని, నవ్య కవిత్వానికి వీరే ప్రాణమని చెప్పాడు శ్రీశ్రీ.

నాలో కదిలే నవ్య కవిత్వం
కార్మిక లోకపు కళ్యాణానికి
శ్రామిక లోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా సమర్చనంగా...

(మహాప్రస్థానం, పుట-61)

అంటూ తన కవిత్వాన్ని శ్రమ జీవులకు అర్పించాడు.

చేదుపాట :

వెనుక దగా ముందు దగా
కుడి యెడమల దగా దగా

(మహాప్రస్థానం, పుట- 63)

అంటూ పెట్టుబడిదారీ వ్యవస్థలో పీడిత మానవుల ఘోషను గుండెలకు అంటుకొనేలా విన్పిస్తాడు.

'నవకవిత'లో శ్రీశ్రీ నవ్య కవిత్వానికి కావలసిన లక్షణాలని వర్ణించి చెప్పాడు. ఈ కవిత నిండా విప్లవ ప్రతీకలను వుపయోగించాడు. సమాజాన్ని మార్చగలిగే కవిత్వం రావాలని కోరుకున్నాడు.

పెనునిద్దర వదిలించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి

(మహా ప్రస్థానం, పుట- 72)

దేశ చరిత్రలు :

ఈ కవితలో శ్రీశ్రీ చరిత్ర అంటే రాజుల గాధలు కావని, ఏ చరిత్ర శ్రామికుల కష్టానికి విలువ కట్టలేదనీ, సమాజంలో సామాన్యుని పాత్రను విస్మరించేది చరిత్రే కాదని చెప్పాడు.

ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కాన్పించని
కథలన్నీ కావాలిప్పుడు
దాచేస్తే దాగని సత్యం

(మహా ప్రస్థానం, పుట- 76)

పేదలు, నీడలు :

గేయాలలో పేదల బ్రదుకును కరుణ రసాత్మకంగా వర్ణించాడు.

అంతేలే పేదల బ్రదుకులు
తిరిపెమునకు పిడికెడు మెతుకులు
తెరువెరగని దీర్ఘరాత్రిలో
తలపగిలెడి తలపుల గతుకులు

(మహా ప్రస్థానం, పుట- 86)

జగన్నాథుని రథచక్రాలు :

ఈ కవితలో శ్రీశ్రీ జగన్నాథుని రథచక్రాలను విప్లవానికి ప్రతీకగా భావించాడు. 1922 లో 'మాలపల్లి' నవలలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారు జగన్నాథ రథాన్ని విప్లవంగా చెప్పడం కద్దు.

"కొత్తా పాతా యావత్తూ ఒక మూసనపడి కరిగి సమ్మిళితమై ఒక నూతన శక్తిగా విజృంభించి జగన్నాథుని రథం వలె పరిభ్రమిస్తున్నది. ఇది నిజంగా జగన్నాథుని రథమ్."

(మాలపల్లి పుట- 377)

'సర్వమ్ శ్రీ జగన్నాథమ్' అంటే ఆ జగన్నాథుని ముందు అందరూ సమానులే. ఎక్కువ తక్కువలు వుండవు. అటువంటి సమసమాజాన్ని కాంక్షిస్తూ ఆదర్శ సమాజాన్ని ఈ కవితలో సూచించాడు. ఐక్యము, స్వాధీనత, జ్ఞానము, శక్తి ఆ రథానికి నాలుగు చక్రాలు.

ఆ రథాల క్రింద పడి నలిగిన దీనులకూ, హీనులకూ కొత్త జీవితాన్ని అందిస్తాయి.

ఈ రథం ఆకాశపు దారులంట హడావిడిగా వెళ్ళి పోతుంది. వాటిని భూమార్గం పట్టించాలి. అంటే కవిత్వాన్ని సామాన్యుడికి చేరువ చేయాలి అనే భావం యిందులో కన్పిస్తుంది.

ముగింపు :

ఆధునిక తెలుగు సాహిత్యంలో మహోన్నత శిఖరం శ్రీశ్రీ. శ్రీశ్రీ తెలుగు సాహిత్యాన్ని ఒక ప్రధానమైన మలుపు తిప్పాడు. కవితలో, ఇతివృత్తంలో, విషయంలో వ్యక్తీకరణలో నవ్యతను చూపించాడు.

"నవనవోన్మేషశాలి ప్రజ్ఞా ప్రతిభామతా:" అని ప్రాచీన అలంకారికులు చెప్పారు. అటువంటి ప్రతిభావంతుడైన మహాకవి శ్రీశ్రీ. తన సాహిత్యంలో సామాన్యుడిని నాయకునిగా చేసి , ప్రాచీన సాహిత్యాన్ని ధిక్కరించాడు. రచనా విషయంలో వాస్తవికతను ప్రవేశపెట్టి, భావ కవిత్వంలోని కాల్పనికతను తిరస్కరించాడు. ఇది ఈ కవిత ద్వారా యిచ్చిన ఉపదేశం.

ఇక ఆనందం విషయానికొస్తే శ్రీశ్రీ కవిత్వం కొత్తకొత్త హొయలతో ఉత్సాహంగా, వేగంగా, లయతో, భావావేశంతో చదువుతున్న పాఠకునికి ఊపునిస్తూ వుంటుం దనేది మనకు అనుభవైక వేద్యమే. అతను ఉప యోగించిన పదాలు, శబ్దాలూ, విరుపులూ, ఖండగతి విన్యాసాలూ పఠితను ఉర్రూతలూగిస్తాయి.. ఈ విధంగా శ్రీశ్రీ కావ్య ప్రయోజనమైన ఆనందోపదేశాలను రెంటినీ సాధించిన విద్వత్కవి.

"భావి వేదముల జీవనాదాలు ధ్వనించే కొన్ని గీతాలు జాతి జనులు పాడుకునే మంత్రాలయ్యాయి."

(ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్యం, పుట- 855)

నా రచనలలో లోకం ప్రతిఫలించి, నా తపస్సు ఫలించి
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నా జాతి జనులు పాడుకునే
మంత్రంగా మ్రోగించాలని

(మహా ప్రస్థానం, పుట- 70)

అన్న శ్రీశ్రీ కోరిక నెరవేరింది. నేటికీ మనందరి నోళ్ళలోనూ ఆయన కవితలు మ్రోగుతూనే ఉన్నాయి.

"సుకవి జీవించు ప్రజల నాల్కల యందు" అన్న జాషువా మాట శ్రీశ్రీ విషయంలో అక్షర సత్యం.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. మహా ప్రస్థానం - శ్రీశ్రీ
2. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర
3. కావ్యాలంకార సంగ్రహం - రామరాజభూషణుడు
4. కొడవటిగంటి కుటుంబరావు వ్యాసాలు
5. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - వెలమల సిమ్మన్న

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ జీవితం - సాహిత్యం

- డా॥. జి. పార్వతి, సహ ఆచార్యులు, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం,కడప.

బాల్యం - విద్యాభ్యాసం :

శ్రీశ్రీ విశాఖపట్నంలో ఒక మధ్య తరగతి బ్రహ్మణ కుటుంబానికి చెందిన బడిపంతులు ఇంట్లో జన్మించాడు. శ్రీశ్రీ పుట్టిన తేది వివాదాస్పదం. స్కూల్ రికార్డులో అతని తండ్రి నమోదు చేయించినది జనవరి 2 అది తన తండ్రి గారి కల్పన అని తాను స్కూల్ ఫైనల్‌కు వచ్చేసరికి తనకు 15 ఏళ్ళని రుజువు చేయ్యడానికి తండ్రి చేసిన సవరణ అని శ్రీశ్రీ పేర్కొన్నారు. విశాఖపట్నం పురపాలక సంఘం వారు ఖరారు చేసిన 30-4-1910 అని విరసం వారు స్పష్టం చేశారు.

శ్రీశ్రీ తండ్రి పూడిపెద్ది వేంకటరమణయ్య, తల్లి అప్పల కొండ. అతణ్ణి శ్రీ రంగం సూర్యనారాయణకు దత్తత ఇచ్చినందు వల్ల ఇంటి పేరు మారింది. తండ్రి వేంకటరమణయ్య విశాఖపట్నం మిసెస్ ఎ.వి.ఎన్. కళాశాల ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా ఉండేవాడు. శ్రీశ్రీ 8 సం॥రాల వయస్సులో పద్యాలు రాయడం మొదలుపెట్టాడు. 1925 మార్చి నెల ఈయన పాఠశాల విద్య పూర్తి అయింది.

ఆ సంవత్సరమే వివాహం జరిగింది. శ్రీశ్రీ కవిత్వం రాయడం, వ్యాసాలు రాయడం ప్రారంభం అయింది. ఆ రోజుల్లో శ్రీశ్రీ పై విశ్వనాధ సత్యనారాయణ, దేవుల పల్లి కృష్ణశాస్త్రి కవి కొండల వెంకటరావు ప్రభావం ఎక్కువగా ఉండేది.

శ్రీశ్రీ మద్రాసులోని క్రైసవ కళాశాలలో 1928 సం॥లో బి.ఎలో చేరాడు. అక్కడ కొంపెల్ల జనార్ధన రావుతో పరిచయం ఏర్పడింది. కొంపెల్ల కనుమూసేదాకా వారి స్నేహనుబంధం కొనసాగింది. 1930 సం॥లో శ్రీశ్రీ విశాఖ పట్నం తిరిగి వచ్చారు. 64 రోజులు టైఫాయిడ్ జ్వరంతో బాధపడ్డాడు శ్రీశ్రీ అని ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మ్యాందం ఏర్పడిన రోజులు శ్రీశ్రీ మానసికంగా భౌతికంగా చాలా కష్టాలు పడ్డాడు. గొప్ప దారిద్ర్యం అనుభవించారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. ఖర్గపూర్ నుంచి కలకత్తా మార్గంలో 20 మైళ్ళు నడవాల్సి వచ్చింది. ఇల్లు వేలం పాటలో అమ్మకమైంది. అలాంటి కష్ట కాలంలోనే మహాప్రస్థానంలో కవితలు చాలా వరకు రాసాడు.

1942 సం॥లో మద్రాస్ రేడియో స్టేషన్లో శ్రీశ్రీ ఉద్యోగం దొరికింది. కొద్దికాలంలోనే ఉద్యోగం పోయింది. 1944 సం॥లో అబ్బూరి రామకృష్ణరావు స్థాపించిన 'నటాలి' అనే సంస్థలో రచయితగా చేరి నాటక రంగ ప్రచారంలో పాలు పంచుకున్నాడు. ఆ రోజుల్లోనే ఆయన తండ్రి మరణించాడు.

1945 సం॥లో శ్రీశ్రీ జీవనం కోసం సినిమా రంగంలో ప్రవేశించి"డబ్బింగ్ కింగ్" అనే బిరుదు సంపాదించాడు. 1946-49 మధ్య ఆనందవాణి అనే సాహితీ పత్రికకు సంపాదకత్వం వహించాడు. అప్పటికే అభ్యుదయ రచయితల సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తు న్నాడు. ఈ శతాబ్ది మధ్యకాలానికి శ్రీశ్రీ కవిగా మేధావిగా గొప్ప గుర్తింపు సాధించాడు. నంద్యాల రాజకీయ సభలో కమ్యూనిష్టు పార్టీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వరరావు శ్రీశ్రీ మహాకవి అని ప్రశంసించారు. అప్పటి నుంచి అందరూ మహాకవిని పిలవడం ప్రారంభం అయ్యింది.

1952 సం॥లో విడుదలైన "ప్రపంచం" చిత్రంలా మొదటిసారి శ్రీశ్రీ కనిపించారు. ఆ తర్వాత 1968 సం॥లో జి. వరలక్ష్మి దర్శకత్వం వహించిన మూగజీవులు చిత్రంలో ఇతర కవులతో పాటు శ్రీశ్రీ కూడా కనిపిస్తారు. 1970సం॥లో ఫిబ్రవరి2న శ్రీశ్రీ షష్టి పూర్తి ఉత్సవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంలో శ్రీశ్రీ సంపూర్ణ

సాహిత్యాన్ని 17 భాగాలుగా ప్రచురించారు. శ్రీశ్రీ 1970లో అరసం వారితో సంబంధాలు వదులుకొని విప్లవ రచయితల సంఘం (విరసం) అధ్యక్ష పదవిని స్వీకరించాడు. 1976 సం॥లో చైనాలో పర్యటించాడు. 1983 సం॥లో జూన్ 4న నేటి భారతం అనే చిత్రానికి చివరి పాట రాశాడు.

శ్రీశ్రీ కొన్నాళ్ళు కేన్సర్‌తో బాధ పడ్డాక కోలుకుంటున్న దశలో తీవ్రమైన రక్తపోటు వల్ల 1983 జూన్ 15న శ్రీశ్రీ కన్నుమూశారు.

శ్రీశ్రీ- సాహిత్యం :

1. సావిత్రి సత్యవంతులు - 40 పేజీల రచన (పద్యనాటిక)
2. పరిణయ రహస్యం - నవలికను రచించాడు
3. గోకులాయ్ అనే అపరాధ పరిశోధక నవల
4. వీరనరసింహ విజయసింహులు - దేశభక్తి(కల్పిత కథ)
5. సంపెంగతోట - అనువాద కవిత
6. మహాప్రస్థానం - 1950 కవితా సంపుటి
7. అమ్మ - అనువాద రచన
8. మేడే -1954 రచన
9. మరో ప్రపంచం- రేడియో నాటికల సంపుటి
10. త్రీచీర్స్ ఫర్ మ్యాన్
11. చమర రాత్రి - కథల సంపుటి
12. మానవుడి పాట్లు - అనువాద నవల
13. సౌదామిని - ఆంగ్ల అనువాద కవితలు
14. గురుజాడ - అనే విమర్శన గ్రంధం
15. మూడు యాభైలు
16. ఖడ్గ సృష్టి
17. వ్యూలు - రివ్యూలు
18. రెక్కలు విప్పిన రెవల్యూషన్ - అనువాద గ్రంధం
19. వ్యాస క్రీడలు
20. చైనాయానం
21. న్యూఫ్రాంటియర్స్
22. అనంతం - "జీవితచరిత్ర"
23. ప్ర- జ -
24. సిప్రాలి
25. శ్రీశ్రీ మిసైల్ అనే (ఇంగ్లీషు రచనలు)

శ్రీశ్రీ అభ్యుదయ సాహిత్య విశ్లేషణ :

భావ కవిత్వం దిగజారి అభ్యుదయ కవిత్వం తలెత్తేందుకు మూల వ్యక్తి శ్రీశ్రీ అని స్పష్టం చేశాడు. అభ్యుదయ సాహిత్యాన్ని రక్షించాడు శ్రీశ్రీ అని చెప్పాలి. శ్రీశ్రీ అంటే మహాప్రస్థానం, మహాప్రస్థానం అంటే శ్రీశ్రీగా సాహిత్య ప్రపంచంలో అభ్యుదయ మార్గ ప్రవర్తకుడుగా నిలబెట్టినవి మహాకావ్యం మహాప్రస్థానం.

మహాప్రస్థానం రాసేనాటికి నాకు మార్క్సిజమ్ గురించి తెలియనే తెలియదు. నేను మార్క్సిజమ్ గురించి తెలుసుకున్నది సాహిత్యం ద్వారానే అని శ్రీశ్రీ పేర్కొన్నారు.

శ్రీశ్రీ రష్యాలో నిరంతరం జరుగుతున్న పీడనం, దోపిడీ కర్షక శ్రామిక తిరుగుబాట్లు దౌర్జన్యమైన జీవన విధానం మొ॥ వార్తల ద్వారా పత్రికల ద్వారా వినిపిస్తున్న ఒక వంక భారతదేశంలో స్వాతంత్ర్య సంగ్రామం కదులుతుంది. మరోప్రక్క బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించే ప్రజాశక్తి కావాలన్నప్పుడు పరమ సందేశాన్ని శ్రీశ్రీ ఇచ్చాడు.

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి తోసుకు
పోదాం పోదాం పైపైకి
కదం తొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ

అని శ్రీశ్రీ ఈ సందేశాన్ని ఇచ్చారు.

శ్రీశ్రీ దేశచరిత్రలు మార్క్సిస్టు మెనిఫెస్టోకు అక్షర బద్ధమైన కవితా రూపం అనాలి కారల్ మార్క్స్, ఏంగిల్స్

అనేవారు చరిత్రను గతితార్కిక భౌతికవాదంతో సమన్వయించారు. ఇది అంతే వర్గపోరాటమేనని. పాలిత పాలక వర్గం నుంచి విముక్తి పొందే మార్గం సిద్ధం చేయటమే భాగంగా కారల్‌మార్క్స్ సిద్ధాంతంగా చెప్పారు.

అంటే విరుద్ధ శక్తుల మధ్య జరిగే సంఘర్షణే సామాజిక పరివర్తనకు మూలమైందని మార్క్స్ సిద్ధాంతం ఒరవడిగా చేసిన రచన దేశచరిత్రలు.

ఏదేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం

శ్రీశ్రీ ప్రతిజ్ఞ అభ్యుదయ కవితా ఖండికగా బాగా ప్రసిద్ధి చెందింది.

కర్షక వీరుల కాయం నిండా
కాలువ గట్టె ఘర్మజలానికి
ధర్మజలానికి
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్
కార్మిక ధీరుల కన్నుల నిండా

కార్మిక, శ్రామిక లోకపు కళ్యాణానికి సౌభాగ్యానికి కలం పట్టిన కవి శ్రీశ్రీ. శ్రీశ్రీ రచించిన బుక్కులు కృతావేశాన్ని గురించి చెప్పిన ఖండిక కవితకు అర్హం కాని వస్తువు లేదని శిల్పం ఒక్కటే తప్పనిసరిగ్గా కావలసిందని చాటి చెప్పిన గీతం.

కుక్క పిల్లా
అగ్గిపుల్లా
సబ్బుబిల్లా
హీనంగా చూడకు దేన్నీ
కవితామయమేనోయ్ అన్నీ
రోట్టె ముక్కా
అరటి తొక్కా
బల్ల చెక్కా
నీ వైపే చూస్తూ తమలోతుని
కనుక్కో మంటాయంటారు శ్రీశ్రీ
తలుపు గొళ్ళెం
హారతి పళ్ళెం
గుర్రపు కళ్ళెం

అన్నీ కూడా కవితకు అర్హమైనవే అందుకే వస్తువుకు కాదు ప్రాధాన్యం అభివ్యక్తికి అనుభూతికి మాత్రమే అంటారు శ్రీశ్రీ.

ఉండాలోయ్ కవితావేశం
కానీవోయ్ రసనిర్దేశం
దొరకదటోయ్ శోఖావేశం
కళ్ళంటూ ఉంటే చూసి
వాక్కుంటే వ్రాసీ
ప్రపంచమొక పద్మవ్యూహం
కవిత మొక తీరని దాహం

కవిత్వం తీరని దాహం అనడంలో శ్రీశ్రీ కవిత్వం రాసే కవిని. కవిత్వం చదివె పాఠకుడు కూడా దృష్టిలో పెట్టుకొని చెప్పిందే ఇది. శబ్దాలంకారాలు, అంత్యప్రాసలు కవితకు అందం చేకూరుస్తాయి.

భగవంతుడంటే - ప్రజ అని ప్రజ అనే శీర్షిక రాశారు. శ్రీశ్రీ ప్రజలో సాహిత్యం రాజకీయాలు పడుగు పేకల్లో కలసి పోయాయి. ప్రజా ఉద్యమాలు ప్రజానికి పుష్టి చేకురాయి.

"శ్రీశ్రీ గురించి ఎన్ని చెప్పినా రాసినా చాలదు
శ్రీశ్రీ సాహిత్య చరిత్ర అనంతమే".

ఆధార గ్రంధాలు :

1) తెలుగు అకాడమి - తెలుగు సాహితీ చైతన్యమూర్తులు
2) శ్రీశ్రీ - మహాప్రస్థానం
3) డా॥ దామోదర వేంకట సూర్యారావు - తెలుగు కీర్తికేతనాలు

❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీరంగం శ్రీనివాసరరావు జీవితం - సాహిత్యం

– డా॥. మూడె శంకరబాబు, గెస్ట్‌లెక్చరర్, తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-05.

ఆధునిక తెలుగు సాహిత్యంలో చెదరని ముద్ర వేసిన సుప్రసిద్ధ సాహితీవేత్త, మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు. తన సాహిత్యంతో సామాజిక చైతన్యానికి బాటలు వేసిన మహోన్నతమైన చైతన్యదీప్తి. సమకాలీన సమాజంలో రుగ్మతలను పారద్రోలి తన కలంతో వ్యవస్థలో మార్పు తేవడానికి నేను సైతం అంటూ ముందుకొచ్చిన మహాకవి శ్రీశ్రీ.భావకవిత్యానికి విరుద్ధంగా శ్రామికవర్గచైతన్యం ఆశయంగా రచనలు చేసిన శ్రీశ్రీ దగాపడిన వాళ్ళంతా ఏకమై పీడనని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. బ్రదుకుకాలి పనికిమాలిన శనిదేవత రథచక్రపు టిరుసులలో పడి నలిగినవారిని ఓదార్చి వారికోసం జగన్నాధ రథచక్రాలను భూమార్గం పట్టించిన భగీరథుడు శ్రీశ్రీ. ఆ మహాకవి యొక్క జీవితం, సాహిత్యానికి సంబంధించిన అంశాలను గురించి చెప్పడమే నా పరిశోధన వ్యాససారాంశం.

శ్రీశ్రీ జీవితం ప్రస్థానం :

మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ. ఈయన 1910 సంవత్సరంలో (జనవరి 2) ఎప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు పూడిపెద్ది వేంకట రమణయ్య, తల్లి అప్పలకొండమ్మ. వీరి తల్లిదండ్రులు శ్రీశ్రీ శ్రీరంగం సూర్యనారయణకు దత్తత ఇచ్చినందువల్ల ఇంటిపేరు మారింది. శ్రీనివానరావు ఏడాదిన్నర వయస్సులో ఉండగా కన్నతల్లి అప్పలకొండమ్మ కోల్పోయాడు. తరువాత తండ్రి సుభద్రమ్మను రెండో పెళ్లి చేసుకున్నాడు. జీవితాంతం శ్రీనివాసరావుకూ అతడి మారుతల్లికి మధ్యగల ప్రేమాభిమాన సంబంధాలు చెక్కు చెదరలేదు. శ్రీశ్రీ ఈమెకు 'ప్రభవ' కవితాసంపుటిని అంకితం ఇచ్చాడు.

1915 - 1920 మధ్యకాలంలో శ్రీశ్రీ చదువు శివ రామయ్య ప్రైవేటు స్కూలో సాగింది. ఎనిమిదేళ్ల వయస్సు నిండకముందే అతడు సులక్షణసారమనే ప్రసిద్ధ చంధోగ్రంథం చదివి పద్యాలు రాయడం మొదలు పెట్టారు. 1920లో ఆరోతరగతి చదువుతున్నప్పుడు 'వీరసింహ విజయసింహులు' నే పెద్ద నవల రాశానాంటాడు గానీ లిఖిత ప్రతి దొరకలేదు. ఆ సంవత్సరమే కృష్ణలీలలనే నాటకంలో అశరీరవాణి అనే ఆడవేషం కట్టాడు. 1924లో మారుదల్లి అయిన సుభద్రమ్మ కన్నుమూసింది. శ్రీశ్రీ సంరక్షణ కోసం పూర్తిగా తండ్రి ఆధారపడవలసి వచ్చింది.

1925లో మార్చినెలలో వెంకరమణమ్మతో వివాహం జరిగింది. ఆ సంవత్సరంలోనే 'పరిణయ రహస్యం' అనే నవలికను రాశారు. తరువాత తమిళనాడులోని మద్రాసు క్రైస్తవ కళాశాలలో శ్రీశ్రీ గారు 1928లో బి.ఏలో చేరారు. డిగ్రి పూర్తిగానే 1930లో విశాఖపట్నం వచ్చారు. ఆరవై నాలుగు రోజులు టైపాయిడ్ జ్వరంతో బాధపడ్డాడు. తనకు వైద్యం చేసిన డాక్టర్ సి.మల్లికార్జునరావు ఉరఫ్ మల్లిక్‌ను తన ఆత్మకథలో పదే పదే స్మరించాడు.

శ్రీశ్రీ ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా ఒకమారు ఖరగ్‌పూర్ - కలకత్తా రైలుమార్గం మీద ఇరవైమైళ్లు నడవవలసి వచ్చింది. ఆ రోజుల్లోనే అతడి మహాకావ్యం 'మహాప్రస్థానం' లోని అత్యధిక భాగం రచితమయింది. బతుకు నిలుపుకోవటం కోసం విశాఖపట్నంలోని స్వగృహాన్ని అమ్ముకోవలసి వచ్చింది.

1931లో కొంతకాలంపాటు విశాఖ హార్బర్‌లో 'టైంకీపర్'గా, 'వెయింగ్‌క్లర్క్'గా పనిచేశాడు. మిసెస్ ఎ.వి.ఎన్.కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో డిమాన్‌స్ట్రేటర్‌గా పనిచేయడం వలన శ్రీశ్రీ కి కప్పల మేష్టా అనే బిరుదు వచ్చింది. ఆ సమయంలోనే హరీంద్ర నాథ్ చట్టోపాధ్యాయ కవితలు కొన్నింటిని తెలుగులోకి

అనువదించాడు.

కన్యాశుల్కం నాటకంలోని స్త్రీ పాత్రల గురించి అతడు రాసిన మొట్టమొదటి వ్యాసం 1932 నాటి సమదర్శినిలో అచ్చయింది. 1933 మార్చిలో బరంపురంలో జరిగిన అఖిలాంధ్ర కవిపండిత సభలో పాల్గొనటం ద్వారా అతడి మిత్ర ప్రపంచం విస్తరించింది.

1935లో విశ్వనాథ సత్యనారయణ కిన్నెరసాని పాటలనూ, కోకిలమ్మపెళ్లినీ సమీక్షిస్తూ అతడు రాసిన వ్యాసాలు అచ్చయినాయి. కొంపెల్ల జనార్దనరావు సంపాదకత్వంతో ఉదయిని అనే సాహిత్య పత్రికలో మొట్టమొదటి సాంకేతిక వ్యాసం గురజాడ ముత్యాల సరాలు ప్రచురితమయింది.

ప్రబుద్ధాంధ్ర అనే మరో ప్రసిద్ధ సాహితీ పత్రికలో భారతదేశంలో విదేశాలల్లో ఉన్న కొందరు మహా రచయితలు తననెలా ఆకర్షించారో చర్చిస్తూ రాసిన వ్యాసం వెలుగుచూసింది.

న్యాపతి నారయణమూర్తి సంపాదకత్వంలో నార్ల వేంకటేశ్వరావు, మల్లవరపు విశ్వేశ్వరరావు, కప్పగంతుల సత్యనారయణలతో బాటు శ్రీనివాసరావు తొలితరం ఉపసంపాదకుడుగా మద్రాసులోని ఆంధ్రప్రభలో చేరాడు. మదరాసులో ఆలిండియా రేడియో స్టేషన్లో శ్రీశ్రీకి 1942లో ఉద్యోగం వచ్చింది కాని త్వరగా ఢిల్లికి బదిలీ చేశారు.

1943లో అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు అయ్యారు. 1944లో అబ్బూరి రామకృష్ణరావు స్థాపించిన 'నటాలి' అనే స్వచ్ఛంధ సంస్థలో స్క్రిప్ట్ రచయితగా చేరి నాటక రంగ ప్రచారంలో పాలుపంచుకున్నాడు. నట బృందంతో పాటు తీరాంధ్రలో పర్యటించాడు. కొన్నిసార్లు అవసరమైనప్పుడు కొన్ని వేషాలు కట్టాడు. ఇంతలో తండ్రి మరణించడంతో వారి జీవితం ఇంకా దుర్భరమయి పోయింది. మరల 1945లో జీవనభృతి కోసం సినిమా రంగంలోకి ప్రవేశించాడు. అందులో కాలక్రమాన 'డబ్బింగ్ కింగ్' అనే పేరు సంపాదించాడు.

1946 -1949 మధ్యకాలంలో 'ఆనందవాణి' అనే సాహితీ పత్రికకు అతడు సంపాదకత్వం వహించాడు. తన సాహితీ సిద్ధాంతాలను విశదీకరిస్తూ 1947లో రెండు వ్యాసాలు ప్రచురించాడు.

1949లో నట్ ఔర్ నందా (నవీనా) అనే హిందీ సినిమాను ఆహుతి అనే పేరున తెలుగులోకి డబ్ చేశాడు. హెచ్.ఎం.రెడ్డి నిర్ధోషి అనే తెలుగు చిత్రాన్ని నిరపరాధి అనే తమిళచిత్రాన్ని తీస్తూ శ్రీశ్రీని చేరదీశాడు. 1950 నుంచి శ్రీశ్రీ సినీ రచయితగా స్థిరపడి త్వరలో పేరుమోసి రాణించాడు. 1951లో జరిగిన బొంబాయి ఫిల్మ్ ఉత్సవంలో అతడు న్యాయనిర్ణేతగా ఎంపికైనాడు. 1952లో విడుదలైన 'ప్రపంచమనే' చిత్రంలో మొదటిసారి అతడి రూపం ప్రదర్శితమయింది. తరువాత 1968లో వరలక్ష్మి దర్శకత్వంలో వహించిన 'మూగజీవులు' సినిమాలో ఇతరకవులతో పాటు శ్రీశ్రీ కూడా దర్శన మిచ్చాడు.

1954లో స్టాక్‌హోంలో జరిగే ప్రపంచ శాంతి మహా సభల్లో పాల్గొనవలసిందగా శ్రీశ్రీ కి ఆహ్వానం అందింది. కెయిరో మీదుగా ప్రయాణించి (నవంబర్ 13 - డిసెంబర్ 21) మధ్యకాలంలో ప్రథమ పర్యాయం విదేశయాత్ర చేశారు. 1955 నాటికి శ్రీశ్రీ ధనవంతుడు అయ్యారు. మదరాసులో సొంత ఇల్లు, సొంత కారూ ఏర్పడ్డాయి. శ్రీశ్రీ తన సంపాదించిన డబ్బును అభ్యుదయ రచయితల సంఘం కోసం విచ్చలవిడిగా ఖర్చు చేశాడు. 1959 సంవత్సరంలో తన కన్న 30 సంవత్సరాలు చిన్నదైన ఉపద్రష్ట సరోజను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు.

బూదరాజు రాధాకృష్ణ గారు శ్రీశ్రీ జీవిత ప్రస్థానాన్ని తన అభిప్రాయాన్ని ఇలా పేర్కొన్నారు.

శ్రీశ్రీ ఆధునిక కవులలో వివాదాస్పదుడు మరియు వ్యక్తిగతంగా అస్థిరత్వంతో మెలిగేవాడనీ తీవ్ర విమర్శలు కలవు. సిద్ధాంతాలు గురించి, తోటి కవుల గురించి ఆయన అభిప్రాయాలు అత్యంత వేగంగా, అతి తక్కువ

హేతుబద్ధంగా మారుతూండేవి. ఉద్యోగాల్లో ఇమడలేక పోడం, మొదటి వివాహంలో పిల్లలు కలగకపోవడం, చివరిదశలో దాదాపు 50 ఏళ్ల వయస్సులో దగ్గరపడ్డాకే రెండో భార్యతో పిల్లలు పుట్టడం. సినిమాల్లో సంపాందించి మొత్తం కోల్పోవడం, తన అస్థిరత వల్ల సాహితీ సంఘులలో వివాదాలు రావడం ఇలా ఎన్నెన్నో ఒడిదుడుకులు ఆయన జీవితాన్ని తాకాయి అని చెబూతూ శ్రీశ్రీ వయసు వచ్చిన పసివాడని, అమాయకుడైనా చురుకైనావాడని, అహంకారి అయినా తలవంచుతుంటాడనీ, విచారణశీలి అనీ బూదరాజు రాధాకృష్ణ తన అభిప్రాయాన్ని చెప్పారు.

శ్రీశ్రీ సాహిత్య ప్రస్థానం :

పద్యమైనా.... గద్యమైనా... వచనమైనా... మామూలు కొలతలకు అందని మహాసముద్రం శ్రీశ్రీ రచనలు. శ్రీశ్రీ రచనలు ఎంతో గొప్పవి. ఎటువంటి ఆర్బాటాల జోలికి పోకుండా, మామూలు పదాలతో గొప్ప అర్థం స్ఫురించే విధంగా రచనలు చేయటం శ్రీశ్రీ ప్రతిభాకి నిదర్శనంగా చెప్పవచ్చు. ఇకా శ్రీశ్రీ గారి సాహిత్య ప్రస్థానాన్ని కవిత్వం, నవలలు, యాత్రచరిత్ర, శతకం, ఆత్మకథ, నాటికలు, కథలు, ఇతరాలు వర్గీకరించవచ్చు. అవి.

కవిత్వం :

ప్రభవ (1928), సంపెంగతోట(1947), మహాప్రస్థానం (1950), మరో ప్రపంచం (1954), ఖడ్గసృష్టి (1966), మరోప్రస్థానం(1980), మూడు యాభైలు (కార్టిన్ కవితలు -1964).

నవలలు :

చిత్ర రహస్యం (అనువాద అపరాధక నవల), పరిణయ రహస్యం (1924), గోకులాయి (డిటేక్టవ్ నవల), యాత్రచరిత్ర : చైనాయానం(1980),

విమర్శ గ్రంథం :

గురజాడ ముత్యాలుసరం,

పాటల సంకలనం :

పాడబోయి భారతీయుడా (1983), తెలుగు వీర లెవరా (1996).

శతకం :

సిరి సిరి మువ్వ, ఆత్మకథ : అనంతం (1986), నాటికలు : రేడియో నాటికాలు (1956),

కథసాహిత్యం :

కోనేటి రాయలు కథలు, హేమంత కథలు, అశ్వమోథ యాగం కథలు, చరమరాత్రి (1957),

ఇతరాలు :

వారంవారం (1946), అమ్మ (1952), మేమే (1954), త్రీ చీర్స్‌ఫర్‌మాన్ (1956), మానవుని పాట్లు (1956), సౌదామిని (1958), వ్యాలు, రివ్యూలు(1969), లెనిన్(1971), రెక్కవిప్పిన రిమ్యూషన్ (1971), ప్రాసక్రీడలు (1980), సిప్రాలి (1981), న్యూ ఫ్రెంట్‌ర్స్ (1986) మొదలయిన వాటిని పేర్కొనవచ్చు.

శ్రీశ్రీ తొలి కవితా సంపుటి 'ప్రభవ' 1928లో ప్రచురించబడింది. ఇందులో 1925-28 వరకు రాసిన 16 ఖండికలను ఒక చోట చేర్చి అదే సంవత్సరం తెలుగు నామ ప్రభవ పేరుతో పుస్తకం విడుదుల చేశారు. ఇది భావకవిత్వమే అయినా ప్రేయసి పరంగా కాకుండా పరమేశ్వరుని పరంగా రాసిన కవితలు. తెలుగు సారస్వతంతో తిక్కన, శ్రీనాథ, వేమనల ప్రభావం, కృష్ణశాస్త్రి కవిత్వాన్ని, విశ్వనాథ సత్యనారయణ శిల్పాన్ని చేర్చుకొని, "చక్కని కవిత్వం, చిక్కని కవిత్వం" 'ప్రభవ' కవితాసంపుటిలో పలికించారు శ్రీశ్రీ.

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' 1950 సంవత్సరంలో వెలువడింది. ఇది విప్లవకావ్యం. ఇందులో సామాన్యుల గురించి ఇందులో ప్రస్తావించారు. ఈ రచన ఉదయిని పత్రికా సంపాదకులు అయిన కొంపెల్ల జనార్ధనరావుకు అంకితమిచ్చారు. ఈ కావ్యానికి చలం రాసిన యోగ్యతా పత్రం మరింత వన్నెను చేకూర్చిందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు. ఈ కావ్యం ఇప్పటికి వరకు 40 ముద్రణలకు పైగా వెలువడింది. ఈ కావ్యంలో 40 కవితలుంటే దాదాపు అన్నేసార్లు ఈ గ్రంథం ముద్రణకు నోచుకుందంటే కావ్య విశిష్టత విశదమవుతుంది. తెలుగు

సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన పుస్తకం మహాప్రస్థానం. ఈ పుస్తకం ఈనాటికీ తెలుగు వాడిని ఆకర్షిస్తూనే ఉంది. శ్రీశ్రీ కృషి వల్ల వచన గీతానికి ఎనలేని ఖ్యాతి వచ్చింది. యోగ్యతా పత్రం మహాప్రస్థానం పుస్తకానికి చలం రాసిన పీఠిక. తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప పీఠికలలో ఇది ఒకటి. ఆ పుస్తకం ఎందుకు చదవాలో, ఎందుకు వివరించే పీఠిక అది. ''రాబందుల రెక్కల చప్పుడు పయోధర ప్రపంచ ఘోషం ఝుంఝూనీల షడ్జధ్వానం'' విని తట్టుకోగల చావ ఉంటే ఈ పుస్తకం తెరవండి'' అంటూ పుస్తకం చదవడానికి పాఠకుడికి సమాయత్త పరచే పీఠిక అది.

శ్రీశ్రీ ఖడ్గసృష్టి కవితాసంపుటిని 1940 - 1945లో మధ్యకాలంలో రాయగా 1966లో పుస్తకరూపంలో వెలువడింది. ఈ రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారము 8000 రూపాయిలు మరియు సోవియట్ ల్యాండ్ నెహ్రూ బహుమతి లభించింది. ఈ రచనలోని అహింస ఒక ఆశయమేకాని, ఆయుధం ఎప్పుడూ కాదని తొలి ఖండిక ఖడ్గసృష్టిలో చెప్పాడు. ఖడ్గసృష్టిలో రౌడి రాజకీయాలను విమర్శించారు.

ప్రాసక్రీడలలో జాతీయ నాయకుల వైఖరిని ఖండించాడు. శ్రీశ్రీ వరదరాజేశ్వరరావులతో కలిసి మేమే అనే గ్రంథాన్ని రాశారు. అలాగే ఆరుద్ర సహరచయితగా సంప్రదాయ చంధస్సులో వ్యవహారిక భాషలో రాసిన గ్రంథం రుక్కుటేశ్వర శతకం. శ్రీశ్రీ రాసిన పదకొండు నాటికలు శిల్పానికి, వచన పద్య రచనకూ ప్రసిద్ధాలు.

శ్రీశ్రీ వచన రచనల్లో చరమరాత్రి పేరిట ప్రచురితమైన కథాసంపుటి విశిష్టమైనది. ఇందులోని కథలు అణి ముత్యాలుగా చెప్పవచ్చు. ఈ కథల్లో నిరంకుశమయిన స్వేచ్ఛ, అదివాస్తవికస్పర్శ, ఉన్నాయడంలో అతిశయోక్తి కాదు. ఈ కథలలో తన భావాలనూ ఆదర్శాలనూ వ్యక్తీక రించడానికి అతడు వాడిన వచనం అక్కరకు మించినంత కవితాత్మకంగా సాగింది.

సాహితీ పత్రికల్లో భిన్నకాలలో ప్రచురించిన వచన రచనలు ''వారంవారం'' అనే శీర్షికతో ఒక సంపుటిగా వెలవడ్డాయి. శ్రీశ్రీ సాహిత్య సర్వస్వంలో ''శ్రీశ్రీ జాబులు'' ఒక భాగం. శ్రీశ్రీ జాబులు 1940 - 83 మధ్యకాలంలో రాసినవి. ఈ జాబులు ఎక్కువగా అరసం, విరసం, దిగంబర కవులకు, కార్యకర్తలకు రాసినవే. ప్రారంభంలో ఉత్సుకత, ఆవేశం, ఆవేగం ప్రస్ఫుటంగా కనబడతాయి. ఈ జాబులలో ప్రధానంగా మూడు అంశాలు గమనించవచ్చు. అవి శ్రీశ్రీ వ్యక్తిగతం, సాహిత్యం, రాజకీయం. శ్రీశ్రీ వ్యంగ్య చమత్కార రచనపై మక్కువతో సిరిసిరిమువ్వ, ప్రాసక్రీడలు, లిమరిక్కులు రచించారు.

శ్రీశ్రీ తన ఆత్మకథ అయిన 'అనంతం'లో తన దుశ్చర్యలు కొన్నింటిని సిగ్గువిడిచి చెప్పుకున్నాడు. అతడు వ్యభిచరించి సుఖరోగాలు తెచ్చుకున్నాడు. బాల్యంలోనే మిత్రులతో కలిసి తిరునాళ్లలో ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఒక మారు తాగుబోతనే నేరానికి అరెస్టయి మదరాసు జైల్లో ఒక రాత్రి గడిపాడు. ఇలా శ్రీశ్రీ తన జీవితంలోని ముఖ్యఘట్టాలు, ఒడిదుడుకులు వివరించాడు. అతడి సమకాలీన కవులు, రచయితలు, ప్రసిద్ధ వ్యక్తులు మనకు ఈ రచనలో పరిచయం చేశాడు. ఆధునిక సాహిత్య చరిత్రలో అతిశయోక్తులు, అబద్దాలు లేకుండా రాస్తే, అదే శ్రీశ్రీ స్వీయచరిత్ర అవుతుంది.

శ్రీశ్రీ కవితలు తెలుగు వారి గుండెల్లో ప్రతిధ్వనిస్తాయి. శ్రీశ్రీ సామ్యవాద సమాజం ఏర్పడుతుందని ముందుగానే గ్రహించి దానికి స్వాగతమిచ్చిన వైతాళికుడు. కవిత్వాన్ని ప్రజల కష్టాలుతీర్చే సాధనంగా మార్చి, వారి కష్టాలకు స్పందించి రచనలు చేసిన శ్రీశ్రీగారు దిక్కులేని వాళ్ళ గుండెల్లో దీపంలాగా నిలిచిపోయాడు. సంప్రదాయాన్ని పునాదిగా చేసుకొని తన ప్రతిభావ్యుత్పత్తులతో తెలుగు సాహితీ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాడు. వేలాది మంది శ్రీశ్రీ కవితానదిలో రసానందం అనుభవించి సమాజంలో వారి బాధ్యతని తెలుసుకున్నారు. మహాప్రస్థానం గేయాలు ప్రబోధ కవిత్వము అవుతాయి. ఇవి నిస్సందేహంగా అభ్యుదయవాదులందరికి ఆసరాగా ఉండి నూతన సామాజిక మార్గాలను అన్వేహించేవారికి ప్రేరణాత్మకంగా నిల్చిపోతాయి. శ్రీశ్రీ ఆధునిక సాహిత్యా

నికి చేసిన సేవ చిరస్మరణీయమైంది. ఆయన తెలుగువారందరికి గురుతుల్యుడు.

శ్రీశ్రీ కవితా పరిధి చాలా విస్తృతమైంది. ఆయన కవిత్వం చాలా ఆదర్శవంతమైంది. బుక్కులు అన్న గీతంలో శ్రీశ్రీ తన కవితాతత్వాన్ని వివరించేందుకు ప్రయత్నించారు. వేదంలోని మంత్రాలనే బుక్కులు అంటారు. ఈ పేరుతో కవితావస్తువుగా దేన్నయినా గ్రహించవచ్చని శ్రీశ్రీ ప్రకటించారు. సంప్రదాయాన్ని అనుసరించి కవులు కేవలం కొన్ని వస్తువులనే స్వీకరించే వారు. కానీ శ్రీశ్రీ సాధారణ వస్తువులైన కుక్కపిల్ల, సబ్బుబిళ్ల, అగ్గిపుల్ల, రొట్టెముక్క, అరటితొక్క, బల్లచెక్క మొదలైనవాటిని కావ్యవస్తువులుగా గ్రహించవచ్చని చెప్పాడు. పండితులు అన్ని వస్తువుల పట్ల, వ్యక్తుల పట్ల సమభావాన్ని కలిగి ఉంటారు. సమసమాజ స్థాపన ఆశయంగా పనిచేస్తున్న కవి ఏ విషయాన్ని హీనంగా చూడ కూడదు అని చాటి చెప్పిన శ్రీశ్రీ కవితావేశానికి, రసనిర్ధేశానికి అన్ని అర్హమేనని వివరించారు. లాక్షణికులు కూడా నిజానికి ఇదే విధంగా భావించారు. ''కళ్ళంటూ ఉంటే చూసి వాక్కుంటే వ్రాసి' తీరని దాహమైన కవిత్వాన్ని పద్మవ్యూహం లాంటి లోకాన్ని అర్థం చేసుకోవటానికి ఉపయోగిస్తానని శ్రీశ్రీ చెప్పారు. తను ఎందుకోసం రాస్తున్నాడో, ఏమి కోరి రాస్తున్నాడో కవికి స్పష్టంగా తెల్సినప్పుడు అతని కవిత్వం లక్ష్యాత్మకమైంది అవుతుంది. నన్నయ భావించినట్లు 'విశ్వశ్రేయ:కావ్యమ్' అనే శ్రీశ్రీ భావించాడు.

గేయరచనా విధానంలో శ్రీశ్రీది నూతనమార్గం. వచన గేయాలకి భావోద్వేగాన్ని, అక్షరరమ్యతను సాధించిన విధానం చాలా కొత్తది. అనేక చోట్ల విరామచిహ్నాలు కూడా భావానికి ప్రాణం పోస్తాయి. 'ఆ' అన్న గేయంలో మూడు మూడు పాదములు ఒక భాగంగా, ప్రత్యేక విధానంలో కన్పిస్తాయి. నిప్పులు చిమ్ముకుంటూ అని మొదలయ్యో మొదటిభాగం వీరు అని విరామచిహ్నంతో అంతమవుతుంది. రెండోపాదం నెత్తురు క్రక్కుకుంటూ అని మొదలయి వీరె... అని వ్యంగాన్ని సూచిస్తూ ముగుస్తుంది.

ఈయన రచనలన్నింటిలోనూ అనర్గళం, అనితర సాధ్యం అయిన అభ్యుదయ శక్తుల భుగభుగలు కనిపిస్తాయి. మహాప్రస్థానం, ఖడ్గసృష్టి కవితాసంపుటాలు తెలుగువాళ్ళకి రామాయణ, భారతాలుగా నిల్చిపోయాయి. అలాగే ఆరుద్ర కూనలమ్మ పదాలకు, శేషంద్ర శర్మ బుతుఘోషకు శ్రీశ్రీ గేయరూపంలో పీఠికలు రాశాడు. సిపిఐ కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు గారిచే 'మహాకవి' బిరుదు శ్రీశ్రీ పొందారు.

శ్రీశ్రీ తనను గూర్చి తానే 'మహతి' అనే వ్యాస సంకలన గ్రంథంలో ఇలా చెప్పుకున్నారు. ''ఇప్పుడు మనం 20 వ శతాబ్దంలో ఉన్నాం. ఈ శతాబ్దం నాది. నేను 1910లో పుట్టాను(తోకచుక్కలాగా) మూడు సార్లు మృత్యువుతో పోరాడి గెలిచాను. 1918లో మొదటి గీతం వ్రాశాను గణ, యతి ప్రాసలంటే ఏమిటో తెలియకుండా), 1920లో మొదటి నవల వీరసింహ విజయ సింహులు రాసి పారేశాను. 1925లో మొదటి నవలిక (పరియణ రహస్యం) అచ్చయింది. 1930లో నేను 63 రోజులు టైఫాయిడ్ జ్వరంతో బాధపడ్డాను. జీవితం మృత్యువుతో ఎలా పోరాడుతుందో స్వయంగా తెలుసుకున్నాను. 1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తరువాత నుంచీ దాన్ని నేను నడిపిస్తున్నానని చెప్పారు.

శ్రీశ్రీ తెలుగు సినిమాలలో రాసిన పాటలను పరిశీలిస్తే ఊపెన లా విరుచుకుపడే కవితలను కురిపించిన శ్రీశ్రీ, ఊహలోకాల్లో తెలియాడించే పాటలు రాయడం విశేషంగా చెప్పవచ్చు.

మనసున మనసై (డాక్టర్ చక్రవర్తి), హలో హలో ఓ అమ్మాయి (ఇద్దరు మిత్రులు), నా హృదయంలో నిదురించే చెలి (ఆరాధన), ఆకాశవీధిలో అందాల జాబిలి (మాంగల్య బలం), కల కానీది... విలువైనది (వెలుగు నీడలు) ఇలాంటి అణిముత్యాలు వంటి పాటలు రాశారు శ్రీశ్రీ. ఇంకా మన స్వాతంత్రదినోత్సవం నాడు ఆగస్టు 15న శ్రీశ్రీ రాసిన రెండు పాటలు అన్ని ప్రాంతాలలో మారుమ్రోగుతాయి. ఒకటి తెలుగు వీర లెవరా..(అల్లూరి సీతరామరాజు), మరోకటి పాడవోయీ భారతీయుడా

(వెలుగు నీడలు). శ్రీశ్రీ స్ట్రెయిట్ సినిమాలు కంటే అనువాద సినిమాలకి ఎక్కువగా పనిచేసేవారు. అనువాద సినిమాలకు చాల వేగంగా మాటలు, పాటలు రాసేవారు. ఆయన ఒక రోజునా 12 పాటలు రాశారంటే. పాటలను రాయడం ఆయనకు ఎంత తేలికైన పని మనకు అర్థమవుతుంది.

ముగింపు :

ఆధునిక తెలుగు కవితకు సరికొత్త శక్తిని కల్పించిన కవి శ్రీశ్రీ. ఎందరో యువకులను ప్రభావితం చేసిన కవి శ్రీశ్రీ. మహాప్రస్థానం కావ్యంతో ముప్ఫయ్యవ దశకంలో మహాకవిగా ఎదిగిన కవి శ్రీశ్రీ. కార్మికలోకపు కళ్యాణం కోసం, శ్రామికలోకపు సౌభాగ్యం కోసం, సామ్యవాద ప్రపంచం కోసం కలం పట్టిన కవి శ్రీశ్రీ. ఏదేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అని అందరూ ఏకకంఠంతో గానం చేస్తూ ఉన్న రోజుల్లోనే, ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?' అని ఎదురు తిరిగి ప్రశ్నించిన కవి శ్రీశ్రీ.

శ్రీశ్రీ రెండక్షరాలే అయితే అవి శ్రీరంగం శ్రీనివాసరావు అనే ఒక చైతన్యస్ఫూర్తికి సజీవ దర్పణాలు. శ్రీశ్రీ రెండు చారిత్రక సందర్భాలుగా చూస్తే ...అవి అభ్యుదయ సాహిత్యానికి, విప్లవసాహిత్యానికి రెండు మహోన్నత ఆరంభాలు.

తెలుగు సాహిత్యంలో మహాకవి శ్రీశ్రీకి విశిష్టమైన స్థానము ఉంది. ఆకాశపుదారులంట హడావిడా వెళ్లిపోయె జగన్నాథ రథచక్రాలను, భూమార్గం వైపు మళ్లించి, శ్రామిక వర్గానికి, కవిత్వ పట్టం కట్టించిన కవి శ్రీశ్రీ. శ్రీశ్రీ తెలుగు సాహిత్యంలో వర్గ దృక్పథానికి ద్వారం తెరిచి, అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడయినాడు. శ్రీశ్రీ స్వతహాగా ప్రయోగశీలి. సర్రియలిజం, డాడాయిజం, ప్యూడరిజం వంటి నవీన దోరణుల్ని తెలుగులో పరిచయం చేశాడు. 'చైతన్య స్రవంతి' శిల్ప ప్రక్రియను మొదటిగా తెలుగులోకి తెచ్చిది శ్రీశ్రీయే. శ్రీశ్రీ ఆధునిక తెలుగు సాహిత్యానికి యుగకవి. అన్ని సాధారణ వస్తువుల్నీ, కవితామయంగా ప్రదర్శించడం, నరళరచనా సంవిధానంతో యువకుల్లో చైతన్యం రగిలించడం, శ్రీశ్రీ ప్రత్యేకతలు. కవిత్వంలో అప్పటి వరకు ఉన్న పాత పదాల డిక్షన్ (అర్థాలు), వర్ణనలు, అలంకారాలు, కవి సమయాలు, ఉపమానాలు, ఛందస్సు అనే వాటిని మార్చి వేసిన అత్యంత ప్రతిభాశాలి శ్రీశ్రీ.

సామ్యవాద సమాజసాధనకి సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించిన శ్రీశ్రీ 1983 సంవత్సరంలో జూన్ 15న భౌతికశరీరాన్ని విడిచారు. వీరి మరణంతో తెలుగు సాహిత్యంలో ఒక అరుణతార నేలరాలింది. ఒక ఉజ్వల శకం పరిసమాప్తమైంది. హైదరాబాద్‌లో హుస్సాన్ సాగర్ ఒడ్డున ముగ్దుం మోహియుద్దీన్ శిలా విగ్రహంతో బాటు శ్రీశ్రీ విగ్రహాన్ని కూడా 1986 జూన్ 3వ తేదిన ప్రతిష్టాపించారు.

శ్రీశ్రీని మొత్తంగా కొలిస్తే ... ఆ విరాట్ రూపం తెలుగు సాహిత్యానికి, సమాజానికి మధ్య విస్తరించిన హద్దులు లేని విశ్వమానవ సౌందర్యం. సాహితీవేత్తగా, సామాజిక కార్యకర్తగా శ్రీశ్రీ తెలుగు వారికి అందిన గొప్పవరం చెప్పడంలో అతిశయోక్తిలేదు.

ఆధార గ్రంథాలు :

1. మహాకవి శ్రీశ్రీ - బూదరాజు రాధాకృష్ణ
2. శ్రీశ్రీ ప్రస్థానత్రయం (మహాకవి శ్రీశ్రీ సంపూర్ణ లభ్య రచనల సంకలనం) - మనసు ఫౌండేషన్
3. శ్రీశ్రీ కవితాప్రస్థానం - అద్దేపల్లి రామమోహనరావు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ సాహిత్య నేపథ్యం

– పొత్తూరి శ్రీనివాసులు, తెలుగు అధ్యాపకులు, డిగ్రీ కళాశాల, చేబ్రోలు.

శ్రీ శ్రీ మహాకవి... శ్రీ శ్రీ శ్రీ ప్రజాకవి.,...శ్రీ శ్రీ శబ్ద గురించి.... Sri Sri is a great poet... ఇలా శ్రీశ్రీ గురించి మనం ఎన్నో విశేషణాలను చెప్పవచ్చు... కానీ వీరులుచరిత్ర సృష్టించరు... చరిత్రే వీరులను సృష్టిస్తుంది (It is not heroes that make history, but history that makes heroes.

Joseph Stalin అనే స్టాలిన్ మాటల సారాంశాన్ని అర్థం చేసుకున్నట్లయితే ఒక కవి, కళాకారుడు, మేధావి వారంతట వారు తయారు కారు. వారిని తయారు చేసేది వారి చుట్టూ ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులే. అయితే తే కవులు, కళాకారులు, మేధావులు అందరూ తమ కాలం నాటి సాంఘిక జీవనానికి ఒకేసారి ఒకే మాదిరిగా ప్రతిస్పందించరు.అది వారి వారి చైతన్య స్థాయిని బట్టి ఆధారపడి ఉంటుంది. ఈ దృష్టితో పరిశీలిస్తే ఏ పరిస్థితులు శ్రీ శ్రీ ని అభ్యుదయ కవిగా నిలబెట్టాయో, ఏ పరిస్థితులు శ్రీశ్రీ ని విప్లవకవిగా మార్చాయో, ఏ పరిస్థితులు శ్రీశ్రీని శబ్దవిరించిగా తయారు చేశాయో మనం గ్రహించవచ్చు. తద్వారా మన తరువాతి తరాలకు దిశానిర్దేశం చేయవచ్చు. కనుక శ్రీశ్రీ రచనా కాలం నాటి పరిస్థితుల్ని పరిశీలిద్దాం.

చారిత్రక నేపథ్యం :

శ్రీ శ్రీ జన్మించింది 1910 వ సంవత్సరం. అంటే అది భారత దేశాన్ని ఆంగ్లేయులు పాలిస్తున్న కాలం. దేశ వ్యాప్తంగా రకరకాల పోరాట రూపాల్లో స్వాతంత్ర ఉద్యమ జ్వాలలు వ్యాపిస్తున్న తరుణం. ఆంగ్ల విద్యా వ్యాప్తితోపాటు పాశ్చాత్య సాహిత్య పరిచయం, ప్రపంచం నలుమూలల జరుగుతున్న విముక్తి ఉద్యమాల ప్రభావం యువతరాన్ని జాగృతం చేస్తున్న సమయం. 1905లో రష్యాలోశ్రామికవర్గం రష్యన్ విప్లవానికి నాంది పలికింది. అప్పటికి అది అపజయాన్ని చవిచూసినా అంతర్జాతీయ శ్రామికవర్గ విప్లవాలకు దిశానిర్దేశం చేసింది. తెలుగునాట ఆధునిక సాహిత్యం కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు గార్లతో ప్రారంభమై సంఘ సంస్కరణోద్యమ కవిత్వంగా ప్రసిద్ధి పొందింది. అప్పారావు కావ్యాల్లో సామాజిక శ్రేయస్సు ప్రధాన లక్ష్యం. అందుకే వారు ''మంచి గతమున కొంచెమేనోయి'' అనగలిగాడు. 1910లో గురజాడ దేశభక్తి గీతంతో తెలుగులో అభ్యుదయ సాహిత్యానికి అంకురార్పణ జరిగింది. ఒకవైపు భాష ఫ్యూడలిజం మీద గిడుగు రామ్మూర్తి పంతులు, మరోవైపు సాహిత్య ఫ్యూడలిజం మీద కందుకూరి, గురజాడలు తిరుగుబాటు ప్రకటించారు. సంఘ సంస్కరణ సాహిత్య ధ్యేయం అయింది. 1917లో రష్యాలో పెట్టుబడిదారీ వర్గాన్ని నిర్మూలించి శ్రామిక వర్గం సోషలిస్టు విప్లవం లో విజయం సాధించింది. 1922లో అల్లూరి సీతారామరాజు స్వాతంత్రం కోసం సాయుధ తిరుగుబాటు చేశాడు. అదే సంవత్సరం ఉన్నవ లక్ష్మీనారాయణ గారి మాలపల్లి నవల తెలుగు జాతి మెదళ్ళకు పదును పెట్టింది.

1930 నాటికి ప్రపంచమంతా ఆర్థికమాంద్యంతో తల కిందులైంది. పేద మధ్యతరగతి బ్రతుకులు దుర్భరంగా మారాయి. పెట్టుబడిదారి దేశాల్లోని మేధావుల్లో ఆవరించిన నిరాశా నిస్పృహలు రకరకాల రూపవాద ప్రక్రియలకు ప్రాణం పోశాయి. ఈ అనారోగ్యకరమైన ప్రక్రియల మీద తిరుగుబాటుగా క్రిస్టఫర్ కాడ్వెల్ , రాల్ఫ్ ఫాక్స్ వంటి విమర్శకులు 'న్యూ సిగ్నేచర్స్' అనే కవితా సంపుటిని ప్రకటించారు. అలాగే అనేక దేశాల నుండి యుద్ధోన్మాదాన్ని, పెట్టుబడి పీడనం ,వలస పాలనను వ్యతిరేకించే ప్రగతిశీల ప్రజాస్వామ్య భావాలు గల రచయితలు కళాకారులు మేధావులు లండన్లో 1932లో అంతర్జాతీయ

అభ్యుదయ రచయితల మానిఫెస్టో ప్రకటించారు. ఈ సమావేశాలకు హాజరైన భారతీయ రచయితలు లండన్ మేనిఫెస్టో ఇచ్చిన ప్రేరణతో మన దేశంలోని భిన్న ప్రాంతాలకు చెందిన రచయితలను సమకూర్చి 1936లో లక్నోలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన అబ్బూరి రామకృష్ణారావు గారు ఆంధ్ర ప్రాంతంలో ఉన్న శ్రీశ్రీ వంటి యువ రచయితలచేత అంతర్జాతీయ అభ్యుదయ రచయితల ప్రణాళిక ప్రతిని చదివింప జేశారు. ఆ ప్రణాళిక కలిగించిన నూతన ఉత్తేజం శ్రీశ్రీతో మహాప్రస్థాన గీతాలను రాసేలా చేసింది. తన సమకాలీన కవుల కన్నా ఈ ప్రణాళిక తో అత్యధికంగా ప్రభావితమై ప్రతిస్పందించిన వాడు కాబట్టి ఇ అద్భుతమైన గీతాన్ని ఆంధ్ర జాతికి అందించగలిగాడు శ్రీ శ్రీ. తన తరాన్నే కాక భవిష్యత్ తరాలను కూడా ప్రభావితం చేశాడు.

గురజాడ స్ఫూర్తి :

భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో దేశభక్తిని ప్రబోధించాలన్న ధ్యేయంతో చాలామంది కవులు కావ్యాలు రచించారు. వారంతా దేశాన్ని ఒక భౌగోళిక ప్రాంతంగా భావించి అందులోని నదులు,పర్వతాలను సముద్ర తరంగాలను కీర్తించారు తప్ప ఆ ప్రాంత ప్రజలను గాని పోరాటయోధులు గాని, నదులపై ఆనకట్టలు నిర్మించి బీడు భూములను వ్యవసాయ యోగ్యం చేస్తున్న నిర్మాణ కూలీలను గానీ తమ కవిత్వంలో తీసుకున్నట్లు కనిపించదు ఇలాంటి ధోరణులపై తిరుగుబాటుగా 1910 నాటికి దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని కొత్త ఆలోచన విధానాన్ని ఆంధ్ర జాతికి అందించిన ఆధునిక కవి గురజాడ అప్పారావు గారు. జన సమూహాలు కళా రూపాలను సృష్టించాలన్న తమ అవసరాలు తీర్చే అనేక వస్తువులను తయారు చేయాలన్నా వారికి ముందు కావలసింది పొట్టనిండా తిండి, కట్టుకోవడానికి గుడ్డలు, ఉండడానికి ఇల్లు. వర్గ సమాజంలో ఇవన్నీ నీ తీరని కోరికలు. నిరాశా నిస్పృహలకు లోను చేస్తూనే ఉంటాయి. ఈ విషయాన్ని ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్ తిండి కలిగితే కండ కలదోయ్ కండ కలవాడేను మనిషోయ్ అని స్పష్టం చేసిన గురజాడ అన్నదమ్ముల వలెను మతములన్నియు మెలగవలెనోయ్ అంటూ భవిష్యత్తుకు బాటలు వేసిన వైతాళికుడు గురజాడ. ఒక కొత్త ఆలోచన విధానాన్ని, ఒక నూతన గృహము తెలుగు జాతికి గురజాడ అందిస్తే దాన్ని ఆధునిక యుగ స్వభావంగా అభ్యుదయ పథ నిర్దేశంగా భావించి నా వాడు శ్రీశ్రీ. అందుకే ''అడుగు జాడ గురజాడది అది భావికి బాట'' అంటూ గురజాడ స్ఫూర్తి ని స్వీకరించి పతితుల కోనం, భ్రష్టులకోనం, బాధాసర్పదష్టుల కోసం, కూలీ, నారీ, రైతుల కోసం, గుడిసెల్లో బతికే వాళ్లకోసం, నిరుద్యోగుల కోసం పాలికేకలు వేసిన వాడు శ్రీ శ్రీ.

చారిత్రక భౌతికవాదం :

ఇంతవరకు నటించిన చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్ర పీడితులు నిరంతరం పరస్పర శత్రువులుగా నిలబడి ఒకప్పుడు పోరాటం చేస్తూ ఉన్నారు ఈ పోరాటం పర్యవసానం ఒకసారి మొత్తం సమాజం విప్లవాత్మక పునర్నిర్మాణానికి లోనయ్యేది, ఒక్కోసారి ప్రత్యర్థివర్గాలు రెండూ నాశనం అయ్యేవి'' అంటున్నది చారిత్రక భౌతిక వాదం. ఈ విషయాన్నే ''నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం రక్త ప్రవాహం దరిద్రులను కాల్చుకు తినడం'' అనడంలో స్పష్టమవుతుంది.

అలాగే చరిత్ర నిర్మాతలు ప్రజలు ఏ రాజు లో వారి తాబేదార్లు కాదు అన్న చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని కవిత చేసి గుండెల్లోకి దూసుకుపోయే విధంగా రాసిన వాడు శ్రీ శ్రీ. రాణుల ప్రేమ పురాణాలు, రాజుల ముట్టడికి అయిన ఖర్చులు మతలబులు కైఫీయతులు చరిత్ర కాదంటూ ''నైలు నదీ నాగరికతలో సామాన్యుల జీవన మెట్టిది, తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీ లెవ్వరు'' పరిశీలించమన్నాడు శ్రీశ్రీ.

తాజ్‌మహల్ అనగానే పులకించిపోతూ అదో అద్భుత ప్రేమ సౌదామని వెండి కొండ అని వెన్నెల మేడం వర్ణించే కాల్పనిక కవుల వెన్నుతట్టి ఆ వెన్నెల మేడ నిర్మిస్తూ ఎన్ని చేతులు విరిగాయో, ఆ వెండికొండ కింద ఎన్ని కాళ్ళు తెగిపడినాయో, ఎన్ని కళ్ళు చీకట్లు కమ్మాయో, ఆ ప్రేమసౌధం కోసం ఎందరు కూలీలు బలయ్యారో, ఎందరు కూలీల భార్యల విధవలు అయ్యారో ఆలోచించ మన్నాడు శ్రీశ్రీ. అంతేకాకుండా "అందరం కలిసి చేసిన ఈ, అందమైన వస్తు సముదాయం అంతా, ఎవడో ఒక్కడే వచ్చి, ఎత్తుకు పోతూ ఉంటే....., అన్యాయం -అన్యాయం- అని మేమంటే, అనుభవించాలి మీ ఖర్మం అంటాడు" అని సామాజిక ఉత్పత్తిని వేస్ట్ స్వామ్యం చేసుకుంటున్న వర్గ సమాజ స్వభావాన్ని కళ్ళ ముందు ఉంచాడు శ్రీ శ్రీ చరిత్రపై నిర్దిష్టమైన అవగాహన ఉన్న వాడు కాబట్టే "చరిత్ర సలసల మండే భాండం. సిమ్మరింగ్ పాట్" అనగలిగాడు. ఇప్పటివరకు జరిగిన చరిత్ర గురించి తత్వవేత్తలు రకరకాలుగా వ్యాఖ్యానించారు ఇప్పుడు మనం చేయవలసింది దీన్ని మార్చడం అన్నాడు కార్ల మార్క్స్. దానికి అనుగుణంగా చరిత్రను వ్యాఖ్యానించడం తోనే సరిపెట్టుకోకుండా ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ ఒక జాతిని వేరొక జాతి పీడించే సాంఘిక ధర్మం ఇంకానా ఇకపై సాగదు అంటూ ఖచ్చితంగా హెచ్చరించాడు శ్రీ శ్రీ. దోపిడి కీ, పీడనకూ తావులేని సమ సమాజ నిర్మాణం కోసం పిడికిళ్ళు బిగించాడు శ్రీశ్రీ.

మరో ప్రపంచం :

ఒక మనిషిని వేరే ఒక మనిషి ఒక జాతిని వేరొక జాతీ ఒక వర్గాన్ని ఒక వర్గం దోపిడీ చేయడానికి అవకాశం లేని సమ సమాజం కావాలని కాంక్షిస్తూ దాన్నే మరో ప్రపంచం గా అభివర్ణిస్తూ దానికోసం "దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణచేస్తూ కదం తొక్కుతూ పదం పాడుతూ హృదంతరాళం గర్జిస్తూ పదండి ముందుకు పదండి తోసుకు" అంటూ మాచింగ్ గీతాన్ని నినదించడంతో "త్రాచులవలెనూ రేచులవలెనూ ధనంజయునిలా సాగండి కనబడ లేదా మరో ప్రపంచపు అగ్నికిరీటపు ధగధగలు ఎర్రబావుటా నిగనిగలు హైమజ్వాలల భుగభుగలు" అంటూ అప్పటికీ రష్యన్ కార్మికవర్గ మహా నాయకుడు లెనిన్ సారధ్యంలో బోల్షివిక్ పార్టీ నాయకత్వంలో ఎర్ర జెండా నీడలో నిర్మితమైన మరో ప్రపంచం కనబడలేదా విరామమెరుగక మోగుతూ ఉన్న కార్మిక వర్గ నియం తృత్వపు కంచు నగారా వినబడలేదా.... తరతరాల దోపిడీ వర్గదుర్గాలు, తగలబడిపోతున్న సూచిక వేదాంతాలు శూన్య హస్తాలు సంప్రదాయ ఛాందస భావజాలాలు భూస్వామ్య వర్గాల గుప్పిట్లో భూములు చేయబడుతున్న ఫ్యాక్టరీలు పరిశ్రమలు సమాజ సంపదలు తరిమి వేయబడుతున్న ఆకలి నిరుద్యోగం దరిద్రం అజ్ఞానం అనారోగ్యాలు ఇవన్నీ కనబడలేదా కొత్త సృష్టిని స్ఫురింపజేస్తుంది పుడమితల్లి పురిటినొప్పులు వినబడ లేదా అని సూటిగా ప్రశ్నిస్తున్నారు ఈ మహాప్రస్థానంలో ఎదురయ్యే చెరసాలలు ఉరికొయ్యలు ప్రాయంగా భావించడమే కాక చెరసాలలో శిరస్సులపై ఉరికొయ్యల చివర పై ఎగురుతున్న తిరుగుబాటు ప్రదర్శితం చేస్తూ పతిత దళిత జనరణ హుంకారాన్ని ప్రళయ సమయంలో దిగ్గజం ఘీంకారాన్ని నిద్రిస్తున్న సమాజము గుండెమీద బాంబుల నిటారుగా నిలబడ్డ వ్యవస్థను కుదిపేసే డైనమిక్ ప్రయోగించిన వాడు శ్రీశ్రీ.

అంతర్జాతీయ దృక్పథం :

జర్మనీ జపాన్ ఇటలీ లనే ఫాసిస్టు దుష్టత్రయం మొత్తం ప్రపంచాన్ని కబళించి వేయాలనే దుర్మార్గపు తాపత్రయంతో రెండవ ప్రపంచ యుద్ధాన్ని సృష్టించి అన్నిదేశాల్నీ ఖండాల్ని సమస్త భూగోళాన్ని యుద్ధం మాట జ్వాలలో రగిలిస్తూ అందులో భాగంగా మొట్టమొదటి సోషలిస్ట్ దేశమైన సోవియట్ యూనియన్ ని నాశనం చేయాలన్న తలంపుతో ఆ దేశంపై దాడి చేసి అపారమైన ఆస్తి నష్టం ప్రాణ నష్టాన్ని కలిగిస్తున్నప్పుడు 1941 జూన్ నెలలో సోవియట్ వాయుసేన రంగంలోకి దిగి ఫాసిస్టు సైన్యాలను సాహసోపేతంగా ఎదుర్కొంటున్నారని వార్తలు

చదివిన శ్రీ శ్రీ ఒక క్రాంత దర్శిగా నేలపై కమ్యూనిజం బతకాలనే ప్రగాఢమైన కోరిక గల అంతర్జాతీయ వాదిగా గర్జించు రష్యా ! గాండ్రించురష్యా ! పర్జన్య శంఖం పూరించు! రష్యా దౌర్జన్య రాజ్యం ధ్వంసించు రష్యా! అంటూ సోవియట్ సోషలిస్ట్ రాజ్యం రక్షింపబడాలి అని

మేలు కొంటున్న సుప్త కంకాలాల్నీ, పరిగెత్తి పోతున్న ప్రపంచాన్ని, విప్లవ కెరటాలు పొంగి తిరగబడుతున్న కార్మికులు, కర్షకులు, తాడిత, పీడితుల సౌభ్రాతృత్వాన్ని, సోవియట్ విజయాన్ని కాంక్షిస్తూ గర్జిస్తున్న కోట్లాది గుండెల్ని గొంతెత్తి గానం చేశాడు శ్రీ శ్రీ ఆ మహా కవి స్వప్నం నెరవేరింది కార్మికవర్గ వర్గం విజయం సాధించింది ప్రజలు జూలు విదిల్చిన సింహాలై కలియబడ్డారు. కోట్ల మందిని పొగొట్టుకున్న ఏ మాత్రం ధైర్యం కోల్పోని సోషలిస్టు సేనలు శత్రువులను తరుముకుంటూ అనేక దేశాలను విముక్తం చేసుకుంటూ ఆయా దేశాల గుండెలపై అరుణ వేస్తూ ముందుకు సాగాయి ప్రమాదం నుండి ప్రపంచాన్ని సంరక్షించాయి. ఈ విజయానికి మనదేశంలోని కమ్యూనిస్టు అందరితోపాటు మనసారా స్వాగతం పలికిన వారు శ్రీ శ్రీ.

ముగింపు :

శ్రీశ్రీ ని ప్రభావితం చేసిన వాటిలో ఈ నాలుగు ప్రధానమైన అంశాలు. అంతేకాకుండా నాటి బ్రహ్మ సమాజ ప్రభావం దేవులపల్లి కృష్ణశాస్త్రి విశ్వనాథ సత్యనారాయణ వంటి సమకాలీన ప్రముఖ తెలుగు కవులు, ఎడ్గార్ ఎలన్ పో, స్విన్ బర్న్ ,మయకో వస్కీ వంటి విదేశీ కవుల సాహిత్యం కూడా శ్రీశ్రీ మీద అత్యధికంగా ప్రభావం చూపించింది. ఇంత బలమైన చారిత్రక సామాజిక నేపథ్యం ఉంది కాబట్టి శతాబ్ద కాలం పాటు తెలుగు సాహిత్యం పై తన ప్రభావాన్ని బలంగా చూపించగలిగాడు శ్రీ శ్రీ.

ఆధార గ్రంథాలు :

1. ఆధునిక కవిత్వం- సంప్రదాయాలు, ప్రయోగాలు-సినారె
2. సమగ్రాంధ్ర సాహిత్యం -ఆరుద్ర
3. ఆధునిక కవితా సమీక్ష- కె వి ఆర్ నరసింహం
4. శ్రీ శ్రీ సర్వ లభ్య రచనల సంకలనం- మనసు ఫౌండేషన్

❖❖❖

శ్రీ శ్రీ నవరసాల కథలు – ఒక పరిశీలన

– అంకే మదనమోహన, తెలుగు అధ్యాపకుడు, ప్రభుత్వ కళాశాల(స్వయం.) అనంతపురం.

శ్రీ శ్రీ తెలుగు సాహిత్యాన్ని ఖండించి, దీవించి, శాసించిన మహాకవి. మానవుడే నా సందేశం మనుష్యుడే నా సంగీతం" అని ఎలుగెత్తి చాటాడు . నెమ్మదిగా, నిదానంగా ,మంద్రంగా సాగుతున్న తెలుగు సాహిత్యాన్ని ఉర్రూతలూగించి,పరుగులు పెట్టించాడు . "కదిలేది కదిలించేది .. మునుముందుకు సాగించేది, పెనునిద్దుర వదిలించేదీ, పరిపూర్ణపు బ్రతుకిచ్చేది, కావాలోయ్ నవ కవనానికి "అంటూ శ్రీశ్రీ తన కవిత్వ ఒరవడిని తెలుగు వారి నానుడి గా మార్చి అభ్యుదయ మార్గాన్ని సుసంపన్నం చేశారు.

కావ్యేషు నాటకం రమ్యం అంటారు ప్రాచీన అలం కారికులు. ఆధునిక కాలంలో కావ్యేషు కథా రమ్యం అనేంత కథా సాహిత్యం లభిస్తోంది. అందులో భాగంగానే శ్రీశ్రీ రాసిన కథలను చదివిన పాఠకుల్లో చాలామందికి అవి కథలా లేక సాహితీ వ్యాసాలా అనే అనుమానం కలుగక పోదు. అయితే ఆ కథలన్నీ వ్యాసలక్షణాల్ని సంతరించుకున్న కథగానూ, కథా విశేషాల్ని పుణికి పుచ్చుకున్న వ్యాసం గానూ కనిపిస్తాయి. బాగా పరిశీలించి చూస్తే ఆయా కథల లో ఉత్తమ కథా లక్షణాలైన సంక్షిప్తత, ఏకాగ్రత, సమగ్రత, (ఉత్కంఠ కూడా) సంఘర్షణ, సంవాద చాతుర్యం, నిర్మాణ సౌష్టవం వంటి వి కనిపిస్తాయి." శ్రీశ్రీ కథ జీవన వ్యధను మోసుకొని వచ్చే ఉదధి తరంగం " అంటారు జి. వి. యస్.సుబ్రమణ్యం .అందులోనూ ప్రయోగాత్మకంగా శ్రీ శ్రీ నవ రసాలకు ఒక్కొక్క రసం మీద ఒక్కొక్క కథ ను ఆవిష్కరించారు .అవి జ్యోతి మాస పత్రికలో 1976 ఆగస్టు నుండి 1977 మే నెల దాకా ప్రచురింపబడ్డాయి. నవరసాల కథలను గురించి శ్రీ శ్రీ

"నవరసాల నాయకున్ని
కవనం నా ఆయుధం
ఈ శతాబ్ది నేలుతుంది
భీభత్స రసాయనం " అంటాడు.

లెనినిజం (అద్భుత రసం -విస్మయం) :

(అసాధారణ సంఘటన లేదా అసాధారణ వస్తువు చూడ్డం వల్ల కలిగే విస్మయం) ఒక కల్పిత కథావస్తువును తీసుకుని కథ ముగింపు వరకు ఆశ్చర్యం తగ్గకుండా, పాఠకుల్లో ఉత్కంఠను రేకెత్తించే విధంగా కొనసాగుతుంది. ఈ కథ చదివినప్పుడు పోతన భాగవతం లోని అద్భుత రసాన్ని చిత్రించే వామనుని విశ్వరూప సందర్శనం లోని పద్యాలు గుర్తుకొస్తాయి ఉదా..కు 1.ఇంతింతై వటుడిం తయై.. బ్రహ్మాండాంత సంవర్ధియై, 2. రవిబింబంబు పమింప. వటుడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్. వంటి పద్యాలలో కలిగిన విస్మయం ఈ కథలో నాకు కలిగింది .అందుకే ఈ శీర్షికను ఎంచుకోవడం జరిగింది.

మాస్కో నగరం లోని క్రెమ్లిన్ భవనంలో లెనిన్ సమాధి ముందు కథ మొదలై తిరిగి అక్కడే కథ ముగుస్తుంది. టాస్ వార్తా సంస్థ లెనిన్ పార్థివదేహానికి ప్రాణప్రతిష్ఠ చేయడం జరుగుతుందని సమాచారం ప్రసారం చేసింది.. దీంతో ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రజ్ఞులు, వైద్యులు, సంప్రదాయవాదులు, మత సంస్థలు, హేతు వాదులు విభిన్న రకాలుగా స్పందిస్తారు. చంద్రుడికి, భూమికి మధ్య ఉన్న అంతరిక్షం లో లెనిన్ కు ప్రాణప్రతిష్ట చేసే ఆధునిక ప్రయోగాలు జరుగుతున్నాయి అని ఒక పాత్రికేయుడు రాయడం. శ్రీహరికోటలోని మన అంతరిక్ష వైజ్ఞానికులు దీని గురించి ఇప్పుడే వ్యాఖ్యానించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. టాస్వార్తాసంస్థ లెనిన్ కు ప్రాణ ప్రతిష్ట ప్రయత్నాలు ఫలిస్తున్నాయని, అంతరిక్షంలో తిరుగుతున్నాడని, మాట్లాడడానికి ప్రయత్నం చేస్తున్నాడని బులెటిన్ వార్తలు ప్రసారం చేయడం ఐక్యరాజ్యసమితిలో

లెనిన్ కు ఘనమైన స్వాగతం ఇవ్వడానికికొంతమంది తీర్మానించగా అమెరికారాయబారి "చనిపోయిన మనిషిని బ్రతికించడం అంత తేలికైన పని కాదని "వివరిస్తాడు. కొన్ని మత సంస్థలు భగవంతుని సంకల్పానికి విరుద్ధమని ఆ ప్రయత్నం సఫలం కాకూడదని ప్రార్థనలు చేశారు.

మనదేశంలో ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని ప్రార్థనలు, భజనలకనీ డబ్బులు పోగుచేసి, వాటిని కైంకర్యం చేయడం కూడా పత్రికలో రాలేదంటాడు రచయిత. అమెరికా వాళ్ళు ఒకవైపు ఇది అసాధ్యం అంటూనే మరొకవైపు న్యూయార్క్ని మాడిసన్ స్క్వేర్ లో స్వాగతం ఇవ్వడానికి ప్రతిపాదించడం. దీనికి ఆఫ్రికా దేశాలు అంగీకరించకపోవడం అంతలోనే భారత దేశ ప్రతినిధి హైదరాబాదులో స్వాగతం ఇవ్వాలని ప్రతిపాదన చేయడం ,చివరికి అంగోలా లో స్వాగతం ఇవ్వాలని తీర్మానం నెగ్గడం జరుగుతుంది.

దైవ భక్తుల్లో ప్రపంచాన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకొనే ఉద్దేశంతో రష్యన్లు బూటకపు నాటకం సృష్టించారు తప్ప చనిపోయిన మనిషి బతకడమేంటి అనే అనుమానం కూడా మొదలైంది. దీన్ని వ్యతిరేకిస్తూ హేతువాదానికి శాస్త్ర విజ్ఞానానికి బద్ధ విరోధులే అయినా ఈ ముఠాల వాళ్ళు తమకు దొరికిన ప్రతి విషయాన్ని ఉపయోగించి ప్రజల్లో గందరగోళం సృష్టించడం కొత్త కాదని నాస్తికులు చెబుతున్నారు. చివరగా అంతరిక్షంలో పునరుజ్జీవం పొందిన వ్యక్తి భూలోకంలో సజీవుడుగా ఉండడానికి అనుకూలమైన వాతావరణం లేనందువలన తిరిగి అదే ప్రాంతంలోని భద్రపరచాలని నిర్ణయించడం, టాస్ సంస్థ లెనిన్ సమాధి పునరుద్ధరింపబడిందని ప్రకటించడం ఆ రోజు సాయంత్రం ఇవాన్ లెనిన్ సమాధికి పూలదండ వేయడంతో కథ సమాప్తమవుతుంది.

ఈ కథ మొత్తం ప్రథమ పురుషలో నడుస్తుంది శ్రీశ్రీ రచన శైలి అద్భుతం. చివరి దాకా ఉత్కంఠతో కొనసాగుతుంది. 1924లో చనిపోయిన లెనిన్ పార్థివ దేహాన్ని కథావస్తువుగా తీసుకుని 1976లో కథ రాశారు. ఇందులో ప్రతి సన్నివేశం కళ్ళముందు జరుగుతున్నట్టు విస్మయానికి గురి చేస్తుంది. ఒక చిన్ని సంఘటన ప్రపంచవ్యాప్తంగా ఎలా వైరల్ అవుతుంది అనేది ఆనాడే శ్రీశ్రీ దర్శించాడు అనడంలో అతిశయోక్తి లేదు.

నింపాదిగా కోపం చెయ్యి (రౌద్ర రసం) (రౌద్ర రసానికి స్థాయి భావం- క్రోధం శత్రుధిక్కారం వల్ల కలిగే మనఃప్రజ్వలనం క్రోధం) కోపం వల్ల జరిగే అనర్థాన్ని ఈ కథలో రచయిత వివరిస్తారు కోపం విషయంలో మనిషికి జంతువుకి తేడా ఉండదు లింగ భేదం కూడా ఉండదు అయితే కోపం వచ్చినప్పుడు మెదడులోనూ, గుండెల్లోనూ ఆ మాటకొస్తే శరీరమంతటా రక్తం ప్రకోపిస్తుంది . అలాంటి సమయంలో ఒకటి రెండు మూడు నాలుగు అంటూ కనీసం ఇరవై దాక లెక్క పెట్టాలి. అందులో తొందరపాటు తగదు. పరిగెత్తి పాలు తాగడం సామెత అలాగని నిలబడి నీళ్లు తాగమని మాత్రం సిఫారసు చేయడు రచయిత. ఆ తాగే నీరు నిలబడి నిదానంగా పాలే తాగమంటాడు నింపాదిగా కోపం చేయడం కూడా ఇంతే.

నీకే గనక నియంతృత్వ అధికారం వచ్చి కోపాన్ని నిషేధించాలని ఒక చట్టం జారీచేశావు అనుకో . అది జరిగే పనేనా? దేనికైనా మితం ఉండాలంటూ మద్యపానానికై నా, కోపానికైనా, కుటుంబ నియంత్రణకైనా అంటాడు రచయిత. కొంతమంది ఇది మనుషులు సిగ్గు లేకుండా మన కళ్లెదుటే చేస్తున్న పనులు చూస్తే ఒళ్ళు మండుతుంది కానీ ఆ కోపాన్ని తగ్గించుకోవాలి అంటాడు రచయిత ఉదాహరణకు లైబ్రరీలో పాఠకులు చదువుతూ ఉంటాడు గోడల మీద నిశ్శబ్దం గా ఉండాలనే ప్రాథమిక నియమాన్ని పనికట్టుకుని ఉల్లంఘించడమే వ్యక్తి స్వాతంత్ర్యంగా భావించేవాళ్ళు మనదేశంలో కోకొల్లలు. అదేవిధంగా బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు నో స్మోకింగ్ అని ఉన్నప్పటికీ ఎవరికీ తోచింది వాళ్ళు చేస్తూ ఉంటారు ఎవరైనా ప్రశ్నిస్తే నేడే చూడండి మా సినిమాను అని పోస్టర్ ఉంటుంది. అలాగని మనం ఆ సినిమాను చూస్తామా అని తిరుగు ప్రశ్న వేస్తారు.. అంటాడు

రచయిత.ఒక్కొక్కసారి పేదవారి కోపం పెదవికి చేటు అని చెప్పడంలోనూ, అత్త మీద కోపం దుత్త మీద చూపడం అని చెప్పడంలోనూ ఒకటే అంతః సూత్రం. రెండింటిలోనూ నష్టమే జరుగుతుంది అని రచయిత ఉద్దేశం.

మన అలంకారికులు రౌద్రం ఒక రసంగా పరిగణించారు. అయితే ఉత్తమ సాహిత్యంలో ఎక్కడా, ఎప్పుడూ ఏ రసము మోతాదు మించి పోదు. వాస్తవం అనే భ్రాంతిని కలిగించేదే కళ అంటాడు రచయిత అందుకే మన వాళ్ళు అరిషడ్వర్గాలలో క్రోధానికి ,రెండో స్థానం ఇచ్చారు. రచయిత ఉద్దేశంలో బహిరంగ శత్రువు తో కన్నా అంతరంగ శత్రువుతో పోరాడే పద్ధతి వేరు అని చెబుతూ, క్రోధం లాంటి భయంకర శత్రువుతో పోరాడ వలసి వచ్చినప్పుడు నింపాదిగా కోపం చెయ్యి అనే సూత్రం పాటిస్తే విజయం చేకూరుతుంది అని చెబుతారు రచయిత. ముఖ్యంగా ఈ కథ మనస్తత్వ శాస్త్రానికి సంబంధించిన కథగా మనం భావించవచ్చు.

అరవంలో కోడిగుడ్డు(హాస్యరసం - హాసం) :

ఈ కథలో ప్రధానంగా తాతా-మనవడు ఉంటారు. కథ అంతా ఉత్తమ పురుషలో కొనసాగుతుంది. అరవ భాష నేర్చుకోవడంలో వచ్చే ఇబ్బందులను రచయిత వివరిస్తారు. మనవడు ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదువుతుంటాడు తాను అన్ని సబ్జెక్టుల్లో 80, 90 మార్కులు తెచ్చుకుంటాడు కానీ ఒక అరవం (తమిళం)లో మాత్రం కోడి గుడ్డు (గుండుసున్న) తెచ్చుకుంటాడు. కారణం అడిగితే మిగతా వాటిలో ఎన్ని మార్కులు వచ్చాయో చూడమన్నాడు.

అరవ(తమిళం) భాష/లిపి నేర్చుకోవడం కంటే నాగర(హిందీ)లిపి, రోమన్ (ఆంగ్లం) లిపి సులభం అంటాడు అందుకే కాబోలు ముస్తఫా కమాల్ పాషా టర్కీకి నియంత అయిన తక్షణమే తురక లిపిని రద్దు చేసి రోమన్ లిపిని అందరూ వాడాలని శాసించారు. అలాగే మన దేశంలో కూడా అన్ని భాషలకి రోమన్ లిపినే వాడితే ఈ వైజ్ఞానిక యుగం సొమ్ము, శ్రమ కలిసొస్తాయి అంటాడు. మనవడి స్కూల్లో ప్రతినెలా పరీక్షలు జరుగుతాయి, అన్నింట్లోనూ మంచి మార్కులు తెచ్చుకుంటూ ఉంటాడు ఒక్క అరవంలో మాత్రం కోడిగుడ్డు వస్తూనే ఉంటది. అది నిజమైన కోడిగుడ్డు అయితే ఎంత బాగుండు. నా ఆహార సమస్య తీరేది కదా అని చమత్కరిస్తాడు శ్రీశ్రీ.

మనవడి సమస్యను దృష్టిలో ఉంచుకొని అపద్ధర్మంగా హిందీ ని ప్రవేశ పెడితే బాగుండునంటాడు. మారిషస్ ప్రధానమంత్రి హిందీ ప్రపంచ భాష అని కీర్తించాడని, గాంధీ మహాత్ముని తర్వాత మహాత్మునిగా పిలువబడ్డ వినోబాభావే గారు ఆసియా ఖండం అంతటా నాగర (హిందీ) లిపి అమలు చేయాలని కోరిక వెలిబుచ్చారు. అది జరిగేనా అంటాడు రచయిత. అలాగే మంత్రాలు తంత్రాలు వేసే బాబా గార్లు, అమ్మవార్లు దేశమంతటా హిందీ తీసుకు వస్తే కనీసం మనవడి కష్టం గట్టెక్కేది అంటాడు కానీ అది సందేహమే. ఎందుకంటే అరవంలో కొన్ని శబ్దాలకు సూచించగలిగే అక్షరాలు హిందీ లో లేవు. అదేవిధంగా మన అచ్చతెలుగు ధ్వను లైన ఎ, ఒ, చ, జ,ఱ లకు హిందీ లిపి న్యాయం చేయలేదు లేదు. పంచ ద్రావిడ భాషల (తెలుగు, తమిళం, కన్నడ ,మలయాళం, తుళు భాషలు అనుకుంటా) కుటుంబానికి ప్రత్యేక లక్షణాలున్నాయి. వీటిలో ఏ ఒక్క దానికి నాగర లిపి అనుకూలం కాదని తన అభిప్రాయం చెబుతాడు.

చివరిగా మనవడి సమస్యను పరిష్కరించడానికి మహాభారతంలోని ఒక కథను ఉపమానంగా తీసుకొని ద్రావిడ భాషలలో ఒకటైన తెలుగులో కుస్తీ పట్టించి, మంచి పట్టు సాధించేలా చేస్తాడు.. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టు తెలుగు,అరవం రెండూ మనవడికి కొట్టినపిండి అవుతాయి. ఫలితంగా ఈసారి టెస్టులో మనవడికి కోడిగుడ్డు బదులు వెరీ గుడ్డు వచ్చింది అని సంతోషిస్తాడు.

ఈ కథలో మహాభారతంలోని ఉత్తర ప్రగల్భాలలో హాస్యం పండించి నట్టుగా అరవం భాషను, మనవడిని కేంద్రీకృతం చేసుకొని, ఆ భాష నేర్చుకోవడానికి ఎదు రయ్యే సమస్యల్ని సున్నితంగా, హాస్యంగా, చమత్కారంగా వివరిస్తూనే ఆ సమస్య నుంచి గట్టెక్కే మార్గం చూపించాడు రచయిత.

దైవభీతి (భయానక రసం -భయం) :

రచయిత రామయ్య శెట్టి ఇద్దరు బాల్య స్నేహితులు. రచయిత నాస్తికుడు రామయ్య శెట్టి ఆస్తికుడు. శెట్టికి భయమూ, భక్తీ రెండూ ఎక్కువే. దేవుడు ఉన్నాడని తను, దేవుడు లేడని రచయిత ఎప్పుడూ వాదించుకొంటూనే ఉంటారు. ప్రతి రోజు చాలా మంది చనిపోతున్నారు. అలాగే చనిపోయినవాళ్ల తాలూకు బంధువులు దేవుళ్ళను మొక్కుతూండటం నిజం కాదా అంటాడు రచయిత అలా అయితే మీ అమ్మా నాన్న ఇద్దరూ చనిపోయారు కదా వాళ్ళను కాపాడమని దేవుళ్లను మొక్కుకున్నావా అని రచయిత అంటే శెట్టి నువ్వు నాస్తికుడిని నీకు సమాధానం ఇవ్వనుపో అని ఒకసారి మరో సందర్భంలో లో కర్మ ఫలం అని సమాధానం ఇస్తాడు. ఇద్దరికీ మిత్రు డైన జనార్దన్ రావు తను తాసిల్దార్ అయినా శెట్టి బట్టల దుకాణంలో 500 రూపాయలు ఖరీదు చేసి, ఇవ్వకపోతే ఆ డబ్బు ఇవ్వమని గట్టిగా అడగడానికి ధైర్యం లేక ఆశ వదులుకున్నాడు శెట్టి. తీర్థపు రాళ్ళ దగ్గర రచయిత, లోలోపల బాధపడుతున్న శెట్టిని చూసి, కారణం అడగగా తన భార్య తనను మోసం చేసిందని విలపిస్తాడు. తామిద్దరూ నల్లగా ఉంటే తమ బిడ్డ తెల్లగా ఎలా పుడతాడు అని అడిగితే దానికి సమాధానం గా మెండీ లియన్ థియరీ ప్రకారం భార్య భర్త నల్లగా ఉన్నా వారికి పుట్టే బిడ్డ తెల్లగా పుట్టే అవకాశం ఉందని జన్యుపరంగా జరిగే మార్పు అని చెబుతాడు రచయిత.

శెట్టి తన తెల్లబిడ్డను ఎంతో ప్రేమగా చూసుకుంటూ ఉండగా ఒక రోజు జ్వరం రావడం దానికి విరుగుడుగా నవగ్రహశాంతి చేయించడం, ఆ తర్వాత ఏడుకొండల వాడికి తలనీలాలు ఇస్తానని మొక్కుకొన్నా ఫలితం లేక పిల్లాడు చనిపోవడం. అది పూర్వజన్మలో తాను చేసిన పాపం అని సముదాయించుకోవడం. రచయిత శెట్టితో ఏడుకొండల వాడికి తలనీలాలు ఇవ్వడం అవసరం లేదని తన బిడ్డను బతికించలేదు కదా అని అంటే అలా చేయకపోతే తన ప్రాణానికి ముప్పు అని భయ పడడటంతో కథ ముగుస్తుంది.

ఈ కథలో మనిషి పుట్టిన నాటి నుండి చనిపోయే దాకా భయం గుప్పిట్లో జీవిస్తున్నాడు. దేవుని పేరుతోనూ కర్మసిద్ధాంతం పేరుతోను ఆ భయాన్ని సృష్టించుకొని ఆ మాయ నుంచి బయటికి రాలేకపోతున్నాడు అని, రచయిత హేతువాద భావాన్ని అలవర్చుకోవాలని సూచిస్తాడు.

మదన కథన కథ (శృంగార రసం) :

(శృంగార ఏవ ఏకోరసః భోజుని మతం) డాక్టర్ మదన్ మోహన్ ప్రముఖ వైద్యుడు, పరిశోధకుడు కూడా. మనిషి యొక్క వయస్సును (ఆయుర్దాయం) పెంచడంలో పరిశోధన కొనసాగిస్తున్నాడు. ఒక రోజు హౌరా నుంచి మద్రాసుకు రైలులో ప్రయాణిస్తున్నాడు అదే కంపార్ట్మెంట్లో ఒక జమీందారిణి కూడా ప్రయాణిస్తోంది ఆ ఇద్దరి మధ్య జరిగిన మౌన సంభాషణ తుని స్టేషన్ దాకా కొనసాగింది. తునిలో జమీందారిణి గారిని రాజ బంధువులు ఆతిథ్యం స్వీకరించాలని కోరడం, తనకు అభ్యంతరం లేకపోతే డాక్టర్ గారిని కూడా ఆహ్వానించడం జరుగుతుంది. ఆ ఇద్దరి మధ్య జరిగిన శృంగార సన్నివేశం నాలుగు కళ్ళతో పాటు ఒకటిన్నర పెదవులూ కలుసుకున్నాయి అంటాడు రచయిత. అందులో ఒక పెదవి డాక్టర్ గారిది, అరపెదవి అమ్మా రావు గారిది. ఇంతకీ ఆ డాక్టర్ వయస్సు యాభై ఏళ్లు, ఆవిడ వయస్సు అరవై ఏళ్లు .

తుని నుంచి ఇద్దరు బయలుదేరిన తర్వాత డాక్టర్ గారిలో మనుష్యుల వయస్సు పొడిగించడం సాధ్య మైనపుడు తగ్గించడం మాత్రం ఎందుకు సాధ్యం కాదు అన్న ప్రశ్న ఉదయించి, ప్రయత్నం చేసి అతను 20

సంవత్సరాల యువకుడు అయ్యాడు. అదే సమయంలో అమ్మా రావు గారి వయస్సు సగం తగ్గుతుందని అతనికి తెలుసు. పైగా తన పరిశోధనల ఫలితం తనకు తన ప్రేయసికి తప్ప ఇతరులకు దక్కకూడదని నాశనం చేసేసాడు. ఇది శాస్త్ర విరుద్ధం అని తనకు తెలుసు కానీ స్వార్థం కోసం చేస్తాడు తనకు తెలుసీ మన పాతశాస్త్రాలన్నీ దేవతల వయస్సు ముప్పై సంవత్సరాలనే చెబుతున్నాయని డాక్టర్ గారి ఉద్దేశ్యం.

తుఫానులో ఏ రేవైనా చాలు అనుకునే డాక్టర్ గారు, చూసి చూడగానే మోహించిన జమీందారిణి ఇద్దరూ వయస్సు, కులం, హెూదా, గౌరవమర్యాదలు వంటి అడ్డుగోడల్ని దాటుకొని ఏదైనా ఆశ్రమంలో తన పేరును (భగవంత బాబా) మార్చుకుని సుఖంగా జీవిద్దాం అనుకుంటారు. ఈ విషయాన్ని వైజ్ఞానిక పత్రికలన్నీ డాక్టర్ గారిని శాస్త్రజ్ఞాన శత్రువుగా విమర్శించాయి. భక్తులు మాత్రం గొప్ప ఆధ్యాత్మిక పరివర్తన చెందిన సిద్ధుడని సైన్స్ లాంటి క్షుద్ర వ్యాసంగాల్ని వదులుకొన్న త్యాగమూర్తి అని కీర్తించారు.

కుళ్ళు పేతుళ్ళూ (బీభత్స రసం -జుగుప్స) :

శ్రీశ్రీ గారు కవితాత్మకంగా చెప్పిన కథ ఇది. ఈ దేశంలో మనుషుల గురించి, దేవుళ్ల గురించి, అనాధలు, అభాగ్యుల గురించి, ఆస్తికులు, నాస్తికులు గురించి వివరించిన కథ ఇది. ఈ దేశంలో ఎలకా ,పందీ దేవుడే, మనిషి మాత్రం యెదవ అంటాడు. తెల్లారి లేచింది మొదలు, ఎవడి నెత్తి కొడదామా అనే ఆలోచన మొగుడ్ని పెళ్ళాం మోసం చేస్తది, మొగుడు ముఠా కోరు అంటాడు. అంతా అసహ్యం ఇష్టం వచ్చినన్ని పాపాలు చేసి కొబ్బరికాయ కొడితే చాలు, కర్పూరం వెలిగిస్తే చాలు పాపాలు పోతాయని వెక్కిరిస్తాడు.

మసీదు ముందర, కోవెల ముందర ఎంతోమంది అనాధలు వారి చుట్టూ ఈగలు, దోమలు .అక్కడ అన్నం పెడితే తిని నువ్వు ప్రసాదమంటావు నేను పెంట రా అంటాను.. నన్ను నాస్తికుడు అని నువ్వు అంటావు ఏది ఏమైనా నిత్యం దేవుడు మీద ఆధారపడి భక్తులు అందరూ అశక్తులు, బానిసలు, మానసిక స్వాతంత్రం లేని మీ మనసంతా జుగుప్సాకరం.. మీ దేవుళ్ళ దగ్గర బీభత్సం .దేవుడునుంచి బయటికి రమ్మని, దేవుడే కుళ్ళు అని, అలా లేకుంటే ఒకరిని ధనవంతుడిలా మరొకరిని పేదోడిలా ఎలా సృష్టిస్తాడు .అందుకే హేతు వాద భావాన్ని మనలో నింపుకొని సాటి మనిషికి సాయం చేస్తూ ముందుకు నడవాలి అంటాడు రచయిత.

బ్రూహి ముకుందేతి (శాంత రసం - శమం) :

కర్ణాటక సంగీతంలో ప్రముఖ స్థానం పొందింది తమిళ గాయనీమణి శాంతము లేక సౌఖ్యము లేదు... అంటూ పాడుతోంది. శాంత రసం వర్షిస్తున్న ఆమె సంగీతంలో తెలుగు భాషకు జరుగుతున్న డ్యామేజ్ ని ఎవరూ ఖాతరు చేయలేదు. ఒక్క రచయిత తప్పా. ఆమె గతంలో శృంగార ఒలికించే పాటలు పాడినా, భక్తి కారణంగా ఆమె గానములో ఆధ్యాత్మిక విలువలు ఉన్నాయని మొట్ట మొదటిగా ఒక పత్రిక ప్రచురించింది. అది ప్రామాణికం కూడా. అయితే ఆమె సంగీతం గురించి మాట్లాడే అర్హత తనకు లేనప్పటికీ, సాహిత్యానికి ఆవిడ కలిగించే హాని తలచుకొని రచయిత బాధ పడతాడు. ఆమె ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి కర్ణాటక సంగీతానికి గౌరవం తెచ్చింది కానీ కమ్యూనిస్టు దేశాలలో మాత్రం కచేరీలు చేయలేదు కారణం దైవ భక్తులు కానివారికి సంగీతం వినిపించడం ఆ దేవునికి అపరాధం చేయడం అని ఆమె నమ్ముతుంది.

కాలానుగుణంగా ఆ గాయనీమణి లో వచ్చిన మార్పు టికెట్లు పెట్టి కచేరీలు చేయడం కంటే ఉచితంగా అందరికీ సంగీతం అందించడం మంచిది అని భావించడం, ప్రజోపయోగ సంస్థల నుండి ఆహ్వానం రావడంతో, (విరాళాల రూపంలో వసూలు చేయడంలో ఆంక్షలు విధించేది కాదు) ప్రదర్శన ఉచితమే కానీ తన బృందానికి ఖర్చులు మాత్రం భరించాలనేది. ఆ విధంగా ఒక సారి ప్రధాన మంత్రి గారి పుట్టినరోజు కూడా

కచేరీ చేయడం జరిగింది. అక్కడికి ఒక సేట్ జీ రావడం, తన పుట్టిన రోజుకి కచ్చేరి చేయాలని కోరడం, ఇప్పుడు కుదరదు గాని వచ్చే సంవత్సరం చేస్తానని చెప్పడం జరుగుతుంది. ఇచ్చిన మాట ప్రకారం కచేరి జరిగింది అయితే ఒక్క పైసా కూడా ఇవ్వనని చెప్పాడు. ఆమె పుట్టెడు దుఃఖంతో పాడక తప్పలేదు. ''బ్రూహి ముకుందేతి, రసనే పాహి ముకుందేతి'' అంటూ పాడింది. శ్రోతలందరూ శాంత రసం లో తడిసి పోయారు. పాట మధ్యలో ఆమె గుండెపగిలి మరణించింది. అక్కడున్న వాళ్ళందరూ ఎంత పుణ్యాత్ములారా అంటూ మెచ్చు కొన్నారు. ఆమె మరణం సంగతి రచయిత కుక్క నీకు ఆమె ఎందుకు మరణించినచో నాకు ఒక్కడికే తెలుసు అని రచయిత కథను ముగిస్తాడు. ఈ కథలో శ్రీశ్రీ ఎంత గొప్ప గాయకులైన భాషపట్ల అభిరుచి, భావ శుద్ధి కలిగి ఉండాలని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పరోక్షంగా సూచన ఇస్తాడు.

కన్నీటి కబుర్లు (కరుణరసం - శోకం) :

భగవంతుడు కరుణామయుడు అని, అతగాడే ఈ ప్రపంచాన్ని సృష్టించాడని, తాను చేసిన దాన్ని చూసుకొని ఏడవడం తప్ప ఇంకేం చేయగలడని మనిషే దేవుడిని సృష్టించాడని, నాలాంటి వాళ్ళతో కలిసి నవ్వుకుంటాం . జీవంబం (యేను ఏడ్చెను) అనే పదం ఆశ్చర్యం కలిగించలేదు కానీ నిజీవంబం wept valitare laughed" అనే వాక్యం తనకు కనువిప్పు కలిగించింది అంటారు శ్రీశ్రీ.

ప్రబంధ కవులు పనిగట్టుకుని నాయికలతో ఏడిపించిన విషయం అందరికి తెలిసిందే.''పాటున కింతులోర్తురె కృపా కహితాత్మక'' అంటూ అల్లసాని పెద్దన అటు ఇటు ఏడ్చాడని, ''ఈసున బుట్టి డెందమున హెచ్చిన'' అంటూ ముక్కుతిమ్మన ముద్దుముద్దుగా ఏడ్చాడని, ''ఆ జాబిల్లి వెలుంగు వెల్లికల డాయన్ లేక'' అంటూ భట్టుమూర్తి బావురుమని ఏడ్చాడని మనం చదువుకున్నాం. దానికి కొనసాగింపుగా ఏడుపు కోసం కృష్ణపక్షం రాశాడు కృష్ణశాస్త్రి. కృష్ణశాస్త్రి కరుణ రసాన్ని గుత్తకు తీసుకున్నాడేమో అనిపిస్తుంది . ఆ తరువాత ప్రవాసము ఊర్వశి కూడా కన్నీరు ఓవర్ ఫ్లో అయిందని శ్రీశ్రీ అంటాడు ఈ ఏడుపంతా దేనికంటే దైవం కోసం, ప్రేమ కోసం అంటాడు ఠాగూర్. ఆ రవీంద్రుని మంత్రజాలంలో చిక్కుకున్న కృష్ణశాస్త్రి ఊర్వశి, ప్రేయసి ..అంటూ విప్రలంభ శృంగారం ఆలంబనగా కడవల కొద్దీ కన్నీరు కార్చడని శ్రీశ్రీ అంటారు.

ఎవరైనా ప్రముఖులు చనిపోతే పత్రికల్లో అసలు తర్పణచేస్తూ సంపాదకీయాలు కుంభవృష్టిగా కన్నీరు కురిపిస్తాయి అంటాడు దానిని శ్రీశ్రీ శివారాధన అంటారు లేదా శివ సంస్కృతి అంటాడు గొప్పవాడు మరణిస్తే ఏడుపు కాక నవ్వు వస్తుందా అని ఎవరైనా నన్ను అడిగితే అందరూ కలిసి ఏడుస్తాము కానీ, ఆ వెంటనే కళ్ళు తుడుచుకుని కార్యరంగంలోకి దిగడమే మన కర్తవ్యం అని చెప్తాడు. ''ఏకో రసః కరుణ ఏవ'' అంటే తాను ఒప్పుకోనని, శృంగార రసానికి కూడా ప్రముఖ స్థానం ఇవ్వనని ,ఆ రెండింటిని గద్దెదించి వీరరసానికి పట్టం కట్టాలని శ్రీశ్రీ సిఫారసు చేస్తాడు... అంటే శ్రీశ్రీ గారి ఉద్దేశంలో ఎవరైనా మహనీయుడు మరణిస్తే తాను సాధించాలనుకున్న ఆశయాల్ని మనం మునుముందుకు సాగించాలనే శ్రీశ్రీ గారి ఉద్దేశ్యం.

వెలుతురు కిరణాలు (వీరరసం - ఉత్సాహం) :

(లోకోత్తర కార్యాన్ని నిర్వర్తించడానికి సంకల్పం చేసే నిర్విరామ ప్రయత్నం ఉత్సాహం) ఈ కథ గెరిల్లా యోధులు గురించి చెబుతుంది ''నీ అంత ఇప్పుడే తేల్చేస్తా'' అంటూ గురిచూసి గొడ్డలి విసిరాడు గెరిల్లా యోధుడు. ఎదురుగా ఉన్న పోలీస్ పామును చూసిన కప్పలాగా నిశ్చలంగా ఉండి పోయాడు. ఏ దేశంలో అయినా ధీరులు ఉంటారు, పిరికి వాళ్ళు ఉంటారు. వీరిని చూసి పిరికి వాళ్ళకి ఆచూకీ ఇచ్చే వాళ్ళు ఉంటారు. వీరుల నెత్తి మీద బహుమతులు ప్రకటించి తమ దారికి అడ్డు తొలగించుకొనే ప్రభుత్వాలు ఉంటాయి. అయినా వీరులు ప్రభవిస్తూనే ఉంటారు ప్రభుత్వాలను పడు

గొడుతూనే ఉంటారు. ఒక ఉషస్సు పుట్టాలంటే ఎన్నో కోట్ల నక్షత్రాలు చనిపోవాలన్న కవి మాట కవిత్వమే కాదు యథార్థం అంటాడు. పై మాటలన్నీ మూడో వ్యక్తిగా శ్రీశ్రీ చెప్పిన మాటలే.

యోధుడిని గొడ్డలి చెట్టులో చిక్కుకోవడం పోలీసు తప్పించుకోవడం, యోధుడు పాదల్లోకి దాక్కోవడం, పోలీసు తుపాకితో వీరుడి తొడకి కాల్చడం, వీరుడు నేల కూలడం జైల్లో నిర్బంధించడం తరువాత పోలీసులు చేసిన చిత్రవధను రచయిత చెప్పదలచుకోలేదు. (అది అందరికీ తెలిసిందే) ఆ సంఘటనను పత్రికలవాళ్లు రకరకాలగా రాయడం జరుగుతుంది. జైలులో యోధున్ని ఉన్నతాధికారి ప్రశ్నించడం (నీ పేరు ఏమని అడగ్గా ''మానవుడు'' అని నీది ఏ ఊరు అనగా ''ప్రపంచమని'' ఏ ఊర్లో పుట్టావు అని ప్రశ్నించగా మీరు నేలమట్టం చేయకముందు ప్రపంచంలో ఒక కుగ్రామం అని) తెలివిగా సమాధానం ఇవ్వడం జరుగుతుంది. నీ లాంటి యువకులు ఈ దేశానికి ఎంతో అవసరం నా మాట విని ఆ రహస్యాలు చెప్పమని అడుగగా మా రహస్యం చెబితే మా వాళ్లకు ద్రోహం చేసినట్లే అనీ అది ఎప్పటికి జరగదని పోలీసు నెత్తి మీద యోధుడిచేయి పడబోతుంటే నేర్పుగా తప్పించుకొని, స్టేషన్ లో నిర్బంధించిన వాడిని చంప కూడదంటూనే బయటకు తీసుకెళ్లి వీడ్ని కాల్చేయండి అని ఆర్డర్ వేస్తాడు. పూర్తిగా చీకట్లు పోనీ, బాగా వెలుతురు రాని (పూర్తి స్వాతంత్రం రాలేదని, దానిని పోరాడి సాధించాలనే ఉద్దేశం)సమయంలో వీరుడు తుపాకీ గుళ్లను సంతోషం స్వీకరించాడు. ఆ చీకట్లో అతనికి ఓ వెలుతురు కిరణాలు కనిపించాయి. అవి తాను చదువుకునే గదిలో మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావోల వర్ణ చిత్రాలు... ఇంతటితో కథ సమాప్తమవుతుంది.

ఈ దేశానికి ఇంకా సంపూర్ణ స్వాతంత్రం రాలేదని, అది రావాలంటే ఇంకా ఎంతో మంది యోధులు ప్రాణార్పణ చేయడానికి సిద్ధంగా ఉండాలని సమాజ నిర్మాణం జరగాలంటే మార్క్సిజమే శరణ్యమని శ్రీ శ్రీ రచనల ద్వారా మనకు తెలుస్తుంది.

శ్రీశ్రీ ఈ నవరసాల కథల్ని కొన్ని ఉత్తమ పురుషలోనూ, ఎక్కువగా ప్రథమ పురుషలోనూ రచించారు. ఒకటి రెండు కథలు సాహితీ వ్యాసాలుగా కనిపించినప్పటికీ, ఆరుద్రగారు అన్నట్టు శ్రీ శ్రీ కథలు మొదట్లో కుతూహలాన్ని, చివరిలో ఆలోచనల్ని కలిగించాయి మధ్యలో రక్తి కట్టిస్థా ముందుకు నడిపించాయనేది'' మనం గ్రహించవచ్చు. శ్రీశ్రీ తన కవిత్వంలోనే కాదు తన కథల్లో కూడా అభ్యుదయభావాల్ని, వస్తువు నవ్యత, శైలి నవ్యతను పాటిస్తూ నూతన మార్గాలను అన్వేషిస్తూ, తెలుగుజాతికి మార్గ నిర్దేశకులు అయ్యారు.

❖❖❖

శ్రీశ్రీ - ఆధునిక సాహిత్యంలో వేగుచుక్క

- కె. రంగనాయకులు, పాఠశాల సహాయకులు (తెలుగు), జి॥ప॥ ఉ॥ పాఠశాల, చిప్పగిరి (గ్రా & మం.) కర్నూలు జిల్లా.

శ్రీరంగం శ్రీనివాసరావు అనే మహాకవి పుట్టింది విశాఖపట్టణంలో అయినా పెరిగింది మాత్రం సాహితీ వినీలాకాశంలో అని అంటాను. ఈయనగారికి ముందు ఎంతోమంది కవులు, కళాకారులున్నా, సంప్రదాయవేత్తలు ఉన్నా అందరిని కాదని తన పంథాను ఆపకుండా ఆధునిక యుగంలో ధిక్కరించిన విప్లవగొంతుకయినా తర్వాత సమాజంలోని నవ్యతను ఎత్తిచూపిన అభ్యుదయ కవి. జనహృదయాలలో చిరంజీవిగా నిలిచిపోయారు. 20వ శతాబ్దాన్ని శాసించిన విప్లవ కెరటం సంప్రదాయ కవిత్వానికి స్వస్తి అంటూ తన మహాప్రస్థానాన్ని మొదలు పెట్టిన నవయుగ వైతాళికుడు శ్రీశ్రీ. పేదల పక్షాన తన గొంతును చించుకున్న మహానుభావుడు. అందుకే అంటారు మహానుభావులు ఊరికే రారు అని.

నూనూగు మీసాల నూత్న యవనంలోనే 'ప్రభవ' కావ్యాన్ని రాసి అబ్బురపరిచారు. సమాజంలోని రుగ్మత లకు తన కవిత్వం ద్వారా మందు వేశారు. గాయపడిన గుండెలకు గీతాలు, సినిమా పాటలతో అలరించి రంజింపచేశారు. ఈయనగారు ఒకాను ఒక సందర్భంలో ఇలా అన్నారు. 1930 వరకు తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది. ఆ తర్వాత తెలుగు సాహిత్యాన్ని నేను నడిపిస్తున్నాను అని అన్నారు. సాహిత్యం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినవారు వీరే. ఈయన ప్రయోగించిన పదబంధాలు, వాక్యనిర్మాణాలు కవిత్వంలో ఇవన్ని ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

తన కవితలలో అల్లుకుపోయిన సాహితీ తీగలు సామాజిక వనంలో గుబాళింపులు వెదజల్లే సుగంధ పరిమళాలు. కవితా వస్తువులన్నీ సమాజంలోని తన చుట్టూ ఉన్నవాటిని సంపూర్ణంగా వినియోగించుకున్న సాహితీ సేవకుడు. శ్రీశ్రీ మరో ప్రపంచాన్ని సృష్టించిన సృష్టికర్త. అందుకే ఆయన మరోప్రపంచం పిలుస్తుంది. పోదాం పదండి అంటూ తన యుగళ గళాన్ని విని పించారు.

యువతరంగాన్ని ఉర్రూతలూగించిన ఈ కవితా గానం చూద్దాం!

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి తోసుకు
పోదాం, పోదాం పైపైకి
కదం తొక్కుతూ
పదం పాడుతూ
హృదంతరాళం గర్జిస్తూ
పదండి పోదాం
వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం?

అంటూ భావావేశాన్ని రగిలిస్తూ ప్రపంచంలోని అన్యాయాల్ని, అధర్మాల్ని ఎదిరిస్తూ ఆటంకాలన్నిటిని అధిగమిస్తూ, కుహనా శక్తుల కోరల్ని పెకళిస్తూ, పరస్పర విద్వేషాలను అంతం చేస్తూ ముంచుకొస్తున్న మృత్యువును దరిచేరనీయకుండా నిరాశ నిస్పృహలను పారద్రోలుతూ పదండి ముందుకు అంటూ గీతాలాపన చేశారు.

భవిష్యత్తుకు మార్గదర్శి శ్రీశ్రీ అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఎందుకనగా అర్థంలేని ఆశలు, ఆకారం లేని స్వప్నాలు ఉండరాదని, మానవులు సాటి మానవుడి మీద నమ్మకం, విశ్వాసం ఉంచాలంటారు.

శ్రీశ్రీ గారి మాటలలోనే ఇలా....

రాశి చక్ర గతులలో

రాత్రిందినాల పరిణామాలాలలో,
బ్రహ్మాండగోళాల పరిభ్రమణాలలో
కల్పాంతాలకు పూర్వం కదలిక పొందిన
పరమాణువు సంకల్పంలో
ప్రభవం పొందివాడా!
మానవుడా! మానవుడా! అంటూ ఎలుగెత్తి చాటుతూ వచ్చారు.

ఆంధ్ర సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవితా మహాయుగ కర్త శ్రీశ్రీ. ఈయన గారి వచన కవిత ఉత్తేజాన్ని ఊపిరిగా పీల్చే వజ్రాయుధ ధార! అని అంటారు సాహితీవేత్తలు. ఈయన కవితలు చదువు తున్నప్పుడు అక్షరాలు అయినా నాకు మాత్రం ఆయనలో గూడు కట్టుకున్న భావాలను ఆక్షరీకరించి సాధకబాధలు, సాటి మనుషులపై కల్గిన ప్రేమాప్యాయతలు ఒక ఉద్రేక జాలం తన హృదయంలో నుంచి ఉద్భవించిన విప్లవ కవితా వస్తువులు. శ్రామిక వర్గపు చైతన్య గీతాలాపనలు చేసి సరికొత్త మార్గదర్శకులు అయ్యారు. శ్రమ దోపిడీదారులకు కొరకరాని కొయ్యలా తయారు య్యారు. సమాజ చైతన్యముతో అభివృద్ధి బాట పట్టగలదు అని నొక్కి చెప్పారాయన.

సామాజిక స్పృహతోనే అంతర్జాతీయ దృక్పథాన్ని నేర్పిన శ్రీశ్రీ. విశాల హృదయంతో రాసిన 'జయభేరి' కవితలో సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో వాడుక భాషకు దగ్గరగా రాసి తన ధ్యేయం ఏమిటో స్పష్టంగా సూటిగా ఇందులో చెప్పారు.

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనాక్కటి ఆహుతిచ్చాను"
"నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను
నేను సైతం విశ్వవీణకు తంత్రినై మూర్చనలు పోతాను
నేను సైతం
భువన భవనపు బావుటనై పైకి లేస్తాను"

అంటూ చక్కని చిక్కని పదాల అల్లికలతో జన హృదయాలను ఉర్రుతలూగించారు.

సమాజంలోని జనాల్ని ఆలోచింప చేయాలన్నా కదిలించాలన్నా, కదిపించాలన్నా తన కవితా వేశపు పదాలను చిత్రించిన తీరు ప్రజలకు, పాఠకులకు బలాన్ని ఇచ్చింది. అందుకే శ్రీశ్రీ గారు అనాథలు, అభాగ్యులు, అశాంతుల పక్షం వాలాడు. వీరందరికి న్యాయం చేకూరలంటూ విప్లవ శంఖం పూరించక తప్పదని లోకపుటన్యాయాలను ఎదిరించేందుకు తన గొంతులో తూటాలాంటి పదాలను వదిలారు.

"కావున లోకపు టన్యాయాలూ
కాల్చే ఆకలి, కూల్చే వేదన
దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ
పరిష్కరించే, బహిష్కరించే
బాటలు తీస్తూ పాటలు వ్రాస్తూ"

అంటూ శ్రీశ్రీ నవ్య కవితా మార్గం నాది అని ప్రతిజ్ఞ చేశారు.

సమసమాజాన్ని ఆకాంక్షిస్తూ ధనికస్వామ్య వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ సామ్యవాద వ్యవస్థ ఏర్పడాలని విశ్వాసం వ్యక్తీకరించారు. శ్రీశ్రీగారి జగన్నాథ రథ చక్రాలులో సమాజ చైతన్య రథచక్రాలుగా మలచి, మంచి సహృదయభావిగా నిలిచారు.

"పతితులార
పతితులార!
భ్రష్టులార!
బాధాసర్పదష్టులార!
బ్రతుకు కాలి,
పనికిమాలి"
"స్వాతంత్ర్యం
సమభావం
సౌభ్రాత్రం
సాహార్ధం"

దగాపడ్డ తమ్ములార!
ఏడవకండేడవకండి!
వచ్చేశాయ్, విచ్చేశాయ్
జగన్నాథ
జగన్నాథ
జగన్నాథ రథచక్రాల్,
జగన్నాథ రథచక్రాల్,
రథ చక్రాల్ - అని అభ్యుదయ గళానికి
సూచికలా భావించారందరూ.

దోపిడీదారులు, దుర్మార్గులందరూ ఈ రథచక్రాల క్రింద పడి మరణిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

నవ్య కవిత సృష్టించాలన్నా! అది పాఠకుల హృదయాలను రంజింపచేసే శక్తి శ్రీశ్రీ యుగ కలానికే ఉంది. అందుకే శ్రీశ్రీని "శబ్దబ్రహ్మ" అంటారు సాహితీవేత్తలు. సాహసించి విప్లవ గీతాలతో "మరో ప్రస్థానం" కవితా సంపుటిలో "భూమ్యాకాశాలు" స్మృతి కవితలో.

"ఊగరా ఊగరా, ఊగరా! ఉరికొయ్య అందుకొని ఊగరా
ఉరికొయ్య అంటుకొని ఊగరా
నెత్తురు కాల్చిన కళ్ళే నిప్పులు చేలరేగుతాయి
స్వాతంత్ర్యపు మారుతేరు సామ్యవాదమే సత్యం!
చావులేని ఆ సత్యం జ్వలిస్తుంది అనునిత్యం" అంటూ విప్లవ గీతాలాపన చేశారు.

"కాదేది కవితకనర్హం" అని కొత్త సిద్ధాంతం ప్రతిపాదించారు. సమయ సందర్భానుసారం తన చేతిలో కవితా శిల్పం అప్పటికపుడు కవిత్వం చెప్పగల నవ్యకవి మన శ్రీశ్రీగారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి గారు
2. శ్రీశ్రీ గారి మహాప్రస్థానం.

❖❖❖

సిప్రాలి కవితలు

-డా॥. పి. నరసింహులు, తెలుగు అధ్యాపకులు, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఆదోని, కర్నూలు జిల్లా,7

తెలుగు సాహిత్య చరిత్రలో చిరంజీవులుగా నిలిచి పోయిన శ్రీ శ్రీ వేగ చుక్క మరియు ఒక విప్లవ కవి సామాన్య మానవుడి పక్షాన నిలబడి గేయాలు, కవిత్వాలు వినిసించిన ప్రజల మనిషి, తను రచించిన సిప్రాలి రచన ఒక అద్భుతం, మహాద్భుతం కలిగిన కవిత్వాలు క్రింది విధంగా ఉన్నాయి.

దేశం కోసం త్యాగం
చేశామని చెప్పి పదవి చేపడగానే
చూశారా! మన కాంగ్రెస్
చేసిన పని సిగ్గుచేటు, సిరిసిరిమువ్వా!

నిజమైన శత్రువులతో
భుజం కలిపి - ప్రజల బాధ పొడిగించే, స్వీ
యజనుల హింసించే ఫా
సిజవున్ ధోరణి వహించె, సిరిసిరిమువ్వా!

దేన్నైతే పూర్వం కా
దన్నామో, రాక్షసత్వమని యెంచామో,
దాన్నే ఆరాధిస్తే
చిన్నతనం వేరెకలది? సిరిసిరిమువ్వా!

మన కాంగ్రెసని యసెంబ్లీ
కనుపగనది యున్న స్వేచ్ఛ నవరోధించెన్,
మనసు నపుంసకమని పం
చిన దయితన్ దవిలినట్లు, సరిసిరిమువ్వా!

దేవుడి పేరిట ఏవే
వో వెధవపనుల్ పొనర్చుటున్నది కద, హిం
సావాదం గాంధీజీ
సేవకులే చేయలేదె! సిరిసిరిమువ్వా!

చీకటి బజారులో (వే
ళాకోళం కాదు) లక్షల కొలందిగ మ
స్కాకొట్టిన వాళ్లంతా
శ్రీ కాంగ్రెస్‌వాదులౌర! సిరిసిరిమువ్వా!

గౌను జనాయిస్తే దొర
సానిగ గడసాని మారజాలువే? ఖాదీ
తానులు సైతాను ధరి
స్వే నాయకుడెట్టు లవును? సిరిసిరియువ్వా!

కోట్లకొలది ప్రజలను చీ
కట్లోపల వదిలి నేటి కాంగ్రెస్ రాజ్యం
కాట్లాటల పోట్లాటల
చీట్లాటగ మారిపోయె, సిరిసిరిమువ్వా!

అసలు సమస్యలు గ్రాసం,
వసనం, వాసం! అలాంటి వాటిని చూపే
పస లేక గింజుకొని చ
చ్చి సున్నమవుతోంది ప్రభుత్వ! సిరిసిరిమువ్వా!

ఎన్నాళ్లీ దారిద్ర్యం?
ఎన్నాళ్లీ అస్వతంత్ర హీనస్థితి? ఇం
కెన్నాళ్లీ వైఫల్యం?
చెన్నగర రాజ్యమందు, సిరిసిరిమువ్వా!

కందం తిక్కనగారిది
కుందవరపు వారి ముద్దుకుర్రని దంతే,
అందరి తరమా కందపు
చిందుల కిటుకుల్ గ్రహింప సిరిసిరిమువ్వా!

భాషకొక స్థాయినిచ్చే
ప్రాసలు యతు లలంకృతులు వ్యాకృతులయ్యో
పైసాగసుపూతకైతే
చేసేదేమున్నదింక! సిరిసిరిమువ్వా!

తేనెకు సీసా, బంగరు

పళ్ళెమునకు గోడచేర్పు కావాలి సరే
మధుకనక ప్రాముఖ్యం
సీసా గోడలకు లేదు సిరిసిరిమువ్వా!

కోయకుమీ సారకాయలు
వ్రాయకుమీ నవలలని అవాకుచెవాకుల్
డాయకుమీ అరప ఫిలిం
చేయకుమీ చేబదుళ్లు సిరిసిరిమువ్వా!

ఊళ్లో తిరిగే కుక్కలు
మళ్లీ కనబడని యెడల మనకేం పోయెన్
జిల్లా కలెక్టరున క
ర్జీ ల్లిఖియించిన పనేమి సిరిసిరిమువ్వా!

జెండా ధరించి కేకల
ఖండంగా వేసివేసి ఖైదుకుపోతే
పండువలె జాజిపూవుల
చెండువలెన్ పడనె స్వేచ్ఛ సిరిసిరిమువ్వా!

సామాజిక చైతన్యం, రాజకీయ సిద్ధాంతం, సాహిత్య సంఘాల స్థాపన - శ్రీ శ్రీ కవితా జీవితంలో పెనవేసుకు పోయాయి. లిమబుక్కులలో ఇవే మనకు కనిపిస్తాయి. అక్షరాల అయుధాలే లిమబుక్కులు కవితా విలంబులు మనందరికి అందించారు శ్రీ శ్రీ. వాటిని, వాడిగా వీడిగా ప్రయోగించి సామాన్య జనాన్ని విప్లవ కార్యాచరణకు ఉద్యుక్తుల్ని చేద్దాం. తద్వారా విప్లవ సాహిత్యాన్ని సార్థకం చేద్దాం.

❖❖❖

అనంతం – శ్రీశ్రీ విదేశీయాత్రానుభవాల పరిశీలన

– డా॥. ఎం. లక్ష్మయ్య, తెలుగు ఉపన్యాసకులు, సి.ఎస్.ఎస్.ఆర్ & ఎస్.ఆర్.ఆర్.ఎం. డిగ్రీ & పి.జి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

శ్రీశ్రీ ఏప్రిల్ 30 1910 సంవత్సరంలో వెంకట రమణయ్య, అప్పలకొండ దంపతులకు విశాఖపట్నంలో జన్మించాడు. శ్రీశ్రీని తల్లిదండ్రులు శ్రీరంగం సూర్యనారాయణకు దత్తత ఇస్తారు. అందువల్ల శ్రీశ్రీ ఇంటిపేరు "శ్రీరంగం" గా మారింది. అతడు విశాఖ పట్నంలో విద్యాభ్యాన్ని కొనసాగించాడు. 1925 వ సంవత్స రంలో ఎస్.ఎస్.ఎల్సి పాసయ్యాడు. అదే సంవత్సరంలో వెంకటరమణమ్మను వివాహం చేసుకుంటాడు. 1931లో మద్రాసు విశ్వవిద్యాలయంలో డిగ్రి (బి.ఎ) పట్టానందు కుంటాడు. 1938లో ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. తర్వాత ఆకాశవాణి ఢిల్లీలోను, మిలటరీలో, ఆంధ్రవాణి పత్రికలోను వివిధ స్థాయిల్లో పని చేశాడు.

శ్రీశ్రీ 1933 నుండి 40 మధ్యకాలంలో మహా ప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి 'మహాప్రస్థానం' అనే పుస్తకంగా ప్రచురించాడు. మద్రాసులో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు రాశాడు. పిల్లలు లేకపపోవడం వల్ల 1949 లో ఒక బాలికను దత్తత తీసుకుంటాడు. 1956లో సరోజను రెండవ వివాహం చేసుకుంటాడు. ఆమెకు ముగ్గురు కూతుళ్ళు, ఒక కుమారుడు జన్మించారు. శ్రీశ్రీ ఉద్యో గాలు చేయలేకపోవడం, మొదటి వివిహంలో పిల్లలు కల్గకపోవడం, 50 సంవత్సరాల వయసులో రెండవ పెళ్ళి, పిల్లలు కల్గడం. సినిమాల్లో సంపాదించి, తాను ఒక సినిమాను సొంతంగా తీయడం వల్ల సంపాదించినదంతా పోగొట్టుకోవడం. శ్రీశ్రీ అస్థిరత వల్ల సాహితీ సంఘాల్లో వివిదాలు రావడం. ఇలా ఎన్నెన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవలసివచ్చింది.

శ్రీశ్రీ రాసిన ఆత్మకథ 'అనంతం' సాదారణ పరిస్థితుల్లో ఎవరూ ఊహించని, పాఠకులకు మింగుడుపడని విడ్డూరమైన ప్రసంగాలతో నింపాడని చెప్పవచ్చు. శ్రీశ్రీ వ్యక్తిత్వం పై ఎన్నో వ్యతిరేక ప్రభావాలు వేసినా అతని ఆకర్షకు ఇసుమంతైనా తగ్గించలేదని చెప్పవచ్చు.

శ్రీశ్రీ గురించి బూదరాజు రాధాకృష్ణ " శ్రీశ్రీతో ఏకొంత కాలమైనా పరిచయం గల వారెవరైనా అతడు వయసొచ్చిన పసివాడని, అమాయకుడైనా చురుకైన వాడని, అహంకారియైనా తలవంచుకుంటాడని, విచారణ శాలియైనా తప్పించుకు తిరుగుతాడని, ఆకర్షకుడైనా ఏడిపించగలడని అంగీకరిస్తాడు. కొన్ని అభిప్రాయాల విషయంలో అతడు జగమొండి అని చెప్పవచ్చు. సరదా పడ్డప్పుడు అతన్ని అదుపుచేయడం కష్టం. విపరీతా లోచనలో ఉన్న అతడు క్రమశిక్షణకు లొంగడు. దాపరికం లేకపోవడం, ఆలోచనలోనూ, స్వభావంలోనూ చాటు మరుగు లేకపోవడం విస్పష్టం. మాటల్లో మాత్రమే అతడు భయంకరుడు. మరో విధంగా పోరాడలేడు. వాస్తవ జీవితంలో అతడు సమస్త సాంప్రదాయిక పద్ధతులకు కట్టుబడ్డాడు. కాని తన విప్లవ భావాలతో వాటినెప్పుడూ వ్యతిరేకిస్తుండేవాడని" వ్యాఖ్యానించాడు.

"కృష్ణ శాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ " అని చలం యోగ్యతా పత్రంలో తెలియజేశాడు.

"కొవ్వొత్తిని రెండువైపులా ముట్టించాను అది శ్రీశ్రీలా వెలిగిందని" పురిపండా అప్పలస్వామి అన్నాడు.

"తెలుగు కవిత్వ చరిత్రలో తిరుగులేని మలుపు మహాప్రస్థానం"- అని డా॥ పాపినేని శివశంకర్ అన్నాడు.

ఆ రోజుల్లో విశాఖపట్నంలోని ధనిక కుటుంబాల్లో శ్రీశ్రీ కుటుంబం ఒకటి. తండ్రి ఇంగ్లాండులో ఐ.సి.ఎస్. చదివిస్తానంటాడు. అప్పుడు శ్రీశ్రీకి ఇంగ్లాండు వెళ్ళడ అసాధ్యమనిపించలేదు. 15 రోజులు స్టీమరులో ప్రయాణం చెయ్యడం విసుగ్గానే ఉంటుంది. తప్పదు అనుకునేవాడు. కాని శ్రీశ్రీ బి.ఎ. పాసయ్యేనాటికి వారి ఆర్థికపరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. విదేశీ ప్రయాణం అసంభవం ఆ విషయం అనుకోవడం కూడా అనవసరం. స్వదేశంలోనే నిరుద్యోగిగాను, రకరకాల చిన్న చిన్న ఉద్యోగాల్లోను ఎన్నో ఊళ్ళు తిరిగినట్లు తెలుస్తుంది. అప్పుడు అతనికి విశాఖపట్టణం తప్ప మిగిలిన ఊళ్ళన్ని విదేశీయమే అనిపించేవి.

శ్రీశ్రీకి 1953 లో చైనా వెళ్ళే అవకాశం వచ్చింది. అప్పుడు శ్రీశ్రీ ఉమ్మడి మద్రాసురాష్ట్రంలో లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు. అప్పటి ముఖ్యమంత్రి రాజగోపాలాచారి. పాస్ పోర్టు కోసం అతన్ని కలుస్తాడు. రాజగోపాలాచారి శ్రీశ్రీని అప్యాయంగా పలుకరిస్తాడు. పాస్‌పోర్టును ఇవ్వమని సిఫారసు చేస్తానంటాడు. కాని తన కింది అధికారితో పాస్‌పోర్టు ఇవ్వరాదని చెప్పిన విషయాన్ని శ్రీశ్రీ తెలుసుకుంటాడు. పాస్‌పోర్ట్ లేని కారణంతో చైనా ప్రయాణం ఆగిపోతుంది. శ్రీశ్రీ మూడు విదేశీ యాత్రలకు సంబందించిన విషయాలను గురించి తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

1954 సంవత్సరంలో స్టాక్‌హొంలో జరగబోయే ప్రంచశాంతి సమితి సమావేశానికి ఆహ్వానం వచ్చింది. అప్పుడు కూడా శ్రీశ్రీకి పాస్‌పోర్టు సమస్య వచ్చింది. అప్పుడే కొత్తగా ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పడింది. కర్నూల్‌లో గూడారాల పరిపాలన సాగుతోంది శ్రీశ్రీ విశాఖపట్టణం వెళ్ళి అక్కడ కలెక్టరు ద్వారా ఆంధ్రప్రభుత్వానికి అర్జి పెట్టుకుంటాడు. కలెక్టరు ఇంగ్లీష్‌వాడు. సానుభూతితో సిఫారసు చేశాడు. దాన్ని తీసుకుని కర్నూల్‌కు వెళ్ళాడు. కర్నూలులో క్రింది స్థాయి ఉద్యోగులు కావాలని శ్రీశ్రీ ఫైలును జాప్యం చేస్తున్నట్లు తెలుసుకుంటాడు. అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డిని కలసి విషయం చెబుతాడు. ముఖ్యమంత్రి చొరవతో పాస్‌పోర్టు త్వరగా లభిస్తుంది. 1954 వ సంవత్సరం నవంబరు 13వ తేదిన మద్రాసు నుండి బొంబాయి వెళ్ళి అక్కడ భారతీయ ప్రతినిధి వర్గంలోని ఇతర సభ్యులతో కలసి బొంబాయిలోని శాంతాక్రాజ్ విమానశ్రయం నుండి ఎయిరిండియా విమానంలో వెలతాడు. అర్ధరాత్రి రెండు, రెండున్నరకు కైరో చేరుకుంటాడు. చలికాలం కావడంతో అక్కడ చలి ఎక్కువ. శ్రీశ్రీ ఇంటిదగ్గర నుండే ఉన్ని దుస్తులు తీసుకెలుతాడు. కైరో విమానశ్రయంలో టీ త్రాగుతారు. తర్వాత రోజు ఉదయం రోమ్ చేరుకుంటారు. అక్కడ ఒక గంటసేపు సరదాగా తిరుగుతారు. సాయంత్రానికి లండన్ చేరుకుంటారు. రెండు రోజులు లండన్‌లో ఉండి స్టాక్‌హొంకు వెళతారు. స్టాక్‌హొం ఉత్తర ధృవానికి దగ్గరగా ఉండడం వల్ల అక్కడ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. భారతీయ ప్రతినిధి వర్గంలో పండిట్ సుందర్‌లాల్ వంటి ప్రముఖులున్నప్పటికి విలియమ్స్ అనే క్రిస్టియన్ ఫాదర్‌ను నాయకునిగా ఎన్నుకుంటారు.

స్టాక్‌హొంలో దేశదేశాల నుంచి ప్రతినిధులు వచ్చారు. అక్కడ శ్రీశ్రీని ఎక్కువగా ఆకర్షించినది ఫ్లాబొనిరుడా. అతనికి ఇంగ్లీష్ రాదు శ్రీశ్రీకి స్పానిష్ రాదు. సంజ్ఞలతోనే శ్రీశ్రీ ఆటోగ్రాఫ్ పుస్తకంలో అతని సంతకం తీసుకున్నట్లు తెలుస్తుంది. ప్రపంచ కవులలో అతడు సుప్రసిద్ధుడు. అప్పటికి అతనికి ఇంకా నోబెల్ పురస్కారం రాలేదు. ఆఖరి రోజున మద్యమాంసాలతో పెద్ద విందు జరిగింది. స్టాక్‌హొం సభలు ముగిశాక శ్రీశ్రీ బృందం ఇండియాకు బయలుదేరాలనుకుంటారు. కాని భారతీయ ప్రతినిధి వర్గాన్ని సోవియట్ శాంతి సంఘంవారు రష్యాకు ఆహ్వానిస్తారు. వారి ఆహ్వానం మేరకు శ్రీశ్రీ బృందం మాస్కో నగరానికి వెలుతారు. అక్కడ వారికి రాజ మర్యాదలతో అందరికి అతిథి సత్కారాలు జరిగాయి. లండన్ వీదుల్లో కనిపించే చెత్త , చెదారం మాస్కో వీదుల్లో

కనిపించదు. మొదటిరోజు క్రెమ్లిన్ భవనంలోని లెనిన్ సమాధిని సందర్శించి, అక్కడ సమాధిపై పూల మాలలను వేస్తారు. తర్వాత దాని పక్కనే ఉన్న స్టాలిన్ సమాధిని కూడా దర్శిస్తారు.

ప్రతిరోజు రకరకాల సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. వాటిలో రష్యన్ సర్కస్, శ్వాన్ లేక్ అనేవి ముఖ్యంగా చెప్పుకోదగ్గవి.నృత్య నాటికలలోని పాటల రికార్డులు కొన్ని శ్రీశ్రీ బహుమతిగా పొందాడు. సర్కస్‌లో సింహాల చేత చేయించిన విన్యాసాలు అమోఘంగా ఉన్నాయి. తర్వాత లెనిన్‌గ్రాడ్‌లో మూడు రోజుల కన్నా ఎక్కువ ఉండలేకపోయారు. అక్కడి లెనిన్ మ్యూజియం, వింటర్ ప్యాలెస్ ప్రత్యేక ఆకర్షణలని చెప్పవచ్చు. లెనిన్ పేరుకు అన్ని విధాలుగా గౌరవం తెచ్చిన మహానగరం లెనిన్‌గ్రాడ్. పిప్లవానికి పూర్వం పెట్రోగ్రాడ్ అని, సెయింట్ పీగర్స్‌బర్గ్ అని పిలవబడే ఆ నగరం రష్యా అంతటికి ముఖ్య పట్టణమని చెప్పవచ్చు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్ అనే సంస్థ ప్రత్యేకంగా శ్రీశ్రీని మాత్రమే ఆహ్వానించినట్లు తెలుస్తుంది. అక్కడ తెలుగు భాషమీద, సాహిత్యం మీద ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో శ్రీశ్రీ చెబుతున్నదంతా పదిమంది పండితులు పుస్తకాలలో రాసుకుంటున్నారు. రెండు, మూడు గంటలసేపు ఇంగ్లీష్‌లో ఎక్కడా మాట్లాడలేదు. ఇదే మొదటిది. అయితే సాహిత్య విషయం శ్రీశ్రీకి ఆత్మీయమైనది కాబట్టి ఎక్కువ సేపు మాట్లాడాడని చెప్పవచ్చు. ఆ సభలోనే శ్రీశ్రీ దృష్టిలో తెలుగు భాషకు " కవిత్రయం తిక్కన, వేమన, గురజాడ"లని చెప్పడం జరిగింది. తెలుగు భారతదేశంకు జాతీయ భాష కాగల అర్హతలున్నాయని జె.బి.ఎస్. హాల్డేవ్ చెప్పినమాటను శ్రీశ్రీ బలపరిచాడు. సంస్కృత పదాలను జీర్ణించుకున్న కారణంచేత అటు ఉత్తరాదికి, ద్రావిడభాషా కుటుంబంలో ఒకటి కావడంవల్ల ఇటు దక్షిణాదివారికి తెలుగు నేర్చుకోవడం చాలా సులభం అని హాల్డేవ్ పండితుని అభిప్రాయం. ఇప్పటికీ తెలుగు మన జాతీయ భాష కావాలనేది శ్రీశ్రీ అభిమతం కూడా. దేశంలో హిందీ భాషదే మొదటి స్థానమైనప్పటికి ఆభాష మాట్లాడేవారి సంఖ్య నలభై శాతానికి మించదు. అంతేకాక హింది ఒక చిన్న చెట్టుకు పరిమితం. రెండవ భాష అయిన తెలుగు సుమారు ఆరుకోట్ల మందికిపైగా ఆంధ్రులకు మాతృభాష. పైగా తెలుగు వారు దేశమంతటా అన్ని రాష్ట్రాలలోను వ్యాపించి ఉన్నారు. ముత్యాల్లాంటి తెలుగక్షరాలంటూ లిపి మీద లేనిపోని సెంటిమెంట్లు పెట్టుకోవడం మాని రోమన్ లిపిలో (a,aa,i,ee ఈ విధంగా) తెలుగును నేర్పితే అప్పుడు మన దేశం ఆధునిక యుగంలోకి ప్రవేశిస్తుం దనేది శ్రీశ్రీ అభిమతం. ప్రపంచ తెలుగు మహాసభలవారు ఈ విషయాన్ని ఆలోచించడం మంచిదని అతని మనోభావాన్ని వ్యక్తపరిచాడు.

రెండవ పర్యటన పూర్తిగా శ్రీశ్రీ సొంత ఖర్చుతో సాగిందని చెప్పవచ్చు. అందుకుగాను ఒక మార్వాడి దగ్గర అతని కారు 6000రూపాయలకు తాకట్టు పెట్టాడు. ఈ సారి కూడా ప్రపంచ శాంతి సంఘ ప్రతినిధిగానే వెళ్ళాడు. స్టాక్‌హోంలో వారం రోజులుండి అక్కడ నుండి మాస్కోకు తిరిగి రావాలని బయల్దేరినప్పుడనుకున్నాడు. కానీ శాంతి సంఘ కార్యాలయంలోకి అడుగు పెట్టగానే మద్రాసు నుండి సినిమా ప్రొడ్యూసర్లు ఫోన్ చేస్తారు. వెంటనే రావాలని శ్రీశ్రీ లేకపోతే అన్ని పనులూ ఆగి పోతాయని చెబుతారు. స్టాక్‌హోం వెళ్ళింది మొదలు తిరుగు ప్రయాణానికి సణ్ణాహాలు చేసుకోవడంలోనే అతని కాలం గడిచిపోయిందని చెప్పవచ్చు. ఆ రోజుల్లో శ్రీశ్రీ కూడా ఒక డబ్బింగ్ సినిమా చేస్తున్నాడు. అయితే పాటలు, మాటలు రాయడం కరకే అతని వంతు , పూర్తి బాధ్యతంతా రెండవ భార్య సరోజ చూసుకునేది. ఆ సినిమాలో నష్టం రావడం వల్ల శ్రీశ్రీ ఆర్థికంగా బల హీనుడైనాడని చెప్పవచ్చు. మార్వాడీ దగ్గర తాకట్టుపెట్టిన కారును కూడా తిరిగి పొందలేకపోయాడు.

1966 సంవత్సరంలో సోవియట్ లాండ్ బహుమతి నిమిత్తం శుద్ధానంద భారతి అనే స్వామీజి తమిళంలో "సోవియట్ గీతాంజలి" అనే కావ్యాన్ని రాత్రికి రాత్రి పూర్తి చేసి, తన సొంత ప్రెస్సులో అచ్చువేయించి అవార్డు కమిటకీ పంపించాడు. హిందిలో కిషన్ చందర్‌కూ తమిళంలో 'భారతి'కి బహుమతునివ్వాలన్న నిర్ణయం నిమిషాలమీద జరిగిపోయింది. శ్రీశ్రీ "ఖడ్గసృష్టి" పరిశీలనకు వచ్చినప్పుడు ఒకే సంవత్సరం రెండు దక్షిణాది భాషలకు బహుమతి ఇవ్వవలసిందేనా అన్న మీమాంస వచ్చింది. ఇవ్వకూడదనే అంక్ష ఏదీ లేక పోయినా తర్జనభర్జనలు మాత్రం ఘాటుగానే సాగిపోయా యని చెప్పవచ్చు. చివరకు ఖడ్గసృష్టి కూడా బహుమతికి ఎంపికవుతుంది.

మూడవ పర్యటన సోవియెట్ లాండ్ బహుమతి నిమిత్తం 1967 మే 10 వ తేదిన ఢిల్లీ పాలం విమానా శ్రయం నుంచి సోవియట్ టర్బోజెట్‌లో మాస్కోకు వెలుతాడు. 1954లో చూసిన రష్యాకూ,1967లో చూసినప్పుడు అక్కడ చాలా తేడా కనిపించింది. శ్రీశ్రీ మొదటిసారి పర్యటనలో రష్యన్ ప్రజల ముఖాలమీద ఏదో గంభీరమైన మౌనముద్రను గుర్తించాడు. మరో ప్రంచయుద్ధ ప్రమాదం ఆనాటి అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులను నీడలా వెన్నాడుతుండడమే ఇందుకు కారణమంటాడు. 1967లో మాత్రం అలాకాదు. ప్రమాదం తొలగిపోయిందనడానికి వీల్లేదుకాని, నిశ్చయంగా దూరమైపోయింది. ఈసారి ప్రజల ముఖాలన్నీ కలకల లాడుతున్నాయి. సొంతమోటారు కారులున్న కుటుంబాల సంఖ్య పెరిగింది. పనిగంటలు తగ్గి తీరుబాటు పెరిగిం దని చెప్పవచ్చు. ప్రజల జీవితాలలో భౌతికసుఖాలు పెద్దమార్పు తీసుకొచ్చాయని భావించవచ్చు. అందుకే శ్రీశ్రీ రష్యన్లది కడుపునిండిన బేరం, చైనీయులది కడుపు మండిన బేరమని చెప్తాడు. 1967లో ప్రపంచపు అగ్ర రాజ్యాలలో ఒకటిగా రష్యాస్థానం స్థిరపడిందని చెప్పవచ్చు.

ఇప్పుడు కూడా శ్రీశ్రీ కి కెమెరా బహూకరించడం జరిగింది. ఆ కెమెరాను శ్రీశ్రీ భార్య సరోజ ఎవరికో దానం చేసేసింది. ఎప్పుడడిగినా బాడుగకు ఇచ్చానంటుంది. మొదటి కెమెరా దుండగులు పాడుచేసినందుకు చాలా విచారించాడు. కాని రెండో కెమెరా ఎప్పుడూ ఏదో ఇబ్బంది పెడుతూండటంవల్ల పోతేపోయిందిలే అను కుంటాడు. కాని సరోజ మాత్రం తెచ్చేతీరుతానని చెబుతుంది. తెచ్చినా ఏం ప్రయోజనం? అది పాడయి పోయింది. దాన్ని బాగు చేయించాలంటే మనదేశంలో పరికరాలు పనికిరావు.

సోవియెట్ పర్యటన పూర్తికావచ్చింది. మాస్కో నుంచి తాష్కెంట్ వెళ్ళారు. శ్రీశ్రీ బృందంలో గాడ్గిల్ అని ఒకాయన ఉన్నాడు. అతనికి ఏ పద్దుకింద సోవియెట్ లాండ్ బహుమతివచ్చిందో తెలియదుగాని గాంధేయ ఆర్థిక శాస్త్రవేత్త అని తెలుసు. ఆ రోజుల్లో అమెరికన్ టైమ్ పత్రిక సోవియెట్ ఆర్థిక వ్యవస్థలో పగుళ్ళు పొడ చూపుతున్నాయని ఒక పెద్దవ్యాసం రాసింది. దాన్ని ఆధారం చేసుకుని గాడ్గిల్ చాలాసార్లు రష్యన్ వ్యవస్థను విమర్శించాడు. రష్యన్ మిత్రుల పక్కన కిషన్ చందర్, శ్రీశ్రీ రష్యన్ విధానాన్ని సమర్థించేవాళ్ళు. పెట్టుబడిదారీ దేశాల పత్రికల రాతలమీద మన ఆలోచనలు ఆధార పడకూడదనే వారి వాదం. చైనాలో సాంస్కృతిక విప్లవం విఫలమయిపోయిందని ఇప్పటికీ ఆ పత్రికలు రాస్తూనే ఉన్నాయి. యాభై సంవత్సరాల వ్యవధిలో సోవియెట్ యూనియన్ ప్రపంచంలోని అగ్రరాజ్యాలలో ఒకటి కావడానికి అక్కడి పంచవర్ష ప్రణాళికలు సఫలమై నాయనడానికి గొప్ప నిదర్శనం అని చెప్పవచ్చు.

చివరిరోజున మాస్కోలో నోవోస్తి అనే వార్తా సంస్థ శ్రీశ్రీ బృందానికి విందును ఏర్పాటు చేసింది. ఆ కార్య క్రమంలో ఎవరో ఒక వ్యక్తి శ్రీశ్రీ ని చక్కని మాటలతో పొగడతాడు. ఆ మాటలు శ్రీశ్రీ కి సోవియెట్ యూని యన్‌లో గెలిచిన బహుమతులన్నిటి కన్నా ఎక్కువ ఆనందాన్ని ఇచ్చిందని తెలిపాడు. మూడవ యాత్రకు

ఇండియా గవర్నమెంట్ 75 రూపాయలను మాత్రమే తీసుకెళ్ళాలని నిబంధనను పెట్టింది. అందువల్ల శ్రీశ్రీ ఖర్చులను చూసుకుని వాడుకునేవాడని తెలుసుకోవచ్చు. ఎందుకంటే ఒక సారి విస్కీ కొనడానికి దగ్గర 20 రూపాయలు డబ్బులు లేక గాడ్గిల్ ను అడుగుతాడు. అతడు మద్యం తప్ప మరేది కొనడానికైనా నువ్వడిగిన 20 ఇస్తానంటాడు. దాన్ని తిరిగివ్వవలసిన అవసరం లేదని చెబుతాడు. శ్రీశ్రీ ఆ డబ్బు వద్దనుకుంటాడు. చివరకు 1967 మే 25 వ తేదీన పాలం విమానాశ్రయంలో దిగడంతో విదేశీపర్యటన ముగుస్తుందని చెప్పవచ్చు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ కవిత సమాజపు భవిత - విశ్లేషణ

- డా॥. జొడ సీతాలతి రెడ్డి, సహాయాకాచార్యులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం,
నూజివీడు ప్రాంగణం, కృష్ణా జిల్లా,

ఒకొక కవికి ఒక్కొక దిశా నిర్దేశం ఉంటుంది. వాళ్ళు చూసిన, చూడబోయే దార్శనికత వాళ్ళను మిగతా వాళ్ళ నుంచి వేరుచేస్తుంది. ప్రజాకవినీ, మహాకవినీ చేస్తుంది. ప్రపంచ జ్ఞానం, చెప్పిన అంశాలలో స్పష్టత, ప్రజానాడి, చెప్పే వేడి లాంటి చాలా అంశాలు కవిత్వంలో మరింత నగిషీలు చెప్పిన శిల్పంలా మెరుస్తూ ఉంటాయి.

దీనికి సమకాలీన పరిస్థితులు, దేశపు సమస్యలు లాంటివి తీసుకోవడం ఆధునిక కాలానికి కవితా వస్తువులు. పురాణ ప్రతీకలు, కొత్త పోకడలు మరింత వావ్వా అనిపించేలా అలంకారాలు అలంకరించడం ఆ కవి ప్రతిభకు పట్టాభిషేకం. 1930ల్లో పీడిత ప్రజల తిరుగు బాట్లు ఇండియాలో, క్యూబాలో, చిలీలో, స్పెయిన్లో జరిగాయి. కార్మికుల సమ్మెలూ హక్కులకోసం, స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటాలూ ప్రపంచ చరిత్రలో 20వ శతాబ్దిలో ఎక్కువ. ముందున్న ఫ్యూడల్ వ్యవస్థమీద బూర్జువాల తిరుగుబాటే ఇది. పీడితులే శ్రీశ్రీకి కెరటాలుగా పొంగి కనిపించారు. వర్గ రహిత సమాజం సాధ్యమయ్యే స్వప్నమే రష్యాగా భావించారు. సోవియట్ రష్యాకూ నాజీలకూ జరిగిన యుద్ధం ప్రపంచ చరిత్రలో పురోగమన శీలం కలిగిందో శ్రీశ్రీ ఆ యుద్ధపు తొలిదశలోనే గుర్తించడమే శ్రీశ్రీ కవితా చైతన్యం.

సమకాలిక సమాజ దృశ్యాలు :

సమాజ సంస్కరణ నేపథ్యంగా సాగిన పురోగమనం గురజాడనుంచి శ్రీశ్రీ ఒక కవితా ప్రస్థానం. గురజాడ కవిత్వంలో ఫ్యూడల్ సమాజ వాస్తవికత, బూర్జువా సమాజపు ఊహలు ప్రతిబింబాలు, శ్రీశ్రీ కవితలో బూర్జువా సమాజపు వాస్తవిక, సామ్యవాద సమాజపు ఊహలు ప్రతిఫలిస్తాయి.

నిరుద్యోగానికి యవకుల బలి,
బిచ్చగాళ్లను ఎవరూ పట్టించుకోకపోవడం,
సామాజిక న్యాయం లేకపోవడం ,
కొందరు ఉన్మాదులుగా మారిపోవడ0,
ఆకలి తీరని యువతులు పడుపు వృత్తికి దిగడం,
యుద్ధాలలో యువకులు చనిపోవడం,
నిరాశవల్ల త్రాగుడుకు అలవాటు పడడం,
నేరం చేయని వాళ్ళను కూడా ఉరితీయడం,
కూలీలు సమ్మె కట్టడం,
కర్షకులు కార్మికులూ జీవన భారం మోయలేక దుఃఖించడం
ఆత్మహత్యలకు ప్రయత్నించడం,
యంత్ర శాలల్లో ప్రమాదాలకు కొందరు లోనుకావడం,
దిక్కు లేని శవాలుగా మరణాన్ని పొందటం,

ఒకవ్యక్తిని మరో వ్యక్తి, ఒక జాతిని మరోజాతి పీడిస్తూ ఉండడం ఎలా ఎన్నో...

ఈ లోపాలకు పరిష్కారం సంస్కరణం కాదు. హింస దీనికి ప్రధాన ఆయుధం. తన లోపాల్ని అంగీకరించదు. ఇవన్నీ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతికాది రంగాలన్నిటితోనూ ఎంతోకొంత సంబంధాన్ని కలిగి ఉండి. మొత్తంగా వ్యవస్థ మారిపోయేలా మనశ్చైతన్యం కోసం తన కవితా వస్తువుల్ని విస్తరించుకున్నాడు. వర్తమాన దురవస్థా సూచికాలైన కవితా వస్తువుల్ని స్వీకరించడంలో ఈ సమాజ వాస్తవికత నిండుగా కనిపిస్తుంది.

వర్గ దృష్టి, పీడక వర్గ ద్వేషం :

సాహసి, బాటసారి, భిక్షువర్షీయసి, ఉన్మాది, చేదుపాట, సంధ్యా సమస్యలు, ఆకాశ దీపం, అవతలి

గట్టు, పరాజితులు, ఆఁ, నీడలు, అద్వైతం, వాడు, వ్యత్యాసం, శైశవగీతి, మిథ్యావాది అనే 17 ఖండికల్లో సమాజాన్ని వర్గ దృష్టితోనూ, పీడక వర్గ ద్వేషంతోనూ విప్లవ ఆవేశంతోనూ చిత్రించాడు.

ఉదా : సాహసి కవితలో చూస్తే పారిశ్రామిక యుగ సమయం. శ్రీశ్రీకి 'లోహవిహంగాలు' ఆకర్షించాయి. కవితాదర్శనంలో ఎగిరే లోహశ్యేనం ఒకటి. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా విమాన బాహువులు విసరడాన్ని శ్రీశ్రీ సమర్థించాడు. నేడు కూడా ఉక్రెయిన్ మీద రష్యా చేస్తున్న సైనిక చర్యకు ప్రధానమైన ఆయుధంగా వాడుతున్నది లోహవిహంగాలే. ఎగిరిన ఇనుప డేగగా విమానాన్ని ఉత్ప్రేక్షించారు. అది ద్రోహాలను తూలగొట్టి, శాంతిని తెస్తుందని భావన.

చిర దీక్షా తపస్సమీక్షణలో నిశ్చలసమాధిలో సర్గద్వారపు తోరణమై వ్రేలిన మస్తిష్కమం శ్రీశ్రీది. ఈ మస్తిష్కంలోనే అతనికి ఘోషలు, భాషలు, దృశ్యాలెన్నో తోచాయి. కవిత్వానికి ఆలోచననూ దృక్పథాన్ని ప్రధానంగా భావించిన శ్రీశ్రీ, మస్తిష్కాన్ని కులాయంగా భావించడం. అందులో నివసించే భావాలను లోహవిహంగాలుగా భావించడంబీ వాటిని ఎగిరించ బూనుకోవడం అతి వేలమైన అతివాదానికి నిదర్శనాలే.

సామ్యవాదాన్ని కోరే అతివాది పీడకవర్గాన్ని ద్వేషించక మానదు. ఈ ద్వేషాన్ని తిరస్కరించే మితవాది సుప్త భుజంగాలను కదిలించ వద్దంటాడు. ఈ హితబోధను అనుకరించి వెక్కిరించడమే అతివాది చేసేపని. మనోవల్మీకంలో నిద్రించే భుజంగాలను కదిలించ మంటాడు. అతివాది, భుజంగాలకు కదలడమే సహజ చైతన్యం. కానీ కుబుసంతో ఉన్న భుజంగాలు వల్మీకంలో నిద్రిస్తూ ఉంటాయి. వాటిని కదిలించడం అపాయ0. ఈ భుజంగాలు మనోవల్మీకంలోనివి కావడం వల్ల వాటిని కదిలించడమే కర్తవ్యంగా అతివాది భావిస్తాడు. ఇది వైవిధ్య భరిత సన్నివేశాల సమాహారం. అంతరంగ ఆలోచన సరాలు. పీడక వర్గ ద్వేషం.

మనో వాస్తవికత, విశ్లేషణా దృక్పథం :

పీడిత మానవుడి మానసిక వేదన మరో అంశం. ఇది బయటకు కనిపించని బలహీనత. దేనికొరకు, కేక, ఒక రాత్రి, ఒక క్షణంలో అనే నాలుగు కవితలో మనో వాస్తవికత, మనో విశ్లేషణ ద్వారా వ్యధను వ్యక్తపరిచాడు.

ఉదా : ఒకరాత్రి కవితలో - పౌర్ణమి వెళ్ళిపోయిన తర్వాత అయినోరోజున ఆకాశంవైపు చూసిన ఒక రాత్రి అది,

గగనమంతానిండి పొగలాగు క్రమ్మి ఉందట ఆ రోజు తన భయానికి కారణం ఆ వెన్నెల! వెన్నెలకు పోలికగా పొగ ఎప్పుడైతే చెప్పాడో, ఆకాశానికి పోలిక శ్మశానంగా అప్పుడే సూచిస్తున్నాడు శ్రీశ్రీ. పొగద్వారా శ్మశానాన్నీ, శ్మశానం ద్వారా శవదహనాన్నీ, శవదహనం ద్వారా మృత్యువునీ జ్ఞాపకం చేస్తున్నాడు. శ్రీశ్రీ 1930లో 63 రోజులు టైఫాయిడ్ జ్వరంతో చివరకు మృత్యువును గెలిచి బ్రతికాడు. కానీ బ్రతికిన తనకు బ్రతుకు తెరువు కనిపించడం లేదు. ఇదే భయానికి కారణం.

'బహుళపంచమిజ్యోత్స్న భయపెట్టు నన్ను' అంటాడు. బహుళ పంచమి తన జీవితంలోని నిరుద్యోగదశ. నిరుద్యోగానికి కారణం సమాజవ్యవస్థ అతని భయానికి తగినట్లే ఆకాశం ఎడారిగాను, వెన్నెల ఇసుక తుఫానుగాను చెప్పడం. ఒంటరితనానికి సూచికలు.

ఎడారిలో ఇసుక తుఫాను రేగిన దృశ్యం బీభత్స రసాస్పదం. ఆకాశపు టెకారి శ్రీశ్రీ హృదయానికి ప్రతీక. 'ఈరేయి' అనేది తాను ఆ విషాదాన్ని అనుభవించిన రాత్రికే కాదు, కఠోరమైన సమాజ వాస్తవికతకు సంకేతం.

నిజానికి ఈ మానసిక కల్లోలంగా శ్రీశ్రీ కూర్చున్న చోటు సాగరతీరం! హొరెత్తడం సముద్రానికి సహజమేకాని, 'నోరెత్తి హొరెత్తడం మాత్రం ఆచేతనానికి మానవత్వం ఆరోపించడం. ఇక్కడ సముద్రదుఃఖంలో శ్రీశ్రీ దుఃఖమే ధ్వనిస్తుంది. అంతేకాదు, సమాజంలోని అన్యాయాలను గురించి సాగరుడంతటివాడు నోరెత్తి, హొరెత్తి

నొగులుతూ ఉన్నా ఆ సమాజం మాత్రం వినిపించుకునే స్థితిలో లేదు.

సమకాలీన సమాజ పాలకుల ప్రభావం :

కవిత్వాన్ని నిర్దేశించడం ద్వారా కవితా వస్తువును ఆలోచింపజేయడం ద్వారా కవులను పాఠకులను చైతన్యపరచడం శ్రీశ్రీ లో కొత్తకోణం. కవితా వస్తువు, సామగ్రి, సంవిధానం, ప్రయోజనం, దృక్పథం, పాఠక వర్గం మొదలైన వాటికి విశ్లేషించేలా ఋక్కులు, కవితా ఓ కవితా, నవకవిత, ప్రతిజ్ఞ, కళారవి, స్వీన్ బర్న్ కవికి, గంటలు అనే ఖండికలు దీన్ని విశ్లేషిస్తాయి.

ఉదా : ఋక్కులు కవితను చూస్తే- రొట్టెముక్కా, అరటితొక్కా, బల్లచెక్కా కవివేపే చూస్తూ ఉంటాయనీ తమలోతు కనుక్కోమంటాయని చెప్పడంతో అచేతనమైన వస్తువులకు చేతనధర్మాన్ని ఆరోపించడం జరిగింది.

రొట్టెముక్క చూస్తుంది - మాటాడుతుంది శ్రీశ్రీ సృజనలో. రొట్టెముక్కకు లోతు దాని చరిత్రకు సంకేతం. అది ఎలా తయారైంది? చేసిన శ్రామికుడి ఉత్పత్తి సాధనాలు? అవి ఎవరిదగ్గర ఉన్నాయి? అది దొరకక ఎంతమంది తల్లడిల్లుతున్నారు? లాంటివి అన్నీ లోతులే. అరటితొక్క లోతు ఆ పండ్లపండించిన కర్షకుడిదాకా తీసుకుపోతుంది. బల్ల చెక్క లోతు దాన్ని కోసిన కార్మికుడి జీవితంవైపు చూపిస్తుంది.

వీటిపై దృష్టి పెట్టిన నాయకుడు ఎవరు? అనే ప్రశ్నను చెప్తాయి. శ్రమశక్తిని గుర్తించవలసిన వైనాన్ని సూచిస్తాయి. పాలకులు పాలితులు పడుతున్న వ్యవస్థలోని అవస్థలను గుర్తించాలి. అప్పుడే నిజమైన సేవానాయకుడు అవుతాడు. అలాంటి సమాజాన్ని కావాలనే కవి ఆకాంక్ష కని పిస్తుందిక్కడ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీకాకుళ ఉద్యమ స్ఫూర్తిగీతం – 'మరో ప్రస్థానం'

– డా॥. దొర్లపూడి శివరామకృష్ణ, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతపల్లి,
నూజివీడు ప్రాంగణం, కృష్ణా జిల్లా,

''మాంచాలను కొలుస్తారు, మల్లమ్మను తలుస్తారు
ఝాన్సీలక్ష్మీబాయికీ భాష్పధార విడుస్తారు
సరోజనీదేవి ఫోటో పటం కట్టి పొగుడుతారు
పంచాద్రి నిర్మలంటే భయంపట్టి వణుకుతారు
తెల్లవాడు నిన్నునాడు భగత్సింగు అన్నాడు
నల్లవాడు నువ్వు నేడు నక్సలైట్ అన్నాడు''.

సదృశ్య ఆశయాలతో, సమానమైన ఆకాంక్షలతో, నిర్ధిష్ట లక్ష్యాలతో, ఏకోన్ముఖమైన ధృక్పథంతో, సైద్ధాంతిక పునాదితో సాగే కార్యచరణ ప్రధానమైన సంఘటిత ప్రయత్నం ఉద్యమం. నిర్ధిష్ట లక్ష్యాలను నిర్దేశిస్తూ సైద్ధాంతిక అవగాహనను అందిస్తూ వ్యవస్థ స్వరూప స్వభావాలను విశ్లేషిస్తూ, పరిస్థితులను మార్చటానికి కావలసిన ధృక్పధాన్ని వివరిస్తూ సంఘటితం కావలసిన అవసరాన్ని ఉద్బోధిస్తూ ఆశయాలను, ఆకాంక్షలను ప్రతిఫలిస్తూ, తదనుగుణమైన కార్యచరణను ప్రభోధిస్తూ ప్రజలకు సన్నిహితంగా ఉండే రూపంలో, భాషలో వెలువడే సాహిత్యమే ఉద్యమ సాహిత్యం. 1940 మందసా ప్రాంతంలో రైతలు ప్రతిఘటన సందర్భంగా ఆత్మత్యాగం చేసిన గున్నమ్మను గురించి దాసరుల పాటలు, గంగిరెడ్లు పాటలతో శ్రీకాకుళం పోరాట సాహిత్యం ప్రారంభమవుతుంది. 1967 ప్రాంతంలో పోరాటం ఉద్యమరూపం తీసుకుంటున్న అభివృద్ధి దశలో సుబ్బారావు పాణిగ్రాహి రచనలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

శ్రీశ్రీ 'మరో ప్రస్థానం'లో శ్రీకాకుళం గిరిజన ఉద్యమ సారథులైన కొందరిని ప్రస్తావించారు. వారిని గురించిన పోరాట స్ఫూర్తిని అక్షరాల్లో మండించారు. ''సాహిత్యం లోనూ ముఖ్యంగా కవిత్వంలోనూ వస్తున్న మార్పులను గమనిస్తూనే ఉన్నాను. వాటికి నేను అనుక్షణము స్పందిస్తూనేవున్నాను'' అనే శ్రీశ్రీ శ్రీకాకుళం ఉద్యమ సమయంలో 'మరో ప్రస్థానం' నందు కొన్ని గీతాలు 'ఉద్యమ వ్యక్తిత్వాన్ని' ప్రతిఫలిస్తాయి. కారణం ఈ పుస్తకానికి 'విరసం'కి గల అవినావాసంబంధం. 'విరసం'కి సమాజం పట్ల బాధ్యత ఉందంటారు. చలసాని ప్రసాద్. శ్రీశ్రీకి నిరంతరం సాహిత్య ఉద్యమంలోనూ, సంఘాలతోనూ సజీవ సంబంధాలు ఉండటం చేతనే వాటితో మమేక మయీ 'మరో ప్రస్థానం'లో శ్రీకాకుళం ఉద్యమనేతల స్ఫూర్తిని అక్షరబద్ధం చేయగలిగారు. మరో ముఖ్య విషయమేమిటంటే భాష, యాసలతో ఈ పుస్తకంలో కొన్ని 'కవితలు' ప్రతిఫలిస్తాయి. శ్రీకాకుళం యాస, భాషకో ప్రత్యేకత ఉందని చా.సో, బలివాడ, అట్టాడ, కా.రా వంటి వారు నిరూపించారు. శ్రీశ్రీ సహితం తన 'మరో ప్రస్థానం' ద్వారా శ్రీకాకుళ ఉద్యమంలో సాహితీ ఉద్యమానికి ఈ ప్రాంతం భాష, యాసల తోడ్పాడును ఉదహరించారు. 'ఊగరా ఊగరా/యిప్లవం యాడుందిరా' అనే జనం పాటకు శ్రీశ్రీ తన కలం బలాన్ని జోడించారు.

జనానికి మరీ దగ్గరగా వెళ్ళారు. వారి గొంతులో గానమయ్యారు. ఈ 'మరో ప్రస్థానం'లో ప్రజల పలుకు బడులు, పోరాటాల ప్రభావం కనిపిస్తుంది. ''శ్రీకాకుళం అడవుల్లో చీమలు/పాముని చంపుతాయి/సింహాద్రిశిఖరం మీద చిలకలు/పిల్లిని చెండుతాయి. వంగపండు చ్చాయలు శ్రీశ్రీ కవితలో కూడా క(వి)నిపిస్తే అది ఆయాకవుల సాహిత్య హృదయ దగ్గరితనంగా భావించాలి. 'చండ్రపుల్లారెడ్డి/తరిమెల నాగిరెడ్డి/వేసిన పాలికేక/సత్యమూర్తి పెనుఢాక/చారు మజందార్ పవర్/మనవేనోయ్‌డియర్‌బ్రదర్/కొల్లిపరా, పంచాదీ/అల్లిపురం,

సిమ్మాద్రీ)/చాగంటి, తామాడా/వెంపటరావు, కైలాసం/ యీళ్ళంతా యీరాది/యీరులురా సోదరా' వీరంతా శ్రీకాకుళం గిరిజన ఉద్యమంలో సాహిత్యంలో విప్లవాన్ని సాధించే గొప్ప వీరులుగా ఖ్యాతినొందారు. శ్రీకాకుళం గిరిజన, రైతాంగ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి విజయ పతాకాన్ని ఎగురువేసారు. శ్రీశ్రీ పేర్కొన్న అందరూ తీవ్రమైన ప్రభుత్వదమనకాండకు గురియిన వారే అయినా మొక్కనోని పోరాట స్ఫూర్తి వారిని నేటికి 'అమరులు' గానే మిగిల్చింది. శ్రీశ్రీ వంటి వారు తన పదునైన కవితలతో వారిని మరొక్కసారి స్మరణకు తీసుకువచ్చి నేటి తరానికి 'ఉద్యమం' యొక్క ఉనికి, అస్తిత్వాలను తెలియపరిచారు. 'నిన్నటి జట్కావాలా' కవిత నిండా శ్రీకాకుళం భాష, యాసలు కనిపిస్తాయి. శ్రీశ్రీ మార్కును వినిపిస్తాయి. ఎన్ని కష్టాల, నష్టాలు ఎదురైన సామాజిక అనమానతలు మార్చనలిగినా చావుకు మాత్రం 'ఛాన్సివ్వనని' ధైర్యంగా చెప్పిన 'జట్కావాలా' మాటలను శ్రీకాకుళం యాసలోనే' నేను మాత్రం సావను/సచ్చేదాక బతికే తీరుతాను/సావ్వలిసినోళ్ళని సంపే తీరు తాను/ ఫర్వాలేదురా చేటా అవి/నాకు నేను బరవసా సెప్పు కున్నాను ''ఇదే కవితలో మరో చోట 'సికాకుళం' 'యెల్లి పోవాలని/సెప్పవయ్యా సిరిసిరిమువ్వా' అంటారు. వెంపటావు సత్యన్నారాయణ గురించి ప్రత్యేకంగా ఓ కవితలో 'వెంపటాం/అదో ఊరు కావచ్చు/అయినా అదో కార్చిచ్చు/ ఆ పక్కనే సత్యం / అదో మనిషి పేరు కావచ్చు / మనిషి మహిహ కావచ్చు'' అని ఆయన చరిత్రను కొద్దిపాటి అక్షరాల్లో ప్రదర్శితం చేసినా 'వెంపటాం' ఘన చరిత్ర శ్రీకాకుళం ఉద్యమానికి దిశ, దిశా నిర్దేశించటంలో ప్రముఖమైనదనే శ్రీశ్రీ చెబుతారు. కవిత చివర్లో వెంపటం జీవితదర్శం, ఉద్యమ నేపధ్యంను గురించి చెబుతూ శ్రీకాకుళం ఉద్యమ గీతానికి పరిపుష్టిని చేకూర్చారు. 'వెంపటాం/ఔను అన్యాయాన్ని గుండుపేల్చి చంపటం/ అధర్మాన్ని గద్దెమించిదించడం.

శ్రీకాకుళం ఉద్యమంలో వెంపటరావు సినిమా బాణీలనందుకొని ప్రజలను చైతన్యపరిచారు. 'అర్జునులై విల్లంబులు బట్టి' 'నరరూపరక్కసుల'ని అటు/గిరిజన చైతన్యం, ఇటు పోలీసుల జులుంను వివరించారు. ఆఖరున కలియుగ గిరిజన వీర/కమ్యూనిస్టువై నీవు/ కరకంఠుందునుమాడు/కర్తవ్యం నీకున్నదీ/అంటారు. శ్రీశ్రీ సహితం ఇదే అలవరసలలో 'ఇప్పుడే ఇక్కడే' అనే కవితలో 'భూమిమరామత్ చెయ్యాలంటే/లేమి హజమత్ చెయ్యాలంటే/ముందుగా/కమ్యూనిస్టు కావాలి/నువ్వు అని నినదించారు. 'పచ్చగా బతకాలంటే/ఎర్ర ఎర్రగా ఎదగాలంటే/మంచి/కమ్యూనిస్టు కావాలి అని హెచ్చ రిస్తారు. శ్రోతకు ఉత్తేజం కలిగించాలనుకుప్పుడు, పాటలో కొన్ని చోట్ల గ్రాంథిక పదాలను, సంస్కృత సమాసాలను ఉపయోగించం వెంపటాపుకు అలవాటు. ఈ సత్యం శ్రీశ్రీకి తెలుసు 'జన విముక్తి ధన విరక్తి/ దాస్య బంధనాలు తెంచెడి/సుఖమయజీవితమునిచ్చు/ సౌభాగ్యపు సమరమిదే' అని పదాలను ఆవేశంగా ఉప యోగించిన శ్రీశ్రీ సహితం తనదైన శైలిలో శ్రీకాకుళం ఉద్య అస్తిత్వాన్ని తెలిపారు. బరిసెలు, కొడవళ్లే పాశు పతీస్త్రాలు/గురి తప్పనిది నీది శ్రీరామభాణమే/నీ విల్లు గాండీవం, నీ యిల్లు భూలోకం/నీ గోళ్ళు గొడ్డళ్ళు, ఈ ప్రజలు నీ వాళ్ళు' అని నినాదం చేస్తారాయన.

డిశంబర్1, 1975న భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరివేసినప్పుడు ఆయన తనదైన ముద్రతో ''వాళ్ళిద్దర్నీ ఉరితాసారని/అరవ పత్రికలో చదివినప్పుడు/వాళ్ళిద్దర్నీ చంపేశారని/డైరీలో నోట్ చేసుకున్నాను' మరో సందర్భంలో 'మరణం లేని మహాదాశమే/మనికి వాళ్ళిచ్చిన నిధి' అని కర్తవ్యంను గురించి చెబుతారు. భూమయ్య, కిష్టాగౌడ్‌లు శ్రీకాకుళం నక్సల్బరీ ఉత్తేజంతో చారు మజుందార్ పార్టీలోకి ఆకర్షితులయినవారు. తెలం గాణా సాయుధ పోరాట కాలం నుంచి 'ఎర్రజెండా'నే తన జీవిత, జీవన 'అజెండా'గా మార్చుకున్నవారు.

శ్రీశ్రీ తనదైన శైలిలో రచించిన 'మరో ప్రస్థానం' 'మహాప్రస్థానానికి' తీసిపోదు. 'ఓరయ్యోసేద్యగాడ/

అయ్యయ్యో బానిసీడ/యెన్నాళ్ళుబాకిరీ/ యెన్నేళ్ళు నౌకరి' అని గట్టిగానే ప్రశ్నిస్తాడు' ఏంది దొరా యీ గోరం/ ఏందని అడిగావంటే/బూటుతో కొడతాడు/బూతులు తిడతాడు. వర్తమానంలో రైతులు పైనే కేసులు పెడు తున్నారు. లాఠీలు విరుస్తున్నారు. రైతు ఓ అనాధ. రైతు కేవలం 'ఓటరు'... ఓ సంఖ్య... అందుకే ఆయన 'మానవత్వం సమానత్వమే నా గమ్యం/అది సాధించ డానికే/పూరించాలి విప్లవశంఖం/మ్రోగించాలి విజయ దుందుభి' అంటారు. నేడుఉ కూడా ఈ వ్యాక్యలు అక్షర వాస్తవాలు.

ఆధార గ్రంధాలు :

- 'మరో ప్రస్థానం' - శ్రీశ్రీ - విశాలాంధ్ర ప్రచురణ - 2009
- శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం -డా॥కె.ముత్యం- దృష్టి ప్రచురణ - 1993
- మహాప్రస్థానం - శ్రీశ్రీ - విశాలాంధ్ర ప్రచురణలు - 2010

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ జీవితం - సాహిత్య ప్రస్థానం

- డా॥. భీమినేని శివసాయి ప్రసాద్, పాఠశాల సహాయకులు, నల్లమోతు చెంచురామనాయుడు పురపాలక ఉన్నత పాఠశాల, తెనాలి, గుంటూరు.

శ్రీశ్రీ జీవితం - సాహిత్యం :

ఈ శతాబ్దం నాది అని సగర్వముగా ప్రకటించి, మహాకవి శ్రీశ్రీగా పేరు పొందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఏప్రిల్ 30, 1910లో పూడిపెద్ది వెంకటరమణయ్య, అప్పలకొండ దంపతులకు విశాఖపట్టణంలో జన్మించాడు. శ్రీశ్రీ మాత్రం తాను జనవరి 2, 1910లో జన్మించినట్లు చెప్పుకున్నాడు. శ్రీరంగం సూర్యనారాయణకు శ్రీనివాస రావుని దత్తత ఇచ్చినందు వల్ల ఇతని ఇంటి పేరు పూడిపెద్దికి బదులు శ్రీరంగంగా మారింది. ఒకటిన్నర సంవత్సరాలకే తల్లిని కోల్పోవడంతో మారుతల్లి అయిన సుభద్రమ్మ అవాజ్యమైన ప్రేమాభిమానాలతోనే పెరిగాడు. శ్రీశ్రీ అంత ఆరోగ్యకరమైన వాడు కాకపోవడంతో ఏడాది వయస్సులోనే నుదుటున చుట్ట నిప్పుతో వాతలు పెట్టి వైద్యం చేశారు. 1917 చిన్నతనంలో విశాఖపట్టణంలోని గోదావరయ్య బడిలో చదివాడు. 1915-20 మధ్య కాలంలో శివరామయ్య ప్రైవేటు స్కూలులో చదివాడు. ఎనిమిదేళ్ళ వయస్సు నిండక ముందే తండ్రి ప్రోత్సాహంతో 'సులక్షణసారం' అనే చంధో గ్రంథం చదివి పద్యాలు వ్రాయడం మొదలుపెట్టాడు. ఎనిమిది సంవత్సరాల వయస్సులోనే కందపద్యం రాశాడు. 1920 ఆరవ తరగతి చదువుతున్న రోజుల్లో 'వీరసింహ విజయ సింహ' అనే దేశభక్తి గల నవల రాశాడు. 1920లో 'శ్రీకృష్ణ లీలలు' అనే నాటకంలో అశరీరవాణి అనే ఆడవేషం వేశాడు. కేతవరపు వేంకటశాస్త్రి దగ్గర ప్రైవేటుగా సంస్కృతం నేర్చుకున్నాడు. తల్లి లేకపోయినందున తండ్రి ఎంతో ప్రేమగా శ్రీశ్రీని పెంచడంతో బాల్యం ఎంతో హాయిగా నడిచింది. గాంధీజీ అరెస్టుకు నిరసనగా సమ్మెలో పాల్గొనడంతో తండ్రి ఆగ్రహానికి గురి కావలసి వచ్చింది. 1924లో మారుతల్లి సుభద్రమ్మ మరణించడంతో శ్రీశ్రీ తండ్రి మీదే ఆధారపడవలసి వచ్చింది. 1925 మార్చి నెలలో శ్రీశ్రీ పాఠశాల విద్య (ఫూజ) పాసవ్వడంతో, అదే సంవత్సరం వెంకట రమణమ్మతో వివాహం జరిపించారు. 'పరిణయ రహస్యం' అనే నవలికను రాశాడు. పురిపండ అప్పలస్వామి శ్రీశ్రీకి స్నేహితుడు, బోధకుడు, దార్శనికుడు, అభిమాని. 1926లో పురిపండ అప్పలస్వామి వడ్డాది సీతారామాంజనేయులుతో కలిసి 'కవితాసమితి' స్థాపించారు. 1928-1931 సంవత్సరాల మధ్య మద్రాసులో బి.ఎ పూర్తి చేశాడు.

శ్రీశ్రీ 1928లో తన 18వ ఏట 'ప్రభవ' అనే భావ కవితా సంపుటిని వెలువరించాడు. 1930 ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం సంభవించిన రోజులలో టైఫాయిడ్ జ్వరంతో 2 నెలలు మంచం పట్టాడు. బ్రతుకుతెరువు కోసం 1931లో కొంతకాలం పాటు విశాఖ హార్బరులో టైంకీపర్‌గా, వేయింగ్ క్లర్క్‌గా పని చేశాడు. 1935లో మిసెస్ ఎ.వి.ఎస్. కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో డెమాన్‌స్ట్రేటర్‌గా పని చేశాడు. ఆంధ్రప్రభ, విశాఖ, ఆనందవాణీ వంటి పత్రికలలో సబ్ ఎడిటర్‌గా పని చేశారు. 1942లో మద్రాసులోని ఆలిండియా రేడియోలో పని చేస్తూ ఢిల్లీకి బదిలీ అయ్యాడు. కేవలం నాలుగు నెలల పాటు న్యూస్ రీడర్‌గా పని చేశాడు. లక్నోలోని మిలిట్రీ కంటోన్మెంటులో లేబరేటరీ అసిస్టెంటుగా ఉద్యోగం చేశాడు. 1944లో అబ్బూరి రామకృష్ణారావు స్థాపించిన 'నటాలి' అనే స్వచ్ఛంద సంస్థలో స్క్రిప్ట్ రైటర్‌గా చేరి నాటకరంగ ప్రచారంలో పాలు పంచుకున్నాడు. నిజాం కొలువులో పౌర సంబంధ ఉద్యోగిగా పనిచేస్తూ 1946లో ముల్కీ సర్టిఫికెట్ లేని

కారణంగా ఆ ఉద్యోగం ఊడిపోవడంతో మద్రాసు వెళ్ళి సినీ రంగంలో స్థిరపడ్డాడు.

1950లో సినిమా రంగంతో ప్రత్యేక సంబంధం ఏర్పడి నెలవారి జీతంతో అనేక సినిమా సంస్థలకు మాటలు, పాటలు రాశాడు. 'తెలుగు వీర లేవరా' అనే పాటకు తొలిసారి జాతీయ స్థాయిలో అవార్డు తెచ్చి తెలుగు పాటకు కావ్య గౌరవం కల్పించాడు. ఉషశ్రీ పిక్చర్స్ అనే సినిమా సంస్థను ప్రారంభించి తాను సినిమా రంగంలో సంపాదించిన ధనం అంతా పోగొట్టుకున్నాడు. 1950లో ప్రారంభమైన ఆయన సినీ ప్రస్థానం 1982 వరకూ నిరాటంకంగా సాగింది. శ్రీశ్రీ పాటల్లో సగటు మనిషి ఆవేదన, వారి బాధలు పొగొట్టే ఆనందం ఉంటుంది. విప్లవ గీతాలైనా.. భావాత్మక గీతాలైనా.. దేశభక్తి గీతాలైనా.. ప్రణయ గీతాలైనా.. విరహ గీతాలైనా.. విషాద గీతాలైనా.. భక్తి గీతాలైనా ఆయన కలం నుండి అలవోకగా జాలువారినాయి. విప్లవకవిగా తన రచనలతో ప్రజలను చైతన్య పరుస్తూనే... సినీ కవిగా తన రచనలతో ప్రేక్షకులపై పాటల జల్లులు కురిపించాడు. 'తెలుగు వీర లేవరా..', 'సమరానికి నేడే ఆరంభం..', 'ఎవరో వస్తారని ఏదో చేస్తారని..', 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై..', 'ఆకాశ వీధిలో అందాల జాబిలి..' మొదలైన పాటలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాడు. విశ్వనాచార్య గారి సినిమాకి ఒక రోజులో 12 పాటలు వ్రాసి రికార్డు సృష్టించాడు. దాదాపుగా 50 చిత్రాల వరకూ సినీ సాహిత్యం అందించాడు.

1933లో బరంపురంలో జరిగిన అఖిలాంధ్ర కవి పండిత సభలో పాల్గొన్నాడు. 1936లో మున్సీ ప్రేమ్‌చంద్ అధ్యక్షతన జరిగిన అభ్యుదయ రచయితల మహాసభకు శ్రీశ్రీ ప్రతినిధిగా వెళ్ళాడు. 1943లో తాపీ ధర్మారావు ఆధ్వర్యంలో తెనాలిలో జరిగిన అ.ర.సం మహాసభలలో శ్రీశ్రీ పాల్గొన్నాడు. 1955 విజయవాడలో జరిగిన అ.ర.సం అయిదవ మహాసభకు అధ్యక్షునిగా పని చేశాడు. మార్క్సిజం, సామ్యవాద సిద్ధాంతం సామవేదంలా కనిపించడంతో భావ కవితా సంకెళ్ళు తెంచుకొని Capital ధనస్వామ్య వ్యవస్థ నుండి సమసమాజ స్థాపన వైపు అడుగులు వేయడంలో భాగంగా శ్రీశ్రీ 1950లో 'మహా ప్రస్థానం' అనే అభ్యుదయ కవితా సంకలనం వెలువరించారు. అభ్యుదయ కవిత్వానికి శ్రీశ్రీ 'మహాప్రస్థానం' మేనిఫెస్టో లాంటిది. 1930 దాకా తెలుగు కవిత్వం తనని నడిపిస్తే ఆ తర్వాత తెలుగు కవిత్వాన్ని తానే నడిపించానని... 'ఈ శతాబ్దం' తనదేనని శ్రీశ్రీ నగర్వంగా చెప్పుకున్నాడు. 1935 తర్వాత కలం పట్టిన యువకులందరికీ శ్రీశ్రీ మార్గదర్శి అయ్యాడు. చరమరాత్రి కథల ద్వారా చైతన్య స్రవంతి పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టాడు. 1947లో మద్రాసుకు తిరిగి వచ్చి అక్కడే స్థిరపడి తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ ఖడ్గసృష్టి, మూడు యాభైలు, గురజాడ, వ్యూలు - రివ్యూలు మొదలైనవి వెలువరించారు. మద్రాసులో ఉంటూ ఎన్నో సినిమాలకు మాటలు, పాటలు రాశాడు. విశాఖ విద్యార్థుల సవాల్‌తో 1970లో అ.ర.సంతో తనకున్న సంబంధాలను తెగతెంచుకొని అనేక వాదోపవాదాల మధ్య వి.ర.సం అధ్యక్ష పదవి చేపట్టారు. 1977లో విప్లవ రచయితల సంఘం (వి.ర.సం) అధ్యక్ష పదవి నుండి వైదొలిగారు. శ్రీశ్రీ 1980లో 'చైనా యానం', 'మరో ప్రస్థానం' వెలువరించారు. హైదరాబాదు హిందీ ప్రచార సభ వారు శ్రీశ్రీకి 'సాహిత్యాచార్య' బిరుదును ప్రధానం చేశారు. 1982లో ఎన్.టి.ఆర్.ని సమర్థించారు. శ్రీశ్రీ అభిప్రాయాలు, ఆలోచనలు, ప్రవర్తనలలో చాలా మార్పులు కనిపించేవి. చాలా వివాదాస్పద రచయితగా ముద్రపడ్డారు. వ్యక్తిగత లోపాలు ఎన్ని ఉన్నా కలిసి మెలిసి ఉండే గుణం, వ్యాస చమత్కారాలు, అద్భుత సాహిత్య శక్తి శ్రీశ్రీని పండిత పామరులకు జన ప్రియుణ్ని చేశాయి. 1975 ఆగస్టు 3న ప్రజాతంత్రంలో శ్రీశ్రీ తన వీలునామా ప్రచురించారు.

శ్రీశ్రీ కేంద్ర సాహిత్య అకాడమీలో సభ్యుడిగా పని చేశాడు. తెలుగు భాష జాతీయ భాష కావాలని

సంకల్పించాడు. అమెరికా, రష్యా, చైనా, లండన్ దేశాల ఆహ్వానంపై ఆ దేశాలు వెళ్ళి అక్కడి కవులను కలిసి సాహిత్య చర్చలు జరిపాడు. శ్రీశ్రీ సాహిత్య సృజనకు గుర్తింపుగా 'ఖడ్గసృష్టి' కావ్యానికి 1966లో సోవియట్ భూమి నెహ్రూ అవార్డు, 1973లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1979లో శ్రీరాజాలక్ష్మీ ఫౌండేషన్ వారి మొదటి అవార్డు అందుకున్నాడు. తెలుగు వాళ్ళకి మరో ప్రపంచాన్ని ప్రసాదించడం కోసం తన సర్వశక్తుల్ని కవితా రూపంలో ధారపోసిన మహాకవి శ్రీశ్రీ క్యాన్సర్ వ్యాధి బారిన పడి 1983 జూన్ 15వ తేదీన మహాప్రస్థాన మొందాడు. విశాఖపట్టణం బీచ్ రోడ్డులో శ్రీశ్రీ నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 1986లో శ్రీశ్రీ విగ్రహాన్ని హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టాపన చేశారు. ప్రపంచంలో పేదలు, కర్షకులు, కార్మికులు, శ్రామికులు, ధీనులు, బాధాసర్పదష్టులు ఉన్నంత కాలం శ్రీశ్రీ కవిత్వం బతికే ఉంటుందని సగర్వంగా చెప్పవచ్చు.

శ్రీశ్రీ - సాహిత్య ప్రస్థానం :

కార్మిక లోకపు కళ్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి పాటు పడతానని అంటూ కష్ట జీవికి కాపుదలగా కవిత్వం రాస్తానని శ్రీశ్రీ ప్రతిన పూనాడు. శ్రీశ్రీ సృజనకు, ప్రతిభకు తాత్త్విక మార్గాన్వేషణకు పేరుగన్నవాడు. నూతన ప్రయోగాల మార్గదర్శకుడు. శబ్ద బ్రహ్మ. కర్షకులు, కార్మికులు, పీడితులు, పేదలు అనుభవించే కష్టసుఖాలు ఈయన కవితా వస్తువులు. కళ కళ కోసమే అన్న భావనను ప్రక్కనపెట్టి కళ సమాజం కోసం అన్న రీతిలో తన సాహిత్య ప్రస్థానాన్ని ప్రదర్శించాడు. శ్రీశ్రీ 1926-32 మధ్య కాల్పనిక ప్రభావంతో, 1932-40 మధ్య మార్క్సిస్టువాద ప్రభావంతో, 1940 తర్వాత ఫ్రాయిడ్ మనోవిశ్లేషణా సిద్ధాంత భావంతో రచనలు చేశాడని చెప్పవచ్చు.

శ్రీశ్రీ - భావకవితా దృష్టి :

శ్రీశ్రీ ఆదిలో ప్రాచీన కావ్యశైలిలో రచన సాగించాడు. భావ కవిత్వం పై మక్కువతో కృష్ణశాస్త్రి ప్రభావంతో భావకవితలు రాశాడు. శ్రీశ్రీ కలం తొలి చిందులు తొక్కుతున్న కాలంలో సహజంగానే భావకవిత్వ పోకడలతో 1928లో 'ప్రభవ' అనే పద్య కావ్యాన్ని రచించాడు. కాల్పనికోద్యమ ప్రభావంతో రాసిన 'ప్రభవ'ను మారుతల్లి సుభద్రమ్మకు అంకితం చేశాడు. 1927 భారతి జులై సంచికలో శ్రీశ్రీ రాసిన 'అభిసారిక'లో భావకవిత్వ ఛాయలు కనిపిస్తాయి. 1927-28ల మధ్య రాసిన 17 ఖండికలు ఈ ప్రభవలో ఉన్నాయి. కృష్ణశాస్త్రి పద్యాలకు కార్బన్ కాపీలా రాసే వాళ్ళమని శ్రీశ్రీ ఒకచోట చమత్కరించుకున్నాడు. కొత్త కవికి పదాల మీద మోజుంటుందనేది 'ప్రభవ' నిండా కనిపిస్తుంది. భావ కవులకు సహజంగా ఉండే 'స్వేచ్ఛ' అన్న లక్షణం కృష్ణశాస్త్రి, శ్రీశ్రీలలో చూడగలం. ''ఆకులో ఆకునై పువ్వులో పువ్వునై...'' అంటూ జగము నిండా స్వేచ్ఛగాన ఝరుల నింతు అని కృష్ణశాస్త్రి గారంటే, శ్రీశ్రీ ''నేను సైతమొక్కాకునై యునయుదేని.. గాలి యొసగిదు కొత్త రెక్కలు ధరించి, అతి నిరాఘటముగా విహాయాస పతాల నెఱుక పడరాని మెచటికో ఎగసిపోదు'' అని అంటాడు. ప్రకృతి ఆరాధనతత్వం 'మాతృగీతి'లో చూడగలం. ఉషఃకాలాన్ని వర్ణిస్తాడు, గాలి అలలను, అవి చేసే చప్పళ్ళనూ వర్ణిస్తాడు. ఆత్మాశ్రయ కవిత్వ లక్షణాలు సముద్రఘోష, మాతృగీతి, మృత్యు ప్రబోధం ఖండికల్లో స్పష్టంగా చూడగలం. కృష్ణశాస్త్రి గారు 'ఎవ్వరని మెంతురో నన్ను ఏననంత శోకభీకర తిమిర లోకైకపతిని కంటక కిరీట ధారినై...' అంటే శ్రీశ్రీ 'ఎరుగవే నన్ను లోకభీకర మహోగ్ర, విషఫణస్ఫీత మృత్యురూపిణిగ నీవు ? విష్ఫరతేజమున తాండవించు నన్ను మృత్యు దేవతగా మదినెఱుగలేవో? అని 'మృత్యు ప్రబోధం' ఖండికలో పలికాడు. గీత పద్యాలంటే శ్రీశ్రీకున్న మక్కువను ''గీత పద్యాలు'' అన్న ఖండికలో తెలియజేశాడు. పద్యములు ముఖ్యముగా గీత పద్యములవె / యొసగు నింతింత కాని సంతసము నాకు / 'ప్రాణ సన్నిభమై గీతి త్రుళ్ళులాడు' - అంటాడు. ప్రభవలోని ఖండికలలో చాలా భాగం గీత పద్యాలే. 'మత స్వీకృతి' అన్న ఖండికలో హిందూ మహమ్మదీయ

సామరస్యాన్ని ఒక పురాతన గాథ ఆధారంగా రాశాడు. 'మతములన్నీ దైవ సమ్మతములగును' అని సూచించాడు. శ్రీశ్రీలో తొంగి చూస్తున్న లౌకిక భావచ్ఛాయ లిందులో చూడవచ్చు. దైవ నిరాకరణ స్థాయికి శ్రీశ్రీలో శాస్త్రీయ దృక్పథం పెరగని దశ అది. కానీ, మత సామరస్యం అవసరం అన్న భావన వరకూ ఎదిగాడు.

ఇలా సాగిన రచనా క్రమంలో శ్రీశ్రీ పదసారళ్యం వైపు మొగ్గుతున్నా అక్కడక్కడ కృష్ణశాస్త్రి గీతాలకు ప్రతిధ్వనులు కూడా వినిపిస్తాయి. ప్రభవలో ఇలా సంస్కృతీ సంపన్నంగా పౌరాణిక ఇతివృత్తాలు, కథన పద్ధతులను కవితా ఖండికలుగా రాశాడు. ఇంటర్ చదువుతూ ఇంకా జీవితపు సుడిగుండాలలో చిక్కుకోని కాలంలోనే 'ప్రభవ' అచ్చయింది. సమాజంలోని ఒడిదుడుకుల ప్రభావం కూడా అప్పటికి శ్రీశ్రీ మీద పడలేదు. మానవుణ్ణి మరేదో మానవతాతీత శక్తి నడిపిస్తున్నదన్న భావన ఉంది. ఓ సగటు కవిత్వం రాసే యువకుడిగా, నాడున్న భావకవిత్వ ప్రభావంలో మునిగిన వాడి రచనగా ప్రభవ కనిపిస్తుంది. లౌకిక భావం నుండి నిరీశ్వరవాది గాను, శబ్ద బ్రహ్మ గాను వివిధ చంధాలను నడిపించగలవాడు గాను, మత దురహంకారాన్ని తిరస్కరించేవాడు గానూ భవిష్యత్తులో మారబోతాడని సూచించే దాఖలాలు 'ప్రభవ'లో కనిపిస్తాయి. నేను నుండి మనం దాకా ఎదిగే విరాట్ స్వరూపానికి ప్రభవ ఓ 'మినిమేచర్'గా చెప్పవచ్చు. 1926-1932 మధ్య కాలంలో వచ్చిన శ్రీశ్రీ సాహిత్యంలో కాల్పనికోద్యమ భావకవిత్వ ఛాయలు స్పష్టంగా కనిపిస్తాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.

శ్రీశ్రీ - అభ్యుదయ దృష్టి :

1929-1932 మధ్య కాలంలో ఒక రష్యా మినహా ప్రపంచ దేశాలన్నీ భయంకర ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయాయి. న్యూయార్క్‌లోని వాల్ స్ట్రీట్‌లో తలెత్తిన అపస్వరాల వలన వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో ప్రపంచ వ్యాప్తంగా మాంద్యం ఏర్పడింది. అకాశన్నంటే ధరలు, నిరుద్యోగం, ఆకలిదప్పికలు, దోపిడీ సంస్కృతి, దౌర్జన్యాలు వల్ల మనుష్యులు బతికున్న శవాలయ్యారు. ఆకలి, అసమానతలు పెచ్చు పెరిగి పోయాయి. పెట్టుబడిదారి దేశాల ద్రోహ బుద్ధులు, దోపిడీ సంస్కృతి, దౌర్జన్యాలు ప్రజలకు తెలిసి వచ్చాయి. ఈ ఆర్థిక మాంద్యాన్ని తట్టుకుని గెంతులు వేస్తూపోతున్న కమ్యూనిస్టు సోవియట్ రష్యా ప్రపంచ వ్యాప్తంగా రచయితలకు, ముఖ్యంగా కవులకు ప్రేరణ ఇచ్చింది. కర్షక కార్మిక శ్రామికులందరినీ జాగృతం చేసింది. 'లెనిన్ తపస్సు, స్టాలిన్ సేద్యం, మార్క్స్ కమ్యూనిస్ట్ రచనలు' కవితలకు ఉద్దీపన కలిగించాయి. ఆలెన్, స్పెండర్, డేలుయిస్, జార్జి బార్కర్ మొదలైన వారు ఈ కాలంలోనే గొప్ప రచనలు చేశారు. 1935 ఫారిస్‌లో అంతర్జాతీయ రచయితల సదస్సు, 1935 అలహాబాద్‌లో ఇండియన్ ప్రొగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ సమావేశం, 1936 లండన్ నుండి భారత అభ్యుదయ రచయితల ప్రణాళిక ప్రకటన మొదలైన అంశాలు మున్సీ ప్రేమ్ చంద్ ఆధ్వర్యంలో 1936 ఏప్రిల్‌లో లక్నోలో అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ సమావేశాలు జరగడానికి తోడ్పడినాయి. 1936 సెప్టెంబరు ఫైజాపూర్‌లో జాతీయ కాంగ్రెస్ మహాసభల సందర్భంగా సరోజనీనాయుడు అధ్యక్షతన రచయితల ఇష్టాగోష్టి సమావేశం జరిగింది. సమసమాజ నిర్మాణం, శ్రామిక జీవన సౌందర్య సాధన, కులమత వర్గ బేధ నిర్మూలన, సమాన హక్కులు, స్వేచ్ఛ, సౌభ్రాతత్వం... మొదలైనవి ప్రాతిపదికగా 1936లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. పై పరిణామాల నేపథ్యంలో 1943 తెనాలిలో మొదటి అభ్యుదయ రచయితల సంఘ మహాసభ తాపీ ధర్మారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు శ్రీశ్రీ, బెల్లంకొండ రామదాసు, అనిశెట్టి, కుందుర్తి, సోమసుందర్ మొదలైనవారు పాల్గొన్నారు. ప్రజాశక్తి, తెలుగుతల్లి పత్రికలు అ.ర.సం పట్ల విస్తృత వ్యాప్తి కలిగించాయి. ఈ ఆర్థిక మాంద్య పరిస్థితులు యువకుడైన, ప్రపంచ సాహిత్య అధ్యయన శీలి అయిన శ్రీశ్రీని అమితంగా ప్రభావితం చేసి శ్రీశ్రీని

అభ్యుదయ కవిత్వానికి ప్రతినిధిని చేశాయి. పురిపండ, కొంపెల్ల జనార్ధనరావు, అబ్బూరి రామకృష్ణారావు గార్ల పరిచయ స్నేహాలు శ్రీశ్రీ ఆలోచనా విధానంలో పెద్ద మార్పులు తెచ్చాయి. ఆర్థిక మాంద్యం, స్పానిష్ అంతర్యుద్ధాల ప్రభావంతో తన కవిత్వం మెరుగులు తీరి ప్రాపంచిక దృక్పథం విస్తరించడంతో భావకవితాసంకెళ్ళు తెంచుకొని అభ్యుదయ కవిత్వంవైపు చకచక అడుగులు వేశాడు.

అభ్యుదయ రచయితలకి ప్రజలే ప్రమాణం. కొన్ని కారణాల వల్ల సాహిత్యానికి దూరమైపోయిన ప్రజల జీవితాలను సారస్వతోన్ముఖంగా తిప్పడమే అభ్యుదయ సాహిత్య లక్ష్యం అని శ్రీశ్రీ ఉద్ఘాటించారు. మార్క్స్, ఏంగెల్స్ గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాలు ప్రాతిపదికగా బడుగు, బలహీన వర్గాల వారి అభ్యుదయం కోసం కవిత్వం రాస్తానని శ్రీశ్రీ ప్రతిన పూనారు. కందుకూరి, గురజాడ అభ్యుదయ భావాలను స్ఫూర్తిగా తీసుకొని 1933లో 'జయభేరి' అనే కవితతో మహా ప్రస్థానానికి నాంది పలికాడు. శ్రీశ్రీ మహాప్రస్థానంతో అభ్యుదయ కవిగా, మహాకవిగా కీర్తించబడ్డాడు. 1930 నుండి పూర్తి మార్పులు శ్రీశ్రీలో చూడగలం. 1929లో రాసిన 'సుస్తాస్థికలు' నుండి 1932లో రాసిన 'ఖండశశి' వరకూ కవితలలో ప్రతీక లక్షణాలు ప్రబలంగా రావడం గమనించవచ్చు. శబ్దం నుండి భావానికి కాకుండా, భావం నుండి శబ్దానికి నడకలిక్కడే ఆరంభమయ్యాయి. తానింత వరకూ రాసిన బాణీ ఇక పనికి రాదనీ, కొత్త రక్తంతో కొత్త మార్గంలో ప్రయాణించాలని భావించారు. అదే మహాప్రస్థాన గీతాల రచన. 1933 నుండి 1947 వరకూ రాసిన కవితలతో 1950లో 'మహాప్రస్థానం' కవితా సంపుటి ప్రచురించారు. ఇందులో 1933-1937 మధ్య కాలంలో రాసిన కవితలే ఎక్కువ.

మహాప్రస్థానంలో మొత్తం 40 కవితా ఖండికలున్నాయి. 41వ కవితా ఖండికగా వెళ్ళిపోయావా, నేస్తం!... శీర్షికతో మిత్రుడు కొంపెల్ల జనార్ధనరావుకి అంకిత సుమాంజలి ఘటించాడు. మహాప్రస్థానం, జయభేరి, ఒక రాత్రి, గంటలు, ఆకాశదీపం, బుక్కులు, అవతారం, బాటసారి, ఆశాదూతలు, ఐ, శైశవగీతి, అవతలిగట్టు, సాహసి, కళారవి, భిక్షువర్షీయసి, ఒక క్షణంలో, పరాజితులు, ఆ:!, ఉన్మాది, స్వింన్ బర్న్ కవికి, అద్వైతం, వాడు, అభ్యుదయం, వ్యత్యాసం, మిథ్యావాది, ప్రతిజ్ఞ, చేదు పాట, కవితా! ఓ కవితా!!, నవ కవిత, దేశ చరిత్రలు, జ్వాలా తోరణం, మానవుడా!, సంధ్యా సమస్యలు, దేని కొరకు ?, కేక, పేదలు, గర్జించు రష్యా!, నిజంగానే, నీడలు, జగన్నాధుని రథ చక్రాలు మొదలైన కవితా ఖండికలు బడుగు బలహీన వర్గాల వారి ఆకలి కేకలు, అన్యాయాలు, వేదనలు దౌర్జన్యాలు, ఆక్రందన లను పరిష్కరించాలని నూచించాయి. లయకు ప్రాధాన్యతనిస్తూ మత్రా ఛందస్సులో సాగిన ఈ కవితలన్నీ కష్టజీవికి కాపుదలగా నిలిచాయి.

మహాప్రస్థానంలోని కవితలు ఒక బలీయమైన సాంద్రమైన ఎమోషనల్ నుండి వచ్చిన నిరసనలు. ఇవి ఒక తాత్విక చింతనను అనుసరించి వచ్చిన నిరసన కాదు. అంతకు క్రితం వరకూ వచ్చిన కవిత్వం సమాజంలో తాడితులు, పీడితుల వేదనలకు స్పందించకుండా ఉండటం పై వచ్చిన నిరసన. ఇది మహా శక్తివంతంగా వెల్లువలా, జ్వాలలా వచ్చింది. ఆయన కవిత్వంలో కూడా బలీయంగానూ వెల్లువయింది. తనకు పాఠకునికి మధ్య అక్షరాలు అడ్డుగా నిలవకుండా ఆయన గుండెలోని ఆవేశాలు, ఆక్రందనలు, ఆకాంక్షలు పాఠకుల గుండెల్లోకి మహావేగంగా చీల్చుకుంటూ దూసుకుపోతవి. మహా ప్రస్థానంలోని అత్యధికమైన కవితలు ఈ వేగం, ఈ ఊపు కలిగి ఉంటవి. వెనుక చూపు లేనే లేకుండా 'పదండి ముందుకు పదండి ముందుకు' అంటూ పిడికిలి బిగించి కదను త్రొక్కుతూ విరుచుక పడుతుంటే, అడ్డంకులన్నీ బేజారెత్తి పటాపంచలై పారిపోతవి. పాఠకులను జ్వలించే మూర్తులుగా ప్రభావితం చేస్తవి. ఇంతటి శక్తి ఆ కవితల కుండటానికి కారణం కవి ఆవేశ స్ఫూర్తి, శబ్ద శక్తి, అనుభూతుల నిజతత్వ నిరూపణకు వ్యక్తీకరణ

మాధ్యమాలుగా వాడిన పద చిత్రాలు. మహాప్రస్థాన ఖండిక మొక్క భావావేశం, శబ్ద సౌష్టవం, పద చిత్రాల నిర్మాణ ప్రౌఢిమ, అది సాధించిన మనోహరమైన లయ కావ్యానికే తలమానికంగా నిలబడతవి. దోపిడీల్లేని సమసమాజ నిర్మాణం కోసం పిలుపు, మేల్కొలుపు ఈ మహాప్రస్థానం. ఈ ప్రస్థానం అంత సులభం కాదు. అందుకే కృత నిశ్చయంతో సర్వ త్యాగాలకు సిద్ధపడి అవసరమైతే గుండె నెత్తురుల తర్పణ చేస్తూ బాటలు, పేటలు, కోటలు, నదులు, కొండలన్నింటినీ అతిక్రమించి గమ్యం చేరాలని సూచించే గొప్ప ప్రయాణం. సుమారు వెయ్యేళ్ళ గ్రాంధికశైలి, గణబద్ధ చంధస్సులతో నడిచిన క్లాసికల్ బండి దారి నుండి గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్త మలుపు ఇస్తే ఆ మలుపును మహాప్రస్థాన గీతాలతో మరింతగా వెడెల్పు చేసి బాట ఏర్పరిచినానని శ్రీశ్రీ సగర్వంగా ప్రకటించాడు. అందమైన అబద్ధాల కన్నా, నిష్కర్షమైన నిజంతోనే మంచి కవిత్వం దర్శనీయ మవుతుందని శ్రీశ్రీ నమ్మడంతో తన గేయాలలో సామాజిక వాస్తవికతలకు దర్పణం పట్టడం జరిగింది.

అసమ సమాజపు దోపిడీ వ్యవస్థ నుండి, పెట్టుబడి దారీ పెత్తనం నుండి సమసమాజం వైపు, వర్గ రహిత వ్యవస్థ వైపు, కార్మిక శ్రామిక కళ్యాణం వైపు, సామ్యవాద వ్యవస్థ వైపు చేసే గొప్ప ప్రయాణంగా 'మహాప్రస్థానం' ఖండిక కొనసాగింది. వాడక భాషకి ప్రాధాన్యమిచ్చి వ్యష్టి, సమిష్టి సంబంధాన్ని 'జయభేరి' కవితా ఖండిక తెలియ జేస్తుంది. శ్రీశ్రీ అందరి కోసం నిలుస్తాడు కావునే "ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ' అన్న సార్థకం ఏర్పడింది. 'ప్రతిజ్ఞ' గేయం అభ్యుదయ కవిత్వానికి మేనిఫెస్టో వంటిది. వ్యవసాయదారులు, శ్రామికులు, కార్మికులు, బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం కవిత్వం రాస్తానని 'ప్రతిజ్ఞ' గేయంలో సూచించాడు. ప్రజలే చరిత్ర నిర్మాతలు అన్న దానికి కవితాత్మక రూపం 'దేశ చరిత్రలు' గేయం. ఇందులో చరిత్ర బోధక శక్తులేవో అద్దం పట్టి చూపించే కవిత. కవితా! ఓ కవితా!! గేయంలో కవిత్వ దర్శనం ఉంది. శ్రీశ్రీ తన కవితా లక్ష్యాలను, సామాజికతను ప్రతీకలతో, సమాసాలతో వివరించాడు. ఇందులో సామాజిక, కవితా విప్లవాల స్పృహలు ఉన్నాయి. గతంపై నిరసన ఉంది. నిజమైన కవితావేశం జల పాతంలా దూసుకు వచ్చినప్పుడు నిఘంటు, వ్యాకరణ అడ్డు నియమ నిబంధనలు ఉండవని చాటాడు. శ్రీశ్రీ చెప్పిన వ్యదార్థ జీవిత యదార్థ దృశ్యానికి 'భిక్షు వర్షీయసి' ఖండిక నిలువుటద్దం. భిక్షుక వృత్తికి ధనస్వామ్య వ్యవస్థ ప్రధాన కారణం అని సూచిస్తుంది. శ్రీశ్రీ మానసిక స్థితిని వివరించే ఆత్మక్రియ కవిత 'ఒక రాత్రి'. నిరుద్యోగం, పేదరికం, పిరికితనం మొదలైనవి ఇందులో వ్యక్తీకరిం చాడు. తన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ పిల్లల పట్ల వాత్సల్యాన్ని ప్రదర్శిస్తూ వారి ఔన్నత్యమును తెలిపే ఖండిక 'శైశవ గీతి'. మానవుని పుట్టుక, మానవ స్వభావాలు, మానవునిలో గల వివిధ భేదాలు గురించి శ్రీశ్రీ లోచూపుతో లోక పరిశీలనతో వివరించిన గేయమే 'మానవుడా!'. రష్యా ఫాసిజాన్ని నిరసించడంతో, రష్యా వల్ల సామ్యవాద స్వర్గం ఏర్పడుతుందని శ్రీశ్రీ 'గర్జించు రష్యా'లో ఆశపడ్డాడు. 'నవకవిత' గేయం అభ్యుదయ కవిత్వ వస్తువనీ, దాని సామాజిక ప్రయోజనాన్ని తెలియజేస్తుంది. శ్రీశ్రీ తాడిత జీవిత పక్షపాతానికి నిలువెత్తు సాక్ష్యం 'జగన్నాధుని రథ చక్రాలు' గేయం. జగన్నాధుని రథ చక్రాలు ఆదర్శ సమసమాజానికి సంకేతాలు.

మహాప్రస్థాన గేయం సామ్యవాద వ్యవస్థకు ఒక కవాతు పాట. ఫ్రెంచి జాతీయ గీతం - షురుకువాహై జెన్, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ రాసిన - షా మొహతాహై జెన్, నజ్రూమ్ఇస్లాం - విప్లవగీతాలు, ఎడ్గార్ ఎలాన్ పో, గురజాడ గేయాలు, కవి కొండలు గేయాలు, ఆదిశంకరాచార్యుల భజగోవిందం మొదలైనవి మహా ప్రస్థాన గేయాలకు ప్రేరణగా శ్రీశ్రీ చెప్పుకున్నాడు. శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలం 'యోగ్యతా పత్రం' పేరుతో పీఠిక రాస్తూ, ఈ వృద్ధ ప్రపంచానికి నెత్తురూ, కన్నీళ్ళు తడిపి కొత్త టానిక్ తయారు చేశాడని శ్లాఘించాడు.

శ్రీశ్రీ తన 'ఖడ్గసృష్టి'లోని 'ఏవి తల్లీ', 'ఓ మహాత్మా', 'సఖ్యం', 'ఆంధ్రదేశం', 'వెండి పండుగ' మొదలైన ఖండికలలో అభ్యుదయం కాంక్షించాడు. ఖడ్గసృష్టి అధివాస్తవిక కవిత్వం (సర్రియలిజం)తో సాగింది. సిగ్మండ్ ఫ్రాయిడ్ Psycho - Analysis ఆధారంగా ఈ వాదం ఆవిర్భవించింది. డీకంపోజిషన్, విదూషకుని ఆత్మహత్య, టాంటాం, కొంటె కోణాలు, అభిసారికి కడసారి, అధివాస్తవికుల ప్రదేశం మొదలైనవి శ్రీశ్రీ అధివాస్తవిక గీతాలు.''జీబ్రాకి Alzebra చిహ్నాల / లాంకోటు, ఫాంకోళ్ళు తొడిగి /

సాహిత్య పౌరోహిత్యం చే యిస్తే / వెఱ్ఱి కాదు Sur - Realisim సోదరా'' అని శ్రీశ్రీ - కొంటె కోణాలులో సర్రియలిజాన్ని నిర్వచించాడు. అసంబద్ధత, అనర్థకత, శబ్ద చమత్కారం సర్రియలిజం లక్షణాలుగా శ్రీశ్రీ చెప్పాడు. శ్రీశ్రీ - ప్రతిజ్ఞ, నీడలు, పేదలు, నర కవిత గేయాలు ప్రతీకవాదానికి చిహ్నాలు. శ్రీశ్రీ న...న...న...నత్తి మాటలు, ''హూష్ హూష్'' మొదలైన గేయాలు విధ్వంస కరవాదం (డాడాయిజం)తో సాగినాయి. శ్రీశ్రీ - 'బాటసారి' గీతం భావచిత్రవాదం (Imagism)తో సాగింది.

శ్రీశ్రీ - విప్లవ కవితా దృష్టి :

మహాప్రస్థానంలో శ్రీశ్రీ చేసినదంతా సామాజిక రుగ్మతను నినదించడం మాత్రమే. 'ఇదీ మన ప్రపంచం! ఇలా ఉన్నారు ఇచ్చటి ప్రజలు!' అని శ్రీశ్రీ పలికాడు. ఇది సరైన రోగ నిదానమే కాని ఇంతటితో ఆగిపోకూడదు. జబ్బులకు తగ్గ మందు వెదకాలి. పై పై పూతలతో ఈ జబ్బులు కుదరవు. కావలసింది శస్త్ర చికిత్సే. దానినే 'విప్లవం' అంటున్నాను అని శ్రీశ్రీ ప్రకటించారు. మహా ప్రస్థానంలో అభ్యుదయ కవిత్వం, విప్లవ బీజాలు ఉన్నాయి కానీ 'విప్లవ సాహిత్యం' లేదు. విప్లవ సాహిత్యం అంటే సామాన్య ప్రజానీకాన్ని విప్లవాచరణకు ఉద్యుక్తుల్ని చేసే విధంగా సాగేదే! అని శ్రీశ్రీ ఉద్ఘాటించాడు.

1967లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా నక్సల్‌బరీ గ్రామంలో జరిగిన రైతాంగ పోరాటం విప్లవ కవిత్వానికి నేపధ్యం వహించింది. నక్సల్‌బరీ ఉద్యమ ప్రభావం శ్రీకాకుళం జిల్లా గిరిజన ప్రాంతాలకు వ్యాపించి 1967 నుండి 1970 వరకూ ఉధృతంగా నడిచింది. సామ్యవాదం పై ఆశలు సన్నగిల్లడం, రష్యాలో కమ్యూనిజం అంతం అవ్వడం, కమ్యూనిస్ట్ పార్టీల చీలిక, అభ్యుదయ కవులు సినీకవులుగా, ప్రభుత్వకవులుగా మారడంతో అభ్యుదయ కవిత్వం స్థానంలో విప్లవ కవిత్వానికి అంకుర్పారణ జరిగింది. తుపాకి గొట్టం ద్వారా రాజ్యాధికారం, శ్రామిక వర్గ విముక్తికి సాయుధ పోరాటం, భూటకపు ఎన్నిక వ్యవస్థ నిర్మూలన చేసి సుస్థిర ప్రభుత్వ నిర్మాణం మొదలైన లక్షణాలతో 'విప్లవ కవిత్వం' నడిచింది.

1970 ఫిబ్రవరి 1, 2 తేదీల్లో శ్రీశ్రీ షష్ఠిపూర్తి సందర్భంగా విశాఖలో ఆయనకు పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లబ్ధ ప్రతిష్ఠులూ, ప్రఖ్యాత కవులు, సాహితీవేత్తలు ఉపన్యాసాలు చేస్తుండగా 'రచయితలకు విశాఖ విద్యార్థుల సవాల్' అంటూ ఒక కరపత్రం అందరి చేతుల్లోకి వచ్చి చేరింది. 'మీరు ప్రజల పక్షమా, పాలక పక్షమా' అని సూటిగా ప్రశ్నించింది ఈ కరపత్రం. రచయితల్ని, మేధావుల్ని ఆలోచింప చేసింది. సామాజిక సంఘర్షనలకూ, రాజకీయోద్యమాలకు, ప్రజా పోరాటాలకు సాహిత్యం దూరంగా తటస్థంగా ఉండ కూడదనే అభిప్రాయాన్ని కలుగజేసింది. 1970 జూలై 3 అర్ధరాత్రి, అనగా జూలై 4వ తేదీన శ్రీశ్రీ అధ్యక్షుడిగా విప్లవ రచయితల సంఘం (వి.ర.సం) ఆవిర్భవించింది. 1970 జూలై 10న శ్రీకాకుళం గిరిజన నాయకుడు వెంపటాపు సత్యాన్ని పోలీసులు కాల్చి హతమార్చారు. దీనికి శ్రీశ్రీ ''సాయుధ విప్లవ బీభత్సుని సారధినై / భారత కురుక్షేత్రంలో / నవయుగ భగవద్గీతా ఝంఝని ప్రసరిస్తాను / మంటల చేత మాట్లాడించి / రక్తం చేత రాగాలాపన చేయిస్తాను'' అంటూ 'వి.ర.సం' అధ్యక్షునిగా దీక్షను ప్రకటించాడు. 1970 అక్టోబరులో

వి.ర.సం ప్రథమ మహాసభలు ఖమ్మంలో జరిగాయి. శ్రీశ్రీ, రావిశాస్త్రి, కాళీపట్నం వంటి రచయితలంతా పాల్గొని సమగ్రమైన మానవ స్వాతంత్ర్యం కోసం విప్లవ సాహిత్యం జరిపే మహా ప్రస్థానమే తమ పోరాట మార్గమని నిర్దేశించుకున్నారు. 1980లో సాయుధ పోరాటం వైపు ప్రయాణంలో భాగంగా శ్రీశ్రీ 'మరో ప్రస్థానం' (విప్లవ కవితా సంపుటి) వెలువడింది. "ఊగరా ఊగరా ఊగరా / ఉరికొయ్య అందుకొని ఊగరా" అంటూ విప్లవవాదుల్ని ప్రోత్సాహపరిచాడు. "తెల్లవాడు నన్ను నాడు భగత్సింగు అన్నాడు / నల్లవాడు నువ్వు నేడు నక్సలైటునన్నాడు / ఎల్లవారు నిన్ను రేపు వేగుచుక్క అంటారు" అని విప్లవానికి ఊపునిచ్చాడు. భారతదేశానికి రాష్ట్రపతి కావడం కన్నా విరసానికి అధ్యక్షుడు కావడం గొప్ప అని అంటూ నా శాశ్వత చిరునామా వి.ర.సం అని ప్రకటించాడు.

ఉప సంహారం :

20వ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ. సాంప్రదాయ భావ కవిగా, అభ్యుదయ కవిగా, విప్లవ కవిగా, సినిమా కవిగా తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేశాడు. ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన శ్రీశ్రీ సాహిత్య ప్రభావం నుండి యువ కవులెవరూ తప్పించుకోలేకపోయారు. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించి, రక్షించే అపూర్వశక్తిగా" శ్రీశ్రీని చలం కీర్తించాడు. "భారత జాతికీ, ప్రపంచ సాహిత్యానికి శ్రీశ్రీ తెలుగు వారిచ్చిన వెలుగు కానుక", తెలుగు భాష ఉన్నంత కాలం శ్రీశ్రీ ఉంటాడని రావిశాస్త్రి శ్లాఘించాడు. ప్రపంచంలో పేదలు, కర్షకులు, కార్మికులు, శ్రామికులు, ధీనులు, బాధాసర్పదష్టులు ఉన్నంత కాలం శ్రీశ్రీ కవిత్వం బతికే ఉంటుంది.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. శ్రీశ్రీ కవిత్వం వస్తు సంవిధానం - డా॥ మిరియాల రామకృష్ణ
2. మహాకవి శ్రీశ్రీ - బూదరాజు రాధాకృష్ణ
3. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - వెల్చేరు నారాయణరావు
4. ఆధునికాంధ్ర కవిత్వం - సాంప్రదాయాలు ప్రయోగాలు - ఆచార్య సి. నారాయణరెడ్డి
5. ప్రభవ నుండి ప్రస్థానం - ఏటుకూరి ప్రసాద్
6.ఆధునికాంధ్ర కవితా వికాసం - డా॥ కడియాల రామమోహన్

❖❖❖

శ్రీశ్రీ కవితాదృష్టి - కవుల చర్చ

- కప్పల శ్రీరాములు
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం,
వారణాశి.

- కనుమల మునిస్వామి
పరిశోధక విద్యార్థి(యూజీసీ జేఆర్ఎఫ్), తెలుగు &
తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ
విశ్వవిద్యాలయం, అనంతపురము.

"1940 తర్వాత ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్య లోకాన్ని ఉత్తేజితం చేసిన అభ్యుదయ కవిత్వోద్యమ మూల విరాట్టు 'శ్రీశ్రీ'. భావకవిత్వానికి విరుద్ధంగా జెండా ఎత్తుటతోనే కాక, శ్రామిక వర్గచైతన్యం ఊపిరిగాగల ఒక సరికొత్త కవితారీతికి పాదులు వేసిన స్రష్ట, వాస్తవికతతో పాటు అధివాస్తవికతను, వ్యక్తి చైతన్యంతో పాటు సంఘచైతన్యంను సమానాధికారంతో ప్రవచించిన ప్రవక్త శ్రీశ్రీ." - అంటారు ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు, సినీ గేయ రచయిత డా॥ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) గారు.

మహాకవి శ్రీశ్రీ 30-04-1910 తేదిన విశాఖ పట్నంలో పూడిపెద్ది వెంకటరమణ, అప్పనకొండ దంపతులకు జన్మించారు. అనంతరం శ్రీరంగం వారి ఇంటికి దత్తతకు వెళ్ళాడు. అప్పుడే ఆయన ఇంటిపేరు శ్రీరంగంగా మారిపోయింది.

శ్రీశ్రీ రచనలు :

మహా ప్రస్థానం
మహా ప్రపంచం
మరో ప్రపంచం
ఖడ్గ సృష్టి
ప్రభవ
అనంతం (ఆత్మకథ-నవల)
సంపెంగ తోట
అమ్మా (అనువాద నాటికలు)
పాడవోయి భారతీయుడా (సినిమా పాటలు)
విశాలాంధ్రలో ప్రజా రాజ్యం
అగ్నిజ్వాల,ఉక్కు పిడికిలి (సినిమా పాటలు)

అయితే ఎన్ని రచనలు చేసినా, శ్రీశ్రీని మాత్రం మహాకవిగా నిలబెట్టింది మాత్రం మహాప్రస్థానమే. "మహాప్రస్థానం"లో శ్రీశ్రీ కొన్ని గేయాల్లో తన కవితా సిద్ధాంతాలను ప్రకటించాడు. "కవితా ఓ కవితా" అన్న కావ్య ఖండం శ్రీశ్రీ కవితా పరిణతిని ప్రకటించుచున్నది. ఈ కావ్య ఖండమును మూడు భాగాలుగా విభజింప వచ్చును. మొదటి భాగంలో శ్రీశ్రీకి సరస్వతీ సాక్షాత్కారం కలిగిన విధానం వర్ణించబడింది. రెండో భాగంలో శ్రీశ్రీ కవితా వస్తు రీతులు వర్ణించబడ్డాయి. మూడో భాగంలో సరస్వతీ కటాక్షం వల్ల శ్రీశ్రీ పొందిన అలౌకిక అనుభూతి వర్ణించబడింది.

మొదటగా శ్రీశ్రీ సరస్వతీ దేవిని "వినువీధుల్లో విహరించే అందని" అందముగా ఊహించెను. అనగా అప్పటి కవితా సరస్వతి కేవల సౌందర్య స్వరూపిణి. అట్టి ఆమె కొరకు తన బ్రతుకును ఒక తపస్సుగా శ్రీశ్రీ అంకితం చేసి, ఆమెను అన్వేషించాడు. కానీ "చటులాలం కారపు మటుమాయల నటనలలో" (నీ రూపం కనరానందున) కవితా సరస్వతి కానరాలేదు. అయినప్పటికీ ఈ మహాకవి ఆమె కొరకు ఒక్కడై స్రుక్కి స్రుక్కి కాలం గడిపాడు. తరువాత కవి కవితా సరస్వతి ప్రాబల్యము వలన నిశ్చల సమాధిని సాధింపగలిగెను. ఆ సమయంలో అతడు భయంకర తీవ్ర ధ్వనులను విన్నాడు. ఈ ధ్వనులన్నీ విప్లవ భావమునకు ప్రబల చిహ్నములు. వాటిని గురించిన భావన చేయగా అతనిలో స్పందన కలిగింది. తదనంతరం కవి తన్ను కదిలించిన దృశ్యములను చూచెను. ఆ దృశ్య వర్ణనాంతరము శ్రీశ్రీ

"నా విన్నవి కన్నవి విన్నవించగా
మాటలకై వెదుకాడగ బోతే
అవి
పుంఖాను పుంఖంగా
స్మశానాల వంటి నిఘంటువుల దాటి
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి
ఛందస్సుల సర్వపరిష్వంగం వదలి
వడిగా, వడివడిగా
వెలువడినై, పరుగిడినై, నా యెదనడుగిడినై"

అని వక్కాణించాడు. ఇట్లు చెప్పినప్పటికీ కవి నిఘంటు సహాయము కావలసిన మాటలను వాడక పోలేదు. లయబద్ధమైన ఛందస్సును స్వీకరింపకపోలేదు. పిద శ్రీశ్రీ తన అలౌకికానుభూతిని వర్ణించాడు. ఆ అనుభవము "క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం".

శ్రీశ్రీ "నవకవిత" అను గేయంలో విప్లవ చిహ్నాలు కవిత్వానికి కావలయునని వర్ణించి తుదకు

"కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేదీ
పెనునిద్దుర వదిలించేదీ
మును ముందుకు సాగించేదీ
పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ
కావాలోయ్ నవకవనానికి"

అని చాటెను. కవితా వస్తువు సమాజ పరిణామముతో పాటు మారుచూ నమాజమును ముందుకు నడిపించవలెనని, అది గేయ రూపమున వుండ తగుననియు నిద్రాణమైన జాతిని మేలుకొలిపి దానిని పరిపూర్ణ జీవనాభిముఖంగా కొనిపోవలయునని శ్రీశ్రీ అభిప్రాయం.

లోకమున కవితా మయములు కాని వస్తువులు లేవని శ్రీశ్రీ అభిప్రాయం.

కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా -
హీనంగా చూడకు దేన్నీ!
కవితా మయమేనోయ్ అన్నీ!
రొట్టెముక్కా, అరటి తొక్కా, బల్లచెక్కా -
నీ వేపే చూస్తూ వుంటాయ్!
తమ లోతు కనుక్కోమంటాయ్!
తలుపుగొళ్ళెం, హారతిపళ్ళెం, గుర్రపు కళ్ళెం -
కాదేదీ కవిత కనర్హం!
ఔనౌను శిల్ప మనర్హం!
ఉండాలోయ్ కవితావేశం!
కానీవోయ్ రస నిర్ధేశం!
దొరకదటోయ్ శోభాలేశం!
కళ్ళంటూ ఉంటే చూసి,
వాక్కుంటే వ్రాసీ!
ప్రపంచమొక పద్మవ్యూహం!
కవిత్వమొక తీరని దాహం!

కుక్కపిల్ల మొదలైనవి హీనములైనప్పటికీ, మహాకవి దానిని రసమయంగా వర్ణింపగలడని అతని సిద్ధాంతము. కవితావేశం కావ్య కారణమని, రసనిర్ధేశమునే కవి వాంఛింపవలయునని అతని తలంపు. శ్రీశ్రీ అభ్యుదయ కవితా పితామహుడు. కార్మిక, కర్షక ప్రతినిధియైన మహాకవి. కార్మిక కర్షకుల ఉపకరణాలు అతని నవీన గీతికి భావము, భాగ్యము, ప్రాణము, ప్రణవము. శ్రమజీవుల సమస్యలను వర్ణించుటయే కవి లక్ష్యం కావాలన్న తీవ్రవాది శ్రీశ్రీ

"కావున - లోకపుటన్యాయాలూ
కాల్చే ఆకలి, కూల్చే వేదన
దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ
పరిష్కరించే బహిష్కరించే
బాటలు తీస్తూ,
పాటలు వ్రాస్తూ,
నాలో కదిలే నవ్యకవిత్వం
కార్మిక లోకపు కల్యాణానికి
శ్రామిక లోకపు సౌభాగ్యానికి

సమర్పణంగా
సమర్చనంగా
త్రిలోకాలలో
త్రికాలాలలో
శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనే లేదని
కష్టజీవులకు
కర్మవీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ
స్వస్తి వాక్యములు సంధానిస్తూ
స్వర్ణవాద్యములు సంరావిస్తూ
వ్యథార్త జీవిత యదార్థ దృశ్యం
పునాదిగా ఇక జనించబోయే
భావి వేదముల జీవ నాదములు
జగత్తుకంతా చవులిస్తానోయ్"

అని అభ్యుదయ కవితా వైతాళికుడై శ్రీశ్రీ ప్రపంచానికి చాటాడు.

శ్రీశ్రీ విప్లవ కవి. వట్టించిన విస్తరివంటి జీవితాన్ని గడుపు ధనవంతులకు వ్యతిరేకంగా విప్లవం కొనసాగాలని అతని నిశ్చితాభిప్రాయం. ధనవంతులు - దరిద్రులు అనే రెండు తెగలు మాత్రమే శ్రీశ్రీకి సమాజంలో కనిపించాయి. జాతి, మత, కుల, భేదములతో అతనికి సంబంధం లేదు. ఇట్టివాడు కాబట్టే

మాకు గోడలు లేవు
గోడలను పగల గొట్టడమే మా పని
అలజడి మా జీవితం
ఆందోళన మా ఊపిరి
తిరుగుబాటు మా వేదాంతం"

అని నిర్భయంగా పేర్కొన్నాడు శ్రీశ్రీ. అంతేకాదు

"బండెడు చెత్తను ఛంద
శ్చండముగా పోగుచేసి స్వారస్యము చూ
డండని రంకెలు వేస్తే
చెండాడెద నట్టివారి సిరిసిరిమువ్వా!

ఇంకా

"శుష్కచ్ఛాందస కవిజన
ముష్కరులకు సొంటి పిక్క మూర్ధమ్మున కా
యుష్కర్మము, తదుపరి శో
చిష్కెశున కప్పగింత సిరిసిరిమువ్వా!

అని అంటూ, అ ఆ ఇఈ లు కూడా సరిగా రాని వారు కూడా మేము బ్రహ్మాలం, ఋషులం అని చెప్పుకుంటున్నారు. ఛీఛీ సిగ్గులేదా అని నిగ్గదీసి అడుగుతూ, కవులుగా ప్రచారాలు చేసుకుంటున్న కుకవులను అయన ఏకి పారేశాడు. మరికొంతమంది ఇమిటేషన్‌తో కవిత్వం రాస్తూ, సొంతంగా నాలుగు వాక్యాలు రాయడం చేతకాని వారు, మమ్మల్ని, మా కృతుల్ని పొగడండి అని అడుగుతుంటారు. అలాంటి వారు లోకంలో చాలామంది ఉన్నారని, కవిత్వం కోసం నిజంగా తపస్సు చేసిన వారిని పూజించాలని శ్రీశ్రీ తన కవితా దృష్టిలో పేర్కొన్నాడు.

ఆధార గ్రంథాలు :

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ
2. శ్రీశ్రీ సంసార ప్రస్థానం - సరోజా శ్రీశ్రీ
3. శ్రీశ్రీ కథలు అనువాద కథలు - చలసాని ప్రసాద్ (ప్రచురణ)
4. శ్రీశ్రీ సిప్రాలి - చలసాని ప్రసాద్ (ప్రచురణ)

❖❖❖

శ్రీశ్రీ ఆలోచనా ప్రసంగ ప్రస్థానం - దాని అవశ్యకత

-పొలపల్లి శ్రీకాంత్, సహాయ ఆచార్యులు, విశ్వవిద్యాలయ విద్యకళాశాల, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.

ఇరవయ్యవ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ చిన్న వయస్సులో రచనా వ్యాసంగం మొదలు పెట్టి "ఈ శతాబ్దం నాది" అని ప్రకటించుకున్న దమ్మున్న కవిగా పేరు తెచ్చుకున్న మహానుభావుడు శ్రీశ్రీ. తన కలంతో కార్మిక లోకాన్ని కదం తొక్కించాడు. ఆయన కవిత్వాలతో ఉద్యమాలకే ఊపిరి పోసిన మహాకవి శ్రీశ్రీ. సమాజం పట్ల ఉన్న దృక్పథాన్ని తనదైన శైలిలో సూటిగా వ్యాఖ్యానించారు శ్రీశ్రీ. కటిక పేదరికంలో మగ్గుతూ నిర్లక్ష్యానికి గురైన ఎంతోమంది దీనులను అభాగ్యులను ఉద్దేశించి శ్రీశ్రీ రచించిన కవిత్వం అద్భుతమని చెప్పాలి. "ఎవరు బాధపడొద్దు మంచి రోజులొస్తున్నాయి" అనే భావంతో ఎన్నెన్నో ఉదాహరణ లతో బడుగు బలహీనులకు ధైర్యాన్ని నూరిపోసేలా ఉన్న 'జగన్నాథ రథచక్రాలు' కవిత్వాన్ని రాశాడు శ్రీశ్రీ.

పతితులారా! భ్రష్టులారా!
బాధాసర్ప దష్టులారా! అంటూ మొదలుపెట్టి.....
బ్రదుకు కాలి, పనికిమాలి,
శని దేవత రథచక్రపు
టిరుసులలో పడి నలిగిన
దీనులార ! హీనులార !
కూడు లేని, గూడు లేని
పక్షులార ! భిక్షులార !

స్వాతంత్ర్యం, సమభావం,
సౌభ్రాత్రం, సౌహార్దం
పునాదులై ఇళ్లు లేచి,
జనావళికి శుభం పూచి
శాంతి, శాంతి, శాంతి, శాంతి
జగమంతా జయిస్తుంది,
ఈ స్వప్నం నిజమవుతుంది !
ఈ స్వర్గం ఋజువవుతుంది !
పతితులార ! భ్రష్టులార !
బాధాసర్పదష్టులార !
దగాపడిన తమ్ములార !
ఏడవకం డేడవకండి !
వస్తున్నాయి యొస్తున్నాయి
జగన్నాథ,జగన్నాథ,
జగన్నాథ రథచక్రాల్,
జగన్నాథుని రథచక్రాల్
రథచక్రాల్, రథచక్రాల్,
రథచక్రాల్, రథచక్రాల్,

రారండో! రండో! రండో! అంటూ జగన్నాథ రథ చక్రాలు మనముందుకు తెచ్చాడు శ్రీశ్రీ.

మొదట 1928 లో ప్రభవ కావ్య సంపుటి ప్రచు రించారు. ఈ సంపుటి సంప్రదాయపద్ధతిలో రాసినా తరువాత సంప్రదాయ ఛందస్సు గ్రాంథికాన్ని పక్కనపెట్టి వాడుకభాషలో కవిత్వాన్ని రాయడం ప్రారంభించాడు. శ్రీశ్రీ మహాకవి గా ప్రసిద్ధి చెందడం వెనక ఆరుద్ర గారి ప్రభావం ఎంతో ఉంది. అమెరికా రష్యా దేశాలకు చెందిన డెబ్భై మంది కవులకు చెందిన రచనల్ని కుడా తెలుగు పాఠకులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కారణంగా ప్రపంచ సాహిత్యంపై అవగాహన కల్గిన ప్రథమ కవిగా పేరు తెచ్చుకున్నాడు శ్రీశ్రీ.

1950 ప్రాంతంలో పూర్తిస్థాయిలో సినీ రంగప్రవేశం చేశారు. శ్రీశ్రీ మొదటగా ఆహుతి డబ్బింగ్ సినిమాకి మాటలు పాటలు రాయడంతో సినీ మాటల పాటల రచయితగా పేరు తెచ్చుకున్నారు. విప్లవ కవిగా ఛందోబద్ధ

కవిత్వాన్ని ధిక్కరించిన వాడిగా, అరసం అధ్యక్షుడిగా, విరసం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ఆయన సుప్రసిద్ధుడయ్యాడు.

పల్లెటూళ్లలో భజన చేసేముందు భాగవతం లోనిదే ఒక శ్లోకం పాడతారు. దాన్ని గమనించినట్లయితే 'నామ సంకీర్తనం యశ్య సర్వ పాప ప్రణాశనమ్ ప్రణామో దుఖఃశమనగా తం నమామి హరిం హరం' ఈ శ్లోకం చదవకుండా భజన చేయరు. నామసంకీర్తనం యశ్య సర్వ పాప ప్రణాశనమ్ అనగా ఈ హరినామ సంకీర్తనం అన్ని పాపాలను పోగొడుతుందని అర్థం. ప్రణామో దుఖఃశమనగా తం నమామి హరిం హరం అనగా ఏ హరికి మనము సాష్టాంగ నమస్కారం చేస్తే దుఃఖాలన్నీ మాయమైపోతాయో అటువంటి పరమాత్ముడైన హరికి నమస్కారం చేస్తున్నాని చెప్పి భజన మొదలు పెడతారు. పాప పుణ్యాలన్నీ మనసులోనుంచే పుడుతున్నాయి. మనస్సులోనే ఉంటున్నాయి . మనస్సులోనే నశిస్తాయి. సృష్టి భగవంతుడి నుండే ఏర్పడింది. భగవంతుడి వలనే కొనసాగుతుంది. భగవంతుడిలోకే లీనమైపోతుంది. దీనిని మనం అంగీకరించాలంటాడు.

ఎవ్వనిచే జనించు జగ; మెవ్వని లోపల నుండు లీనమై
యెవ్వని యందు డిందు; బరమేశ్వరుడెవ్వడు; మూలకారణం
బెవ్వ; డనాదిమధ్యలయుడెవ్వడు; నర్వము దానయైన వా
డెవ్వడు; వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్

ఈ పద్యాన్ని ప్రతి పాఠశాలలో ప్రార్థన లో పెడితే మొత్తం జాతి బాగుపడుతుందని మహాకవి శ్రీశ్రీ ప్రస్తావించడం గమనార్హం. కమ్యూనిస్టు కవిగా పేరుపొందిన శ్రీశ్రీ ఒక ఇంటర్యూలో 'ఎవ్వనిచే జనించు' పెట్టండి, లోకం బాగు పడుతుందని వారికీ 'భాగవతం' గురించి తెలుస్తుందని'' అభిప్రాయపడ్డాడు. శ్రీశ్రీ గారు ''కవిత్వం రాయాలనుందండి, పద్యాలూ రాయాల నుందండి'' అని ఎవరైనా అంటే వారికి ముందు 'భాగవతం' చదువు ఆ తరవాత రాద్ధువుగాని రాయక పోయినా నష్టమేమి లేదని భాగవతం చదవకపోతేనే నష్టమని 'ప్రజల ప్రశ్న జవాబుల శీర్షిక ' నిర్వహించిన శ్రీశ్రీ స్వయంగా అందులో చెప్పడం జరిగింది. నేను భాగవత పద్యాలతో ప్రేరణ పొందానని శంకరాచార్యుల వల్ల ప్రేరణ పొందానని చెప్పాడు. మీరు కూడా నాలా ప్రేరణ పొంది ముందుకుసాగాలని చెప్పాడు మహాకవి. భజగోవిందం భజగోవిందం అనే పాటకు బదులుగా ప్రజలను చైతన్య పర్చడానికి ''పదండి ముందుకు/పదండి తోసుకు /పోదాం పోదాం పైపైకి'' అన్నాడు. మొత్తం కవుల్ని వర్గాలుగా చేసి విడగొట్టి పారేశాం అని ఆవేదన వ్యక్తం జేశాడు. వైదిక ధర్మంలో అన్ని ఉన్నాయి. మనం వాటిని పాటిస్తే కదా! పుణ్య పాపాలు ఎక్కడినుండి వచ్చాయి? మనసులో ఉండే ఆలోచనలు అవి ఎలా అమలు జరుగుతున్నాయి? ఆలోచనల కారణంగా పుణ్య పాపాలు ఎలా పోతాయి? ఆలోచనలు పోతే పోతాయి.. ఆలోచనలు పోవాలంటే ఏం చేయాలి? అన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యామ్నాయ ఆలోచనలని పెట్టమని సూచించాడు. ఆలోచనలు లేకుండా ఉండలేము. కాబట్టి ప్రత్యామ్నాయ ఆలోచనలే మార్గమని లోకానికి తెలియ జేశాడు. నరకం.. నరకం.. అనే ఆలోచనల నుండి ఓం నమశ్శివాయ అని, నేను.. నాది.. అనే ఆలోచన నుండి నమోనారాయణ భగవన్నామ కీర్తన వల్ల పాపాలన్నీ పోతాయని, ఇదే తర్కం ఇదే హేతుబద్ధత అని చెప్పాడు. నిరంతర స్మరణలో ఉండేవాడు తప్పు చేయలేడు. భగవతాశక్తి అతన్ని తప్పు చేయనివ్వదు. ఎప్పుడు లోపలనుండి హెచ్చరిస్తుంది. 'ఆ నామం స్మరిస్తూ ఈ పని ఎందుకు చేస్తున్నావని ఒకవేళ అలవాటున్న మానేస్తాడని ' శ్రీశ్రీ ప్రజా శ్రేయస్సును కోరి విన్నవించి నటువంటి అంశము మనం చూస్తున్నాం.

ఇంకా ప్రపంచం బాధంతా నా బాధ అంటాడు శ్రీశ్రీ. అందుకే

దారి పక్కన కూర్చున్న ముసలిదొకతి / మూలుగుతున్న ముసురుతో
ఈగలతో వేగలేక / ముగ్గుబట్ట వంటితలా
ముడతలు బారిన దేహం/ కాంతి లేని గాజు కళ్ళు
తనకన్నా శవం నయం / ఆ అవ్వే మరణిస్తే
ఆ పాపం ఎవ్వరిదని / వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్ళి పోయింది'' అనే భయంకర కవిత్వం రాశాడు. శ్రీశ్రీ ఇటువంటివి మనకి ఓ పట్టాన అర్థం కావు. ఆయన రాసిన దాంట్లో నిగూఢార్థంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. శ్రీశ్రీ అనగానే ఆయన కమ్యూనిష్టని, నాస్తికుడని సాగదీస్తారు . దాని వల్ల ఏం ప్రయోజనం? అతడు మానవతావాది. దారి పక్కన కూర్చున్న ముసలి దాని గూర్చి మాట్లాడాడు. కానీ మనం మూలుగుతున్న నోట్ల కట్టల గురించి మాట్లాడుతూ ఉంటాం. వాటి గురించే పూజలు చేస్తాం. వాటి కోసమే దేవతలని ఆశ్రయిస్తాం. కానీ మనకంటే శ్రీశ్రీ గొప్పవాడు, మహాను భావుడు. బక్కచిక్కి ఎండిపోతున్న మనుషుల గూర్చి ఎవరైతే మాట్లాడాడో అతనే మానవుడు.. అతడే దేవుడు. అంగాంగ వర్ణనలు చేసేవాళ్ళు కాదండి. కవులంటే ప్రపంచ బాధే నా బాధ అని ఎండిపోయిన డొక్కల గురించి ఆలోచించిన మహానుభావుడు మన శ్రీశ్రీ. అందుకే నేను శ్రీశ్రీని ప్రేమిస్తాను.. అభిమానిస్తాను.. విశ్వనాథ సత్య నారాయణ ను ఎంత ప్రేమిస్తానో శ్రీశ్రీ ని కూడా అంతే ప్రేమిస్తాను. సంప్రదాయంలో ఉండే పరిమళాన్ని సుగంధాన్ని నా జాతికి అర్థం చేయించినవాడు విశ్వనాథ ఐతే ఆ సంప్రదాయం ఆధునికంగా ఎలా ఉప యోగపడ్తుందో తెలుపుతూ బడుగు బలహీన వర్గాల వారున్నారు, డొక్కలు ఎండి పోయిన వారున్నారు, రెక్కాడితే కానీ డొక్కాడనివారున్నారు కాస్త ఆలోచిం చండని ఒక సందేశమిచ్చిన మహానుభావుడు శ్రీశ్రీ.

మహాప్రస్థానం ఆయన రచించిన కావ్యాల్లో ప్రసిద్ధ మైంది అని చెప్పవచ్చు. 1934 లో వచ్చిన మహాప్రస్థానం అనగా సుదీర్ఘ ప్రయాణం అని అర్థం. ఈ పదం మహాభారతంలో ఉంది. దీంట్లో కురుక్షేత్ర సంగ్రామం అయిపోయిన తరవాత పాండవులు ఈ ధరణి నుండి స్వర్గానికి చేసిన ఒకానొక సుదీర్ఘమైన ప్రయాణానికి ఈ మహాప్రస్థానం అని పేరు. దీన్ని శ్రీశ్రీ గారు కమ్యూనిస్టు సిద్ధాంతంలో వాడడం జరిగింది. ఇతని ఉద్దేశం ఏంటంటే పీడితులారా... మీరుకూడా సుదీర్ఘ ప్రస్థానం చేయడానికే ఈ రచనా వ్యాసంగం చేస్తున్నాని చెప్తూ ''మనది ఒక బ్రతుకేనా'' అంటూ తన మహాప్రస్థానం లో విమర్శనాస్త్రం గుప్పించాడు. తన భావాలు ఎప్పటికైనా ప్రపంచమంతా చిరుజల్లుల్లా పడతాయనీ కనీసం అప్పుడైనా సమాజంలో మార్పు వస్తుందని ముందుచూపుతో ఆలోచించి సమాజాన్ని ప్రశ్నించి తెలుసుకునే విధంగా చేసిన మహానుభావుడికి జోహార్లు.

❖❖❖

ఆయన కవిత్వం... ఆయన వ్యక్తిత్వం

– డా॥. ఖి. శ్రీనివాసరావు, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆముదాలవలస.

"మంటల చేత మాట్లాడించి
రక్తం చేత రాగాలాపన చేయిస్తాను"

- శ్రీశ్రీ

"కనీసం వేయి సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో కవితను ఇలా నిర్వచించి, ఇంత కవితాత్మంగా వర్ణించి, ఇంత అద్భుత సృష్టి చేసిన మరో కవి లేనేలేడు. ఇదే అతన్ని సాహితీ శిఖరాగ్రాన నిలిపింది" అనే బూదరాజు రాధాకృష్ణ గారి వ్యాఖ్యానం 'మరో ప్రస్థానం' చదివిన వారికి అక్షరసత్యమనిపిస్తుంది. కవిత రాయటం ఇంత క్లిష్టతరమని చటుక్కున స్ఫురింపజేస్తూనే 'ఇదేనా కవిత్వమంటే' అనే మెరుపు ఆలోచన కలిగించటం శ్రీరంగంశ్రీనివాసరావు గారి ప్రత్యేకత. కవిత్వం ఆయన వ్యక్తిత్వం. ఎన్నో మెరుపులు, మరెన్నో చమక్కులు, శైలి, శిల్పం వంటి వాటిని పట్టించుకోనితనం. అయినా వాటితోనే అద్భుతకవితా శిల్పాలను సృజియించిన గొప్ప దార్శనిక కవి శ్రీశ్రీ. శ్రీశ్రీ వ్యక్తిత్వంలో ఎన్నో విరుద్ధమైన భావాలు, చిత్ర, విచిత్రమైన సంఘర్షణలు కనిపిస్తాయి. ఒక విధమైన అస్థిరత ఆయనను గొప్పగా మలిచిందనే వారున్నారు. వివాదాలు, నినాదాలు ఆయన మార్కుగా మారిపోయాయి. సంపద, సంసారం వంటివి ఆయనకు స్థిరత్వాన్ని ఇవ్వలేకపోయాయి. బూదరాజు వారు శ్రీశ్రీ వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తూ "శ్రీశ్రీతో ఏ కొంతకాలమైన పరచయం గల వారెవరైనా అతడు వయిసొచ్చిన పసి వాడని, ఆమాయకుడైనా చురుకైనవాడనీ, అహంకారి అయినా తలవంచుతాడని, విచారణశీలి అయినా తప్పించుకు తిరుగుతాడని, ఆకర్షకుడైనా ఏడిపించనూ గలడనీ అంగీకరిస్తారు. అతడు క్రమశిక్షణకు లొంగడు. విపరీతాలోచనా ధోరణిలో దాపరికంలేని వాడని అంటారు. అతని 'అనంతం' పాఠకులకు మింగడు పడని వ్యక్తిత్వ పొత్తం. అయినా విలువయిన సమాచారం. ఇన్ని కలిసినా ఆకర్షణ తగ్గని అంతరంగ వ్యక్తిత్వం అతని స్వంతం.

"ఉయ్యాల లాగుతున్న వారికి ఉలుపాలు చూపించింది మన సాహిత్యం. కానీ విట్టు పవాసాలు చేస్తుండిన వాడి వెన్నుతట్టి, ఒక్క ముక్క యివ్వలేకపోయింది" అనే అవిశెట్టి మాటలు, అంతరం శ్రీశ్రీ కవిత్వం ఆదిశగా కాకుండా ఓ క్రొత్త మార్గంలో పయినించింది. "నేటి సామాజిక వ్యవస్థలోని వర్గ బేధాలను శాస్త్ర దృష్టితో పరిశీలించి, ఒక వ్యక్తిని మరో వక్తిని, ఒక దేశం మరో దేశాన్ని దోపిడి చేస్తున్న విధానాన్ని ఖండిస్తూ సర్వతోముఖ సాంఘిక జీవితాభివృద్ధి, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, శాంతి, అభ్యుదయాలకు అవకాశం కలిగే మార్గాన్ననసురిస్తూ అలాంటి సామాజిక వ్యవస్థ కోసం పాటుపడుతుంది' అంటారు చదలవాడ పిచ్చయ. అభ్యుదయ కవిత్వపు చిరునామాను ప్రస్తావిస్తూ, బహుశా ఇటువంటి భావాలే శ్రీశ్రీ వ్యక్తిత్వ అమరికకు వేదికలయినాయనేది సాహితీవేత్తల భావన. కలల్లో సహితం కణకణ మండే నిప్పుకణాలను దర్శించడం శ్రీశ్రీకి మాత్రమే సాధ్యం.

'కనబడలేదా మరో ప్రపంచపు/అగ్ని కిరీటపు ధగధగలు/ఎర్రబావుటా నిగనిగలు/హోమ జ్వాలల భుగ భుగలు' అంటారాయన. "ఘోషించాను/మంచిగా ఉండడర్రా అంటూ/గోలపెట్టాను/అమాయకులజోలికి పోకండర్రా అంటూ/" అని అరిచినా వినని సమాజానికి హెచ్చరికగా 'సాయుధ విప్లవ భీభత్సుని సారథినై/భారత కురుక్షేత్రంలో/నవయుగ భగవద్గీతా ఝంఝని ప్రసరిస్తాను' ఆ విధంగా సాహిత్యంలో 'ఈ శతాబ్దంనాదని' గర్జించారు.

'మరో ప్రస్థానం'లో శ్రీశ్రీ అనుసరించిన మార్గం

అడుగడుగునా మనకి కనిసిస్తుంది. విప్లవోద్యమం, విప్లవ సాహిత్య ఉద్యమం కళ్ళకి కట్టినట్లు దర్శింపజేసారు. తనకితాను ఆవిష్కరింపజేసుకున్నారు. ఆయన శ్వాస విప్లవపథం, ఆయన గమనం, గమ్యం సాహిత్య విప్లవం 'దొంగనోట్ల దొంగవోట్ల/రాజ్యం ఒక రాజ్యమా?/లంచ గొండి వెధవలిచ్చు/సాక్ష్యం ఒక సాక్ష్యమా' సమాజంలోని ఓ అవినీతిచ్ఛాయ యొక్క 'విపరీతం'ను స్వయంగా అనుభూతి చెందకపోతే ఇంత తీవ్రమైన పదజాలంతో ధ్వజమెత్తడం సాధ్యం కాదు. శ్రీశ్రీ కవిత్వంలో పోరాటాలు ఉద్యమాలు వడుగూ, పేకలాగా కలిసిపోతాయి. జీవితానికి, సామాన్యజనానికి కవిత్వం, కవులు అలీనంగా ఉండాలనీ, అతీతంగా ఉండానుకొనేవారికి 'మరో ప్రస్థానం'లోని శ్రీశ్రీ వ్యక్తిత్వం నచ్చదు. తాను చూసిన సమాజ ఆర్థిక అసమానతలు నడుమ 'పేద' జనానికి పెద్ద పండుగలుండవని శ్రీశ్రీ తన కవితలో 'ఉండడానికి గూడు లేకా/పండడానికి నీడ లేకా/ఎండావానల దేబిరించే/హీనజనులకు పేదనరులకు/పండగొకటా? పబ్బమొకటా?/పెద్ద పండగ శుద్ధ దండగ' అని ఆక్రోశిస్తారు. ఇంకో కవితలో తనలో ఆక్రోషాన్ని ప్రకటిస్తూ, తన నైజంను ప్రస్ఫుటం చేస్తారాయన "కన్నీళ్ళు కడుపుతో వుండి/నత్తుల్ని ప్రసరిస్తున్నాయి/ఇవాళ కత్తులన్నీ కడుపులో దించుకొని/కన్నీళ్ళు ప్రసరిస్తున్నాయి' భాషాపద చిత్రాల వెనక విషాదాంతమైన వర్తమానంలోని 'విప్లవాగ్నులును కూడా' గుర్తించకుంటే మనమంతా ఉండేది సమాజా? శ్మశానమా అనే ప్రశ్నలేవక తప్పదు. శ్రీశ్రీ పైన ఆంగ్ల సాహిత్య ప్రభావం ఎక్కువ. ప్రారంభంలో ఆయన సంప్రదాయ వ్యాకరణవేత్తల వలే 'పద్యకవిగా'నే సాహితీ ప్రపంచానికి పరిచయం. కానీ... సమాజ తీరు, వ్యక్తుల బేజారు వంటివి ఆయనలో మార్పుకు నాంది వాచకాలయినాయి. 'విరసం' పరిచయం, గిడుగు, గురజాడల వ్యవహారికా భాషా ఉద్యమ ప్రభావం వంటివి 'తన గమ్యాన్ని, లక్ష్యాన్ని నిర్దేశించాయంటారాయన విద్యుత్తులు ప్రవహించే నీ నరాల్లో/విప్లవం శాలువా అల్లినవాడా/ తెల్ల భయాన్ని కెదురుగుండా/ఎర్ర భీభత్సం జల్లినవాడా ('తెల్ల భయాన్ని' ఇంగ్లీష్‌లో 'వైట్ టెర్రర్' అంటారు) అని తన అస్తిత్వాన్ని తెలియజేసుకొన్న కవి శ్రీశ్రీ. తన గురించి తానే 'మట్టిపులి' కవితలో 'మనిషిగా పుట్టడం సులభమే కానీ/కవిగా బతకడం ఎంత కష్టం/ అబద్ధానికి భయపడే నాకు/నిజమంటే ఎంత ఇష్టం' అని రాసుకున్నారు. వెంటనే.... 'అందుకే నిజం చెబుతున్నాను/ ఇది రాస్తున్నప్పుడు నేను తాగలేదు/పెసరట్టూ బ్రాందీ కోసం కాదు/ అని నిజం చెబుతారు. నిజాలకు, ఇజాలకు లొంగని శ్రీశ్రీ తను చేరిన సంస్థలతోనూ పేచిపడ్డారు. ఆయన వ్యక్తిత్వమది. సత్యం కోసం ప్రజల కోసం చేసే పోరులో మార్గాలు వేరని ఆయన నమ్ముతారు. కానీ... నిజంగా ప్రజలకు మేలు జరగాలని కోరుకొనే సంస్థలతో ఆయనకు పేచీ లేదు. ప్రజలు... పార్టీలు... సిద్ధాంతాలు వేరు వేరయినా పోరు ఒక్కటే అనే వాటిపైనే ఆయన అలక, పోరు, అందరూ ప్రజలే అంటారు. వారి సంక్షేమమే ప్రథానమంటారు. మరి ప్రజల చెంతకు ఎందకు సంక్షేమం చేరటం లేదు. పోరు పంథాలో నష్టపోతున్నది ఎవరు? ప్రయోజనాలను సిద్ధించుకుంటున్నదెవరు? అందుకే శ్రీశ్రీ 'మీ దారిని మీరు పొండి/నా దారి నాకు వదిలి/మీరట ప్రజలంటారు/నేను ప్రజలంటాను/మీ ప్రజకూ నా ప్రజకూ/పొంతన కుదరదులెండి'. అ 'ప్రజ' విభజన వెనుక గల కారణాలు సాహితీ ప్రపంచానికి తెలుసునని శ్రీశ్రీకి తెలుసు.

విప్లవం గురించిన ఆయన అభిప్రాయం ఒక్కమాటలో చెప్పాలంటే 'ఒక జీవితాన్ని మరో జీవితానికి పెనవేస్తూ/ వస్తోంది వస్తోంది విప్లవం' శ్రీశ్రీ తనని తానే నమ్ముకోవాలని విశ్వసించాడు, శ్వాసించాడు. ఎవరు ఎవరికి సహాయం రారని, ఎవరి పోరాటంలో వారికి కావలసినవి సాధించుకోవటం ఉంటుందని చెబుతారు. కాదనలేని వాస్తవమే అయినా... వ్యక్తీ పోరు కన్నా వ్యవస్థాగత శక్తిపోరు మిన్న అనేది ఓ నినాదం. ఏది ఏమైనా మన చేతులే

మన ఆయుధాలు అయినప్పుడు మనకెందుకు సహాయం, సైన్యం. శ్రీశ్రీ ఓ కవితలో 'నమ్ముదాం మన కండల సత్తువని/గుండెల నిబ్బరాన్ని/మనకే సైన్య సహాయమూ వద్దు మనమే ఇక సైన్యంగా మారిపోదాం' అంటారు.

'మహాప్రస్థానం'కి చలం ఇచ్చిన యోగ్యతా పత్రంలో 'దేవుడు, అధికారాలు, పాతర్లు, సౌఖ్యాలు, నీతులు, స్వర్గం, మర్యాదలు మూటగట్టుకొని కులికే మీకు అర్ధం కానీ బాధ, మరణం, దరిద్రం, అవిశ్వాసం, అశాంతి ఇవన్నీ అర్ధం కాక గట్టిగా సృష్టినే ప్రశ్నిస్తున్న యువకుల లక్ష కంఠాల్ని ఏకం చేసి పలుకుతున్నాడు శ్రీశ్రీ' అని రాసారు. మాములు మాటలకు ప్రాణం పోసి బరువు లేని బలంతో మరుగులేని స్వచ్ఛతతో, ప్రతీ ఊహ మనస్సును గట్టిగా పట్టుకుంటుంది. అగ్గిపుల్లనో, అరటి తొక్కనో, హారతి పళ్ళాన్నో... దేనినైనా సరే కవితామయంగా చెప్పగల సాహితీ వ్యక్తిత్వం శ్రీశ్రీకి మాత్రమే స్వంతం.

ఆధార గ్రంథాలు :

- మహాప్రస్థానం, మరో ప్రస్థానం - శ్రీశ్రీ - విశాలాంధ్ర ప్రచురణలు - 2009
- శ్రీశ్రీ సన్మాన సంచిక - కొత్త కవిత్వం - 1970
- అభ్యుదయ విప్లవ కవిత్వాలు సిద్ధాంతాలు, శిల్పరీతులు - డా॥ అద్దెపల్లి రామ్మోహనరావు - 1999

❖❖❖

ముగ్ధ, నిర్మల మానవతా గీతి – శ్రీశ్రీ శైశవ గీతి

– డా॥. పట్టపు శివకుమార్, తెలుగు ఉపన్యాసకుడు, శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల, తి.తి.దే., తిరుపతి.

ఆధునికాంధ్ర సాహిత్యంలో శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) ఒక అభ్యుదయ శిఖరం. తెలుగు కవిత్వాన్ని జాతీయ అంతర్జాతీయ వేదికల మీద ప్రతిష్ఠించి ప్రఖ్యాతి గాంచిన మహాకవి శ్రీశ్రీ 1910లో విశాఖపట్టణంలోని పుట్టి 15.6.82 తేదీన మద్రాసులో అస్తమించాడు. శతాబ్దాల తెలుగు కవిత్వాన్ని గురజాడ అప్పారావు ఆస్థానాల నుంచీ, అంతఃపురాల నుంచి విముక్తి చేయగా, శ్రీశ్రీ దానిని సామాన్య ప్రజాజీవితమనే అగ్ని సరస్సులో ముంచి పవిత్రీకరించాడు. శ్రీశ్రీ తెలుగు కవితను తనదైన శైలిలో ఆధునికం చేశాడు. అదే సమయంలో దానిని అభ్యుదయీకరించాడు, విప్లవీకరించాడు కూడ. అయితే శ్రీశ్రీ కవితామార్గంలో ప్రవేశించి కలం పట్టిన కాలంలో భావ కవిత్వం అంతిమయాత్ర చేస్తోంది. ఆనాటికి యువ కవియైన శ్రీశ్రీ భావ కవిత్వలక్షణాల్లోనే అనేక భావకవితల్నీ, ఖండ కావ్యాల్ని రాశాడు. శ్రీశ్రీ తొలి కవితా సంకలనం 'ప్రభవ' (1928) కూడా భావకవితా సంకలనమే.

1980 ప్రాంతాలలో జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల్లో అనేక తీవ్రమైన మార్పులు వచ్చాయి. మొదటి ప్రపంచ యుద్ధ ప్రభావంతో ప్రపంచంలో పాతశక్తులు పతనమై నూతనశక్తులు ఆవిర్భవించడం జరిగింది. సోవియట్ రష్యాలో సోషలిస్టు విప్లవ విజయం ప్రపంచ చరిత్రలో నూతన శకాన్ని ఆవిష్కరించింది. పెట్టుబడిదారీ దేశాల్లో ఆకలి, నిరుద్యోగం, నిరాశా నిస్పృహలు విలయ తాండవం చేశాయి. ఈకాలంలోనే భారత దేశంలో జాతీయోద్యమం ఉధృతంగా కొనసాగుతోంది. అప్పుడప్పుడే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భారత ప్రజానీకం చైతన్యం పొందుతున్నారు. ఈ జాతీయ అంతర్జాతీయ పరిస్థితుల ప్రేరణతో శ్రీశ్రీ "మరో ప్రపంచం, మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది" అంటూ మహాప్రస్థాన గీతంతో అగ్నిజ్వాలల్ని మండించాడు. ప్రపంచం లోని కార్మికుల, కర్షకుల, ఇతర పీడిత జనాల ప్రళయఘోషని శ్రీశ్రీ మహాప్రస్థాన గీతాల్లో అనువదించాడు.

ఆధునిక తెలుగు కవిత్వ చరిత్ర 'మహాప్రస్థానం'తో మలుపు తిరిగింది. శ్రామిక వర్గపు పక్షపాతం, సామాజిక వాస్తవికత, భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేకత అనే ఆశయాలతో ఆవిర్భవించిన అభ్యుదయ రచయితల సంఘానికి శ్రీశ్రీ నాయకత్వం వహించి, సాహిత్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకుపోవడమనే మహత్తర కర్తవ్యాన్ని స్వయంగా నిర్వహించాడు. మహాప్రస్థానంలో ప్రపంచ ప్రజల్ని ఉద్దేశించి వీరావేశంతో రాసిన శ్రీశ్రీ, ఆంధ్రజాతి సమస్యల్లో ఉత్తేజితుడై నిర్దిష్టంగా రాసిన కవితా సంకలనమే ఖడ్గసృష్టి. 1966 ప్రాంతాలలో అభ్యుదయ సాహిత్య ఉద్యమం అనేక కారణాల వల్ల నీరసం అయిపోయి, 1970లో నక్సల్‌బరీ రైతాంగ పోరాటంతో ప్రేరణ పొందిన విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించింది. శ్రీశ్రీ విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షుడై రక్తంతో రాగాలాపన చేశాడు. ఆ సమయంలోనే శ్రీశ్రీ రచించిన విప్లవ కవితా సంకలనమే 'మరో ప్రస్థానం'. అభ్యుదయ మార్గంలో కవితా రచన చేయడానికి గల నేపథ్యాన్ని గురించి శ్రీశ్రీ తన 'మహాప్రస్థానం' ముందుమాటలో ఈవిధంగా చెప్పుకున్నారు.

"ఒకటి మాత్రం నిశ్చయం. 1933లో "నేను సైతం ప్రపంచాగ్నికి" ఇత్యాది గీతంతో ప్రారంభించి కడసారిగా గ్రాంధిక శైలికీ, గణబద్ధ ఛందస్సులకీ గుడ్బై కొట్టేశాను ఇదే గురజాడ అడుగుతాడు. అంతవరకు సుమారు వెయ్యేళ్లు అవ్యాహతంగా సాగుతూ నలిగిన క్లాసికల్ బండిదారి నుంచి గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్త మలుపు ఇచ్చాడు. రధాలూ, పల్లకీలూ, గుర్రబ్బర్లూ వెళ్లేదారిని తప్పించి, మోటార్లూ, రైలుబళ్లూ తిరిగే ఆధునిక

యుగానికి తెలుగు కవిత్వాన్ని మళ్లించాడు. గురజాడ చూపించిన మలుపును నేను మహాప్రస్థాన గీతాలతో మరింత వెడల్పు చేశాను.

ఇది టెక్నిక్కు సంబంధించింది. గ్రాంధికంలో రాసే వృత్తాలు రధాల్లాంటివి. పల్లకీల్లాంటివి. గురజాడ వాడుక భాషలో రాయమన్నాడు. మాత్రా ఛందస్సులను వాడమన్నాడు. నేనందుకే ఉత్సాహం, ఉద్రేకంతో ఉద్యమించాను. ఇక విషయంలోకి వస్తే, అందమైన అబద్ధాలలో కన్నా, నిష్ఠురమైన నిజంలోనే మంచి కవిత్వం దర్శనీయమవుతుందని విశ్వసించాను. దీనితో మహా ప్రస్థాన గీతాలలో సామాజిక వాస్తవికతకు దర్పణం పట్టడం జరిగింది. దీని తర్వాతి మెట్టు సామ్యవాద వాస్తవికత. దీన్నింకా మనం అందుకోలేదు. అందుకోకుండా పెట్టుబడి దారీ గుంటనక్కలు పెద్ద పెద్ద కుట్ర చేస్తున్నాయి. అందుకు మద్దత్తుగా సాహిత్యంలో క్లాసిజం నిలబడింది...

"మహా ప్రస్థానం"లో నేను చేసిందంతా సామాజిక రుగ్మతను నిదానించడం మాత్రమే. "ఇదీ మన ప్రపంచం! ఇలా ఉన్నారు ఇచ్చటి ప్రజలు!" అన్నాన్నేను. ఇది సరైన రోగ నిదానమే కాని ఇంతటితో ఆగిపోకూడదు. జబ్బులకు తగ్గ మందు వెదకాలి. పైపై పూతలతో ఈ జబ్బులు కుదరవు కావలిసింది శస్త్రచికిత్స. దాన్నే "విప్లవం" అంటున్నాను.

"మహాప్రస్థానంలో అభ్యుదయ కవిత్వమూ, విప్లవ బీజాలూ ఉన్నాయి. విప్లవ సాహిత్యం లేదు. "విప్లవ సాహిత్యం" అంటే ఏమిటి? సామాన్య ప్రజానీకాన్ని విప్లవాచరణ కుద్యుక్తుల్ని చేసే విధంగా సాగేదే ఇదీ నామాట." (మహాప్రస్థానం. 5, 2004)

శ్రీశ్రీ కేవలం కవి మాత్రమే కాదు. సాహిత్య విమర్శకుడు, నాటక కర్త, కథా రచయిత కూడ. శ్రీశ్రీ వ్యాసాలు, వ్యాసక్రీడలు - శ్రీశ్రీ సాహిత్య విమర్శ గ్రంథాలు. 'చరమరాత్రి' అనేది ఆయన రచించిన కథల సంపుటి. 'చతురస్రం' అనేది నాటికల సంపుటి. అంతే కాకుండా శ్రీశ్రీ ప్రపంచ సాహిత్యంలో అమూల్యమైన అనేక ఆధునిక కవితల్ని తెలుగు లోనికి అనువదించాడు. 'మయకోవస్కీ' రాసిన 'లెనిన్' కావ్యాన్ని శ్రీశ్రీ తెలుగు లోకి అనువదించాడు. ప్రయోగాల్నీ, ప్రయోజనాన్నీ, సృజనాత్మకంగా మిశ్రమం చేసి ఆధునికాంధ్ర కవిత్వానికి అంతర్జాతీయ గౌరవాన్ని సాధించిన మహాకవి శ్రీశ్రీ.

శైశవ గీతి - రచనా నేపథ్యం :

ప్రసిద్ధ కమ్యూనిస్ట్ మేధావి, రచయిత అయిన కారల్ మార్క్స్ 'Eternal Charm' అని శైశవమును గూర్చి పేర్కొన్నాడు. దానిని ఆధారంగా గ్రహించి శ్రీశ్రీ "శైశవ గీతి" అనే ఈ మహత్తర గీతం గానం చేశాడు.

శైశవ గీతి - వస్తువు :

పసి పాపలు పాపపుణ్యాలు, లోకం పోకడ, కష్ట సుఖాలు, పురుషార్థాలు ఏమీ తెలియని పరమాత్మ స్వరూపులు. మెరుపు మెరిసినా, వాన కురిసినా, ఆకాశంలో హరివిల్లు విరిసినా అవి తమవే అని భావించి ఆడు కుంటారు. గమ్యమంటూ ఏదీ లేకపోయినా, ఈలలు వేసుకుంటూ అనేక దిక్కులలో పరుగెడుతుంటారు. గరిక పచ్చ మైదానాలలో, తామరలు పూచిన తటాకాల్లో, పంటచేలల్లో, బొమ్మరిళ్ళల్లో, నాన్న ఒడిలో, తల్లి కౌగిటిలో, మన శరీరాలతో, చెదరిన వెండ్రుకలతో, నోళ్ళల్లో వేళ్లుంచుకొని పసి పాపలు అంతటా విశ్వ రూపంతో సాక్షాత్కరిస్తుంటారు.

అందుకే ఈ లోకం వారిది. వారే ఈ లోకపు భాగ్య విధాతలు. వారి నవ్వులలో కాంతులు కనిపిస్తాయి. రానున్న దినముల ఉదయ కాంతులు వసంత ఋతు సౌందర్యము, నిప్పులు చెరగే గ్రీష్మం, ఏళ్ళను, బయళ్ళను, బీళ్ళను ఏకం చేసే వర్షాకాలాలు, పండునెన్నెల కాంతులు వ్యాపింపజేసే శరత్కాలం, మంచు కురిసే హేమంతం, చలితో గజగజలాడించే శిశిరం పసిపాపల కోసం దాగుడుమూతలు ఆడుతూ వస్తూపోతూ వుంటాయి. ఎప్పుడూ సూర్యకిరణం ఆకాశం వుంటుంది. గాలులు వీస్తూ పువ్వులు పూస్తూ వుంటాయి. కవికి కనిపించే పలు రంగుల కాంతులకు, వినిపించే దివ్యనాదాలకు పసిపాపలు కూడ వారసులే. ఈవిధంగా 'శైశవ గీతి' లోని

కవితా వస్తువును గురించి చెప్పుకోవచ్చు.

ముగ్ధ, నిర్మల మానవగీతి - శ్రీశ్రీ శైశవగీతి :

పసిబిడ్డల్ని ప్రేమించగలగడం మనిషిలోని మానవత్వానికి నిదర్శనం. పసిపిల్లల్ని చూసి ఆనందించలేనివాడు పశువు కంటే కనాకష్టం. మానవ జీవితంలో స్వార్థం, కల్మషం లేని సహజ ముగ్ధ సౌందర్య దశ శైశవదశ అని చెప్పవచ్చు. అందుకే పసి పిల్లల్లో ''శాశ్వతాకర్షణ'' అనేది ఉంటుంది. మానసిక రోగగ్రస్తులు తప్ప ఈ ఆకర్షణ నుండి ఎవరూ తప్పించుకోలేరు. సాధారణంగా పెద్దలు తాము దాటి వచ్చిన బాల్యాన్ని శిశువుల్లో చూసి ఆనందిస్తారు. శిశువుల సమక్షంలో పెద్దలు కూడా స్వచ్ఛ మానవులుగా ప్రవర్తిస్తారు. సమస్యల వలయంలో, కఠోర జీవన సత్యాల సుడిగుండంలో చిక్కుకున్న మనుషులు బాల్యాన్ని స్మరించి సాంత్వన పొందుతుంటారు. నిజానికి తెలుగు కవిత్వమంతా యౌవన కవిత్వం అని చెప్పవచ్చు. అది సద్యోయౌవన కవిత్వం. భాగవతంలో బాలకృష్ణుడు వర్ణింపబడినా అది సహజ బాల్య వర్ణన కాదు. అక్కడ కృష్ణుడు అద్భుత శిశువు. ఆధునిక సాహిత్యంలో బాల సాహిత్యం పేరుతో అద్భుత జానపద కథలూ, వ్యాసాలు సమృద్ధిగా వచ్చాయి. కాని ఒక మహోద్రేకంతో స్వచ్ఛ నిర్మల హృదయంతో శైశవావస్థను గానం చేసింది శ్రీశ్రీ 'శైశవ గీతి' మాత్రమే. ఈ కవితలో మానవజాతి శిశుదశను శ్రీశ్రీ నిర్మల మానవత్వంలో ఆవిష్కరించారు.

శ్రీశ్రీ 'శైశవ గీతి'ని 1934లో రాశాడు. అంటే తన నిండు యౌవనంలో శ్రీశ్రీ శైశవ గీతిని గానం చేశాడు. ఆశాంతి, ఏకాంతం, జీవితంలో పోరాటం చేస్తున్న దశలో శ్రీశ్రీ గత శైశవ రాగ మాలికల ప్రతిధ్వనుల కోసం తపించి శైశవగీతిని ఆలపించాడు. మచ్చలేని అద్దం వంటి శిశు జీవితంలో ఆమాయకమైన సహజ స్వేచ్ఛని హృదయంతో వర్ణించాడు. పాపం, పుణ్యం, కష్టం, సుఖం వంటి ద్వంద్వాలు ఏవీ పిల్లలకు తెలియవు. ఇవి పరిణత సామాజిక మానవునికి లభించేవి. పెద్దలు పాపపుణ్యాల మధ్య, కష్టసుఖాల మధ్య స్వేచ్ఛగా సూటిగా మాట్లాడలేని పరిస్థితుల మధ్య కూరుకొనిపోయి మానవతకు దూరమయిపోతారు. పిల్లలకు ఈ సమస్యలు ఏమీ లేవు. వాళ్ళు ప్రపంచాన్ని సమదృష్టితో చూడగలరు. మెరుపు మెరవడం, వాన కురవడం, ఇంద్రధనస్సు వెలగడం లాంటివన్నీ సహజమైన ప్రకృతి ధర్మాలు. పిల్లలు అమాయకంగా ఆ ప్రకృతి అందచందాలన్నీ తమవే అనుకొని కేరింతలు కొడతారు. ఆనందంతో ఆడుకుంటారు. వారి మనస్సులు సహజంగా ఉండటంవల్ల వారు ఈ అనుభూతిని పొందగలుగు తున్నారు.

'నాది', 'నాదికాదు' అనే సామాజిక భావన పిల్లలలో ఉండదు. అచ్చట ఇచ్చట అనుకోకుండా ఎచ్చటికైనా ఎగురుతూ పోయే పక్షి మనసు వాళ్ళది.

పాపం, పుణ్యం, ప్రపంచమార్గం --
కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ
ఏమీ ఎరుగని పూవుల్లారా,
అయిదారేడుల పాపల్లారా!

మెరుపు మెరిస్తే
వాన కురిస్తే,
ఆకసమున హరివిల్లు విరిస్తే
అవి మీకే అని ఆనందించే
కూనలారా!

అంటూ శ్రీశ్రీ పిల్లల మనన్తత్వం గురించి పేర్కొన్నాడు.

గరికపచ్చ మైదానాల్లోనూ,
తామరపూవుల కోనేరులలో,
పంటచేలలో, బొమ్మరిళ్ళలో,
తండ్రి సందిట, తల్లి కౌగిటా,
దేహధూళితో, కచభారంతో,
నోళుల వ్రేళులు, పాలబుగ్గలూ,

ఎక్కడ చూస్తే అక్కడ మీరై
విశ్వరూపమున విహరిస్తుండే
పరమాత్ములు

ఓ చిరుతల్లారా! అని శ్రీశ్రీ పిల్లలను గురించి ప్రస్తావించారు.

శ్రీశ్రీ ఉద్దేశంలో పచ్చని మైదానాలు, తామరపువ్వుల కోనేరులు, పంటచేలు, బొమ్మరిల్లూ, తండ్రిచేతులు, తల్లి ఒడి అన్నీ పిల్లలవే. అన్నిచోట్ల వాళ్ళు సహజసిద్ధంగా విహరిస్తారు. దేహధూళి, కచభారం, నోట్లో వేళ్ళూ, పాలబుగ్గలూ వాళ్ళ విశ్వరూపం. వయస్సు తెచ్చి పెట్టే ఏ కృతిమ లక్షణాలు లేకుండా సహజ ముగ్ధత్వంతో నిండి ఉండే తత్వం సకల ద్వంద్వాలకీ అతీతమైన పరమాత్మ వంటివి. సమస్త విశ్వమూ పిల్లలదే. వాళ్ళే లోకభాగ్య విధాతలు. వాళ్ళ అకల్మష హాసంలో వచ్చే యుగాలనాటి మెరుపులు ఉంటాయి. ఎప్పుడూ ఋతువులు వచ్చి పోతున్నట్లు, ఎప్పుడూ సూర్యబింబం ఆకాశంలో పయనించినట్లు, ఎప్పుడూ గాలి వీచునట్లు, పూలు పూచినట్లు, పిల్లల్లో శాశ్వతాకర్షణ అనేది ఉంటుంది. కనుక మానవులకు శైశవావస్థ శాశ్వతం. వాటిలోని మాధుర్యాన్ని, కోపతాపగ్రస్తం కాని పసిగుండెలే అనుభవించగలవు. నక్షత్ర రంగుల ప్రపంచానికి, విశ్వసంగీత తరంగాలకి పిల్లలే వారసులు. పిల్లలు ప్రకృతి సౌందర్యం వలె సహజ కళాఖండాలు. వాళ్ళు ప్రకృతిలో ఒక అందమైన భాగం.

ముగింపు :

సాహిత్యంలో శృంగారాన్ని, వీరాన్నీ, భక్తిని వర్ణించిన కవులు అసంఖ్యాకంగా ఉన్నారు. కానీ శైశవాన్ని ఇంత సహజ మధురంగా వర్ణించిన కవి శ్రీశ్రీ ఒక్కడే. ఈ గీతంలో కూడా శ్రీశ్రీ కవితలో సహజమైన ఓజోగుణ ముద్ర, నవ్యత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఋతు వర్ణనలో శ్రీశ్రీ అపూర్వ భావచిత్రాల్ని ప్రయోగించాడు. వసంతకాలం 'ఋతువులు రాణి', గ్రీష్మం ఉష్ణాన్ని 'కంచు వృషభాల' అగ్నిశ్వాసతో పోల్చడం శ్రీశ్రీకి మాత్రమే సాధ్యమైన విశిష్టత. ప్రకృతిని, శైశవావస్థనీ అభేదం చేసి విశ్వసాహిత్యంలో విశిష్టమైన 'శైశవ గీతి'ని శ్రీశ్రీ అలపించాడు అని చెప్పవచ్చు. కార్ల్ మార్క్స్ 'Eternal Charm' అని శైశవాన్ని గురించి ఒక్క మాటలో చెప్పిన దాన్ని తెలుగులో శ్రీశ్రీ మహత్తరమైన గీతంగా ఆవిష్కరించాడు.

'శైశవ గీతి' లోని అంతస్సారాన్ని, కవి హృదయాన్ని ఆవిష్కరిస్తూ,

'మీదే మీదే సమస్త విశ్వం! మీరే లోకపు భాగ్య విధాతలు! మీ హాసంలో మెరుగులు తీరును. ఋతువుల రాణీ వసంతకాలం మంత్రకవాటం తెరుచుకునీ, కంచు వృషభముల అగ్నిశ్వాసం క్రక్కే గ్రీష్మం కదలాడీ, ఏళ్ళు, బయళ్ళూ, ఊళ్ళూ, బీళ్ళూ ఏకంచేసే వర్షాకాలం, స్వచ్ఛ కౌముదుల శరన్ని శీధినులు, హిమానీ నిబిడ హేమంతములు, చలివడకించే శైశిరకాలం వస్తూ పోతూ దాగుడు మూతల క్రీడలాడుతవి మీ నిమిత్తమే! ఇవాళలాగే ఎప్పుడు కూడా ఇనబింబం పయనించు నింగిపై! ఎప్పుడు కూడా ఇవాళలాగే గాలులు వీచును, పూవులు పూచును! నాకు కనబడు నానాతారక, అనేక వర్ణ, అనంత రోచులు దిక్కుదిక్కులా దివ్యగీతములు మీరూ వీటికి వారసులే! ఇవి మీలో కూడా మిల మిలలాడును!

నా గత శైశవ రాగమాలికల ప్రతిధ్వనులకై, పోయిన బాల్యపు చెరిగిన పదముల చిహ్నాల కోసం, ఒంటరిగా కూర్చుండి ఊరుపులు కదిలే గాలికి కబళము నిస్తూ, ప్రమాద వీణలు కమాచి పాడగ సెలయేళ్ళను, లేళ్ళను లాలిస్తూ, పాతాళానికి పల్టీకొట్టీ వైతరణీనది లోతులు చూస్తూ, శాంతములే కేకాంతముగా, దిగ్భ్రాంతిలో మునిగి గుటకలు వేస్తూ, మెటిక విరిస్తూ ఇట కూర్చుండిన నను చూస్తుంటే నవ్వొస్తోందా? ఉడుతల్లారా! బుడతల్లారా! ఇది నా గీతం, వింటారా?' అని శ్రీశ్రీ పలికిన ఈ మాటలు ఎంతో విశిష్టమైనవి, గమనించదగినవి.

ఆధార గ్రంథాలు :

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ
2. ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు ప్రయోగాలు - సి.నా.రె.
3. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య

❖

సమాజంపై శ్రీశ్రీ రచనల ప్రభావం

– సుశీల్ ప్రత్యూష దొసరి, తెలుగుశాఖాధిపతి, అక్కినేని నాగేశ్వరరావు కళాశాల (అటానమస్), గుడివాడ.

("ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ ఒక జాతిని వేరొక జాతీ పీడించే సాంఘిక ధర్మం ఇంకానా? ఇకపై సాగదు" - శ్రీశ్రీ)

"సామ్యవాదం అనేది ఒక తత్వం ఒక దర్శనం. ఒక జీవిత విధానం. నా కవిత్వాన్ని పూర్తిగా దానికే అంకితం చేశాను. సామాజిక ప్రయోజనాన్ని సాధించలేని కవిత్వానికి నేను విలువ ఇవ్వలేను"(జనశక్తి ద్వైవార పత్రిక, 18-11-1964) - శ్రీశ్రీ

మహాకవీ, విప్లవ కవీ, ప్రజాకవీ శ్రీశ్రీ పూర్తిపేరు శ్రీ రంగం శ్రీనివాసరావు. శ్రీశ్రీ 1910 ఏప్రియల్ 30న విశాఖపట్నంలో తొలి సంధ్యవేళ ఉదయించారు. 1983 జూన్ 15న మలి సంధ్యవేళ అస్తమించారు.

దుర్భరమైన ఆర్థిక ఇబ్బందులనూ, అనారోగ్యాన్ని బాల్యంలోనే అనుభవించిన శ్రీశ్రీ 1910లో పుట్టిన తొలినెలలోనే మృత్యువాకిటి దాకా వెళ్ళివచ్చారు. 1930లో ఒక మారు టైఫాయిడ్ జ్వరంతో.. 1955లో మరోసారి మెంటల్ క్లినిక్‌లో మృత్యువుతో పోరాడారు. ఆ సమయం లోనే ఆర్థిక మాంద్యం, తీవ్రమైన కరువు పరిస్థితులూ... యుద్ధ బీభత్సం... నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తానొక్కడే కాదు ప్రపంచంలోని శ్రామికులు అందరూ అనుభవిస్తున్నారని, శ్రమైక జీవనం ఒకరిదైతే సంపదంతా మరొకరిది అవుతుందని గ్రహించిన శ్రీశ్రీ గొప్ప మానతావాదిగా రూపొందారు.

సమాజంపై సాహిత్యం యొక్క ప్రభావం ప్రాచీనకాలం నుంచి ఆధునిక కాలం వరకు ఎంతగానో ఉంది. శ్రీశ్రీ ప్రతిజ్ఞ గేయం యువతరానికి శ్రమలోని గొప్పతనాన్ని తెలియచేస్తూ సమాజానికి ఉపయోగపడే అన్ని వృత్తులనూ గౌరవించే సంస్కారాన్ని తెలియజేస్తుంది.

ఒకరకంగా శ్రీశ్రీ జీవితం ఓపెన్ బుక్‌లాంటిది (తెరచిన పుస్తకం). 1965-70 మధ్య శ్రీశ్రీ ఆర్థికంగా చాలా ఇబ్బందుల పాలయ్యాడు. గడియారం, కొన్ని సామాన్లు మార్వాడీకి తాకట్టు పెట్టాడు. తాకట్టు విడిపించుకోడానికి మార్వాడీ దగ్గరకు 1970 ఏప్రిల్‌లో వెళ్లాడు. వడ్డీ ఎక్కువగా గుంజుతున్నాడని అతని మీద నేను కోపం తెచ్చుకుంటే "వడ్డీ అతని వృత్తి ఈ సంఘంలో ఏ వృత్తినీ ద్వేషించలేం. మనది వృత్తి సమాజం" అంటూ సర్ధి చెప్పారు శ్రీశ్రీ.

సమాజంలోని దోపిడీ అన్ని వ్యధలకూ మూలమని అభ్యుదయ కవి విశ్వసిస్తాడు. ఋజువు చేసే ప్రయత్నం చేస్తాడు. తానుంటున్న ఎగుడు దిగుడు సమాజం స్థానంలో సమ సమాజాన్ని నిర్మించటానికి కార్మికులను, శ్రామికులను సన్నద్ధం చేస్తాడు. అందుకోసం అంతకు ముందులేని భావి వేదాల జీవనాదాల్ని విలపిస్తాడు. ఆ భావి వేదాలు ఏమో కాదు సామ్యవాద నాదాలే!

బాటసారి ఖండికలో సమాజంలోని నిరుద్యోగ యువకుని పాత్ర కరుణ రసాత్మకంగా చక్కగా వర్ణించారు. నిరుద్యోగ సమస్య దాని ప్రభావం వలన నిరుద్యోగులలో కలిగే నిరాశ, నిస్పృహలను కళ్ళకు కట్టినట్లుగా చూపించారు. కూలికోసం పట్టణాలలో అడుగుపెట్టిన బాటసారి పెనుతుఫానులో చిక్కుకోవడం, దారితప్పటం, చివరకు జ్వరం వచ్చి ఏ సహాయం దొరక్క మరణించడం వర్ణించ బడింది.

'బాటసారి'లో నిరుద్యోగి ఆవేదనను శ్రీశ్రీ హృదయ విదారకంగా చిత్రించారు. "కూటి కోసం కూలి కోసం / పట్టణంలో బ్రదుకుదామని / తల్లిమాట చెవిని బెట్టక బయలు దేరిన బాటసారి దిక్కులేని పరిస్థితులలో మరణించాడు.

'బాటసారి కళేబరంలో శీతవాయువు ఆడుకుంటోంది / పల్లెటూళ్ళో తల్లికేతో / పాడుకలలో / పేగు కదిలింది'

అని కరుణామయమైన స్థితిని వర్ణించి గుండెలు బరువెక్కించారు. తర్వాత వచ్చిన అభ్యుదయ కవులకు 'బాటసారి' మార్గదర్శకమైంది.

'భిక్షువర్షీయసీ' ఖండికలో భిక్షుకి దీనావస్థ స్థితిని వివరిస్తారు. ఆమె మరణించిన తరువాత ఆమె మరణానికి సమాజమే కారణమని.... ఆ పాపం నాది కాదని ఎంగిలాకు అంటున్నదని సంఘం బాధ్యతను గుర్తు చేస్తూ ఇలాంటి ఎన్నో రచనలు చేయటం శ్రీశ్రీ సహజ లక్షణం.

ఒక వ్యక్తి ఏడ్చే ఏడ్పును బట్టి ఆ వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని నిర్ణయించవచ్చు. తమ బాగోగులు కోసం ఏడిస్తే వారు మామూలు మనుషులు. ఇతరులు బాగు పడిపోతున్నారే అని వాపోతే వాళ్ళు దుర్మార్గులు. ఇతరులు బాగుపడటం లేదే అని విలపిస్తే వాళ్ళు మహాత్ములు. అదేవిధంగా మహా కవులు కూడా సమాజ శ్రేయస్సుకోసం శోకిస్తారు.

అభ్యుదయ కవిత్వంలో అత్యంత శక్తివంతమైన గీతం 'భిక్షువర్షీయసీ' ఇది నా పాపం కాదని ఎగిరి వచ్చె ఎంగిలాకు' అనటంలో కవి ఆర్థిక వ్యత్యాసాలున్న సమాజంలో దీనుల స్థితిని గురించి ప్రశ్నించారు. దారి పక్క చెట్టు కింద కూర్చున్న అవ్వను ఆరిన కుంపటితో పోల్చటం కవి అసాధారణ ప్రజ్ఞకు నిదర్శనం.

మహాకవి శ్రీశ్రీ :

"నేను దుఃఖింతు మానవాజ్ఞానమునకు
నేను హర్షింతు మానవ జ్ఞానమునకు
అఖిల మనుజ దుఃఖ ప్రమోదాశ్రు సలిల
ధార భరియింతు" నంటాడు.

"శ్రీశ్రీ తన కోసం తన అభ్యున్నతి కోసం ఏడవలేదు. మనుషులు అజ్ఞానంలో ఉంటే దానికి ఏడుస్తానంటాడు. ఇలా అజ్ఞానంలో ఉన్న ఇతరుల కోసం ఏడ్చేవారు ఎంతమంది ఉంటారు." ఇతరుల అభివృద్ధిని చూసి సంతోషించేవారు ఎందరుంటారు శ్రీశ్రీ లాంటి అభ్యుదయ భావాలు కలిగిన మహాత్ములు తప్ప.

ఈ విధంగా శ్రీశ్రీ తన రచనల ద్వారా సమాజంలోని పరిస్థితులను, వ్యక్తుల, స్థితిగతులను వర్ణించిన తీరు ఎంతో అద్భుతంగా ఉంటుంది. సమాజంలోని అంశాల పట్ల ఎంతో దార్శనికత ఉన్నటువంటి మహాకవి, మానవతావాది శ్రీశ్రీ.

ముగింపు :

ప్రతి దేశంలోనూ, ప్రతిచోట ప్రతి సందర్భంలోనూ దోపిడీ అనేది ఉంది. బలవంతుడు బలహీనుని అణచి వేతకు గురి చేసి ఇంకా ఇంకా బలహీనుని చేయటం మనం చూస్తున్నాము. ఇది అన్యాయమని భావించిన వాళ్ళందరూ దాన్ని రూపు మాపటానికి ఎన్నో ప్రయత్నాలు సాగించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి సామ్యవాద వ్యవస్థను నిర్మించటం అంత సులభం కాదు. అంత తొందరగా సాధ్యమయ్యేది కాదు. ఇటువంటి పరిస్థితులలో సామ్యవాదానికి బాటలు నిర్మించటంలో శ్రీశ్రీ సాహిత్యం చెప్పుకోదగినది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహితీ చైతన్య మూర్తులు - తెలుగు అకాడమి, హైదరాబాదు
2. చిరంజీవి శ్రీశ్రీ - చలసాని ప్రసాద్
3. శ్రీ రంగం శ్రీనివాసరావు - ఆరుద్ర
4. తెలుగు సాహిత్యంపై మహాకవి శ్రీశ్రీ ప్రభావం - డా. కడియా రామమోహనరావు

❖❖❖

ఈ శతాబ్దం నాది అన్న - శ్రీశ్రీ

- బండారి ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, ఖైరతాబాద్.

జనచైతన్యానికి కవితాబావుటాలెత్తిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు. సామాన్య మానవుణ్ణి కవితా వస్తువు చేసుకొని, పీడితుల పక్షం వహించి ఐదు దశాబ్దాలకు పైగా కవితా జైత్రయాత్ర సాగించిన శ్రామిక పక్షపాతి అయిన కవి శ్రీశ్రీ. "మరో ప్రపంచం, మరో ప్రపంచం పిలిచింది. పదండి ముందుకు, పదండి తోసుకు పోదాం, పోదాం పైపైకి ! పదండి ముందుకు పదండి" అని ఉవ్వెత్తున లేచి బెబ్బులిలా గర్జించాడు. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితలు చదివి కవిలోకం నివ్వెరపోయింది. నిఖిడాశ్చర్యం ఆయన వంకే చూసింది. ప్రపంచ బాధని తన బాధగా చేసుకొని కదిలాడాయన.

శ్రీశ్రీ మహాప్రస్థానానికి ముందుమాట రాస్తూ "కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచపు బాధంతా శ్రీశ్రీ బాధి" అంటాడు చలం. ఇది అక్షర సత్యం. తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పిన మహాకవి. అభ్యుదయ కవిత్వానికి ఆద్యుడు శ్రీశ్రీ. ఆధునిక కవిత్వానికి వేదం లాంటి మహాప్రస్థానం రచించి మానవాభ్యుదయాన్ని ఆకాంక్షించిన మహాకవి. ఆకాశమార్గంలో పయనిస్తున్న జగన్నాథ రథచక్రాలను భూమికి దింపిన దార్శనిక కవి. పద్యాన్ని విడిచి వచన పద్యాన్ని గేయకవితను అందుకొని ఎన్నో కొత్త భావాలను ప్రవేశపెట్టి పాఠకులను ఆలోచింపజేస్తున్న క్రాంతి మూర్తి. మార్క్సియ సిద్ధాంతాలతో ప్రభావితుడై అదే భావధారతో ఉత్తేజమైన రచనలు వెలిగించిన విప్లవమూర్తి. ఆయన సమాజాన్ని సాహిత్యాన్ని అతి సవ్యంగా తీర్చిదిద్దిన మహాకవి.

తెలుగు దేశమన సాంఘిక రంగమందు ఇటు సాహిత్యరంగమందు కందుకూరి వీరేశలింగంగారు, గిడుగు రాంమూర్తిగారు, గురజాడ అప్పారావుగారు నూతన మార్గాలననుసరించి ఆంధ్రదేశమున కొంత చైతన్యమును గలిగించిరి. జాతీయ అంతర్జాతీయ రంగాలలో కూడ పెక్కు మార్పులు పరిఢవిల్లుచుండెను. ప్రథమ ప్రపంచ సంగ్రామము తరువాత కమ్యూనిస్టు విప్లవ భావాలు అంతర్జాతీయంగా వ్యాప్తి నొందడం, ఇటు దేశీయ రంగంలో స్వాతంత్ర్యోద్యమం బలం పుంజుకుంటూ ఉండటం, ఆర్థిక రంగాల్లో తీవ్రమయిన మాంద్యం - ఇవన్నీ ఆనాటి యువతరాన్ని ప్రభావితం చేసి నవి. ఇట్టి వాతావరణంలో భావ కవిత్వ మార్గము నుండి క్రమంగా విడివడి అభ్యుదయ మార్గమున పయనించుటకు ఉపక్రమించిన శ్రీశ్రీనివాసరావుగారి పై సమకాలీన వాతావరణ ప్రభావము కొంతవరకు పడియుంటుందని ఆశించటంలో ప్రతిపత్తి లేదు. పాశ్చాత్య సాహిత్య రంగములలో వచ్చిన వివిధ ఉద్యమముల పరిచయము కూడ శ్రీనివాసరావుగారి పై ప్రభావము చూపినట్లు, పాశ్చాత్య రచయితలలో తనకు కొందరు అభిమాన రచయితలైనట్లు కొందరి ప్రభావము తనపై నున్నట్లు శ్రీనివాసరావుగారే స్వయంగా తెలిపి ఉన్నారు.

శ్రీనివాసరావుగారి అభ్యుదయ కవితా ఖండికలలో మొదటి దశకు చెందిన వారిలో ప్రతిభ, దేశచరిత్రలు అనునవి ఆ రోజులలో మిక్కిలి సంచలనం కలిగించినవి, అసలు సిసలైన అభ్యుదయ భావాలు, విస్పష్టంగా తెలుపబడిన కర్షక, కార్మిక, శ్రామిక వర్గముల ప్రాధాన్యము, దేశ చరిత్రల రచనా విషయంలోనూ అధ్యాయం చేయవలసిన విధానంలోను చూపవలసిన నూతన దృక్పథము, ఈ గీతములలో తెలుపబడినది.

ప్రతిజ్ఞ అనే ఖండికలో, కర్షక, కార్మికవీరుల ఖర్మ జాలానికి, వారి విలాపాగ్నులకు ఖరీదు కట్టే షరాబులేడని అవి అమూల్యములని తెలిపాడు. అంతేకాదు, తాడిత

పీడితులై శ్రమ నిష్పలమైన అశాంతులందు అనాథులంతా తీవ్రర్వంతో విప్లవశంఖం వినిపిస్తారని చాటాడు. అందుకనే తన నవ్య కవిత్యాన్ని లోకపుటన్యాయాలు, దారిద్ర్యాలు, దౌర్జన్యాలు పరిష్కరించుటకు, శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్చనం చేస్తానన్నాడు.

దీనిలో ప్రధానం Progresive Writers Manifesto చదివిన తరువాత శ్రీశ్రీ రాసిన "ప్రతిజ్ఞ" అనే గీతంమీద ముఖ్యంగా కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి వర్గం. ఇత్యాది పాదాలమీద సుస్పష్టంగా ముద్రిత మయిందని వేరే చెప్పనక్కరలేదు. దేశ చరిత్రల రచన, అధ్యయనమూ, వీని యెడగల సంప్రదాయ దృక్పథ మును సమూలముగా మార్చి, నూతన శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతిపాదించిన వారు మార్క్స్, ఎంగిల్స్ లు, అంతకు ముందున్న భౌతిక వాదం అసమగ్రమైనదని అది భావ వాదానికి సమీపంగా నున్నదని సమాజాన్ని, చరిత్రను అధ్యయనం చేయడంలో దాని పాత్ర పాక్షికమైనదని వీరు అభిప్రాయపడ్డారు.

రణకర్ష, ప్రవాహసిక్తం, భీభత్సరస ప్రధానం, పిశాచగణ సమవాకారం, కాల్చుకతినడం, తడిసెరక్తమున కన్నీళ్ళు చల్లారిన సంసారాలు, మరణించిన జనసందోహం మున్నగువన్నీ భీభత్స రసానికి, అంధయుగం, చీకటికోణం మున్నగునవి చీకటి ప్రసక్తి, ధనవంతుల పన్నాగాలు ఇంకానా ఇకపై సాగవు, మున్నగునవి విప్లవ భావాలకు శిల్పమూ, సాహిత్యము, శాస్త్రమూ మున్నగు వానిని గుర్చిన గొప్పతనాన్ని గుర్తించకుండ కేవలం కూలీల గొప్పతనాన్నే చూడదలచిన పాక్షిక దృష్టికి నిదర్శనాలు. ప్రపంచములోని దీనుల యెడ, ఆర్తుల యెడ, తాడిత పీడితుల యెడల గల అనుకంప, ఆర్ద్రత, సహాను భూతులు వ్యక్తమవుతాయి. శైశవంలో, బాల్యవవస్థలో వారనుభవించిన వివిధ కష్టనష్టముల ఫలితంగా ముఖ్యంగా తల్లిని కోల్పోవడం వల్ల ఏర్పడిన మనస్తత్వం వల్ల వారి ఆలోచనా విధానం గూడ మార్పు చెందింది.

"నడి సంద్రపు కెరటాల్లో మ్రోగిన" అన్నప్పుడు విశాఖపట్టణపు సముద్రము. బాల్యస్మృతి. శ్రీనివాసరావు గారిలో ప్రముఖంగా కనిపించే తిరుగుబాటు స్వభావం దూకుడు ప్రవృత్తి దౌర్జన్య శీలతలు సంకేతాత్మకంగా కనిపించే పాదాలు, "అన్ని సరస్సున వికసించిన వజ్రం" ఎగిరే లోహాశ్వేసం" "ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగ నాదం" మున్నగునవి. శ్రీనివాసరావుగారి బాల్య జీవితంలో తల్లిని కోల్పోవడం, తదనంతర ఆర్థిక మానసిక బాధలు, వారి అవ్యక్తంలోనున్న tenstr. ఉద్రేకాలు, impulses ఉద్రిక్తలను గురించి ఇంతకు పూర్వము సోదా హరణముగా తెలుసనై నది. శ్రీశ్రీకి బలంగా తగిలిన మానసిక ఆఘాతాల్లో ఆప్తమిత్రుడు కొంపెల్లి జనార్ధనరావు మరణం ఒకటే. బహుశః ఈ అఘాత్యాన్ని తట్టుకునే సందర్భంలోనే కావచ్చు, "పోనీ పోనీ పోతే పోనీ సతుల్, సితుల్, హితుర్" అని ధైర్యం చిక్కబట్టుకొని కళా ప్రపంచంలో దారి వెతుక్కుంటూ నడిచే ప్రయత్నం చేస్తూ వచ్చాడు. బాహ్యమైన కారణాల కన్నా అంతరంగికమైన కారణాలే స్నేహిత ధర్మమును నిర్ణయించునట్లు ప్రబలమైన పాత్ర వహిస్తాయి.

శ్రీనివాసరావుగారి కవితలలో, మహా ప్రస్థానం, దేశ చరిత్ర గీతికల తరువాత మిక్కిలి ప్రసిద్ధి పొందినది. "జగన్నాథుని రథ చక్రాలు" అనే గీతం. పతితులను, బాధాసర్పదష్టులను కూడు లేని గూడు లేని హీనులను సమూశ్వాసిస్తూ చేసిన రచన ఇది. ఏడవకండి ఏడవకం!" అని. ఎందుకు ఏడవకూడదు? అంటే "వస్తున్నా మొస్తున్నాయి. జగన్నాథ జగన్నాడు జగన్నాధ రథచక్రాల్, జగన్నాథుని రథచక్రాల్, రతచక్రార్, రథచక్రార్, రథచక్రాల్, రథచక్రాలొస్తున్నా యెస్తున్నాయి.

ఒక వ్యక్తి కవితా ప్రపంచమును గూర్చి పరిశీ లించునప్పుడు ఆయన వ్యక్తిగత గుణశీలాదులను గురించి చర్చించుట, ముచ్చటించుట, అనవసరము. మంత్రిపదవులు నిర్వర్తించుచూ వచ్చిన కుటుం బంలో జన్మించడం, భావ కవిత్వాన్ని జనజీవిత విధానములో పెరగడం, చిన్న చిన్న రాజులు వారి తగువులాటలు, సంధి

కార్యాలు చూచి తదనుగుణమైన జీవన నరళిని జీర్ణించుకున్న వాడవటం చేతనే తిక్కన, తాను రచించిన భారత భాగములో పంచ పాండవులను, శ్రీకృష్ణుని, ద్రౌపదిని, విశిష్ట భంగిమల్లో చిత్రించగలిగాడు. భోగియైన శ్రీనాథుడు, భక్తుడైన పోతన, యోగియైన వేమన, సృష్టించిన కవితలు వారి వారి గుణశీలాదుల ముద్రలను కలిగి యుండుట విదితము. కావున వ్యక్తి యొక్క గుణశీలాదుల ఛాయలు కొంతగాకున్నా కొంత వరకు వారి కృతులపై ప్రభావము చూపిస్తాయనుటలో ప్రతిపత్తిలేదు. వారి రచనల్లో వారు స్వయంగా చెప్పుకొన్న విషయముల నాధారంగా శ్రీనివాసరావు గారి గుణ శీలాదులను అంచనా వేయవచ్చు.

స్థిరమైన ఎట్టి భావనలు లేని కారణం చేతనే ఎట్టి ఉవిరత్యాన్ని ఆయన తన కవితా ఖండికలు, ప్రతిపాదించలేక పోయారు. సామ్యవాద వ్యవస్థలు గురించి, తాడిత పీడిత ప్రజల గురించి వ్రాసినట్లు కనిపించి, తాను సామ్యవాదం స్థాపించ డానికే కలం పట్టినానని ఉద్ఘోషించినా అది బాహ్యమైన రాజకీయ ప్రచారము, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేసినవే. అలా కానినాడు ఇటీవలి కాలంలో శ్రీమతి ఇందిరాగాంది ప్రకటించిన ఎమర్జెన్సీ వెనకాల ఎట్టి తత్త్వముగాని Ideology సిద్ధాంతము గాని లేని సంగతి సువిదితమైన విషయం. శ్రీనివాసరావు గారికి తత్త్వతః సన్నిహితములైన విషయములు అభివాస్తవిక ధోరణులు కాని కమ్యూనిస్టు తత్త్వముకాదు.

భాషలోనూ, భావంలోనూ విప్లవం తెచ్చిన మహా మహులైన మన కందుకూరి, గురజాడ గిడుగు మహనీయులను మనఃఫలకం ముందు సాక్షాత్కరింపచేసుకొని తెలుగు కవిత్వానికి నూతనత్వం అద్దిన అభ్యుదయకవి శ్రీశ్రీ. ఇంతటి మహాకవికి అరసంతోనూ ప్రగాఢమైన అనుబంధముంది. విజయవాడలో జరిగిన అరసం ఐదవ రాష్ట్ర మహానభలో అధ్యక్షస్థానానికి ఎన్నికైనారు. 'అభ్యుదయ' పత్రికకు సంపాదక వర్గ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించారు.

కవిత్వమొక తీరని దాహం' అన్న శ్రీశ్రీ మాటల్లాగే ఆయన గురించి అధ్యయనం కూడా అనంతమైంది.

'ఒక సూర్యుండు సమస్త జీవులకు ఒక్కొక్కరీతి' అన్నట్లు కొత్త కొత్త సందర్భాలలో కొత్త సంకేతాలివ్వడానికి ఆయన కవితాచరణాలు అక్కరకు వస్తుంటాయి.

మరో ప్రపంచం/ మరో ప్రపంచం, మరో ప్రపంచం పలిచింది !
పదండి ముందుకు, పదండి త్రోసుకు !
పోదాం పోదాం పైపైకి
నేను సైతం/ ప్రపంచాగ్నికి / సమిధనొక్కటి ఆహుతిచ్చాను ! నైను సైతం / విశ్వపుష్టికి / అశ్రువొక్కటి ధారపోశాను ! నేనుసైతం / భువనఘోషకు /వెర్రిగొంతక విచ్చి మ్రోశాను.!
ప్రపంచమొక పద్మవ్యూహం ! కవిత్వమొక తీరని దాహం !
నేను సైతం / ప్రపంచాబ్జపు / తెల్లరేకై పల్లవిస్తాను !
నేను సైతం / విశ్వవీణకు / తంత్రినై మూర్ఛనలు పోతాను !
నేను సైతం / భువన భవనపు / భావుటానై పైకి లేస్తాను.

కదిలేది, కదిలించేది, / మారేదీ, మార్పించేదీ, పాడేదీ, పాడించేదీ / మునుముందుకు సాగించేదీ, పెను నిద్దుర వదిలించేదీ / పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ, కావాలోయ్ నవకవనానికి

మనుష్యుడే నా సంగీతం ! మానవుడే నా సందేశం !
దొంగనోట్లు దొంగవోట్ల రాజ్యం ఒక రాజ్యామా ?
లంచగొండి వెధవలిచ్చు సాక్ష్యం ఒక సాక్ష్యమా ?

ప్రథమ శత్రువు / ప్రధాన శత్రువు అదే మన అవస్థల కన్నిటికీ / కారణభూతమైన /పెట్టుబడిదారీ వ్యవస్థ దానిమీదనే మన పోరాటం / దానిని పడగొట్టడానికే మన విప్లవం.

శ్రీశ్రీ కన్న గొప్పది శ్రీశ్రీ కవిత్వం. శ్రీశ్రీ కవిత్వం కన్నా

గొప్పది శ్రీశ్రీ మార్గం. శ్రీశ్రీ కవితా శక్తి జనన మరణాలు లేని సజీవశక్తిగా అభివర్ణించవచ్చు. "నేను ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కవిత్వం మీద తిరుగులేని నియంతృత్వం చెలాయించాలని నిశ్చయించాను. అందుకుగాను జీవితమంతా కృషిచేశాను" అని శ్రీశ్రీ స్వయంగా చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

అర్ధ శతాబ్ధిపాటు తెలుగు సాహిత్యాన్ని ముఖ్యంగా అభ్యుదయ సాహిత్యాన్ని మరపించిన మహాకవి శ్రీశ్రీని అంత త్వరగా మరిచిపోయే కృతఘ్నజాతికాదు మనది, 1950వ దశాబ్ధిలో సాహిత్యలోకంలో కళ్ళుతెరిచిన సాహిత్య పరులకు మిగితావాళ్ళ కన్నా శ్రీశ్రీ పై అభిమానం, ఆరాధన ఎక్కువ. అందుకే నేటికి శ్రీశ్రీ సాహిత్యం కావాలి! రావాలి!

ఆధార గ్రంథాలు :

1. విమర్శకుడుగా శ్రీశ్రీ -సృజన పత్రిక, ఫిబ్రవరి 1970.
2. శ్రీశ్రీ సంస్మరణ సంచిక - హైదరాబాద్, రంజని-1985.
3. ఆధునిక తెలుగుసాహిత్యంలో విభిన్న ధోరణులు, కె.కె.రంగాచార్యులు, (సం), ఆంధ్రసారస్వతపరిషత్తు, హైదరాబాద్, 1981.

❖❖❖

శ్రీ శ్రీ మహాప్రస్థానం - చైతన్య ప్రవంతి

- కాపర్తి స్వరాజ్యం, తెలుగు సహాయాచార్యులు, కరీంనగర్.

మనిషిని మార్చి మనసును కదిలించి, ఆలోచనల్లో మార్పు తెచ్చింది కవిత్వం. కొన్ని కవితలు దుఃఖాలను పోగొట్టితే, మరికొన్ని కవితలు దుఃఖాన్ని ఛేదించి మార్గాన్ని చూపిస్తాయి. కవిత్వం అంటే కేవలం ఆనందం మాత్రమే కాదు అభ్యుదయం కలిగించేది కూడా అని అనడం అతిశయోక్తి కాదు. కలాల కవిత వేల గళాలను వినిపించి కొత్త ఊపిరి పోస్తుంది. అలాంటి కవితలే ముందు ముందు నిలిచి పోతాయి. తన కలంతో వేల గొంతులు వినిపించి మేలుకొలుపును కలిగించిన కవి శ్రీ శ్రీ.

అభ్యుదయ కవిత్వాన్ని అణువనువున నింపుకున్న కవి. అంతే కాదు పాత పదాలు, డిక్షన్, వర్ణనలు, అలంకారాలు, ఛందస్సు లేకుండా సమసమాజ నిర్మాణం చేసి ముందు తరాలకు ఆదర్శప్రాయుడైనాడు. అనాటి సమాజంలోని దోపిడీ దౌర్జన్యాలు బ్రిటిష్ సామ్రాజ్య ఆధిపత్యం సహించలేని శ్రీశ్రీ ప్రజల్లో కదలికలు తేవడానికి కవిత మార్గాన్ని ఎంచుకున్నాడు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా చాలామంది ఈ బానిస సంకెళ్లను తెంచుకోలేక పోయారు ఏదో ఒకరకంగా బందీలవుతూనే ఉన్నారు. విముక్తికై చేసే పోరాటంలో ఎప్పటికప్పుడు ఎందరో బలవుతూనే ఉన్నారు. కాలాలు మారినా తరాలు మారినా దేశ ప్రజల్లో మాత్రం హెచ్చుతగ్గులు అలాగే కొన సాగుతున్నాయి.

ఏ దేశ చరిత్ర చూసిన
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం

-శ్రీ శ్రీ దేశ చరిత్రలు పుట: 84

ఏ దేశ చరిత్రైనా తెలిపేది మానవ జీవితం పరుల చేతిలో మగ్గిపోయినదని. స్వాతంత్రం పూర్వం, తర్వాత కాలం ఏదైనా జరిగింది ఇదే. ఇలాంటి వ్యవస్థ పోయి అందరూ సమానమే అని అందరూ ఒకటేనని భావన కలిగేలా చూడాలంటారు శ్రీశ్రీ. అభ్యుదయ, విప్లవ సంఘాలకు అధ్యక్షునిగా అనేక సాహిత్య సేవలు అందించిన శ్రీ శ్రీ తన సాహితీ ప్రస్థానంలో 1933 -40 కాలంలో రాసిన మహాప్రస్థానం ఎప్పటికీ నిలిచిపోయేది. ఈ పుస్తకం కేవలం శ్రీ శ్రీ జీవితాన్నే కాదు తెలుగు సాహిత్యపు దశ, దిశలను కూడా మార్చివేసింది అని చెప్పవచ్చు.

గురజాడ తన అడుగుజాడగా భావించి కవితా రచనకు పూనుకున్నాడు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీశ్రీ ఆధునిక కవులలో నేటి. అంతేకాదు శ్లేషకు ప్రాసకు పెట్టింది పేరుగా తన రచనలు కొనసాగించాడు. దీనికి సరైన నిర్వచనంగా మహాప్రస్థాన కవితాసంపుటి అని చెప్పవచ్చు. వ్యక్తికి బహువచనం శక్తి అని మహోత్తర వాక్యాన్ని మహాప్రస్థానంలో సృష్టించిన అభ్యుదయవాది. శబ్ద ప్రయోగంలో నవ్యతను పాటించి సాహితీలోకంలో తనదైన ముద్ర వేసుకున్నాడు.

మహాప్రస్థానం రాసేనాటికి మార్క్సిజం అనేది ఒకటుందని తెలియకపోయినా ఆ ద్రుక్పథంలోనే మహాప్రస్థాన రచన చేశాడంటే వీరికి గల భావనాశక్తి ఎంత గొప్పదో తెలుస్తుంది. మహాప్రస్థానంలోని కవితలు, సామాజిక స్పృహ, మార్క్సిస్టు స్ఫూర్తి యాదృచ్ఛికాలు కావని చదివిన ప్రతి వారికి అర్థమవుతుంది.

దాస్య విముక్తి :

భారతదేశం బ్రిటిష్ పాలనలో మగ్గిపోతున్న కాలంలో కుల, మత, వర్గ, వర్ణ భేదాలు లేకుండా అనేక కష్టాలు పడ్డారు. బానిస సంకెళ్ళు పెంచుకో లేక భారంతో బతుకు ఎల్లదీసారు. కనిపించని ఆ సంఖ్యను పెంచే వారి కోసం నాలుగు దిక్కుల ఆశతో ఎదురు చూసిన వారు

ఎంతోమంది ఉన్నారు. ముఖ్యంగా పేదలు , బలహీన వర్గాలు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాళోజీ వంటి కవులు కూడా తమ అభిమానాన్ని ప్రకటించటానికి సాహిత్యాన్ని ఎంచుకున్నారు. అభ్యుదయ కవిత్వం ప్రజల్లో చైతన్యానికి పెద్ద పీట వేసిందని చెప్పవచ్చు.

భావ దాస్యంబెపుడు బాసిపోవునురా
నీ భాష యందును నీ వేషమందును
అభిమానముడిగిన చవట వీవేరా!

- ప్రజా కవి కాళోజీ, సాహిత్య సమాలోచన, పుట: 87

ఆంగ్లేయుల కాలంలో ముఖ్యంగా తెలుగు ప్రజల మాతృభాషకు, వేషానికి ఆదరణ లేక పోవడమే కాదు నిరాదరణకు గురైంది. అందుకే కాళోజీ తన కవితలో ఈ దాస్యం వీడేదెప్పుడని ప్రశ్నించడమే కాదు, నా అభిమానం లేనివాడు చవట అంటే చేతగానివాడు అని తెలిపాడు. ఈ కవిత విన్న ప్రతి వారిలో పౌరుషం పొందాల్సిందే నడం సందేహించాల్సిన విషయం కాదు.

శ్రీశ్రీ తన కవితా సంపుటి మహాప్రస్థానంలో ప్రజల్లో చైతన్యం కలిగించే ఎన్నో కవితలు మనకు అందించారు. ఇది కేవలం ఏదో ఒక కాలానికి సంబంధించిన వారి కోసం కాదు అన్ని కాలాలు అన్ని సమాజాలలో కూడా ఉపయోగపడేదే, ప్రజలను మేలుకొలిపేదే. ఏడుస్తూ కూర్చుంటే మన వద్దకు ఏదీ రాదు ,ఎదురుతిరిగిన అప్పుడే అనుకున్నది సాధించగలమనేది నేటి సమాజం నేర్పిన కొత్త పాటమిదని అని చెప్పవచ్చు. స్వాతంత్రానికి ముందు గాంధీగారి పిలుపునందుకొని ప్రాణాలను లెక్క చేయక ఉద్యమ వారదులైన వారు ఎందరో. అలా ఉద్యమంలో పాల్గొనక ప్రాణాలు అరచేతిలో పట్టుకొని చావలేక బతకలేక జీవించే వారిని ఉద్దేశించి...

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు
పదండి తోసుకు!
పోదాం పోదాం పైపైకి

- శ్రీశ్రీ మహాప్రస్థానం పుట:26

జీవితపు బానిస సంకెళ్లు తెంచుకొని ముందుకు సాగితే ఒక కొత్త ప్రపంచం ఉంటుంది అని ఆ ప్రపంచం పిలుస్తుంది అని సందేశం ఇచ్చాడు. కొత్త ప్రపంచంలో కష్టాలు, కన్నీళ్లు, సంకెళ్ళు ఉండవని మనం కోరినట్టు జీవించవచ్చని పిలుపునిచ్చాడు. ఎవరూ లేని బాధలు లేని మరో ప్రపంచం పిలుస్తోంది అని, దాని కోసం ఎదురు గా వచ్చిన వారిని పక్కకు నెట్టుకొని ముందుకు సాగాలని ఒక సంకేతం ఇచ్చాడు. ఈ కొత్త ప్రపంచానికి భయపడే వాళ్లు, చేతగాని వాళ్ళు నిరుత్సాహులు రాకుండా ఉం డడని, కేవలం చైతన్య వారసులే కదలండి అనడంలో శ్రీశ్రీ అభ్యుదయవాదం కనిపిస్తుంది. మరో ప్రపంచానికి వెళ్లేటప్పుడు అడ్డంకులన్నీ దాటుకోవాలని, ప్రళయం వచ్చిన వెంటనే వద్దు అని కూడా సందేశం ఇచ్చాడు.

మహాప్రస్థానంలోని ప్రతి కవిత ఒక అగ్నికణం, చదివిన కొద్దీ గుండెల్లో ఏదో తెలియని శక్తి, రక్తం మర గాల్సిందే, నరనరాల్లో చైతన్య ప్రవహించాల్సిందే. శ్రీశ్రీ అంటేనే అభ్యుదయం, చీకటి తలపున ఆశాదీపం వెలిగించే కవికుడు. తన జీవితంలో ఎన్నో కష్టాలు పడిన ఎక్కడ జీవిత ప్రయాణం అని ఆ పని చైతన్య మూర్తి, స్ఫూర్తి. తరతరాలకు సాహిత్య పతాకాన్ని ఎగురవేసి స్థిర జీవు డయ్యాడు

అంతేకాదు అన్యాయాన్ని ఎదిరించ లేనివాళ్లు చచ్చి పోవాలని నిర్మొహమాటంగా తెలిపిన కవి. దేనికి ఎవరికీ భయపడని వ్యక్తిత్వంతో కవితలు రాసి అందరిచేత మెప్పు పొందాడు. జీవితంలో వచ్చే వారు వస్తారు, పోయే వారు పోతుంటారు. అంతమాత్రం చేత జీవితం ఆగకూడదు. ఒకవేళ ఆగినట్లయితే జీవితానికి అర్థం ఉండదు .లక్ష్యాన్ని చేరడంలో, విజయాన్ని సాధించడంలో కష్టాలు, నష్టాలు, అవమానాలు ఎన్నో ఎదురవుతాయి. ప్రతిదానిని పట్టించు

కుంటే ముందుకు సాగాలేము. ఎప్పుడైతే అన్నిటినీ భరించి ధైర్యంగా సాగుతామో విజయభేరీ మోగించగలం. మనం చేసేది మంచి పనయినపుడు ఎవరు ఏమనుకున్నా పట్టించుకోవాల్సిన అవసరం లేదంటాడు శ్రీశ్రీ.

రాని రాని,
వస్తే రానీ!
కష్టాల్, నష్టాల్,
కోపాల్, తాపాల్, శాపాల్ రానీ!
వస్తే రానీ!
తిట్లు, రాట్లు, పాట్లు రానీ!
రానీ, రానీ!

- శ్రీశ్రీ, మహాప్రస్థానం, కళారవి, పుట: 15

దేశం కోసం చేసే పోరాటంలో ప్రతి ఒక్కరు సమితి అయినప్పుడే తెలుగు వెలుగు పొందగలం. అలా చేసే పోరాటంలో కొడుకులు కూతుళ్లు స్నేహితులు పోయినా కానీ వెనుకడుగు వేయకూడదు అంటాడు. నమ్మిన సిద్ధాంతం కోసం, ఆశయం కోసం చేసే పోరాటంలో కష్టాలు, నష్టాలు వచ్చినా కానీ వదిలేయకుండా ముందుకు సాగాలని యువతలో కొత్త స్ఫూర్తి నింపాడు శ్రీశ్రీ. మనం చేసే పోరాటంలో మంచి, చెడు రెండూ ఉంటాయి. దీనివల్ల కొందరు తిడుతారు, మరి కొందరు పొగుడుతారు, కొంతమంది కొడతారు కూడా. ఇలా అనేక రకాల సంఘర్షణలను ఎదుర్కోవలసి వచ్చినా ఎక్కడ ఆగిపోకుండా ముందుకు సాగాలని చెప్పడం లో శ్రీ శ్రీ చైతన్య వారధి కనిపిస్తుంది.

సమాజం ప్రతి దానిని స్వీకరించదు తనకు నచ్చింది చేస్తే మెచ్చుకుంటుంది ఒకవేళ నచ్చనిది చేస్తే, సమాజం నుండి వెలి వేస్తుంది. ఆనాటి కాలంలో సంఘసంస్కర్తలు, సంస్కరణవాదుల పనులు కొందరికి నచ్చేది కాదు. అయినాసరే ప్రజల్లో చైతన్యం కోసం మార్పు కోసం ఎంతోమంది ముందడుగు వేశారు. అలాంటి వారిని ఉద్దేశిస్తూ వారి బాటలో నడవమని చెప్పూ, ఈ కవితలో సందేశం ఇచ్చాడు. వందేమాతర ఉద్యమం అందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక బాటలో నడిపించి ప్రతి భారతీయుని గుండెల్లో చప్పుడిలా మోగింది. సుభాష్ చంద్ర బోస్, అజాద్ లాంటివారు హింసను పాటిస్తే, గాంధీ గారి నాయకత్వంలో నడిచేవారు అహింసను పాటించారు. అతివాదులైన, మితవాదులైనా స్వాతంత్రం కోసం పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన వారే. అంతే కాదు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని నిద్ర పోనివ్వకుండా చెమటలు పట్టించిన ధీరులెందరినో చరిత్రలో చూడ వచ్చు.

ఏదో ఒక వైపు నుండి, ఒక వర్గం నుండి కాకుండా అన్ని వైపులా అన్ని వర్గాల వారు ఒకటిగా కదిలారంటే ప్రతి వారిలో స్వాతంత్ర కాంక్ష ఎలా ఉందో తెలుస్తుంది.

మానవకోటి సామ్రాజ్య దూతలు, కళా
యజ్ఞాశ్వములు గాలులై, తరగలై, తావులై,
పుప్పొళ్ళ కుంకుమల్ పొగలై సాగిరి

-మహాప్రస్థానం, ఆశాదూతలు, పుట: 44

తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం అన్నివైపులా ఆవరించిన భారతీయుల ఆకాంక్ష తీర్చడానికి స్వాతంత్ర ఉద్యమ కారులు ముందుకు సాగారు. ఆనాడు సీతా అన్వేషణకు సుగ్రీవుడు తన సైన్యాన్ని నాలుగు దిక్కుల పంపి రావణ సంహారానికి శంఖం పూరించిన ట్లుగా, ఈనాడు బ్రిటిష్ సామ్రాజ్యాన్ని నేలమట్టం చేయడానికి వందేమాతర నినాద శంఖాన్ని ఊదుతూ విశ్వమంతా నిండి పోయారు. గాలిలో, ధూళిలో, పరిమళంలో, అలలో, పూల పుప్పొడిలో అన్నింటా నిండిపోయారనడంలో శ్రీ శ్రీ చైతన్యం ఎక్కడో ఒకచోట కాదు, అంతటా నిండి ఉందని సూచనలు ఇచ్చాడు. అందరిలో కలిగిన చైతన్యం ఇక ఆగదు. అందుకే మీరు దేశం వదిలి వెళ్లిపోండి అని హెచ్చరించినట్లుగా ఈ కవితలో సామాజిక స్ఫూర్తి కనిపిస్తుంది.

గాలి పీల్చకుండా ప్రాణం నిలవదు మరి ఇప్పుడు ఆ గాలిలో నిండింది వందేమాతర నినాదం. అది పీల్చిన ప్రతి ఒక్కరి రక్తం మరగాల్సిందే, ముందుకు కదలాల్సిందే.

అదే కదా మహాప్రస్థానం, అందరూ కోరే స్వాతంత్రం. ఇదే కవితలో శ్రీ శ్రీ పాపాలను నాశనం చేసి, కోపావేశంతో రగిలిపోతూ, నిప్పులు కురిపిస్తూ, ప్రళయకాల సూర్యుని వలె రగిలిపోతూ, వీర విహారం చేస్తూ వెర్రి నవ్వులతో అడ్డు గోడలు దాటి ఆకాశాన్ని తాకేలా బాణాలు వేసి ప్రజలను మేలుకొలిపాడు.

స్వాతంత్ర సమరయోధులు ప్రజల్లో నేర్పిన ఆశ స్వాతంత్రం.

ఇన్నాళ్లు పడిన శ్రమ, బాధ ఇక తొలగిపోతుందని రాబోయే కాలమంతా ఆనందంగా ఉంటుంది అన్నాడు. అంతేకాదు హింస, ధ్వంసం, అణగారినత్వం త్వరలోనే నశించిపోయి కొత్త లోకం వస్తుందని, దాని కోసం రథం కదిలిందని, ఆ రథ చక్రాల కింద పడి దగాకోరులు, హింసా వాదులు నలిగిపోతారని ఆశాభావం కలిగిస్తూ రాసిన కవిత జగన్నాథుని రథచక్రాలు.

పూరి జగన్నాథుని రథం సాగినప్పుడు తొక్కిసలాటలో ఎంతో మంది రథ చక్రాల కింద పడి గాయపడు తుంటారు. పాపం చేసిన వారికి దేవుడు వేసిన శిక్ష అని చెప్తుంటారు. శ్రీశ్రీ కూడా తన కవితా రథచక్రాల కింద దోపిడీదారులు పడి నశిస్తారని, ఆ తర్వాత ప్రజలకు కష్టాలుండవని స్వేచ్ఛ, సమానత్వం ఏర్పడి అందరూ ఒక్కటై ఆనందం వస్తుందని సందేశం ఇచ్చాడు. వస్తున్నాయ్, వస్తున్నాయ్ జగన్నాధ రథచక్రాలు అనడంలో స్వాతంత్ర్యం రావడానికి ఎంతో కాలం పట్టదని, అతి త్వరలో ప్రజల కాంక్ష తీరుతుందని తెలిపాడు. స్వాతంత్రం రావడానికి కొంత కాలం ముందే రాయబడిన ఈ కవితలో ,ప్రజలను కదిలించి ముందుకు నడిపే పదాలను చూడవచ్చు.

పతితులార!
భ్రష్టులార
బాధాసర్పదష్టులార!
బ్రదుకు కాలి,
పనికిమాలి,
శనిదేవత రథచక్రపు
టిరుసులలో పొడి నలిగిన
దీనులార!
హీనులార!

-శ్రీ శ్రీ, జగన్నాథ రథ చక్రాలు, పుట: 107.

మార్క్సు సిద్ధాంతంలోని శాస్త్రీయ సత్యాలను తన కవితా శిల్పంతో వినిపించిన కవి శ్రీ శ్రీ. మార్కెట్ అని చెప్పడంలో సాహిత్యానికి అగౌరవాన్ని కలగకుండా ఉన్నతంగా తీర్చిదిద్దాడు. శ్రీశ్రీ కవిత్వాన్ని మూడు దశల్లో చెప్పారు ఈ కవిత రెండవ దశకు చెందినది. దీనిలో సజీవ సాహిత్య నిర్మాణం చేసే ప్రజల హృదయాలను తనవైపుకు ఆకర్షించుకున్నాడు.

అన్నీ కోల్పోయి నిరుత్సాహంలో, నిరాశతో, నిరంతర ఆవేదనతో బ్రతుకు నశింప చేసుకుని బ్రిటిష్ సామ్రాజ్య చక్రాల కిందపడి నలిగిపోతున్నారంటూ, ప్రజలకు తనతో రమ్మని చైతన్య పిలుపునిచ్చిన కవి శ్రీ శ్రీ. తన కాలం పట్టింది అభాగ్యుల కోసం, అన్నార్తుల కోసమని ఆశాభావం వ్యక్తం చేశారు. మహాప్రస్థానంలో కవితలు ఆశావాదాన్ని కలిగినట్లు అనిపించినా, ప్రతి కవిత చైతన్య స్ఫూర్తిని కలిగించేవే. కవితా లోతుల్లోకి వెళ్ళి నప్పుడు ఆ చైతన్యం కనిపిస్తుంది అదే శ్రీశ్రీ ప్రత్యేకత.

గర్జించు రష్యా కవితలో రష్యా ప్రజల మనోభావాలను తెలుపుతూ విప్లవ శంఖం పూరించాడు. సోవియట్ రాజ్యం శత్రువుల గుండెల్లో కత్తి దించాలని కోరుతూ...

గర్జించురష్యా!
గాండ్రించు రష్యా!
పర్జన్య శంఖం వలికించు రష్యా!
దౌర్జన్య రాజ్యం ధ్వంసించు రష్యా!

- శ్రీశ్రీ, మహాప్రస్థానం, గర్జించురష్యా , పుట: 10.

అనడంలో రష్యా ప్రజల తిరుగుబాటు అన్ని దేశాలకు ఆదర్శం కావాలని భావం కనిపిస్తుంది. కురుక్షేత్ర

సంగ్రామానికి అర్జున శంఖం లాగా భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామానికి విప్లవశంఖం వెలిగించి, దౌర్జన్యం చేసే రాజ్యాన్ని సమూలంగా నాశనం చేయమని చైతన్య దీపిక వెలిగించాడు.

స్వాతంత్రం రాక ముందే తప్పక వస్తుందని విజయభేరి మోగించిన కవి శ్రీ శ్రీ. శ్రామిక లోకం కోసం, కార్మికుల కోసం మానవత్వంతో కరిగిన మనసుతో, ఉద్యమ స్ఫూర్తితో రాసిన కవిత జయభేరి. సీసీ కోరిన లక్ష్యాన్ని చూపించిన కవితగా దీనిని చెప్పవచ్చు. ఈ గేయం మొదట్లోనే మార్మిస్టు చైతన్యం కనిపిస్తుంది. ఈ కవితలోని ప్రతి పదం 'నేను సైతం 'పలికిన ప్రతిసారి భావావేశం కలిగిస్తూనే ఉంటుంది.

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను
నేను సైతం
విశ్వసృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను!
నేను సైతం
భువన ఘోషకు
వెర్రి గొంతుక నిచ్చి మ్రోశాను!
- శ్రీశ్రీ, జయభేరి, పుట: 29.

'నేను' అంటే కేవలం ఒక వ్యక్తి కాదు మహా శక్తి. అందుకే వ్యక్తికి బహువచనం అయిన శక్తిని 'నేను' గా పలికాడు. సామాజిక చైతన్యం కలిగించడానికి 'నేను'అనే శక్తిని ప్రయోగించిన కవి శ్రీ శ్రీ సమసమాజం రావాలంటే, స్వేచ్ఛావాయువులు దేశమంతా వీయాలంటే అందరం ఒకటేననే భావన ఏర్పడాలి. అందుకే ఈ కవితలో ప్రపంచమంతా అగ్నితో (ఆవేశం) రగిలిపోతుంటే దానిలో నేను ఒక ఒక సమితి లాగా మారి కలిసిపోతాను అనడంలో, ప్రపంచంలో తాను ఒక చైతన్య వెలుగును నింపుతానన్నాడని చెప్పవచ్చు.

లోకాల సృష్టి జరిగేటప్పుడు, సృష్టి నిర్మాణంలో తాను ఒక కన్నీటి చుక్క నిచ్చాననడంలో, స్వాతంత్రం ముందు ప్రజల దీనస్థితిని చూసి చలించిన శ్రీ శ్రీ కొత్త సృష్టి జరగడానికి తనవంతు పాత్ర పోషిస్తాను అంటాడు. అంతేకాదు లోకమంతా బాధతో విలవిలలాడుతూ ఉంటే తాను కూడా పెద్ద గొంతుతో అరిచాడు. ప్రపంచంతో మమేకమైన నా 'నేను 'శక్తిగా మారాలని చైతన్య గీతిక వినిపించాడు . సమిధ, ఆహుతి అంటే ఉన్నత ఆశయం కోసం తనను తాను సమర్పించుకోవడం గా, స్వార్థం లేకుండా అంకితమై పోవడమనేది కవితలోని నిగూఢ అర్థం.

ఏ యుద్ధం ఎందుకు జరిగెనో?
ఏ రాజ్యం ఎన్నాళ్ళు ఉందో?
తారీఖులు దస్తావేజులు
ఇవి కావోయ్ చరిత్రకర్థం
- శ్రీ శ్రీ, దేశ చరిత్రలు, పుట:87.

చరిత్రలో నిలిచిపోవడానికి రక్తాక్షరాలు కాదు, సువర్ణ అక్షరాలు కావాలి అంటాడు శ్రీశ్రీ. కురుక్షేత్ర సంగ్రామం ఎందుకు జరిగిందో, ఫలితం ఏమిటో తెలిసిందే. నాటి కాలం నుండి నేటి వరకు ఎన్ని రాజ్యాలు మట్టిలో కలిసిపోయాయో ఒకసారి చరిత్రను చదివితే తెలిసి పోతుంది. ఏ రోజున, ఏ తేదీన యుద్ధం జరిగిందో దానికి సంబంధించిన ఆధారాలు కాదు చరిత్ర అంటే, జాతిని జాగృతం చేసే రాతలుండాలంటాడు శ్రీశ్రీ.

ముగింపు :

నన్నయ్య కాలం నుండి నేటివరకు సాహిత్యంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కవిత్వం అంటే కాలక్షేపం కాదు, కవి అంతరంగిక కల్లోలం, సమాజానికి ఆశా కిరణాలు. ఆధునిక కవిత్వం లో అనేక మార్పులు, నూతన పోకడలు చోటుచేసుకున్నాయి. ఏది ఏమైనా కవిత్వం నిద్రాణమైన వ్యవస్థను మేల్కొల్పే అవుతుంది. సమాజంలోని సంఘటనలను తన భావాలను రూపంలో కవి వ్యక్తం చేస్తే, ఆ భావాలను తనకు అనుగుణంగా

మార్చుకునే వాడే పాఠకుడు. అలాంటి కవితలే నేటి సమాజానికి మార్గదర్శకాలు.

శ్రీ శ్రీ శ్రీ కవితలు అభ్యుదయ సంఘర్షణ. ప్రతి కవిత కూడా భావితరానికి ఉపయోగపడేదే. ముఖ్యంగా మహా ప్రస్థానం ఆనాటి సమాజాన్నే కాదు, నేడు అంతేకాదు ముందు తరాల సమాజాన్ని కూడా ప్రభావితం చేయడమే కాదు, చైతన్య మార్గంలో నడిపించేది అని చెప్పవచ్చు. భయంతో, చేతగానితనం తో బ్రతికినా చచ్చినట్లే అన్న శ్రీశ్రీ కవితా పంక్తులు ప్రతిరోజు చదవాల్సిన పారాయణాలు. ఎందుకంటే నేడు యువత ఎటువైపు వెళ్తుందో ఏం చేస్తుందో తమకే తెలియనంతగా ప్రయత్నం చేస్తుంది. శ్రీ శ్రీ కవితలు యువతలో చైతన్యాన్ని కలిగించి ఒక కొత్త మార్గాన్ని, కొత్త దార్శనికతను చూపిస్తాయని చెప్పవచ్చు. ప్రతి కాలంలో రెండు వర్గాలు ఉండనే ఉంటాయి ఒకటి దోపిడీ వర్గం రెండు బానిస వర్గం. ఎప్పుడైతే బానిసత్వం లోని జీవులుగా ఉంటామో అప్పుడు మనలో చైతన్యం కలిగించడానికి శ్రీ శ్రీ కవితలు చక్కని ఔషధాలు. భావితరానికి చైతన్య కిరణాలు అందించిన శ్రీ శ్రీ కవిత్వం ఎప్పుడూ నిలిచిపోతుంది.

మనలను నడిపించే శక్తి ఎక్కడో లేదు మనలోనే ఉంది అది తెలుసుకుంటే చాలు వెనకడుగు వేసే ప్రసక్తే ఉండదు. కానీ ఈ విషయం తెలియక చాలామంది తమలో తామే కుమిలిపోతూ, ఎవరో వచ్చి తమను రక్షిస్తారని ఎదురుచూస్తూ కాలాన్ని వృధా చేసుకుంటారు. కాలంతో పాటు జీవితం కూడా కరిగిపోతుంది. జీవితంలో మనం చేరాల్సిన లక్ష్యం చేరకుండానే ఆగిపోవాల్సి వస్తుంది. అందుకే ఎదురు చూపులు మాని, ఎదురు తిరిగితే నువ్వే ఒక సైన్యం అని చెప్పే కవితలు మహా ప్రస్థానంలో ఉన్నాయి.

ఇలాంటి కవితలు ముందు తరాల భవిష్యత్ ను చూపించడమే కాదు, దేశప్రగతికి కూడా సాధనాలు అవుతాయి. ప్రతి పౌరుడు ఒక ఆయుధం కావాలనే శ్రీశ్రీ కవితా భావాలు ఆదర్శంగా భావించింది ముందుకు సాగినప్పుడే మహాప్రస్థానం చేరగలుగుతాం

ఉపయుక్త గ్రంథ సూచి :

1). ప్రజా కవి దాశరథి సాహిత్యం, డాక్టర్ దాశరథి కృష్ణమాచార్యులు ,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్,2017
2). తెలుగు సాహిత్య సమీక్ష జి నాగయ్య 2003.
3). స్వామి వివేకానంద జీవితం సందేశం, రామకృష్ణ మఠం గ్రాఫిక్ ప్రింటర్స్, విజయవాడ, 2012.
4). తెలుగు సాహిత్య చరిత్ర ద్వా.నా.శాస్త్రి ,విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2007.
5). మహాప్రస్థానం, శ్రీ శ్రీ, నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2020.
6). తెలుగు సాహితీ మంజీర, తెలుగు అకాడమీ, నవతెలంగాణ ప్రింటర్స్, హైదరాబాద్ ,2018.
7). సాహితీ దుందుభి, తెలుగు అకాడమీ, నవతెలంగాణ ప్రింటర్స్ ,హైదరాబాద్, 2021.
8). ప్రజా కవి కాళోజీ, సాహిత్య సమాలోచన,

❖❖❖

శ్రీశ్రీ సాహిత్యంలోని పాటలలో మాటలు

– కే. తేరేష్ కుమార్, పరిశోధక విద్యార్థి(యుజిసి-జేఆర్ఎఫ్), తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

శ్రీశ్రీ సినిమా పాటకు శ్రీకారం చుట్టడం మహాప్రస్థానం గ్రంథ రూపంలో వెలువడడం రెండూ 1950 లోనే కావడం యాదృచ్ఛికము.1940 లో విడుదలైన కాలచక్రంలో శ్రీశ్రీ మహాప్రస్థాన గీతం కొన్ని మార్పులతో ఉపయోగించ బడినా, దాన్ని ఆయన తన మొదటి సినిమా పాటగా పరిగణించలేదు.1950లో వచ్చిన ఆహుతి డబ్బింగ్ చిత్రంతోనే శ్రీశ్రీ సినీ వ్యాసంగం ప్రారంభమైంది.వాటిలో మొదటిదే ''ప్రేమయే జనన మరణలీల''అనేది తన ప్రథమ గీతమని శ్రీశ్రీ స్వయంగా పేర్కొన్నారు.సినిమా కోసం శ్రీశ్రీ ఎక్కువ పాటలు రాసిన మొదటి చిత్రం 1952లో విడుదలైన మరదలు పెళ్లి. శ్రీశ్రీ సుమారు 200 చిత్రాలకు, 80 డబ్బింగ్ చిత్రాలకు కలిపి దాదాపు 1000 పాటలు రాసినా సంఖ్యాపరంగా డబ్బింగ్ చిత్రాలే ఎక్కువ ఉండటం విశేషము.

బహుముఖంగా చిత్ర గీతాలు రాసిన శ్రీశ్రీ ఆ రంగంలో అనేక ధోరణులకు ఆద్యులు, అగ్రగణ్యులూ అయ్యారు.మాతృకకు మక్కీకి మక్కీ కాకుండా అవసరమైన మేరకు మాత్రమే పెదవుల కదలికలను పాటించి, తెలుగు నుడికారంతో పాటలు రాసి, దానికొక ఒరవడి ప్రవేశపెట్టారు. వామపక్ష భావజాలంతో సామ్యవాద గీతాలను రాసి సినీ పరిశ్రమలో చైతన్య గీతాలకు అంకురార్పణ చేశారు. తెలుగు సినిమాల్లో ఎక్కువ దేశభక్తి గీతాలను రచించినా ఖ్యాతి కూడా ఆయనకే దక్కుతుంది. మహాప్రస్థానం, ఖడ్గసృష్టి కవితా సంకలనాల్లో ముందుగా వెలువడి ఆ తర్వాత పాటలుగా సినిమాలకెక్కినవి పాతిక పైనే ఉన్నాయి.ఈ విషయంలో అగ్రతాంబూలం శ్రీశ్రీదే. ఆకలి రాజ్యం, మహానది సినిమాలో కథానాయకుడు మహోద్రేకంగా శ్రీశ్రీ కవితల్ని ఉటంకించడం తెలుగు సినీకవుల్లో ఆయనకు మాత్రమే దక్కిన ఘనత.

కవిత్వంలో చందోబందోబస్తులను ఛట్ ఫట్ చేయమన్న శ్రీశ్రీ అనేక సాంఘిక చిత్రాల్లో కూడా పద్యాలను రచించారు.బొబ్బిలి యుద్ధంలో మధురాతి మధురమైన జావళి రాసి తనకు చేతకాని ప్రక్రియ లేదని నిరూపించారు.తన పాటల్లో తనకు నచ్చినది మాత్రం పంతాలు పట్టింపులు లోనే ''ఇనుకోరా,ఇనుకోరా ఈ మల్లన్న మాటే ఇనుకోరా'' గా ప్రకటించారు.ఆరాధనలోని నా హృదయంలో నిదురించే చెలీ ప్రేమగీతంలో ఆ చెలి ఎవరని ఓ విమర్శకుడు ప్రశ్నిస్తే, ఆ చెలి 'కమ్యూనిజం' అని చమత్కరించారు. శ్రీశ్రీ పేరు చెప్పగానే మూడు ముఖ్యమైన పాటలు గుర్తొస్తాయి.అవి తెలుగు సినిమా పాటకు మొదటి జాతీయ పురస్కార గౌరవాన్ని దక్కించిన అల్లూరి సీతారామరాజు చిత్రంలోని 'తెలుగువీర లేవరా'. బతుకు మీద విరక్తితో ఆత్మహత్యకు పూనుకున్నఓ వ్యక్తిని ఆ ప్రయత్నం నుంచి విరమింపజేసి, పూర్ణాయువును పోసిన వెలుగునీడలు చిత్రంలోని

'కలకానిది విలువైనది
బ్రతుకు కన్నీటిధారలలోనే బలిచేయకు'

పాట.ఓ కన్నడ ప్రేక్షకున్ని సైతం కేవలం ఆ పాట కోసం 20 సార్లు ఆ సినిమా చూసేలా చేసిన పునర్జన్మ చిత్రంలోని 'ఓ సజీవ శిల్పసుందరీ' పాటలతో సినీ గీతాలకు కొత్త నడకలు నేర్పారు.శ్రీశ్రీ పాటలో ప్రణయ రాగాలను పలికించారు, ప్రణయ గర్జనలు పుట్టించారు. హాస్యాన్ని తొణికించారు.శృంగారాన్ని ఒలికించారు, నిప్పులురిమే ఉద్యమ గీతాలను, ఉత్తేజాన్ని నింపే దేశభక్తి పాటలూ రాశారు. ఒక్క మాటలో చెప్పాలంటే నవరసాలతో పాటలను పరవళ్ళు తొక్కించారు.శ్రీశ్రీ పాట గురించి ఏమని చెప్పగలం? ఆయన పాట జలపాతం,

వర్షాకాభ్రముల ప్రళయఘోష. కాళికాదేవి నాలిక. కత్తి మొన మీద నెత్తుటి చుక్క, హేమంత సమీరం, తుషార శీతలం, వెచ్చని నీడ, పచ్చని పైరు అని చెప్పవచ్చు.

శ్రీశ్రీ పాటలు రాయడం ఏమిటి తప్పుతప్పు అని అప్పుడప్పుడు కొంతమంది నోరుపారేసుకున్నా, నొసలు చిట్లించినా సినిమాకు శ్రీశ్రీని దూరం చేయలేదు.ఆహుతి సినిమాలో ఆయన రాసిన 'జనన మరణలీలలో' అనే పాటలో మృత్యుపాశం, అమర బంధం,యువ ప్రాణులు, హృదయ సదనం, సుకృత జన్మం,మధుర మధురతనం అనే పదాలను ప్రయోగించి వారి నోటికి తాళం వేశాడు శ్రీశ్రీ. సినీ రంగంలో ఉంటూ పెట్టుబడిదారీ వ్యవస్థ పై సామ్రాజ్యవాద శక్తులపై ఆవేశాన్ని, ఆక్రోశాన్ని, అసహ్యాన్ని ఆయన పాటల్లో ప్రస్ఫుటింపజేశారు.ఆ పాటలన్నింటి పుట్టుక పెద్ద మోసం అంటూ చెప్పుకోగలగటం శ్రీశ్రీకే చెల్లింది. అది ఆయనలోని నిక్కమైన నిజాయితీకి నిదర్శనం. అయితే మోసం అంటూనే ఏ పాటను తేలిగ్గా తీసుకోలేదు. అషామాషీగా రాయలేదు. ప్రతిదానికి కష్టపడ్డాడు. ప్రతిదాన్నీ ఇష్టపడ్డాడు. సినిమా పాటల్లో వ్యక్తమైన భావాలు చాలా వరకు తనవి కావని డబ్బిచ్చి రాయించుకున్న నిర్మాతలవనీ, వాళ్లు కోరినవే తాను రాసి పెట్టానని శ్రీశ్రీ చెప్పుకున్నా, చాలా పాటల్లో ఆయన అభిప్రాయం స్పష్టంగా వినిపిస్తుంది. శ్రీశ్రీ కలం పడితే పదాలు అలా వరుసలో నిలబడాల్సిందే కానీ... ఆయన ఏనాడు శబ్దాల కోసం బుర్ర బద్దలు కొట్టుకోలేదు. కలం జోరుగా హుషారుగా సాగిపోయేది. పాటలోనూ అంతే భార్యాభర్తలు సినిమాలోని జోరుగా హుషారుగా పాటలాగా సాగిపోయేది.

శ్రీశ్రీ అన్ని రకాల పాటలు రాశారు.నవరసాలు ఒలికించారు. వైరాగ్యము రాశారు, వేదాంతాన్ని రాశారు. రెండింటినీ కలగలిపి కషాయం తయారు చేస్తే దాని ఘాటుకి దేవుడు ఉక్కిరిబిక్కిరయ్యేంతగా రాశారు.దేవత సినిమాలోని 'బొమ్మను చేసి ప్రాణము పోసి' అన్న పాటకు నిజంగానే దేవుడు ఉక్కిరిబిక్కిరి అయ్యే ఉంటాడు. అలాగే డాక్టర్ చక్రవర్తి సినిమాలోని''మనసున మనసై బ్రతుకున బ్రతుకై''పాటను అప్పట్లో ప్రతి తెలుగు ఇంట్లో మురిపెంగా పాడుకుంటూ మురిసిపోయింది.

జాతిని మేల్కొలిపే పాటలే కాదు, మేల్కొన్న జాతిని ముందుకు నడిపించే సమర గీతాలు కూడా అనేకం రాశారు. తర్వాత ఆయన్ను చాలామంది అనుకరించారు.' నిజంగా నేను ప్రజల కవిని... ఎందుకంటే వాళ్లను చదివాను... చదివిందే రాశాను అనేవారు శ్రీశ్రీ'.ఆత్రేయ దర్శకత్వంలో వచ్చిన 'వాగ్దానంలో శ్రీశ్రీ ఓ పాటలోఎవరో వచ్చి సాయం చేస్తారు అనుకోవటమే పొరపాటు అని అంటారు... అదే పాటను కాస్త మార్చి భూమికోసం సినిమాలో''ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా''అని మళ్లీ ప్రయోగించారు.ఈ పల్లవిని మేజర్ చంద్రకాంత్ సినిమాలో యన్.టి.రామారావు గారు సంభాషణ రూపంలో చెప్పి మరోసారి శ్రీశ్రీని గుర్తు చేశారు.

అప్పటిలో శ్రీశ్రీ రోజుకు రెండు మూడు పాటలు రాసేవారు. కానీ వెలుగునీడలు సినిమాలోని పాడవోయి భారతీయుడా పాటను రాయడానికి మాత్రం పక్షం రోజులు పట్టింది. తెలుగు పాటకు జాతీయస్థాయిలో గౌరవాన్ని తీసుకొచ్చింది శ్రీశ్రీ నే. శ్రీశ్రీ దేశభక్తి పాటలు, జాతిని చైతన్య పరిచే గీతాలను ఎన్నో రాశారు.బలిపీఠం సినిమాలో కలిసి పాడుకుందాం తెలుగు పాట,రాముడు భీముడు లో ఉందిలే మంచికాలం ముందుముందునా, నేటి భారతంలో అర్ధరాత్రి స్వతంత్రం అంధకార బంధురం వంటి పాటలు అనేకం రాశారు.

శ్రీశ్రీ ఓ శతాబ్దపు మహాకవిగా ఓ వెలుగు వెలిగారు. ఆయన పాటా వెలిగింది.వెలుగుతూ ఉంది... సినీ సాహిత్యంలో ఆయన స్పృశించని ప్రక్రియ లేదు.బొబ్బిలి యుద్ధం సినిమాకు ఓ జావళి అవసరమైంది.నేను రాస్తాను అన్నారు శ్రీశ్రీ...'మీరు రాయగలరా అని ప్రశ్నించారు సాలూరు మాస్టారు.. గలనో లేనో చూడండి' అంటూ

నిమిషాల్లో' నిను చేరా మనసాయరా' పాట రాసి అనుమాన పడ్డ వాళ్ళ ముక్కున వేలేయించ్చారు.వ్యక్తిత్వ వికాసానికి బండెడు పుస్తకాలు చదవక్కరలేదు... గంటలకొద్దీ ప్రసంగాలు వినక్కర్లేదు కేవలం శ్రీశ్రీ పాటలు వింటే చాలు ఎందుకంటే ఆ పాటల ప్రభావం అలాంటిది. నాస్తికుడైనా శ్రీశ్రీ భక్తి పాటలూ రాశారు. వృత్తి ధర్మం కొద్దీ వాటికి న్యాయం చేశారు.వీర రసాన్ని శ్రీశ్రీ పలికించినంతగా మరే రచయిత పలికించలేదు.. పలికించ లేడు కూడా ఎందుకంటే అది శ్రీశ్రీ సొత్తు కాబట్టి. యమగోలలోని సమరానికి నేడే ప్రారంభం పాట వింటే వీర రసంలోని శక్తి ఏమిటో తెలుస్తుంది.

శ్రీశ్రీ ఓ మహోన్నత శిఖరం. ఉవ్వెత్తున లేచిన కడలి తరంగం.30 ఏప్రిల్ 1910న జన్మించిన శ్రీశ్రీ 15 జూన్ 1983న అస్తమించారు.శ్రీశ్రీ కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది పురస్కారాన్నిఅందించింది. కాబట్టి శ్రీశ్రీ మాటలతోనే కాదు పాటలతోను ఆడుకుంటాడు అని రుజువైంది. అందుకే" కొవ్వొత్తిని రెండు వైపులా వెలిగించాను అది శ్రీశ్రీలా వెలిగింది" అని పురిపండా అప్పలస్వామి అన్నారు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీశ్రీ సినిమా పాటలు-విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
2. మహాకవి శ్రీశ్రీ-బూదరాజు రాధాకృష్ణ
3. శ్రీశ్రీ జయభేరి-తెలకపల్లి రవి
4. వెండితెరపై మహాప్రస్థానం-శ్రీశ్రీ సాహిత్య నిధి

పద్యాలు సంస్కరణ దృక్పథంతో ముందుకు తీసుకువెళ్ళతాయనడంలో అతిశయోక్తి ఎంతమాత్రము లేదు.

ఆధార గ్రంథాలు :

1. ప్రజాకవి వేమన - ఆచార్య ఎన్. గోపి
2. వేమన శతకం - ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ప్రచురణ
3. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య జి. నాగయ్య, నవ్యపరిశోధక ప్రచురణలు, తిరుపతి.
4. వేమన ఎప్పటికీ... అందరికీ.... - ఆచార్య ఎలవర్తి విశ్వనాథరెడ్డి (సంపాదకత్వం), వేమన ఫౌండేషన్

❖❖❖

సమసమాజ నిర్మాణ చైతన్య స్ఫూర్తి శ్రీశ్రీ

-డా॥. సూరపరాజు వసంత కుమారి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

చిరకాలం జరిగిన మోసం
బలవంతుల దౌర్జన్యాలూ,
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా! ఇకపై చెల్లవు
ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ,
ఒక జాతిని వేరొక జాతీ,
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా! ఇకపై సాగదు

(దేశచరిత్రలు - మహాప్రస్థానం)

ఒక వ్యక్తిని మరో వ్యక్తి, ఒక జాతిని మరొక జాతి పీడించే నీతి ఇక చెల్లదు, అందరూ సమానమే అని నినదించి, తన కలాన్నే ఖడ్గంగా చేసి సమ సమాజ నిర్మాణానికై అక్షర యుద్ధం చేసిన మహాకవి శ్రీశ్రీ. ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తగా ప్రసిద్ధి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు గురించి తెలియని సాహిత్య ప్రియులుండరు. ఏప్రిల్ 30న 1910లో విశాఖపట్నంలో జన్మించి ఎనిమిదేళ్ళ చిరుప్రాయంలోనే తన కవిత్వానికి శ్రీకారం చుట్టిన శ్రీశ్రీ, 1983 జూన్ 15న తన అస్తమయం వరకు అలుపెరగని అక్షరపోరాటం చేశాడు. ఆనాటి సమాజంలో ప్రజల మధ్య పేదలు - ధనికులు, శ్రామికులు - పెట్టుబడి దారులు, ఇలా అంతరాలు, అంతస్తులు, దోపిడీదారితత్వం ఎక్కువగా వుండేవి. అందుకే పీడిత, తాడిత ప్రజల పక్షాన నిలబడి పీడక పాలక వర్గాలపై అక్షర సమరశంఖం పూరించాడు శ్రీశ్రీ.

పతితులారా!
భ్రష్టులారా!
దగాపడిన తమ్ములారా!
మీకోసం కలం పట్టి
ఆకాశపు దారులంట
అడావుడిగ వెళిపోయే
అరచుకుంటు వెళిపోయే
జగన్నాథుని రథచక్రాల్,
రథచక్ర ప్రళయ ఘోష
భూమార్గం పట్టిస్తాను!
భూకంపం పుట్టిస్తాను!

(జగన్నాథుని రథచక్రాలు - మహా ప్రస్థానం)

మోసపోయిన మరియు అనేక బాధలకు గురి అవుతున్న పేద ప్రజల కోసం కలం పట్టి తాను సాహిత్య సమరం చేస్తానని, సమసమాజ నిర్మాణ దిశగా చైతన్యాన్ని రగిలిస్తానని శ్రీశ్రీ ప్రతిజ్ఞ చేశాడు.

నరజాతి చరిత్ర సమస్తం
దరిద్రులను కాల్చుకు తినడం,
బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు.
చల్లారిన సంసారాలూ
మరణించిన జన సందోహం,
అసహాయుల హాహాకారం
చరిత్రలో మూలుగుతున్నవి

(దేశచరిత్రలు - మహాప్రస్థానం)

సమాజంలోని పేదవాళ్ళను, అసహాయులను ధనికులు, బలవంతులు ఎలా దోచుకున్నారో, అందు వలన ఎన్ని సంసారాలు కూలిపోయాయో, ఎంతమంది అసహాయులు ఆర్తనాదాలు పెట్టారో, మరెంతమంది మరణించారో శ్రీశ్రీ తెలిపాడు. ఒకరు తిండికి లేక అల్లాడడం యేమిటి? మరొకడు భోగలాలసతతో వుండడం ఏమిటి? అన్న ప్రశ్నలకు అప్పటి వరకు ఎందరో

చెప్పిన గత జన్మ పాపపుణ్య కర్మల ఫలితమన్న సమాధానాన్ని, శ్రీశ్రీ తన కవిత్వంతో నిరసించాడు. ఆకలితో వున్న ఆడపాము తన గుడ్లనే తాను ఎలా మింగేస్తుందో, అలా చేసుకున్న పాపం వల్ల కాదు మనుషులు ఆకలితో అలమటించడం, ఆకలితో అలమటించడం వలన మనుషులు యెంతటి పాపాన్ని అయినా చేస్తున్నారు. కాబట్టి మనిషి మనిషిగా బతకాలంటే మనిషిని క్షీణింప చేస్తున్న ఆకలి, బాధలను తప్పించాలి, అని సమ సమాజ మరో ప్రపంచ నిర్మాణం కోసం, నవతరాన్ని సృష్టించిన ఆధునిక కవిబ్రహ్మ శ్రీశ్రీ.

నైలునదీ నాగరికతలో
సామాన్యుని జీవనమెట్టిది?
తాజ్‌మహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?
సామ్రాజ్యపు దండయాత్రలో
సామాన్యుల సాహసమెట్టిది?
ప్రభువెక్కిన పల్లకి కాదోయ్
అది మోసిన బోయీలెవ్వరు?

(దేశ చరిత్రలు - మహాప్రస్థానం)

సామాన్య ప్రజలే చరిత్ర నిర్మాతలు, శ్రామికులే చైతన్య ప్రగతి రథచక్రాలు. అటువంటి సామాన్యులకు, శ్రామికులకు జరుగుతున్న అన్యాయాలను శ్రీశ్రీ నిలదీశాడు.

మనమంతా బానిసలం,
గానుగలం, పీనుగులం!
వెనుక దగా, ముందు దగా,
కుడి యెడమల దగా, దగా!
మనదీ ఒక బ్రదుకేనా?
కుక్కల వలె, నక్కల వలె!
మనదీ ఒక బ్రదుకేనా?
సందులలో పందులవలె!

(చేదుపాట - మహాప్రస్థానం)

పెట్టుబడిదారులు శ్రామికులను ఎలా దోచుకుంటూ వున్నదీ, ఎలా దగా చేస్తున్నది వివరిస్తూ శ్రమజీవుల దైన్యాన్ని కళ్ళకు కట్టినట్లు శ్రీశ్రీ తెలిపాడు.

ధనిక స్వామికి దాస్యం చేసే,
యంత్ర భూతముల కోరలు తోమే,
కార్మిక వీరుల కన్నుల నిండా
కణకణ మండే,
గల గల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదు కట్టే షరాబు లేడోయ్!

(ప్రతిజ్ఞ - మహాప్రస్థానం)

కార్మికుల కష్టాలు, కన్నీళ్ళు వెలకందని అమూల్యమైనవని, వారి దాస్యం, శ్రమ దైన్యమని, శ్రీశ్రీ తెలిపాడు.

పొద్దు పొడిచి పొద్దు గడిచేదాకా
ఎద్దుల్లాగ పనిచేసే మమ్మల్ని
మొద్దుల్నీ, మొరటుల్నీ చేసి
ముద్దకి కూడా దూరం చేశాడు.
"ఘోరం ఇది, దారుణం ఇ"దంటే
"ఆచారం! అడుగు దాటరా" దంటాడు
భరించడం కష్టమైపోయి
పనిముట్లు మేము క్రిందను పడవైచి-
"చెయ్యలేం, చస్తున్నాం మేము,
జీవనానికి ఆసరా చూపించ"మంటే-
నోరుమూసి, జోడు తీసి కొట్టి
"దౌర్జన్యానికి దౌర్జన్యం మం"దంటాడు

(వాడు - మహాప్రస్థానం)

పేదవాళ్ళను ధనికులు, కార్మికులను పెట్టుబడిదారులు ఎలా దోచుకుంటున్నారో, వారిపై ఎలా దౌర్జన్యాలు చేస్తున్నారో పై కవితలో శ్రీశ్రీ తెలిపాడు.

ఓహో!మానవుడా!
ధర్మస్థాపనకు యుద్ధం చేసేవాడా!
అన్యాయం భరించలేనివాడా!

ఆదర్శజీవీ! మహాత్మా! మానవుడా!

(మానవుడా! - మహాప్రస్థానం)

ఇది సవనం,
ఇది సమరం!

(జగన్నాధుని రథచక్రాలు - మహాప్రస్థానం)

శ్రీశ్రీ తన సమర శంఖాన్ని పూరించి సమసమాజ నిర్మాణానికి, ధర్మస్థాపనకు, యుద్ధం చేయడానికి పిలుపునిచ్చాడు.

పదండి ముందుకు,
పదండి త్రోసుకు!
పోదాం, పోదాం పైపైకి!
ప్రభంజనం వలె హోరెత్తండీ!
భావ వేగమున ప్రసరించండీ!
వర్షకా భ్రముల ప్రళయ ఘోషవలె
పెళపెళ పెళ పెళ విరుచుకు పడండి!
త్రాచుల వలెనూ,
రేచుల వలెనూ,
ధనంజయునిలా సాగండి!
కనబడలేదా మరో ప్రపంచపు
అగ్ని కిరీటపు ధగధగలు,
ఎర్ర బావుటా నిగనిగలు,
హోమజ్వాలల భుగభుగలు?

(మహాప్రస్థానం - మహాప్రస్థానం)

ఆర్థిక అంతరాలు, అనమానతలు, దోపిడి దారితనంపై తిరుగుబాటు చేసి అవేవి లేని సమసమాజ సామ్రాజ్యమైన మరో ప్రపంచంకు మనమంతా చేరుకోవాలని శ్రీశ్రీ పిలుపునిచ్చాడు.

మానవులంతా ఒకటని
మనిషి గ్రహించే సుదినం
ఇంతట్లో వచ్చే సూ
చన లేవి కానరావు

(సామ్యవాది మానిఫెస్టో - ఖడ్గసృష్టి)

అసమానతలతో నిండిన ఈ సమాజంలో, మనుషులంతా ఒక్కటే అని సమానత్వ హక్కు ఇప్పట్లో వచ్చే సూచనలేవి కనిపిండచడం లేదని శ్రీశ్రీ తెలిపాడు.

అందుకే సృష్టిస్తున్నాను
అధర్మనిధనం చేసే ఈ ఖడ్గాన్ని
కలంతో సృష్టిస్తున్న ఖడ్గం ఇది
జనంతో నిర్మిస్తున్న స్వర్గం ఇది
ఈ కత్తి
కుళ్ళిపోతున్న సమాజ వృక్షాన్ని
సమూలచ్ఛేదం చెయ్యడానికి
దీన్ని
నల్లబజారు గుండెల్లో దించు
దీనితో కల్లాకపటాలను వధించు
ఇది
సమాన ధర్మాన్ని స్థాపిస్తుంది
నవీన మార్గాన్ని చూపిస్తుంది

(ఖడ్గసృష్టి- ఖడ్గసృష్టి)

శ్రీశ్రీ అధర్మాన్ని అంతం చేసి, సమాన ధర్మాన్ని స్థాపించి, అందరికి హక్కులను కల్పించే కొత్త మార్గ నిర్మాణానికై తన కలాన్నే ఖడ్గంగా మలచి కవిత్వమనే ఆయుధాన్ని సంధించాడు.

మనుష్యుడే నా సంగీతం
మానవుడే నా సందేశం

(మహా సంకల్పం - ఖడ్గసృష్టి)

అని ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ.

ఐశ్వర్యం అందరిదీ
అందుచేత అందులోన
సామాన్యుడు తన వాటా
తనకిమ్మని కోరుతాడు
బతకడమే సమస్యగా
పరిణమింప జేసినట్టి
అన్యాయాలన్నిటినీ

హతమార్చాలంటాడు.

(సామాన్యుని కామన - ఖడ్గసృష్టి)

సామాన్యుల ఆర్థిక, సామాజిక హక్కులను వారికి కల్పించాలంటూ శ్రీశ్రీ పై కవితలో కోరాడు.

ఓ మనిషీ! మేల్కో మనిషీ!
నిన్నటి స్వప్నంనేటి యథార్థం
అసాధ్యమన్నది అతి సామాన్యం
ఇరుల తెరలలో ఉంది భయం
ఎదిరిస్తేనే దిగ్విజయం

(సఖ్యం - ఖడ్గసృష్టి)

సమసమాజం సామ్యవాదం అనే కలను నిజం చేసుకోవడం సుసాధ్యమని, ఎదిరిస్తే విజయం తథ్యమని పీడిత ప్రజలకు మేలుకొలుపు పాడాడు మహాకవి శ్రీశ్రీ.

కదలవోయ్ ఆంధ్రకుమారా!
నిద్ర వదలవోయ్ నవయుగం
నిర్మింపగ సాగవోయ్
కదలవోయ్ ఆంధ్రకుమారా!
అదగదిగో రేయిపోయి
వేగుచుక్క వెలిగెనోయ్
సుదూరాన విశాలాంధ్ర
విజయవాణి పిలిచెనోయ్

(సుదూరాన-ఖడ్గసృష్టి)

పేదల జీవితాల్లో చీకట్లు పోయి వెలుగులు నింపే ఆ నవలోక నిర్మాణానికి మత్తు వదిలి కదలాలని జాగృతి నిచ్చాడు. జన హృదయాల్ని గెలుచుకున్న తిరుగులేని మహాకవి శ్రీశ్రీ.

నిన్న తమకంటే హెచ్చువారి కాళ్ళు పట్టుకొని కొలిచి
తమకన్న తక్కువ వారిని కాళ్ల కింద పట్టి అణచి
చిరునవ్వుతో స్థిమితంగా సర్దుకుపోయే మనస్తత్వం
నేడు ఆ మనస్తత్వపు అవశేషాల నెదిరించి
పోరాడుతున్న వారి తిరుగుబాటు
రేగించిన ప్రచండ సంఘర్షణల
ప్రభంజన గర్జన

(ఒకటీ - పదీ - ఖడ్గసృష్టి)

గతంలో తమను తొక్కి పెట్టిన పెట్టుబడిదారులు, బలవంతులు, ధనవంతులపై తిరుగుబాటు చేసి శ్రామికులు, సామాన్యులు, పేదవాళ్ళు తమ హక్కులకై గర్జించమని శ్రీశ్రీ చైతన్య స్ఫూర్తిని రగిలించాడు.

"మాకు గోడలు లేవు, గోడలను పగుల గొట్టడమే మా పని" అంటూ, అసమానతల అంతరాల గోడలు కూల్చివేసి సమ సమాజం కోసం "ముందుకు పోతాం మేము, ప్రపంచం మావెంట వస్తుంది" అంటూ సమ సమాజం స్థాపన కోసం తమ హక్కుల రక్షణకై పోరాడుతాం, అందరూ మావెంట వస్తారని ధీమా వ్యక్తం చేసి ప్రజలలో చైతన్య స్ఫూర్తిని రగిలించాడు. పోరాట పథానికి దారి చూపాడు మహాకవి శ్రీశ్రీ. బహుశా ఆ మహానుభావుని కృషి ఫలితంగానేమో, నాటి సమాజంలో పోల్చితే నేటి సమాజంలో అసమానతలు, అంతరాలు, దోపిడీతత్వం ఎంతో తగ్గిందని చెప్పక తప్పదు.

❖❖❖

అభ్యుదయ కవితా - యుగకర్త శ్రీశ్రీ

- డా॥. మల్లెపోగు వెంకటలక్ష్మమ్మ, తెలుగు అధ్యాపకురాలు, సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ కళాశాల, కర్నూలు.

'జీబ్రాకీ ఆల్‌జీబ్రాకి చిహ్నాల
బాంకోటు సాంకోళ్ళూతిడిగి
సాహిత్య పౌరోహిత్యం యిస్తే '

వెర్రిగాదు సార్ ఈ రియలిజం సోదరా' అంటూ ఖడ్గసృష్టి సృష్టించి పలు కవితలు సర్రియలిజం (అది వాస్తవికత) ఆధారాలు రచించారు.

'నేను సైతం ప్రపంచాబ్బపు
తెల్లరేకై పల్లవిస్తాను
నేను సైతం విశ్వవీణకు
తంత్రి మూర్చనలు పోతాను
నేనుసైతం/ భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను''

అంటూ శ్రామికుడు కంఠాలతో పలుకుతున్న శ్రీశ్రీ ప్రపంచాభ్యుదయం కోసం ఎన్నె ఎన్నెన్నో త్యాగాలు చేశాడు. ఇక్కడ నేను సైతం అనే నుడికారం మానవజాతి చరిత్రలో పేరుకు కూడ నోచుకొని ఒకసామాన్యుడి ప్రాముఖ్యం కలిగిస్తోంది. తరతరాల నుండి చరిత్రలో గుర్తింపు లేదు. వీరు 'మహాప్రస్థానంలో' ఈ జయభేరిని మోగించాడు. మహాప్రస్థానంలో నలభై ఖండికలు ఉన్నాయి. 'కొంపెల్ల జనార్ధన రావు కోసం' అనే గీతం కలిపితే నలభై ఒకటి. ఈ సంకలనంలో మొదటి కవిత 'మహాప్రస్థానం' అయినా ముందుగా రచించిన కవిత 'జయభేరి'.

అయితే శ్రీశ్రీ మహాప్రస్థానంలో మార్క్సిజం ప్రభావం వుందనీ గతి తార్కిక భౌతికవాదం వుందని విమర్శకులు వ్యాఖ్యానించారు. అయితే ఇది చర్చనీషంశం అయింది. 1970 లో 'సృజన పత్రిక'కి ఇంటర్వ్యూ ఇస్తూ శ్రీ శ్రీ స్వయంగా ఇలా అన్నారు.

మహాప్రస్థానం అనే గీతం రాసే నాటికి మార్క్సిజం గూర్చి తెలియనే తెలియదు. నేను మార్క్సిజం తెలుసుకున్నది సాహిత్యం ద్వారానే కాని రాజకీయాల ద్వారా కాదు అంటారు.

అయిన శ్రీశ్రీ 'మహాప్రస్థానం' లోని ఖండికలు మార్క్సిజం లక్షణాలు ఉండటానికి అభ్యంతరం అక్కర్లేదు. ప్రాచీనకవులు భావించినా, భావింపకపోయిన ఉద్దేశించినా ఉద్దేశించకపోయినా మన పండితులు కొత్త అర్థాలతో వ్యాఖ్యానాలు లాగటం లేదా? అలాగే శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లోని కవితల్లో వ్యాఖ్యానించినపుడు ఆ భావజాలం ప్రతిబింబించే అవకాశం వుంది. సామాజిక పరిశీలనతో, కమ్యూనిష్టభావాజాలం నేపథ్యంగా రచించడం వల్ల జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను ఆకలింపు చేసుకోవటం వల్ల 'మ్యానిఫెక్టో ఆఫ్ లండన్ ప్రోగ్రెస్యూ రైటర్స్ లసోసియేషన్ లండన్ అభ్యుదయ రచయితల సంఘం.

మ్యానిఫెక్టో చదవడంల వల్ల శ్రీశ్రీ పై పరోక్షంగా మార్క్సిజం ప్రభావం అంతో ఇంతో లేకుండా ఎలా వుంటుంది. గురుజాడ, నజ్రుల్ ఇస్లాం, స్వన్‌బర్గ్, ఎడ్గార్ ఎల్‌న్‌సో, బెర్టోల్డ్ బ్రెట్, మయకోవస్కి, గోర్కి, బోదలెల్, క్రిష్టఫల్, కాల్డ్‌వెల్, హల్ఫ్‌పాక్స్ మొదలైన ఎందరో రచయితల ప్రభావం శ్రీశ్రీ మీద వుంది. 'గాలి మొసగెడు క్రొత్త ఱెక్కల ధరించి

అతిని రాఘాటముగ విహాయాస పదాల
నెఱుక పడరాని, ఎచటికోఎగిరిపోదు- శ్రీశ్రీ

'భారత కురుక్షత్రంలో
నవయువ భగవద్గీతలా ఝంఝని ప్రసరిస్తాను.
మంటల చేత మాట్లాడించి
రక్తంచేత రాగాలాపన చేయిస్తాను. అని అన్నది

శ్రీశ్రీ గారు 'కాదేదీ కవిత కనర్హం' అని కొత్త సిద్ధాంతం ప్రతిపాదించాడు.

'నైలునది నాగరికతలో, సామాన్యుని జీవన మెట్టిది?
తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలివ్వరు?

ప్రభువెక్కిన పల్లకి కాదోయ్, అది మోసిన బోయీ లెవ్వరు?

'కదిలేది కదిలించేది- మారేదీ మార్పించేదీ
పాడేది పాడించేది - పెనునిద్దర వదిలించేది...ఇదే కవిత్వం అంటాడు

'5,3,2 ఆముక్త మాల్యద
ఆటవేలది ద్విపద కత్తగారు'

అంత గొప్ప కవి శ్రీరంగం శ్రీనివాసరావు 1910లో విశాఖపట్నంలో జన్మించాడు. ఎనిమిదో ఏటనే పాడుగు పాట్టి పాదాలతో కంద పద్యం రాశాడు. చిన్న వయస్సు లోనే 'సావిత్రి సత్యవంతుడు' పద్య నాటకం రచించాడు. తెలుగు కావ్యాలు చదువుకున్నాడు. పదిహేను సంవత్సరాలకే ఛందస్సు బాగా అలవడింది. శ్రీశ్రీ 'విశ్వ రూప సందర్శనం' అనే గీత మాలికను రచించాడు. ఇదే అతని మొట్టమొదటి పద్య రచనఅనీ అరుద్ర పేర్కొంటూ కొన్ని పంక్తులు ఉదాహరించాడు. నరసింహ విజయ యసింహాలు, పరిణియ, రహస్యము అనే నవలలు రచించాడు. కొన్ని ఖండికలతో 'ప్రభవ ' అనే కావ్యం ప్రచురించి పండితుల మెప్పు పొందాడు.

1929లో శ్రీ శ్రీ రాసిన 'సుప్తాస్థికలు' అనే గీతాన్ని ' భారతి సాహిత్య పత్రిక అచ్చు వేయ్యకుండా తిప్పేసింది.' తర్వాత శ్రీశ్రీ టైఫాయిండ్ జ్వరంతో చాలా బాధపడి చావు నుంచి బయటపడ్డారు. ప్రతి కోత్త ఉద్యమాన్ని ఆహ్వానించాడు. దిగంబర కవిత్వాని సమర్ధించాడు. విప్లవ సంఘ అధ్యక్షుడయ్యాడు. అయితే ఆశయాలకి ఆచరణకీ వైరుధ్యం కూడ లేకపోలేదు. ఏమైనా శ్రీశ్రీ ఒక యుగకర్త అనిపించుకున్నాడు.

మహాప్రస్థానం అంటే గొప్ప ప్రయాణం. వీరు రాసిన ఈ క్రింది గేయం.

'మరోప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు
పదండి తోసుకు

పోదాం పోదాం పైపైకి అంటూ రాసిన ఈ గేయం ఒక సమరగీతంలా ... ఇందులో పీడిత సమాజం నుంచి సామ్యావాద వ్యవస్థకి, సమసమాజానికి పయనించటమే మహాప్రస్థానం.

కడుపు దహించుకుపోయే
పడుపుకత్తె రాక్షస రతిలో
అర్ధ నిమీలిత నేత్రం
భయంకర బాధల పాటల పల్లవి
ఉరితీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం
ఉన్నది మనశ్వని వారిలో ఘాకం భేదం, భేకం దాకా

అంటూ శ్రీశ్రీ రచించిన మహాప్రస్థారంలో 'కవితా ఓ కవితా' లాంటి కవి వుండాలని కోరుకుంటుంది అభ్యుదయ సమాజం.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అభ్యుదయ కవి - శ్రీశ్రీ

- డా॥. బి. చక్రవర్తి

శ్రీశ్రీ భావకవిగా పాట మరిచి, అభ్యుదయ కవిగా వికసించి, విప్లవకవిగా పరిణమించిన ఆధునికాంధ్ర కవులలో శ్రీశ్రీ ఒకరు. అభ్యుదయ కవిత్వం, నవీన కవిత్వం దృక్పథాలన్నింటికీ సామాజిక స్పృహే మూలం. సంఘప్రగతికీ మానవాభ్యుదయానికీ, సామాజిక దురాచారాలను పరిష్కారాలనూ ప్రభావితంగా ప్రదర్శించి నది అభ్యుదయ కవి శ్రీశ్రీ. ఆధ్యుడూ, నవీన కవిత్వముగ కర్త సామాజికాభ్యుదయానికి శ్రీశ్రీ కవిత్వం బాటలు వేసింది. అభ్యుదయ కవిత్వానికి బలమైన ప్రతినిధి. పద్దెనిమిదవ ఏట ప్రభవకావ్యం వెలువడింది. దీనికి పురిపండా అప్పలస్వామి పీఠిక రచించారు. శ్రీశ్రీ బి.ఎ., పూర్తి చేసిన తర్వాత టైఫాయిడ్ జ్వరంతో రెండు నెలలు బాధపడ్డారు. ఆ సమయంలో శ్రీశ్రీ ఆలోచన విధానంలో మార్పువచ్చింది. కవిత్వానికి చంధస్సు అవశ్యకమనే భావం తొలగిపోయి దేశదేశాల కవుల రచనలు చదవటంలో ఊహాపరిధి విస్తృతమైంది. శ్రీశ్రీ బ్రతుకు తెరువు కోసం రకరకాల ఉద్యోగాలు చేశారు. పురిపండా వడ్డాది సీతారామాంజనేయులతో కలిసి కవితాసమితి స్థాపించారు. 1930-40 దశాబ్దంలో ప్రపంచమంతా పేద, మధ్య తరగతి ప్రజల జీవితం దుర్భరంగా సాగింది. ఈ కాలాన్ని చరిత్రకారులు Hungry Thirties అని పిలుస్తారు. ఈ దశాబ్దంలో శ్రీశ్రీ కవిత్వం ఒక వెలుగు వెలిగిందని చెప్పవచ్చు.

గురజాడతో ప్రారంభమైన కవితావిప్లవం శ్రీశ్రీతో ముందంజ వేసింది. శ్రీరంగం శ్రీనివాసరావుగా ఉన్న కవి ప్రభ, సుస్తాస్థికులు రచించిన తర్వాత శ్రీశ్రీ అనే కలం పేరుతో ప్రసిద్ధుడయ్యారు. 1930 దాకా తెలుగు కవిత్వం తనను నడిపిస్తే ఆ తర్వాత తెలుగు కవిత్వాన్ని తానే నడిపించానని శ్రీశ్రీ ఒక సందర్భంలో పలికారు. "ఈ శతాబ్దం నాదే" అని శ్రీశ్రీ సగర్వంగా పలికారు.

మహాప్రస్థానం కవితాసంపుటి చలం యోగ్యతా పత్రంతో వెలువడింది. అప్పటికే ఇది సాహిత్యలోకంలో సంచలనం కలిగించింది. యువ, నవకవులకు శ్రీశ్రీ ఆరాధ్యుడయ్యాడు. తరువాత వచ్చిన కవులు శ్రీశ్రీ ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయారు. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, బిగించి, శాసించి, రక్షించే అపూర్వశక్తి"గా మహాప్రస్థాన కావ్యసంపుటిని చలం కొనియాడాడు, కవిత్వంలో ఎప్పుడు ఏ కొత్తదనం వచ్చినా దాన్ని ఆదరించటం శ్రీశ్రీ స్వభావం. సాయుధ పోరాటమే సాంఘిక సమస్యలకు పరిష్కార మార్గమని నమ్మిన విప్లవ రచయితల సంఘానికి ఆయన సంస్థాపకులు అధ్యక్షులు బ్రతుకులో నిరంతరం ఎక్స్‌పెరిమెంటు విదూషకుని టెంపర్‌మెంట్ తనలో ఉన్నాయని శ్రీశ్రీ సెల్ఫ్‌పోర్ట్రిట్‌లో చెప్పుకున్నారు. శ్రీశ్రీ రకరకాల కవితా ప్రయోగాలు చేశారు. శ్రీశ్రీ రచనల ద్వారా తెలుగు సాహిత్య స్వరూపంలో సమూలమైన మార్పువచ్చింది. చలం చెప్పినట్లు "ఇంకా రాత్రి చీకట్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంట్లో దీనంగా పలవరించే ఉషాగమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు శ్రీశ్రీ. ఆంధ్రవిశ్వవిద్యాలయంలో దేశదేశాల కవుల గ్రంథాలు చదివి మనస్సుకు పట్టించుకున్నారు. శ్రీశ్రీ రచించిన జయభేరి, నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను అనేది అభ్యుదయ కవిత్వానికి నూతన కవాటాలు తెరిచింది. ఆంగ్లసాహిత్యం ఫ్రెంచి జాతీయగీతం, హరీన్ ఛటోపాధ్యాయ, ఎడ్గార్ ఎలన్‌పో, గురజాడ, కవి కొండ గేయాలు మహాప్రస్థాన గేయానికి మార్గదర్శకమయ్యాయని చెప్పుకున్నారు. ఆదిశంకరుల భజగోవిందం తన మరో ప్రపంచం గీతం నడకకు తోడ్పడిందని కూడా ఆయన తెలిపారు. శ్రీశ్రీ చేసిన కావ్య రచనలు ఏకకాలంలోనే పండితపామరులు

భములనే రంజింపజేశాయి. తర్వాతి కవులందరూ శ్రీశ్రీ మార్గాన్ని అనుసరించారు. తన తర్వాత కవులంతా తన నోట్లోంచి ఊడిపడినట్లుగా తన మానసపుత్రులైనట్లుగానో అనురక్తులైనట్లుగానో ఏ కవి నిండుగా నిర్భయంగా, స్పష్టంగా, బలంగా రాసిపోతాడో, ఏ కవి యొక్క ఆవిర్భావం వల్ల ఈ ప్రపంచం ఇంకో అడుగు ముందుకు వేస్తుందో ఆ కవి మహాకవి అయేట్లుంటే నిస్సంసయంగా మహాప్రస్థానం కవి మహాకవి గండ బేరుండం అని కె.వి. రమణ రెడ్డి తెలిపారు.

శ్రీశ్రీ రచించిన ప్రతిజ్ఞగీతం సమకాలిక తెలుగు రచయితల గుండెలలో సెగలు పొగలు కక్కుతున్న ఆవేదనలను అక్షరరూపమిచ్చినట్లయింది. కార్మిక కర్కశ క్షేమమూ, వివిధ వృత్తుల వల్ల జీవించే శ్రామికల క్షేమమూ కోరటం అవశ్యకర్తవ్యమని రచయితలు గర్తించారు. ఊహాప్రేమికుల గురించి, ప్రకృతి సౌందర్యం గురించి, దేశభక్తి కవిత్వం గురించి ప్రయోజనం లేదని తెలుసు కున్నారు. ప్రతిజ్ఞ గీతం సామాన్య మానవుణ్ణి కథా నాయకుణ్ణి చేసి శ్రమజీవికి ఉచితాసనం ఇచ్చింది. దీనితో తెలుగు సాహిత్యస్వరూపమే మారిపోయింది.

పొలాల నన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ
విరామ మెరుగక పరిశ్రమించే,
బలం ధరిత్రికి బలి కావించే
కర్షక వీరుల కాయం నిండా
కాలువ కట్టే ఘర్మజలానికి
ఘర్మజలానికి
ధర్మజలానికి
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్!

పై గేయంలో పొలాలన్నిటినీ నాగళ్ళతోదున్ని భూమిలో నుండి బంగారాన్ని వెలికి తీస్తూ ఎడతెగక శ్రమపడుతూ బలాన్ని భూమికి బలికావించే, రైతువీరుల శరీరాల నిండా కాలువలు కట్టి చెమటకు, శ్రామికశక్తికి ధర్మజలానికి ఖరీదుగట్టే షరాబు లేదు. నరాలబిగువును, కరాల సక్తువును వరాల వర్షం కురిపించాలని, ప్రపంచభాగ్యం వర్ధిల్లాలని గనులలో, తోటల్లో, కార్ఖానాల్లో శ్రమపడుతూ కదులుతూ ధనికస్వాములకు దాస్యం చేస్తూ, యంత్ర భూముల కోరలు తోమే కార్మికదీరులు కన్నుల నిండా కణకణమండుతూ, గలగల తాణకే శోకాగ్నులకు, శోకభాష్పాలకు ఖరీదుగట్టే షరాబులేదు. నిరపరాధులైనా దురదృష్టం చేత చెరసాలల్లో చిక్కేవాళ్ళూ యంత్రాలనే లోహరాక్షసులు పాదాల కిందపడి కొనప్రాణాలతో కొట్టుకునేవాళ్ళు, శ్రమపడినా ఫలితం దక్కక తెగించి సమ్మెలు కట్టేలా చేసిన శ్రమ అంతా నిష్పలం కాగా పుట్టుకే ఒక శాపమై నూతిని గోతిని వెతికే స్త్రీలు, అనాథలూ, అశాంతులూ దీర్ఘశృతితో తావు ధ్వనితో విప్లవం అనే శంఖధ్వానాన్ని వినిపిస్తారు. శ్రీశ్రీ ప్రతిజ్ఞ గీతం వ్యధార్థ జీవిత యథార్థ దృశ్యాలను చూసారు. తెలుగు పాఠకు లకు, కవులకు కళ్ళు తెరిపించారు. సమాజ శ్రేయస్సును మించిన పరమ లక్ష్యం ఆధునిక కవికి మరేదీ లేదని స్పష్టం చేశారు. తెలుగు కవిత్వ మార్గాన్ని అభ్యుదయ మార్గంలో సమసమాజ లక్ష్యం వైపు నడిపించిన ప్రతిజ్ఞ తెలుగు సాహిత్యంలో ధృవ నక్షత్రం వంటిది. త్రోవ తిప్పి తిరుగాడుతున్న కవులను సరియైన త్రోవను నిర్దేశించిన ప్రతిజ్ఞ నిస్సందేహంగా ఉత్తమ గీతం.

మరో ప్రపంచం
మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది!

మహాప్రస్థానం ప్రధానంగా మార్క్సిజం ప్రభావితంతోనే ఆవిర్భవించింది. అంటే సామాజికంగా ఉన్న వర్గస్పృహ శ్రీశ్రీ కవిత్వానికి కొంత ఆలంబన అయింది. కేవలం మార్క్సిజం ప్రభావమే కాక, ఇతర విషయాలను కూడా శ్రీశ్రీ కవిత్వీకరించారు. ఆధునిక కవిత్వానికి వాస్తవికత, కాల్పనికత వాదంతో కొంత ఆశ్రయించింది. భావుకవులది ప్రధానంగా ఆత్మాశ్రయధోరణి కాగా అభ్యుదయకవులది

వాస్తవికధోరణి బుర్జువా వ్యవస్థ చేతకానిది సామ్యవాద విప్లవాన్ని తెచ్చేది. కేవలం శ్రామిక వర్గమేనని శ్రీశ్రీ ప్రధానంగా ఆశించాడు. ఆ విప్లవమే శ్రీశ్రీ కవితావస్తువు అయింది.

"కదిలేది కదిలించేది
పెను నిద్దుర వదిలించేది" అంటూ భావనలతో మానవుని మెదళ్ళలో నవచైతన్యాన్ని కలిగించారు శ్రీశ్రీ. సాహిత్య లతకు చైతన్యసుమమై విరబూశారు. వారిలో దాగిన ప్రతిభను కొంచెంకొంచెంగా కాంతిపుంజమై వెలిగించారు. అది

నేడే
ఈనాడే
జగమంతా బలిడిమర్థి
నరజాతికి పరివర్తన
నవజీవన శుభ సమయం అభ్యుదయం"

తన హృదయ మహాప్రస్థానాన్ని కొనసాగించారు. అభ్యుదయానికి హారతినిచ్చి చైతన్యాన్ని ఆహ్వానించి మానవత్వాన్ని మానవ హృదయాల్లో మళ్ళీ నింపడానికి మహాఋషిగా అవతరించారు. 1910లో వెలుగురేఖలా వేగుచుక్కలా మెరిసారు. చిన్నతనంలోనే తండ్రి ఆదర్శరువ్వించి మానవతను రక్తంలో కలుపుకున్నారు.

"సాటి మనిషిపై మమతే మానవతా
అది మేటి మనిషిగా తీర్చిదిద్దును సమతా
మానవునికి మంచినేర్పు
మతం పుట్టెను
కాని కాలగతిన కుళ్ళునెంతా
కూర్చి పెట్టెను

అలా మానవుడు మతం, జాతి, కులం అంటూ విడిపోయి విడివిడిగా, వడివడిగా, మానవత్వం మరిచి బండరాయిగా మారుతూ జీవచ్ఛవమవుతుంటే నిద్రలేపాలని కంకణం కట్టుకున్నాడు శ్రీశ్రీ. బడి పంతుళ్ళు నేర్పిన పాఠాల్లోని నీతుల్ని ఆ నాలుగు గోడలకే పరిమితం అని తెలుసుకుని సమత, సమానత్వం, సమసమాజం, నవసమాజం కావాలని నేను వ్రాయాలి. నేనే వ్రాయాలి అని కొత్తకొత్త ఆలోచనలతో అక్షరాల్ని ప్రాతిపదిక చేసి పొట్టి, పొడుగు వరసల్ని వ్రాసి కందమని తండ్రికి చూపిస్తే "అప్పకవీయం" అందుకొమ్మనగా, శ్రీశ్రీ భావితరానికి భావకవిత్వం అందించారు. అతనితో తన మిత్రులు శ్రీ బాబు చాసో ఎంతో అన్యోన్యంగా వుండి వారిని ఎదిగించారు. ప్రపంచం ఎలా వున్నా పక్కనున్న మిత్రుడు బాగుంటే ప్రపంచం కనబడు తీరే వేరు. సఖుల అండదండలే మెడలో దండలై అద్భుతాలు కాగలవు. ఏ కవికైనా శ్రీశ్రీకైనా మానవత్వమున్నవారే మానవతావాదిగా ఎదగగలరు. ఎదుటి మనుషుల బాధల్ని అర్థం చేసుకోగలరు.

ఆదుకోగలరు అది లేనివారు బండరాళ్ళై మిగిలిపోతారు. మానవ సమాజంలో సామాన్య ప్రజల గూర్చి పట్టించుకున్న సాహిత్యం "అభ్యుదయ సాహిత్యం" మానవతా సాహిత్యపు తొలకరి జల్లు కురిపించిన ఏకైక మేఘం శ్రీశ్రీ.

ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చారిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం

అని గొంతెత్తి పలికిన శ్రీశ్రీ సమాజాన్ని చూసి అంతరాలున్నాయని పేదవాడు నానాటికీ పేదవాడుగా, ధనవంతుడు మరింత ఐశ్వర్యవంతుడుగా తయారౌతున్నాడు. దీనికి కారణం చూస్తే మానవజాతిలో మానవత్వం మళ్ళా చిగురించాలని తనలో చైతన్యాన్ని మనకు పంచే ప్రయత్నం చేశారు. అభ్యుదయ రచయితల మేనిఫెస్టో చదివి ఆ భావాలు మనస్సులో మెదులుతుండగా శ్రీశ్రీ ఈ గీతం రచించినట్లు తెలిపారు. ప్రతిజ్ఞ చదవగానే శ్రీ అబ్బూరి రామకృష్ణారావు ఆనందంతో "అభ్యుదయ రచయితల మేనిఫెస్టో అంతా ఇందులో దింపేశావు" అని శ్రీశ్రీని మెచ్చుకున్నారు. శ్రీశ్రీ దాన్ని తనకు గొప్ప ప్రశంసగా భావించుకున్నారు.

ఆధార గ్రంథాలు :

1. సమగ్రాంధ్ర సాహిత్యం, 2013, ఆరుద్ర, తెలుగు అకాడమీ, హైదరాబాదు.
2. తెలుగు సాహిత్యచరిత్ర, 1998, శాస్త్రి ద్వా.నా, ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాద్.
3. తెలుగు సాహిత్య చరిత్ర, 2021, సిమ్మన్న వెలమల, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాద్.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అభ్యుదయ కవితోద్యమ వైతాళికుడు శ్రీశ్రీ

– డా॥. పుట్ట శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, పాలమూరు విశ్వవిద్యాలయం,
మహబూబ్ నగర్ జిల్లా, తెలంగాణ.

ఆంధ్రభారతి కొత్తగా ముత్యాలసరాల్ని అలంకరించు కొంటున్న రోజులవి. గురజాడ వారి గొంతుక విని సాహితీ జగత్తు మేలుకొన్న తరుణమది.భావ కవిత్వం ఒకశ్రీకారం చుడితే భవిష్యోదయం మరో శ్రీకారం జంట కలిపి లిఖించిన చారిత్రక ఘట్టమది. శ్రీవాణితో ప్రారంభమైన ప్రాచీన మార్గం శ్రీరంగం శ్రీనివాసరావు ప్రస్తావనం సాగించడానికి మరో నాందిని పలికించే సూత్రధారుని సృష్టించుకొన్న కాలమది. శ్రీశ్రీ గారు 1929లో రెండు నెలల పాటు టైఫాయిడ్ జ్వరంతో బాధపడ్డారు.ఆయన ఆలోచనా రీతుల్లో మార్పు వచ్చింది. అంతర్జాతీయంగా స్పానిష్ అంతర్యుద్ధం శ్రీశ్రీ ని బాగా కదిలించింది.

దేశంలో ఎటు చూసినా ఆకలి, నిరుద్యోగం ప్రజలు పడుతున్న పాట్లు తెలుసుకున్నాడు. ఆయన వ్యక్తిగత జీవితంలో ఎదురుకున్న దారిద్ర్యం, నిరుద్యోగం, అశాంతి కవితా రీతిలో చాలా మార్పులు తెచ్చాయి. సుప్తాస్థికతలు అనే గీతం ఆలోచనలో వచ్చిన మార్పులను తెలుపు తుంది. అప్పటి నుండి ఆయన కవితా ప్రపంచం మరో ప్రపంచం శ్రీశ్రీ గారు మహాగ్నిజ్వాలై నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను. నేను సైతం విశ్వ సృష్టికి అశ్రువొక్కటి దారి పోశాను. ఇలాంటి కవితల ద్వారా ప్రపంచ శాంతిని తొలగించడానికి ప్రయత్నం చేసిన మహానుభావుడు శ్రీశ్రీ గారు భావకవిత్వంపై తిరుగుబాటు బావుటానెత్తిన విప్లవ కవి అభ్యుదయ కవితా ఉద్యమానికి వైతాళికుడు కవిత్వానికి కొత్త మార్గాలు ప్రతి పాదించిన గొప్ప శిల్పి 1934లోనే అభ్యుదయ కవిత్వం తెలుగునాట ప్రారంభమైంది. 1943లో అభ్యుదయ రచయితల మహాసభ జరిగి సంఘంగా ఏర్పాటయింది. నన్నయ్య కాలం నుండి అభ్యుదయ సాహిత్యమేనని శ్రీశ్రీ భావన ప్రపంచంలో జరిగిన కొన్ని పరిణామాలు జాతీయ రంగంలో చారిత్రక ఆర్థిక, సాంఘీక, రాజకీయ పరిస్థితుల ప్రేరణతో తెలుగు కవితా రంగంలో చారిత్రాత్మకమైన అభ్యుదయ కవిత్వానికి ప్రాణం గీతం మరో ప్రపంచం మహా ప్రస్థానం రాశారు.

శ్రీశ్రీ గారు తన కవిత్వానికి ప్రేరణ ఇచ్చిన రచనలను గురించి శ్రీశ్రీ గారు స్వయంగా చెప్పుకున్నారు. ఫ్రెంచీ జాతీయగీతం నరేంద్రనాథ్ ఛటోపాధ్యాయుని శురు హువాహైజంగ్ పాట నజ్రల్ ఇస్లాం విప్లవ గీతాలు గురజాడ కవికొండల గేయాలు ఇవే కాక పాశ్చాత్య కవుల రచనల యొక్క ప్రభావం తన కవిత్వం అవేశం ఇచ్చిందని తెలిపారు. 1934లో అనేక ప్రేరణలతో వచ్చిన మహా ప్రస్థానం గేయం నవశకానికి నాంది పలికింది. 45ఏళ్ల కవితాసంపుటి శ్రీశ్రీ కవిత్వం గురించి చలం గారి మాటలలో నెత్తురూ కన్నీళ్లూ తడిపి కొత్త టానిక్ తయారు చేసి ఈ వృద్ధ ప్రపంచానికి అందించాడు.

భావకవిత్వం కుబుసం విడిచిన శ్రీశ్రీ గారు మార్క్సిస్టు ప్రభావంతో ప్రపంచ దృక్పథాన్ని సంపాదించుకున్నాడు. కావ్య వస్తువులో విప్లవం తీసుకొచ్చారు. అభ్యుదయ కవిత్వ లక్ష్యాలను నవకవిత గేయ రూపంలో ప్రస్తావించాడు. కదిలేది కదిలించేది, మారేది మరిపించేది ముందు ముందు సాగించేది పెను నిదర వదిలించేది పరిపూర్ణపు బ్రతికించేది అంటూ శ్రీశ్రీ గారు తన కవిత్వంలోని ఆవేదనను వ్యక్తపరిచారు. శ్రీశ్రీ గారు సాహిత్య పోరాటంలో నవ్యత కోసం అన్వేషిస్తూనే వస్తువులో భావ జాలంలో అభివ్యక్తిలో కొత్తదనం అన్వేషణలో ఒక భాగ మైంది కొత్త మార్గము దొరికింది. 1910లో జన్మించారు. అదే సంవత్సరంలో ముత్యాల సరాలు రాశారు.

గురజాడ అందుకే శ్రీశ్రీ గారిని తోకచుక్క లాగా ఆకాశంలో మేఘం లాగా తెలుగు సాహిత్యంలో ఒక మెరుపు మెరిసింది అని చెప్పడానికి ఇదే తార్కాణం సంప్రదాయ సాహిత్యానికి భావ కవిత్వానికి విపత్తు అన్న అర్ధంలో చెప్పవచ్చును. శ్రీశ్రీ గారిపై ప్రభావం చేసిన కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయి. ఫ్యూచరిజం 1909 ఇటలీలో మెరినిటి రచయిత నాయకత్వంలో సైతం కొనసాగింది డాడాయిజం విధ్వంసవాదం.యూరప్ దేశంలో జరిగిన సంఘటనలు గురించి తెలిపేది ఇమేజిజం భావ చిత్రవాదం పలుకుబడులలో పదబంధాలలో రచన రీతిలో గతానుగతికమైన ధోరణి కలిగి ఉంటాయి. ప్రతీకవాదం బాడ్ లేర్ మలార్మే ఫ్రెంచ్ కవులు కవిత్వం ప్రచారంలోకి వచ్చింది.

వామపక్షీయులు కమ్యూనిస్టు ఉద్యమం 1930 తరువాత ఇంగ్లీష్ కవిత్వం ఇంకొక మలుపు తిరిగింది. శ్రీశ్రీ గారికి ఇలాంటి కవిత్వాలు ప్రభావం చేసినవి సంఘర్షణలోనే అభ్యుదయం ఉంటుందని ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం గతితార్కిక దృష్టికి నిదర్శనాలు వివిధ దేశాల మధ్య జరిగిన యుద్ధాలు రాజుల దండ యాత్రలు రాజకీయ నేతలు చాకచక్యాలు సేనానుల పరాక్రమాలు ప్రధానంగా శ్రీశ్రీ కవిత్వంలో కనబడతాయి. 1940 తరువాత ఒక శతాబ్దం పాటు ఆంధ్ర సాహిత్య లోకమునుత్తేజిత మొనర్చిన అభ్యుదయ కవితోద్యమ మూలవిరాటు శ్రీశ్రీ గారు శ్రామికవర్గ చైతన్యమూపిరిగా వైదర్భీరీతులను వెలార్చుకొన్న గేయంలా గౌడిరీతిలో నడిపిన ఛందోబద్ధమైన రహస్యవేత్త వ్యక్తి చైతన్యం సంఘ చైతన్యం సమాన అధికారం తో ప్రహించిన మహనీయులు కవిత్వాన్ని భ్రమలో నుంచి వాస్తవానికి రసానందం చైతన్యానికి జాతీయత నుంచి అంతర్జాతీయతకీ సంపన్న వర్గాల నుంచి విప్లవవాదం లోకి దృష్టి నుంచి సమిష్టిలోకి వృత్తనుంచి సామ్యవాద వ్యవస్థలోకి మళ్లించారు శ్రీశ్రీ .

ఈ విధంగా ఆధునిక సాహిత్యంలో అభ్యుదయ సాహిత్యానికి శ్రీశ్రీ గారి పాత్ర చాలా అమూల్యమైనది అని చెప్పవచ్చును. అభ్యుదయ సాహిత్యానికి దిక్సూచి మార్గదర్శకుడు ఆదర్శప్రాయుడని తెలియజేయవచ్చును.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ సినీగేయాలు - సాహిత్య సౌరభాలు

- అవధానం సుజాత, సహాయాచార్యులు, తెలుగుశాఖ, ప్రభుత్వ సిటీ కళాశాల, నయాపూల్, హైదరాబాదు,

శ్రమైకజీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని, తన కవిత్వాన్ని కార్మికలోకపు కల్యాణానికి అంకితం చేస్తానని ఎలుగెత్తి చాటిన అభ్యుదయ కవి శ్రీరంగం శ్రీనివాసరావు. వీరి మహాప్రస్థానంతో తెలుగు కవిత్వంలో ఒక నూతనశకం ప్రారంభమైందని చెప్పవచ్చు. నూతనమైన భావవ్యక్తీకరణ, విలక్షణమైన పదబంధాల ప్రయోగం శ్రీశ్రీ ప్రత్యేకత.

వచనకవితలో శబ్దసౌందర్యాన్ని, భాషావైదుష్యాన్ని నింపి సామాజిక చైతన్యాన్ని సాధించిన అభ్యుదయ కవితా చక్రవర్తి శ్రీశ్రీ. శ్రీశ్రీ అనేక ప్రక్రియలను చేపట్టారు. ఖడ్గసృష్టి, మరోప్రస్థానం, సిరిసిరిమువ్వ, ప్రాసక్రీడలు, అనంతం, చరయరాత్రి మొదలగు వీరి రచనలు సినిమాలలో వందల పాటలను రచించి వీరు కవిగా కాక సినీగేయ రచయితగా కూడా ప్రసిద్ధిపొందారు.

శ్రీశ్రీ సినీగేయాలలోని సాహిత్య సౌరభాన్ని వివరించడమే ఈ పత్రం యొక్క ఉద్దేశము.

సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోవాలంటే సినిమా పాటలు ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. సినీ కథను మరిచిపోయినా సినీగేయాలు కలకాలం ప్రేక్షకుల మనస్సులో స్థిరంగా ఉండిపోతాయి. ఎంతకాలం గడిచినా సినీగేయాల పరిమళం వాడదు. కొన్ని సినిమాలు, పాటల ద్వారానే ప్రజాదరణ పొందాయి.

శ్రీశ్రీ మొదట అనువాద సినిమా ఆహుతికి పాటలు వ్రాశారు. శ్రీశ్రీ సినిమా పాటలను అలవోకగా వ్రాసేవారు. ఒకసారి కన్నడ అనువాద సినిమాకు ఒకేరోజు 13 పాటలు రచించడం వారి ప్రతిభకు నిదర్శనం. సన్నివేశానికి, కథకు పాత్రల మనోభావాకు తగ్గట్టుగా శ్రీశ్రీ పాటలను వ్రాసే వారు. శ్రీశ్రీ పాటలన్నీ ప్రజాదరణ పొందినవే. ప్రాసకు, శ్లేషకు శ్రీశ్రీ పెట్టింది పేరు. పాటలలో లయ, పల్లవి, అనుపల్లవులతో, చరణాలను అలవోకగా అల్లడంలో శ్రీశ్రీ అందవేసిన చేయి.

దాదాపు 30 సంవత్సరాలు వారు సినీగేయ రచయితగా అనేక పాటలు రచించారు.

శ్రీశ్రీ సినీగేయాల విభజన :

వ్యక్తుల ఔన్నత్యాన్ని తెలిపే పాటలు :

అల్లూరి సీతారామరాజు చిత్రంలో శ్రీశ్రీ రచించిన తెలుగువీర లేవరా అనే పాట జాతీయస్థాయిలో అవార్డును అందుకొంది. సీతారామరాజు గొప్పతనాన్ని, దేశభక్తిని వ్యక్తీకరించిన పాట. ఆ రోజుల్లో ఈ పాట ప్రతి తెలుగు వాడి నోట మంత్రంమై పలికింది.

ఓహో ఓహో
తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా
దేశమాత స్వేచ్ఛకోరి తిరుగుబాటు చేయరా
దారుణమారణకాండకు తల్లడిల్లవద్దురా
నీతిలేని శాసనాలు నేటి నుండి రద్దురా,
నిదురవద్ద బెదరవద్దు నింగి నీకు హద్దురా
. . . . సింహాలై గర్జించాలి, సంహారం సాగించాలి.

ఈ పాటలోని పదాలన్నీ దేశభక్తిని మేలుకొలిపే విధంగా ఉన్నాయి.

మరొకపాట 'కరుణామయుడు' చిత్రంలోనిది. ఏసుక్రీస్తు ఔన్నత్యాన్ని వివరించే పాట.

కదిలింది కరుణరథం,
సాగింది, క్షమాయుగం
మనిషి కొరకు దైవమే
కరిగి వెలిగే కాంతిపథం

కరుణామయుడైన ఏసుప్రభువు చరితను తెలిపిన ఈ పాట ఎంతో ప్రజాదరణ పొందినది.

నందనుని చరితము తెలిపే పాట

"నందనుని చరితము వినుమా
పరమానందము గనుమా" అంటూ రమణీయంగా నందనుని చరితను పాటరూపంలో శ్రీశ్రీ రచించారు.

తెలుగు భాష గొప్పతనాన్ని తెలుపుతూ రచించిన పాట పలువురి ప్రశంసలను అందుకొంది.

"కలసిపాడుదాము తెలుగు పాట
కదలి సాగుదాం, తెలుగు బాట
తెలుగు వారు నవజీవన నిర్మాతలని
తెలుగుజాతి సకలావనికి జ్యోతి అని ..."

అని తెలుగుభాష వైభవాన్ని, తెలుగుకవుల (వీరేశలింగం, గురజాడ) గొప్పతనాన్ని ఈ పాటలో శ్రీశ్రీ చక్కగా వర్ణించారు.

యుగళగీతాలు :

ఎంత విప్లవకవి అయినా శ్రీశ్రీ కలం నుండి మనస్సు దోచె సుతిమెత్తని యుగళగీతాలు వెలువడి తెలుగువారి హృదయాలను దోచుకొన్నాయి. సినిమాలలో వీరు వ్రాసిన పాటలు ప్రేక్షకులను అలరించాయి. సినిమా విజయానికి కారణమయ్యాయి. ఉదా:

1. తూరుపు సిందూరపు మందారపు
   వెన్నెలలో ఉదయగానం, హృదయగానం
2. ఈ రోజు మంచిరోజు, మరుపురానిది
   మధురమైనది ప్రేమ సుమము వికసించినరోజు
3. ఎవరికోసం, ఈ మందహాసం ఒకపరి వివరించవె
   చెలిమికోసం, చెలి మందహాసం
4. మురిపించె అందాలె, అవి నన్నె చెందాలె
   ఇలా ఎన్నో పాటలు, ఆ యుగళగీతాలె

రసరమ్య గీతాలై సినీజగత్తులో తారకలై నిలిచాయి.

ప్రభోదాత్మక గేయాలు :

శ్రీశ్రీ ఎన్నో ప్రభోదాత్మక గేయాలను రచించారు. యువతను జాగృతం చేసి వారిలో అభ్యుదయభావనను మేలు కొలిపారు. ఈ పాటలలో

పాడవోయి భారతీయుడా
ఆడిపాడవోయి విజయగీతికా
నేడే స్వాతంత్ర్యదినం, వీరుల త్యాగఫలం
స్వాతంత్ర్యం వచ్చెనని సభలే చేసి
సంబరపడగానే సరిపోదోయి
సాధించిన దానికి సంతృప్తిని పొందక
కదలి సాగవోయి ప్రగతి దారుల

అంటూ యువత దేశభవిత కోసం అవినీతిని వదిలి కష్టించాలని తెలిపారు.

మరొక పాట

ఉందిలే మంచికాలం ముందు ముందునా
అందరూ సుఖపడాలి నంద నందనా
ఎందుకో సందేహం ఎందుకో.... నీవే రాజువయి
దేశసంపద పెరిగేరోజు మనిషి మనిషిగా ఎదిగేరోజు
గాంధీజీ కలగన్నరోజు
అందరి కోసం ఒకడు నిలిచె ఒకడి కోసం అందరూ
నిలిచి సహకారమె మన వైఖరి అయితే
ఉపకారమే మన ఊపిరి అయితే బీదా గొప్ప
అన్న భేదం పోయి అందరూ, అంటూ సామ్యవాదాన్ని ఈ పాటలో శ్రీశ్రీ వినిపించారు.

జయమ్ము నిశ్చయమ్మురా, భయమ్ము లేదురా
జంకు, బొంకు లేక సాగిపోమ్మురొ

అంటూ రిక్షాకార్మికులను ఉత్తేజపరుస్తూ శ్రీశ్రీ వ్రాసిన పాట జనానికి జయగీతమై నిలిచింది.

శ్రామిక గేయాలు :

శ్రీశ్రీ శ్రామిక పక్షపాతి, కష్టజీవికి సంపద దక్కాలి. వారు సంతోషంగా ఉండాలన్నదే శ్రీశ్రీ కోరిక.
ఉదా :

ఓరంగయ్యో, పూలరంగయ్యో, ఓరచూపు
చాలించి సాగిపోవయో పొద్దువాలి
పోతున్నదోయి, ఇంత ముద్దు నడక నీకెందుకోయి
పగలనక రేయనక పడుతున్న శ్రమనంతా పరుల

కోసం ధారపోయు మూగజీవులు
ఆటలలో పాటలలో ఆయాసం మరిచిపోవు ధన్యజీవులు
అంటూ అందంగా వారి శ్రమను వర్ణించారు.

మరొక పాటలో

"కారులో షికారుకెళ్లె
పాలబుగ్గల పసిడిదాన
బుగ్గమీది గులాబిరంగు ఎలా వచ్చెనో తెలుసుకో...
చలువరాయి
మేడలోన కులుకుతావు చిన్నదాన వచ్చెనో తెలుసుకో
అంటూ కష్టజీవుల శ్రమను గుర్తించమని తెలిపారు.

సోలో పాటలు : భావవ్యక్తీకరణ పాటలు

ఉదా :

మనస్సున మనస్సై, తోడొకరుండెన
అదే భాగ్యం,
హంసకదా నొపడవ... మొదలగు పాటలు

ప్రేరణ కల్గించే పాటలు :

కలకానిది విలువైనది, బతుకు కన్నీటి
ధారలలో బలిచేయకు
వాడినపూలె వికసించెనె ...

మొదలైన పాటలు. యువతలోని నిరాశను పోగొట్టి బ్రతుకుపై ఆశను రేకెత్తించాయి.

హరికథ :

వాగ్దానం చిత్రంలో సీతారామకల్యాణమును వర్ణిస్తూ అద్భుతంగా రచించారు. ప్రాచీన కవిత్వపు సోయగాలను ఈ పాటలలో వర్ణించారు.

విద్యార్థుల గీతాలు :

"భలే భలే మంచిరోజులులే
మళ్లీ మళ్ళీ ఇక రావులే" అంటూ విద్యార్థి లోకాన్ని ఉర్రూతలూగిన పాట.

సినిమాలో కీలక సన్నివేశాన్ని వర్ణించే పాటలు :

ఉదా : దేవుడు చేసిన మనుషులు సినిమాలో

"దేవుడు చేసిన మనుషుల్లారా
మనుషులు చేసిన దేవుళ్లారా
వినండి మనుషుల గోల
కనండి దేవుని లీల" అంటూ ఈ గీతం ఆద్యంతం కథను మలుపు తిప్పే విధంగా సాగింది. ఎత్తుగడలలో విలక్షణమైన పాటలు

అంతగా నను చూడకు, నాతో మాట్లాడకు
ఇలాగ వచ్చి, నా మదినే దోచావు
జోరుగా హుషారుగా సాగిపోదామా హాయి హాయిగా

యమగోలలో

"సమరానికి నేడే ప్రారంభం
యదురాజుకు మూడెను ప్రారబ్ధం
వెట్టిచాకిరి ఇకపై వద్దు, నరుడే గురుడని భావిద్దాం"

శబ్దసౌందర్యమును, సాహితీ సౌరభాన్ని వెదజల్లే పాటలు:

ఉదా :

ఆకాశవీధిలో అందాల జాబిలి
ఒయ్యారి తారను జేరి సయ్యాట
లాడనె ఉయ్యాలలూగెనె
జలతారు మేలిమబ్బు పరదాలు నేసి
తెరచాటు చేసి పలుమారు దాగిదాగి
పంతాలు పోయి, దొంగాటలాడెనె

మరొకగీతం

నా హృదయంలో నిదురించె చెలి,
మయూరివై, వయారివై నటనమాడినావె నన్ను దోచినావె

మొదలైన గీతాలు, సాహితీ మాధుర్యాన్ని వెదజల్లి ప్రేక్షకుల మనస్సును అలరించాయి.

ఈ విధంగా శ్రీశ్రీ సినీగేయాలు తెలుగువారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మహా కవి శ్రీశ్రీ - మహా ప్రస్థానం

- వంకం భాస్కర్, ఆంధ్రోపన్యాసకులు, ఎస్ సి ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు.

1930 ప్రాంతాల్లో ప్రపంచమంతా ఆర్థికమాంద్యంతో విలవిలలాడుతున్న సమయంలో 1934 నుండి 1940 మధ్యకాలంలో తాను రాసిన కవితలలో 'మహాప్రస్థాన' మనే గేయ సంపుటిగా వెలువరించినాడు శ్రీశ్రీ. ప్రపంచ వ్యాప్తంగా మానవులు ఎదుర్కొంటున్న బాధలను ప్రధాన ఇతివృత్తంగా స్వీకరించి గేయాలను రచించాడు. 1950లో మొదటిసారిగా ఇప్పుడున్న రూపంలో ప్రచురించటానికి తన స్నేహితుడు నళినీ కుమార్ ఆర్థికంగా, హార్దికంగా సహాయపడినాడు. చిన్న వయసులోనే అకాలమరణం పొందిన తన స్నేహితుడు 'కొంపెల్ల జనార్ధనరావు'కు అంకితమిచ్చాడు. చలం ఈ గ్రంథానికి రాసిచ్చిన 'యోగ్యతాపత్రం' మరింత వన్నె తెచ్చింది. శ్రీశ్రీ రచన లంతా కవితాత్మకంగానూ, శక్తిమంతంగానూ, మనో రంజకంగానూ చలమిచ్చిన యోగ్యతా పత్రం ఉండటం ఈ సంపుటికి మరో లక్షణం. లండన్‌లోని డాక్టర్ గూటాల కృష్ణమూర్తి విదేశాంధ్ర ప్రచురణాలయం శ్రీశ్రీ సొంత దస్తూరీతో గొంతుతో ఈ గేయాలను అక్షర ధ్వని రూపాల్లో ప్రచురించింది.

ఇంత గొప్ప కవితా సంకలనాన్ని గురించి కొంత వివరించటం సమంజసము. అంకిత భాగం కాక సంపుటంలో 40 కవితలున్నాయి. అందులోని మొదటి గేయం పేరునే సంపుటికి శీర్షికగా పెట్టారు. ఎడ్గార్ అలాన్‌పో కవిత్వం 'దిబెల్స్' చదివి, ఆవేశంతో రాసినది 'మహా ప్రస్థానం'. ఇందులోని "కదం త్రొక్కుతూ, పదం పాడుతూ, హృదంతరాళం గర్జిస్తూ... దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ పదండి ముందుకు! పదండి త్రోసుకు, పోదాం, పోదాం పైపైకి" అని "నెత్తురు మండే శక్తులు నిండే" సైనికులకు బోధించాడు. "హరోం హరోం హర! హర! హర! హర! హర! హరోం హర!" అని యుద్ధోత్సాహంతో కదలమన్నారు. అప్పటి నుండి ఎన్నో సభల్లో ఈ కవాతు పాట మారుమోగుతూనే ఉంది.

'జయభేరి' కవితలో మొదటి తొమ్మిది పంక్తులనూ, అంతంలోకి వచ్చేసరికి మార్చి రాశాడు. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాన"న్నాడు. భువనఘోషకు వెర్రిగొంతుకలిచ్చి మోసిన తాను భువన భవనపు బావుటానై పైకి లేస్తాన"న్నాడు. రెండవ ప్రపంచ యుద్ధకాలం నాటి ఏవో ఘోషలను తన 'అభ్యుదయం' కవితలో వినిపించాడు. మరణించిన యువ యోధుల బల వితర్ది నుంచి నరజాతికి పరివర్తన నవజీవన శుభసమయం ఆసన్నమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. 'అవతారం' గేయం పౌరాణిక ప్రతీకలతో నిండి, నూతన శకాన్ని ప్రారంభించడాన్ని సూచిస్తుంది. "యముని మహిషపు లోహ ఘంటికలు, ఉదయ సూర్యుని సప్తహయములు. కనక దుర్గా చండ సింహం, ఇంద్రదేవుని మదపుటేనుగు, నందికేశుడు, ఆది సూకర వేదవేద్యుడు" తమ తమ స్వభావాలను ప్రదర్శించిన తర్వాత, ఉత్పాతం జరిగిన తర్వాత "పుడమితల్లికి పురుటినప్పులు కొత్తసృష్టిని స్ఫురించాయని" నిశ్చయించాడు. 'నవ్య కవిత్వాన్ని' వివరించే తర్వాతి గేయం అందుకు కావలసిన వస్తువులను కూడా వివరిస్తుంది. ఆధునిక కవితా రచనకు కావలసిన వస్తువునూ, ధర్మాన్నీ కూడా వివరించాడు శ్రీశ్రీ. సింధూరం, రక్త చందనం, బంధూకం, రుద్రాలిక నయన జ్వాలిక, ఘాటెక్కిన గంధక ధూమం, రగులుకొనే రాక్షస బొగ్గు, రాబందుల రెక్కల చప్పుడు, హరీంద్ర గర్జన, పయోధర ప్రచండ ఘోష, ఖడ్గమృగ విరావం, ఝుంఝూనిలం మొదలైన లక్షణాలతో "కదిలేదీ, కదిలించేదీ, మారేదీ మార్పించేదీ, పాడేదీ పాడించేదీ, పెను నిద్దుర వదిలించేదీ, మును ముందుకు సాగించేదీ, పరిపూర్ణపు

బ్రతుకిచ్చేదీ కావాలోయ్ నవకవనానికి." అని సులభమైన భాషలో విడమరచి చెప్పాడు.

"కవితా! ఓ కవితా!" అనే గేయం శ్రీశ్రీ కవితల్లో గొప్ప కవిత అని చెప్పవచ్చు. ఇందులో తన అద్భుత ప్రతిభను కనబరిచాడు. తరువాత కాలంలో ఈ గేయాన్నే తానే స్వయంగా అనువదించినా, మూల స్వభావాన్ని, ఆత్మనూ ప్రదర్శింపలేకపోయాడు. కవితను స్మరిస్తే అగ్ని సరస్సున వికసించిన వజ్రం, ఎగిరే లోహశ్యేనం, ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగనాదం, జవరాలి మన: ప్రపంచ పుటావర్తాలు, రోగార్తుని రక్తనాళ స్పందన, త్రాగుబోతు వ్యక్తావ్యక్తాలాపన, భయంకర బాధల పాటల పల్లవి, శతకోటి సముద్ర తరంగాల మ్రోతలు వినిపించా యన్నాడు. తన అనుభూతులను వివరించాలంటే "అవి పుంఖానుపుంఖాలుగా, శ్మశానాల వంటి నిఘంటువుల దాటి, వ్యాకరణాల సంకెళ్ళు విడిచి, ఛందస్సుల సర్పపరిష్వంగం వదిలి వడిగా, వడివడిగా వెలువడినై, పరుగిడినై" అని విశదీకరించాడు.

లండన్ అభ్యుదయ రచయితలు మేనిఫెస్టోను చదివి 1937లో రచించిన గేయం 'ప్రతిజ్ఞ'. గేయ చ్ఛందస్సును కదిలించి ఊపుతుంది. "కర్షక వీరుల కాయం నిండా, కాలువ కట్టే ఘర్మజలానికి, ధర్మజలానికి గాని కార్మిక ధీరుల విలాపాగ్నులకు, విషాదాశ్రువులకు గాని ఖరీదు కట్టే షరాబు లేడ"ని తెల్చాడు. అభాగ్యులంతా, అనాథలంతా, అశాంతులంతా, దీర్ఘ శ్రుతిలో, తీవ్ర ధ్వనితో, విప్లవశంఖం పూరిస్తారని, త్రిలోకాలో శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనదేదీ లేదని చెప్పాడు. తాను నవీనరీతిలో రాయబోయే నవీనగీతికి సహస్రవృత్తు ల సమస్త చిహ్నాలూ ప్రాణమన్నాడు. ఈ గేయ భావాలకు విలువ ఉన్నంతకాలం, ఈ రచనా శిల్పం శ్రోతలనూ, పాఠకులనూ ఆకట్టుకోగలిగినంత కాలం శ్రీశ్రీ సజీవంగా ఉంటాడు.

'బాటసారి' గీతంలో దారి తప్పిన బాటసారి కళేబరంతో శీతవాయువు ఆడుకుంటే పల్లెటూళ్లో అతడి తల్లికి వచ్చిన పాడు కలలో పేగు కదలటం ఇతివృత్తం. 'భిక్షువర్షీయసి' గేయంలో తనకన్నా శవం నయమన్నట్లుగా ఉన్న ముసలామె మరణిస్తే, ఆ పాపమెవరిదని వెర్రిగాలి ప్రశ్నించింది. ఎముక ముక్క కొరుక్కుంటున్న కుక్క ఏమీ అనలేదు. ఒక ఈగను పడవేసుకొని తొండ పారిపోయింది. ఎగిరి వచ్చిన ఎంగిలాకు మాత్రం ఇది నా పాపం కాదని కాదన్నది. ఈ కవితలో వాడిన భాష, వర్ణించిన దృశ్యం, కథా వస్తువూ, ఆ విషాదగాథా ఇవన్నీ గుండెలను కరిగిస్తాయి.

'చేదుపాట' కవితలో వేదాంతులనూ, మాయా వాదులనూ కవి వెక్కిరిస్తాడు. మనమంతా బానిస బతుకుల బతుకుతున్నామనీ, వెనుక ముందుల్లో దగా పడుతున్నామనీ, కుక్కల్లా, నక్కల్లా, సందుల్లో పందుల్లా బతుకుతున్నామనీ వాపోతాడు. 'ఆకాశదీపం'లో ఉదయం ఆరున్నరకు ఆరిపోయాడో దురదృష్టజీవి. ఆ రాత్రికి దీపమూ ఆరిపోయి తారగా మారిపోయింది. సామాన్యుడి మరణం ఎవరికీ పట్టదని కవి చిత్రీకరణ.

''శైశవగీత' పసిపిల్లల అమాయకత్వాన్నీ, ఆట పాటలనూ వర్ణిస్తుంది. లోకపు భాగ్యవిధాతలైన పసిపిల్లలు ప్రకృతిని గమనించాలంటాడు. 'దేశచరిత్ర'లులో నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వమనీ, పరస్పరా హణోద్యోగమనీ, రణరక్త ప్రవాహసిక్తమనీ, దరిద్రులను కాల్చుకు తినడమనీ కవి తీర్మానించాడు. గతమంతా రక్తంతోనో, కన్నీళ్లతోనో కలుషితమైందన్నాడు. "పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను" అని సిద్ధాంతీ కరించాడు.

'జగన్నాథుని రథ చక్రాలు'లో దళిత తాడిత పీడిత ప్రజానీకానికి ధైర్యం చెప్పాడు. పతితులూ, భ్రష్టులూ, బాధాసర్ప దష్టులూ అయిన దగాపడిన తమ్ములందరినీ అవి కాపాడుతాయనీ ఆశాభావం వ్యక్తం చేశాడు.

'బుక్కులు' కవితలో ఈ సృష్టిలో కవితకనర్హం కాని వస్తువే లేదన్నాడు. కవి యొక్క కవితా శిల్పం దేనినైనా మలచగలదంటాడు. "శోభాలేశం దొరికినా ప్రపంచంలో

రసనిర్దేశం చేసి, కవితావేశంలో రాయమన్నాడు. ''కాదేదీ కవితకనర్హం! ఔనౌను శిల్పమనర్హం... ప్రపంచమొక పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం'' అని నిర్ధారించాడు. ఇవి సాహిత్య జగత్తులో వేద మంత్రాల వింటి సూక్తులు కాబట్టే 'బుక్కుల'ని పేరు పెట్టారు. ఈ విధంగా మహాప్రస్థాన కవితా సంపుటిలో తన ఆలోచనా ధోరణినీ, కవితా దర్శాన్ని నిరూపించాడు మహాకవి శ్రీశ్రీ.

❖❖❖

కష్టజీవికి బాసటగా శ్రీశ్రీ

– నండూరి అనంతలక్ష్మి, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ సిటి కళాశాల, హైదరాబాదు.

శ్రీశ్రీ కవిత్వాన్ని దర్శించాలనుకోవడం, సమీక్షించాలనుకోవడం చలం చెప్పినట్లు ఎవరెస్టు అంత ఎత్తున్న వీపు చరచి వృద్ధి లోకి వస్తావు అంటున్న పిగ్మీలా ఉంటుంది. ఆయన కవిత్వాన్ని చర్చించడం తెలుగు సాహితీ అంబరాన్ని చుంబించడమే. నెత్తురూ, కన్నీళ్ళూ తడిపి కొత్త టానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ యీ వృద్ధ ప్రపంచానికి. శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు. ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ అంటాడు చలం. కూటికోసం, కూలికోసం పట్నంలో బ్రతుకుదామని బయల్దేరిన బాటసారికి జ్వరం వస్తే ఎంత కష్టం? అని గతంలో ఏ కవీ దర్శించని బడుగుజీవి కష్టాన్ని దర్శించాడు కనుకనే ఈశకం నాది అని ఘంటా పథంగా చెప్పారు. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం, పరస్పరాహరణోద్యోగం, రణరక్త ప్రవాహ సిక్తం, పిశాచగణ సమవాకారం, దరిద్రులను కాల్చుకు తినడం వంటి వాటితో నిండియున్నదన్నారు. చిరకాలం జరిగిన మోసం, బలవంతుల దౌర్జన్యాలు, ధనవంతుల పన్నాగాలు ఇక చెల్లవనే ఆశావహ దృక్పథాన్ని వెల్లడించారు. యుద్ధాలు, రాజ్యాలకు సంబంధించిన తారీఖులు, దస్తావేజులు, రాణీ ప్రేమ పురాణాలు ఇవి చరిత్ర కాదని, నైలునదిలోని సామాన్యుని జీవనం, తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలు, సామ్రాజ్యపు దండయాత్రలో సామాన్యుల సాహసం, ప్రభువెక్కిన పల్లకిని మోసిన బోయీలు- ఇవి చరిత్రగా వ్రాయబడాలని అన్నారు. దిగిరాను దిగిరాను దివినుంచి భువికి అన్న కవిత్వాన్ని భూమార్గం పట్టించాడు. రాజులకు, దేవతలకు, ఊహా సుందరులకు పరిమితమైన కవిత్వాన్ని శ్రామికుడి చెంతకు చేర్చాడు. వ్యక్తికి బహువచనం శక్తి అని నిర్వచించాడు. పతితులార, భ్రష్టులార బాధా సర్పదష్టులార ఏడవకండేడవకండి అంటూ అక్కున చేర్చుకున్నారు. మీకోసం కలంపట్టి, ఆకాశపు దారులంట అడావుడిగా వెళ్ళిపోయే జగన్నాథుని రథచక్రాలను భూమార్గం పట్టించి, భూకంపం పుట్టిస్తానని వారిలో ధైర్యాన్ని నింపాడు. శ్మశానాల వంటి నిఘంటువుల దాటి, వ్యాకరణాల సంకెళ్ళు విడిచి, ఛందస్సుల సర్ప పరిష్వంగం వదిలి మున్ముందుకు ప్రయాణించాడు.

ఎండకాలం మండినప్పుడు గబ్బిలంవలె క్రాగిపోయే వాళ్ళను, వానకాలం ముసిరిరాగా నిలువు నిలువున నీరు కారే వాళ్ళను, శీతకాలం కోతవెట్టగ కొరడుకట్టే ఆకలేసీ కేకలేసే వాళ్ళను తన కవిత్వంతో ఓదార్చాడు. శ్రమజీవి ఒక్కడూ నిలిచిపోతే చంద్రగాడ్పులు, వానమబ్బులు, మంచుసోనలు భూమి మీద భగ్నవకాతాయని, నింగి నుండి తొంగిచూసే రంగురంగుల చుక్కలన్నీ రాలి నెత్తురు కక్కుకుంటూ పేలిపోతాయనీ పగళ్ళన్నీ పగిలిపోయి నిశీథాలు విశీర్ణిల్లీ, మహాప్రళయం జగం నిండా ప్రగల్భిస్తుందనీ హెచ్చరించాడు. ఎప్పటికైనా శ్రమజీవి ఒక్కడూ ధాత్రినిండా నిండిపోయి, అతడి కుహూరత శీకరాలు లోకమంతా జల్లులాడే ముహూర్తా లాగమిస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం, జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీరకష్టం స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి, సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలను తన కవిత్వానికి భావ్యం, భాగ్యం, ప్రాణం, ప్రణవం అని శ్రీశ్రీ ప్రకటించాడు. విరామ మెరుగక పరిశ్రమించే కర్షక వీరుల కాయంనిండా కాలువకట్టేఘుర్మజలానికి ఖరీదు లేదన్నాడు. కార్మిక వీరుల విలాపాగ్నులకు, విషాదాశ్రులకు ఖరీదు కట్టే షరాబు లేడన్నాడు. త్రిలోకాలలో, త్రికాలాలలో శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని చాటి

చెప్పాడు. కష్ట జీవులకు, కర్మవీరులకు నిత్యమంగళం నిర్దేశిస్తూ స్వస్తి వాక్యములు సంధానించాడు. స్వర్ణ వాద్యములు సంరావించాడు. వ్యథార్త జీవిత యుధార్థ దృశ్యం పునాదిగా భావివేదముల జీవనాదములు జగత్తుకంతా చవిచూపించగలిగాడు.

దోపిడీ విధానాన్ని, దోపిడీదారుల అరాచకాల్ని ఎండగడుతాడు శ్రీశ్రీ . శ్రమజీవులందరూ కలిసి చేసిన అందమైన వస్తుసముదాయమంతా దోపిడీదారులు దోచుకుంటుంటే అన్యాయం, అన్యాయం అని అరిస్తే మీకర్మ అంటూ కర్మసిద్ధాంతాన్ని, పొద్దుపొడిచి నప్పటి నుండి పొద్దు గడిచేదాకా ఎద్దుల్లాగా పని చేసే శ్రామికు లని ముద్దకు కూడా దూరం చేస్తే అది దారుణం అంటే ఆచారం అని చెప్పి కర్మనీ, ఆచారాన్ని దోపిడీ సాధనాలుగా అణచివేస్తూ ఆ కర్మ సిద్ధాంతం, ఆ ఆచారాలు పని చేయనప్పుడు దౌర్జన్యాన్ని ప్రయోగించి దోపిడీని నిరాఘాటంగా కొనసాగించడం వలన శ్రామికుడు దోపిడికి గురయ్యే క్రమాన్ని వివరించాడు. దోపిడీని మిధ్య, మాయ అని నమ్మింపజేసే ధనస్వామ్య వ్యవస్థని ప్రశ్నించాడు. వాళ్ళ రోల్స్‌కారు, మనీపర్సు మాయంటావా అని ప్రశ్నించాడు. మీరు దోచుకొనే పాలికాపు నుదుటి చెమట, కూలివాని గుండెచెరువు, బిచ్చగాని కడుపు కరువు మాయంటారా అని దోపిడీ తత్వాన్ని ఎండగట్టాడు.

ప్రపంచం ధనికులూ, పీడకులూ అని పేదలు, పీడితులు అని పెండు వర్గాలుగా చీలిపోయిందని మొదటి వర్గం తన ప్రయోజనాలను రక్షించుకొనే గదులు నిర్మించుకొని వడ్డించిన విస్తరలాంటి జీవితం అనుభవిస్తున్నారని, తాము గిరిగీసుకున్న రేఖను కాపాడుకోవడానికి రేఖకవతల ఉన్న పీడితులను నేర గాళ్ళుగా చిత్రించి న్యాయస్థానాలను, రక్షక భటవర్గాలను, చెరసాలలను, ఉరికొయ్యలను తన ప్రయోజన పరి రక్షకులుగా నిర్మించుకొన్నారని జరుగుతున్న అన్యాయాన్ని మనముందుంచుతారు. అభాగ్యులైన వారు సమస్యలతో, నందేహాలతో అలజడి జీవితంగాను, ఆందోళన ఊపిరిగాను, తిరుగుబాటును వేదాంతంగాను అవాంతరా లెన్ని ఉన్నా ముందుకు నడుస్తారని, ప్రపంచం వారి వెంట నడుస్తుందని, అంతిమ విజయం వారిదేననే నమ్మకాన్ని కలిగించారు.

స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాత్రం, సౌహార్దం, పునాదులై ఇళ్ళులేని జనావళికి శుభం పూచి శాంతి జగమంతా జయిస్తుందనే ఆశావహ దృక్పథాన్ని కలిగిం చారు శ్రీశ్రీ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీశ్రీ అనంతం - నా దరిద్రపు రోజులు

- పి. వెంకటేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

సామాజిక జీవితంలో, రాజకీయరంగంలో, ప్రజా పరంగా జరిగే ఉద్యమాలతో అత్యంత ఆప్తుడుగా ఉం డేవాడు శ్రీశ్రీ. అందుకే శ్రీశ్రీ జీవితకాలంలో తెలుగు సాహిత్యం ఎన్నిమలుపులు తిరిగిందో అన్నింటిలో ఉం టాడు శ్రీశ్రీ.

అనంతం శ్రీశ్రీ స్వీయచరిత్ర. అన్నిరకాల చైతన్యము జీవితం ఉండే ఉద్భవించాలి. ఏ మునుగులు, దాపరికాలు లేకుండా ఉన్నది ఉన్నట్లుగా అనంతాన్ని వ్రాసికుంటూ వచ్చాడు శ్రీశ్రీ. కానీ ఇది సమాజంలో ఉన్న అనేక మందికి నచ్చలేదు. శ్రీశ్రీ అనంతం గురించి ఇది ఒకచోట కదలకుండా కూర్చొని తీరిగ్గా, తాపీగా వ్రాసినది కాదు అని చెప్పవచ్చు. మరొక మాటగా చెప్పాలంటే శ్రీశ్రీ అనంతం ఒక వరుసక్రమంలో కూడా రాయలేదు.

నా దరిద్రపు రోజులు :

ఫలానా తారీఖునుండి నా దరిద్రం ఆరంభమైందని చెప్పలేను. 1930 నుండి 1940 వరకు చాలా అవస్థలుపడి ఈ దశాబ్దంలోనే మహాప్రస్థానం గీతాలన్నీ చాలామటుకు రాశాడు. ఈ అనంతం గురించి చిత్రకారులు ఏమి చెప్పారంటే హంగ్రిథర్టీస్ అని చెప్పారు.

కొంపెల్ల జనార్ధనరావు గారు :

''లోక ప్రవృత్తినంతటిని కలవరపరచిన ఆర్థిక మాంధ్యం రోజులు'' అని ఆయన మాటల్లో చెప్పాడు. ఇప్పుడు శ్రీశ్రీ అగాథమైన లోతుల్లోకి దిగుతున్నాడు. దరిద్రం అనుభవించేటప్పుడు ఎంత ఘోరంగా ఉంటుందో గుర్తుకు చేసుకున్నప్పుడు అంతే సంతోషంగా ఉంటుంది అని శ్రీశ్రీ చెప్పాడు.

ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్ నుండి కలకత్తాకు కాలినడకలో చేరుకున్నాడు. అలా రైలు పట్టాల మీద 20 మైళ్లు నడిచే సరికే దారిలో మేక శవం, మబ్బులో ఎవరో ఉన్నట్లు కనిపించింది. అప్పుడు అక్కడున్న ప్రజలు ఇది చాలా భయంకరమైన ప్రాంతం ఇక్కడికి ఎందుకు వచ్చావు అని అడగ్గా నా దగ్గర అణాలున్నాయి. నన్ను ఎవరు చంపలేరు అని చెప్పారు. అప్పుడు ఆ ప్రాంత ప్రజలు నీవు ఉత్త చవటవి ఈ ప్రాంతంలో ఒక్కఅణా ఉన్నాకూడా ధన వంతుడౌతారని చెప్పారు. ఆ విధంగా ఒకరాక్షసరాత్రి గడిపారు.

మరుసటి రోజున నడుస్తున్నాడు, నడుస్తున్నాడు అంగీ జేబులో రెండు అణా ల డబ్బులతో రైల్వేస్టేషన్ దాటి అక్కడ మట్టికూజాలో ఉన్న నీళ్లు తాగిన తర్వాత స్టేషన్ మాస్టారు టి.సి దగ్గరకు వచ్చి ఈ రాత్రికి ఇక్కడే పడుకోమని చెప్పారు. అలా ఆ రోజు రైల్వేస్టేషన్‌లోనే నిద్రపోయి మర్నాడు తెల్లవారగానే మరోబండిలో ఎక్కి తంత్రగాచికి బయలుదేరి వెళ్లాడు.

శ్రీరంగం వెంకటరమణమ్మ శ్రీశ్రీ మొదటి భార్య. నాదరిద్రపు రోజుల్లో ఓ సారి శ్రీశ్రీ గారు తన భార్యతో నాకు ఒక పెద్ద ఉద్యోగి నౌకరుజాబు ఇస్తే నువ్వు వాడి దగ్గరకు వెళతావా? అని అడిగితే వెంకటరమణమ్మ తప్పకుండా వెళతానంది. తన భార్య నిజాయితీకి శ్రీశ్రీ గారు హర్షించారు. చివరకు భార్యతో శ్రీశ్రీ నాకు ఉద్యోగం ఇచ్చేవాడు లేడు, నువ్వు వెళ్లనవసరం లేదు అని నా దరిద్రపు రోజుల్లో శ్రీశ్రీ గారు చెప్పుకుంటూ వచ్చారు.

నా దరిద్రపు రోజుల్లో రెండు రోజులు తిండిలేకుండా శ్రీశ్రీ బ్రతకగలిగాడు. 10 సంవత్సరాలలోనే మహాప్రస్థాన గీతాలు రాశాడు. అంత దారిద్ర్యంలో ఉన్నాకూడా ఎవరిని కానీ 'దేహి' అని చేయి చాపలేదు. క్యారంబోర్డు ఆటలో గెలిచిన కప్పులను, కవిత్వాన్ని కూడా అమ్ముకున్నాడు.

ఇది వ్యభిచారం అని శ్రీశ్రీకి బాగా తెలుసు. సింకి గుడ్డల సింహం అనే పూర్తికానీ గీతంను ఆరోజుల్లోనే ఆలపించాడు. సింహం ఆరోజుల్లో శ్రీశ్రీ గారికి ఆదర్శప్రాయం. గత పది సంవత్సరాల్లోనే దరిద్రము అందుల్లోంచి పుట్టుకొచ్చిందే శ్రీశ్రీగారి కవిత్వం.

ఆ దరిద్రపురోజులు శ్రీశ్రీని బాధించిన దానికన్నా అంతగా శ్రీశ్రీ నాన్నగారిని ఎక్కువగా సంక్షోభానికి గురిచేసి వుంటాయి. ఎప్పుడు ఆనందంగా ఉండే ఆయన ముఖంలో దరిద్రపు కత్తిపోటు బలంగా నాటుకు పోతుందని శ్రీశ్రీకి చాలా క్లుప్తంగా కనపడేది. జీవితంలో బాగా డబ్బున్న వారిగా విశాఖపట్నంలో ఏలిన శ్రీశ్రీ నాన్నగారు అగాథంలోకి కూరుకుపోతుంటే వారి చుట్టాలుగానీ, స్నేహితులు గానీ ఎవరు పట్టించుకోలేదు.

శ్రీశ్రీ గారికి టైఫాయిడ్ జ్వరం వచ్చి ప్రాణం పోయేటట్లు ఉన్న పరిస్థితుల్లో ఆసుపత్రి ఖర్చులకు డబ్బులు లేక ఇల్లు అమ్మకానికి పెట్టారు. వేలంపాటలో ఇల్లు అమ్మకమైంది. కానీ శ్రీశ్రీ నాన్నగారికి ఇల్లు అమ్మడం ఇష్టం లేదు. ఎందుకంటే శ్రీశ్రీ గారి వాళ్ల అమ్మ అంటే నా భార్య స్వయంగా పాదులు త్రవ్వి, గంపలతో రాళ్లుకూడా మోసిందని ఎట్టి పరిస్థితుల్లో ఇల్లు అమ్మకూడదు అనుకున్నాడు. కానీ దేవుడు రాసిన తలరాతలో విధిని తప్పించుకోలేక ఇల్లు అమ్ముకోవాల్సి వచ్చింది. " పూర్వజన్మలో చేసిన పాపాలకు ప్రస్తుత జన్మలో పనిష్‌మెంట్ అన్నట్లు".

ఆ కాలంలో శ్రీశ్రీ వాళ్ల నాన్న ఎందరికో ఉపకారాలు చేసేవారు. అపకారాలు చేసేవాడు కాదు. కష్టకాలంలో శ్రీశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఎవరు ముందుకు రాలేదు. ఓ సారి శ్రీశ్రీ వాళ్ల నాన్న శ్రీశ్రీ గారితో ఏమన్నా డంటే పాఠశాల ప్రధానాచార్యులు ఉండి, చదువు నేర్పించి, పరీక్షలు, మార్కులు వేయించి అందరిని పాస్ చేయించాడు. కానీ విద్యార్థుల చేత కాపీ కొట్టించాడు అనే నెపంతో నా ఉద్యోగ రీత్యా హెూదాను తగ్గించేశారు అని చెప్పారు. కాబట్టి ముందుగానే తనకు కష్టపు రోజులు వస్తాయని ఊహించి అపకారాలు చేయలేదు. ఆయన స్వాభావమే ఆయన చేత మంచిపనులు, ఉపకారాలు చేసేటట్లు చేసిందని చెప్పారు.

శ్రీశ్రీ నాన్నకు అప్పు ఉన్న వాళ్లంతా ఎదోక సాకుతో అప్పు ఎగరగొట్టేవాళ్లు చివరకు శ్రీశ్రీ గారికి కూడా ఎటువంటి ఆస్తిపాస్తులు మిగల్చలేదు. శ్రీశ్రీ వాళ్ల నాన్న స్నేహితుడు వాళ్ల నాన్న దగ్గర రూ.200 అప్పు తీసుకున్నాడు. ఆయన అనుకోని కారణాల వలన మరణించాడు అప్పుడు శ్రీశ్రీ వాళ్ల నాన్న మిత్రుని భార్యదగ్గరకు వెళ్లి మీ భర్త నా దగ్గర రూ.200 అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బులు ఇవ్వండి అని అడగ్గా ఆమె సరేమొత్తం చెల్లిస్తాను కానీ రుణపత్రం తీసుకుని రమ్మన్నది శ్రీశ్రీ వాళ్ల నాన్నగారి దగ్గర రుణపత్రం లేదు. రుణపత్రం లేదనే విషయం తెలుసుకుని అది తేస్తేగాని డబ్బులు ఇవ్వనంది.

శ్రీశ్రీ నాన్నగారు మాత్రం తీసుకున్న అప్పు నెలనెలకట్టేవాడు. ఇంకా రెండు, మూడు నెలల్లో అప్పు మొత్తం తీరుతుందనే సమయంలో వాళ్ల నాన్న దగ్గర ఉన్న రశీదులన్నీ పొగొట్టుకుపోయాయి. శ్రీశ్రీ నాన్నగారికి అప్పు ఇచ్చిన వాళ్లు అందరు రశీదులు పోయిన విషయం తెలుసుకుని ఇవ్వవలసిన మొత్తంకంటే రెండింతలు ఎక్కువ వడ్డీ వసూలు చేశారు. ఈ సమాజం నేటికి నాటికి ఇలాంటి పద్ధతులనే అంగీకరిస్తుందని అందుకే కోపం అనేది ఏ కోశాన లేని శ్రీశ్రీకి ఈ వ్యవస్థ పేరు ఎత్తిన, ఈ సమాజం పేరు ఎత్తినా చాలు కోపం అనేది అరికాలిమంట నెత్తికెక్కుతుంది శ్రీశ్రీకి.

సుభద్రమ్మ శ్రీశ్రీ వాళ్ల నాన్నగారి రెండవ భార్య. ఆమె చనిపోయినప్పటి నుండి వీళ్ల దరిద్రపు రోజులు ఎక్కువ అయ్యాయి. ఆడవాళ్లు లేని శ్రీశ్రీ ఇంటిలో నుండి సామానులు ఒకటికి మరొకటి మాయం అవుతుండేవి. అలా అన్ని వస్తువులు పొగొట్టుకున్న తర్వాత వాళ్లు చిన్న అద్దె ఇంటిలో వుండేవారు. ఆ సమయంలో శ్రీశ్రీ నాన్న దగ్గర గొలుసు, బంగారు గడియారం ఉండేవి. అవి వాళ్ల

నాన్న గారితో అక్రమ సంబంధం పెట్టుకున్న ఒకామె ఒక చిన్నపిల్లవాడి సహాయంతో గొలుసుతో సహ గడియారం కూడా తీసుకుంది. అవి అన్ని ఎక్కడికి వెళ్లాయని శ్రీశ్రీ గారు అడిగితే వాళ్ల నాన్నగారు ''పోయింది పోల్లె ఉన్నది గట్టు''అని శ్రీశ్రీ నాన్నగారు చెప్పారు.

శ్రీశ్రీవాళ్ల నాన్నగారి రెండవ భార్య సుభద్రమ్మ చనిపోవడం శ్రీశ్రీకి పెళ్లికావడం రెండుకూడా శ్రీశ్రీగారి దరిద్రపు రోజులు ప్రారంభకావడానికి కారణం అయ్యాయి. శ్రీశ్రీ గారి భార్య శ్రీశ్రీ గారి కంటే 15 సంవత్సరాలు చిన్నది. పెళ్ళైన వెంటనే శ్రీశ్రీభార్యను నష్ట జాతకురాలనీ, ఇనుప పాదాలదని మా బంధువులు, చుట్టాలందరు అనడం వల్ల అవన్ని విషయాలు మనస్సులో నాటుకుపోయి దరిద్రపు రోజులు మరి ఎక్కువగా అయ్యాయి.

నడిచెను నడిచెను ... జీవితంలో నడకకు ప్రాధాన్యం ఇచ్చేవాడు శ్రీశ్రీ. శ్రీశ్రీకి ఒంటరిగా నడవడమే ఇష్టం. మిత్రులతో కలసి నడవడం ఇష్టం లేదని కాదు కానీ నలుగురితో కలిసి నడిస్తే వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవాడు.

ఒకసారి శ్రీశ్రీ ఎర్రమిల్లి రాంబాబు ఇంటివైపు నడుచుకుంటూ వెళుతున్నాడు. ఎర్రమిల్లి సోదరులు పఠాభి, రాంబాబు ఇద్దరు శ్రీశ్రీ గారి స్నేహితులు ఇంచుమించు వారు ముగ్గరికి ఒకేవయస్సు ఉంటుంది. ముగ్గురుని ఆటలలో ప్రావీణ్యం ఉన్నవాళ్లే. ధీపావళి పండుగరోజున రామలింగస్వామి కుడిచేతిలో మందు గుండు పాత్ర పేలి కుడిచేయి కాలిపోతే ఆపరేషన్ చేశారు. డాక్టర్ రామలింగస్వామి చేతి బోటనవ్రేలికి రుమాలు కట్టడం వల్ల అది ఒక ఫ్యాషన్ అనుకుని అందరుకూడా వారి యొక్క కుడిచేతికి రుమాలు కట్టుకుని తిరిగేవాళ్లు.

శ్రీశ్రీ గారి ఇంకొక మిత్రుడు ద్వారం జగన్నాథరావు. వీడి ధనవంతుడు జగన్నాథరావు శ్రీశ్రీకి ఎప్పుడు కోకు తయారు చేసి ఇచ్చేవాడు. కానీ ఎప్పుడు కూడా డబ్బులు అడిగి ఇప్పించుకునే వాడు కాదు. శ్రీశ్రీ గారి మిత్రులు రాంబాబు, పఠాభి దగ్గర కొద్ది మొత్తంలో డబ్బు ఉండేది. కానీ శ్రీశ్రీ దగ్గర ఒక పైసాకూడా ఉండేది కాదు. రాంబాబు దగ్గర ఉన్న డబ్బులతో ఈతకల్లు కొనుక్కొని ఇద్దరు తాగేవారు. అదికూడా మంచినీళ్లు తాగినట్టు ఉంది కదరా అని అనుకునేవారు. ఇది ''పాలిచిన కల్లు కదూ! చాలా ఆరోగ్యం'' అని రాంబాబు అంటే ఏడ్చినట్టే ఉంది అని శ్రీశ్రీ అనేవాడు.

శ్రీశ్రీ మద్రాసు తంబుచెట్టు కాలనీలో ఉన్న ఫస్ట్ స్టూడెంట్ హోంలో ఉండి బి.ఎ చదువుకునే రోజుల్లో నెలాఖరి దినాల్లో డబ్బు అవసరం అయ్యింది. అప్పుడు శ్రీశ్రీ వాళ్ల నాన్నగారిని టి.ఎం.ఒ చేయమని జాబు వ్రాసి కోర్టు లోపల ఉన్న తపాలాశాఖలో వేయడానికి వెళుతుంటే మార్గమధ్యంలో పడివున్న దానిని ఎదో ఒక కాగితపుపేపరు అని తన్నబోయాడు. తీరా చూస్తే అది ఐదు రూపాయల నోటు. ఈ అయిదు రూపాయల నోటుతో 5 రోజులు హాయిగా బ్రతకగల రోజులు అని అనుకునేవాడు కానీ దొరికినందుకు దేవుడికి కృతజ్ఞతలు చెప్పదలచుకోలేదు అని అంటాడు.

శ్రీశ్రీ గారు దరిద్రపు రోజుల్లో కూడా మాకు సహాయం చేయండి అని భగవంతుడిని కానీ మిత్రులను కానీ, బంధువులను కానీ ఎవరిని అడగలేదు. ''అత్యున్నతమైన శిఖరాలనుండి అతిభయంకరమైన లోయలోకి కూరుకు పోతున్నప్పుడు కూడా ఎక్కడ ఉన్నారు ఈ బంధువులు, మిత్రులూ, దేవుళ్ళు అని చెప్పేవారు.

చివరగా ''భగవంతుణ్ని తలచుకోవడం అంటే పిరికితనం ఇంకొకటి లేదు. అనేది శ్రీశ్రీగారి విశ్వాసం''.

ఆధార గ్రంథాలు :

1. శ్రీశ్రీ అనంతం- ఆత్మచారిత్రాత్మక నవల
2. ప్రజాతంత్ర వారపత్రిక - 18.1.1976, 25.1.1976, 8.2.1976

❖

తెలుగు సాహిత్యంపైన శ్రీశ్రీ ప్రభావం

– డా॥. పి. కమల సుధారెడ్డి, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, గవర్నమెంట్ సిటీ కాలేజ్, హైదరాబాద్.

శ్రీశ్రీగా ప్రఖ్యాతి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఆధునిక తెలుగు కవిత్వ చరిత్రపై అత్యంత ప్రభావాన్ని చూపిన మహాకవి. 1910లో విశాఖపట్టణంలో జన్మించారు. 1931లో బి.ఏ. డిగ్రీ చదివి రేడియోలో, పత్రికల్లో వివిధ రంగాల్లో అనేక ఉద్యోగాలు చేశారు. "మానవుడే నా సందేశం, మనుషుడే నా సంగీతం" - అని ఎలుగెత్తి చాటిన అభ్యుదయ కవి శ్రీశ్రీ. తెలుగు కవిత్వాన్ని మరో మలుపుతిప్పిన మహాకవి. ప్రాచీన తెలుగు కవిత్వానికి ఆధునిక సాహితీ పోకడలు అద్ది తెలుగు సాహిత్యంపైన తనదైన ముద్ర వేసిన మహనీయుడు శ్రీశ్రీ. దాదాపు 30 సం॥లు తెలుగు సాహిత్యాన్ని ఏలిన భావకవిత్వానికి తిరుగుబాటుగా అభ్యుదయభావ పరంపరలతో అభ్యుదయ సాహిత్య యుగకర్తగా నిలిచాడు శ్రీశ్రీ. అగ్గిపుల్ల / సబ్బుబిళ్ళ / కుక్కపిల్ల / కాదేది కవిత కనర్హం - అంటూ సమకాలీన సమాజంలోని సమస్యలే కవితా వస్తువులుగా స్వీకరించి ఆధునిక తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశం చేశాడు. శ్రీశ్రీ అనగానే ప్రపంచానికి గుర్తువొచ్చేది మహాప్రస్థానం. శ్రీశ్రీ రచనల్లో మహాప్రస్థానానికి వచ్చిన ఖ్యాతి దేనికి రాలేదనే చెప్పవచ్చు. మహాప్రస్థానం అంటే "గొప్ప ప్రయాణం" అని అర్థం. ఇందులోని ప్రతి కవిత సాహిత్యాభిమానుల నోట వేమన పద్యంలా పలికింది. అభ్యుదయ కవిత్వోద్యమానికి దారి చూపించింది. విప్లవ కవిత్వోద్యమానికి బీజాలు మహాప్రస్థానంలో కనిపిస్తాయి.

శ్రీశ్రీ గొప్ప ప్రయోగవాదకవి. వస్తువుతో పాటు శిల్ప రహస్యమెరిగిన ప్రతిభాశీలి. కొత్త పదబంధాలతో, వినూత్న అభివ్యక్తితో, అలంకారవైచిత్రితో, అద్భుతమైన ప్రతీకలతో వచన కవితలో శబ్ద సౌందర్యాన్ని, భావవైదుష్యాన్ని నింపి సామాజిక చైతన్యాన్ని సాధించిన ప్రయోజనాత్మక కవితాసారథి శ్రీశ్రీ. "కవిత్వమొక తీరని దాహంగా" బ్రతికిన మహాకవి శ్రీశ్రీ.

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ముద్ర ప్రగాఢమైంది. అందుకే సాహిత్యకారులు కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ / ప్రపంచం బాధ శ్రీశ్రీ బాధ - అంటూ ఆయన సమసమాజస్థాపన కృషిని చెప్పారు. వ్యక్తి శ్రేయస్సుకన్నా సంఘ శ్రేయస్సుని కాంక్షించే వారంతా శ్రీశ్రీ మార్గంలోనే ప్రయాణించారు. 1930 వరకు తెలుగు సాహిత్యం శ్రీశ్రీని నడిపించింది. ఆ తర్వాత నుంచి తెలుగు సాహిత్యాన్ని శ్రీశ్రీ నడిపించారు అనడంలో అతిశయోక్తి లేదు. అప్పటి నుండి ఉన్న తెలుగు సాహిత్య చరిత్ర శ్రీశ్రీ స్వీయచరిత్ర అనడంలో సందేహం లేదు. అభ్యుదయ కవిత్వం గ్రాంధిక భాషకు స్వస్తి పలికి వ్యావహారిక భాషకు పట్టం కట్టింది. దీనికి మూలకారకులు శ్రీశ్రీనే. ఛందోబందోబస్తులు తెంచేస్తాన్నంటు రచనలు చేశారు.

సామాజిక జీవితంతో, రాజకీయ రంగంతో, ప్రజాఉ ప్యమాలతో అత్యంత సన్నిహితంగా ఉన్నాడు శ్రీశ్రీ. అందుకే తన జీవితకాలంలో తెలుగు సాహిత్యం తిరిగిన అన్ని మలుపుల్లోనూ ఉన్నాడు శ్రీశ్రీ. పరిస్థితులు తోసుకువస్తే కీలకపాత్ర వహించగలడు, ఉద్యమం ఉద్భుతమైతే నాయకత్వం వహించగలడు అందుకే తెలుగు సాహిత్యం మీద ఆయన ప్రభావం అనంతం.

సైన్సు లాగే కవిత్వానికి ప్రయోగాలు లేనిదే అభివృద్ధి లేదని భావించాడు శ్రీశ్రీ. తొలినాళ్ళలో భావకవిత్వోద్యమ ప్రభావంతో ప్రభవ అనే పద్యకావ్యాన్ని విద్యార్థి దశలోనే రచించారు. ఆ తర్వాత అంతా అభ్యుదయ భావాల సృష్టే చేశారు. తన 15వ ఏట పరిణయ రహస్యము అనే నవలను వ్రాశారు. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో అన్నింటినీ దాదాపు సృశించారు శ్రీశ్రీ. అనంతం ఆత్మ కథలో శ్రీశ్రీ చరిత్రగా కాదు తెలుగు సాహిత్య చరిత్రగా దాన్ని మలిచారు. శ్రీశ్రీకి మరింత ఖ్యాతి తెచ్చింది ఖడ్గసృష్టి.

ఇందులో ప్రతి కవిత ఆలోచనని, ఆవేశాన్ని కల్గించే విధంగా ఉంది. ప్రారంభకవిత రెండురెళ్ళు నాలుగున్నం దుకు అంటూ సాగే ఈ కవిత్వ సమాజంలోని హింస, దౌర్జన్యం, బీదరికం కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. శరచ్చంద్రికలో నవీన విశ్వవిద్యాలయాల్లో / పురాణ కవిత్వంలాగా / శ్రవణ యంత్రశాలల్లో / శాస్త్రీయ సంగీతం లాగా / ఇలా వచ్చావేం వెన్నెలా - అంటూ ప్రశ్నించే విధానం సర్వకాలాల్లో పీడితజన జీవితాలకి అద్దంలా ఉంది. విశాలాంధ్రలో ప్రజారాజ్యం - శక్తి కోసమే నడు / ముక్తి కోసమే మను / విముక్తి కోసమే మను / విశ్వశాంతి క్రాంతి కోసమే మనస్సు లేకమై నడూ నడూ; భయం గియం విడూ - అంటూ ప్రజల్లో ధైర్యాన్ని నింపి ముందుకు నడిపించేలా కవిత్వం వ్రాశారు.

"తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవరు ? - అని శ్రామిక వర్గ పక్షాన నిలబడి ప్రశ్నించారు. పాలాలన్నీ / హలాలా దున్ని / ఇలాతలంలో హేయం పిండగ / ధర్మజలానికి / ఘర్మజలానికి ఖరీదు కట్టే శరాబు లేడంటు శ్రమైక జీవన సౌందర్యాన్ని శ్లాఘించారు.

శ్రీశ్రీ అంటే కవిత్వం మాత్రమే కాదు వ్యాసం, నవల, నాటకం, కథ ఇలా అనేక కోణాల్లో రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. అందుకే తెలుగు సాహిత్యం మీద ఆయన ప్రభావాన్ని ఇంత అని చెప్పడం సాధ్యం కాదు. ఎన్నెన్నో రేడియో నాటకాలు వ్రాశారు. ముఖ్యంగా రష్యాలో సామాజిక పతనాన్ని చిత్రించే చెహూవ్ (1860-1904) మధ్య నాటకం శ్రీశ్రీ రచనల్లో చెప్పదగింది. ఇది అక్కడి రాచరిక వ్యవస్థ క్షీణదశను, చెహూ కళాకారుడు తన గళంతో చేసిన అద్భుతం ప్రధానాంశంగా సాగింది. ఇక రెండో నాటకం అమ్మ. ఇది ప్రపంచ శాంతిని కాంక్షించేది. దాదాపు 29 రచనలు అచ్చయినాయి. అచ్చుకానివెన్నో ఉన్నాయి.

శ్రీశ్రీ ఉద్యమావేశ స్ఫూర్తితో చేసిన రచన మహా ప్రస్థానం. ఇది 1933లో రచింపబడింది. శ్రామికలోకపు సౌభాగ్యం కోసం, కార్మికలోకపు కల్యాణం కోసం మానవతా హృదయంతో చేసిన రచన. ఇందులో జయభేరి కవిత ఒక మార్టఫాస్ట్ గీతంగా ఆవేశపూరితంగా సాగుతుంది. ఇందులోని లయ, నేను సైతం అనే మాటల పునరుక్తి పఠితలో భావావేశాన్ని కల్గిస్తుంది. కవితలోని నేను వ్యక్తి కాదు, సామాజిక ప్రాతినిథ్యంగా భావించాలి. కారణం వ్యక్తికి బహువచనం శక్త అని శ్రీశ్రీ సామూహిక చైతన్యానికి ప్రతీకగా ఈ నేను ప్రయోగించాడు. సమిధ, ఆహుతి అనే పదాలను ఉన్నతమైన ఆశయాల కోసం సమర్పణగా, నిస్వార్థంగా అంకితమవడంగా కవి భావించాడు. "నేను సైతం / ప్రపంచాగ్నికి / సమిధ నొక్కటి ఆహుతిచ్చాను" అంటూ ప్రేరణాత్మక సందేశాన్ని ఇచ్చాడు.

నాడు - నేడు కూడా శ్రీశ్రీ కవిత్వం అంటే ప్రేరణ, ఆవేశం, చైతన్యం. అందుకే ఆధునిక తెలుగు సాహిత్యం అయన నీడ వంటిదని పలువురి అభిప్రాయం.

సాహిత్య ప్రక్రియలే కాదు సినిమా పాటలు కూడా అద్భుతంగా వ్రాశారు. ఇవి కవి ఆబాలగోపాలాన్ని రసానందానికి లోను చేశాయి. 93 పాటలు తెలుగువారి ఇళ్ళలో సందడి చేశాయి. ముఖ్యంగా తొలి తెలుగు రంగుల చిత్రం అల్లూరి సీతారామరాజులో పాట ఆనాడు జాతీయగీతంలా తెలుగు ప్రజలు ఇంటింటా పాడు కున్నారు. "తెలుగు వీరలేవరా దీక్షబూని సాగరా" - అనేది ప్రఖ్యాతమైంది. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ఒక శకంగా నిలిచారు. ప్రతి రచనలో ఒక కొత్తదనాన్ని చవి చూపిం చారు. అందుకే శ్రీశ్రీ అంటే ఆధునిక తెలుగు సాహిత్యానికి శ్రీకారం, శ్రీకరంగా నేను భావిస్తున్నాను.

❖❖❖

మహాకవి - శ్రీశ్రీ ప్రతిజ్ఞ

- **చుట్టి రవీంద్ర,** పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

విప్లవ కవిగా సాంప్రదాయ చాందస్సు బంద కవిత్వాన్ని దిక్కరించిన ప్రజాకవి శ్రీశ్రీ. ఆయన పాటలలో కవితలలో సగటు మనిషి ఆవేదన కన్పిస్తుంది. 20 వ శతాబ్ధపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి. విప్లవ కవిగా తన రచనలతో ప్రజలలో చైతన్యం నింపుతూ, ఒక సామాన్య మానవుడి భాదలను పాటల రూపంలో తన కలంతో వారి బాధను వినిపించిన యుగకర్త. విప్లవ రచయితల సంఘం వ్యవస్థాప అధ్యక్షులు, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు, సినిమా పాటల రచయిత, నాస్తికుడు, హేతువాది శ్రీశ్రీ గారు.

"కృష్ణ శాస్త్రి బాధ ప్రపంచానికి బాధ, ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ" అని చలం గారు మహాప్రస్థానానికి యోగ్యతా పత్రంలో చెప్పారు.

"1930 దాకా తెలుగు సాహిత్యం నన్ను నడిపించింది, ఆ తర్వాత నుంచి నేను దాన్ని నడిపిస్తున్నాను" (దిస్ సెంచరీ ఈజ్ మైన్) అని చెప్పకున్న శ్రీశ్రీ గా అందరికి సుపరిచితమైన శ్రీ రంగం శ్రీనివాసరావు 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకట రమణయ్య, అప్పలకొండ దంపతులకు జన్మించాడు. ఈయనను శ్రీ రంగం సూర్యనారయణ దత్తత తీసుకోవడం వలన ఈయన ఇంటి పేరు శ్రీరంగంగా మారిపోయింది. 1925లో ఇంటర్ పాసయ్యాడు, 1931లో మద్రాసు విశ్వవిద్యాలయంలో బి.ఎ(జంతుశాస్త్రం) పూర్తి చేశారు, 1938లో మద్రాసు 'ఆంధ్రప్రభ'లో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు.

శ్రీశ్రీ తన ఏడవ యేటనే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు. తన ఏనిమిదవ యేట తాను రాసిన మొదటి గేయాల పుస్తకం ప్రచురించబడింది. 1928లో తన 18వ యేట 'ప్రభవ' అనే కావ్యానంపుటిని సంప్రదాయ పద్ధతిలో రాసి ప్రచురించారు. 'వరం వరం', సంపంగి తోట మొ॥ వాడుక భాషలో రచనలు చేస్తూ 1950లో 'మహాప్రస్థానం' అనే కవితా సంకలానాన్ని రచించారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి మహా ప్రస్థానానికి ముందు, మహాప్రస్థానానికి తర్వాత అని చెప్పడంలో అతిశయో శక్తి కాదు లేదు. ఈ మహాప్రస్థానం ఒక అభ్యుదయ కవితా సంపుటి. ఇందులో మొత్తం 40 నలువై కవితలున్నాయి.

ఈ మహాప్రస్థాన కవితా సంకలనంలో శ్రీశ్రీ గారు కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలను ఉత్తేజపరుస్తూ, నూతనోత్సహం కలిగిస్తూ ఉర్రుతలూగే కవితలు రాశారు. ఇది తెలుగు కవితకే మార్గదర్శకం అయింది. ఈ మహాప్రస్థాన రచనే శ్రీశ్రీని మహాకవిగా మార్చింది అని చెప్పడంతో సందేహం లేదు. ప్రజా సమస్యలపై తన సమర శంఖాన్ని ఊరించింది మహాప్రస్థానం కవితా సంపుటి, ఈ మహాప్రస్థాన కవితా సంకలనంలో 'ప్రతిజ్ఞ' అనే కవితను ఈ వ్యాసంలో చెప్పదలచుకున్నాను.

కర్షక, కార్మికుల, శ్రామికుల కష్టాలను తన కవిత్వం ద్వారా వారి కష్టాలు తొలిగేందుకు మార్గాన్ని చూపుతానని లోకానికి తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేసాడు శ్రీశ్రీ. కష్టపడి, శ్రమ పడే వారి పట్ల గౌరవం, అన్ని పనులను, అన్ని వృత్తుల వారిని గౌరవించాలి.

"పాలాలనన్నీ
హలాల దున్ని
ఇలా తలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ
విరామ మెరుగక పరిశ్రమించే
.....
.....
ఘర్మ జలానికి ఖరిదు లేదోయ్"!

నిత్యం విశ్రాంతి అనేది లేకుండా పోలాలన్నింటిని, నాగళ్ళలో దున్ని ఈ భూమి మీద బంగారాన్ని పండిస్తున్నారు. నీవు పండించిన దాని వల్లే జగం అంతా ఆకలి తిరుస్తున్నావు. విరామం లేకుండా నీ శక్తిని మొత్తాన్ని ఈ భూమి కోసమే త్యాగం చేస్తున్నారు కర్షకులు అని, అలా శ్రమించేటపుడు శరీరం నిండా చెమట కాలువలుగా ప్రవహిస్తుంది అని, ఆ ఘర్మజలానికి (చెమట)కు ఖరీదు అనేది అసలు కట్టలేము అని శ్రీశ్రీ చెబుతున్నారు.

"నరాల బిగువూ
కరాల సత్తువ
వరాల వర్షం కురిపించాలని
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని
గనిలో, పనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ
పరిప్లమిస్తూ
.....
.....
.....
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదు కట్టే షరాబు లేడోయ్!"

ప్రపంచం మొత్తం సంపదలతో భాగ్యవంతంగా వెలగాలని కార్మికులు తమ నరాలలో ఉన్న పట్టు, చేతులలోని శక్తిన్నంతా పణంగా పెట్టి గనులలో, అడవులలో, పరిశ్రమలలో, కర్మాగారాలలో పనిచేస్తూ ఆ ధనిక సామ్యయాజమానులకు దాస్యం చేస్తు ఉంటారు అని వాపోతున్నాడు శ్రీశ్రీ గారు. వారు పని చేసే యంత్రాలను భూతాలు అని వాటిని ఎల్లప్పుడు నడిపిస్తుంటారు అని, ఆ కార్మికుల కళ్ళ నుండి ఎంతో విశాదంతో కూడిన కన్నీళ్ళకు ఖరీదు కట్టే యజమానులు ఎవరువ లేరని చెబుతూ

"కావున - లోకపుటన్యాయాలు
కాల్చే ఆకలి, కూల్చే వేదన
దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ
పరిష్కరించే, బహిష్కరించే
.....
.....
నాలో కదలే నవ్య కవిత్వం
కార్మిక లోకపు కళ్యాణానికి
శ్రామిక లోకపు సౌభ్యాగానికి
.....
సమానమైనది లేనే లేదని"

లోకంలో జరిగేటటువంటి అన్యాయాలు, ఆకలి, మనిషిని చంపే వేదన, పేదరికం మరియు దౌర్జన్యాలు ఎండగడుతూ వాటిని రూపు మాపాలని దాని కోసం దారులు వేసే కవితలు రాస్తూ, నాలో కదులుతున్నా కవిత్వం ఆ కార్మికుల యొక్క శుభం కొరకు, వారికి మేలు చేయడం కోసం, వారు సౌభాగ్యంగా ఉండడం కోసం నా గీతం వారికి అర్పిస్తున్నాను అని అదే విధంగా ఈ మూడు కాలాలో, మూడు లోకాలలో ఈ శ్రామికుల శ్రమ సౌందర్యానికి తల తూగేది, సమానం అయినది ఈ ప్రపంచంలోనే లేదని శ్రీశ్రీ గారు అంటున్నారు.

"కష్టజీవులకు
కర్మవీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ
స్వస్తి వాక్యములు సంధానిస్తూ
స్వర్ణ వాద్యములు సంరావిస్తూ
.....
.....
భావి వేదములు జీవనాదములు
జగత్తు కంతా చవులిస్తానోయ్!"

కర్మవీరులకు నిత్యం పని చేసే ఆ కష్ట జీవులకు నేను బంగారు వాయిద్యాలతో, స్వస్తి మంత్రాలతో వారికి హారతి పడతాను అని, వారి భాదలను, కష్టలను ముందు తరాల వారికి చెప్తాను అని, ' నా మాటలు భావితరాలకు, వేదాలు, జీవనాదాలు అని ఈ జగత్తు మొత్తం వినే లాగా చేప్తాను అని అంటున్నారు శ్రీశ్రీ.

"కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం,
జాలరి పగ్గం
సాలెల మగ్గం
శరీర కష్టం స్ఫురింపజేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి
సహస్రవృత్తుల సమస్త చిహ్నాలు
నా వినుతించే
నా విరుతించే
.....
నా విరచించే నవీన రీతికి
భావం!
భాగ్యం!
ప్రాణం!
ప్రణవం!"

అని ఇనుపు వస్తువులు తయారు చేసే కమ్మరి కొలిమి, కుండలు చేసే కుమ్మరి యొక్క చక్రం అలాగే చేపలు పట్టేందుకు జాలరి దగ్గర వల, బట్ట నేసే సాలేల యొక్క మగ్గం మొ॥ ఇవి అన్ని కూడా శరీరం యొక్క కష్టాన్ని చూపే చిహ్నాలే. ఈ ప్రపంచంలో శారీర కష్టం చేసేవారు చాలా ఉన్నారు. అదే విధంగా గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి అన్ని వివిధ వృత్తులకు గుర్తులు. ఆ చిహ్నాలే నేను చెప్పేది, నేను వినిపించేది, నేను రాసేటటు వంటి కవితలకు భావం, భాగ్యం అన్ని కూడా ఆ కార్మిక వీరులే, నేను నా గీతాలన్ని వారి కోసం రాసి అంకింత చేస్తాను అని తెలియజేసారు. ఆ శ్రామికులు, కార్మికులు నా కవిత్వంలో నాయకులు అని శ్రీశ్రీ గారు ప్రతిజ్ఞ కవితలో కార్మికులు, శ్రామికులు శ్రమ చేసే వారందరికి తన కవితను రాసి అంకింతం చేశారు శ్రీశ్రీ గారు.

శ్రీశ్రీ కవిత్వాన్ని పరిశీలిస్తే ఆయన మొదట పద్యం, కవి గాను, తర్వాత భావకవిగా, ఆ తర్వాత అభ్యుదయ కవి కనిపిస్తాడు. అదేవిధంగా విప్లవ కవిగాను కనిపిస్తారు శ్రీశ్రీ. ఆయన కవిత్వం, రచనలు కాక సినిమా పాటలు కూడా రాశారు. ఈయన సినిమా పాటలు "పాడవోయి భారతీయుడా" "తెలుగు వీర లేవరా" పేర్లతో వెలువడ్డాయి. తను చెప్పదలచుకున్నది నిర్భయంగా, నిరమెహమాటంగా చెప్పడమే కాక ఆయన మాటలలో చమత్కారం, శ్లేష ప్రయోగం కనబడుతుంది. ఉదా:- ఒక మిత్రుడు తనకు ఒక నాటిక రాయమని అడిగితే దానికి శ్రీశ్రీ గారు దానికేం " ఏనాటికైనా రాస్తాను" అని చమత్కారంగా చెప్పాడు.

"నా రచనలలో లోకం ప్రతిఫలించి
నా తపస్సు ఫలించి
నా గీతం గుండెలలో ఘారిల్లగ
నా జాతి జనులు పాడుకొనె
మంత్రంగా మ్రోగించాలని"

శ్రీశ్రీ గారు ఆశించి కవిత్వం రాశారు. ఆ ఆశ ఫలించింది. అతని మార్గం అనితర సాధ్యం, శ్రీశ్రీ ప్రజా కవి, మహాకవి, అభ్యుదయ సాహిత్యానికి రథసారధి శ్రీశ్రీ.

శ్రీశ్రీ రక్తం కవిత!, శ్రీశ్రీ ఊపిరి నవత!, శ్రీశ్రీ ఆర్తి అభ్యుదయం!, శ్రీశ్రీ విక్రాంతి విప్లవం.!!

"మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం అని ఎలుగెత్తి చెప్పిన మహాకవి శ్రీరంగం శ్రీనివాస రావు గారు.

ఆధార గ్రంధాలు :

1. మహాప్రస్థానం శ్రీశ్రీ.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

యుగకవి శ్రీశ్రీ - మహాప్రస్థానం

– ఐ. రాజశేఖర్, పరిశోధక విద్యార్థి, నెట్ (NFSC) తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

శ్రీశ్రీ అని పిలవబడే శ్రీరంగం శ్రీనివాసరావు ప్రముఖ తెలుగుకవి, విప్లవ కవిగా, సాంప్రదాయ, చందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ప్రసిద్ధుడు. ఆయన హేతువాది, నాస్తికుడు. మహాప్రస్థానం అతని రచనల్లో ప్రసిద్ధమైనది.

శ్రీశ్రీ 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకటరమణయ్య అప్పలకొండ దంపతులకు జన్మించాడు. శ్రీరంగం సూర్యనారయణకు దత్తుడగుట వలన ఇతను ఇంటి పేరు శ్రీ రంగంగా మారింది. శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని తన ఏడవ యేటనే ప్రారంభించాడు.

శ్రీశ్రీ గురించి ప్రముఖుల పలుకులు...

"మహాప్రస్థానం ఈ శతాబ్దంలో తెలుగులో వచ్చిన ఏకైక మహాకావ్యం" - పురిపుండా అప్పలస్వామి

"కొవ్వొత్తిని రెండువైపులా ముట్టించాను. అది శ్రీశ్రీలా వెలిగింది" - పురిపుండా అప్పలస్వామి

"తెలుగు కవిత్వ చరిత్రలో తిరుగులేని మలుపు మహాప్రస్థానం" - డా. పాపినేని శివశంకర్

పాపం, పుణ్యం, ప్రపంచమార్గం -
కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ
ఏమీ ఎరుగని పూవుల్లారా,
అయిదా రేడుల పాపల్లారా!
మెరుపు మెరిస్తే,
వాన కురిస్తే,
ఆకసమున హరివిల్లు విరిస్తే
అవి మీకే అని ఆనందించే
కూనల్లారా!

ఈ ప్రపంచంలో నివసిస్తున్న ప్రతి ఒక్క మనిషి జీవితంలో కష్టాలు, సుఖాలు, పాపాలు, పుణ్యాలు, బాధలు, కోపతాపాలతో నిత్యం జీవితాన్ని కొనసాగిస్తున్నారు. కానీ ఐదు, ఆరు, ఏడేళ్ల వయస్సు ఉన్నా బాలలు, బాలికలు జీవితం ఏమీ తెలియకుండా పువ్వులు ఎంత స్వచ్ఛంగా, ఎంత నిర్మలంగా ఆహ్లాదకరంగా ఉంటాయో, పసిపిల్లలు కూడా అంత ప్రశాంతంగా జీవనం గడుపు తారని రచయిత పేర్కొన్నాడు.

ఆకాశంలో ఒక మెరుపు మెరిసినా, వాన కురిసినా, ఆకాశంలో ఇంద్రధనస్సు వెలిసినా అవి తమ కోసమే అన్నట్టు, పసిపిల్లల మనస్సు ఎంత అమాయకంగా ఉంటుందో రచయిత "శైశవగీతి" కవితలో చాలా విపులంగా వివరించాడు.

అచ్చటి కిచ్చటి కనుకోకుండా
ఎచ్చటి చటికో ఎగురుతు పోయే,
పిట్టల్లారా!
పిల్లల్లారా!

ఆకాశంలో విహరించే పక్షులు అక్కడ, ఇక్కడ అనుకోకుండా తమ గమ్యం ఏంటో కూడా తెలియకుండా, స్వేచ్ఛగా ఎలా అయితే విహంగ వీక్షణం చేస్తాయో, పిల్లలు కూడా ఈలలు వేస్తూ, కేరింతలు కొడుతూ, వీధుల్లో చక్కర్లు కొడుతూ ఆనందంగా జీవితం గడుపుతారని రచయిత 'శైశవగీతి'లో వర్ణించారు.

గరికి పచ్చ మైదానాల్లోనూ,
తామర పువుల కోనేరులలో,
పంట చేలలో, బొమ్మరిళ్ళలో,
తండ్రి గుండిటా, తల్లి కౌగిటా,
దేహ ధూళితో, కచభారంతో,
నోళుల వ్రేళులు, పాలబుగ్గలూ,

ఎక్కడ చూస్తే అక్కడ మీరై
విశ్వరూపమున విహరిస్తుండే
పరమాత్ములు
ఓ చిరుతల్లారా!

ఈ సృష్టిలో ప్రతి చోటా పిల్లలు గరికపచ్చ మైదానాల్లోనూ, తామరపువ్వల కోనేరులలో, రైతులు పండించే పంట పొలాల్లోనూ, ఇసుకల్లో బొమ్మరిల్లూ కట్టుకుంటూ, తండ్రి ఎక్కడికి వెళ్ళినా మారం చేసి వారి వెంట వెళుతూ, తల్లి కొగిట్లో సేద తీరుతూ, ఆటలు ఆడుకొని దేహమంతా, దుమ్ము ధూళితో, నోట్లో వ్రేళ్ళూ పెట్టుకొని, పాలబుగ్గలతో ఎక్కడ చూసిన పిల్లలు పరమాత్మలాగా ప్రతి చోట ఉంటారని రచయిత చిన్న పిల్లల జీవితాన్ని చాలా కూలంకషంగా "శైశవగీతి" కవితలో చెప్పారు.

ఆ సాయంత్రం....
ఇటు చూస్తే అప్పులవాళ్ళు
అటు చూస్తే బిడ్డల ఆకలి!
ఉరిపోసుకు చనిపోవడమో
సముద్రమున పడిపోవడమో
సమస్యగా ఘనీభవించిరి
దొక సంసారికి!

"సముద్రాన్ని అయిన ఈదడం సులువే గానీ, సంసారాన్ని ఈదడం కష్టం" అనే లోకోక్తి. సంసార సాగరంలో సంసారికి ఒకవైపు అప్పుళ్ళవాళ్ళు ఒత్తిడిని భరిస్తూ, మరొక వైపు పిల్లల ఆకలి తీర్చడం ఎలా అని మానసిక సంఘర్షణలకు లోనవుతూ, లాంటి మొదలైన రకరకాల సమస్యలతో, సతమవుతూ సముద్రంలో పడిపోయి, చనిపోదామా! లేక ఉరివేసుకొని చనిపోదామా! అని సంసారి ఆలోచిస్తూ జీవనం కొనసాగిస్తారని, రచయిత "సంధ్యా సమస్యలు" అనే కవితలో చెప్పారు.

కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని
తల్లి మాటలు చెవిన పెట్టక
బయలుదేరిన బాటసారికి
మూడురోజుల ఒక్క తీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక
నడి సముద్రపు నావ రీతిగ
సంచరిస్తూచ సంచలిస్తూ,
దిగులు పడుతూ, దీనుడౌతూ
తిరుగుతుంటే
చండ చండం తీవ్ర తీవ్రం
జ్వరం కాస్తే,
భయం వేస్తే,
ప్రలాపిస్తే
మబ్బుపట్టీ, గాలికొట్టీ,
వాన వస్తే, వరద వస్తే,
చిమ్మ చీకటి క్రమ్ముకొస్తే
దారి తప్పిన బాటసారికి
ఎంత కష్టం.

పల్లెల్లో చాలామందికి జీవనోపాధి లేక పట్టణ ప్రాంతానికి వలసలు వెళ్ళి అక్కడ పనికి వెళ్తూంటారు. ఇంట్లో తల్లి వద్దని వారిస్తున్నా పట్టించుకోకుండా, కూటి కోసం, కూలి కోసం అని బయలుదేరి పట్టణ ప్రాంతంలోకి వెళ్ళిన తరువాత పని లభించక, వెనక్కి తిరిగి రాలేక, పట్టణం అంతా తిరిగి, తిరిగి ఎండకు జ్వరం వచ్చి, ఆకాశమంతా, మబ్బులు కమ్ముకొని, వాన వస్తే, వరదలు వస్తే, చిమ్మ చీకట్లోలలో దారి తప్పిన బాటసారి యొక్క మానసిక సంఘర్షణ ఎలా వుంటుందో రచయిత ఈ "బాటసారి" కవితలో సునిశితంగా వివరించారు.

అందరం కలసి పనిచేసిన ఈ
అందమైన వస్తు సముదాయం అంతా
ఎక్కడో ఒక్కడే వచ్చి
ఎత్తుకు పోతూ ఉంటే చూసి,
"అన్యాయం, అన్యాయం! అని మేమంటే
అనుభవించాలి. మీ కర్మం అంటాడు.

సాధరణంగా, కర్షకులు, కార్మికులు. ఒక పంట

పండించడం, లేదా ఒక వస్తువను ఉత్పత్తి చేయడం వరకు మధ్యలో చాలామంది కష్టపడతుంటారు. కానీ దాని ప్రతిఫలం మాత్రం ఒక్కడే అనుభవిస్తుంటాడు. అలా ఒక్కడే వచ్చి ఎత్తుకుపోతుంటే అది అన్యాయం, అని వారు అడిగితే అది మీ కర్మ అనుభవించండి అని ప్రతిఘటిస్తున్నాడు. సూర్యుడు అస్తమించే వరకు, ఎద్దుల్లా పనిచేసే మమల్ని మొద్దుల్నీ, మొరటుల్నీ చేసి కనీసం వారికి కడుపు నిండా ముద్ద కూడా దూరం చేస్తాడు. కారణం తక్కువ కులం, ఆచారం పేరుతో అడుగు దాటరాదంటాడు. పనిచేసి చేసి ఒక మా వల్ల కాదు. ఆ పని భరించడం కష్టమయిపోయి చేతిలో నున్న పనిముట్లు క్రింద పడేసి, నిస్సహాయ స్థితిలో ఉన్నా, నోరుమూసి కొట్టి బలవంతంగా పనిచేయిస్తున్నారు అని రచయిత కార్మికులు, కర్షకులు, పీడితులు, బలహీనులగురించి "వాడు" అనే కవితలో వాళ్ళు పడే కష్టాలు చాలా గొప్పగా చెప్పారు.

ఔను నిజం, ఔను నిజం,
ఔను నిజం, నీవన్నది,
నీ వన్నది, నీ వన్నది,
నీ వన్నది నిజం, నిజం!
లేదు సుఖం, లేదు సుఖం
లేదు సుఖం జగత్తులో!
బ్రతుకు వృద్ధా, చదువు వృధా!
కవిత వృధా! వృధా,వృధా!

ఈ ప్రపంచంలో ప్రతి మనిషి ఎల్లప్పుడూ సంతోషంగా జీవించలేరు. ఉదయం నుంచి సాయంత్రం వరకు. శక్తి వంచన లేకుండా పనిచేసేవారు కొందరు, మరియు, చదువుకొని ఉద్యోగాలు రాక ఎంతోమంది నిరోద్యోగులు ప్రాణం లేని శవంలా బ్రతుకుతున్నారు. ప్రతిరోజు కష్టపడి పనిచేసేవారు. సుఖం లేదు. సుఖం లేదు. తమలో తాము మదనపడుతున్నారు. చదువుకున్నా విధ్యార్థులు ఉద్యోగాలు రాక తను చదివిన అంతా వృధా అని కలత చెందుతున్నారు. సమాజంలో మనమంతా బానిసలు లాగా బ్రతుకుతున్నాం. ప్రతి ఒక్కరి జీవితంలో మోసాలు, దగాలకు, ఏదో ఒక సందర్భంలోనైనా భాదితులవుతూ, ముందుకు పోతే దగా, వెనుక వచ్చిన దగా "ముందు నుయ్యి వెనుక గొయ్యి" అనే పరిస్థితులను ఎదొర్కొంటున్నారు, గానుగలం, పీనుగలం. అనగా మనిషి యంత్రంలా పనిచేస్తున్నాడు.

సందులలో పందులవలే, కుక్కలవలే బ్రతుకుతున్నా సమాజంలోని సోమరిపోతులను మనది కూడా ఒక బ్రతుకేనా! అని రచయిత "చేదుపాట" కవిత ద్వారా చక్కటి సందేశం ఇచ్చారు.

ముగింపు :

మహాప్రస్థానం గేయాల్లోని ఇతివృత్తాలు ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ఎదుర్కొంటున్న భాదలు, వీటికి నేపధ్యంగా ఉన్న చారిత్రక పరిణామాలు, పీడితుల పక్షాన లక్షణాలు, నూతనమైన ఈ అంశాలపై రావల్సిన కవిత్వమూ, తన కవిత్వానికి లక్షణాలు, పీడితులను, ఇంకా పీడించేందుకు సహాయకారిగా ఉండే తాత్వికత లపై తిరుగుబాటు వంటివి ఉన్నాయి. వీటన్నింటికి మూలమైన నేపధ్యంగా తన కవితా తాత్వికతనీ, దానికి వెనుకనున్న సంఘర్షణనీ అపురూపంగా వెల్లడించిన కళాఖండమైన కవితా ఓ కవితా కూడా వుంది.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విశ్వమానవ ప్రేమకు దిక్సూచి - జయభేరి

- కోట్ల గోవిందరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

11వ శతాబ్దం మొదలు నేటి వరకు తెలుగు సాహిత్యం దేశ కాల పరిస్థితుల ప్రభావానుసారం నిత్యం మార్పులకు లోనవుతూ, నూతనత్వాన్ని సంతరించుకుంటూ దిన దినాభివృద్ధి చెందుతూనే ఉంది. ప్రతీ యుగంలో యుగ పురుషులచే నూతన ప్రక్రియల సృష్టి చేత కాలాను గుణమైన మార్పులు చెందుతూ "విశ్వశ్రేయ:కావ్యం" ఆంధ్రశబ్ద చింతామణి నిర్వచనం ఆధారంగా నన్నయయుగం నుండి నేటి వరకు అన్ని ప్రక్రియలో ఉపదేశమే ప్రధానంగా వెలువడ్డాయని చెప్పవచ్చు. పురాతనకాలంలో వచ్చిన ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు చతుర్విద పురుషార్థాలు, వ్యక్తుల ధర్మాలు, నీతి, న్యాయం వంటి వాటిని ప్రథమంగా తెలియజేస్తే, ఆధునిక కాలంలో వచ్చిన కవిత్వం వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, ఆకాంక్షించి, సర్వమానవ సౌభ్రాతృత్వమే ప్రధానంగా సాగింది. ఈ ఆధునిక కవిత్వంలో కూడా మనం ఎన్నో పోకడలను ధోరణులను గమనించవచ్చు. సాంప్రదాయబద్ధమైన చందోవ్యాకరణాంశాల చెర నుండి బానిస సంకెళ్లు తెంచుకున్న ఆధునిక తెలుగు కవిత మాత్రా చందస్సులో, వచన కవితలో మెరుస్తూ ప్రాచీన కవులు చూడని, వాడని కవితా వస్తువులను గ్రహించి, సామాన్య మానవుని జీవన గమనాన్ని చిత్రించాయి. "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యెనర్పింబూనిన ప్రబంధనంబునకు కథాక్రమం బెట్టి దనిన" అని ప్రారంభించిన ప్రాచీన కావ్యాలలోని అభ్యుదయం ప్రజల మేలు కోరలేదు, రాజుల విలాసాలు వ్యసనాలను కీర్తించే స్థాయికి దిగజారింది.[1] కానీ నేటి ఆధునిక కవిత్వం పేద ప్రజల ఆకలి బాధలను తెలియజేస్తూ, పీడించేవాళ్ళూ, పీడింపబడే వాళ్ళూ ఉన్న సమాజంలో వర్గపోరాటాలు తెలియపరుస్తూ, శ్రామిక, కర్షక జీవుల్ని చైతన్యపరుస్తూ, సంకుచిత భావాలను విడనాడి, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించేది అభ్యుదయం. నా కుటుంబం, నా దేశం, నా మతం, నా కులం అన్నటువంటి జనగణమన, వందేమాతరం, మా తెలుగు తల్లికి మల్లెపూదండ, ఇటువంటి జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టే అహంభావ గీతాలు[2] కాక "సూర్యుని వెలుతురు సాకనందాక... నరుడు భూతలిని నడుచునందాక" వంటి రాయప్రోలు విశ్వమానవ గీతాలు ఆధారంగా విశ్వమానవతే పరమ మతంగా శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానంలోని జయభేరి కవితా ఖండిక ప్రపంచ మానవ జాతీయ గీతంగా అభివర్ణించవచ్చు.

శ్రీశ్రీ సాహితీలోకానికి పరిచయం అవసరం లేని పేరు. ఆధునిక తెలుగు కవితకు ప్రపంచ గుర్తింపు కల్పించిన మహాకవి, భావకవిత్వంలో చటుక్కున మెరిసి, అభ్యుదయ కవిత్వంలో అజరామరమై, విప్లవ కవిత్వంలో పిడుగుల్లాంటి కవితా అస్త్రాలను సంధించిన పోరాట యోధుడు. సామాన్య ప్రజల కోసం, కార్మిక కర్షకుల కోసం, తన కవిత్వాన్ని అంకితం చేసిన మహనీయుడు. సమాజంలో ఉత్పత్తి సాధనాలను తమ ఆధీనంలో ఉంచుకుని, కర్షకుల శ్రమను దోచుకు తింటున్న ధనిక స్వాములకు, శ్రమ జీవులకు జరుగుతున్న వర్గపోరాటాన్ని ప్రధాన కవితా వస్తువుగా స్వీకరించి, తన కలం ద్వారా శ్రామిక లోకాన్ని చైతన్య పరిచిన అభ్యుదయ వాది, శ్రీశ్రీ నిత్యహరితమైన వృక్షం. జీవనది, కాలంతో పాటు కదిలి వచ్చిన కవి మాత్రమే కాదు, కాలానికి ముందుండి, క్రాంతిదర్శియై జాతిని ముందుకు నడిపించిన కవి.[3] తర్వాత వచ్చిన కవులకు ఆయన ప్రభావం నుండి తప్పించుకోవడం చాలా కష్టమైంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో అంతటి ప్రభావాన్ని కలిగించిన కవి. శ్రీశ్రీ

అభ్యుదయ రచనా పరంపరలో అగ్రగణ్యమైనది మహా ప్రస్థానం కవితా సంపుటి అయితే, అందులో సంపుటికే తలమానికమైన ఖండిక జయభేరి. ఈ జయభేరి పీడిత వర్గమైన శ్రామికులను దోచుకుతింటున్న ధనిక స్వాముల భవన పుణాదులను కదిలించిన రణభేరి. ఈ జయభేరి ద్వారా శ్రామిక శంఖారావం పూరించి శ్రామిక లోకపు చైతన్య దీపాన్ని వెలిగించి, విప్లవ భీజాలు నాటి సమర బేరులు మ్రోగించారు. ఈ ఖండికల్లో భాష ఎంత కఠినంగా జఠిలంగా ఉంటుందంటే శ్రీశ్రీ పుస్తకం కొని తీరిగ్గా చదవండి, పద్యం పదిసార్లు చదవండి, ఏమీ అర్థం కాలేదా - ఏ యువకుడికో, భిక్షకుడికో, death - bed present గా పంపండి, పారేయ్యకండి, అంతకన్నా దాచుకోకండి[4] అంటూ చలం చెప్పిన మాటలు అక్షర సత్యాలు. ఎందుకంటే ఇది చదవగానే అర్థమయ్యే భాష కాదు, ఆలోచింపజేస్తుంది, ప్రశ్నిస్తుంది, తర్కిస్తుంది - హెచ్చరిస్తుంది అంటూ చెపుతూ దాచుకోవద్దని హెచ్చ రిస్తాడు చలం. ఎందుకంటే శ్రీశ్రీ విప్లవ కవిత్వానికి మహా ప్రస్థానం భీజప్రాయమైనది. అందుచే జయభేరి ఖండిక విశ్వ సృష్టిలో ఆహుతి అవుతున్న శ్రామికుల శ్రమను తెలియజేస్తూ విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని తెలియ జేస్తుంది.

శ్రీశ్రీ గారు జయభేరి కవితా ఖండికను 02-06-1933లో రచించారు. ఈ గేయం నిర్మాణపరంగా ఐదు భాగాలుగా విభజించవచ్చు. ఈ గేయం ప్రపంచం లోని సమస్త శ్రామిక లోకానికి, పీడిత తాడిత ప్రజానీకానికి, దోపిడికి గురౌతున్న పేద ప్రజలకు, అణిచివేతకు గురౌతున్న అణగారిక వర్గాలకు ప్రతిబింబించి, శ్రామిక శక్తి యొక్క ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. ఈ గేయాన్ని పరిశీలించినట్లయితే

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వ వృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను!
నేను సైతం
భువన ఘోషకు
వెర్రి గొంతుక విచ్చి మ్రోశాను!"

నేను సైతం అంటూ ప్రారంభమైన ఈ గేయంలో నేను అనేది భావకవిత్వంలో స్వార్థపూరితమైన వ్యక్తిగత అర్థం కాదు, నేను అంటే వ్యక్తి, వ్యక్తికి బహువచనం శక్తి. ఈ ప్రపంచంలోని సర్వమానవాళిని తనలో ఇమిడ్చుకుని, సకల శ్రామిక శక్తి యొక్క గొంతును తన ద్వారా పలికిస్తున్నాడు. కనుక ఇక్కడ నేను అంటే శ్రీశ్రీ కాడు, శ్రీశ్రీ కంఠంతో పలుకుతున్న శ్రామికుడు. ప్రపంచా భ్యుదయం కోసం అతడు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, నేను సైతం అనే నుడికారం మానవజాతి చరిత్రలో పేరుకు కూడా నోచుకుని సామాన్య మానవుని త్యాగాలను తెలియజేసారు. ప్రపంచ బాధ అంటూ శ్రీశ్రీ బాధ "అంటారు కదా అందువల్ల నేను అన్న పదంలో సమస్త మానవాళిని పేర్కొనవచ్చు. నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొకటి ఆహుతిచ్చాను అంటారు అంటే ఈ ప్రపంచం యొక్క సమూలమైన అభివృద్ధిలో తన యొక్క భాగస్వామ్యాన్ని తెలియజేస్తున్నాడు శ్రామికుడు. అగ్నికి సమిధను ఆహుతివ్వడం ఆ అగ్ని ఆరిపోకుండా నిరంతరం ముండుతూ ఉండడానికే,[5] ప్రపంచాగ్ని ఆరిపోతే ప్రపంచమే లేకుండాపోతుంది. పురాతన వైదిక సంస్కృతిలో యజ్ఞ వేదిక ముందు సమిధలను అగ్నికి ఆహుతి ఇస్తూ ఉండేవారు. ఆ వేదకాలం నాటి వాడే శ్రామికుడు. ఈ పంక్తుల్లో శ్రామికుడు తన గతాన్ని తెలుపుతున్నారు. అదేవిధంగా ఈ విశ్వమనే ధారా పాతమైన వర్ష వృష్టికి నా అశ్రువులను ధారపోశానని, ఈ భువన గోషకు వెర్రిగొంతుకతో లయ పాడుతూ వచ్చానని తెలుపుతున్నాడు. అంటే జరిగిన ప్రతీ పరిణామంలోనూ యుద్ధాలు, కరువులు, విప్లవాలు, ఉద్యమాలు, పోరాటాలు అన్నింట్లోనూ తన పాత్ర బలీయమైనదని

సగర్వంగా చాటి చెపుతున్నాడు. అదే విధంగా రెండవ భాగంలో

"ఎండకాలం మండినప్పుడు
గబ్బిలం వలె
క్రాగిపోలేదా!
వానకాలం ముసరి రాగా
నిలువు నిలువున
నీరు కాలేదా?
శీతాకలం రోత పెట్టగ
కరడు కట్టీ
ఆకలేసీ కేకలేశానే!

ఈ భాగంలో శ్రామికులు, సమాజం వివిధ కాలాల్లో వారు పడిన శ్రమను ప్రత్యేక వాదంలో తెలియజేస్తున్నాడు. ఎండాకాలంలో నిప్పులు చెరిగి మండిపోతున్నప్పుడు తాను గబ్బిలం వలె క్రాగిపోయనంటాడు. ఇక్కడ గబ్బిలం నిరాదరణకు ప్రతీక, వానాలకాలం ముసురులో కూడా నిలువునా నీరైపోతున్నానని, శీతాకాలంలో కరుడుగట్టిన చలిలో ఆకలితో కేకలు వేశానని తెలియజేస్తున్నారు. ఎండనక వాననక, చలనక ఎండకి ఎండుతూ వానకు తడుస్తూ ఆరుగాలం నిత్యం శ్రమిస్తూనే ఉంటామనీ ప్రపంచ పురోభివృద్ధికి తోడ్పడ్డామని తెలియజేస్తున్నారు. శ్రీశ్రీ ప్రపంచ భాదను తన గొంతుతో వినిపిస్తున్నారు.

అదే విధంగా శ్రీశ్రీ సమాజంలో నేనొకన్ని నిలిచిపోతే సమస్త ప్రపంచం నిలిచిపోయి స్తబ్ధంగా ఉండిపోతాయని, చెండ్రగాడ్పులు, వానమబ్బులు మంచు సానలు భూమి మీద భుగ్నమైపోతాయనీ, నేనొకన్ని ఆగిపోతే నింగిలోని రంగురంగుల చుక్కలన్నీ రాలిపోయి నెత్తురు క్రక్కుకుంటూ పేలిపోతాయని పగళ్ళు పగిలిపోతాయనీ రాత్రులు విశీర్ణమౌతాయనీ, మహాప్రళయమే జగాన్ని ముంచివేస్తుందని తెలియజేస్తున్నాడు. తన ప్రస్థానమే ఆగిపోతే అంటే సమాజంలోని శ్రామికుల లేదా సమాజగతి ఆగిపోతే కాలాల, ఋతువులు, రాత్రిపగలు ఆగిపోయి, చుక్కలన్నీ రాలిపోయి మహాప్రళయమే సంభవిస్తుందని అంటున్నాడు. తన నడక ఎంతటి ప్రభావవంతమైందో, తన నడక ఆగితే ఏమి జరుగుతుందో తెలియజెప్పారు.

అదే విధంగా

"నేనొకణ్ణీ ధాత్రినిండా
నిండిపోయీ
నాకు హూరత శీకరాలే
లోకమంతా జల్లులాడే
ఆ ముహూర్తాలాగమిస్తాయి!

భాగవతంలో "ఇందుగలడందు లేడని సందేహము వలదు"[6] అని నరసింహామూర్తి విశ్వ వ్యాపకత్వాన్ని తెలియజేసిన ప్రహ్లాదుని మాదిరి శ్రీశ్రీ తన యొక్క విశ్వవ్యాపకత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. శ్రీశ్రీ తాను ధరిత్రి నిండా నిండి పోయానని, నా యొక్క వసంత ఋతు కుహూరత శీకరాలు లోకమంతా నిండిపోయే ఆ శుభముహూర్తానికి ఎంతో సమయం లేదని, దగ్గరలోనే తన యొక్క అభ్యుదయ భావగీతాలు ప్రపంచమంతా ప్రతిధ్వనించి, మనిషి మనిషినీ తట్టిలేపి చైతన్య పరుస్తాయని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. అదే విధంగా

నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను!
నేను సైతం
విశ్వ వీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను!
నేను సైతం
భువన భవనపు
భావుటానై పైకి లేస్తాను!

అంటూ చివరి భాగంలో మళ్ళీ విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని వ్యక్తపరిచారు. తన యొక్క విశ్వవాపకత్వాన్ని ప్రదర్శిస్తూ నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను అంటూ ఈ ప్రపంచమనే తామర పుష్పానికి

తాను తెల్లరేకై పరిడవిల్లుతానంటూ ప్రపంచశాంతికై శ్వేతవర్ణ శోభితమవుతానని, ఈ విశ్వమనే వీణకు ప్రపంచ మానవులంతా తంత్రులైనప్పుడు తాను కూడా తంత్రినై మూర్చనలు పోతానని, నేను సైతం భువనపు భవనానికి భావుటానై ఆకాశవీధిలో రెపరెపలాడుతానంటాడు శ్రీశ్రీ. నా శిరస్సు నగర్వ పతాక - దాన్నెవరూ అవనతం చేయలేరు[7] అంటారు కవి. అలాంటి ఈ భువనాలకే భావుటానై నగర్వంగా వెలుగొందుతాననీ ప్రపంచ మానవావళికి స్వేచ్ఛా వీచికలు అందిస్తాననీ ప్రతిజ్ఞ చేస్తున్నాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీ ఈ జయభేరి ఖండిక ద్వారా విశ్వమానవ ప్రేమను, కార్మిక లోకపు అభివృద్ధిని ఆకాంక్షించారు. మార్క్సిస్టు అభ్యుదయ భావాలను తన గీతాలలో ప్రవేశపెట్టి, రాబోయే విప్లవానికి అంకురార్పణ చేస్తున్నట్లు ప్రపంచ మానవావళి చైతన్యానికి కంకణం కట్టుకున్నాడు. అదే విధంగా ఈ అభ్యుదయ భావపరంపరలో తన యొక్క విశ్వ మానవ ప్రేమను వెలువరిస్తూ తన యొక్క స్వేచ్ఛా కాంక్షను, వర్గ పోరాటపు ఆనవాలను బీజ ప్రాయంగా తెలియజేసారు. అదే విధంగా ప్రపంచంలో సృష్టి ఆరంభం నుండి నేటి వరకు ఈ అఖండమైన అభివృద్ధిలో భాగం పంచుకుంటూ, నేటికీ సామాజిక, ఆర్థిక, సాంఘిక, రాజకీయ, విద్యారంగాల్లో తీవ్రమైన వెనుకబాటుకు గురై సకలమైన దారిద్ర్యాన్ని అనుభవిస్తూ, పేదరిక అంచుల్లో కొట్టి మిట్టాడుతున్న ప్రపంచ కార్మిక కర్షకులకై తన గళాన్ని అంకితం చేస్తూ భువన ఘోషకు వెర్రి గొంతుక విచ్చి మ్రోసాను అనడంలో అతని యొక్క ఆవేశం అర్థమౌతుంది. తెలుగు సాహిత్యంలో అభ్యుదయ విప్లవ భావాలకు పతాకస్థాయిని కల్పించి సాధారణ మానవుని గొంతుకు తానే శబ్దాన్ని, ప్రపంచ భాదను తన బాధగా ఎంచుకున్నో మహాకవి శ్రీశ్రీ.

పాదసూచికలు :

1) పుట 222 - తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరాయ్
2) పుట xivi - గురజాడ రచనలు (కవితల సంపుటం) సెట్టి ఈశ్వరరావు
3) పుట 234 - తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహనరాయ్
4) పుట 24 - యోగ్యతా పత్రం - చలం
5) పుట 26 - శ్రీశ్రీ కవితా వైభవం
6) పుట 605 - సప్తమ స్కంధం భాగవతం
7) పుట 107 - దండోరా దరువు - ప్రొ॥ పి.కనకయ్య

ఆధారగ్రంథాలు :

1) మహాప్రస్థానం - శ్రీశ్రీ
2) తెలుగు కవితా వికాసం - కడియాల రామమోహన రాయ్
3) తెలుగు సామిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి
4) శ్రీశ్రీ కవితా వైభవం - మిరియాల రామకృష్ణ
5) తెలుగులో కవితోద్యమాలు - తెలుగు అకాడమీ

❖❖❖

"కాలదోషం అంటని పాట - పాడవోయి భారతీయుడా"

– యం. ప్రభాకర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పాడవోయి భారతీయుడా - ఆడి
పాడవోయి విజయగీతికా ॥ పాడ॥
నేడే స్వాతంత్ర్యదిన - వీరుల త్యాగఫలం
నేడే నవోదం - నీదే ఆనందం ॥ పాడ॥
స్వాతంత్ర్యం వచ్చెననీ సభలే చేసి
సంబరపడగానే సరిపోదోయి
సాధించినదానికి సంతృప్తిని పొంది
అదే విజయమనుకుంటే పొరపాటోయి
ఆగకోయి భారతీయుడా - కదలి
సాగవోయి ప్రగతి దారుల ॥ పాడ॥
కాశం అందుకొనే ధరలొకవైపు
అదుపులేని నిరుద్యోగమింకొకవైపు
అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు
అలముకొన్న నీదేశం ఎటు దిగజారు?
కాంచవోయి నేటి దుస్థితి - ఎది
రించవోయి ఈ పరిస్థితి ॥ పాడ॥
పదవీ వ్యామోహాలు, కులమతబేధాలు
భాషాద్వేషాలు చెలరేగె నేడు
ప్రతి మనషి మరియొకని దోచుకొనేవాడే
తన సౌఖ్యం, తన భాగ్యం చూచుకొనే వాడే
స్వార్థమీ అనర్థకారణం - అది
చంపుకొనుటె క్షేమదాయకం ॥ పాడ॥
సమసమాజ నిర్మాణమే నీ ధ్యేయం
సకల జనుల సౌభాగ్యమె నీలక్ష్యం
ఏకదీక్షతో గమ్యం చేరినవాడే
లోకానికి మన భారతదేశం
అందించునులే శుభ సందేశం॥

ఈ పాట శ్రీ శ్రీ 1961 సం॥లో అన్నపూర్ణా పిక్చర్సు వారి "వెలుగు నీడలు" అనే సినిమా కోసం రాశారు. శ్రీ శ్రీ పాటలు, పద్యాల సంకలనం పేరు కూడా "పాడవోయి భారతీయుడా" ఈ సంకలనాన్ని మల్లాది రామకృష్ణ శాస్త్రికి అంకితం ఇచ్చారు.

ఇక ఈ పాట విషయానికి వస్తే ఈ పాటలో ఏముంది అని అడిగే వారు నేటికాలంలో లేకపోలేదు కానీ మనం సాధించుకున్న స్వతంత్ర భారతం ఎలా ఉందో కంటికి కనిపింపజేసే అరుదైన దేశభక్తి పాటలు జాబితాలో చేర్చవలసిన పాట ఇది

అన్నం ఉడికిందో లేదో అన్నం అంతా పట్టుకుని చూడాల్సిన పనిలేదు. ఒక్క మెతుకు పట్టుకుని ఉడికిందో లేదో చెప్పవచ్చు. ఇదే విధంగా శ్రీ శ్రీ మహాకవి అనుటకు ఈ పాట ఒక్కటి చాలు అని నా అభిప్రాయం. దేశ స్వాతంత్ర్యం, దేశ పరిస్థితులు, సమ సమాజ నిర్మాణం, సౌభ్రాతృత్వం వంటి అభ్యుదయ భావాలు మెండుగా ఉన్నాయని ఈ పాట ద్వారా గమనం గమనించవచ్చు.

ఈ పాట రాసింది స్వాతంత్ర్యం వచ్చిన 14 సం॥రాల తరువాత కానీ వజ్రోత్సవ వేడుకలకు సిద్ధమువుతున్న మన స్వతంత్ర్య భారతం నేటి కాలానికి సైతం నాటి పాటలో చెప్పిన అంశాలు ఇంకా విస్తరించాయే గానీ ఏ మాత్రం తగ్గినట్లు కనపడవు. "కవులు క్రాంత దర్శులు" కావాలన్న అలంకారికుల మాటలు అక్షర సత్యాలు. ఎప్పుడో 60 సం॥రాల క్రితం ఈ పాటలో పేర్కొన్న మాటలు ఇప్పటికీ అలాగే ఉండటమే కాకుండా ఎంతో పెరిగి పెరిగి బలీయంగా తయారయ్యాయి.

స్వాతంత్ర్యం వచ్చిందని సంబరాలు చేసుకోవటం, ఊరూరా వాడ వాడలా జెండాలు ఎగురవేయటం, మిఠాయిలు పంచుకొనటం కాదు. స్వాతంత్ర్యం అనే మధుర మఠాయిని ఎంతమంది ఆస్వాదిస్తున్నారని కవి

సూటిగా తన ఘాటైన మాటల్లో పాట రూపంలో వ్యక్తం చేస్తూ చూస్తున్న ప్రేక్షకులను ప్రశ్నిస్తున్నాడు. హమ్మయ్య స్వాతంత్ర్యం సాధించుకున్నాం ఒక పని అయిపోయింది. అని చేతులు కట్టుకుని కూర్చోకుండా తరువాత జరగాల్సిన వాటిని గురించి ఆలోచించుకొని ప్రగతి పథంలో నడవాలసి హెచ్చరిక చేశారు శ్రీ శ్రీ.

ఈ పాట రాసిన 1961 సం॥లోనే ధరలు ఆకాశం అంటుతున్నాయని చెప్పాడు శ్రీ శ్రీ. నాడే ఆకాశమే హద్దుగా ధరలు ఉంటే నేడు హద్దూ పద్దు లేని ధరల మాటేమిటి ఇక నిరుద్యోగం అంటారా ఇది ఎప్పటికీ తీరని సమస్యే. కాశ్మీరు సమస్యకైనా పరిష్కారం దొరికింది గానీ మరి ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందా అని ప్రశ్నించు కోవాలి. చదువుకున్న చదువులకు తగిన ఉద్యోగాలు లేక యువత ఎటు పోతుందో అని కవి ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిత యువత చేతుల్లో ఉంటుందంటారు. మరి యువత భవితే ప్రశ్నార్థకంగా ఉంటే దేశ భవిత ..... ఆలోచించుకోవాల్సిందే.

పదవుల పట్ల అధికారాల పట్ల వ్యామోహాన్ని ఖండించిన శ్రీ శ్రీ కులం మతం అంటూ బేదాలు ఉండకూడదని సూచించారు. కులం మతం అనే మనుసిద్ధాంతాన్ని ఏకరవు పెట్టాడు. ఈ దేశంలో ''మతమే పెద్ద మత్తు'' అన్న వివేకానందుని మాటలు ఇక్కడ గుర్తు చేసుకోవాలి. భిన్నత్వంలో ఏకత్వం అంటూ మమేకమవుతూనే ''మాకు మేమే - మీకు మీరే'' అనే ప్రాంతీయ వాదాన్ని, భాషా వాదాన్ని, వేర్పాటు వాద ధోరణులను తీవ్రంగా తనదైన తీరుతో చిత్రించారు. స్వార్థమే అన్ని అనర్థాలకు మూలమన్న శ్రీ శ్రీ సూచన అందరూ స్వీకరించదగినది, అంగీకరించవలసినది. కానీ స్వార్థం అనేది సహజ మానవనైజం. దీనిని వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా దేశ ప్రయోజనాలకు ఉపయోగించాలి. నేను అని కాకుండా నాదేశం అనే జాతీయ దృక్పథం అలవరచు కోవాలి.

సమ సమాజ నిర్మాణం - సకల జనుల సౌభాగ్యం కాంక్షించారు శ్రీ శ్రీ అభ్యుదయ భావాలు అధికంగా ఉన్న శ్రీ శ్రీ లాంటి వారు కోరేది ఇటువంటి ప్రయోజనమే కాక మరేముంటుంది. ప్రపంచానికంతటికి వేద జ్ఞానాన్ని అందించిన మన భారతదేశం ఏకలక్ష్యంగా ముందుకు సాగితే మన దేశానికి మించిన మరొక ఉన్నత ఉత్తమ దేశం ఉండదని కవి కాంక్షించారు. ఇది కాంక్ష గానే మిగిలిపోయింది, మిగిలిపోతుంది కానీ సార్థకం కాదని ఆక్రోశించి ఉక్రోశంగా ఆలపించిన దేశ భక్తి పాటలలో ముందు వరుసలో నిలువదగిన అత్యుత్తమ దేశభక్తి పాట పాడవోయి భారతీయుడా.

సాధారణంగా శ్రీ శ్రీ పాటల్లో 'ఓ' కారాన్ని ఎక్కువగా ప్రయోగిస్తుంటారు. కానీ ఈ పాటలో 'ఓయి' అనే సంబోధనా ప్రథమతో మనల్ని పలకరిస్తూ కర్తవ్యం ఉపదేశించాడు శ్రీ శ్రీ. కర్తవ్య ఉపదేశమే కాదు పాటలో పేర్కొన్న అధిక ధరలు, అదుపు లేని నిరుద్యోగం, అవినీతి, బంధుప్రీతి చీకటి బజారు వంటి వాటితో సుసంపన్న నా దేశం ఎటు దిగజారి బజారు పాలవుతుందనే ఆవేదనా భరితమైన హృదయం ద్రవించగా మలచిన అక్షరాల శిల్పం ఈ పాట.

''వాక్యం రసాత్మకం కావ్యం'' అనే విశ్వనాధుని కార్యనిర్వచనం ప్రకారం రసవంతమైన ఒకే ఒక వాక్యం కూడా కావ్యం అవుతుంది. ఈ నిర్వచనానికి చక్కని ఉదాహరణ ఈ పాట. ఈ పాట ఒక్కటే ఒక దేశభక్తి కావ్యం కాగల కావ్యం ఏదైనా ఒక రచన చేస్తే అది చదువుకున్న వారు మాత్రమే చదివి ఆస్వాదించగలరు. కానీ సినిమా పాటను రాస్తే అది చూస్తున్న వింటున్న ప్రతి ప్రేక్షకుని హృదయాన్ని తాకుతుంది. శ్రీ శ్రీని సినిమా రంగానికి పరిచయం చేసి పాటలు రాసే విధంగా ప్రోత్సహించిన మల్లాది రామకృష్ణ శాస్త్రి గారికి మనం ఎంతో ఋణపడి ఉండాలి. శ్రీ శ్రీ కలం నుండి కదిలిన ఈ పాట ఆనాటి ప్రజలను ఎందిరిని కదిలించిందో

''కొవ్వొత్తిని రెండు వైపులా వెలిగించాను అది శ్రీ శ్రీగా వెలిగింది'' అని అంటారు పురిపండ అప్పలస్వామి ఇలా వెలుగబడిన శ్రీ శ్రీ కార్మిక కర్షక జీవుల అభ్యున్నతిని, ప్రజల అభివృద్ధికి, దేశ సమగ్రతకు తనదైన తీరులో రచనలు చేస్తూ జన జాగృతి కోసం కృషి చేశారు. యువతలో స్వాతంత్ర్యోద్యమ పోరాట స్ఫూర్తిని పురిగొల్పే విధంగా తన రచనా వ్యాసంగాన్ని కొనసాగిస్తూ భావిభారత పౌరలను తీర్చిదిద్దే ప్రయత్నం చేసిన మహాకవి శ్రీ శ్రీ.

'కవి ప్రవక్త కాలం కన్నా ముందుండాలి' అని అంటారు గురజాడ, 'రచయితలు రాజ్యం కన్నా ముందుండాలి' అని అంటారు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారు. శ్రీ శ్రీ ఈ మాటల కన్నా ఎన్నో వేల లక్షల కోట్ల ముందుండి భవిష్యద్దర్శనం చేశాడు అనటానికి ఈ పాట ఒక చక్కని నిదర్శనం. నాటికీ నేటికీ ఎప్పటికీ చిరస్థాయిగా నిలవదగిన కాలదోషం అంటని పాట పాడవోయి భారతీయుడా

ఆధార గ్రంధాలు :

1. పాడవోయి భారతీయుడా (సినిమా పాటలు) - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ - హైదారాబాద్
2. సాహిత్య ప్రస్థానం మాసపత్రిక 2010 డిసెంబరు సంచిక వ్యాసం : రచయిత - రాజ్యం, వ్యాసకర్త: ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారు
3. శ్రీ శ్రీ కవితా వైభవం, డా॥ మిరియాల రామకృష్ణ, ప్రచురణ : యువభారతి.

❖❖❖

శ్రీశ్రీ జీవితం - వ్యక్తిత్వం

- డా॥. సత్యగాయత్రి జనమంచి, తెలుగు లెక్చరర్, ఎమ్.ఎన్.ఆర్. డిగ్రీ కళాశాల , హైదరాబాదు

విమర్శలో కవి జీవిత విమర్శ ఒకటి. కవి జీవితాన్ని పరిశీలించిన యెడల అతని కావ్యతత్వము అర్థమౌతుంది. కవి జీవితములోని భౌతిక, మానసిక, తాత్విక విశేషాలు అతని కావ్యంలో ఏవిధంగా ప్రతిఫలిస్తుందో కవి జీవిత విమర్శవల్ల తెలుస్తుంది. శ్రీశ్రీ లాంటి మహాకవి కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి శ్రీశ్రీ జీవితాన్ని తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. శ్రీశ్రీ జీవిత విశేషాలను, కవిత్వం, సమాజం పట్ల శ్రీశ్రీ దృక్పథాన్ని అంచనా వేసే ప్రయత్నమే ఈ వ్యాసం లక్ష్యం.

శ్రీశ్రీ అని పిలవబడే శ్రీరంగం శ్రీనివాసరావు ఏప్రిల్ 30, 1910 జన్మించారు. శ్రీశ్రీ తల్లిదండ్రులు వెంకట రమణయ్య, అప్పకొండమ్మ. ప్రాథమిక విద్యాభ్యాసం అంతా విశాఖపట్నంలో చేసారు. అదే సంవత్సరం వెంకట రమణమ్మతో పెళ్ళి జరిగింది. 1931లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బి.ఏ (జంతుశాస్త్రం) పూర్తి చేసారు.

1935 విశాఖలోని మిన్ ఎ.వి.ఎన్ కాలేజీలో డిమాన్‌స్ట్రేటరుగా చేసారు. 1938లో మద్రాస్ ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటర్‌గా చేసారు. ఆ తరువాత ఆకాశవాణి డిల్లీలోను, మిలిటరీలోను ,ఆంధ్రవాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసారు. 1930 నుండి 1940 వరకు రచించిన మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనంచేసి మహాప్రస్థానం పుస్తకంగా ప్రచురించారు. తెలుగు సాహిత్యపు దశను, దిశను మార్చిన పుస్తకం అది. పిల్లలు లేని కారణం చేత 1949లో ఒక బాలికను దత్తత తీసుకున్నారు. రెండవ భార్య ద్వారా ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కలిగారు. వివిధ దేశాలలో పర్య టించారు. ఎన్నో పురస్కారాలు పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాజా లక్ష్మీ ఫౌండేషను అవార్డులను పొందారు. అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా పనిచేసారు.

శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని ఏడవ ఏటనే ప్రారం భించారు. తన మొదటి గేయాల సంపుటిని ఎనిమిదో ఏట ప్రచురించారు. మహాప్రస్థానం, మరో ప్రస్థానం, ఖడ్గసృష్టి, సిప్రాలి, చమరరాత్రి మొదలైన రచనలు చేసారు. ఎన్నో సినిమాలకు పాటలు, మాటలు రాసారు. అల్లూరి సీతారామరాజు సినిమాకి శ్రీశ్రీ రాసిన 'తెలుగు వీర లేవరా' అనేది శ్రీ శ్రీ రాసిన ఆణిముత్యం. కవిత్వంలో రకరకాల ప్రయోగాలు చెయ్యడం శ్రీశ్రీకి బాగా తెలుసు. శ్రీశ్రీ తన కవిత్వాన్ని గురించి "ధిక్కారగుణమే తొలి నుంచి నాకవిత్వానికి ప్రాతిపదిక. కల్పనా ప్రపంచం నుంచి కవిత్వాన్ని వాస్తవలోకానికి మళ్ళించడమే నాధ్యేయం. అందమైన అద్దాలనుగాక నిష్ఠురమైన నిజాన్నే నేను ఆరాధిస్తాను. ఏదో కొత్తదనం కోసమే నా అన్వేషణ" అని పేర్కొన్నారు. శ్రీశ్రీ జీవితం ఎదురయ్యే ప్రతీ సమస్యను సవాల్‌గా తీసుకున్నారు. ఎంత దారిద్ర్యాన్ని అనుభవించినా ఎక్కడా నిరాశ, నిస్పృహను దరి దాపులకు కూడా రానివ్వలేదు. విపరీతమైన దరిద్రాన్ని అనుభవిస్తున్నప్పుడే మహాప్రస్థానంలోని గేయాలను శ్రీశ్రీ రచించారు. శ్రీశ్రీ తమ మనస్తత్వాన్ని గురించి తమ ఆత్మకథలో ఈ విధంగా పేర్కొన్నారు. ''మానాన్న ఎంత గొప్ప గణితశాస్త్ర పండితుడో అంత గొప్ప జూదగాడు. గెలిచినప్పుడు గెలుస్తాం ఓడినప్పుడు ఓడిపోతాం అనేది మానాన్న మనస్తత్వం. గెలవడానికి అడ్డాలి ఓటమి అంగీ కరించకూడదు. అనేది నా మనస్తత్వం. గెలుపూ ఓటమి అంటున్నా జీవితాన్ని మానాన్న లాగ నేనో జూదంగా పరిగణించలేదు. ఒక స్పోర్ట్ తీసుకున్నాను. అంతకుమించి ఒక ఛాలెంజ్ కూడా తీసుకున్నాను. ఇదో పెద్ద సవాల్!

దీన్ని అంగీకరించితీరాలి. మరొక సందర్భంలో శ్రీశ్రీ అన్న మాటలివి "శ్రీశ్రీ దారిద్ర్యం వల్ల చాలా సార్లు చనిపోవాలి అనుకున్నారట. చచ్చి సాధించేదేముంది కనుక బతికుంటే దీని అంతు తేల్చుకోవాలనే పట్టుదల నాకు పరిపక్వ మవుతూ వచ్చిందని శ్రీశ్రీ పేర్కొన్నారు.

శ్రీశ్రీ తన గురువులుగా ఇద్దర్ని పేర్కొన్నారు. ఒకటి వాళ్ళ నాన్న గారు, రెండు అబ్బూరి రామకృష్ణారావు గారు. మానాన్నే నాకు గాడ్ ఫాదర్, అమ్మ, దేవుడు, పురో హితుడు, నాజీవితానికి సార్వభౌముడు మానాన్నే. అందరూ తల్లిచాటు బిడ్డలయితే నేను తండ్రి చాటు బిడ్డగా పెరిగాను. నాకో సొంత అక్కగానీ అన్న గానీ తమ్ముడు గానీ,చెల్లెలు కానీ లేకపోయినందువల్ల నాలో ఏదో ఒక ఏకాంతం ఆవహించేది. అదేదో జబ్బుగా మారకుండా నన్ను కాపాడిన వాడు మానాన్నే. ఆయన దగ్గరుంటే ప్రపంచం అంతటనీ కౌగిలించుకుంటున్న భావన నాకు కలిగేది.

శ్రీశ్రీకి పుస్తకం పఠనమంటే ఎంతో ఇష్టం. చదవడం ప్రారంభించినప్పటి నుండి శ్రీశ్రీ ప్రతీ పుస్తకాన్ని చదివేసే వారట. స్వసంఘ గ్రంథాలయం, గుప్తా బ్రదర్సు వారి గ్రంథ విక్రయశాల నేనారోజులలో తరుచు కన్పించే చోట్లు మానాన్న నా కవితాశక్తిని నిరుత్సాహ పరచలేదు. పైగా కవితాశక్తి దోహదం చేసే సులక్షణసార గ్రంథం కొనిచ్చారు. ఆది మధ్యావసానేషు ఇత్యాది శ్లోకాలతో తానే ఛందో రహస్యాలు నాకు బోధించారు అంటూ శ్రీశ్రీ వారి పఠనాశక్తిని తెలియజేసారు.

శ్రీశ్రీ విస్తృతంగా ఆంగ్ల సాహిత్యాన్ని కూడా చదివేవారు. గిబ్సన్ గీతాలలో ఒక దాని శీర్షిక ఱ వజవఅ ఱ ఇదే నాచేత నేను సైతం ప్రపంచానికి సమిధినొక్కటి ఆహుతిచ్చాను అనే గీతం రాయడానికి ప్రేరణ యిచ్చింది. అలాంటిదే శిష్టా ఉమామశ్వరరావు మరో వచన గీతం 'మరో ప్రపంచం మరో ప్రపంచం' అనే వచన గీతాన్ని రాయడానికి స్ఫూర్తిని యిచ్చింది. శ్రీశ్రీ 1910 నుండి 1940 వరకు వెలువడిన నవ్య కవిత్వాన్ని పుస్తకంగా ప్రచురించాలనుకున్నారు. శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని 15 సార్లు ప్రూఫ్ రీడింగ్ చేసినట్టు చెప్పారు. ఈ విషయం శ్రీశ్రీకి కవిత్వం పట్ల ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది.

ఆర్థికమే అన్ని సమస్యలకు మూలం అనే మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నేను మార్క్స్ నుంచి కాక ఆప్టన్ సింక్లేర్ రచించిన money writes అనే గ్రంథం నుండి తెలుసు కున్నానని పేర్కొన్నారు. శ్రీశ్రీకి సముద్రమంటే ఎంతో ఇష్టం. నా కవిత్వానికి సముద్రమే ఆవేశం సమీపంలో సముద్రంలేని స్థలం నన్ను చంపేస్తుంది. రోజూ వెళ్ళకపోయినా దగ్గరలో సముద్రం ఉంటేచాలు ఖర్చు పెట్టక పోయినా బ్యాంకులో పదివేలు పద్దున్నట్టే అని చెప్పారు.

శ్రీశ్రీ అన్ని భాషలలో ఉన్న సినిమాలు చూసేవారు అలాగే సినిమాలపై వచ్చిన వ్యాసాలు చదివేవారు. సినిమా ప్రభావానికి లోనైయ్యేవారు. శ్రీశ్రీకి కృష్ణశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణలు చాలా ఇష్టం. శ్రీశ్రీకి ఆడంబారాలు ఇష్టం లేదు. శ్రీశ్రీ సమకాలీనులైన శిష్టా, పఠాభి, ముద్దు కృష్ణ, మొదలైన వారి రచనలు చదివి వాటి మీద సద్విమర్శలు చేసేవారు. శ్రీశ్రీకి ఉదయని పత్రికలో పనిచేసే జనార్ధనరావు సాహిత్యం అంటే ఎంతో ఇష్టం. శ్రీశ్రీ తన మహాప్రస్థానాన్ని జనార్ధనరావుకి అకితం యిచ్చాడు. సారస్వతంలో చరితార్థుడు కావడానికి జనార్ధనరావు ఆయుధాలకోసం అర్జునిడిలాగా తపస్సు చేశాడని పేర్కొన్నారు. ఉదయని పత్రాకలో నేను సైతం అనే గీతం అచ్చుకావడం శ్రీశ్రీకి ఎంతో ధైర్యాన్ని యిచ్చిం దని కూడా తెలియజేసారు. పత్రికల నిర్వహణలో పెట్టుబడి దారీ విధానం పనిచేస్తుందని పేర్కొన్నాడు. తన ఆత్మకథ అనంతం రాయడంలో ముఖ్య ఉద్దేశం మనం జీవిస్తున్న పెట్టుబడి దారీ విధానాన్ని పరువు తీసి బయట పెట్టడమేనని పేర్కొన్నారు. మానవులు సాటి మానవులకంటే దైవానికి, జాతకానికి ఎక్కువ విలువ యిస్తారని పేర్కొంటూ ఇవాళ దేశంలో శాస్త్ర గ్రంథాలకు బదులు

మత గ్రంథాలు ఎక్కువుగా అచ్చవుతున్నాయి. దేశాన్ని పట్టుకున్న జబ్బుకి ఇదో గొప్ప ఉదాహరణ. మంత్రి పుంగవులలో దైవభక్తి పెరుగగుతోంది. అరచేతులు, జాతకాలు చూసేవాళ్ళ గిరాకీ జాస్తి అయింది.

సర్వ సమానత్వం ఈనాడు ఒక ఆదర్శం మాత్రమే. కానీ అది అందుకోవడానికి సాధ్యం కాని ఆదర్శం మాత్రం కాదు. ఎన్నో ఎగుడుదిగుడులున్న నిన్నటి బంజరు భూమి నేటి విమానాశ్రయ మయినది. ఈ ఎగుడుదిగుడులు భగవంతుడి సృష్టికాదు. వీటిని చదునుచేసే శక్తి మానవుడికి వుంది. ఈ విధంగా శ్రీశ్రీ సర్వ మానవ సమానత్వం గురించి కృషి చేసి తమ కవిత్వం ద్వారా సమాజంలో చైతన్యాన్ని కలిగించి మహాకవిగా నిలిచారు.

❖❖❖

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 5, May 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక సాహిత్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానం - సామాన్యుల జీవన విధానం

- యం. భైరవేశ్వర, పరిశోధక విద్యార్థి, చీజు (NFSC), తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

రాజు మరణించె నొక తార నేలరాలె
కవి మరణించె నొక తార గగనము నెగిసె
రాజు జీవించే రాతి విగ్రహముల యందు
కవి జీవించే ప్రజల నాలుక యందు

అని గుఱ్ఱం జాషువా పేర్కొన్నట్లు శ్రీశ్రీ కూడా రచయితగా నేటికి పుస్తక రూపంలోనూ, ప్రజల నాలుక యందు తాండవమాడుతున్నాడు. శ్రీశ్రీ మరణించినప్పటి నుంచే జీవించడం మొదలు పెట్టాడు. 'రవి గాంచనిచోట కవి గాంచున్' అని రామరాజ భూషణుడు చెప్పినట్లు శ్రీశ్రీ కూడా అభ్యుదయ, విప్లవ కవిగా, సినిమా పాఠల రచయితగా, సమస్త లోకాన్ని సందర్శించాడు. అందుకే మహాప్రస్థానం లాంటి కవితా సంపుటికి పురుడు పోయగలిగాడు.

మహాప్రస్థానంలోని ప్రతి కవితను గమనిస్తే స్వయంగా శ్రీశ్రీనే ఈ సమస్యను అనుభవించాడా అనే సందేహం చదివే ప్రతి పాఠకునిలోను కలుగుతుంది. మహాప్రస్థాన కవితా సంపుటిలోని కవితలు సామాన్య మానవుని జీవిత విశేషాలను, వృద్ధులు పడే ఆవేదనను, ఇలా చెప్పుకుంటూ పోతే ఏది వదలకుండా ప్రతిదీ రాశాడు. అందుకే చలం 'మహాప్రస్థానాన్ని తూచడానికి తన దగ్గర సరైన తూనీక రాళ్ళు లేవంటాడు'. ఈ విషయంలో చలం ఒక్కడే కాదు ప్రతి రచయితా కూడా ఏకీభవించాలిసినదే. అందుకే శ్రీశ్రీ స్థానం రాజ్యాన్ని ఏలిన రాజుతో, తప్పులు చేస్తే శిక్షించే దేవునితో సమానం. అందుకే ఈ దశాబ్ది నాది అని సగర్వంతో చెప్పుకున్నాడు. ఇంతటి ధైర్యం నేటి ఆధునిక రచయితల్లో కనిపించదు. శ్రీశ్రీ సాహిత్యం అంతా ఒక ఎత్తు అయితే శ్రీశ్రీ మహాప్రస్థానం మాత్రం ఒక ఎత్తు. అందుకే నభూతో నభవిష్యత్ అని చెప్పగలిగిన కవితాసంపుటి మహాప్రస్థానం.

కూటి కోసం, కూలి కోసం
పట్టణంలో బ్రతుకుదామని
తల్లిమాటలు చెవినపెట్టక
బయలుదేరిన బాటసారికి
మూడురోజులు ఒక్క తీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక

అనే 'బాటసారి' కవితలో శ్రీశ్రీ ఒక నిరుద్యోగి దీన పరిస్థితిని ఇలా వివరించాడు.

పల్లెల్లో పనిచేసుకోవడానికి పనుల్లేక పోవడం వల్ల పూటకూడా జరగని పరిస్థితి అలుముకుంది. అందుకే ఒక యువకుడు కన్నతల్లి మాటలను కాదని పెడచెవిన పెట్టి పట్నం బయలుదేరాడు. నడి సముద్రంలో నిలబడ్డ ఓడలా ఆ బాటసారికి ఏదిక్కూ తోచలేదు. రోజులు గడిచాయి. ఉద్యోగం దొరకలేదు. ఆకలి దప్పికలు తప్పలేదు. ప్రకృతి దాటికి నిలబడలేకపోయాడు. చీకటి కమ్మేసింది తెల్లవారేసరికి ఆ బాటసారి రాబందులకు ఆహారం అయ్యాడు. తల్లికి మాత్రం పుత్ర శోకం మిగిలింది. ఇలాంటి పరిస్థితి ప్రతి నిరుద్యోగి అనుభవిస్తూనే ఉన్నాడు. ఇంత సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ, ఉన్నత చదువులు చదివినప్పటికి ప్రభుత్వ వైఫల్యాల వల్ల నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయే తప్ప ఉద్యోగులుగా జీవించే పరిస్థితి నేడు లేదు. ఉన్నత చదువులు చదివించిన తల్లిదండ్రులకు మాత్రం పుత్ర శోకం మాత్రమే మిగులుతుంది. ఈ పరిస్థితిని ప్రతి ఒక్కరూ గమనించాలి.

భూతాన్ని, యజ్ఞోపవీతాన్ని
వైప్లవ్యగీతాన్ని నేను!
స్మరిస్తే పద్యం
అరిస్తే వాద్యం
అనల వేదిక ముందు అస్రనైవేద్యం

అను 'ఐ' కవితలో సామాన్యుని ఆవేశాన్ని గమనించవచ్చు. సామాన్యుల బ్రతుకులు, దోపిడీదారుల దౌర్జన్యాలు, ధనవంతుల విలాస జీవితాలు, ధరిద్రుల ఆకలి కేకలు ప్రతి సామాన్యునిలోను ఆవేశాన్ని నింపుతాయి. ఆ ఆవేశమే సామాన్య మానవున్ని నాయకుడిని చేస్తుంది. ఉద్యమబాట పట్టే విధంగా దారి చూపుతుంది. ప్రజలను చైతన్య మార్గంలో నడిపించే విధంగా తీర్చిదిద్దుతుంది. అలాంటి మానవుని ఆవేశాన్నే శ్రీశ్రీ ఈ 'ఐ' కవితలో స్పష్టంగా పేర్కొన్నాడు.

దారిపక్క, చెట్టు క్రింద
ఆరిన కుంపటి విధాన
కూర్చున్నది ముసల్దొకతె
మూలుగుతూ, ముసురుతున్న
ఈగలతో వేగలేక

అను 'బిక్షు వర్షీయసి' కవితలో ఒక వృద్ధురాలి దీనస్థితిని శ్రీశ్రీ చక్కగా ఇలా చిత్రీకరించాడు. అన్నం తినక ఎన్ని రోజులు అయిందో డొక్కలు అడుగంటాయి. స్నానం చేయక ఎన్ని రోజులయిందో బట్టలు మట్టికొట్టుకు పోయాయి. తలవెంట్రుకలు అట్టగట్టాయి కనీసం చేతిలోని బొచ్చలో కాసింతా తిండి కూడా లేదు. చిల్లర డబ్బులూ లేదు. ఏమో మరి ఆ వృద్ధిరాలి పట్ల సాటి మనిషికి కూడా కనికరం కలగలేదు. ఆ వృద్ధురాలు చచ్చిన శవంలా ఒక మూలన పడి ఉంది. జన్మనిచ్చిన బిడ్డలు వదిలేశారు. కట్టుకున్న భర్త తనదారి తాను చూసుకున్నాడు. ఈమె పరిస్థితి అయోమయం. అందుకే అలా అనాథలా ఊరు ఊరు వీధి వీధి తిరుగుతూ అలసి సొలసి ఒక చెట్టుక్రింద పడింది. ఆమెను చూసిన వారంతా శవమే అనుకుంటారే తప్ప బ్రతికి ఉన్న వృద్ధురాలని ఎవరూ గుర్తించలేదు అని ఈ గేయం చదువుతే పాఠకులకు అర్థమవుతుంది.

అందరం కలిసి చేసిన ఈ
అందమైన వస్తు సముదాయం అంతా
ఎక్కడో ఒక్కడే వచ్చి
ఎత్తుకు పోతూ ఉంటే చూసి
అన్యాయం, అన్యాయం! అని మేమంటే
అనుభవించాలి మీ కర్మం అంటాడు

అను 'వాడు' కవితలో దోపిడీదారుల దౌర్జన్యాలు భూస్వాముల ఆధిపత్యపు పోరు, జమీందారుల చేతిలో అన్యాయమైన సామాన్యుల జీవితాలను గమనించవచ్చు. ఉమ్మడిగా కష్టపడి ఉత్పత్తి చేసిన వస్తు సముదాయంకు సరైన ధర చెల్లించక అక్రమంగా తరలిస్తుంటే ఇది అన్యాయం అని అందరూ అంటుంటే ఇదే ఎక్కువ మీ బ్రతుకులకు అని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం ఎంత దారుణమో మనం గమనించవచ్చు. కూలీ పనులకు పిలిచి శ్రమను దోచుకొని శ్రమకు తగిన పైకం చెల్లించక పోవడమూ గమనించ వచ్చు. చదువూ సంధ్యా లేకుండా ముద్దకు దూరం చేసి, ఇదే ఆచారం ఇదే మీ గ్రహచారం అని నెట్టుకుపోవడమూ గమనించవచ్చు. ఇలాంటి పరిస్థితి నేటి ఆధునిక కాలంలో లేకపోయినప్పటికి సామాన్యుడు బ్రతకడం చాలా కష్ట సాధ్యమైపోతుంది. దీనికి కారణం పెరిగిన ధరలు చాలి చాలని జీతాలు. ఇవే సామాన్య మానవుని జీవిత రహస్యాలు. 'వాడు' అనే కవిత సామాన్య మానవుని దీనస్థితిని తెలియజేసే విధంగా ఉంది.

పాలాలనన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌక్యం, నిండగ
విరామమెరుగక పరిశ్రమించే
బలంధరిత్రికి బలికావించే
కర్షక వీరుల కాయం నిండా

కాలువకట్టే ఘర్మ జలానికి
ఘర్మ జలానికి
ధర్మ జలానికి
ఘర్మ జలానికి ఖరీదు లేదోయ్

అనే 'ప్రతిజ్ఞ' కవిత చదువుతుంటే స్వయంగా రచయితే కష్టాలను అనుభవించడా, అనుభవించడం వలనే ఈ విధంగా ఇలాంటి కవితలు రాయగలిగాడేమో అని ప్రతి వ్యక్తిలోనూ సందేహం కలుగుతుంది. ఇందులో కర్షకులను, కార్మికులను అనాథలను, అభాగ్యులను, సాంకేతిక పరిజ్ఞానం వల్ల పతనమైన కుటీర పరిశ్రమలను, చేతి వృత్తులను వస్తువుగా తీసుకొని 'ప్రతిజ్ఞ' అను కవితను ముందుకు నడిపించాడు. ఈ కవిత మహాప్రస్థానంలోని కవితలకు తలమానికమైనదిగా చెప్పవచ్చు. అనునిత్యం శ్రమించే కర్షకులకు మిగులుతుంది అప్పులే. అధికంగా శ్రమించే కార్మికులకు మిగులుతుంది అనారోగ్యమే. ఏతోడూ లేని అనాథలు, అభాగ్యులు జీవిస్తున్నది రోడ్ల మీదనే. చేతివృత్తిల ద్వారా తయారు చేసే వస్తువులకు గిరాకీ తగ్గి వారికి చివరికి మిగులుతున్నది నిరుద్యోగమే అని శ్రీశ్రీ సవివరంగా ఈ కవితలో విశ్లేషించాడు.

ఔను నిజం, ఔను నిజం
ఔను నిజం, నీవన్నది
నీవన్నది, నీవన్నది
నీవన్నది నిజం, నిజం!

అను 'చేదుపాట' కవితలో శ్రీశ్రీ ఏది నిజం, ఏది అబద్ధం, ఏది సుఖం, ఏది నరకం, ఏది మంచి, ఏది చెడు అనే విషయాలను కళ్ళకు కట్టిన్నట్లు చూపించాడు. మనం ఊహించుకున్న ప్రపంచం అంతా శూన్యమే. నీవు అనుభవించే సుఖంలో సంతోషం వెతుకుంటున్నావే తప్ప, కష్టంలోని సంతోషాన్ని వదిలేసి నీది కాని జీవితం కోసం పరుగెడుతున్నావ్, కష్టం అంటే భయపడుతున్నావ్, ముందు కష్టం అనుభవిస్తేనే కదా సుఖం అంటే ఏదో తెలిసేది, ఏది నిజమో తెలిసేది అని శ్రీశ్రీ వాస్తవ అవాస్తవాలను వివరించాడు.

సిందూరం, రక్తచందనం
బంధూకం, సంధ్యారాగం
పులి చంపిన లేడి నెత్తురూ
ఎగరేసిన ఎర్రని జెండా
రుద్రాలిక నయన జ్వాలిక
కలకత్తా కాళిక నాలిక
కావాలోయ్ నవ కవనానికి

అను 'నవకవిత' లో శ్రీశ్రీ ఈ నూతన ప్రపంచానికి కావాలసినది ప్రయోగమే తప్ప, సంప్రదాయం కాదని నవివరంగా పేర్కొన్నాడు. తరతరాలుగా, యుగయుగాలుగా పెద్దలు అందించే బానిస బ్రతుకులను విడనాడి నూతనత్వాన్ని పెంపొందించుకొని జీవించమని తెలియజేశాడు. శ్రామికుల నెత్తురుతో దాహం తీర్చుకునే దోపిడిదారులను, రాబందుల్లా కార్మికుల కండరాలను చీల్చుకొని ఆహారంగా భుజించే భూస్వాముల ఆగడాలను అరికట్టాలంటే, బానిసత్వాన్ని వదిలేసి ప్రశ్నించడం నేర్చుకోవాలని శ్రీశ్రీ నవకవితలో పేర్కొన్నాడు.

ఇలా చెప్పుకుంటూ పోతే మహాప్రస్థానంలోని ప్రతి కవితా ఒక సంచలనమే. ప్రతి కవితా చదివే పాఠకునిలో ఆవేశం, ఉద్రేకం కలిగించే విధంగా ఉన్నవే. సమాజంలోని అన్ని సమస్యలు, సమస్యలకు పరిష్కారాలు ఈ కవితా సంకలనంలోనే కనిపిస్తాయి. ఈ కవితా సంకలనం లోని కవితల కోసం ఉపయోగించిన వస్తువు సామాన్యుని జీవితమే అని చదువుతున్న పాఠకుడు అవును అని చెప్పక తప్పదు. అందుకే ఈ మహాప్రస్థానం చరిత్రలో ఒక మైలురాయిలా మిగిలిపోయింది. ఈ సంకలనం అభ్యుదయ కవిత్వానికి మచ్చుతునకగా చెప్పవచ్చు. అందుకే ఈ సంకలనం శ్రీశ్రీ సహృదయానికి ఒక నిదర్శనం.

ఆధార గ్రంథాలు : మహాప్రస్థానం - శ్రీశ్రీ

❖

శ్రీశ్రీ సాహిత్యం - నేటి సమాజ ప్రతిఫలనం

- డా॥ బత్తల అశోక్ కుమార్, గ్రంథాలయ సహాయకులు, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇంక్లూజివ్ పాలసీ (CSSEIP), శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము.

శ్రీశ్రీ ఈ రెండక్షరాల పేరు శతాబ్ద కాలంగా తెలుగు సాహిత్యానికి చిరపరిచితమైన పేరు. ఆధునిక తెలుగు సాహిత్యానికి చిరునామాగా మారిన వేగుచుక్క శ్రీశ్రీ. తాడిత, పీడిత, కార్మిక, కర్షక వర్గాల ప్రజల గొంతుక శ్రీశ్రీ కవిత్వం. ఆకాశం దారివెంట పయనిస్తున్న సాహిత్య రథాన్ని భూమార్గం పట్టించి, వర్గపోరుకు శిలాక్షరమై జ్వలించింది శ్రీశ్రీ కవిత్వం. అందుకే శ్రీశ్రీ మహాకవి అయ్యాడు. తన రచనల ద్వారా సమాజాన్ని సంస్కరించ దలిచాడు. సాహిత్యాన్ని దానికి ఊతం చేసుకున్నాడు. ఆయన సంఘర్షణ, పోరాటం అంతా ఒక ప్రాంతానికో, ప్రదేశానికో, ఒక కాలానికో పరిమితం కాలేదు. అంతర్జాతీయంగా పీడనకు గురవుతున్న ప్రతిఒక్కరి గొంతుకగా శ్రీశ్రీ మారాడు.

శ్రీశ్రీ మహాప్రస్థానం గేయాలు రాసింది 1930-1940 దశకంలో. మరి ఇప్పటి పరిస్థితులకు శ్రీశ్రీ రాసిన కవిత్వానికి పొంతన వుందా? ఇంకా మనం శ్రీశ్రీ కవిత్వాన్ని చదవాల్సిన ఆవశ్యకత, అవసరం వుందా? అన్న ప్రశ్న నాలో జనించింది. ఎందుకు చదవాలి? శ్రీశ్రీ కవిత్వం దాదాపుగా ఎనిమిది దశాబ్దాల క్రితం ఆనాటి పరిస్థితులను ప్రతిబింబిస్తూ రాసిన రచన. అప్పటికది నవ్య కవిత్వం. మరి ఇప్పుడు పాత కవిత్వమే కదా? దానివల్ల ఒనగూరే ప్రయోజనం ఏంటన్నది సహజంగా ధ్వనించే ప్రశ్నార్థకమే?. ఆయన రాసిన మహాప్రస్థానం గేయాలు సర్వకాల సర్వావస్థలలోనూ మనిషిలోని నిస్సత్తువను తరిమివేసే కొత్త టానిక్‌గా ఎందుకు చూడ కూడదు. కవి.... తత్తవేత్త కాలం కన్నా ముందుంటారు. నిజమే నేటి ఆధునిక యుగంలో కూడా శ్రీశ్రీ మనకు అవసరమవుతున్నాడు. జాడ్యాలతో సతమతమయ్యే ఈ సమాజానికి ఆయన కవిత్వం ఒక టానిక్. అందుకే శ్రీశ్రీ మహాప్రస్థానానికి ''యోగ్యతాపత్రం'' రాస్తూ చలం ''నెత్తురూ, కన్నీళ్ళూ తడిపి కొత్త టానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ - ఈ వృద్ధ ప్రపంచానికి'' అన్నాడు. ఎంత మాట ఇది. ఎంత సాధికరికతతో అనగలిగాడు చలం. శ్రీశ్రీ కవిత్వాన్ని అనుభవించి పలువరించాడు చలం. చివరగా ''రాబందుల రెక్కల చప్పుడు పయోధర ప్రచండ ఘోషం. ఝుంఝూనిల షడ్జధ్వానం'' విని తట్టుకోగల చావ వుంటే ఈ పుస్తకం తెరవండి'' అంటూ పాఠకులకి ఒక హెచ్చరిక కూడా చేశాడు. అంతలా శ్రీశ్రీ కవిత్వంలో ఏమున్నదని మనం ''మహాప్రస్థానాన్ని'' గమనించి, అర్థం చేసుకోగలిగితే, ఆయన అంత సాధికారికంగా ఎలా చెప్పాడో అర్థమవుతుంది. శ్రీశ్రీ మహాప్రస్థానంలో ఇప్పటి కాలంలో మనిషికి అవసరమైన ఎన్నో అంశాల్ని తట్టి చెప్పాడు

శ్రీశ్రీ మహాప్రస్థానంలో ''బాటసారి'' అనే కవితా ఖండిక వుంది. ఇది చదివితే, కరోనా లాక్‌డౌన్‌లో వలస కూలీల వేదన, రోదన మన కళ్ళముందు కదలాడుతుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. శ్రీశ్రీ చెప్పిన ఆ సమయానికి, ఇప్పటి కరోనా పరిస్థితులకు పోలిక లేదు. కానీ సారూప్యత మాత్రం ఒక్క విషయంలో మనకు కనిపిస్తుంది. అదే పాలకుల వైఫల్యం. శ్రీశ్రీ ''బాటసారి'' కవితా ఖండికలో చెప్పిన పరిస్థితులు ''గ్రామీణ ప్రాంత అభివృద్ధిపై ఆనాటి పాలకుల నిర్లక్ష్యం, పల్లెసీమలే భారతదేశానికి పట్టుగొమ్మలు అన్న అంశాన్ని విస్మరించి, ఆనాటి పాలకులు పట్టణీకరణకు ఎక్కువ ప్రోత్సాహం ఇవ్వడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లేక ఒక వ్యక్తి పట్టణానికి వలస వచ్చాడు.

"కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని-
తల్లిమాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి,
మూడురోజులు ఒక్కతీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక -
నడిసముద్రపు నావ రీతిగ
సంచరిస్తూ, సంచలిస్తూ
దిగులు పడుతూ, దీనుడౌతూ
.....
.....
మబ్బుపట్టీ, గాలికొట్టీ
వానవస్తే, వరదవస్తే
చిమ్మచీకటి క్రమ్ముకొస్తే
దారితప్పిన బాటసారికి
ఎంతకష్టం"

ఈ మాటలు పట్టణ ప్రాంతంలో ఏదో ఒక ఉపాధి దొరకక పోతుందా? ఆకలితో ఉన్న కడుపుకు కాసింత అన్నం దొరకక పోతుందా? అన్న ఒక ఆశతో బయలు దేరిన వ్యక్తి, ప్రకృతి విపత్తువల్ల మార్గమధ్యంలోనే మరణించిన పరిస్థితి. ఇక్కడ మనకు కనిపించేది పాలకుల నిర్లక్ష్యమే. పల్లెసీమల్ని అభివృద్ధి చేయాల్సి వుందన్న అవసరాన్ని శ్రీశ్రీ ఎత్తిచూపాడు. అయితే కరోనా విపత్తు వల్ల సర్వ వ్యవస్థలూ దెబ్బతిన్నాయి. అయితే పాలకుల అనాలోచిత నిర్ణయం వల్ల లాక్‌డౌన్ ప్రకటించడం, కర్ఫ్యూ విధించడం, ప్రయాణ సాధనాల్ని ఎక్కడికక్కడ నిలుపుదల చేయడంతో గ్రామీణ ప్రాంతాల నుండి ఉపాధి కోసం మహా నగరాలకు వలస వెళ్ళిన వలస కూలీలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రపంచం మొత్తం చూసింది. కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా నడుచుకుంటూ వారి స్వస్థలాలకు బయలుదేరి, మార్గమధ్యలోనే అసువులు బాసిన ఎంతోమంది బాటసారులు ఆత్మలు ఎంత క్షోభించివుంటాయి. ఈ పరిస్థితిని "బాటసారి" కవితా ఖండిక కచ్చితంగా ప్రతిఫలించింది అన్నది నూటికి నూరుపాళ్ళు నిజం. ప్రజల ఇబ్బందుల్లో అటు ఇటుగా తేడాలు వుండవచ్చునేమో. కానీ అప్పుడూ, ఇప్పుడూ రెండుచోట్ల సారూప్యత కనిపించింది మాత్రం "పాలకుల వైఫల్యం" విషయంలో. రెండుచోట్ల ఉపాధి అవకాశాలు కల్పించలేని ప్రభుత్వ పాలకులదే అని మాత్రం నిస్సంకోచంగా చెప్పక తప్పదు.

ఇప్పటి పరిస్థితులు, 1930-40 దశకం పరిస్థితులు ఒకేలా ఉన్నాయని చెప్పక తప్పదు. మనిషిని మనిషి దోచుకునే తత్వం ఇప్పటికీ కొనసాగుతోంది. బలవంతుల దౌర్జన్యాలు ఇంకా కొనసాగుతూనే వున్నాయి. డబ్బున్నవాడు డబున్నవాడిగానే వున్నాడు. పేదలు, పేదలుగానే వున్నారు. ఈ ఎనభైఏళ్ళ భారతం ఏం మారింది? "ఆజాదీకా అమృతోత్సవ్" పేరిట దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు అయింది. అయినా మనదేశంలో ఇంకా ఆకలి చావులు కొనసాగుతున్నాయి. మరోవైపు ప్రపంచ కుబేరుల జాబితాలో మనవారే ముందున్నారు. ఈ పరిస్థితులు సమసి పోవాలని ఆనాడే శ్రీశ్రీ హెచ్చరించారు. అందరికీ సమానమైన సామ్యవాదం కావాలని కలలుగన్నాడు. ఇప్పుడూ మనం అందరూ సమానంగా జీవించాలని కలలు కనాల్సిందే.

"బలవంతులు దుర్బల జాతిని
బానిసలను కావించారు
నరహంతకులు ధరాధిపతులై
చరిత్రమున ప్రసిద్ధికెక్కిరి"

ఈ మాటల్ని మనం కాదనగలమా? ఇప్పటికీ వ్యక్తిపూజ జరుగుతూనే వుంది. మనిషిని మనిషి దోచుకునే తత్వం కొనసాగుతూ వుంది. పేరుకే మనది ప్రజాస్వామ్యం. కానీ నడిపిస్తున్నది మాత్రం ధనవంతుల చేతుల్లోని డబ్బే. ఇది కాదనలేని వాస్తవం. మరీ ముఖ్యంగా మన రాజకీయ నాయకుల నేరచరిత్ర. ఆనాడు వారే అధికారాన్ని చేజిక్కించుకున్నారు. నేడు నేర చరితలు వున్నవారే మనల్ని పాలిస్తున్నారు.

ఎనిమిది దశాబ్దాల క్రితమే శ్రీశ్రీ

"చిరకాలం జరిగిన మోసం,
బలవంతుల దౌర్జన్యాలూ
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా! ఇకపై చెల్లవు
ఒక వ్యక్తిని మరొక్క వ్యక్తీ
ఒక జాతిని వేరొక జాతీ,
పీడించే సాంఘిక ధర్మం
ఇంకానా! ఇకపై సాగదు"

అని అన్నాడు. నేడు ఈ మాటల్ని మనం అనకుండా వుండగలమా? పరిస్థితుల్లో మార్పు వచ్చిందా? ఏదో కొద్దిమేర ఇందులో మార్పులు వచ్చి వుండవచ్చు కానీ, దోచుకునే సంస్కృతి పూర్తిగా పోయిందని మనం చెప్పగలమా? ఇటీవలి కాలంలో జాతిపోరు, వర్గపోరూ, కులం-మతం రంగులు వెలసిపోలేదు సరికదా మరింత కొత్తదనాన్ని సంతరించుకున్నాయని మనం అంగీకరించాల్సిందే.

పేదరికం (Poverty) ఒక సామాజిక, ఆర్థిక సమస్య. ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా ఉంది. సమాజంలో ఒక వర్గం కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని పేదరికం అంటారు. పేదరికంతో బాధపడుతున్న వారిని పేదలు అంటారు. పేదరికమే అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ చెప్పారు. వివిధ పథకాల ప్రయోజనాలు అసలైన లబ్ధిదారులకు చేరడం లేదన్న ఆవేదనను పలుమార్లు ఆయన వ్యక్తంచేశారు.

ప్రస్తుతం వివిధ దేశాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పేదరిక నిర్మూలన కోసం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు నిజమైన పేదలకు అందడం లేదు. "పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయి" అని ప్రపంచ బ్యాంకు పరిశోధనా విభాగం మాజీ డైరెక్టర్, సీనియర్ ఉపాధ్యక్షుడు మార్టిన్ రావల్లియన్ అభిప్రాయపడ్డారు.

ఈ అంశాన్నే మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలో "పేదలు" అనే కవితా ఖండికలో వివరించారు. ఆయన పేదల దయార్ద్ర హృదయ వేదనని, ఆవేదనకి అక్షర రూపమిస్తూ

"అంతేలే పేదల గుండెలు!
అశ్రువులే నిండిన కుండలు!
.....
.....
అంతేలే పేదల చేతులు!
శ్లథశైశిర పలాశరీతులు!
అంతేలే పేదల కన్నులు!
వినమ్రములు, వెతల వ్రణమ్ములు!
తుపానులో తడిసిన, జడిసిన
గోమాతల కన్నుల తమ్ములు!"

అని అనడం ఈనాటికీ వర్తిస్తుంది. ముఖ్యంగా భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేదరిక నిర్మూలన అంత ఆషామాషీ కాదు అన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే నిజాయితీగా ప్రయత్నిస్తే సాధించలేనిది మాత్రం కాదు. కావాల్సిందల్లా పాలకుల చిత్తశుద్ధి, ప్రజల్లో నిజాయితీ అన్నది గుర్తించాలి. ఎందుకంటే ప్రభుత్వాలు నిజంగా పేదలకోసం వెచ్చిస్తున్న డబ్బు దారిద్రరేఖకు దిగువున ఉన్న వారికి అందడం లేదు. ఎంతమంది ఉద్యోగులు ఇప్పటికీ పేదలకిచ్చే పథకాలను, రేషన్‌ను తీసుకోవడం లేదు. కాబట్టి ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా, ప్రజలు మారనంతవరకు ఇది అసాధ్యమైన ప్రక్రియే.

ఆధునిక సాంకేతికత అరచేతిలోకి వచ్చే కొద్దీ మనిషిలోని వికృతత్వం మరింతగా జడలు విప్పుతోంది.

మనిషి తోటి మనిషిని ప్రేమించడం మాట అటుంచి దారుణంగా ద్వేషిస్తున్న పరిస్థితులను మనం గమనిస్తూనే వున్నాము. మనం కోరుకున్న ఆదర్శ సమాజం అన్నది నేటికీ కలగానే మిగిలిపోయింది. మహాకవి శ్రీశ్రీ కూడా మంచి సమాజాన్ని ఆకాంక్షించాడు. మానవాళికి నిజంగా మంచి రోజులు వస్తాయని కలగన్నాడు. అందుకే భావితరాలు మంచి దారిలో పయనించాలన్న పథికుడు శ్రీశ్రీ. మహాప్రస్థానంలోని ''నిజంగానే? అనే కవితా ఖండికలో మంచిని గురించి,

"నిజంగానే నిఖిలలోకం
నిండుహర్షం వహిస్తుందా?
మానవాళికి నిజంగానే
మంచికాలం రహిస్తుందా?
నిజంగానే నిజంగానే
నిఖిలలోకం హసిస్తుందా?
దారుణ ద్వేషాగ్ని పెంచే
దానవత్వం నశిస్తుందా?
సాధుసత్వపు సోదరత్వపు
సాధుతత్వం జయిస్తుందా?

వర్ధమాన మహావీరుడు, గౌతమబుద్ధుడు, మహమ్మద్ ప్రవక్త, ఏసుక్రీస్తు, జగద్గురు ఆదిశంకరాచార్య, రామానుజాచార్య, కబీరు, అరవిందుడు, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ వంటి పుణ్యపురుషుల బోధనలు ఎన్నిచేసినా, ఎంతోమందిని సన్మార్గంలో పయనించేలా చేసినా, ఇంకా దానవత్వ దాఖలాలు కనిపిస్తూనే వున్నాయి. మహాకవి శ్రీశ్రీ కూడా ఆ కోవలోనే మంచి సమాజాన్ని ఆకాంక్షించాడు.

శ్రీశ్రీ మనమధ్య లేకపోయినా, ఆయన కవిత్వం మాత్రం నిత్యం మనతోనే వుంటుంది. కాలానికి పట్టిన చీడను ఖండిస్తూనే వుంటుందన్నది మాత్రం సత్యం. మనిషిని మనిషిగా చూడమని చెప్పాడు. ప్రతి ఒక్కరిలో మనిషి తత్వాన్ని చూడాలని, బానిసత్వాన్ని రూపు మాపాలని ఆకాంక్షించాడు శ్రీశ్రీ. ఆయన కవిత్వం అజరామరం. ఆయన కవిత్వం నిత్య నూతనత్వం. అందుకే శ్రీశ్రీ సాహిత్యం నేటి సమాజాన్ని ప్రతిఫలిస్తుందన్న అభిప్రాయాన్ని ఈ సందర్భంగా మరోసారి వ్యక్తం చేస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. మహాప్రస్థానం - శ్రీశ్రీ
2. శ్రీశ్రీ సంసార ప్రస్థానం - సరోజా శ్రీశ్రీ
3. శ్రీశ్రీ కథలు అనువాద కథలు - చలసాని ప్రసాద్ (ప్రచురణ)
4. శ్రీశ్రీ సిప్రాలి - చలసాని ప్రసాద్ (ప్రచురణ)

❖❖❖

మే 2022

భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

మహాకవి శ్రీశ్రీ జీవితం - సాహిత్యం

రెండు రోజుల జాతీయ సదస్సు





డా॥. కత్తిమండ ప్రతాప్

అంతర్జాతీయ అధ్యక్షులు, శ్రీశ్రీ కళావేదిక
(అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ)
రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ రాష్ట్ర సభ్యుడు (పూర్వ)
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాషువా పురస్కార గ్రహీత



Editor & Webinar Director
Dr. Bathala Ashok Kumar
President, Sri Sri Kalavedika SKU Wing



Assistant Editor & Webinar Co-ordinator
Kanumala Muniswamy
General Secretary, Sri Sri Kalavedika SKU Wing